# Rēvūru anantapadmanābharāvu sr̥janātmaka sāhityaṁ-anuśīlana

A Thesis submitted to the University of Hyderabad in partial

Fulfilment of the requirement for the award of

**Doctor of Philosophy**

In

**Telugu**

**Researcher**

**BOYAPALLY CHITTEMMA**

**(Reg No: 17HTPH11)**

**Supervisor**

**PROF. M. GONA NAIK**

**Department of Telugu**
**School of Humanities**
**University of Hyderabad**
**Hyderabad- 500046**
**Telangana, India**

**September – 2022**

# రేవూరు అనంతపద్మనాభరావు సృజనాత్మక సాహిత్యం-అనుశీలన

పిహెచ్.డి., పట్టా కోసం హైదరాబాదు విశ్వవిద్యాలయానికి సమర్పించిన

పరిశోధన గ్రంథం


పరిశోధకురాలు

**బోయపల్లి చిట్టెమ్మ**

**17HTPH11**

పర్యవేక్షకులు

**ఆచార్య యం. గోనా నాయక్**

తెలుగు శాఖ

మానవీయ శాస్త్రాల విభాగం

హైదరాబాదు విశ్వవిద్యాలయం

హైదరాబాదు– 500046


సెప్టెంబర్ – 2022

# DECLARATION

I, **Boyapally Chittemma** hereby declare that this dissertation entitled "**Rēvūru anantapadmanābharāvu sr̥janātmaka sāhityaṁ-anuśīlana"** submitted by me under the guidance and supervision of **Prof. M. Gona Naik** is my bonafide research work. I also declare that it has not been submitted previously in part or in full to this University or any other University or Institution for the award of any degree or diploma. I hereby agree that this dissertation can be deposited in Shodhganga/INFLIBNET.

Place: Hyderabad

Date: 12 /09/2022

Signature of the Student

Name**:Boyapally Chittemma**

Registration No. **17HTPH11**

# CERTIFICATE

This is to certify the Thesis entitled "**Rēvūru anantapadmanābharāvu sr̥janātmaka sāhityaṁ-anuśīlana"** submitted by **Mrs. BOYAPALLY CHITTEMMA** bearing **Regd. No. 17HTPH11** in partial fulfilment of the requirements for the award of Doctor of Philosophy in the School of Humanities, Department of Telugu is a bonafide work carried out by her under my supervision and guidance.

The thesis is free from plagiarism and has not been submitted previously in part or in full to this University or any other University or Institution for the award of any degree or diploma.

**A. Published in the following publications:** Parts of this thesis have been: (NOT EXACT PARTS) Issues discussed in the following papers have been presented elaborately in the chapter 3 and 4 of the thesis.)

1. ***"Anantapadmanābharāvu jīvitaṁ, vyaktitvaṁ"*** (ISSN 2456-4702), Vol: 14. Bhāva vīṇa Pg. No. 91-95, August- 2019. Chief Editor Dr.Pitta Santhi, Guntur, A.P.
2. ***Dharamārdhakāmamōkṣālaku nilayaṁ: Dāmpatya jīvana saurabhaṁ*** ( ISSN 2456-4702), Vol:14. Bhāva vīṇa Pg. No. 304-307 August- 2019. Chief Editor Dr.Pitta Santhi, Guntur, A.P.

**B. Presented in the following National and International seminars:** (Issues presented in the following papers have been discussed elaborately)

**1.** ***"Anantapadmanābharāvu jīvitaṁ, vyaktitvaṁ",*** 'Nelluru Jilla sahithee Sarvasvam, National seminar, conducted by SK Vikrama Simhapuri Vishwavidyalayam, Nellur,A.P. 6&7, April, 2018.

**2.** ***"Dharamārdhakāmamōkṣālaku nilayaṁ: Dāmpatya jīvana saurabhaṁ",*** Bharatheeya Sahithyam-Chathurvidha Purusharthaalu International Conference, conducted by Government degree college, Sadashiv Peta, affiliated to Osmania University, Telangana State, on 8 th , February, 2020.

Further, the Student has passed the following courses towards fulfilment of coursework requirement for Ph.D.

| SL.No | Course Code | Name | Credits | Pass/Fail |
|---|---|---|---|---|
| 1 | HT-801 | Research Methodology | 4 | PASS |
| 2 | HT-802 | History of Telugu | 4 | PASS |
| 3 | HT-803 | Studies in Lieture and Language | 4 | PASS |
| 4 | HT-804 | Specialized Area and Broad Field | 4 | PASS |

(Prof. M.GONA NAIK)

**Research Supervisor**

(Prof. Darla Venkateswara Rao)
Head of the Department Telugu

(Prof.V.Krishna)
Dean School of Humanities

# కృతజ్ఞతలు

'రేవూరు అనంతపద్మనాభరావు సృజనాత్మక సాహిత్యం-అనుశీలన' అనే అంశంపై పరిశోధన చేయడానికి నాకు అవకాశం కల్పించిన హైదరాబాద్ విశ్వవిద్యాలయం తెలుగుశాఖకు...

నా పరిశోధనాంశంలో అవసరమైన సూచనలు, సలహాలు అందించి నా పరిశోధనా గ్రంథం సకాలంలో పూర్తి కావడానికి సహకరించిన నా పర్యవేక్షక గురువులు ఆచార్య ఎం. గోనానాయక్ గారికి...

డాక్టోరల్ కమిటి సభ్యులుగా ఉంటూ నా పరిశోధనకు తగిన సలహాలు, సూచనలు ఇచ్చిన తెలుగు శాఖాధ్యక్షులు ఆచార్య దార్ల వెంకటేశ్వరరావుగారికి, ఆచార్య పిల్లలమర్రి రాములుగారికి...

తెలుగు అధ్యాపకులు పూర్వ శాఖాధ్యక్షులు ఆచార్య శరత్ జ్యోత్స్నారాణిగారికి, పూర్వ శాఖాధ్యక్షులు, ఆచార్య జి. అరుణకుమారిగారికి, ఆచార్య డి. విజయలక్ష్మిగారికి, డా. విజయకుమారిగారికి, ద్రావిడ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య తుమ్మల రామకృష్ణగారికి, ఆచార్య పమ్మి పవన్ కుమార్ గారికి, కీ.శే. ఆచార్య ఎండ్లూరి సుధాకర్ గారికి, డా. బాణాల భుజంగరెడ్డిగారికి...

ప్రాథమిక స్థాయి నుండి పరిశోధన స్థాయి వరకు వివిధ దశలలో నన్ను వివిధ రకాలుగా ప్రోత్సహించిన గురువులు డా. బెల్లి యాదయ్య గారికి, ఆచార్య మాడభూషి సంపత్ కుమార్ గారికి, ఆచార్య విస్తాలి శంకర్ రావుగారికి, డా. గండు మహేందర్ గారికి...

నేను పరిశోధన చేయడానికి అన్నివేళలా తమ తోడ్పాటును అందించి నా సందేహాలను ఎప్పటికప్పుడు నివృత్తి చేసినా పరిశోధనా పురోగతిని సాధించడానికి తమవంతు సహాయ, సహకారాలు అందించిన స్వీకృత రచయిత డా. రేవూరు అనంతపద్మనాభరావుగారికి, ఎప్పుడు

ఇంటికి వెళ్ళినా ఆప్యాయతతో పలకరించి, ఎల్లవేళలా తన ఆశీర్వచనాలు అందించే వారి సతీమణి మాతృ సమానురాలు శ్రీమతి శోభాదేవిగారికి పాదాభివందనాలు.

ఆడపిల్లల్ని కనీస చదువులు కూడా చదివించడానికి భయపడే గ్రామీణ వాతావరణం నుండి, నేను ఈ స్థాయికి ఎదగడానికి చదివించి ప్రోత్సహించిన నా తల్లిదండ్రులు బోయపల్లి నర్సమ్మ, యాదయ్యలకు నా పాదాభివందనాలు.

పెళ్ళయ్యాక అత్తమామలే అమ్మనాన్నల్లా నన్ను ఆదరించి నా చదువుకు ఏ ఆటంకం కలగకుండా చూసిన అత్తమామలు తండ బుచ్చమ్మ, నర్సింహలకు...

యూనివర్సిటీకి వెళ్ళే ప్రతిసారీ "బాయ్ మమ్మీ! స్కూల్ కు పో మంచిగ చదువుకో!! అని తన ముద్దు ముద్దు మాటలతో నాలో ఉత్తేజాన్ని నింపిన నా గారాలపట్టి, ముద్దుల బిడ్డ మనుశ్రీకి... అన్ని వేళలా నాకు సహాయ సహకారాలు అందించి, నేను నిరాశకు గురైన ప్రతిసారీ, నాకు కొండంత ధైర్యాన్ని ఇచ్చి నాలో ఉత్సాహాన్ని నింపిన మా శ్రీవారు తండ యాదగిరి బాబుకు ఆత్మీయ కృతజ్ఞతలు ప్రత్యేకంగా....

హైదరాబాద్ విశ్వవిద్యాలయంలో ప్రవేశం పొందినప్పటినుండి నాపై నేను ఎప్పుడూ విశ్వాసం కోల్పోకుండా అడుగడుగునా నాకు తోడుగా నిలుస్తూ, నా నిరుత్సాహాన్ని ఉత్సాహంగా మారుస్తూ, నా ఉత్సాహానికి ప్రోత్సాహాన్ని అందిస్తూ, నా ప్రగతిలో ప్రతి అడుగులో అభ్యుదయాన్ని కాంక్షిస్తూ అనుక్షణం నా అభ్యున్నతికోసం తపనపడుతూ నా వెంటే ఉంటూ నన్ను ముమ్ముందుకు నడిపిస్తూ నా ప్రతి విజయానికి కారణోపేతుడైన డా. సిరిమాన్ నవీన్‌కు ప్రత్యేకంగా...

నా పరిశోధనను తన పరిశోధనగా భావించి అహర్నిషలు సహాకారం అందించిన శ్రీపతి మారుతికి...

పరిశోధనలో నాకు మార్గదర్శులుగా సహాయ సహకారాలు అందించిన సీనియర్ పరిశోధకులు డా. మంత్రి మల్లేశ్ అన్నకూ, డా. పద్మక్కకు, డా. ఉదయ్ భాను అన్నకూ, డా. పంతంగి అప్పారావు అన్నకూ, రత్నాకర్ అన్నకూ, డా. కోదండ లక్ష్మణ్ అన్నకూ...

స్నాతకోత్తర స్థాయినుండి ప్రతి విషయంలో నన్ను ప్రోత్సహిస్తూ, ఏ చిన్న కష్టం వచ్చినా నేనున్నా బుజ్జి! అంటూ నాకు కొండంత ధైర్యాన్ని ఇచ్చే ప్రాణ సమానురాలు గొంగులూరి కృష్ణవేణికి...

ఏమి అడిగినా కాదనకుండా సహాయం చేసే స్నేహితులు నిరంతరం నావెంటే ఉండే మిత్రులు సాయిరాం, అనంత్, అరుణ, మాధవి, మస్తాన్, లింగరాజు, కాశీరాం, వాసులకు...

మా గ్రామ అభివృద్ధికోసం నిరంతరం తపనపడుతూ, గ్రామానికి వచ్చిన ప్రతిసారీ తొందరగా ప్రయోజకురాలివి కావాలని, గ్రామ అభ్యున్నతికోసం పాటుపడాలని అనుక్షణం ఆకాంక్షించే పులిచింతల లింగారెడ్డి(అసిస్టెంట్ సెక్రటరీ-TTWREIS)గారికి...

నాకు కావాల్సిన గ్రంథాలను అంచించి పరిశోధన సజావుగా సాగడానికి సహకరించిన ఐజిఎం లైబ్రరీవారికి, వివిధ లైబ్రరీలు, పుస్తక విక్రయశాలల వారికి.... ప్రత్యక్షంగా, పరోక్షంగా పరిశోధనకు సహకరించిన వారందరీ పేరుపేరునా.....

**బోయపల్లి చిట్టెమ్మ**

# ప్రవేశిక

## 0. పరిచయం

వంద వసంతాల చరిత్ర కలిగిన తెలుగు ఆధునిక వచన సాహిత్య లక్ష్యం వినోదం, విజ్ఞానం, సామాజిక జీవిత చిత్రణ అందించడమే. ఇందులో భాగంగానే అనేక రకాలైన సమకాలీన సామాజికాంశాలనే ఇతివృత్తాలుగా స్వీకరించి రచనలు చేయడం పరిపాటి. తెలుగు సాహిత్యానికి మొదటి కథను అందించిన గురజాడ అప్పారావుగారి దగ్గరినుండి ప్రస్తుత "స్మార్ట్ ఫోన్" యుగంలో కథలు రాస్తున్న కథా రచయితల వరకు ప్రతి ఒక్కరు సమకాలీన అంశాలను స్పృశించిన వారే. అదే విధంగా మిగతా వచన రచయితల్లో కూడా వివిధ సామాజిక పరిస్తితులపై పాఠకులకు అవగాహన కల్పించి, జ్ఞానాన్ని అందించిన వారే ఎక్కువగా కన్పిస్తారు. వచన రచనల లక్ష్యం ఏదైనా, అందులోని ఇతివృత్తం మాత్రం సమకాలీన సామాజికాంశాలను ప్రతిబింబించేదిగా ఉంటుంది. రచయితను బట్టి, ఎంచుకున్న సృజనాత్మక సాహిత్య ప్రక్రియను బట్టి, వాటి నిర్మాణంలోనూ, భాష వాడకంలోనూ మార్పులు కన్పిస్తాయి.

పాత్ర చిత్రణ విషయంలో కూడా వివిధ రకాల మార్పులు కన్పిస్తాయి. ఈ విషయాలన్నీ ఎలా ఉన్నప్పటికి, అప్పటికి, ఇప్పటికీ, ఎప్పటికీ సృజనాత్మక సాహిత్య లక్ష్యం మాత్రం వినోదాత్మకంగా వివిధ అంశాలపై అవగాహనను కల్పిస్తూ జ్ఞానాన్ని అందించడమే. అటువంటి రచనలపై పరిశోధన చేస్తున్నాను.

## 1. పరిశోధనాంశ పరిధి

'రేవూరు అనంతపద్మనాభరావు సృజనాత్మక సాహిత్యం-అనుశీలన' అనే అంశంపై పరిశోధన చేయడానికి కింది పుస్తకాలను ఎంచుకున్నాను. ఈ పుస్తకాన్నింటిని క్షుణ్ణంగా చదివి వీటిపై పరిశోధన చేయవలసిన అవసరం ఉన్నట్లు గ్రహించి ఈ పరిశోధనాంశాన్ని

ఎంచుకున్నాను. అవి: నవలలు: మారని నాణెం, సంజ వెలుగు, వక్రించిన సరళరేఖ, వారసత్వం, కథాసంపుటాలు: కథాకమామిషు; కథలు: గోరింట పూచింది, కథా మందారం, అంతరంగ తరంగం, హరివంశం, దాంపత్య జీవన సౌరభం, ముత్తుస్వామి దీక్షితులు, యశోద.

పైన పేర్కొన్న రచనలపై పరిశోధన జరగలేదు. పూర్వ పరిశోధనల్లో రచయిత రచనలు సమగ్ర అను జరిగినట్టు పేర్కొన్నాను. ఆయా పరిశోధనలు జరిగే కాలంనాటికి పైన పేర్కొన్న రచనలు రాకపోవడం, వచ్చినా వాటిని ఆయా పరిశోధకులు వారి అంశం పరిధిలోకి తీసుకోకపోవడం వల్ల నేను ఈ పరిశోధన కొనసాగించడానికి కారణం అయ్యింది.

## 2. పరిశోధన ఆవశ్యకత

కాలనుగతంగా సమాజంలో వివిధ మార్పులు రావడం సహజం. మానవుడి మనుగడలో అనేక మార్పులు సంతరించుకున్నట్లే. ఈ మార్పుకు కారణమైన వివిధ పరిస్థితులను ప్రతిబింబించే కథా వస్తువులలో కూడా వివిధ పరిణామాలు కన్పిస్తున్నాయి. ఇలాంటి పరిణామాల వల్ల కథా లక్ష్యం ఎంతవరకు పరిపూర్ణమౌతోంది, రచయిత సృష్టించిన పాత్రలు ఎంతవరకు పాఠకుల్ని ప్రేరేపిస్తున్నాయి. ఎంతమేరకు రచయిత సమకాలీన పరిస్థితులపై అవగాహన కల్పించగల్గుతున్నాడు. భాష వాడకంలోనూ, కథా నిర్మాణంలోనూ, సన్నివేశ చిత్రణలోనూ నేర్పును ప్రదర్శించగల్గుతున్నాడు అనే విషయాలన్నింటిని చర్చించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

కథలపై ఎన్ని పరిశోధనలు జరిగినా, కొత్త కథలు వెలువడుతూనే ఉన్నాయి. కొత్త అంశాలు వాటిలో పొందుపర్చడం జరుగుతూనే ఉంది. కథా వస్తువు ప్రధానంగా సమకాలానికి సంబంధించినదై ఉంటుంది. కాబట్టి కొత్తగా పరిశోధన చేయవలసిన అవసరం కూడా ఉంది.

కథలపై పరిశోధనలు జరగడం ఎక్కువే. అయినప్పటికీ ప్రతి పరిశోధనలో ఏదో ఒక కొత్త అంశం వెలికితీయడం కన్పిస్తుంది. కాబట్టి ఈ అంశంలోనూ కొత్త విషయాలను చెప్పగలిగే అవకాశం ఉంది. కథ పాతదే అయినప్పటికీ అందులోని వస్తువు ఎప్పటికప్పుడు కొత్తగానే ఉంటుంది. అందువల్ల ఈ కొత్త వస్తువును పరిశోధించి సాహిత్య ప్రయోజనాన్ని చేకూర్చే అవకాశం ఉంది.

## 3. పూర్వ పరిశోధనలు

"అనంతపద్మనాభరావు నవలా సాహిత్యం- పరిశీలన" (1992), అనే అంశం పై ఆచార్య కొలకలూరి ఇనాక్ గారి పర్యవేక్షణలో టి. శ్యాం ప్రసాద్, శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయానికి సమర్పించిన యం.ఫిల్ సిద్ధాంత గ్రంథం.

"అనంతపద్మనాభరావు సమగ్ర సాహిత్యం-పరిశీలన" అనే అంశంపై ఆచార్య హెచ్.యస్.బ్రహ్మానందగారి పర్యవేక్షణలో జె. పోతులయ్య శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో అసంపూర్ణ పి.హెచ్.డి. సిద్ధాంత గ్రంథం.

"అనంతపద్మనాభరావు అనువాద రచనలు-సమగ్ర పరిశీలన" (2013) అనే అంశంపై డా.పి.సి.వెంకటేశ్వర్లుగారి పర్యవేక్షణలో శ్రీ కట్టమంచి చంద్రశేఖర్, శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయానికి సమర్పించిన యం.ఫిల్. సిద్ధాంత గ్రంథం.

"అనంతపద్మనాభరావు జీవిత చరిత్రలు-పరిశీలన"(2014) అనే అంశంపై డా.పి.సి.వెంకటేశ్వర్లుగారి పర్యవేక్షణలో శ్రీ కట్టమంచి చంద్ర శేఖర్, శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయానికి సమర్పించిన పి.హెచ్.డి. సిద్ధాంత గ్రంథం.

"సమగ్ర సాహిత్యం-పరిశీలన" (2015) అనే అంశం పై డా.గౌరి శంకర్ గారి పర్యవేక్షణలో దన్యం రాజు నాగమణి తెలుగు విశ్వవిద్యాలయానికి సమర్పించిన పి.హెచ్.డి. సిద్ధాంత గ్రంథం. ఈ గ్రంథాలన్ని ముద్రించబడ్డాయి.

## 4. పరిశోధన ప్రణాళిక

పరిశోధన సౌలభ్యాన్ని దృష్టిలో ఉంచుకొని దొరికిన సమాచారం ఆధారంగా ప్రస్తుతం ఐదు అధ్యాయాలుగా విభజించాను.

1. అనంత పద్మనాభరావు జీవితం–నేపథ్యం
2. రచయిత స్వకపోల కల్పనలు–కథాసాహిత్యం
3. అనంత పద్మనాభరావు నవలలు–ఇతివృత్త వైవిధ్యం
4. పురాణ వాఙ్మయరచనలు విశ్లేషణ – పురాణ వాఙ్మయ ప్రతిబింబం
5. బాల సాహిత్యం–విశ్లేషణ

## 5. ముగింపు

రచయితలు సమకాలీన సామాజిక స్థితిగతులను వస్తువుగా స్వీకరించి వీటిపై పాఠకులకు అవగాహనను కల్పించడంతోపాటు సామాజిక మార్పుకు, సాహిత్యాభివృద్ధికి కారకులవుతున్నారు. ఇది రచయితల బాధ్యతగా కన్పిస్తుంది. సృజనాత్మక రచనల్లోని మంచిని గ్రహించి మార్పును ఆచరించే వాడుగా పాఠకుడు కన్పిస్తున్నాడు. అందువల్ల వీరిద్దరిని సమన్వయిస్తూ సవ్యంగా అర్థం చేసుకొని, సవిమర్శ చేసి కొత్త విషయాన్ని శోధించి సాధించవలసిన నిరంతరాన్వేషిగా పరిశోధకుడు రచనలను పరిశోధించాలి.

## 6. ఉపయుక్త గ్రంథసూచి


1. అనంత పద్మనాభరావు, రేవూరు. 1996. యశోద. తిరుపతి: తిరుమల తిరుపతి దేవస్థానములు.
2. అనంత పద్మనాభరావు, రేవూరు. 1999. ముత్తుస్వామి దీక్షితులు. తిరుపతి: తిరుమల తిరుపతి దేవస్థానములు.

3. అనంత పద్మనాభరావు, రేపూరు. 2004. హరివంశం. రాజమండ్రి: భాగవత మందిరం.

4. అనంత పద్మనాభరావు, రేపూరు. 2013. కథా కమామీషూ. హైద్రాబాద్: శ్రీ వేదగిరి కమ్యూనికేషన్స్.

5. అనంత పద్మనాభరావు, రేపూరు. 2013. దాంపత్య జీవన సౌరభం. హైద్రాబాద్: స్వీయ ప్రచురణ.

6. అనంత పద్మనాభరావు, రేపూరు. 2014. అంతరంగ తరంగం. హైద్రాబాద్: స్వీయ ప్రచురణ.

7. అనంత పద్మనాభరావు, రేపూరు. 2014. గోరింట పూచింది (కథానికల సంపుటి). హైద్రాబాద్: స్వీయ ప్రచురణ.

8. అనంత పద్మనాభరావు, రేపూరు. 2015. కథా మందారం. హైద్రాబాద్: స్వీయ ప్రచురణ.

9. అనంత పద్మనాభరావు, రేపూరు. 2016. సంగ్రహ వాల్మీకి రామాయణం (వచన కావ్యం). హైద్రాబాద్: స్వీయ ప్రచురణ.

10. దక్షిణామూర్తి, పోరంకి. 1975. కథానికా వాఙ్మయం. హైద్రాబాద్. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి.

11. దక్షిణామూర్తి, పోరంకి. 1988. కథానికా స్వరూప స్వభావాలు. హైద్రాబాద్. విశాలాంధ్ర,నవోదయ పబ్లికేషన్స్.

12. నిత్యానందరావు, వెలుదండ. 2013. విశ్వవిద్యాలయాల్లో తెలుగు పరిశోధన. హైద్రాబాద్: శ్రీమతి గీతారాణి పబ్లికేషన్స్.

13. వెంకటసుబ్బయ్య, వల్లంపాటి. 1995. కథా శిల్పం. హైద్రాబాద్. విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్.

# విషయసూచిక

| | పేజీ సంఖ్య |
|---|---|
| డిక్లరేషన్ | iii |
| సర్టిఫికేట్ | iv |
| కృతజ్ఞతలు | vi |
| ప్రవేశిక | ix –xiii |
| 0.పరిచయం | ix |
| 1. పరిశోధనాంశ పరిధి | x |
| 2. పరిశోధన ఆవశ్యకత | x |
| 3. పూర్వ పరిశోధనలు | xi |
| 4. పరిశోధన ప్రణాళిక | xii |
| 5. ముగింపు | xii |
| 6. ఉపయుక్త గ్రంథసూచి | xii |

## మొదటి అధ్యాయం

### అనంత పద్మనాభరావు జీవితం–నేపథ్యం 1 –20

1.0. అనంత పద్మనాభరావు జీవన రేఖలు 1

1.01 రచయిత పరిచయం 1

1.1 పాఠశాల విద్య 2

1.2 విశ్వవిద్యాలయ విద్య 3

1.3 కళాశాల అధ్యాపకత్వం 4

1.4 ఆకాశవాణిలో 6

1.5 పోటీల్లో ముందంజ 6

1.6 దూరదర్శన్ లో 7

1.7 దేవుని కొలువులో 7

1.8 ఐ.ఎ.యస్. కోచింగ్ 9

1.9 ఫ్రీలాన్స్ అధ్యాపకత్వం 9

1.10 నిరంతర పరిశోధకుడు 9

1.11 జీవిత చరిత్రలు 9

1.12 అనంత పద్మనాభరావుగారిపై జరిగిన పరిశోధనలు 10

1.13 వ్యాఖ్యాతగా పలు సందర్భాలలో 10

1.14 బహుముఖ ప్రజ్ఞాశాలిగా రచయిత 11

1.14.1 వచనకవిగా 12

1.14.2 పద్యకవిగా 13

1.14.3 కథారచయితగా 14

1.14.4 కథాకథనం 15

1.14.5 కథావైచిత్రి 15

1.14.6 గల్పికలు 16

1.14.7 నవలాకారుడిగా 16

1.14.8 వ్యాసరచయితగా 17

1.14.9 పీఠికాకర్తగా 18

1.14.10 గ్రంథపరిష్కర్తగా 18

1.14.11 నాటకరచయితగా 18

1.14.12 విమర్శకునిగా 19

## రెండవ అధ్యాయం

## రచయిత స్వకపోల కల్పనలు-కథాసాహిత్యం 21-103

2.0 తెలుగు కథ – ఆవిర్భావ వికాసాలు 21

2.1 తెలుగు కథానిక – స్వరూపం – వికాసం 23

2.2 ఉత్తమ వచన ప్రక్రియ –కథానిక 26

2.3 కథానిక ప్రాచుర్యం 27

2.3.1 వస్తు వైవిధ్యం 27

2.3.2 పాత్ర వైవిధ్యం 27

2.3.3 సన్నివేశ ప్రాధాన్యం 27

2.3.4 సమకాలీన సమాజ చిత్రణం 28

2.3.5 సమన్వయం 28

2.4 కథ –నిర్వచనాలు 28

2.5 భారతీయ లాక్షణికులు – కథా స్వరూపం 30

2.6 కథానిక – ప్రాచీన సాహిత్యం 31

2.7 ఆధునిక కథా సాహిత్యం – పరిణామక్రమం 36

2.8 కథ లక్షణాలు 47
2.9 కథా సాహిత్యంలో ప్రముఖులు 52
2.10 కథా రచయిత్రులు 53
2.11 సమకాలీన కథా సాహిత్యం 55
2.12 స్త్రీవాద రచయిత్రులు 55
2.13 దళిత కథలు 56
2.14 కథా సంకలనాలు 56
2.15 అనంత పద్మనాభరావు కథా సంపుటాలు– విశ్లేషణ 58
2.15.1. మొదటి సంపుటి 58
కథా కమామీషూ
2.15.2. రెండవ సంపుటి 59
గోరింట పూచింది
2.15.3. మూడో సంపుటి 60
కథామందారం
2.16. అనంత పద్మనాభరావు కథలలో ఇతివృత్తం– పాత్ర చిత్రణ 61
పడగనీడ
పాత్రల విశ్లేషణ
పూర్ణిమ
శివుడు
చంద్రసేన తల్లి
సాత్యకి
పూర్ణిమ

తలపులతలుపులు

2.17 కథాకథన కుతూహలం 70

2.17.1 కథాకథన శైలి71

దేవయాని

కృష్ణ జన్మస్థానము

2.18 ఇతివృత్త స్వీకరణ 80

2.18.1 సామాజిక జీవనం 80

2.18.2 కుటుంబ నేపథ్యం 83

2.18.3 యువత దృష్టి 87

2.18.4 వృద్ధాప్య సమస్యలు 89

2.18.5 హాస్యస్ఫోరక సంభాషణలు 94

2.18.6 శృంగార సంభాషణలు –సన్నివేశాలు 97

2.19. గల్పికలు 98

## మూడవ అధ్యాయం

## అనంత పద్మనాభరావు నవలలు-ఇతివృత్త వైవిధ్యం 104-142

3.0 తెలుగు నవల: స్థూల పరిణామం 104

3.1 తెలుగు నవలారంభం 107

3.2 నవలా దృక్పథం 111

3.3 నవలా నేపథ్యం 113

3.4 నవలా ప్రక్రియ 117

3.5 నవలిక స్వరూపం 120

3.6 నవలల వర్గీకరణ 123

3.7 అనంత పద్మనాభరావు నవలలు–విశ్లేషణ 126

3.8 నవలల్లో ఇతివృత్త వైవిధ్యం 128

3.9 స్వగతాలు నవలానేపథ్యం 130

3.9.1 మధ్య తరగతి మందహాసం 131

3.9.2 అట్టడుగు వర్గంవారు 131

3.10 ఇతివృత్త స్వీకరణ 132

3.11 పాత్ర చిత్రణ– నైపుణ్యం 134

3.12 ముగింపు 142

## నాల్గవ అధ్యాయం 143-238

## పురాణ వాఙ్మయరచనలు విశ్లేషణ

## పురాణ వాఙ్మయ ప్రతిబింబం

4.0 దాంపత్య జీవన సౌరభం 143

4.1 గ్రంథ విస్తృతి 146

4.2 వ్యాసాల విశిష్టత 152

4.2.1. ఛాయా సూర్యులు 155

4.2.2 ఊర్మిళ 159

4.2.3 సులోచన ఇంద్రజిత్తులు 162

4.2.4 కౌసల్యా దశరథులు 163

4.3 మహాభారతంలోని దంపతులు 164

4.3.1 గాంధారీ ధృతరాష్ట్రులు 164

4.3.2 కుంతీ పాండురాజులు 165

4.3.3 ద్రౌపదీ–పాండవులు 166

4.3.4 మేనకా విశ్వామిత్రులు 166

4.4 పురాణ కావ్యశాస్త్ర పరిజ్ఞానం 169

4.5. తెలుగు భాషలో రామాయణాలు 173

4.5.1 అనంత పద్మనాభరావు అంతరంగం 175

4.5.2 అంతరంగ తరంగ రచనా నేపథ్యం 177

4.5.3 రచనా ప్రణాళిక 177

4.6 రచయిత స్వీయ పద్య రచనలు 182

4.7. అంతరంగ తరంగం –పాత్ర చిత్రణ 193

4.8 కథాకథనంలో ప్రత్యేకత 196

4.8.1 కౌసల్య 196

4.8.2 కైక 199

4.8.3 సుమిత్ర 201

4.8.4 సీత 202

4.8.5 తాటక 210

4.8.6 అహల్య 212

4.8.7 అనసూయ 214
4.9 ఇతర పాత్రలు 215
4.9.1 సునయనా దేవి 216
4.9.2 ఊర్మిళ 216
4.9.3. శబరి 217
4.9.4. తార 218
4.9.5. మండోదరి 219
4.10 సంగ్రహ వాల్మీకి రామాయణం– సంక్షిప్తీకరణ 221
4.11. హరివంశము పూర్వరంగ విశిష్టత 224
4.11.1 ఆకాశవాణి ధారావాహిక నేపథ్యం 227
4.11.2 ప్రసారంలో వినూత్నత 229
4.11.3 పుట్టపర్తి నారాయణాచార్యుల ప్రశంస 230
4.11.4 వివిధ ఘట్టాలు 232
4.12 వచనరచనలో సృజనాత్మకత 234
4.13 కథా నిర్మాణంలో విశేషాలు 236

## ఐదవ అధ్యాయం

**బాల సాహిత్యం-విశ్లేషణ 239-271**

5.0 తెలుగులో బాల సాహిత్యం—పరిచయం 239
5.1 నిఘంటువులు 'బాల' శబ్ద వ్యుత్పత్తి 241

5.2 ఇతర భాషల్లో బాల సాహిత్యం 246
5.2.1 తమిళంలో బాలసాహిత్యం 246
5.2.2 కన్నడంలో బాలసాహిత్యం 248
5.2.3 హిందీలో బాలసాహిత్యం 250
5.3 బాల సాహిత్యం–నిర్వచనం 250
5.4 అనంత పద్మనాభరావు బాలసాహిత్య కృషి 255
5.4.1 యశోద గ్రంథం 256
5.4.2 భాగవతంలో యశోద పాత్ర 256
5.4.3 ముత్తుస్వామి దీక్షితులు 264
5.4.3.1 వాతాపిగణపతిం భజే 267
5.4.3.2 నవావర్ణ కృతులు 268
5.4.3.3 ద్వితీయ వివాహం 269
5.4.3.4 కలలో గురుగుహానుగ్రహం 269
5.4.3.5 అష్టాదశముద్రలు 271

**ఉపసంహారం 272-274**

**ఉపయుక్తగ్రంథ సూచిక 275-282**

**అనుబంధాలు 283-314**

**అనుబంధం – I 283-307**

I(A)– రచయితతో ఇంటర్వ్యూ 283–292

I(B)– రెండవసారి రచయితతో ముఖాముఖి 293–301

I(C)– మూడవసారి రచయితతో ఇంటర్వ్యూ 302–307

**అనుబంధం - II 308**

ప్రముఖులతో ఇంటర్వ్యూ 308

**అనుబంధం - III 309-314**

డా॥ రేవూరి అనంత పద్మనాభరావు రచనలు (1970–2021)

# మొదటి అధ్యాయం

# మొదటి అధ్యాయం

# అనంత పద్మనాభరావు జీవితం–నేపథ్యం

## 1.0. అనంత పద్మనాభరావు జీవన రేఖలు

అనంత పద్మనాభరావు బహుముఖ ప్రజ్ఞాశాలి. తెలుగు సాహిత్యంలోని అన్ని ప్రక్రియలను స్పృశించి తనదైన ముద్ర వేశారు. కవిగా, కథకుడిగా, నవలా విమర్శకుడిగా, అష్టావధానిగా, సాహిత్యవేత్తగా, ప్రసంగకర్తగా, ప్రత్యక్ష వ్యాఖ్యాతగా, అధ్యాపకుడిగా దాదాపు 5 దశాబ్దాలు కృషి చేశారు. 8 సం॥రాలుగా (1967-1975) కందుకూరి ప్రభుత్వ కళాశాలలో అధ్యాపకునిగా పని చేయడంవల్ల ఏ ప్రక్రియను స్పృశించినా పాఠం చెప్పినట్లు ఎదుటివారికి అర్థమయ్యేటట్లు సులభగ్రాహ్యంగా విషయాన్ని అందించడంలో ఆయన నేర్పరి.

### 1.0. 1. రచయిత పరిచయం

1947 జనవరి 29 రథసప్తమి పర్వదినాన నెల్లూరు పట్టణంలో అనంత పద్మనాభరావు జన్మించారు. తల్లిదండ్రులు లక్ష్మీకాంతారావు, శారదాంబలు. వీరి స్వగ్రామం బుచ్చిరెడ్డి పాలెంనకు సమీపంలోని చెన్నూరు. అది ఒక పంచాయతీ గ్రామం. తండ్రి వ్యవసాయదారుడు. నైష్ఠిక కుటుంబం. ఒక్కగానొక్క కొడుకు పద్మనాభరావు. ప్రాథమిక విద్యాభ్యాసం స్వగ్రామంలోనే 9వ సంవత్సరము వరకు గడిచింది. 4వ తరగతి పూర్తయ్యింది. అప్పట్లో హైస్కూలులో చేరటానికి డబుల్ ప్రమోషన్ విధానం ఉండేది. హైస్కూలులో చేరటానికి ముందు ఒక వ్రాత పరీక్ష పెట్టి వారి వారి అర్హతలను బట్టి 6 లేదా 7 తరగతులలో చేర్చుకునేవారు. అలా 9వ ఏటా 7వ తరగతిలో 'జంపు' చేశారు.

## 1.1. పాఠశాల విద్య

అనంత పద్మనాభరావు తన పాఠశాల విద్యను1960లో బుచ్చిరెడ్డి పాలెంలోపూర్తి చేసుకొని యస్.యస్.ఎల్.సి (11వ తరగతి) ఉత్తీర్ణులయ్యారు. అప్పటికి ఆయనకు 13 ఏండ్లు నిండాయి. వి.ర్. కళాశాలలో (నెల్లూరు) బి.ఏ. స్పెషల్ తెలుగు 1965లో హై సెకండు క్లాసులో పాసయ్యారు. తెలుగు స్పెషల్, హిస్టరీ, ఎకనామిక్స్, ఆప్షనల్ సబ్జెక్టులుగా డిగ్రీ పూర్తి చేశారు. కళాశాల స్థాయిలోనే ఛందోబద్ధంగా పద్యాలు రాశారు. సరస వినోదిని, సమస్యాపూరణ కార్యక్రమానికి ఆకాశవాణికి వారం, వారం పద్యాలు రాయడంతో ప్రారంభమయిన వీరి కవితావ్యాసంగం తరువాత తరువాత వికసించింది. బి.ఏ. మూడో సంవత్సరంలో ఉండగా కళాశాల సాంస్కృతిక ఉత్సవాలకు ముఖ్య అతిథిగా సినీనటులు బాలయ్య వచ్చారు. ప్రిన్సిపాల్ ఆర్. సుబ్బారెడ్డిగారి అనుమతితో ఆయన మీద పద్మనాభరావు ఒక పద్యం రాశారు.

**ఉ. "ఆతత నాట్యకౌశల మహత్త్వమునీకెగల్గె చిత్ర ని**
**ర్మాత సహాయమున్‌గలిగె మా అభిమానము నీకె కల్గెడున్**
**నీ తలిదండ్రులెంత మహనీయులో నిన్గన చిత్రసీమ ప్ర**
**ఖ్యాత కళావిలాసివగు దందరి కన్నను నాట్య చాతురిన్"**

దీనిని వేదిక మీద చదివారు. సభలో చప్పట్లు మారుమోగాయి. "ఆనాటి చప్పట్ల మోత నన్ను రచయితగా తీర్చిదిద్దింది" అంటారు పద్మనాభరావుగారు. కళాశాలలోనే నాటకాలలో, వేషాలు వేశారు. బహుమతులు అందుకున్నారు. 'అల్లుడు చూపిన ఆదర్శం' నాటకంలో అమ్మాయి వేషం వేశారు. ఆ తరువాత పెద్దయిన తర్వాత గొల్లపూడి మారుతీరావుతో కలిసి అనిశెట్టి రాసిన 'ఆడది' నాటకంలో వంటవాడి పాత్ర పోషించాడు. భువన విజయ సభలలో

శ్రీకృష్ణ దేవరాయలుగా, తిమ్మరుసుగా, తెనాలి రామలింగడుగా, పింగళి సూరనగా, కందుకూరి రుద్రకవిగా, వివిధ ప్రదేశాలలో, వివిధ పాత్రలు పోషించారు. ఇది ఆయన కథలలోని నాటకీయతకు నేపథ్యంగా చెప్పవచ్చు.

## 1.2. విశ్వవిద్యాలయ విద్య

1965-67 సం॥ల మధ్య శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతిలో ఎం.ఏ. తెలుగు పాఠ్యాంశంగా చదివి స్వర్ణపతకం సంపాదించారు. వీరికి అధ్యాపకులు: ఆచార్య జి.న్. రెడ్డి, ఆచార్య జీరెడ్డి చెన్నారెడ్డి, ఆచార్య కోరాడ మహదేవశాస్త్రి, ఆచార్య జాస్తి సూర్యనారాయణ, తిమ్మావఝ్ఝల కోదండ రామయ్య, పంగనమల బాలకృష్ణమూర్తి వద్ద శిష్యరికం వీరి పాండిత్యానికి వన్నె పెట్టింది. "కాలేజీలో ఒకరోజు పాఠం వింటూ ఒక గేయం రాశానని, అది ఆంధ్ర పత్రిక దినపత్రికకు పంపిస్తే వెంటనే వేశారని" రచయిత చెప్పారు. "ఉద్గ్రంథం రాయాలంటే" అనే శీర్షికతో రచయితలు పుస్తకాలకు పెద్దవాళ్ల చేత పీఠికలు రాయించటం వాటికి బహుమతులు రావటం అనే అంశాన్ని వ్యంగ్యంగా చెప్పారు. 'అనంతం' అనే కలం పేరుతో 1967లో ఆ గేయం ప్రముఖంగా ప్రచురించబడింది. అంతకు ముందు "భయం వేస్తోందా భారతీ!" అనే పేరుతో ఒక గేయం నెల్లూరు నుండి వచ్చే జమీన్‌రైతు వారపత్రికలో ప్రచురించారు. అంటే ఎం.ఏ. పూర్తయ్యేనాటికే ఆయన పద్య, గేయ రచయితగా సాహిత్యంలోకి అడుగుపెట్టారు. అంతే కాదు స్రవంతి, ఆంధ్ర సారస్వతపరిషత్తు పత్రికలలో అనేక వ్యాసాలు రాశారు. ఉత్తర రామాయణం –తిక్కన – కంకంటి పాపరాజు అనే వ్యాసం ప్రముఖ సాహితీ పత్రిక ఆంధ్ర సారస్వత పరిషత్తు పత్రిక (త్రైమాసం)లో 1967లో ప్రచురితమైంది. ఆ వ్యాసం ప్రచురింపబడగానే చూసిన ఆచార్య తిమ్మావఝ్ఝల కోదండ రామయ్య, పద్మనాభరావుగారిని తరగతి గదిలోనే అందరి ముందు ప్రశంసించారు. దానితోపాటు "ఇలాంటి వ్యాసాల కోసం నీ సమయం వృథా చేసుకోవద్దు చదువు మీద శ్రద్ధ

పెట్ట"మన్నారు. ఫలితం స్వర్ణ పతకం విజేత అయ్యారు.  తెలుగు శాఖాధిపతి జి.న్. రెడ్డిగారు అమెరికాలో అధ్యాపకులుగా విస్కాన్సిన్ (Wisconsin University) విశ్వవిద్యాలయంలో పనిచేసి వచ్చారు. ఆంగ్లేయ బోధన విధానాలకు అలవాటు పడ్డవారు ఆయన. అందుకని ఎం.ఏ. విద్యార్థులకు 1966లో సెమినార్ పద్ధతిని ప్రవేశపెట్టారు. చివరి సంవత్సరంలో ఉన్న విద్యార్థులు ప్రతి ఒక్కరు ఒక్కొక్క అంశాన్ని ఎంచుకొని గంటసేపు విద్యార్థులు, అధ్యాపకుల ముందు పాఠంలా చెప్పాలి. 1966 సంవత్సరంలో చివరి సంవత్సరంలో 13 మంది విద్యార్థులు ఉన్నారు. ఎవరూ ముందుకు రాలేదు. చివరకు ప్రొఫెసర్ జి.ఎన్. రెడ్డి, పద్మనాభరావుని ఎంపిక చేశారు. తనకిష్టమైన బాలవ్యాకరణాన్ని పద్మనాభరావుగారు ఎంచుకున్నారు.  తిమ్మావజ్ఝల కోదండ రామయ్యగారు బాల ప్రౌఢవ్యాకరణాలు చెప్పేవారు. వారి సూచనలు, సలహాల మేరకు 'బాలప్రౌఢలు సాధింపని ప్రయోగవిశేషములు' అనే పేరుతో ఒక గంటసేపు 1966 సెప్టెంబర్ 5న ప్రసంగించారు.  ప్రసంగించడమే కాకుండా మీకేమైన సందేహాలు ఉన్నాయా? అని అడిగారు. అందరూ మెచ్చుకొన్నారు. అది పద్మనాభరావు చెప్పిన తొలి పాఠం. "అనుకోకుండా అది ఉపాధ్యాయ దినోత్సవం అందుకే నేను ఉపాధ్యాయుణ్ణి అయ్యాను" అంటారు. ఆయన కందుకూరి ప్రభుత్వ కళాశాలలో 1967-75 ల మధ్య 8 సంవత్సరాలు తెలుగు శాఖలో అధ్యాపకులుగా పనిచేశారు.

## 1.3. కళాశాల అధ్యాపకత్వం

ప్రకాశం జిల్లాలో కందుకూరు చాలా చిన్న ఊరు. అది గ్రామము కాదు, పట్టణం కాదు. 1966లో అక్కడ తిక్కవరపు రామిరెడ్డి గారి విరాళంతో ప్రభుత్వ కళాశాలను ఏర్పాటు చేశారు.  యాదృచ్ఛికమే అయినా తిరుపతి విశ్వవిద్యాలయంలో తెలుగు ఎం.ఏ.లో సర్వ ప్రథములుగా నిలిచినందుకు తిక్కవరపు రామిరెడ్డి స్వర్ణ పతకాన్ని స్వీకరించిన పద్మనాభరావు అదే రామిరెడ్డి విరాళంతో ఏర్పడ్డ ప్రభుత్వ కళాశాలలో ఉద్యోగం సంపాదించారు.

7½సంవత్సరాలు, అనగానే 'సాడేసాత్' అని గుర్తుకొస్తుంది. అంటే ఏణ్ణాళ్ల శని. కందుకూరులో పనిచేసిన 1967 డిసెంబర్ నుండి 1975 ఆగష్టు వరకు 7 ½ సంవత్సరాలు ఈ రచయిత విషయంలో అది ఫలప్రదమే అయ్యింది.

1. పాఠాలు చెప్పటంలో విద్యార్థుల మెప్పు సాధించారు.

2. బి.ఏ. స్పెషల్ తెలుగు విద్యార్థులకు సంస్కృతం, బాలవ్యాకరణం పాఠాలు చెప్పారు.

3. అష్టావధానాలు మొదలుపెట్టారు.

పరిసర ప్రాంతాల పాఠశాలలో వార్షికోత్సవాలకు ముఖ్యఅతిథిగా చాలా ప్రాంతాలను సందర్శించారు. కందుకూరు తాలూకా రచయితల సంఘం స్థాపించి అధ్యక్షులయ్యారు. సభలు, సమావేశాలు ఐదు సంవత్సరాల పాటు నిర్వహించారు. 1973లో ప్రారంభించిన పిహెచ్.డి. కొనసాగింది. కళాశాల విద్యార్థులలో రచనా వ్యాసంగాన్ని అభివృద్ధి చేయడానికి వారిచేత వచన, గేయ కవిత్వాలను రాయించి "విరిసీవిరియని మొగ్గలు" అనే పేరుతో 1971 సంవత్సరంలో ఒక సంకలనం వెలువరించారు. మరుసటి సంవత్సరం "కుసుమమంజరి" అనే పేర మరో సంకలనం వచ్చింది. రచయితల సంఘం పక్షాన "శారద నవ్వింది" అనే సంకలనం ప్రచురించారు. పద్మనాభరావు తన మొట్ట మొదటి గ్రంథం రాష్ట్రపతి వి.వి.గిరి చరిత్ర 1970లో ప్రచురించారు. తొలి నవల "మారెని నాణం" 1973లో ప్రచురించారు. ఈ సంవత్సరంలోనే మరో మూడు నవలలు రాశారు.

1. వక్రించిన సరళరేఖ.
2. సంధ్య వెలుగు.
3. స్వగతాలు.

రచయితల సహకార సంఘాన్ని స్థాపించి 'శ్రీమాల్యాది వైభవం' అనే గ్రంథం ప్రచురించారు. ఈ విధంగా 7 ½ సంవత్సర కాలంలో విస్తృత సాహితీ వ్యాసంగంతో పాటు రేడియో ప్రసంగాలు కూడా చేశారు. 7 ½ సంవత్సరాలు పూర్తి కాగానే ఏణ్ణాళ్ల శని వదిలినట్టుగా అధ్యాపక వృత్తిని వదిలి ఆకాశవాణిలో చేరారు. ప్రజాసంబంధాలు గల శాఖలో పనిచేయాలని ఆయన అంతరంగం.

## 1.4. ఆకాశవాణిలో

ఈ అధ్యాపక నేపథ్యంతోపాటు 1975-2005 సంవత్సరాల మధ్యగల 30 సంవత్సరాలలో ఆయన ఉద్యోగ రంగం, సాహితీ రంగం, సాంస్కృతిక రంగం వేయి పుంతలు తొక్కింది.

1. భిన్న ప్రాంతాలలో పని చేయటం: ఆకాశవాణి కడప, అనంతపురం, విజయవాడ, హైదరాబాద్, ఢిల్లీ కేంద్రాలలో వివిధ హోదాలలో పనిచేశారు.

2. ప్రవచన శాఖ ప్రయోక్తగా 1975 ఆగస్టులో 'ఓపెన్ కాంపిటీషన్'లో ఎంపికై 7 సంవత్సరాలు కడప, విజయవాడల్లో పనిచేశారు. ఈ కాలంలో వివిధ సాహితీవేత్తలతో,సాంస్కృతిక కళా రాజకీయవేత్తలతో రేడియోకు పరిచయాలు చేశారు. గ్రంథాలు ప్రచురించారు.

3. పిహెచ్.డి. పరిశోధన పూర్తిచేసి 1977లో కందుకూరి రుద్రకవి సిద్ధాంత గ్రంథం వెలువరించారు.

## 1.5. పోటీల్లో ముందంజ

నిలకడగా ఒక ఊర్లో ఉండటం ఆయనకు ఇష్టం ఉండదు. 2 సంవత్సరాల కొకసారి తానే పూనుకొని మరొక ఊరికి బదిలీ అయిపోతారు. అలా 30 సంవత్సరాలలో 13 బదిలీలు

చూశారు. "అధికారిగా మంచి పేరు ఉన్నప్పుడే పక్కకు వెళ్లడం మంచిదని" ఆయన సిద్ధాంతం. 1982లో యు.పి.యస్.సి ద్వారా అసిస్టెంట్ స్టేషన్ డైరెక్టర్ ఎంపికయ్యారు. అదే రీతిలో 1988లో స్టేషన్ డైరక్టర్‌గా ఎంపికయ్యారు. ఇవి రెండూ పోటీ పరీక్షలలో నెగ్గి సాధించిన విజయాలు.

## 1.6. దూరదర్శన్ నియామకం

2001లో పదోన్నతి మీద దూరదర్శన్‌కు డిప్యూటీ డైరెక్టర్ జనరల్‌గా నియమించబడ్డారు. 26 యేళ్ల ఆకాశవాణి అనుబంధాన్ని వదులుకొని తనకు కొత్తదైన దూరదర్శన్‌లో 4 సంవత్సరాలు పనిచేసి 2005 ఫిబ్రవరిలో పదవీ విరమణ చేశారు.

## 1.7. దేవుని కొలువులో

పదవీ విరమణ చేసి హైదరాబాదులో స్థిరపడదలచుకున్న పద్మనాభరావుకు శ్రీవేంకటేశ్వర కరుణా కటాక్ష విక్షణం చేత తిరుమల తిరుపతి దేవస్థానంలో ఐదేండ్లు పనిచేసే భాగ్యం లభించింది. వేంకటేశ్వర దృశ్య, శ్రవణ ప్రాజెక్టులో పనిచేస్తూ శ్రీవేంకటేశ్వర భక్తి చానెలుకు విశేష కృషిచేశారు. 2008లో రాష్ట్రపతి శ్రీమతి ప్రతిభా పాటిల్ చేతుల మీదుగా ఆ చానెల్ ప్రారంభోత్సవం జరిగింది. ఇప్పుడు లక్షలాది మంది భక్తులు తమ ఇంటి ముంగిట తిరుమల కొండ మీది కార్యక్రమాలను తమ డ్రాయింగ్ రూమ్‌లో చూసుకునే అవకాశం లభించింది. ఆ ప్రయత్నంలో తొలి కార్యకర్తగా తాను ఉన్నానని అది భగవంతుడు ప్రసాదించిన అదృష్టం అని 3 సంవత్సరాలు జీతం తీసుకోకుండా స్వామి దగ్గర పనిచేసే మహద్భాగ్యం లభించిందని సవినయంగా చెప్తారు.

## 1.8. ఐ.ఎ.యస్ కోచింగ్

మామూలుగా ఒక ఉద్యోగికి పదవీ విరమణ ఉంటే ఆ తరువాత విశ్రాంత జీవితమే. కానీ ఈయన విషయంలో ఐదు సంవత్సరాలు పొడగించబడింది. అంతటితో ఊరుకోలేదు మళ్ళీ 3వ ఉద్యోగం ఆయన వెంట పడింది. హైదరాబాదులో నారాయణ ఐ.ఎ.యస్ అకాడమీ అనే సంస్థలో వ్యవస్థాపక ప్రిన్సిపాల్‌గా ఒక సంవత్సరం పనిచేసి స్వచ్ఛందంగా 65 ఏండ్లు పూర్తి కాగానే 2012 జూన్‌లో విశ్రాంత జీవితానికి మొగ్గు చూపారు.

## 1.9. ఫ్రీలాన్స్ అధ్యాపకత్వం

సాధారణంగా రిటైర్డ్ అయినవారు ఏమీ తోచలేదని, కాలం గడవలేదని, నిద్ర పట్టడం లేదని, బాధపడటమే కాకుండా ఇంట్లోవాళ్ళను కూడా బాధ పెడుతుంటారు. ఇక్కడ పరిస్థితి తారుమారు అయింది. “నాకు 24 గంటలు సరిపోదు. రోజుకు 10 పేజీలు రాయందే నిదురపోను” అంటారు. 2012–17 ఈ 5 సంవత్సరాల మధ్యకాలంలో ఆయన విజృంభించి రాశారు. వివిధ కోచింగ్ సెంటర్లలో ఐ.ఎ.యస్ అభ్యర్థులకు పాఠాలు చెప్పారు. వివిధ పత్రికలకు వందలాది వ్యాసాలు రాశారు. ఉద్యోగ సోపానం అనే పక్ష పత్రికకు 4 సంవత్సరాలు నిర్విరామంగా 100కు పైగా “జయహో” శీర్షికతో ఐ.ఎ.యస్ విద్యార్థులకు ఉపకరించే వ్యాసాలు రాశారు.

ఐ.ఎ.యస్ విద్యార్థులకు ఉపయోగపడే 6 పుస్తకాలు రాశారు. అవి:

1. Job Interviews – Gyan Publications – Delhi – 2012 (English.)
2. పోటీ పరీక్షలు – లక్ష్య సాధన, తెలుగు అకాడమీ (తెలుగు, 2012).
3. Marathon Race to Civil Services (English, 2013).
4. Civils Planner (Telugu), 2014.

5. Ethics, Integrity, Aptitude (తెలుగు అకాడమి ప్రచురణ) (English, 2014).

6. నీతి నిజాయితీ, అభిరుచి, 2016, 17, 18ల్లో మూడు సార్లు ప్రచురించబడింది.

ఈ ఐదేండ్లలో వచ్చిన ఇతర గ్రంథాల సంఖ్యను చూస్తే ఆశ్చర్యం వేస్తుంది. ఒక రిటైర్డ్ అయిన వ్యక్తి 2005 నుండి 2017 లోపు 12 సంవత్సర కాలంలో 50 పుస్తకాలు రాశాడంటే గొప్ప విషయమే.

## 1.10. నిరంతర పరిశోధకుడు

పద్మనాభరావు పరిశోధన వయస్సుతో సంబంధం లేకుండా నిరంతరం కొనసాగుతూనే ఉంటుంది. దానికి తోడు ఆయనకు లభించిన పరిశోధన సౌకర్యాలు కూడా చెప్పుకోదగ్గవే. కేంద్ర ప్రభుత్వ సాంస్కృతిక శాఖవారి సీనియర్ ఫెలోషిప్ 2005-2007లో లభించింది. "రేడియో నాటకాల" మీద క్షుణ్ణంగా పరిశోధన చేసి 2007లో ఒక ప్రామాణిక గ్రంథం ప్రచురించారు.

2015-17 మధ్య కాలంలో నేషనల్ ఠాగూర్ స్కాలర్‌షిప్ లభించింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అర్కైవ్స్ (Archives) వారి సౌజన్యంతో ప్రాచీన తెలుగు పత్రికల మీద ప్రామాణికంగా ఒక పరిశోధన చేశారు. ఈ గ్రంథం ముద్రణ అయింది.

## 1.11 జీవిత చరిత్రలు

ఈ కాలంలో ఆయన పలు జీవిత చరిత్రలు రాశారు.

1. బెజవాడ గోపాలరెడ్డి, సి.పి. బ్రౌన్ అకాడమి ప్రచురణ, 2009.

2. ఆంధ్ర కేసరి ప్రకాశం – ప్రకాశం అభివృద్ధి అధ్యయన సంస్థ ప్రచురణ, 2010.

3. జమలాపురం కేశవరావు – తెలుగు అకాడమీ, 2017.

4. శంకరంబాడి చంద్రాచారి (తెలుగు) ఎమెస్కో ప్రచురణ, 2016.

5. శంకరంబాడి సుందరాచారి (ఆంగ్లం) ద్రవిడ విశ్వవిద్యాలయం, కుప్పం, 2017.

## 1.12. అనంత పద్మనాభరావుగారిపై జరిగిన పరిశోధనలు

ఇప్పటివరకు వీరి రచనలపై మూడు విశ్వవిద్యాలయాలలో ఐదు పరిశోధనలు జరిగాయి.

1. అనంత పద్మనాభరావు సమగ్ర రచనలు 2008-11 వరకు ఆచార్య ఎచ్.ఎస్. బ్రహ్మానంద పర్యవేక్షణలో P. పోతులయ్య పిహెచ్.డి. పరిశోధన శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం, (సిద్ధాంత గ్రంథం సమర్పించలేదు).
2. అనంత పద్మనాభరావు నవలా సాహిత్యం – టి. శ్యాంప్రసాద్, ఎస్.కె. యూనివర్సిటీ, 1992.

   యం.ఫిల్. పర్యవేక్షణ: ఆచార్య కొలకలూరి ఇనాక్.

3. అనంత పద్మనాభరావు అనువాద రచనలు – కె. చంద్రశేఖర్, యం.ఫిల్.2013, ఎస్.వి. యూనివర్సిటీ. పర్యవేక్షణ: డా॥ పి.సి. వెంకటేశ్వర్లు.
4. అనంత పద్మనాభరావు సమగ్ర సాహిత్యం – డి. నాగమణి. పిహెచ్.డి. 2009-2013. తెలుగు విశ్వవిద్యాలయం. పర్యవేక్షకులు: ఆచార్య టి. గౌరీ శంకర్.
5. అనంత పద్మనాభరావు జీవిత చరిత్రలు – పిహెచ్.డి. 2013-15. కె. చంద్రశేఖర్, యస్.వి. యూనివర్సిటీ. పర్యవేక్షణ: డా॥ పి.సి. వెంకటేశ్వర్లు.

## 1.13. వ్యాఖ్యాతగా పలు సందర్భాలలో

1. భద్రాచల సీతారామచంద్ర స్వామి కళ్యాణం(1981 నుండి నేటి వరకు).

2. తిరుమల తిరుపతి బ్రహ్మోత్సవాలు (1980 నుండి నేటివరకు).

3. శ్రీశైలం శివరాత్రి ఉత్సవాలు (1981 నుండి 2012 వరకు).

4. బర్మింగ్‌హోం ఆంధ్రా అసోషియేషన్, యు.కె., 1996.

5. ఒంటిమిట్ట కోదండ రామస్వామి కళ్యాణోత్సవాలు (సీతారామ కళ్యాణం – ఆకాశవాణి, దూరదర్శన్, ఎస్.వి.బి.సి.లలో ప్రసారం).

## 1.14. బహుముఖ ప్రజ్ఞాశాలిగా రచయిత

సాధారణంగా ఒక రచయిత కథకుడిగానో, కవిగానో నిలిచేపోతాడు. మరో ప్రక్రియలో అంతగా ప్రవేశించడు. ఈ రచయత 1970లో ప్రారంభించిన రచనా వ్యాసంగం దినదిన ప్రవర్తమానమై మూడు పువ్వులు ఆరు కాయలుగా విస్తరిల్లింది. విద్యార్థి దశలోనో, ఆకాశవాణి సమస్యా పూరణల ద్వారా కవితా వ్యాసంగం ప్రారంభించిన ఈయన 20 ఏళ్ళకే అష్టావధానిగా రంగప్రవేశం చేశాడు. యావదాంధ్రదేశంలో పలు ప్రాంతాల్లో పదులకొలది అవధాన జైత్రయాత్రలు సలిపి శభాష్ అనిపించుకున్నాడు. అవధాన పూరణాలను 'అవధాన పద్మసరోవరం' పేరుతో గ్రంథం ప్రచురించాడు.

తిరుపతి వేంకట కవులతో ప్రాముఖ్యం సంతరించుకున్న అవధాన ప్రక్రియను 20వ శతకంలో బహుముఖాలుగా విస్తరిల్లి ఎందరో యువకులు ఆ విద్యపట్ల ఆకర్షితులయ్యారు. అందులో ఈ రచయిత ఒకరు. ఆంధ్రదేశం నలుమూలలా తిరిగి ఉద్దండులైన కవి పండితులు పృచ్ఛకులుగా ఉండగా అష్టావధానాలు జయప్రదంగా నిర్వహించి సత్కృతులయ్యారు. ఈ రచయిత జీవనంలో అది ఒక పార్శ్వం.

## 1.14.1 వచన కవిగా

ఈ రచయిత ఎం.ఏ ప్రీవియస్‌లో ఉండగానే (1965-1966)వచన కవితారంభం చేశాడు. 'భయం వేస్తుందా భారతి' అనే పేర వ్రాసిన వచన కవిత అప్పట్లో నెల్లూరు నుండి వెలువడే జమీన రైతు వారపత్రికలో ప్రచురితమైనది. అది మొదలు గత 50 సం॥లుగా ఎన్నో వచన కవితలను దిన, వార, మాసపత్రికలలో పుంఖానుపుంఖాలుగా ప్రచురించారు. ఎం.ఏ విద్యార్థిగా ఉండగానే "ఉద్గ్రంధం రాయాలంటే" అనే కవిత (1966)ను 'ఆంధ్ర పత్రిక' దినపత్రికలో ప్రచురించడం విశేషం. ఆంధ్రజ్యోతి, ఎడనెడ, ఆంధ్రప్రభ, యోజన తదితర పత్రికలలో ప్రచురితమైన దాదాపు 40 వచన కవితలను 1987 జనవరి నాటికి సాహితీ రజతోత్సవంలో ప్రచురించి 'భయం వేస్తుందా భారతి' అనే పేరుతో ప్రచురించారు.

- '1987 జనవరి 29–40వ సం॥ నాడు హైదరాబాద్ త్యాగరాయ గానసభలో ఈ గ్రంథావిష్కరణ సభకు మూడు విశ్వవిద్యాలయాల ఉపాధ్యాక్షులు విచ్చేసి రచయితను ప్రశంసించడం అదృష్టంగా భావిస్తారు'[1].
- 'ఆచార్య భద్రిరాజు కృష్ణమూర్తి, హైదరాబాద్ విశ్వవిద్యాలయం అధ్యక్షులు, తుమాటి దోణప్ప, తెలుగు విశ్వవిద్యాలయం అధ్యక్షులు ఆచార్య సి. నారాయణరెడ్డి, అంబేద్కర్ సారస్వతిక విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షులు ఈ సభలో పాల్గొని రచయితను విశేషంగా ప్రశంసించారు.
- పుష్పగిరి పీఠాధిపతులు శ్రీశ్రీ విద్యా నృసింహ భారతీ స్వాములవారు ఈ రచయితను ఈ సందర్భంగా ఆశీర్వదించారు.

[1] రచయితతో ఇంటర్వ్యూ: 24/10/2021.

- 1987 సం॥నుండి ఈనాటి వరకు వివిధ సందర్భాలలో వచన కవితలు రచిస్తూ, ప్రచురిస్తూ సాహితీ జీవనయానాన్ని కొనసాగిస్తున్నారు. ఈ గ్రంథానికి ముందుమాట ఎవరిచేతనో రాయించలేదు. వారి శ్రీమతి చేతనే వ్రాయించారు.
- వచన కవితల్లో భావ వైవిధ్యం సందర్భ శుద్ధి, శబ్ద వైచిత్రీ, విషయగాఢత, సునిశిత విమర్శ మనం గమనించగలం'[2].
- దీనిని ఆంగ్లంలో కూడా అనువదించి 'Train Journey' (ట్రైన్ జర్నీ) అనే పేరుతో డా॥ కల్లూరి శ్యామల ప్రచురించారు. ఈ విధంగా మరికొన్ని కవితలు కూడా ఇతర ఆంగ్ల కవులు అనువదించడం విశేషం.

## 1.14.2 పద్యకవిగా

వస్తుతః పద్మనాభరావు పద్యకవి. పద్యం మీద ఆయనకు పట్టు ఉంది. స్వతఃసిద్ధంగా అష్టావధాని కావడంవల్ల పద్యం నడక ఆయనకు నల్లేరు మీద నడక అయింది.

- 'ఆంధ్ర ప్రకాశం మీద వీరు రాసిన పద్యం ఆంధ్ర పత్రికలో తొలుత ప్రచురించబడింది.
- వివిధ సందర్భాలలో వివిధ పత్రికలలో జయంతులకు ప్రత్యేక సంచికలను రాసిన పద్య కవితలు పలువురి ప్రశంసలు అందుకున్నాయి. పద్య కవితలను 2008 సం॥లో 'పద్మసరోవరం' అనే పేరుతో ప్రచురించారు. విడిగా కావ్యం రాయాలనే సంకల్పం ఉన్నా వివిధ ప్రక్రియలలో వేలు పెట్టడంవల్ల దుపద్య కావ్యాలను రాయలేకపోయాను అని బాధపడడం జరిగింది'[3].
- కాని 'శతక ద్వయం' అనే పేరుతో రెండు శతకాలను, 'ప్రకాశోదాహరణం' అనే పేరుతో పద్యాలు వ్రాయడం జరిగింది.

---

[2] రైలు ప్రయాణం: పుట: 8.

[3] రచయితతో ఇంటర్వ్యూ: 24/10/2021.

❖ 'నృసింహాష్టకం' అనే పేర ఒక అష్టకాన్ని రచించారు.

❖ ఈ విధంగా పద్య ప్రక్రియలో కూడా వివిధ విభాగాలను ఆయన స్పృశించారు.

❖ 'పద్య రామాయణం' రాద్దామనే సంకల్పంతో ప్రారంభించి విశ్వామిత్ర ఆగమన సన్నివేశాన్ని పద్యాలలో సంకల్పించారు.

❖ అవధానిగా తాను పూరించిన పూరణలను 'అవధాన పద్మసరోవరం' పేరు 2008లో ప్రచురించి, అమెరికాలోని ఫ్రిమాంట్‌లో ఆవిష్కరింపజేశారు. ఈవిధంగా అటు పద్యరచనలోనూ, ఇటు వచనరచనలోనూ ఈ రచయిత సమర్థుడనిపించుకున్నాడు.

### 1.14.3 కథారచయితగా

'బి.ఏ. చదివే రోజులలోనే ఈ రచయిత కథారచనలకు శ్రీకారం చుట్టాడు. "ఎవరు త్యాగశీలి?" అనే పేరులో ఒక కథను 1965లో జమీన్ రైతు వారపత్రిక ఉగాది సంచికలో ప్రచురించారు. వీటన్నంటికి మించి అప్పట్లో బహుళ ప్రచారం పొందిన సచిత్ర వారపత్రికలో 'విధి నిర్వహణ' అనే పేరు 1969లో కథానిక ప్రచురింటబడటం విశేషంగా పేర్కొన్నారు'[4].

❖ కథలు రాయటంలో తనదైన శైలిలో, తనదైన భావనాబలంతో వివిధ వార మాసపత్రికలలో కథలు ప్రచురించి కథకుడిగా లబ్ధ ప్రతిష్టుడయ్యాడు. గత దశాబ్ది కాలంలో నాలుగు కథాసంపుటాలుగా వెలువడ్డాయి. అవి: 1) కథాకమామీషు – 2013, 2) గోరింట పూచింది – 2014, 3) కథామందారం – 2015, 4) కథాదర్పణం – 2020.

ఇందులో నాలుగు సంపుటాలలో 86 కథలు ఉన్నాయి. 2020లో 'Story Mirror' అనే సంస్థ రోజుకు ఒక కథను రాయమని ప్రతిరోజు ఉదయం సంఘటనను ఇచ్చేవాడు.

---

[4] రచయితతో ఇంటర్వ్యూ: 24/10/2021.

సాయంత్రంలోగా కథను onlineలో రాయడం, అలా 2019 నవంబర్ మాసంలోని 30 రోజులలో 30 కథలు రాసి ఆ సంస్థ చేత 'Literary Colonel' అనే ప్రశంసను పొందారు.

### 1.14.4 కథాకథనం

కథకునికి భావనా బలం కావాలి. తీసుకున్న వస్తువును సన్నివేశ బలంలో సంభాషణ చాతుర్యంలో రక్తి కట్టించడం కష్టతరమైన పని. ఈ రచయిత స్వాతి వారపత్రికవారు ప్రకటించిన వివిధ పోటీలకు కథలు వ్రాశారు. 2013లో స్వాతి వారపత్రిక సరసమైన కథల పోటీలలో బహుమతి పొందింది. "వట్టి రాకపోకలొనర్చె వానిసతియు" అనే కథకు రూ॥10,000/-బహుమతి కూడా లభించింది.

### 1.14.5 కథావైచిత్రి

ఈ కథలలో సామాజిక జీవన చిత్రంతోపాటు ఆర్థిక, సాంఘిక సమస్యలను రచయిత స్పృశించారు. ప్రధానంగా వృద్ధాప్య సమస్యలకు పెద్ద పీట వేశారు. మారుతున్న సమాజంలో వృద్ధాశ్రమాల సంఖ్య ఎక్కువ అయ్యింది. విదేశీ సంప్రదాయాలలోని ఫాదర్స్ డే, మదర్స్ డే రీతిలో ల్లిదండ్రులకు వృద్ధాశ్రమాలు పునరావాస కేంద్రాలు అయినాయి. ఈ కథను చిత్రించటానికి వస్తువులో బలం ఉండాలి. సన్నివేశ కల్పనలలో ఆసక్తి ఉండాలి. కథాకథనంలో అనురక్తి ఉండాలి. వీటిని ఈ రచయిత శబ్ద వైచిత్రితో వానర ప్రస్థాన్ని 'వానర ప్రస్థం'గా చిత్రించడంలో మనం గమనించాలి.

- ❖ బహుమతి పొందిన 'వట్టి రాకపోకలొనర్చె వానిసతియు' అనే కథకు మూలం పింగళి సూరన కళాపూర్ణోదయంలోని సుగాత్రీ/శాలీనుల కథలు ఉన్నాయి. దానిని రచయిత ఆసక్తిదాయకంగా చిత్రించగలిగారు.

❖ వాసిలోను, రాశిలోను కథలకు ప్రాముఖ్యం గల రచయిత ఈయన. ఆంధ్రప్రభ, ఆంధ్రపత్రిక, ఆంధ్రజ్యోతి వారపత్రికలలో తొలినాడులలో ప్రచురించి ఆ తరువాత స్వాతి పత్రిక కథల పోటీలలో పాల్గొనడం ద్వారా నాలుగు సంపుటాలకు సరిపడ 82 కథలు బయటపడ్డాయి.

## 1.14.6 గల్పికలు

'వ్యంగ్య రచనలలో రచయిత సమర్థుడనిపించుకున్నాడు. సమయం అనే దినపత్రికలోను, ఆంధ్రపత్రికలోను 14 గల్పికలు వ్యంగ్యభరితంగా రచించారు. పదునైన కలం ఉంటే తప్ప వ్యంగ్యం పేలదు. తీసుకున్న అంశం జనాకర్షణ కలిగి ఉండాలి. కొద్ది మాటలలో వ్యంగ్యస్ఫోరకంగా విషయాన్ని చెప్పగలిగి ఉండాలి. అలాంటి ప్రయత్నాలలో ఈ రచయిత కృతకృత్యుడయ్యాడు. 'కథాకమామీషు' అనే గ్రంథంలో అద్దె ఇళ్లలో అగచాట్లు, టెలిఫోన్ ప్రహసనం ఇందు ఉదాహరణగా చెప్పవచ్చు'[5].

❖ చిన్న చిన్న మాటలలో పెద్ద భావాన్ని చెప్పడం చేయి తిరిగిన రచయితకే సాధ్యపడుతుంది. మామాగారు ఒకప్పటి అల్లుడే అనే ప్రహసనంలో అల్లుని మనస్తత్వాన్ని చక్కగా చిత్రించారు. ఆ విధంగా గల్పికా రచనలలోను రచయిత తనదైన శైలి ప్రదర్శించారు. ఇంతటి ప్రక్రియా వైవిధ్యం కొంతమందిలోనే గమనిస్తాం.

## 1.14.7 నవలాకారుడిగా

అ.ప. నాలుగు నవలలను రచించారు. అవి:

1) మారని నాణెం (1973 (మొదటి ముద్రణ); 1979 (రెండవ ముద్రణ),

2) వక్రించిన సరళరేఖ (1980),

---

[5] కథా కమామీషు. పుట: 81, 102

3) సంజ వెలుగు (1980),

4) స్వగతాలు (1996).

ఈ నవలలపై టి. శ్యాంసుందర్ ఆచార్య కొలకలూరి ఇనాక్ పర్యవేక్షణలో పరిశోధన చేసి శ్రీకృష్ణ దేవరాయ విశ్వవిద్యాలయం నుండి ఎం.ఫిల్. పట్టా పొందారు.

- ❖ నవలా రచయితగా ఆయన తనదైన ప్రత్యేకతను ఈ నవలలో ప్రస్ఫుటం చేశారు.
- ❖ సామాజిక జీవన చిత్రణలో ఈ రచయితది అందె వేసిన చేయి.
- ❖ మారని నాణెంలో కళాశాల అధ్యాపకుని జీవన నైపుణ్యాన్ని గోపాలరావు పాత్ర ద్వారా తెలియజేశారు
- ❖ ఈ పాత్రలను చదువుతుంటే బారిష్టరు పార్వతీశంలోని పార్వతీశం, గణపతి నవలలోని గణపతి మనకు కళ్ళ ముందు ప్రత్యక్షం అవుతారు.
- ❖ ఒకింత అమాయకత్వం మరికొంత లౌకిక రాహిత్యం ఇంకొంచెం ముక్కుసూటిగా నడిచే మనస్తత్వం గోపాలరావులో ప్రస్ఫుటం అవుతాయి. మిగతా అధ్యాపకులతోటి తాను లౌకికమైన దారులలో నడవాలని ఆయన ఎన్నడు ప్రయత్నించలేదు. అందుకే ఆ పాత్రకు 'మారని నాణెం' అని నామకరణం చేశారు. ఈ నవల రెండు సార్లు ముద్రించబడటం బహుళ జనాధరణ పొందిందనటానికి తార్కాణం.
- ❖ ఈ నవలను అనంతపురానికి చెందిన రచయిత వై. సి .పి. వెంకటరెడ్డి హిందీలోకి అనువదించారు.

### 1.14.8 వ్యాసరచయితగా

ఈ రచయిత వ్యాసుడు. నిరంతరం వ్యాసాలు, రాస్తూన్నే ఉన్నారు. కళాశాల విద్యార్థి స్థాయిలో తొలి వ్యాసం 1965 సం॥లో పింగళి సూరన గురించి ప్రచురించారు. అది మొదలు ఈనాటివరకు నిత్య కృషివలుడై దాదాపు 1200 వ్యాసాలు పుంఖానుపుంఖలుగా దిన, వార,

మాస పత్రికలకు ప్రత్యేక సంచికలకు, సెమినార్లకు, సదస్సులకు రాస్తూనే ఉన్నారు. 100కు పైగా గ్రంథాలకు పీఠికలు వ్రాశారు.

### 1.14.9 పీఠికాకర్తగా

గత 5 దశాబ్దాల కాలం నుండి వివిధ రచయితల గ్రంథాలకు వీరు ప్రోత్సాహకరంగా పీఠకలు వ్రాశారు. పద్య కావ్యాలు, వచన కవితా సంపుటాలు, నాటకాలు, వ్యాస పరంపరలు ఈ కోవలోకి వస్తాయి. కేవలం యువ రచయితలను ప్రోత్సహించడమే గాక లబ్ధ ప్రతిష్ఠుల గ్రంథాలకు కూడా పీఠికలు రాశారు. ఆ పీఠికలన్నీ కలిపి ప్రచురిస్తే దాదాపు 600 పుటల గ్రంథంగా తయారవుతుంది.

### 1.14.10 గ్రంథపరిష్కర్తగా

తాను స్వయంగా రాయటమే కాక ప్రాచీన గ్రంథాలను కూడా పరిష్కరించి ప్రచురించడం ఈయన ప్రత్యేకత.

| | | |
|---|---|---|
| 1) | మాల్యాద్రి వైభవం (మాలకొండ స్థల పురాణం) | 1976 |
| 2) | నిరంకుశోపాఖ్యానం (కందుకూరి రుద్రకవి ప్రబంధం) | 1977 |
| 3) | సుగ్రీవ విజయం(కందుకూరి రుద్రకవి యక్షగానం) | 1980 |
| 4) | రాఘవ పాండవీయం (పింగళి సూరన ద్వ్యర్థి కావ్యానికి అర్థ తాత్పర్యాలు | 2020 |
| 5) | రుక్మాంగద చరిత్ర (గిరికవి ద్విపద) | 2020 |

### 1.14.11 నాటకరచయితగా

తొలినాళ్ళలో రెండు రంగస్థల, సాంఘిక నాటకాలను రచించినా కవి ముద్రణలకు నోచుకోలేదు. ఇటీవల కాలంలో పద్య నాటకపంచకం అనే పేరుతో 2020లో ఆకాశవాణిలో ప్రసారం అయిన 5 నాటికలను ప్రచురించారు.

1) పారిజాతాపహరణం (నంది తిమ్మన మూలం)

2) వరూధిని (మనుచరిత్ర మూలం)

3) నిరంకుశుడు (నిరంకోశోపాఖ్యానం మూలం)

4) దేవయాని (మహాభారతం మూలం)

5) యామినీ పూర్ణతిలక (బిల్హణీయం మూలం)

ఈ పైన తెలిపిన 5 నాటకాలు ఆకాశవాణి విజయవాడ, కడప, హైదరాబాద్, వైజాగ్ కేంద్రాల నుండి ప్రసారం అయ్యి శ్రోతల ప్రశంసలను అందుకున్నాయి.

## 1.14.12 విమర్శకునిగా

- ‘ఈ రచయిత ఎం.ఏ. విద్యార్థిగా ఉండగానే సాహిత్య విమర్శకుడిగా తనదైన స్థానాన్ని నిలుపుకున్నాడు. విమర్శనాదృష్టి పాండిత్య స్ఫురక దృక్పథం రచయితకు సహజ లక్షణాలు.
- 1966లోనే కాకినాడ నుండి వెలువడే ఆంధ్ర సాహిత్య పరిషత్ పత్రికలో ఉత్తర రామాయణం, తిక్కన, కంకంటి పాపరాజు అనే తులనాత్మక వ్యాసం ప్రచురించారు. ఆంధ్ర దేశంలోని అన్ని దినపత్రికలలోను వీరి విమర్శనా వ్యాసాలు బహుళంగా ప్రచురింపబడ్డాయి.
- భారతదేశంలో 1968 సం॥లో బాల ప్రౌఢలు సాధింపని ప్రయోగ విశేషములు అనే వ్యాసం తలమానీకం.
- చిన్న వయస్సులో భారతి పత్రికలో వ్యాసం ప్రచురించబడడం తనకు సంతోషదాయకమన్నారు,[6].

[6] రచయితతో ఇంటర్వ్యూ: 24/10/2021.

- ఆ రోజులలో కృష్ణా పత్రిక సాహిత్య పత్రికగా ప్రాచుర్యంలో ఉండేది (మచిలీపట్నం). అందులో పుంఖానుపుంఖలుగా వ్యాసాలు వ్రాశారు.
- దక్షిణ భారత హిందీ ప్రచార సభ, హైదరాబాద్ వారి శ్రీ స్రవంతి మాస పత్రికలో అనేక వ్యాసాలు ఆంధ్ర దిన పత్రికలలో ప్రముఖ పండితులతో పరిచయాలు ప్రచురించారు.
- సాహితీ ప్రక్రియలలో విమర్శ అగ్రస్థానం పొందింది. వీరు రచించిన వివిధ వ్యాసాలను ప్రచురిస్తే 2000 పుటల గ్రంథంగా ప్రచురింపబడుతుంది.

## ఉపసంహారం

ఒక రచయిత ఇన్ని ప్రక్రియలలో తలస్పర్శిగా రచనలను కొనసాగించడం కష్ట సాధ్యం. ఆకాశవాణిలో అత్యున్నత అధికారిగా (అడిషనల్ డైరెక్టర్ జనరల్) పదవీ బాధ్యతలు నిర్వహిస్తూ 120 గ్రంథాలు ఎలా రాశారు? అని అడిగారు. అది ఒక వ్యసనం అన్నారు. రాయకుండా ఉండలేను అని అన్నాడు. రాసింది ప్రచురించడం మరొక వ్యసనం. అందుకే ఏటా ఒక పుస్తకం చొప్పున 1970 – 2020 సంవత్సరం వరకు అనగా 50 సంవత్సరాలలో 120 పుస్తకాలు రాయడం, ఆయన ఒక సవ్యసాచి అనడానికి నిదర్శనం. ప్రక్రియా వైవిధ్యం, భావన పటిమ ఈయనలోని విశేష అంశాలు. అందుకే ఆయన నిత్య కృషీవలుడు.

# రెండవ అధ్యాయం

# రెండవ అధ్యాయం

# రచయిత స్వకపోల కల్పనలు-కథాసాహిత్యం

## 2.0 తెలుగు కథ – ఆవిర్భావ వికాసాలు

సాహిత్యం కథాసహితం కావచ్చు. కథారహితం కావచ్చు. కథాసహితమైన రచన వచనాత్మకమైనా కావచ్చు. పద్యాత్మకమైనా కావచ్చు. కథాసహితమై, వచనాత్మకమైన దాన్నే కథాత్మక వచన సాహిత్యం అని చెప్పడం జరిగింది. దీని ప్రధానమైన రూపాల్లో కథానిక ఒకటి.

"కథానిక శబ్దానికి చిన్న కథ అని అర్థం. పరిమాణాత్మకంగా చిన్నది కావడాన్ని బట్టి ఈ వాడుక ఏర్పడింది. అయితే చిన్నగా ఉన్న కథల్లా చిన్న కథ అవుతుంది కాని కథానిక కానక్కర్లేదు. అంతేకాకుండా ప్రక్రియపరంగా కథానిక అయిన రచన ఒక్కొక్కప్పుడు పరిమాణాత్మకంగా పెద్దది కావచ్చు; చిన్నది కావచ్చు. కాబట్టి కథానిక శబ్దానికున్న పారిభాషికత 'చిన్న కథ' అన్న శబ్దానికి లేదన్నది స్పష్టమవుతుంది. సామాన్య వ్యవహారంలో అన్ని రకాల కథలను కథలనడమ తెలుగువాళ్లకు అలవాటు. హిందీలో 'కహానీ' అని, ఇంగ్లీషులో 'స్టోరీ' అని అంటూ ఉంటారు. పరిమాణాత్మకమైన భేదం చూపించవలసినపుడు మాత్రం 'చిన్న కథ' అని అంటూ ఉంటారు. దీన్నే ఆంగ్లంలో 'షార్ట్ స్టోరీ' అని పిలుస్తూ ఉన్నారు"[7].

1936లో ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి గారు 'ప్రతిభ' పత్రికలో ఒక వ్యాసం వ్రాస్తూ భారతీయ సాహిత్య శాస్త్రంలో కథానిక అన్న పేరు సిద్ధమై ఉందన్నారు. శివశంకరశాస్త్రిగారు

[7] దక్షిణామూర్తి, పోరంకి. కథానిక స్వరూప స్వభావాలు. పుట: 176

తన 'ఏకాదశి' అనే కథల సంపుటిలో కథ, కథానకం, ఆఖ్యానం, ఆఖ్యాయిక అనే గద్య విభాగాలున్నట్లు వ్రాశారు.

"ఇతివృత్త భేదాన్ని బట్టి కథ, ఆఖ్యాయిక, ఖండ కథ, పరికథ అను ఐదు గద్య ప్రబంధ భేదములు కలవని కావ్యాదర్శ వ్యాఖ్యాత జీవానాంద విద్యాసాగర భట్టాచార్యులు తెలిపిరి"[8].

ఒక నిర్దిష్ట సాహిత్య ప్రక్రియ రూపొందిన ఆధునిక వచన రచనా విశేషం 'కథానిక'. మామూలు కథ కంటే ఇది సునిశితం, సూక్ష్మతరం. ప్రతి కథానిక ఒక కథే. కానీ ప్రతి కథ కథానిక కాదు. కథ విషయ ప్రధానమైతే కథానిక శిల్ప ప్రధానం. రచయిత ఏం చెప్పాడన్నది రెండింటికి వర్తిస్తుంది. కానీ ఎలా చెప్పాడన్నది కథానికకే వర్తిస్తుంది. ఈ విషయం మొట్టమొదట గుర్తించనవారు గురజాడ వెంకట అప్పారావు. ఈయనే తెలుగు కథానికకు ఆది పురుషుడు. ఈయన 'దిద్దుబాటు' అనే కథానికను వ్రాసి ఆంధ్రుల మనస్సులలో చిరస్థాయిగా నిలిచిపోయాడు. ఈ కథానిక 1910 సంవత్సరంలో ఫిబ్రవరి 'ఆంధ్రభారతి'లో ప్రచురింపబడింది.

క్రీ.శ. 19వ శతాబ్దంలో కందుకూరి వీరేశలింగం పంతులు, రఘుపతి వెంకటరత్నం నాయుడు మున్నగువారి సంస్కరణోద్యమంతో తెలుగునాట సాంఘిక రంగంలో నూతన చైతన్యం మొలకెత్తింది. తెలుగు సాహిత్యంపై కూడా ఈ ప్రభావం పడింది. కథానిక వస్తు విషయంలో మార్పు వచ్చింది. ఇతివృత్తంలోను, శైలిలోను, ఆధునికతను సంతరించుకొని కథానిక కొత్త పుంతలు తొక్కింది. గురజాడ 'దిద్దుబాటు' తరువాత చాలా కథానికలు వచ్చాయి. అందులో గురజాడ వ్రాసినవి 'మా పేరేమిటి', 'మెటిల్లా', పెద్ద మసీదు' చాలా ప్రాచుర్యాన్ని పొందాయి.

---

[2] దక్షిణామూర్తి, పోరంకి. కథానిక స్వరూప స్వభావాలు. పుట: 179, 180

## 2.1 తెలుగు కథానిక – స్వరూపం – వికాసం

కథానిక ఈ విధంగా ఉండవలెనన్న నియమం లేదు. ఆయా కాలములలోని సమకాలీన సమస్యలను వస్తువులుగా స్వీకరించింది. వీరేశలింగం పంతులు సంస్కరణోద్యమాన్ని ప్రతిబింబిస్తూ అంధ విశ్వాసాలు, బాల్య వివాహాలు, అవినీతి, కుల ద్రవ్యమానాలు మొదలగువానిని చిత్రిస్తూ అనేక కథలు వచ్చాయి. 1920 తరువాత స్త్రీ పురుష సంబంధాలు, కులాంతర ప్రేమలు, వివాహాలు, ప్రకృతి భీభత్సాలు, సామాన్యుల సమస్యలు చిత్రీకరిస్తూ కథలు వచ్చాయి. ఆధునిక కాలంలో ఉద్యోగులు, అధికారుల సంబంధాలు, నిరుద్యోగం, వరకట్నం, అవినీతి, రాజకీయాలు మొదలగు విషయాలు ప్రతిబింబించే కథలు వచ్చాయి.

గురజాడ కథలలో 'ఉత్తమ శిల్పం', 'సంక్షిప్తత', 'సహజత్వం', 'సాంఘిక ప్రయోజనం', 'ఆధునికతా ముద్ర' చక్కగా పాటింపబడినాయి. సజీవమైన తెలుగు భాషను మొట్టమొదటగా ఉపయోగించినవారు గురజాడ అప్పారావుగారు. గురజాడతో మొదలైన తెలుగు కథానిక క్రమక్రమంగా వికసించి పత్రికల సంఖ్య పెరుగుటతో కథానిక వ్యాప్తి విస్తృతమైంది. కథానిక రచయితల సంఖ్య కూడా పెరిగింది.

క్రీ.శ. 1916 మొదలు 1919 వరకు ఉన్న మధ్యకాలంలో కథారచన విస్తృతమైనది. ఈ కాలం నాటి ప్రముఖ కథారచయితలు చింతా భీమశంకరం, మునిమాణిక్యం నరసింహారావు, వేలూరు శివరామశాస్త్రి, నోరి నరసింహశాస్త్రి మున్నగువారు ప్రముఖులు.

తెలుగు కథాసాహిత్యంలో మొట్టమొదటిసారిగా గిరిజనుల గురించి సంచార జీవనుల గురించి కథలు వ్రాసినవారు చింతా దీక్షితులు. వారు వ్రాసిన 'సుగాలి కుటుంబం', 'దాసరిపాట', 'చెంచురాణి' అన్న కథలు ఈ కోవకు చెందినవి. సుగాలి కుటుంబం తెలుగులో వచ్చిన మొట్టమొదటి కరువు కథ.

"వాస్తవిక జీవిత చిత్రణ, సంఘ సంస్కరణ ప్రధాన వస్తువులుగా కొనసాగుతున్న తెలుగు సాహిత్యంలోకి తాత్వికతను ప్రవేశపెట్టినవారు విశ్వనాథ కంటే ఒక ఏడాది ముందుగా పుట్టినా కాస్త ఆలస్యంగా రచన చేసినవాడు చలం. వస్తువులోను, శైలిలోను, తెలుగు కథలో చలం తీసుకొచ్చిన మార్పు విప్లవ సదృశమైనది. చలమే లేకుంటే తెలుగు కల్పనా సాహిత్యం ఈనాడు ఉన్నట్లుగా ఉండేదికాదు. బహుశా కొడవటిగంటి కుటుంబరావు, గోపీచంద్, బుచ్చిబాబు, రంగనాయకమ్మ, ఓల్గా, సత్యవతి లాంటి వాళ్లు రావటానికి మరెన్నో దశాబ్దాలు పట్టేది. చలం స్త్రీకి స్వాతంత్ర్యం, ఆర్థిక స్వాతంత్ర్యం కూడా ఉండాలని చెప్పారు"[9].

గురజాడ, శ్రీపాద, చింతాదీక్షితులు, చలం, గోపీచంద్, కొడవటిగంటి కుటుంబరాలు, రా.వి. శాస్త్రి, వెంకయ్యనాయుడు, బుచ్చిబాబు, పాలగుమ్మి పద్మరాజు కథావస్తువులోను, కథారూపంలోను ప్రవేశపెట్టిన నూతన అంశాలను గురించి ఇంతవరకు చర్చించాం.

1970 తర్వాత తెలుగు కథా సాహిత్యంలో వచ్చిన పరిణామాలను వాటి ఫలితంగా 1980–90 దశాబ్దం కాలంలో తెలుగు కథలలో వచ్చిన మార్పులను గురించి ఆలోచిద్దాం.

ఆధునిక తెలుగు సాహిత్యంలో 1970 నిశ్చితమైన విభజన బిందువు భావజాలం ప్రాతిపదికగా రచయితలలో, మేధావులలో అంతకు ముందు ఎన్నడూ లేనంత తీవ్రంగా, స్పష్టంగా వర్గీకరణ వచ్చింది. 1970 దశకం విప్లవ కవితాయుగం. 1980 దశకం సామాజిక భావజాలం. చాలా తక్కువగా వ్యక్తిగత స్పందన చాలా ఎక్కువగా ఉన్న కవిత్వం సాహిత్య రంగాన్ని ఏలిన కాలం. కాబట్టి 1970, 80 దశకాలు కవిత్వాన్ని ముందుకు తెచ్చినంతగా కథను తీసుకురాలేదని చెప్పడంలో కొంత సత్యం లేకపోలేదు.

---

3 వెంకటసుబ్బయ్య, వల్లంపాటి. కథాశిల్పం: పుట: 109

1970–90 మధ్య కాలంలో ప్రతిభావంతులైన కొత్త తరం రచయితలు ఎందరో వచ్చారు. వారిలో భూషణం, అల్లం శేషగిరిరావు, యన్.యస్. ప్రకాశరావు, చిలుకూరి దేవపుత్ర, సింగమనేని నారాయణ, కవనశర్మ, అల్లం రాజయ్య, బి.యస్. రాములు, పతంజలి, వివినమూర్తి, పాపినేని శివశంకర్, తుమ్మేటి రఘోత్తమరెడ్డి, జగన్నాథశర్మ, చంద్రశేఖరరావు, పతంజలి శాస్త్రి, ఉమా మహేశ్వరరావు, జి.ఆర్. మహర్షి, నరేంద్ర, మహేంద్ర, ఓల్గా, సత్యవతి నిలదొక్కుకొని మంచి కథలు వ్రాస్తూ ఉన్నారు.

ఇటీవలి తెలుగు కథలో వస్తువుపరంగా వచ్చిన మరొక ముఖ్యమైన మార్పు పెరుగుతున్న రాయలసీమ చైతన్యం. రాయలసీమ మాండలిక భాషతో కథలు విరివిగా రావడం మొదలుపెట్టాయి. కరువు కథలు, ఫ్యాక్షనిజం కథలు, నీటి సమస్యల కథలు, రైతులకు జరిగే మోసాలు ఇటువంటి కథా వస్తువులతో రాయలసీమలో సామాజిక అంశాల ఆధారంగా కథలు వస్తున్నాయి. ఆ కోవకు చెందినవే సీమ కథలు.

స్త్రీవాద కథా సాహిత్యం పుష్కలంగా వస్తూ ఉంది. స్త్రీవాద రచయిత్రులలో ఇల్లిందల సరస్వతీదేవి, ఓల్గా, అబ్బూరి ఛాయాదేవి, శ్రీదేవి, రామలక్ష్మి, వాసిరెడ్డి సీతాదేవి, వడ్లమూడి దుర్గాంబ మొదలైనవారు స్త్రీ సమస్యలను చిత్రిస్తూ స్త్రీవాద చైతన్యంతో కథలు వ్రాస్తున్నారు.

ఇటీవలి కాలంలో తెలుగు కథా సాహిత్యంలో తెరుచుకున్న నూతన ద్వారాలు కథా వస్తువలలో వైవిధ్యం పెరగడం, రచయితలలో కథాశిల్పం పట్ల శ్రద్ధ కలగడం, గోప్యత ఒక ప్రధాన శిల్ప పద్ధతిగా రూపొందించడం, శక్తి కల్గిన 10–15 మంది రచయితలు తెలుగు రంగంలో ఉండడం, తెలుగు కథకు గొప్ప భవిష్యత్తునే సూచిస్తున్నాయి.

తెలుగు కథాసాహిత్యం వివిధ దశలుగా అభివృద్ధి చెంది, నవలిక, నవల, పెద్దకథ ఇలా పలురకాలుగా ముందుకు సాగిపోతూ ఉంది.

## 2.2 ఉత్తమ వచన ప్రక్రియ –కథానిక

సాహిత్య ప్రక్రియలో ఉత్తమమైనదిగా కథానికను పేర్కొనవచ్చు. కథల పుస్తకాలు సైతం కదులుతున్నాయి. అచ్చు వేస్తున్న పరిస్థితి మునుపటి కన్నా చాలా మెరుగని గతములో పెదవి విరిచిన ప్రచురణకర్తలే చిరునవ్వుతో అంటున్నారు. అంటే తెలుగు కథా సాహిత్యరంగంలో మార్పు స్పష్టంగా కన్పిస్తుంది. నిజానికిది గొప్ప పరిణామం. మానవ సంబంధ విలువలు ధ్వంసమవుతున్న సామాజిక నేపథ్యంలో ఉత్తమ కథా సాహిత్యం ద్వారా ఆ సందర్భాన్ని విలువల్ని సంస్కరించడానికి, స్ఫూర్తినివ్వడానికి, వాటి ఆవశ్యకతను తెలియజేయడానికి, వాటిలో దాగివున్న అద్భుతమైన శక్తిని వెలికి తీయడానికి, మానవ జీవిత మూల సూత్రాలను సంరక్షించుకోవడానికి ఉత్తమ వచన కథా సాహిత్యం ఎంతో దోహదపడుతుంది. ఉత్తమ కథా సాహిత్యం, ఉత్తమ సమాజాన్ని నిర్మిస్తుంది. నవలా, జీవిత చరిత్ర, యాత్ర చరిత్ర, కవిత వీటి అన్నిటికన్నా కథానిక సమాజాన్ని చైతన్యవంతపరిచేదిగా మనకు కన్పిస్తుంది. 1989 – 1990 సంవత్సరం నాటికి పరిస్థితిలో కొంత మార్పు వచ్చినది. తెలుగు కథ పునర్వికాసానికి, పునర్జీవనానికి కృషి చేయాలన్న ఆలోచనకు గట్టి మద్ధతు లభించ సాగింది. 1989లోనే హైదరాబాద్ నగరంలో కథా వేదిక సాహితీ సంస్థ ఏర్పాటుకు బీజాలు పడ్డాయి. అయితే అది కాస్తా 1990లో మద్రాసు మహానగరంలో అంకురించింది. సాంస్కృతికంగా మొన్నమొన్నటివరకు కేంద్రంగా ఉన్న మద్రాసు నగరంలో కథా వేదిక ఆవిర్భావం ఒక చారిత్రక సంఘటనగా భావించవచ్చు. కేవలం కథా ప్రక్రియ కోసం దాని వికాసం కోసం కథా మాధ్యమం ద్వారా సామాజిక అంశాలను చర్చించేందుకు గాను సాహితీ సంస్థ ఏర్పడడం ఇది మొదటిసారి.

ఈ విధంగా ఉత్తమ కథలు రాసే రచయితల, రచయిత్రుల సంఖ్య పెరుగుతోంది. ప్రచురించే పత్రికల ప్రచురణకర్తల సంఖ్య పెరుగుతుంది. వివిధ చోట్ల ఉత్తమ కథపై

అవగాహనను పెంచేందుకు క్రియాశీలకంగా పనిచేసే సంస్థలు పెరుగుతున్నాయి. తద్వారా పాలకులు పెరుగుతున్నారు. ఉత్తమ కథా సాహిత్య ఉద్యమం బలపడుతోంది.

## 2.3 కథానిక ప్రాచుర్యం

పారిశ్రామిక యుగంలో అతి శక్తివంతమైన సాహితీ ప్రక్రియ కథ అన్న విషయం యూరప్ సమాజంలో ఏనాడో ఋజువైంది. ఈ శక్తివంతమైన సృజనాత్మకమైన ప్రక్రియ ఆధారంగా నేడు వెనుకబడిన దేశాల్లో ఒకటైన మన దేశంలో ముఖ్యంగా ఆంధ్రదేశంలో అన్యాయాలకు, అక్రమాలకు, అవినీతికి, అణచివేతకు, అరాచకాలకు, అవిద్యకు, అవ్యవస్థకు వ్యతిరేకంగా కథానిక శక్తివంతమైన సాహిత్య సాధనంగా ఉపయోగపడుతుంది.

### 2.3.1వస్తు వైవిధ్యం

వస్తువు అనగా రచయిత చెప్పదలచుకున్న అంశం. ఆధునిక కాలంలో రచయిత కథానికలోని వస్తువును వైవిధ్యంగా చిత్రీకరిస్తున్నారు. కథాంశాన్ని శక్తివంతమైన సాధనంగా ఉపయోగిస్తూ సమాజంలో మార్పు తీసుకురావడానికి కథానిక ప్రయత్నిస్తుంది.

### 2.3.2 పాత్ర వైవిధ్యం

పాత్రలు సమాజంలో నుంచి వచ్చినవే. అయినా వైవిధ్యంతో కూడుకొని ఉంటాయి. మధ్యతరగతి పాత్రలు, సమాజాన్ని ఉత్తేజపరిచే పాత్రలు, విప్లవ పాత్రలు ముఖ్యంగా కథలోని ప్రధాన పాత్ర లేక కథకుడు కథాకథనానికి కొత్త జీవితాన్నిచ్చి చిత్రిస్తూ ఉంటారు.

### 2.3.3 సన్నివేశ ప్రాధాన్యం

కథానికల్లో ముఖ్యంగా సన్నివేశం ప్రాధాన్యత వహిస్తుంది. ఆ సన్నివేశంలో చతురమైన సంభాషణలతో, సరళమైన భాషతో, మనసుకు అర్థమయ్యేలా సంభాషణలు

ఉంటాయి. కథానికలో స్పష్టతను, నిర్దిష్టతను, సూటిదనాన్ని సన్నివేశంలో ప్రవేశపెట్టడానికి రచయిత కృషి చేస్తాడు. ఈ సన్నివేశం వల్ల పాఠకులలో కథానిక మీద ఆసక్తి పెరుగుతుంది.

### 2.3.4 సమకాలీన సమాజ చిత్రణం

సమాజంలో జరుగుతున్న వివిధ రకాల సమస్యలు కథానికలో చిత్రించడం చాలా సులువైన పని. వరకట్న సమస్య, సారా సమస్య, నిరుద్యోగ సమస్య, వాతావరణ సమస్య, రాజకీయ సమస్య, స్త్రీల సమస్యలు, ముసలివారి సమస్యలు, కార్మికుల సమస్యలు మొదలైన ఏ సమస్యలనైనా చిత్రించి వాటికో పరిష్కార మార్గాన్ని చూపించే బాధ్యత కథానికపై ఉంది.

## 2.3.5 సమన్వయం

ప్రాచీన సాహిత్యం నుండి ఆధునిక కాలం వరకు కథానిక తెలుగు సాహిత్యంలో ఎన్నో పరవళ్ళు దిద్దుకుంటూ సమాజాన్ని చైతన్యవంతపరుస్తూ వైవిధ్యమైన కథానికలతో సమాజంలో ఎంతో మార్పు తీసుకువస్తున్నది. ఆధునిక కాలంలో మరింత కొత్తదనంతో తెలుగు సాహిత్యంలో కథానికలు విరివిగా రావాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది.

## 2.4 కథ –నిర్వచనాలు

ఆధునిక యుగంలో వచన కాల్పనిక సాహిత్యంలో ముఖ్యమైన ప్రక్రియ కథానిక. దీన్నే చిన్నకథ, కథ అని చెప్పుకుంటున్నాం. ఆంగ్లంలో దీన్ని "Short Story" అంటారు. సామాన్యుల జీవితంతో కథ అల్లడం, కట్టడం, చెప్పడం, వినడం అనే ప్రక్రియ తరతరాలుగా కనిపిస్తుంది. మౌఖికంగా ప్రచారంలో ఉన్న ఈ కథలు స్థల కాలాలను బట్టి, సమాజాన్ని బట్టి అనేక రకాల కథలు కనిపిస్తాయి. మానవ సమాజంలో అన్ని వర్గాలకు, సమాజాలకు వారి వారి కథలు ఉంటాయి. చూచినవి, విన్నవి అయిన సంఘటనలను, వృత్తాంతాలను, వ్యక్తుల చర్యలను తిరిగి చెప్పడం కథనం. కథలో వస్తువులో వైవిధ్యం, చెప్పే రీతిలో వైవిధ్యం, సంక్లిష్టత

కనిపిస్తాయి. జీవితాన్ని దర్శించే విధానాన్ని బట్టి కథ చెప్పడంలో విభిన్నత గోచరిస్తుంది. అత్యంత ప్రాచీన నాగరికత గల ఈజిప్షియన్, గ్రీక్, రోమన్, చైనీస్, అరబ్, భారతీయ సమాజాలలో చరిత్ర తెలిసిన నాటినుంచి కథలు ఉన్నట్లు తెలుస్తుంది.

“కుతూహలం, కల్పనాశక్తి, విచారశీలత మనిషికుండే స్వభావిక గుణాలు. ప్రకృతిలోని సూర్యచంద్రాదులు, పశుపక్ష్యాదులు, పృధివ్యస్తేజోవాయురాకాశాలు మానవునికి అడుగడుగునా కుతూహలాన్ని రేపాయి. కల్పనా తరంగాలను సృష్టించాయి. అతన్ని వైచారిక పథాన నడిపించాయి. ప్రకృతిలోని సౌందర్యమూ, భీకర స్వరూపమూ, సుఖదుఃఖమూ మానవునికి ఎన్నో ఆలోచనల్ని కల్గిస్తాయి. ఆ ఆలోచనల సుడిగుండాల్లో చిక్కి మనిషి ఉక్కిరిబిక్కిరి అవుతున్నాడు. భౌతిక వస్తువుల గూర్చి, దాని వెనుక దాగి ఉందనుకునే శక్తిని గూర్చి, స్వర్గ, మర్త్య పాతాళాదులను గురించి మనిషి ఆలోచించాడు. అతని ఈ ఆలోచనా శక్తి ఎంతో దూరం పోలేనప్పుడు కల్పనా శక్తే ఎక్కువై కాల్పనిక కథలు రూపు దాలుస్తాయి. తనకు తెలిసింది, తెలయనిది, జరిగింది, జరగనిది మనిషి ఎప్పుడైతే తోటివారికి ఆకట్టుకునేలా చెప్పడం ప్రారంభిస్తాడో అప్పుడే కథ పుడుతుంది” అంటూ ఆర్వీయస్ సుందరంగారు కథ పుట్టుక గురించి వివరించారు.

‘కథా ప్రక్రియ అనేది హఠాత్తు పరిణామం కాదు. దీని పుట్టుక అతి ప్రాచీనమైంది. దీని బీజం వేద సాహిత్యంలోనే కనపడుతుంది. ప్రపంచ సాహిత్య చరిత్రలోనే ఋగ్వేదం అతి ప్రాచీనమైంది. ఆ అపౌరుషేయ సాహిత్యంలో శునశ్శేపుని వృత్తాంతం, యమయమీ వివాదం, సరమా సంవాదం, ఊర్వశీ పురూరవ సంవాదం ఒక విధమై కథా బీజాలతో కూడుకుని’ ఉన్నాయనే అభిప్రాయాన్ని పోరంకి దక్షిణామూర్తి వ్యక్తీకరించారు.

## 2.5 భారతీయ లాక్షణికులు – కథా స్వరూపం

భారతీయ లాక్షణికులు అనేకులు ఈ 'కథ'ను గురించి పలు విధాల భేదాభిప్రాయాలు వ్యక్తం చేసి ఉన్నారు. ఇతర సాహిత్య ప్రక్రియల్లాగా ఈ ప్రక్రియ ముఖ్య ఉద్దేశం 'ఆనందంతో పాటు విశ్వశ్రేయస్సే' అన్నారు. దీన్ని దృష్టియందుంచుకొని జైనులు తమ ప్రాకృత కథలను 'అకథ, కథ లేక సత్కథ, వికథ' అని మూడు భాగాలు చేశారు. వీటిలో మిథ్యా దృష్టిగల అజ్ఞాని చెప్పేది 'అకథ' యని, తపో సంయమన దానశీలాది సద్గుణ వతంసులు చెప్పేది 'కథ' యని, స్త్రీబాలాదులు చెడు మార్గాన్ అవలంబించే విధానానికి అనువైన రాగద్వేషాదులతో కలుషిత వాతావరణం కలది 'వికథ' అని తెలిపారు. అంతేకాక పురుషార్థాలను బట్టి కూడా విభాగం చేశారు.

కృషి, వాణిజ్యం, ధన, సంపాదన మొదలైన ఉపాయాల్ని వర్ణిస్తూ రాయబడింది 'అర్థకథ' అని, ప్రేమకు వ్యాఖ్యానమైంది 'కామకథ' అని, ధర్మోపాఖ్యానమైంది 'ధర్మ కథ అని, ప్రేమ, ధర్మం రెండూ మిళితమైంది 'మిత్ర కథ' అని విభాగించారు. దీనితో తనివి చెందని ఉద్యోతనసూరి –'సకల కథ', 'ఖండ కథ', 'ఉల్లాస కథ', 'పరిహాస కథ', 'సంకీర్ణ కథ'– అని ఐదు భాగాలుగా విభజించాడు.

ఆనంద వర్ధనుడు అవాంతర విషయాలు లేక పద్య రహిత గద్యప్రబంధం 'కథ' యని కథాలక్షణ సమన్వితమై ఇతర గ్రంథాలను ఉదహరిస్తూ చెప్పే వచన కథాభాగం 'అఖ్యాయిక' అని వివరించాడు. అగ్ని పురాణం గద్య కావ్యాలను 'ఆఖ్యాయిక, కథ, ఖండ కథ, పరికథ, కథానిక' అని ఐదు భాగాలుగా విభాగించి అందులో 'ఆఖ్యాయిక'ను కథాభేదంగా పరిగణిస్తూ, ఏ గద్య కావ్యంలో గ్రంథకర్త వంశ వర్ణన విపులంగా కనిపిస్తుందో, కన్యాహరణ, సంగ్రామ విరహ, వివాహాది వర్ణనలతో కథ అశ్వాసాలుగా విభక్తమై, వక్త్రా పవక్త్రలతో కూడిన చూర్ణికా రూపగద్యం కనబడుతుందో అది 'ఆఖ్యాయిక' అని పేర్కొన్నది.

హేమచంద్రుడు తన కావ్యాను శాసనంలో 'ప్రేక్ష్య', 'శ్రవ్యము'లని కావ్య భేదాలను గుర్తించి 'ప్రేక్ష్యాన్ని' పాఠ్య, గేయములని రెండుగా విభజించాడు. అందులో రెండవదైన శ్రావ్యాన్ని –'ఆఖ్యాన, నిదర్శన, ప్రవల్లిక, మతల్లిక, మణికుల్య, పరికథ, ఖండ కథ, సకల కథ, ఉపకథ, బృహత్కథ' అని విభజించాడు.

'ధ్వన్యాలోకం'– వ్యాఖ్యత అభినవగుప్తుడు 'పరికథ, సకల కథ, ఖండ కథ' అని త్రివిధ కథాభేదములనే సూచించాడు. గురుబాల ప్రబోధిక అనేక కథాభేదాలను సూచిస్తూ, వాటిని ప్రధానంగా 'ఉపరి కథ, ఖండ కథ, ఉపకథ, బృహత్కథ' అని నాలుగు భాగాలుగా విభజించింది.

పై వివరణల ఆధారంగా నాయకుడు స్వయంగా తనను గూర్చి చెప్పిన వృత్తాంతం 'ఆఖ్యాయిక' అని, కేవలం కవిచే చెప్పబడిన వృత్తాంతం 'కథ' అని గ్రహింపవచ్చు.

## 2.6 కథానిక – ప్రాచీన సాహిత్యం

ప్రపంచంలోని భాషలతోపాటు, భారతీయ భాషలలో కూడా కథా వాఙ్మయానికి సుదీర్ఘ చరిత్ర ఉంది. వేద వాఙ్మయం మొదలుకొని కథాకథనం ఉన్నట్టు సాహిత్య చరిత్రకారులు చెప్తున్నారు. గుణాఢ్యుడు ప్రాకృత భాషలో రచించిన 'బృహత్కథ' భారతీయ కథా వాఙ్మయంలో తొలినాటి ప్రసిద్ధ రచన. రామాయణ, భారతాలలాగే బృహత్కథ కూడా సంస్కృత కావ్య, నాటకాలలకు వస్తువునందించింది. భాసుడి 'ప్రతిజ్ఞాయౌగంధరాయణం', 'స్వప్న వాసవదత్త' నాటకాలకు, శ్రీహర్షుడి 'రత్నావళి'కి కథామూలాలు 'బృహత్కథ'లో ఉన్నాయి. కాళిదాసు 'ప్రాప్యావన్తీ ముదయన కథాకోవిద గ్రామ వృద్ధాన్' అని అవంతీదేశంలో వృద్ధులు వాసవదత్త, వత్సరాజు ఉదయనుల కథలను చెప్పుకుంటూ ఉంటారని వర్ణిస్తాడు.

ఈ కథలు బృహత్కథలో భాగం. అద్భుతార్థాలనిచ్చే రచనగా 'బృహత్కథ'ను దండి, బాణుడు ప్రశంసిస్తారు. క్రీ.శ. ఒకటి, రెండు శతాబ్దుల మధ్య బృహత్కథా రచన జరిగిందని

పండితుల అభిప్రాయం. బుధస్వామి 'బృహత్కథా శ్లోకమంజరి' వీటిలో మొదటిది. క్షేమేంద్రుని 'బృహత్కథామంజరి' రెండవది. మూడవది సోమదేవుడి 'కథాసరిత్సాగరం'. వీటిలో 'కథాసరిత్సాగరం' ప్రసిద్ధి పొందిన రచన. దేశ, విదేశ భాషలలోకి అనేక రూపాలలో భాషాంతరీకరణం చెందింది.

శివదాసు 'వేతాలపంచవింశతి' సంస్కృతంలో ప్రసిద్ధమైన మరో కథాకావ్యం. ఇందులో బేతాళుడనే పిశాచరాజు విక్రమార్కుడికి చెప్పినట్టుగా ఇరవై అయిదు కథలున్నాయి. జంభదత్తుడనే మరో కవి కూడా 'వేతాల పంచవింశతి' రచించాడు. నందికేశ్వరుడు రచించిన 'విక్రమార్క చరితం' మరో కథాకావ్యం. దీనికే 'ద్వాత్రింశత్సాల భంజిక', 'సింహాసన ద్వాత్రింశిక' అని కూడా పేర్లు. భోజుడు తనకు లభించిన విక్రమార్కుని సింహాసనం ఎక్కేటప్పుడు ముప్పై రెండు బొమ్మలు క్రమంగా ఒక్కొక్క కథ చెప్పడం ఈ గ్రంథంలోని ప్రధానాంశం. శివదాసు రచించిన మరో కథాకావ్యం 'శాలివాహన కథ'. ప్రతిష్ఠానపురం రాజు విక్రమసేనుడికి వేతాలుడు కథలు చెప్పడంగా 'విక్రమసేన చరితమ్' అనే మరో కథాకావ్యం కనిపిస్తుంది. విక్రముడు, విక్రమార్డు, విక్రమసేనుడు మొదలైన పేర్లతో ఒకే రాజుకు సంబంధించిన కథలు వస్తువుగా సంస్కృతంలో అనేక కథా కావ్యాలు రావడం విశేషం. ఈ కావ్యాల్లో శృంగార, వీర, అద్భుతాలు ప్రధానంగా ఉంటాయి.

సంస్కృత సాహిత్యంలో రెండు రకాల కథలు కనిపిస్తాయి. వినోదాత్మకమైనవి, ఉపదేశాత్మకమైనవి. ఇంతవరకు చెప్పిన కథలన్నీ అద్భుతానుభవాలనిచ్చే వినోదాత్మక కథలు. ఉపదేశాత్మక కథలలో ఎక్కువగా పశుపక్ష్యాదులు పాత్రలుగా ఉంటాయి. పంచతంత్రం, హితోపదేశం ఈ కోవలోకి వస్తాయి. సకలార్థ శాస్త్ర సారాన్ని ఇమిడ్చి విష్ణుశర్మ అయిదు తంత్రాలుగా 'పంచతంత్రా'న్ని రచించినట్టు తెలుస్తుంది. పంచతంత్రాన్ని అనుసరించి వచ్చిన మరో నీతిగ్రంథం 'హితోపదేశం'. ఈ గ్రంథం రచయిత నారాయణ పండితుడు. హితోపదేశం పేరుతో మరో రెండు రచనలున్నాయి. నీతిని ఉపదేశించే చిత్రమైన మరో కథాకావ్యం

‘శుకసప్తతి’. వినయ కందర్పుడనే రాజు తన సేవకుడు దేవదాసును కార్యార్థం దూరం పంపించి అందగత్తె అయిన అతని భార్య ప్రభావతిని కలవడానికి రోజూ వెళ్తుంటాడు. దేవదాసు పెంచిన చిలుక రాజుకి రోజుకో కథ చొప్పున డెబ్బై రోజులు నీతి కథలు చెప్పి ప్రభావతి శీలాన్ని కాపాడుతుంది. ‘శుకసప్తతి’ దేశ, విదేశ భాషలలో కొన్ని మార్పులతో భిన్న రూపాలలో కనిపిస్తాయి.

సంస్కృతంలోని కథాకావ్యాలన్నీ, సుమారుగా తెలుగులో పద్యకావ్యాలుగా వచ్చాయి. ‘కథాసరిత్సాగరం’, ‘విక్రమార్క చరితం’, ప్రచారంలో ఉన్న కథల ఆధారంగా తెలుగులో జక్కన ‘విక్రమార్క చరిత్ర’ పద్యకావ్యంగా వచ్చింది. కొరవి గోపరాజు ‘సింహాసనద్వాత్రింశిక’ రచించాడు. మంచన ‘కేయూర బాహుచరిత్ర’కు విద్ధసాలభంజిక’ ఆధారం అయినా అది అనేక కథల సంగ్రహం. పాలవేకరి కదిరీపతి ‘శుకసప్తతి’ వచ్చింది. దాన్ననుసరించి అయ్యలరాజు నారాయణకవి ‘హంసవింశతి’ వచ్చింది. ‘శుకసప్తతి’ మరీ ముఖ్యంగా ‘హంసవింశతి’లోని కథల ముగింపు, కొసమెరుపు వంటి విషయాలలో ఆధునిక కథలలాగా అనిపిస్తాయి. అవి సాంఘిక కథలు, పందొమ్మిదవ శతాబ్దికి ముందు పద్య రూపంలో వచ్చిన ఈ కథలన్నీ మౌఖిక ప్రసారంలో కూడా ఉన్నట్టు చెప్పవచ్చు. పందొమ్మిదవ శతాబ్దిలో, ఇరవయ్యవ శతాబ్ది మొదటి రెండు మూడు దశాబ్దాలలో ఈ కథలనే పండితులు వచనంలో తిరిగి రాశారు. పంచతంత్రం, కథాసరిత్సాగరం, బేతాళ పంచవింశతి, విక్రమార్క కథలు, శుకసప్తతి కథలు, భోజకాళిదాస కథలు బెంగాలీతోపాటు భారతీయ భాషలన్నిటిలోను ఆధునిక కథానిక మొదలుకాక ముందు వచన రూపంలో వచ్చాయి. పందొమ్మిదవ శతాబ్దిలో భారతీయ భాషలన్నిటిలోను సమానంగా కనిపించే లక్షణం ఇది. వీటితోపాటు బౌద్ధ జాతక కథలు ఇతర భారతీయ భాషలతోపాటు తెలుగులో కూడా వచనంలో వచ్చాయి.

తెలుగునాట తరతరాలుగా మౌఖికంగా ప్రచారంలో ఉన్న కథలెన్నో ఉన్నాయి. కొన్ని తెలుగు భాషకి మాత్రమే ప్రత్యేకం కాగా, కొన్ని తోటి దక్షిణ ద్రావిడ భాషలలో కూడా

సమానంగా ప్రచారంలో ఉన్నాయి. ముద్రణ సౌకర్యం అందుబాటులోకి వచ్చిన తరువాత ఈ కథలను లిఖిత రూపంలోకి తీసుకొని వచ్చే ప్రయత్నాలు జరిగాయి. ఒకే కథ వేరు వేరు పండితుల చేతిలో వివిధ శైలులలో, భిన్న కథ క్రమాలలో లిఖిత రూపంలో వచ్చింది. కవి జీవిత చరిత్రకారుడు గురజాడ శ్రీరామమూర్తి మొదలుకొని రావిపాటి గురుమూర్తి శాస్త్రి, కొమాండూరి అనంతాచార్యులు, తడకమళ్ల వెంకటకృష్ణారావు, టేకుమళ్ల రాజగోపాలరావు, మంత్రిప్రగడ భుజంగరావు, చదలువాడ సీతారామశాస్త్రి మొదలైన వాళ్లు ప్రచారంలో ఉన్న కథల్ని లేఖనంలోకి తీసుకొని వచ్చారు. పండితులుగా ప్రసిద్ధులైన వాళ్లు గ్రాంథికంలో కథలు రాశారు. కొందరు సాధారణంగా అందరూ మాట్లాడుకునే వాడుకభాషలో రాశారు. అద్భుతం, హాస్యం, చమత్కారం, శృంగారం, నీతి మొదలైన అంశాలతో పాఠకులను అలరిస్తాయి ఈ కథలు. సంస్కృతం నుంచి సంక్రమించిన కథలకు కూడా ఈ అంశాలు అన్వయిస్తాయి.

తెలుగులో కట్టు కథల రూపంలో ప్రచారంలో ఉన్న కథలు చాలా ఉన్నాయి. వాటిలో ప్రసిద్ధమైనది తెనాలి రామకృష్ణుడు లేక తెనాలి రామలింగడి కథలు. చరిత్రతో సంబంధం ఉన్న వ్యక్తి రామకృష్ణుడి చుట్టూ చారిత్రకం కాని ఘట్టాలు, కథనాలు తరాలుగా ప్రచారంలో ఉన్నాయి. తెలుగువాళ్లలో ప్రచారంలో ఉన్న మరో కథ 'పరమానందయ్య శిష్యుల కథ'. ఈ కథని కూడా చాలామంది వివిధ రూపాలలో రాశారు.

మదన కామరాజు కథలు, మర్యాద రామన్న కథలు, కాశీమజిలి కథలు, కాంభోజరాజు కథలు, పలుగని పద్మాక్షి కథలు, సహస్ర శిరచ్ఛేద అపూర్వ చింతామణి కథలు, రేచుక్క పగటిచుక్క కథలు వివిధ లేఖకుల కలాల నుంచి వివిధ రూపాలలో వచ్చాయి. శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి తనకు కథారచనలో ఆసక్తి కలగడానికి కారణం ఒక వృద్ధ వితంతువుకి 'మదనకామరాజు కథలు' చదివి వినిపించమని చెప్పుకుంటాడు. ఆయనే సామాన్య వచనంలో 'మర్యాద రామన్న కథలు' రాశాడు. చారిత్రక ఇతివృత్తాలు కూడా కథలుగా వచ్చాయి. ఇంగ్లీషులో తాను చదివిన చారిత్రక కథలను 'రాజస్థాన కథావళి' పేర చిలకమర్తి

లక్ష్మీనరసింహం రాశాడు. శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి రచనలలో విజయనగర రాజుల కథలు, ఓరిగంటి రాజుల కథలు, గోల్కొండ నవాబుల కథలు, చిత్తూరు రాజుల కథలు, ఢిల్లీ రాజుల కథలు మొదలైన చరిత్రకు సంబంధించిన కథలున్నాయి. ప్రసిద్ధ నాటకాల కథలు, షేక్స్‌పియర్ నాటక కథలు, కాళిదాసు నాటక కథామంజరి వంటివి వచ్చాయి. విచిత్ర కథలు, వినోద కథలు, హాస్య కథలుగా అనేక కథలు కూడా ప్రచురితం అయ్యాయి.

ప్రపంచ సాహిత్యాలలో, ముఖ్యంగా ఆసియా ఖండ భాషలలో కథా సాహిత్యానికి సంబంధించి ఆదాన ప్రదానాలకు రెండు సహస్రాబ్దాల చరిత్ర ఉంది. బృహత్కథ మీద ఆధారపడ్డ కథలతోపాటు పంచతంత్ర కథలు, బౌద్ధ జాతక కథలు ప్రపంచ భాషలలోకి వెళ్లాయి. పంచతంత్ర కథలు, పర్షియన్, అరబిక్ భాషలలోకి వెళ్లి అక్కడి నుంచి గ్రీక్, లాటిన్, జర్మన్, ఫ్రెంచ్, స్పానిష్ మొదలైన భాషలలోకి ప్రవేశించాయని తెలుస్తుంది. జాతక కథలు చీనీ భాషతోపాటు బౌద్ధం వ్యాపించిన దేశాంతర భాషలన్నిటిలోకి వెళ్ళింది.

అరేబియన్ నైట్స్ కథలు, చార్ దర్వేషు కథలు ఇతర దేశభాషల నుంచి భారతీయ భాషలలోకి ప్రవేశించాయి. పాశ్చాత్య ప్రపంచంతో సంబంధం ఏర్పాడ్డాక గ్రీక్ పురాణ గాథలు, గ్రీక్ భాషలోనే ప్రసిద్ధమైన ఈసపు కథల లాంటివి వెలుగులోకి వచ్చాయి. అరేబియన్ నైట్స్ కథల్ని చాలామంది తెలుగులో రాశారు. ఆంధ్ర వాఙ్మయ చరిత్రకారుడు వంగూరు సుబ్బారావు కూడా అరేబియన్ నైట్స్ కథలు రాశాడు. పర్షియన్ భాషలో అమీర్‌ఖుస్రూ రాసిన నలుగురు ఫకీరుల కథను ఎర్రమిల్లి మల్లికార్జునుడు 'చార్ దర్వేషు కథలు' పేరిట తెలుగులో రాశాడు. పర్సో—అరబిక్, ఇంగ్లీషు పదాలు కలిసిన వాడుక తెలుగులో ఈ రచన జరిగింది.

'శుకసప్తతి' కథలు పర్షియన్, అరబిక్ భాషలలోకి వెళ్లి, మళ్ళీ భారతీయ భాషల్లోకి వచ్చి ఉండవచ్చని బిరుదురాజు రామరాజుగారు ఊహిస్తున్నారు. అవి చిలుక చెప్పిన కథలు, కీరబహత్తరి కథలు, తోతీ నామా కథల పేరిట ఉన్నట్లు ఆయనే ఉటంకించారు. చిలుక చెప్పిన

కథల్ని 'చిలుక చెప్పింది' పేరుతో బులుసు వెంకటరమణయ్య పరిష్కరించగా, గిడుగు సీతాపతి ఉపోద్ఘాతంతో 1955లో ప్రచురితం అయినట్టుగా కూడా చెప్తున్నారు. పర్షియన్ కదీర్‌భక్ష్ రాసిన 'తూతా నామాహ్'కి అనువాదం ఇది. కలకత్తా ఫోర్ట్ విలియం కాలేజీలో ఉపాధ్యాయుడుగా పనిచేసిన చండీచరణ్ ముష్షీ ఈ కథలను 1805 'తోతా ఇతిహాస్' పేరిట బెంగాలీలో రాశాడు. ఇతర భారతీయ భాషలలో కూడా ఈ కథలు వచ్చాయి.

## 2.7 ఆధునిక కథా సాహిత్యం – పరిణామక్రమం

గురజాడ కంటే పదేళ్ళ ముందే బండారు అచ్చమాంబ 'ధనత్రయోదశి' పేరుతో ఆమె దాంపత్య లాలిత్యాన్ని గూర్చి 'హిందూ సుందరి' పత్రికలో 1901–02 ప్రాంతాల్లో కథ రాశారు. 1903లో 'కల్పలత' పత్రికలో 'అపూర్వోపన్యాసం' కథను ఆచంట సాంఖ్యాయనశర్మ రాశారు. 1905లో వెదురుమూడి శేషగిరిరావు 'మద్రాసు కథలు' రాశారు. తణుకు నుంచి వెలువడిన 'సువర్ణరేఖ' పత్రికలో ఇవి ప్రచురితమైనాయి. దీనిని బట్టి ఆధునిక కథా సాహిత్యం 1901లోనే ప్రారంభమైనట్లు చెప్పుకోవచ్చు. ఆధునిక తొలి కథానికగా బండారు అచ్చమాంబ రచించిన 'ధనత్రయోదశి' కథను విమర్శకులు కూడా గుర్తిస్తున్నారు.

ఆ తరువాత 1910లో గురజాడ అప్పారావు రచించిన 'దిద్దుబాటు' కథ ఆంధ్రభారతి పత్రికలో ప్రచురింపబడింది. అప్పటి నుంచి నేటి దాకా తెలుగు కథా ప్రపంచం విస్తరిస్తోంది. వేశ్యాలోలత్వంలో పడిన భర్తని ఎలా దిద్దుకోవాలో భార్య 'కమలిని' పాత్ర ద్వారా గురజాడ నేర్పుగా చూపించారు. భర్త మనసులోని మంచిచెడ్డల సంఘర్షణని చిత్రీకరించారు. గురజాడ 'మీ పేరేమిటి?', 'మతము–విమతము', 'మెటిల్డా', 'పెద్దమసీదు', 'సంస్కర్త హృదయం' అనే కథలు కూడా రాశారు. గురజాడ "Stooping to Raise" అనే ఇంగ్లీషు కథని అవసరాల సూర్యారావు 'సంస్కర్త హృదయం'గా అనువదించారు. శైవ వైష్ణవ భేదాలు, ఆధిక్యాల కోసం

జరిగే పోరాటం చిత్రిస్తూ, మత మౌఢ్యాన్ని వివరించే కథ 'మీ పేరేమిటి?' దేవుడు చేసిన మనుషుల్నీ, మనుషులు చేసిన దేవుళ్లనీ 'మీ పేరేమిటి?' అని అస్తిత్వాన్ని ప్రశ్నించే కథ ఇది.

గురజాడ తర్వాత కందుకూరి, చిలకమర్తి, రాయసం వెంకటశివుడు, పానుగంటి మొదలైనవాళ్లు కథలు రాశారు. చింతా దీక్షితులు రాసిన కథల్లో వైవిధ్యం ఉంది. 'దాసరి పాట', 'కిష్కింధలో కోతి', 'అభిప్రాయ భేదం', 'పెద్ద మేడ', 'గోదావరి నవ్వింది', 'చెంచురాణి', 'మొదటి బహుమానం' మొదలైన కథలు రాసి మంచి కథకుడనదగినవారు చింతా దీక్షితులు. మొట్టమొదటగా గిరిజనుల గురించి, సంచార జీవనుల్ని గురించి కథ రాసిన వారుగా వీరిని పేర్కొనాలి.

తెలుగు కథకుల్లో విశిష్టులు శ్రీపద సుబ్రహ్మణ్యశాస్త్రి (1891). తెలుగు వారి జీవితాల్ని, వాడుక భాషలో, తమదైన శైలిలో రాసిన కథకు చక్రవర్తి శ్రీపాద వల్లంపాటి దృష్టిలో "శ్రీపాద – వీరేశలింగం నుంచి వస్తువునూ, గురజాడ నుంచి ప్రక్రియనూ గ్రహించాడు. అచ్చమైన తెలుగు కథా రచయిత".

శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి అనగానే 'కలుపు మొక్కలు' కథ గుర్తుకు వస్తుంది. బాధ్యతలు గలవాళ్లు అవినీతిపరులై, లంచగొండులై సంఘానికి 'కలుపు మొక్కలు' అయ్యారని ఈ కథలో వివరించారు. మొదట ఈ కథ 'ప్రబుద్ధాంధ్ర'లో 'తెనుగు రక్తం చప్పబడిపోతూ ఉంది' అనే పేరుతో ప్రచురింపబడింది. దీన్నిబట్టి శ్రీపాద వారి ఆవేదన అవగాహనకి వస్తుంది. 'గులాబీ అత్తరు', 'వడ్ల గింజలు', 'శుభికేశిర ఆరోహ', 'అన్నంతపనీ జరిగింది', 'విమానం ఎక్కబోతూనూ', 'తాపీ మేస్త్రీ', 'రావు దీక్షితులు బి.ఏ.', 'మార్గదర్శి', 'కన్యాకాలే యత్నాద్వరితా' మొదలైన కథల శీర్షికలు కూడా ప్రత్యేకత గలవి. కొన్ని కథలు 'నవలిక' వంటివైనా చిన్న కథలనే పిలిచారు. కథా వస్తువులో నిత్య నూతనమైన కథగా 'ఇలాంటి తవ్వాయి వస్తే'ని పేర్కొనాలి. ఈ కథా 1931లో రాసిన 'సాగరసంగం' కథ – రెండింటినీ

దళిత కథలుగా గుర్తించాలి. అంటరానితనం పట్ల సవర్ణ హిందువుల్లో గల ఆత్మవంచనని బట్టబయలు చేసిన కథ 'ఇలాంటి తవ్వాయి వస్తే'. శ్రీపాద వారి తర్వాత వేలూరి శివరామశాస్త్రిని పేర్కొనాలి. శరత్‌బాబు రచనల్ని ముందుగా తెలుగులో అనువదించింది వేలూరు వారే. శివరామశాస్త్రి కథా రచన నైపుణ్యం తెలిపే కథ 'డిప్రెషన్ చెంబు'. కాంచనపల్లి కనకాంబ కూడా కొన్ని మంచి కథలు రాశారు. 'బారిష్టరు పార్వతీశం' ద్వారా పేరుపొంది మొక్కపాటి నరసింహశాస్త్రి కథల్లో హాస్యమూ – శిల్పమూ పెనవేసుకొంటాయి. పిలక, లక్ష్మి, చిత్రం, భిక్షువు మొదలైనవి మొక్కపాటి వారి కథలు.

కవిగా, విమర్శకుడిగా, నవలా రచయితగా ప్రసిద్ధి చెందిన విశ్వనాథ సత్యనారాయణ తక్కువ కథలు రాసినా ఆలోచన కలిగించే కథలు రాశారు. 'నీ ఋణం తీర్చుకున్నా', 'య్యార్విషిశెయ్', 'ఏమి సంబంధం', 'మాక్లీదుర్గంలో కుక్క' అనే కథలు విశ్వనాథ వారిని కథకుడిగా నిలుపుతాయి. చలం దాదాపు వంద కథలు రాశారు. 'ఆ రాత్రి', 'పాపఫలాలు', 'జలసీ', 'ఆమె పెదవులు', 'ఆమె త్యాగం', 'ఓ పువ్వు పూసింది', 'కర్మమిట్లా కాలింది', 'నేనం చేశాను', 'వివాహం', 'దోషగుణం' మొదలైన కథలు చలాన్ని గొప్ప కథకుడిగా నిరూపిస్తాయి. మన సమాజంలో నీతి పేరుతో, పాతివ్రత్యం – దాంపత్య ధర్మం ముసుగుల్లోని అణచివేతనూ, ఆత్మవంచననూ చలం తన రచనల్లో తీవ్రంగా దుయ్యబట్టాడు. స్త్రీ పురుష సంబంధాల మూలాల్లోకి వెళ్లి – అడ్డుగోడల్ని ఛేదించే ప్రయత్నం చేశాడు. భాష ప్రయోగంలో, అభిప్రాయ ప్రకటనలో, పాత్రల మనస్తత్వ చిత్రీకరణంలో ఉన్నది ఉన్నట్టుగా సహజత్వాన్ని ప్రకటించిన ఆధునికుడు చలం.

తెలుగు కథా రచనలో సిద్ధహస్తుడు అడివి బాపిరాజు. 'అంజలి', 'తరంగిణి', 'తూలికా నృత్యం', 'భోగీరలోయ', 'రాగమాలిక', 'వింధ్యాచలం' అనే కథా సంపుటాలు వెలువడ్డాయి. బాపిరాజు కథలు మొత్తం నలభై నాలుగు రాశారు. బాపిరాజు కథల్ని కాల్పనిక కథలు, వాస్తవిక కథలు, బాల వాఙ్మయ కథలు, చారిత్రక కథలు అని విభజించవచ్చు. 'శైలిబాల',

'భోగీరలోయ', 'తూలికా నృత్యం', 'ద్వేషం', 'బండరాళ్లు', 'వీణ' కథలు పేర్కొనదగినవి. 'మెట్లు', 'నరసన్న పాపాయి' అనే దళిత కథలు, 'గుడ్డిపిల్ల', 'కన్నీరు' అనే అభ్యుదయ కథలు రాసి సమకాలీన జీవిత వాస్తవాలను కూడా చిత్రీకరించారు.

సురవరం ప్రతాపరెడ్డిగారు 'నిరీక్షణ', 'మొగలాయి కథలు', 'చంద్రయ్య భీమా', 'పెండ్లి బేరము', 'వింత విడాకులు' అనే విశిష్ట కథలు రాశారు. నిశితమైన పరిశీలనతో విలక్షణమైన 'ఒట్టు', 'మా వూరు' అనే కథలు రచించినవారు కనుపర్తి వరలక్ష్మమ్మ. శ్రీనివాస శిరోమణి కూడా మంచి కథలు రాశారు. భమిడిపాటి కామేశ్వరరావు తమదైన రీతిలో 'దానికేమందు', 'మాటలేనా', 'మడత పేచీ', 'గుసగుస పెళ్లి' మొదలైన హాస్య, అధిక్షేప కథలు రచించారు.

మధ్యతరగతి జీవితాల్లోని అనుభవాలు హాస్యంగా మలిచి, దాంపత్య జీవితంలోని అందచందాల్ని ప్రదర్శించిన విశిష్ట కథా రచయిత మునిమాణిక్యం నరసింహారావు. జీవితం ఆనందదాయకంగా ఉండటానికి కాస్త ఓర్పు, నేర్పు, సెన్సాఫ్ హ్యూమరూ ఉండాలని కాంతం మనకు సందేశమిస్తుంది. 'శరద్రాత్రులు', 'కాంతం కథలు', 'నేనూ – మా కాంతం' అనే కథా సంపుటాలు వెలువడ్డాయి.

'సాహిత్యకారుడిగా జీవితం నాకు ప్రమాణం. సిద్ధాంతం కోసం జీవితాన్ని వక్రంగా చిత్రిస్తే, ఆ రచన ఉత్తమ రచన ఎట్లా అనిపించుకుంటుందో నాకు ఏనాడూ అర్థం కాలేదు' అని పలికిన కొడవటిగంటి కుటుంబరావు తెలుగు కథను మరొక మలుపు తిప్పిన విశిష్ట కథకులు. వీరి తొలి కథ 'ప్రాణాధికం' 1931లో 'గృహలక్ష్మి' పత్రికలో ప్రచురింపబడింది. 1941లో 'నీకేం కావాలి?' అనే తొలి పెద్ద కథ రచించారు. కారుణ్యం, స్వగతం, ఇల్లరికం, నీకేం కావాలి, కాలభైరవుడు, వరప్రసాదం, నిలవ నీరు, మొండివాడు, తల్లి లేని పిల్ల మొదలైన కథాసంపుటాలు వెలువడ్డాయి. సారళ్యం, సూటిదనం, సహజత్వం కొ.కు. కథల్లో ప్రధానం. సూటిగా పాఠకుడి హృదయాన్ని తాకేలా రచించటమే ఆయన శిల్పం.

మానవతావాది, తత్త్వవేత్త, తెలుగులోని గొప్ప కథకుల్లో ఒకరు త్రిపురనేని గోపీచంద్. త్రిపురనేని రామస్వామి చౌదరి కుమారుడైన గోపీచంద్ 'భార్యల్లోనే వుంది', 'దేశం ఏమయ్యేట్టు', 'గీతాపారాయణం', 'తండ్రులూ – కొడుకులూ', 'సరేకానివ్వండి', 'దేవుని జీవితం' అనే కథాసంపుటాలు వెలువడ్డాయి. ఈయన కథల్లో 'ధర్మవడ్డీ'కి చాలా పేరు వచ్చింది. వడ్డీ వ్యాపారం చేసి మూటగట్టిన ఒక షావుకారు చివరికి ఉన్మాద స్థితికి రావడానికి పరిస్థితులు ఎలా దారితీశాయో బాగా వివరించారు. 'ఫాంటసీ'గా రాసిన కథ 'వెంకటచలం పాత్ర'. ఒక విద్యార్థి కమ్యూనిజం వైపు ఆకర్షింపబడటాన్ని 'పీడిత హృదయం' కథలో వివరించాడు. ఒక రైతుకు భూమి పట్ల వుండే మమకారాన్ని బహు సున్నితంగా చెప్పిన కథ 'మమకారం'.

పాలగుమ్మి పద్మరాజు అనగానే 'గాలివాన' కథ గుర్తుకు వస్తుంది. 1952 ప్రాంతంలో 'న్యూయార్క్ హెరాల్డు ట్రిబ్యూన్' పత్రిక నిర్వహించిన అంతర్జాతీయ కథానికల పోటీలో 'గాలివాన'కు ద్వితీయ బహుమతి లభించింది. ఈ విధంగా తెలుగు కథకి అంతర్జాతీయంగా గుర్తింపు లభించింది ఒక గాలివాన వల్ల ఒక స్టేషన్లో రైలాగిపోతుంది. అందులో ప్రయాణం చేస్తున్న ఒక వ్యక్తి – ఉన్నతుడు పవిత్రుడు – ఒక ముష్టి అమ్మాయి సాంగత్యం పొందిన సందర్భాన్ని వివరించే కథ 'గాలివాన'. వేశ్యల మంచితనాన్ని ఈ ప్రతిపాదన నేపథ్యంగా చిత్రీకరించిన మరో కథ 'పరిహారం'.

శ్రీమతి ఇల్లిందల సరస్వతీదేవి మరొక ప్రత్యేక కథా రచయిత్రి. 'బలీయసీ కేవల యిశ్వరాజ్ఞా', 'ముత్యాల మనసు', 'పండుగ బహుమానం' మొదలైనవి ఈమె రాసిన కథలు. ఈ కథలన్నీ సంపుటిగా వెలువడ్డాయి. 'జైలు లోపల' కథా సంపుటి ప్రచురించి బరువు గుండెల బాధల్ని కళ్లకి కట్టించిన విశిష్ట కథకులు వట్టికోట ఆళ్వారుస్వామి. కప్పగంతుల సత్యనారాయణ, ప్రయాగ కోదండరామశాస్త్రి, బెల్లంకొండ చంద్రమౌళిశాస్త్రి, శర్వాణి

మొదలైనవారు ఇతర భాషల్లోని కథల్ని ఆంధ్రీకరించారు. పన్యాల రంగనాథరావు, జమదగ్ని మొదలైనవారు కూడా కథలు రచించారు.

తెలుగు కథా రచనలో చాసో బాణీ విశిష్టమైంది. తెలుగులో చాసో 'చెఖోవ్ వంటి కథాశిల్పి' అంటారు. వాయులీనం, ఎంపు, పరబ్రహ్మం, దుమ్ములగొండె, కుక్కుటేశ్వరము, బండపాటు, కుంకుడాకు, భల్లూకస్వప్నం, బుగ్గిబూడిదమ్మ కథ, చిన్నాజీ అనేవి చాసో రాసిన నలభై మంచి కథలు వాయులీనం కథ మధ్యతరగతి తెలుగు కుటుంబాల్లో క్షీణించిపోతున్న సంప్రదాయబద్ధమైన సంగీతాభిరుచికి దర్పణం. ఫిడేలుతో అనుబంధం తల్లితో వుండే అనుబంధంగా మారటం ఈ కథలోని ప్రత్యేకత. సామాజిక సమస్యలే ప్రాణంగా, రాజకీయ సాంస్కృతిక అవగాహనతో, అన్ని వర్గాల వారి చైతన్యం కోరుతూ, అనితర సాధ్యమైన శిల్పంతో కథలు రాసిన గొప్ప కథకుడు రావిశాస్త్రి. కలకంఠి, బుక్కులు, ఆరుసారో కథలు, ఆరుచిత్రాలు, ఆరు సారా కథలు, బాకీ కథలు అనే కథా సంపుటాలు వెలువడ్డాయి.

కాళీపట్నం రామారావు –'కారా మాష్టారు'గా అందరికీ సుపరిచితులు. సొంత ముద్రగల కథకుల్లో ప్రముఖులు. కథారచన ప్రారంభించిన తొలి రోజుల్లో 'రాగమయి' వంటి కథలు కొన్ని రాసినా, పతితులూ, బాధాసర్ప దుష్టులూ రచనకు ఇతివృత్తం కావాలని నమ్మిన తర్వాత ఈయన గొప్ప కథలు రాశారు. కథనంలో వివరణల గురించి ఎక్కువ శ్రద్ధ చూపించడం వల్ల ఇవి 'చిన్న కథలు'గా ఉండక, పెద్దవిగా ఉంటాయి. 'కాళీపట్నం రామారావు కథలు', 'యజ్ఞం', 'యజ్ఞంతో తొమ్మిది', 'జీవధార', 'భయం', 'చావు', 'నో రూమ్' మరీ గొప్ప కథలు. కా.రా. కథలనగానే అందరికీ గుర్తొచ్చే కథ 'యజ్ఞం'. 'యజ్ఞం' కథ మీద విశేషమైన చర్చలు జరిగాయి. 'కథా యజ్ఞం' అనే పుస్తకం వచ్చింది.

చిత్తూరు జిల్లా మొగరాలలో జన్మించిన మధురాంతకం రాజారాం ఉపాధ్యాయులుగా పనిచేసి 'దామల్‌చెరువు'లో స్థిరపడ్డారు. 'కమ్మతెమ్మెర', 'వక్రగతులు – ఇతర కథలు', 'రేపటి

ప్రపంచం', 'త్రిశంకుడి స్వర్గం', 'జీవితానికి నిర్వచనం', 'కూనలమ్మ కోన', 'తాను వెలిగించిన దీపాలు' అనే సంపుటాలు వెలువడ్డాయి. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ బహుమతి, తమిళ విశ్వవిద్యాలయ పురస్కారం లభించాయి. నేషనల్ బుక్ ట్రస్ట్‌వారి 'కథాభారతి' సంపాదకులు వెలిబుచ్చిన ఈ అభిప్రాయాలు గమనించదగినవి. 'రాజారాం కథలు అచ్చంగా తెలుగు కథలు. చిత్తూరు జిల్లా గ్రామీణ శోభ ఆయన కథల్లో ఘుమఘుమలాడుతూ ఉంటుంది. మధురాంతకం రాజారాం కథలు పెద్ద మనిషి తరహాగా కుదురుగా కమ్మగా ఉంటాయి. సాహిత్యం వలన పరితకు మంచి జరగాలి రాజారాం విశ్వసిస్తారు. తీవ్రమైన రాజకీయాలు, సిద్ధాంతాల జోలికి వీరు పోరు. రచయితకు వర్ణనాసక్తి ఎక్కువ'.

'అతి చిన్న ఉదంతంతో గుండెను పట్టి ఊపగల కథలు ఎలా రాయాలో తెలియాలంటే ఆయన కథలు చదవాలి. వీరి కథలు భావాల బరువులో క్రుంగిపోవు. దూదిపింజల్లా ఆకాశంలోనూ విహరించవు. ఆడంబరమైన ధోరణిలో మేధా ప్రదర్శన కూడా కనబడదు. అతి నిరాడంబరమైన శైలిలో మానవ జీవితంలోని వైవిధ్యాన్ని, విషాదాన్ని, అందునా ప్రత్యేకించి మధ్యతరగతి మానవుల ఆశలను, స్వార్థాలను కుహనా విలువలను, వెర్రిబాగులతానాన్నీ అన్నింటినీ గుదిగుచ్చి మనకు కథలుగా అందిస్తారు' అన్నారు కోడూరి శ్రీరామమూర్తి. 'నేను రాయలసీమకు చెందిన ఒక గ్రామీణ రచయితను. అక్కడి ఊళ్లు, ప్రజలు, వాళ్ల ఈతిబాధలు, రాగద్వేషాలు కథల ద్వారా వ్యక్తం చేస్తూ వచ్చాను' అని రాజారాం చెప్పినా ఆయన కథలు కేవలం ఒక ప్రాంతానికి పరిమితమైనవి కావు.

మనిషికీ మనిషికీ మధ్య పెరిగిపోతున్న అడ్డుగోడల్ని నిరసించి మంచితనం కోసం వెంపరలాడే ఉత్తమ కథకులు రాజారాం. ఆదర్శోన్ముఖమైన యదార్థ దృక్పథంతో కథలు రాస్తున్న రాజారాం కథల్లో శుద్ధమైన దేశీయతా ముద్ర కనిపిస్తుందన్న డి. రామలింగం మాటలు నిజాలే. కుంపట్లో కుసుమం – కాటుక కంటి నీరు – తాను వెలిగించిన దీపాలు – సర్కసు డేరా – వగపేటికి చల్లచిందినన్ – నోరు లేని జీవుడు – పిచ్చి వెంకట్రావు – కమ్మ

తెమ్మెర –ఇక్కడ మేమంతా క్షేమం – చరమాంకం – తలుపులూ తాళాలూ –గ్రూప్ ఫోటో – అజ్ఞాతవాసం మొదలైన కథలెన్నో రాసిన రాజారాం సత్కథా హాలికుడు. వాకాటి పాండురంగారావు అన్నట్టు మనిషి మనిషిగా బ్రతకాలని బోధించే ఉత్తమ కథకుడాయన.

బలివాడ కాంతారావు నౌకాదళంలో అధికార పదవులు చేపట్టి దేశంలోని వివిధ ప్రాంతాలు చుట్టి, ఎన్నో అనుభవాల్ని, అనుభూతుల్ని పట్టి – తమ కథల్లో, నవలల్లో చూపించారు. 'బలివాడ కాంతారావు కథలు' అనే రెండు సంపుటాలు వెలువడి 'ఇంటి కోసం', 'దొంగలు', 'మనిషి–పశువు', 'మునిగిన కథ', 'ఖేడాఘాట్ మొసలి', 'దారితప్పిన మనిషి', 'అదృష్ట చిహ్నం' మొదలైన కథల్లో ఆదర్శవాదం, తాత్త్విక చింతన కనిపిస్తుంది. మానవత్వపు విలువలను కాపాడాలన్న ఆదర్శమే కథకుడ్ని చేసిందనిపిస్తుంది.

దేవరకొండ బాలగంగాధర తిలక్ కవి మాత్రమే కాదు – కథకులు కూడా. 'కథానికా రచనలో ఉత్తమ పాశ్చాత్య రచయితలు శిల్పరీత్యా సాధించిన పరిణతి తిలక్ రాసిన కథల్లో ద్యోతకమవుతుంది. సుందరీ సుబ్బారావు, ఊరి చివర ఇల్లు అనే సంపుటాలు పూర్వం వెలువడ్డాయి. తర్వాత 'తిలక్ కథలు' అనే పెద్ద సంపుటి వెలువడింది. 'ఆశాకిరణం', 'లిబియా యెడారిలో', 'అద్దంలో జిన్నా', 'ఫలిత కేశం', 'బొమ్మ కథలు' మంచి కథారచయితగా పేర్కొంటాయి.

కె. సభా, రావూరి భరద్వాజ, హితశ్రీ, అవసరాల రామకృష్ణారావు, తాళ్ళూరు నాగేశ్వరరావు, వీరాజీ, మంజుశ్రీ, శీలా వీర్రాజు, భమిడిపాటి రామగోపాలం, సి.యన్.రావు, ఆర్.ఎస్. సుదర్శనం, కొమ్మూరి వేణుగోపాలరావు, గొల్లపూడి మారుతీరావు, ఆదివిష్ణు, పూసపాటి కృష్ణంరాజు. సి. రామచంద్రరావు, పోలాప్రగడ, డి. వెంకట్రామయ్య మొదలైన వాళ్లు ఎన్నో మంచి కథలు రాశారు. మనుషుల స్వభావాల మీద దెబ్బ తీసే కథలు రాసిన మరొక మంచి కథకుడు ఎన్.ఎస్. ప్రకాశరావు, దేవుడు చేసిన మేలు, పేపర్ టైగర్ అనే కథలు

బాగా ప్రసిద్ధికెక్కాయి. సాధారణ జీవితంలో దాగి వున్న అసాధారణ సంఘటనల్ని నిశితంగా అన్వేషించి సహజకథలు రాసే ప్రతిభావంతులు పెద్దిభొట్ల సుబ్బరామయ్య. కళ్లజోడు, నీళ్లు, నిప్పు, ముసురు, మూగపిల్ల, చిలకహంస, చిన్నమ్మ నవ్వింది, 'తన జీవితం వైపు', 'అంగారతల్పం' వంటి గొప్ప కథలు రాసిన పెద్దిభొట్ల 'వాస్తవశిల్పి' అనదగిన కథకుడు. కె.వి.ఎస్. వర్మ, ఇచ్ఛాపురపు జగన్నాథరావు, దాట్ల నారాయణమూర్తిరాజు, పులికంటి కృష్ణారెడ్డి, ద్విభాష్యం రాజేశ్వరరావు, కవన శర్మ, మునిపల్లె రాజు, కలువకొలను సదానంద, త్రిపుర గంధం యాజ్ఞవలశర్మ, వై. రాంబాబు, శాయి, విహారి, కె. సదాశివరావు వంటి మంచి కథకులు చాలామంది ఉన్నారు.

కథారచనలో మరొక చేయి తిరిగిన కథకుడిగా కొలకలూరి ఇనాక్‌ని పేర్కొనాలి. అట్టడుగు వర్గాల దళితుల ఇతివృత్తాలుగా ఎక్కువ కథలు రాసారు. 'తలలేనోడు' అనే దళిత కథను ఎప్పుడో రాసి సంచలనం కలిగించారు. బోయ జంగయ్య రచించిన 'ఎచ్చరిక', 'దున్న' సంపుటాలు పేర్కొనదగినవి. సింగమనేని నారాయణ 'జూదం' కథల సంపుటితో పేరు పొంది ఇటీవల 'సీమ కథలు' సంపాదకత్వం వహించి ప్రచురించారు. బొమ్మిరెడ్డిపల్లి సూర్యారావు, వి. రాజారామమోహనరావు, స్మైల్, ఎ.వి.రెడ్డి శాస్త్రి, శ్రీపతి పేర్కొనదగిన మరికొంతమంది మంచి కథకులు. 'తెలుగు కథకి అచ్చమైన తెలుగుదనాన్ని, చిన్న కథకు కావలసిన వేగాన్ని, క్లుప్తతనీ సాధించిన రచయిత'గా సత్యం శంకరమంచిని పేర్కొనటం స్వభావోక్తి అవుతుంది. 'కార్తీక దీపాలు' కథాసంపుటి కన్న 'అమరావతి కథలు' ఈయనకు ప్రఖ్యాతిని తెచ్చి పెట్టాయి. ఈ కథల్లో తెలుగువారి ఆవేశాలూ, భక్తిరక్తి వైరాగ్యాలూ, కలతలు, ప్రవృత్తులూ మల్లాది రామకృష్ణశాస్త్రిలా చిత్రీకరించి 'గొప్ప కథలు' అందించారు సత్యం శంకరమంచి.

ఎనభై తరువాత తెలుగు సాహిత్యం స్పష్టంగా మలుపు తీసుకుందన్నది అందరూ అంగీకరించిన సత్యం. ఆలోచనల్లో, ఆచరణల్లో వికేంద్రీకరణ, బహుళతావాదం, పర్సనల్ ఎథిక్స్ ప్రధాన లక్షణాలుగా ఉండే దృక్పథాన్ని పోస్ట్ మోడ్రన్ దృక్పథంగా భావించినట్టయితే

తెలుగు కథలో అది అరవైల్లోనే ప్రారంభమైందనాలి. కానీ డెబ్బైల్లో విప్లవ సాహిత్య సిద్ధాంతాలు అటువంటి ప్రజాస్వామిక వాదం స్థానంలో ఒక కేంద్రీకృత నిర్దేశాత్మక అధికారిక చట్రాన్ని ప్రతిష్ఠించే ప్రయత్నం చేశాయి. ఇటువంటి చట్రాల్లో సృజనాత్మక రచయితలు సహజంగానే ఇమడలేరు. కాబట్టి ఈ చట్రాన్ని దాటిన ఒక బయటి స్థలం గురించి తహతహగా ఎనభైల్లో యువతరం ఆతృత పడింది.

ఎనభైల్లో మహేంద్ర, దాదాహయాత్, వాడ్రేవు వీరలక్ష్మీదేవి, పి. సత్యవతి, డా॥ కేశవరెడ్డి, నామిని సుబ్రహ్మణ్యం నాయుడు, స్వామి, సింగమనేని నారాయణ, అల్లం రాజయ్య, బోయ జంగయ్య, పాపినేని శివశంకర్, కె.ఎన్.వై. పతంజలి, ఓల్గా, సి. సుజాత వంటి కథారచయితలు ఒక్కసారిగా వెలుగులోకి వచ్చారు. ఈ కథా రచయితలు తమ తమ ధోరణిలో చెప్పిన కథల సారాంశం ఒక్కటే. అదేమంటే జీవిత సత్యాన్ని తెలుసుకోవడానికి ఎవరి అనుభవం వారికి ప్రాతిపదిక కావాల్సిందన్నదే.

శిల్పరీత్యా అత్యున్నత పరిణతి సాధించిన ఎన్నో కథలు ఎనభైల్లోతమ స్వల్ప జీవితానుభవం నుంచే రాయడం మనని ఆశ్చర్యపరుస్తుంది. కానీ ఈ పరిణతి తెలుగు కథ సాధించిన పరిణతిగా మనం గుర్తించాల్సి ఉంటుంది. ఎనభైల ప్రధాన విశేషం రాయలసీమ, తెలంగాణలు కథలోకి మేల్కొన్న ఒక విస్ఫోటం. రాయలసీమ రచయితల్లో ఎనభైలకు పూర్వం కూడా విశిష్టమయిన కథలు రాసినవారున్నారు. మధురాంతకం రాజారాం, కె. సభా, పులికంటి కృష్ణారెడ్డి, కొలకలూరి ఇనాక్, కలువకొలను సదానంద, ఆర్.ఎస్. సుదర్శనం, ఆర్. వసుంధరాదేవి గొప్ప కథలు రాశారు. కానీ ఎనభైల తర్వాత రాయలసీమ కథలో జనజీవన విస్తృతిలోనూ, జీవితానుభవ చిత్రణలోనూ, రాశిలోనూ, వాసిలోనూ కూడా ఎంతో అభివృద్ధి గోచరించింది.

'జర్తే' (1982) కథతో ఒక తారలాగా సాహిత్య ఆకాశం మీదకు దూసుకువచ్చిన మధురాంతకం మహేంద్ర రాసిన 'బేసిన్ బ్రిడ్జ్ దగ్గర' (1989) యువతరం శిల్పరీత్యా సాధించిన పరిణతికి అతి చక్కని ఉదాహరణ. ఈ కథ గురించి ప్రసిద్ధ కథకుడూ, మహేంద్ర తండ్రి అయిన మధురాంతకం రాజారాం 'మన సాహిత్యం'(1992) అన్న వ్యాసంలో ప్రస్తావిస్తూ ఇలా అన్నారు 'యాంత్రిక నాగరికత చేస్తున్న జబర్దస్తీలో పేటలు చిన్న బస్తీలుగా, బస్తీలు పట్టణాలుగా, పట్టణాలు మహానగరాలుగా బలిసి, నగరవాసులు మంచి గాలికి, మంచినీటికి, మంచి తిండికి ముఖం వాచిపోతున్న దుష్పరిణామాన్ని సైతం తెలుగు కథ పసిగట్టగలిగింది...' అని చెప్తూ 'తల్లి భారతి ఇప్పుడు పల్లెల్లో లేదు. మితిమీరిన సంపద, మేర మీరిన దారిద్ర్యం సహజీవనం చేస్తున్న పట్టణాల్లో ఉండలేదు. ఆమె ఉనికి మరెక్కడ? అని కూడా ప్రశ్నిస్తారు.

తొంభయ్యిల్లోని మొదటి పరిణామమేమిటంటే గత దశాబ్దాల్లో విశిష్టమైన కథనశైలి చూపించిన ప్రసిద్ధ రచయితలు కూడా కొత్త శైలిని, కొత్త కథల్ని అన్వేషించుకునే ప్రయత్నం చేయడం. అంతకు పూర్వం విస్తృతమైన సామాజిక జీవన పరిణామాన్ని చిత్రిస్తూ వచ్చిన కాళీపట్నం రామారావు మాస్టారు మధ్యలో దీర్ఘ విరామం తరువాత రాసిన 'సంకల్పం' (1992) కథ అటువంటి ఒక మలుపు. ఇందులో రచయిత మళ్ళీ తనకు పరిచయమైన జీవితం దగ్గరికీ, తనకు సాధికారికమైన అవగాహన వున్నదనుకున్న అంశం దగ్గరికి రావడం కనిపిస్తుంది. భూషణం 'కొత్తగాలి' (1998) ఇటువంటి మలుపే. ఇటువంటి పరిణామమే భమిడిపాటి జగన్నాథరావు, భమిడిపాటి రామగోపాలం, శ్రీపతి, మునిపల్లెరాజు వంటి రచయితల్లో కూడా కనిపిస్తుంది. ఈ నవ్య పరిణామానికి ప్రతినిధిగా 'త్రిపుర' కథను గుర్తించవచ్చును. త్రిపుర 1963 నుంచి 1973 దాకా పదేళ్ళ కాలంలో పదమూడు కథలు రాశారు. ఎనభైల్లో కథా రచయిత్రిగా, నవలా రచయిత్రిగా ముందుకు వచ్చిన ఓల్గా ఫెమినిస్టు దృక్పథాన్ని సృజనాత్మక సాహిత్యం ద్వారా వ్యక్తం చేయడానికి ప్రయత్నించింది. ఆమె కథా

సంపుటాలు – రాజకీయ కథలు (1993), ప్రయోగం (1995) ఒక దృక్పథాన్ని కథలుగా మార్చిన రచనల సంపుటాలు.

'ది రోడ్' (1971) కథ ద్వారా రంగప్రవేశం చేసిన డా॥ కేశవరెడ్డి చిన్న నవలకూ కథకూ మధ్యస్థంగా ఉంటే విశిష్టమైన రచనలను సాహిత్య శిల్పమే బలంగా చేశారు. ఎనభైల్లో వచ్చిన 'అతడు అడవిని జయించాడు', 'రాముడుండాలి రాజ్యముండాలి', 'సిటి బ్యూటిఫుల్' వాటి సాహిత్య వస్తువుల వల్ల మాత్రమే కాక చెప్పిన రీతిని బట్టి కూడా విశిష్టమైన ప్రయోగాలు. కానీ 'చివరి గుడిసె' (1993) సాహిత్య శిల్ప రీత్యా ఆయన రచనల్లోనే కాక ఇరవయ్యో శతాబ్ది తెలుగు కథలన్నింటిలోనూ అత్యున్నత పరిణతి సాధించిన కథగా నిలబడుతుంది.

కాళీపట్నం రామారావు సంకలనం చేసిన శ్వేతరాత్రులు కథాసంకలనంలో గోపీ భాగ్యలక్ష్మి రాసిన 'జంగుబాయి' (1993) కథ ఆ రచయిత్రి రాసిన మొదటి కథ, కానీ స్త్రీవాద, దళితవాద, పోరాట వాదాల వల్ల యువతరంలో కలిగిన మానసిక చైతన్యం సాధించిన పరిణతికి ఆ కథ ఒక ప్రతీక. ఉత్తర తెలంగాణా ప్రజా జీవితంలో వస్తున్న పరిణామాన్ని బి.ఎన్. రాములు, కాలువ మల్లయ్య, జూకంటి జగన్నాథం, బోయ జంగయ్య, అల్లం రాజయ్య, తుమ్మేటి రాఘోత్తమరెడ్డి, సాహు, వసంతరావు దేశ్పాండే, బి. మురళీధర్, కె.వి. నరేంద్ర వంటి రచయితలు చిత్రీకరిస్తూ వచ్చారు.

## 2.8. కథ లక్షణాలు

"రాయగా రాయగా భాష స్వాధీనం అవుతుంది. రాయగా రాయగా క్రాంత దర్శిత్వం నిశితం అవుతుంది. రాయగా రాయగా తపస్సు సిద్ధించి మహర్షి అవుతాడు. మహర్షి కానివాడు కథలు రాయలేడు"[10] అంటారు శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి.

---

[10] శతవసంతి సాహితీ మంజీరాలు – ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ సంఘం ప్రచురణ, 2002, పుట:438, వీరాజీ వ్యాసం.

శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి కథ గ్రామీణ వాతావరణానికి దర్పణం వంటింది. “శిథిలంకాని అక్షర శిల్పాలు ఆయనవి. అందులోను సజీవమైన శిల్పాలు అవి, శాశ్వతాలవి. కథలలో కొత్త చూపు కథనంలో ఒక కొత్త ఊపు ఉంటాయి. తెలుగు జాతి గర్వించదగ్గ తెలుగు కథామూర్తి ఆయన”[11] అంటారు ప్రముఖ పాత్రికేయులు వీరాజీ.

కథలు తెలుగువారికి కొత్త కాదు. నానమ్మలు, తాతయ్యలు, చిన్న పిల్లలను నిద్ర పుచ్చడానికి కథలు చెప్పేవారు. అవినీతిబోధకంగాను, సందేశాత్మకంగాను ఉండేవి. అనగనగా ఒకరాజు, ఆ రాజుకు 7గురు కొడుకులు వారు చేపలు పట్టడానికి వెళ్ళారు. ఇలా ప్రారంభమయి చివరిలో ఏదో ఒక గొలుసు ముడి విప్పుతారు. పిల్లలు ఆ ఉత్తేజంతో హాయిగా నిద్రపోతారు. ఈ రోజుల్లో టీవీల్లో వచ్చే హారర్ (horror) సీరియల్స్, సినిమాలు చూసి పిల్లలు నిద్రలో దడుచు కుంటారు. కాశీ మజిలీ కథలు, రామాయణ, భారత, భాగవతాది కథలు చెబుతున్నా, వింటున్నా రసవత్తరంగా ఉంటాయి. 19వ శతాబ్దం నాటికే సాహిత్య పత్రికలు ప్రారంభం అయ్యాయి. నవీన యుగానికి త్రిమూర్తులైన కందుకూరి, గురజాడ, గిడుగు సంస్కరణోద్యమాలకు కథారచనకు కూడా పూనుకున్నారు. శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి ‘ప్రబుద్ధాంధ్ర’ అనే పత్రికను స్థాపించారు. ఆ పత్రిక సాహిత్య వ్యాసాలు, కథలను ప్రచురించేది.

ఆధునిక కథా సాహిత్యం 1910లో ప్రారంభమైంది. ఆధునిక తొలి కథానిక గురజాడ అప్పారావు రచించిన ‘దిద్దుబాటు’ అంటారు ద్వానాశాస్త్రి. ఇటీవలి కాలంలో దిద్దుబాటు కంటే ముందు కథానికా సాహిత్య చరిత్ర వుందని పలువురు పరిశోధనలు కూడా చేసి గ్రంథాలు ప్రచురించారు.

---

[11] శతవసంతి సాహితీ మంజీరాలు – ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ సంఘం ప్రచురణ, 2002, పుట:445, వీరాజీ వ్యాసం.

పోరంకి దక్షిణామూర్తి – కథానికా స్వరూప స్వభావాలు, వల్లంపాటి వెంకటసుబ్బయ్య – కథాశిల్పం అనే గ్రంథాలు కూడా కథారచనపై వచ్చిన ప్రామాణిక గ్రంథాలు.

వల్లంపాటి వెంకటసుబ్బయ్య కథకు లక్షణాలు ఇవి అని చెప్పారు.

1. క్లుప్తత
2. అనుభూతి
3. ఐక్యత
4. సంఘర్షణ
5. నిర్మాణ సౌష్ఠవం

దిద్దుబాటు కథలో ఇవన్నీ సమగ్రంగా సరిపోయాయని వల్లంపాటి నిర్ధారించారు. ఇతివృత్తం, సంఘటనలు, సంభాషణలు అన్ని సంగ్రహంగా ఉంటాయి. అనవసరమైన వర్ణనలు ఉండవు. గురజాడ ఈ కథలో కమలిని పాత్ర ద్వారా వేశ్యాలోలుడైన భర్తను ఎలా దిద్దుకోవాలో సూచించారు. గురజాడ తరువాత కందుకూరి, చిలకమర్తి, రాయసం వెంకటశివుడు, పానుగంటి లక్ష్మీనరసింహం మొదలైనవారు కూడా కథలు రాశారు. చింతా దీక్షితుల కథలలో వైవిధ్యం కనిపిస్తుంది.

"మొట్టమొదటగా గిరిజనుల గురించి, సంచారుల జీవనాల గురించి కథలను రాసిన వారిగా ఈయనను పేర్కొనాలి"[12] అంటారు ద్వానాశాస్త్రి. చామర్తి కనకయ్య సిద్ధాంత వ్యాసానికి ముందుమాట వ్రాస్తూ శ్రీపాదవారు తన కథల నేపథ్యాన్ని ఇలా వ్యాఖ్యానించారు.

"చిన్న కథ రాయడానికి తన వాఙ్మయంలో (తెలుగు) ఎన్నో గ్రంథాలు చదివి గొప్ప కవులు పోకడలు, పలుకుబడులు బాగా అవగాహన చేసుకొని ఉండాలి. భాషలో నిరంతరం రచనను సాగిస్తుండాలి. లోకపు వృత్తం సూక్ష్మంగా పరకాయించుకుంటూ ఉండాలి. తన

[12] తెలుగు సాహిత్య చరిత్ర – ద్వానాశాస్త్రి, పుట: 593.

రచనలో జీవనాడి ప్రచలితం కావడానికి ఇన్నింటికీ పునాదిగా తన జాతీయత పూర్తిగా అవగాహన చేసుకొని ఉండాలి”[13].

శ్రీపాద అనగానే కలుపు మొక్కలు కథ గుర్తుకొస్తుంది. తెలుగు కథకు జీవనది వంటివాడు శ్రీపాద. ఆయన 70కి పైగా కథలు రాశారు. శ్రీపాద తరువాత వేలూరి శివరామశాస్త్రి చెప్పుకోదగ్గ కథా రచయిత. బెంగాలీ రచయిత శరత్‌బాబు రచనలను ముందుగా తెలుగులో అనువదించినది వేలూరి వారు.

మొక్కపాటి నరసింహశాస్త్రి కథకులలో ప్రసిద్ధులు. మునిమాణిక్యం నరసింహరావు, కాంతం కథలు సాహిత్యంలో మణిపూసలు. ఆయన ఇటు సంసారికి, జ్ఞానానికి ముని. అటు హాస్యానికి మాణిక్యం. అందుకే ఆయన మునిమాణిక్యం. “నటులలో ఇంగ్లీష్ వారికి పాల్గని ఎటువంటివారో రచయితలలో తెలుగువారికి మన హాస్యముని అటువంటివారు అంటారు” పిసుపాటి ఉమామహేశ్వరరావు[14].

ఒక పాత్రను సృష్టించి, దానికి జన్మనిచ్చి, పోషించి, పైకి తీసుకురావడం ఎంత కష్టమో, దానిని పెంచి నిలుపటం కూడా అంతే కష్టం. కాంతం పాత్ర ద్వారా మునిమాణిక్యం గారికి అటువంటి మహాదవకాశం దొరకటం తెలుగుజాతి అదృష్టం. తెలుగువారు ఆనందించటానికి అందిన సాహితీ అదృష్టం పేరు కాంతం. సంసార జీవనంలో ఆయన స్పృశించని విషయం అంటూ లేదు. భార్యాభర్తల మధ్య పొట్లాటాలు రావచ్చు గానీ తెగేదాకా వెళ్ళకూడదని ఆయన సిద్ధాంతం. రసహృదయంతో సాంసారిక ఆనందాన్ని ఆస్వాదించాలన్నది ఆయన తీర్మానం.

---

13 చామర్తి కనకయ్య – పిహెచ్.డి. సిద్ధాంత వ్యాసం – శ్రీపాద ముందు మాటలు, పుట:593, ద్వానాశాస్త్రి.

14 శతవసంతి సాహితీ మంజీరాలు – ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ సంఘ ప్రచురణ, పుట:446.

"తెలుగు సాహితీజగత్తులో చిరస్థాయిగా చిరస్థానాన్ని సంపాదించుకున్న కొద్దిమంది కథకులలో మల్లాది రామకృష్ణశాస్త్రి ఒకరు. ఆయన కథ రాస్తారు అనడానికన్నా చెప్పుకుపోతారు అనడం సమంజసం. అలా ఓసారి కథ చెప్పుకుపోతుంటే అర్థంకాక మధ్యలో ఇదంతా ఏమిటి అని అడిగినప్పుడు జీవితం అంటారు"[15].

శాస్త్రిగారు కథాసంవిధానంలోనూ, వస్తువైవిధ్యంలోనూ చూపిన చిత్రవిచిత్ర పోకడలు ఎన్నో ఎన్నెన్నో. తెలుగు నుడికారపు సోయగాలు, సౌరభాలు, పదాల విరుపులు, మెరుపులు, శ్లేషలు, ఆశ్లేషలు కోకొల్లలు.

మాగోఖలేగా ప్రసిద్ధుడైన మాధవపెద్ది గోపాలకృష్ణ గోఖలే, గ్రామీణ ప్రాంత జీవితంలోని వెలుగు నీడలను కమనీయ కథా ఖండాలుగా మలిచాడు. "ఆయన జీవితాన్ని రెండు విషయాలు ప్రభావితం చేశాయి" అంటారు పాపినేని శివశంకర్[16].

1. తండ్రి ద్వారా సంక్రమించిన గాంధేయ భావజాలం.
2. వామపక్ష భావజాలం. అందులో పీడిత పక్షపాత భావం. ఆయనకు తన బాబాయి కొడవటిగంటి కుటుంబరావు మార్గదర్శకత్వం కూడా తోడయింది. కథలు తప్ప మరో ప్రక్రియను స్పృశించని మొదటి రచయిత కరుణకుమార – ఆయన అసలు పేరు కందుకూరి అనంతం.

వల్లంపాటి తన విశ్లేషణలో ఇలా అంటారు – అది"కరుణకుమార కథల్లో జీవిత విస్తృతి అంతకుముందు ఎన్నడూ లేనంతగా పెరిగింది. పట్టణాలు, పల్లెలు, అగ్రహారాలు, హరిజన వాడలు, కరుణ కుమార కథల్లో కథాస్థలాలు బడగువర్గాల జీవన చిత్రీకరణలో, దేశీయమైన మాండలిక ప్రయోగాలలో విశిష్టుడు కరుణ కుమార".

---

15 శతవసంత సాహితీ మంజీరాలు – సోమంచి రామం వ్యాసం, పుట:453.

16 శతవసంత సాహితీ మంజీరాలు – పాపినేని శివశంకర్ వ్యాసం, పుట: 460.

కథకులలో అగ్రగణ్యుడు చలం, స్త్రీ పురుష సంబంధాల మూలాలలోకి వెళ్ళి అడ్డుగోడలను ఛేదించే ప్రయత్నం చేశాడు. భాషా ప్రయోగంలో అభిప్రాయ ప్రకటనలో పాత్రల మనస్తత్వ చిత్రీకరణలో సహజత్వం కనిపిస్తుంది అంటారు వెన్నవరం వరదారెడ్డి.

కథకులలో వందల కొద్ది  పేర్లు చెప్పుకోవచ్చు. అడవి బాపిరాజు, సురవరం ప్రతాపరెడ్డి, శ్రీనివాస శిరోమణి, భమిడిపాటి కామేశ్వరరావు, పురిపండా అప్పలస్వామి, కొండవటిగంటి కుటుంబరావు, కొనకళ్ళ వెంకటరత్నం, పిలకా గణపతిశాస్త్రి, ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి, సోమంచి యజ్ఞన్నశాస్త్రి, త్రిపురనేని గోపీచంద్, పాలగుమ్మి పద్మరాజు, బుచ్చిబాబు (శివరాజు వెంకట సుబ్బారావు), చాగటి సోమయాజులు (చా.సో.), రావిశాస్త్రి, మధురాంతకం రాజారాం.

## 2.9 కథా సాహిత్యంలో ప్రముఖులు

"కొడవటిగంటి కుటుంబరావు కథా సాహిత్యాన్ని మలుపు తిప్పిన ఒక విశిష్ట కథకుడు. ఆయన రచనలకు సామాజిక ప్రయోగం బలమైన ఉత్తేజం. మధ్య తరగతి జీవితం కేంద్రబిందువుగా ఆయన రచనలు చేసినట్టు కనిపిస్తుంది"[17]. అంటారు ఇంద్రగంటి శ్రీకాంతశర్మ.

కాళీపట్నం రామారావు, దేవరకొండ బాలగంగాధర తిలక్, వాకాటి పాండు రంగారావు, శంకరమంచి సత్యం, కేతు విశ్వనాథరెడ్డి, కే. సభా, రావూరి భరద్వాజ, హితశ్రీ, అవసరాల రామకృష్ణారావు, వీరాజీ, మంజుశ్రీ, శీలా వీర్రాజు, భమిడిపాటి రామగోపాలం, సి.యస్. రావు, ఆర్.యస్. సుదర్శనం, కొమ్మూరి వేణుగోపాలరావు, గొల్లపూడి మారుతీరావు, ఆదివిష్ణు, పోలా ప్రగడ సత్యనారాయణ, దివి వెంకట్రామయ్య, ఇచ్ఛాపురపు జగన్నాథరావు, పులికంటి, ముని పల్లెరాజు. కలువకొలను సదానంద, విహారి, రాజారామ్మోహనరావు, శ్రీపతి

---

[17] తెలుగు సాహిత్య చరిత్ర – డా॥ ద్వానాశాస్త్రి, పుట: 559.

ఇలా ఎందరో మరెందరో. పాలగుమ్మి పద్మరాజు కథ "గాలివాన"కు 1952లో న్యూయార్క్ హెరాల్డ్ ట్రిబ్యూనల్ పత్రిక నిర్వహించిన ప్రపంచ కథా రచనల పోటీలో ద్వితీయ బహుమతి వచ్చింది. ఈ విధంగా తెలుగు కథకు అంతర్జాతీయ గుర్తింపు లభించింది. ఆయన ఎక్కువ కథలు రాయలేదు. బుచ్చిబాబులా పరిమితంగా రాశారు. ఆయనలో ఉన్న విలక్షణత కథావస్తువులను ఎంచుకోవడంలో ప్రదర్శించిన వైవిధ్యం. ఆంధ్ర పత్రికవారు నిర్వహించిన పోటీలో ఈ కథకు తెలుగులో ప్రథమ బహుమతి వచ్చింది. "దానితో ఆయన పేరు సాహిత్య ప్రపంచంలో మార్మోగింది. అంతవరకు రచయితలకు, కొంత మంది మేధావులకు మాత్రమే పరిమితమైన ఆయన పాఠకుల రచయితగా పాపులరయ్యారు"[18].

## 2.10 కథా రచయిత్రులు

సాహిత్య పత్రికలతో పాటు, అధికంగా 20వ శతాబ్దంలో వార, మాస పత్రికలు విరివిగా వచ్చాయి. ఆంధ్ర పత్రికతో ప్రారంభమై ఆంధ్రప్రభ, ఆంధ్రజ్యోతి, ఆంధ్రభూమి వంటి దినపత్రికలు, వారపత్రికలను కూడా నడిపాయి. ఇవికాక స్వాతి వారపత్రిక ఒక ఉధృతంగా వచ్చింది. మరెన్నో మాస పత్రికలు కూడా వెలువడ్డాయి. ఈ నేపథ్యంలో కథకులతోపాటు, కథారచయిత్రులు కూడా అధిక సంఖ్యలో ప్రాముఖ్యాన్ని సంపాదించుకున్నారు. పాత తరానికి చెందిన రచయిత్రులలో కనుపర్తి వరలక్ష్మమ్మ ప్రసిద్ధురాలు. కాంచనపల్లి కనకాంబ, ఇల్లెందుల సరస్వతీదేవి చెప్పుకోదగ్గవారు. 'సరస్వతీదేవి కథల సంపుటి – స్వర్ణ కమలాలు' కేంద్ర, రాష్ట్ర సాహిత్య అకాడమీల బహుమతి పొందింది.

---

[18] శతవసంత సాహితీ మంజీరాలు – కొమ్మూరి వేణుగోపాలరావు వ్యాసం, పుట: 482.

"అత్తగారి కథలతో భానుమతీ రామకృష్ణ నాలుగు కాలాలపాటు నిలిచిపోగల పాత్రలు సృష్టించారు. భానుమతి కథలలో మూడు అంశాలు గమనించవచ్చునని"[19]. మల్లాది సూరిబాబు (మచిలీపట్నం) పేర్కొంటారు.

1. మనస్సుకు ఉల్లాసాన్ని కలిగించే కథలు.

2. ఆంతర్యంలో ఆలోచనలు రేకెత్తించి, బుద్ధికి పదును కలిగించేవి.

3. హృదయాన్ని స్పందింపజేసేవి.

భానుమతి కథలు ఐదు సంపుటాలలో వెలువడ్డాయి.

కథా రచయిత్రిగా వాసిరెడ్డి సీతాదేవి నాలుగు కథా సంపుటాలు ప్రచురించింది. గృహలక్ష్మి స్వర్ణకంకణం అందుకుంది. నాయని కృష్ణకుమారి కథా సంపుటి వెలువడింది. పాకాల యశోదా రెడ్డి – మా వూరి ముచ్చట్లు అనే పేరుతో ఒక కథా సంపుటి ప్రచురించింది. తెలంగాణ మాండలికంలో తెలుగుతనం ఉట్టిపడే కథలు అవి. ఉత్తమ కథలు రాసి కొత్తదనం చేకూర్చిన విశిష్ట కథా రచయిత్రి ముప్పాళ్ళ రంగనాయకమ్మ. అలానే ఆచంట శారదాదేవి మంచి కథకురాలు. ఇతర కథకులను పేర్కొన్నప్పుడు తురగా జానకీరాణి, శివరాజు సుబ్బలక్ష్మి, ద్వివేదుల విశాలాక్షి, ఆర్. వసుంధరాదేవి, పవన నిర్మల ప్రభావతి, పోలాప్రగడ రాజ్యలక్ష్మి, సి. ఆనందారామం, వేదుల శకుంతల, ఐ.వి.ఎస్. అచ్యుతవల్లి, డి. కామేశ్వరి, గోవిందరాజుల సీతాదేవి, కె.వి. కృష్ణకుమారి, తమిరశ జానకి, ఇంద్రగంటి జానకీబాల, గంటే సుజల, కన్నెగంటి అనసూయ, మాలతీ చందూర్ మొదలైనవారు గుర్తుకు వస్తారు. శీలా సుభద్రాదేవి, ముక్తేవి భారతి, వాసా ప్రభావతి, శారదా అశోకవర్ధం, బీనాదేవి తమ కథల ద్వారా పాఠకులను ఉర్రూతలూగించారు. వారపత్రికలలో వీరి కథ ఎప్పుడు వస్తుందా అని ఎదురుచూసే రచయిత్రులలో యద్దనపూడి సులోచనారాణి, కోడూరి కౌసల్యదేవి ప్రముఖులు.

---

[19] శతవసంత సాహితీ మంజీరాలు – మల్లాది సూరిబాబు వ్యాసం, పుట:493.

## 2.11 సమకాలీన కథా సాహిత్యం

1980 నుండి వస్తున్న కథాసాహిత్యాన్ని కొత్తతరం కథకుల కథలను సమకాలీన కథా సాహిత్యంగా పేర్కొనవచ్చు. ఇటీవలి కాలంలో ప్రతి ఏటా ఆ సంవత్సరంలో వచ్చిన కథలలో మేలి కథలను "కథ 92" (1992) – ఇలా ప్రచురిస్తూ వస్తున్నారు. పాపినేని శివశంకర్ ఈ కథా సంపుటులను వెలువరుస్తున్నారు. అలానే కథకులు తమ కథా సంపుటులను ఏటా ప్రచురిస్తున్నారు. ఆధునిక కథకులలో వీరిని పేర్కొనవచ్చును. వివినమూర్తి, తల్లావఝ్ఝల పతంజలి, వాడ్రేవు చినవీరభద్రుడు, ఎ. జగన్నాథశర్మ, మహేంద్ర, జి. ఆర్ మహర్షి, చక్రవేణువు, తుమ్మేటి రఘోత్తమరెడ్డి, కాలువ మల్లయ్య, జగదీశ్వరరావు, తోలేటి జగన్ మోహన్‌రావు, నరేంద్ర మంత్రవాది, మహేశ్వర్, దాసరి అమరేంద్ర, వి. చంద్రశేఖరరావు, శాంతి నారాయణ, భూషణం, సన్నపురెడ్డి వెంకటరామిరెడ్డి, అల్లం శేషగిరిరావు మొదలగువారు చెప్పుకోదగ్గవారు.

"సీనియర్ రచయితల నుండి జూనియర్ రచయితలు శిల్పానికి సంబంధించిన మెలకువల్ని నేర్చుకుంటుంటే, జూనియర్ రచయితల నుండి సీనియర్ రచయితలు కొత్త వస్తువులను స్వీకరించడం నేర్చుకుంటున్నారు"[20] అంటారు వల్లంపాటి వెంకటసుబ్బయ్యగారు.

## 2.12 స్త్రీవాద రచయిత్రులు

స్త్రీవాద సాహిత్యంతోపాటు దళిత కథలు కూడా ఇటీవలి కాలంలో సంపుటాలుగా వెలువడుతున్నాయి. ఇవి సమకాలీన ధోరణులను ప్రతిబింబిస్తున్నాయి. జయధీర్ తిరుమలరావు ప్రధాన సంపాదకుడుగా స్త్రీవాద కథలు వెలువడ్డాయి. ఓల్గా, కొండేపూడి నిర్మల, పి. సత్యవతి, కుప్పిలి పద్మ, విమల, సుజాత పేర్కొనదగినవారు. కె. వరలక్ష్మి, కె.బి.

---

[20] తెలుగు సాహిత్య చరిత్ర – డా॥ ద్వానాశాస్త్రి, పుట: 615.

లక్ష్మి, పి. పద్మజ, మృణాళిని, ఇంద్రగంటి జానకీబాల ఇలా ఎందరో ముఖ్యమైనవారు ఉన్నారు.

## 2.13 దళిత కథలు

ఇటీవలి కథాసాహిత్యంలో ఒక కొత్త మార్పు దళిత కథలు. శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి, వేలూరి శివరామశాస్త్రి, చలం వంటి వెనుకటితరం వాళ్ళు కూడా దళిత కథలు రాశారు. అయితే ఇప్పటి దళిత ఉద్యమ నేపథ్యం వేరు. నేటి సామాజిక, ఆర్థిక రాజకీయాల నేపథ్యంలో దళిత కథలు వస్తున్నాయి. వారిలో కొలకలూరి ఇనాక్, చిలుకూరి దేవపుత్ర, బోయ జంగయ్య, కాలువ మల్లయ్య ప్రధానులు. తెలంగాణ బి.సి. సంక్షేమ సంఘ అధ్యక్షులుగా వ్యవహరిస్తున్న బి.యస్. రాములు ఉద్యమ తత్వవేత్తగా, ఆలోచనాత్మకమైన దళిత కథలు రాశారు. పైడి తెరేష్ బాబు, ఎండ్లూరి సుధాకర్, వల్లూరి రాఘవరావు, భార్గవీరావు ఇలా ఎందరో ఉన్నారు.

## 2.14 కథా సంకలనాలు

రచయితలు తమ కథలను సంపుటులుగా తరచూ ప్రచురిస్తూనే ఉన్నారు. కథా సంపుటాలను కొనేవారి సంఖ్య తక్కువగా ఉన్నా సంపుటాలు మాత్రం వస్తూనే ఉన్నాయి. ఇవిగాక వివిధ రచయిత కథలను సంకలనంగా తీసుకువచ్చే ప్రయత్నం ఇటీవలి కాలంలో మొదలైంది. అలాంటి సంకలనాలు కొన్ని:

1. ఆంధ్ర కథా మంజూష – 1958, కేంద్ర సాహిత్య అకాడమీ, స్వామి శంకరశాస్త్రి.

2. తెలుగు కథ – 1986, డి. రామలింగం, సాహిత్య అకాడమీ.

3. కథా భారతి – 1973, వాకాటి పాండు రంగారావు, పురాణం సుబ్రహ్మణ్యశర్మ, నేషనల్ బుక్ ట్రస్టు.

4. కథా స్రవంతి – పెనుగొండ లక్ష్మీ నారాయణ, గుంటూరు జిల్లా అభ్యుదయ రచయితల సంఘం.

5. కళింగ కథానికలు – చాగంటి సోమయాజులు.

6. నేటి కథ – కాళీపట్నం రామారావు.

7. సీమ కథలు – 1992, సింగమనేని నారాయణ.

8. శ్వేతరాత్రులు – 1993, కాళీపట్నం రామారావు.

9. చదువు కథలు – కేతు విశ్వనాథరెడ్డి, పి. సత్యనారాయణ.

10. సువర్ణముఖి – విరసం, విశాఖ శాఖ.

11. నాగావళి కథలు – 1995, బి.ఎ. రామారావు నాయుడు.

12. కథా 90, 91, 92, 93 ఏటా ఒక కథా సంకలనం – వాసిరెడ్డి నవీన్, పాపినేని శివశంకర్.

13. ఋతుపవనాలు – 1996, కాళీపట్నం రామారావు.

14. విస్మృత కథంబం – సఖ్య సాహితీ, హైదరాబాద్ (28 మంది రచయిత్రులు).

15. రాతిపూలు – శశిశ్రీ.

16. మనకాలం కథలు – 1997, విరసం, ప్రకాశం జిల్లా శాఖ.

17. స్త్రీవాద కథలు – జయధీర్ తిరుమలరావు.

18. ఇంకా ఇకపై చెల్లదు – భార్గవీరావు.

19. దళిత కథలు – 1996, ఆర్. చంద్రశేఖర్ రెడ్డి, కె. లక్ష్మీ నారాయణ.

20. కథా సంపుటి – వేదగిరి రాంబాబు (కొత్తకథ, సరికొత్తకథ, వినూత్న కథ).

21. తానా తెలుగు కథలు – అమెరికా తెలుగు సంఘం.

## 2.15 . అనంత పద్మనాభరావు కథ సంపుటాలు– విశ్లేషణ

అనంత పద్మనాభరావు 2013–14, 15 సంవత్సరాలలో వరుసగా ఒక్కొక్కటి చొప్పున మూడు కథాసంపుటాలు ప్రచురించారు. మొదటి సంపుటిలో 13 కథలు, రెండవ సంపుటిలో 13 కథలు, మూడవ సంపుటిలో 15 కథలు ఉన్నాయి.

## 2.15.1. మొదటి సంపుటి

**కథా క్రమామీషూ**

1. ఐయామ్ రియల్లీ సారీ.
2. వట్టిరాకపోకలొనర్చె వానిసతియు.
3. అష్టోత్తరశతం.
4. మిమ్మల్ని కాదులెండి.
5. ముహూర్తం షాట్.
6. విధి నిర్వహణ.
7. ఎవరు త్యాగశీలి.
8. ఆదర్శం.
9. మాకు ఉన్నాయి స్వగతాలు.
10. పాపం నరసింహులు.

11. ఆత్మాభిమానం.

12. పాపం భారతి.

13. తప్పిపోయిన గోపి.

## 2.15.2. రెండవ సంపుటి

### గోరింట పూచింది

1. గోరింట పూచింది.

2. ఋణానుబంధరూపేణ.

3. రేపటినుండి అమ్మ నీవాటా.

4. అభిజ్ఞవర్గాల భోగట్టా.

5. దేవయాని.

6. చెరువు గట్టు.

7. గుప్తదాత.

8. కాంతాకనకాలు.

9. ఎన్నికల పాపం.

10. నారిగాడు.

11. కాలం కరచిన కడపట.

12. కృష్ణ జన్మస్థానం.

13. గూడు చెదిరిన పక్షులు.

### 2.15.3. మూడో సంపుటి

**కథామందారం**

1. పడగ నీడలో.
2. పూర్ణిమ.
3. తలపుల తలుపులు.
4. ముఖ్య అతిథి.
5. నీడనిచ్చిన గూడు.
6. వంశాంకురం.
7. సన్మానాలు చేయబడును.
8. ఋణానుబంధ రూపేణా.
9. జీవచ్ఛవం.
10. వాన(ర)ప్రస్థం.
11. దహన సంస్కారాలకు.
12. దోస తొడిమ.
13. వట్టిరాకపోకలొనర్చె వానిసతియు.
14. పల్లె పిలిచింది.

15. జగమొండి.

## 2.16. అనంత పద్మనాభరావు కథలలో ఇతివృత్తం

### పడగనీడ

ఈ కథ 2015 జూన్‌లో ఆంధ్రజ్యోతి, నవ్య వారపత్రికలో ప్రచురితమైనది. ఈ కథ గురించి రచయితతో సంభాషించగా ఇలా అన్నారు.

“ఈ కథ నవ్య వారపత్రికలో వచ్చిన తరువాత చాలామంది ఫోన్లు చేశారు. ఒకరోజు ఒకామె ఫోను చేసింది. ఈ కథ చాలా వాస్తవంగా ఉంది. ఆనాటి సమాజంలోనే కాదు, ఈనాటి సమాజంలోనూ చాలామంది ఇలాంటి సూర్యకాంతంలు ఉన్నారు. మీరు చూపిన ముగింపు బాగుంది అన్నారు. మీరెవరమ్మా? అని అడిగాను. “నేను నవ్య వారపత్రిక జగన్నాథ శర్మ భార్యను” అంది. నేను నవ్యలో వచ్చిన కథలు చదువుతుంటాను. ఈ కథలో ముగింపు చాలా నచ్చింది” అన్నారామె.

సాధారణంగా కథ ఉత్కంఠను రేపాలి.చివరివరకు పాఠకుడు తన మనస్సులో ఏదో ఒక భావంతో ఇలా ముగుస్తుంది అనుకుంటాడు. అది అలానే జరగాలని నియమం లేదు. కవి/కథకుడు స్వేచ్ఛాజీవి, “కవయః క్రాంత దర్శినః” అన్నారు. రవికాంచనినో కవి గాంచునే కదా అన్నారు. ఇది కవిత్వం విషయంలో జరుగుతుంది. ఇంకా కథల విషయంలోకి వస్తే కథకుడు ఎలా ముగిస్తాడు అనేది అతడి భావజాలం మీద, అతని మానసిక సిద్ధాంతాలమీద, చుట్టూ పెరిగిన వాతావరణం మీద సమాజ పరిశీలన వల్ల, ప్రభావం వల్ల ఆధారపడి ఉంటాయి. ఇక్కడ రచయిత ఒక స్వతంత్ర నిర్ణయం తీసుకున్నాడేమో అనిపిస్తుంది. ఈ కథను మరోలా కూడా ముగించవచ్చు. సుఖాంతమైన కథలు/విషాదాంతమైన కథలు ఉన్నట్లే, స్వేచ్ఛా వాతావరణ స్వభావం గలవారు అనుకూల వాతావరణ స్వభావం గలవారు అని రెండు రకాలుగా ఉంటారు. ఇందులో రచయిత స్వేచ్ఛా వాతావరణాన్ని ఎంచుకున్నారు.

సంప్రదాయవాదులైనవారు దీనిని సమర్థించకపోవచ్చు. దీనికి రెండు పరిష్కార మార్గాలు ఉన్నాయి.

1. భార్యాభర్తలు వేరే కాపురం పెట్టడం, అయితే దానికి అతను అంగీకరించడు. ఎందుకంటే తల్లిచాటు బిడ్డ. ఎలానో అతనితో పోరాడి వేరు కాపురం పెట్టవచ్చు. ఇది సర్వ సాధారణంగా జరిగే పరిణామం.

2. తాను ఆత్మహత్యకు పూనుకోవటం. ఇది బలహీనురాలైన వ్యక్తి చేసే పని, ఆత్మహత్య ప్రయత్నించిన వ్యక్తి చనిపోక ఆసుపత్రి పాలై రోగిష్ఠిగా మారవచ్చు. ఫలితం శూన్యం.

3. కష్టాలకు వోర్చి అదే ఇంట్లో సర్దుబాటు ధోరణిలో జీవించడం మరో మార్గం.

వీటిలో ఏది ఉత్తమమూ అనేది మనము నిర్ధారించలేము. ఒకే కథకు ముగ్గురు కథకులు మూడు రకాలుగా ఆలోచించవచ్చు. ఈ ముగింపు స్త్రీ భావనా ధోరణికి సన్నిహితంగా ఉన్నది.

ముగింపులో మాంగల్యం తీసి రఘు ఫోటో వద్ద పెట్టి వెళ్లటం ఆమె స్థిర నిర్ణయానికి ఉదాహరణగా చెప్పవచ్చు. చివరి వాక్యంలో అత్తగారు పశ్చాత్తాప పడకా "అంతా నన్ను ఆడిపోసుకుంటారు అనటం ఆమె ధోరణిలో మార్పు రాలేదు అనటానికి పరాకాష్ట. రఘు మౌన ప్రేక్షకుడు. అంతకు మించి అతని తండ్రి ఏమీ సమర్థించలేని మరో వ్యక్తి. అతడు నిస్సహాయుడని విమలకు తెలుసని రచయిత స్పష్టం చేశాడు. నోరు మెదిపితే తనకు శాపనార్థాలు తప్పవని తెలిసిన యోగి" అని రచయిత చెప్పటం సహజంగా ఉంది. ఇందులో పాత్రలు మూడు. వారిని రచయిత ఒక్కొక్క వాక్యంలో అద్భుతంగా వర్ణించారు.

మామగారైన శివరాం యోగి.

భర్తయైన రఘురాం కంప్యూటర్ భోగి.

అత్తగారైన కాంతం నటనారోగి.

ఇవి ఈ కథలో ఆయువుపట్టులు. ఈ కథా శీర్షికను 'పడగ నీడలో' అని పెట్టడం ఔచిత్యవంతంగా ఉంది. పాము పడగన జీవిస్తున్న వ్యక్తి, అది ఎప్పుడు కాటు వేస్తుందో తెలియక నిత్యం జీవిస్తుండాలి. అత్తగారిది పాము పడగ, ఆ నీడలో కోడలు జీవిస్తుందని కథకుడు ధ్వనింపజేశాడు. ఇందులో సంభాషణలు స్వభావ/సహజసిద్ధంగా ఉన్నాయి. చదువుకున్న వాళ్ళంటే అత్తగారికి పడదు, ఎప్పుడూ దెప్పిపొడుపులతో నచ్చిన ఉద్యోగం మానేసింది కోడలు.

## పాత్రల విశ్లేషణ

ఇందులో ప్రధాన పాత్రలు అయిదు:

1.చంద్రసేన – జమీందారు.

2. చంద్రసేన తల్లి.

3. శివుడు – పూర్ణిమ బావ.

4. సాత్యకి – అర్చకుడు.

5. పూర్ణిమ.

కథ అంతా పూర్ణిమ చుట్టూ తిరుగుతుంది. పాత్రల మనోవిశ్లేషణ కథకుడు మానసిక పరిపక్వతను దృష్టిలో పెట్టుకున్నాడు. చంద్రసేన జమీందారుకు ఏకైక సంతానం. విదేశాలలో చదువుకున్నాడు. తండ్రి మరణంతో జమీందారీ పరిపాలనా బాధ్యతలు తనపై పడ్డాయి. పల్లె జీవనానికి ఇంకా పూర్తిగా అలవాటు పడలేదు. 10 రోజులు పల్లెలోనూ, మిగతా రోజులు మద్రాసులోనూ గడుపుతున్నాడు. చదువు సంస్కారం అతనికి అబ్బాయి. అందుకే నిరాడంబరంగా, నిర్మోహమాటంగా ఉన్న పూర్ణిమను చూసి ఇష్టపడ్డాడు. "నిన్ను చూడకుండా

ఉండలేకపోతున్నాను"– అనే ఒక్క మాటలో అతని మనస్తత్వం తెలిసింది. "ఆమె సేవకురాలిగా జన్మించటం విధిరాత అనుకున్నాడు. మీ బావతో పెళ్ళి కుదిర్చాడంట కదా మీ నాన్న" అంటాడు చంద్రసేన. పూర్ణిమ జవాబు ఇవ్వదు, తల ఆడించి సరిపెట్టింది. ఆమె మనస్సు కనుక్కోవాలని "నీకు ఇష్టమేనా" అన్నాడు. "వాడికి ఇష్టం బాబయ్య. మా అత్తకొడుకేగా" అన్నది. ఇది కప్పదాటు జవాబు. తనకు ఇష్టం ఉందో లేదో చెప్పదు. చివరగా చంద్రసేన "బలవంతమేమీ లేదు నేను బలవంతం చేయను. బాగా ఆలోచించుకో" అంటాడు. చివరకు కథ మరోలా మలుపు తిరిగింది. పూర్ణిమను జమీందారు చేసుకోవడం కథకు ఒక విధమైన ముగింపు. రచయిత దీనిని ఎంచుకోలేదు. సర్వసాధారణంగా జమీందారు తన అధికార దర్పంతో ఆమెను వశపరచుకునే ప్రయత్నాలు చేసి ఉండవచ్చు. అలా చేస్తే అది మామూలు కథే అవుతుంది. అలా ఎన్నో కుటుంబాలు మగ్గిపోయిన సందర్భాలు నిజజీవితంలో చూస్తూంటాము. జమీందారులకు బానిసలుగా పడి ఉండటం సహజం. వారికి బహుభార్యాత్వం లేదా/ఇతరులతో అక్రమసంబంధం లోక సహజం. ఇక్కడ చంద్రసేన చాలా ఉదాత్తంగా ప్రవర్తించాడు. తన సంస్కారాన్ని విద్యాబుద్ధులను ఎక్కడా కించపరిచే విధంగా ప్రవర్తించలేదు. ఇది రచయిత కథాకథన సృష్టికి ఒక చక్కని ఉదాహరణ.

**పూర్ణిమ**

ఈ కథ సాధారణంగా సినీ దర్శకులు విశ్వనాథ్ కథా ధోరణికి సరిపడేలా ఉంది. ఇందులో ఒక నాయిక – పూర్ణిమ. ముగ్గురు నాయకులు ఉంటారు. ఈ ముగ్గురు కూడా పూర్ణిమ చుట్టూ తిరుగుతున్న నాయకుల పాత్రలు. ముగ్గురి జీవన నేపథ్యాలు వేరు. ఒకరు జమీందారు, భోగభాగ్యాలతో తులతూగే సంసారం వారిది. పూర్ణిమ ఆ జమీందారు కుటుంబంపై ఆధారపడి జీవించే నరసింహ కూతురు. సంస్థానానికి జమీందారు వారసుడు కానీ అందచందాలతో ఉన్న పూర్ణిమను మనసారా స్వీకరించాలనుకున్నాడు. రచయిత ఈ కథలో తనకున్న సాహిత్య వాసనను కూడా చూపించారు. దువ్వూరి రామిరెడ్డిగారి వనకన్య

ఖండ కావ్యంలోని ఒక పద్యాన్ని జమీందారు చేత చెప్పించారు. దీనివల్ల కథకు బలం చేకూరింది.

**‘అరగౌర చీర అంసములనంటియునంటని పైట చెంగె, ఆ**

**తరుణికి లోకమిచ్చిన ఉదారపు నాగరికంబు, శేషసుం**

**దరత సమస్తమున్ ప్రకృతి తానె యొసంగెను నాగరాంగనా**

**పరిచితమైన లజ్జ ఎటువంటిదొ కన్నె ఎరుంగ దింతకున్’**

**(వనకుమారి:దువ్వూరి రామిరెడ్డి ఖండకావ్యం)**

## శివుడు

అతడు పూర్ణిమకు మేనత్త కొడుకు. అతడు కష్టజీవి. శరీర పుష్టి కలవాడు. వరుసకు మేన మరదలిపై మనస్సు పడటంలో తప్పులేదు. అందుకే “లగ్గం అయ్యేదాకా దూరంగా ఉందాం” అంటుంది పూర్ణిమ. సహజసిద్ధంగా అయితే జమీందారును కాదని బావతో పెళ్ళి చేసుకోవటం కథకు ముగింపు అవుతుంది. ఇక్కడ మరో పాత్ర ప్రవేశించింది. అతడు సాత్యకి. సాత్యకి అని పేరు పెట్టడంలో విశేషం ఉంది. అతడు కృష్ణుడి తమ్ముడు. ఈ కథా గమనంలో కూడా రుక్మిణీ, కృష్ణునిల వివాహ ప్రస్థావన వచ్చింది. అర్చకుడిగా పనిచేస్తున్న తనకు కుల పట్టింపులు ఉన్నా కులాంతర వివాహం చేసుకోవడానికి సాత్యకి సిద్దపడ్డాడు. ఇక్కడ సంప్రదాయాలకు, ఆచారాలకు మధ్య వైరుధ్యం తలెత్తింది. అతడు ఆమె సౌందర్యాన్ని ఆరాధించాడు. వెనుక చూపులేదు. సమాజాన్ని ఎదిరించాలనే ప్రయత్నం కాకపోయినా, సమాజ సూత్రాలకు కట్టుబడి తన అర్చకత్వాన్ని వదులుకున్నాడు. “దైవసాక్షిగా మనం ఈనాటి నుండి భార్యాభర్తలం” అన్నాడు. ఇది కథకు ముగింపుగా భావించాలి.

## చంద్రసేన తల్లి

ఈమె అచ్చమైన జమీందారిణీ స్వభావం గలది. కొడుకు పూర్ణిమను ఇష్టపడుతున్నాడని తెలిసి తన జాగ్రత్తలో తను మసలుతూనే ఉంది. వివాహ ప్రయత్నాలు చేస్తూనే ఉంది. కొడుకును అదుపులో పెట్టాలనుకుంది. పూర్ణిమను చంద్రసేన గదిలోకి పంపడం మానేసింది. ఇది జమీందారు స్వభావానికి తగిన పాత్రపోషణ. భర్తృవిహీనమైన ఆమె అలా ప్రవర్తించడంలో తప్పు లేదు. యవ్వనంలో ఉన్న కొడుకు సర్వాంగ సుందరియైన పూర్ణిమపై మనసు పడటం ఆమెకు కొత్తగా అనిపించలేదు. దిగి వచ్చిన రతీదేవి అని కథకుడు అంటాడు. కొద్ది మాటల్లోనే జమీందారు స్వభావాన్ని కళ్ళకు కట్టేలా చేశాడు.

## శివుడు

ఇతడు పూర్ణిమ మేనత్త కొడుకు చదువుసంధ్యలు లేవు. శరీర పుష్టి ఉంది. జమీందారు గారి పొలం పనులు చేస్తుంటాడు. మేనమామ ఇంటికి తరచూ రాకపోకలు సాగిస్తుంటాడు. అతనిపై పూర్ణిమకు మనస్సు ఉందో లేదో రచయిత స్పష్టంగా చెప్పడు. “వాడికి ఇష్టం బాబయ్య” అనటం మరో అర్థానికి దారి తీస్తుంది. కానీ వెంటనే మా అత్త కొడుకేగా అంటుంది. అంటే ఇష్టపడుతున్నట్లా? ఉదాసీన భావమా? పరిణత మనస్కురాలు కాదా? తానొక నిర్ణయం తీసుకోలేదా? అనే సందేహం వస్తుంది. ఇక్కడ కథకుడు వారిద్దరి మధ్య ఒక సన్నివేశ కల్పన చేశాడు. ఇది కథ ఎలా ముగుస్తుందో అనే ఉత్కంఠకు తెర తీస్తుంది. ఒకరోజు పొలం పనులు చేస్తున్న బావ వద్దకు పూర్ణిమ అన్నం తీసుకెళ్తుంది. శివుడి మాటల్లో వివాహానికి ఆదుర్దా కనిపిస్తుంది. ఆవిడ చేతితో అందించిన అన్నం ముద్దలు తిన్నాడు. తానూ రెండు ముద్దలు ఆమె నోట్లో పెట్టాడు. ఆమె స్పష్టంగా “లగ్గం అయ్యేదాకా దూరంగా ఉందాం” అని చెప్పింది. అంటే పెళ్ళి చేసుకోవటం ఇష్టమేగా! మరి కథ అనూహ్యంగా మరో మలుపు తిరిగింది.

## సాత్యకి

అతడు రామాలయంలోని అర్చకుని కొడుకు. సంప్రదాయ సిద్ధంగా వస్తున్న కుటుంబం వారిది. తండ్రి రామచంద్ర ఘనాపాఠి. తండ్రికి సేవలు చేసే స్వభావం కుమారునిది. ఆ ఆలయానికి వంశపారంపర్య ధర్మకర్త జమీందారు చంద్రసేన. ఈ కథలో పీట ముడిలా జమీందారుగారిపై ఆధారపడిన రెండు కుటుంబాలు కనిపిస్తాయి.

1.ఆ సంస్థానంలో పనిచేసే నరసింహ.

2. ఆ సంస్థానానికే చెందిన ఆలయంలో అర్చకుని కొడుకు సాత్యకి. సాత్యకి కె. విశ్వనాథ్ కథల్లో అమాయకంగా కనిపించే ఒక పాత్ర. అతనికి కట్టుబాట్లు తెంచుకొని సమాజానికి దూరంగానైనా వెళ్ళిపోవాలనే మనస్తత్వం. అనూహ్యంగా బొడ్లో దోపుకున్న మాంగళ్యాన్ని పూర్ణిమ మెడలో కడతాడు. ఆమె ఆశ్చర్య పోతుంది. వ్యతిరేకించ లేదు. ఇద్దరూ కలిసి చేతులు జోడించి ఆలయంలో ఉన్న రామచంద్రమూర్తికి నమస్కరిస్తారు. ఇది సమాజవిరుద్ధం. కులాల అంతరాలు పాటిస్తూ వస్తున్న ఈ సమాజం దాన్ని అంగీకరించదు. కానీ కథకుడు చివరి వాక్యంగా "వెనుక నుండి ఎవరో ఆలయ గంట మ్రోగించారు" అనడం ఇది దైవ నిర్ణయం అనటానికి ఉదాహరణ.

## పూర్ణిమ

ప్రధాన పాత్ర పూర్ణిమ. ఈమెకు భగవంతుడు అందచందాలు ఇచ్చాడు. రతీదేవిలా ఉంటుంది. ఆమెకంటూ స్వతంత్ర నిర్ణయాలు లేవు. తన జీవితాన్ని దైవం ఎలా మలుపు తిప్పితే అలా సాగిద్దామని అనుకొని ఉండవచ్చు. తాను భోగభాగ్యాలను కోరుకొని ఉంటే వివాహానికి చంద్రసేన ప్రతిపాదించినప్పుడు మౌనంగా తల ఊపి ఉండవచ్చు. ఆమె అలా చేయలేదు. ఆమె జమీందారిణిగా హోదాలు కోరుకోలేదు, తొందరపడలేదు.

తన బావ తనపట్ల చూపిన ప్రేమాదరణాలకు మౌనసాక్షిగానే ఉండిపోయింది. తల్లిదండ్రులకు ఇష్టమైన ఆ వివాహాన్ని చేసుకొని ఉంటే సర్వసాధారణమైన జీవితాన్ని ఆమె గడిపి ఉండేది. కానీ భగవంతుడు అలా రాయలేదు.

సాత్యకి మొదటినుండి తనపట్ల చూపుతున్న మమకారాన్ని అర్థం చేసుకోలేని అమాయకురాలు ఏమీ కాదు. "నువ్వు గంధర్వకన్యలా ఉంటా"వన్నప్పుడు, "నిన్నే పెళ్ళాడతాను" అన్నప్పుడు "తప్పు, తప్పు. మీకు మేము సరిరాము" అంది. చివరగా "ఆ రామచంద్రుడి ఇష్టం ఎలా ఉంటే అలా జరుగుతుంది" అని తీర్మానించింది. చివరకు ఆ భగవంతుడి నిర్ణయమే ఫలించింది.

ఈ కథలో పాత్ర చిత్రణ సహజ స్వభావసిద్ధంగా ఉంది. ఏ పాత్రకు ఆ పాత్ర తమదైన శైలిలో మాట్లాడారు, ప్రవర్తించారు. మనసులో మాటను బయటపెట్టారు. దీనిని విస్తృతం చేస్తే ఒక పెద్ద సినిమా కథలాగా 'పూర్ణిమ' టైటిల్‌తో తీయవచ్చు అనిపిస్తుంది. శీర్షికను పెట్టడంలో రచయిత ఒక ప్రత్యేకతను చూపించారు. ఇందులో మూడు పాత్రలు.  మూడే మూడు పాత్రలతో కథ నడిచింది. ప్రధాన పాత్ర – పూర్ణిమ. ఈ కథకుని చాలా కథలలో స్త్రీలే ప్రధాన భూమిక నిర్వహించడం మనం గమనించాలి.  పడగనీడలో కాంతం, విమల, పూర్ణిమలో పూర్ణిమ, తలపుల తలపులో శాంత.

## తలపులతలుపు

శాంత భర్త ఆకస్మికంగా రోడ్డు ప్రమాదంలో చనిపోతాడు.  ఆయన బాగా సంపన్నుడు. కంపెనీ లాభాల బాటలో నడుస్తున్న సమయంలో అతడు అర్ధాంతరంగా వెళ్ళిపోయాడు. శాంత ఇప్పుడు ఒక అసహాయక స్త్రీ, నౌకర్లు, చాకర్లు, పూద్చలేని వెలితి ఆమెది. తాను విధవరాలు. ధనానికి లోటు లేదు. కానీ సమాజంలో ఒంటరి స్త్రీ. ఎలాంటి అసహజ సంఘటనలకు గురి కావాల్సి వస్తుందోనని ఎదురుచూచింది.

రంగనాథ్ శాంత భర్తకు అత్యంత సన్నిహితుడు. స్నేహితులు ఇద్దరూ ప్రయాణిస్తున్న కారు యాక్సిడెంట్‌కు గురి అయ్యింది. ముందు సీట్లో కూర్చున్న శాంత భర్త చనిపోయాడు. రంగనాథ్ మిగిలిపోయాడు. పరామర్శిద్దామని వచ్చిన రంగనాథ్ శాంతను ఓదార్చాడు. ఇదీ సహజమే కానీ అతనిలోని పురుష మనస్తత్వం మరి కొద్ది రోజులకు బయటపడింది. టెలిఫోన్‌లో వ్యంగ్యంగా మాట్లాడటం. రెండర్థాలు వచ్చేలా మాట్లాడటం చేశాడు.

ఒకరోజు తన మనసులో మాట బయటపెట్టి "నేను పెళ్ళి చేసుకుంటాను" అంటాడు. అతడు బ్రహ్మచారి కానీ శాంత తొందరపడలేదు. "నేను మళ్ళీ పెళ్ళి చేసుకోలేను" అని స్పష్టంగా చెప్పింది. ఇక్కడ రచయిత కథను మరో మలుపు తిప్పాడు.

"సువిధాహోం" అనే పేరుతో నిరాశ్రయులకు ఊతంగా ఒక సంస్థను ప్రారంభించే ఆలోచనను శాంత బయటపెట్టింది.

"డామిట్ కథ అడ్డం తిరిగింది" అనే గిరీశం అన్నట్లుగా రంగనాథ్ "విజయోస్తు" అని ఆశీర్వదిస్తాడు. ఈ కథలో పాత్రల మానసిక బలహీనత అద్భుతంగా చిత్రించబడింది.

సుధాకర్ శాంత కంపెనీలో ఫైనాన్సియల్ ఆఫీసర్. అపర చాణుక్యుడు. పందిని నందిని చేయగల సమర్థుడు. కంపెనీ లాభాల బాటలో నడిచేందుకు ఇంతకాలం పనిచేశాడు. అతడు కంపెనీలో నెంబర్ 2. ఒంటరిగా జీవిస్తున్న శాంతను లోబరచుకోవాలని ఒక పాచికను విసిరాడు. పశువుగా జీవించలేను అనుకుంటూ శాంత అతడి ఆలోచనకు అడ్డుకట్ట వేసింది. ఈ మూడు పాత్రలను విశ్లేషించినప్పుడు శాంత ఎలా ప్రవర్తించిందో అనే విశ్లేషణ కలుగుతుంది. ఆమెకు సిరిసంపదలు, ఐశ్వర్యాన్ని ఇచ్చినా భగవంతుడు భర్త ఆకస్మిక మరణంతో ఒక్కసారిగా నిస్పృహకు గురిచేసేలా చేశాడు. కంపెనీ వ్యవహారాలు కొనసాగించక తప్పలేదు. పురుషాధిక్య సమాజంలో జీవిస్తూ వారి బలహీన మానసిక ప్రవృత్తులకు లోబడకుండా ఆమె స్వతంత్ర నిర్ణయం తీసుకోగల సమర్థురాలు. అందుకే

తనవంటి నిస్సహాయులకు తోడునీడగా నిలిచే ఒక 'సువిధా హోం' నిర్వహించాలని, కంపెనీ లాభాలు దానికి ఉపయోగించాలని తీర్మానించుకుంది. ఇక్కడ కథకుడు తనకున్న పాండిత్యాన్ని ఒక శ్లోకంలో వివరించాడు.

**'నిరాశ్రయే నశోభంతే**

**కవితా వనితా లతా'**

ఇది బాగా ప్రసిద్ధమైన శ్లోకం. కవిత్వం, వనితా, లతా ఆధారం లేకుండా జీవించలేరని అర్థం. అలాంటి వారికి ఆధారంగా 'సువిదా హోం' ఏర్పాటు చేసింది శాంత. సమాజ ప్రలోభాలకు లొంగిపోకుండా స్వతంత్రంగా తమ కాళ్లపై తాము నిలబడి తుచ్ఛమైన కామవాంఛలకు లొంగకుండా ఇతరులకు కూడా సహాయపడే తత్త్వంగల స్త్రీలు ఈనాటి సమాజానికి అవసరమని రచయిత సూచించాడు.

## 2.17 కథాకథన కుతూహలం

అనంతపద్మనాభరావు రచించిన 41 కథలలో రచనా శిల్పాన్ని గురించి ఇలా విశ్లేషించవచ్చు.

ఏ కథకుడైనా తన రచనలలో ఒక నూతనతను, విశిష్టతను ప్రదర్శించాలని ప్రయత్నిస్తాడు. విశిష్ట కథారచయితల రచనాశైలి ప్రభావం వారిపై ఉంటుంది. వారపత్రికలకు రచనలు చేసేటప్పుడు ఆ పాఠకుల నాడిని పట్టుకునే ప్రయత్నం చేస్తారు. ఈ నేపథ్యంలో వీరి కథలలో భిన్నత్వాన్ని పరిశీలిద్దాం.

1. కథాకథన శైలి.

2. ఇతివృత్త స్వీకరణ.

3. పాత్ర చిత్రణ.

4. సంభాషణా నిర్వహణ.

5. ఉత్కంఠ రేపడం.

ఈ ఐదు అంశాలను పరిగణలోకి తీసుకొని తైపారు వేసి చూస్తే ఈ క్రింది అంశాలు స్పృశిస్తాయి.

## 2.17.1 కథాకథన శైలి

ప్రాచీన సాహిత్యంపై పట్టు సాధించిన ఈ రచయిత తన సాహిత్య పరిజ్ఞానాన్ని అనేక కథలలో ప్రదర్శించారు. వేగంగా కథను నడపడం అనేది ఒక శిల్పం. కథా కమామీషూ గ్రంథంలో రచయిత ముందుమాటలో ఇలా చెప్పారు.

"ఆఫీసులో ఇంటా, బయట కథలు చెప్పడం అందరికీ అలవాటు"[21]. చిన్న పిల్లల్ని పడుకోబెట్టడానికి కథలు చెబుతాం. ఆఫీసర్ కోప్పడితే ఎన్నో కథలు చెబుతాం. ఆలస్యంగా ఇంటికి వచ్చినందుకేదో కథ. అబద్దాల గోపురాలు కథలు. కల్పిత ప్రధానమైనవి కథలు. కాని కలం పట్టుకొని కథలు రాయడం ఒక కళ. మరో విషయం కథ అనే ప్రక్రియలో ఉంటుంది. కథను మలిచే తీరుని బట్టే ప్రక్రియలుంటాయి. నవల చదివి కథ చెబుతాం. నాటకం చూసి కథ చెబుతాం. కథానిక ఒక సంపూర్ణ ప్రక్రియ. మనచుట్టూ ఉన్న సమాజాన్ని విశ్లేషిస్తుంది. మాట్లాడుకొనే భాషలో ప్రత్యేక శిల్పంతో ఉంటుంది. క్లుప్తత, స్పష్టత ప్రధానం. ఉపోద్ఘాతాలు, వర్ణనలు లేకుండా ప్రారంభమవుతుంది. చదివే సమయం కన్నా, ముగించిన తర్వాత ఆలోచింపజేసే సమయం ఎక్కువ. మెదడుకి పదను పెడుతుంది కథానిక.

---

21 కథాకమామీషూ – అనంత పద్మనాభరావు – 2013, పుట: 6.

"కథను మలచటంలో ఆయన ఒక ప్రత్యేక శైలిని ఎంచుకున్నారు. చిన్న చిన్న వాక్యాలలో భావస్ఫూరకంగా కథను నడిపాడు. ఇందుకు అనేక ఉదాహరణలు చూపించవచ్చు ఆదర్శం కథలో"[22].

"నిజానికి రంగనాథం అభినవ ద్రోణుడు. ఇప్పుడు రంగనాథం బడిపంతులు గాదు. మంత్రిగారి ఆప్తుడు. ఎందరికో తన చేతి మీదుగా సహాయంచేసి పెడుతున్నాడు. అదృష్టం పండి జాతక పురుషుడయ్యాడు. లంచం తీసుకోని రంగనాధాన్ని వెర్రిబాగులవాడి కింద జమగట్టిందీ లోకం".

ఈ వాక్యాలలో రచయిత తనకున్న పురాణ పరిజ్ఞానాన్ని కథలో చూపించారు. ఈ కథ భారతంలోని ద్రుపద, ద్రోణుల వైరం వంటిది. భారతంలోని కథలో ద్రుపదుడు రాజయ్యాడు. ద్రోణుడు పేద బ్రాహ్మణుడిగా ఒక గోవును దానం చేయమని అడగటానికి ద్రుపదుని వద్దకు వెళతాడు. అతడు ద్రోణుడిని తిరస్కార భావంతో చూస్తాడు. మనకు సఖ్యత ఎలా కుదురుతుందని ఈసడిస్తాడు.

**"సమశీల శ్రుతయుతులకు**
**సమధనవంతులకు సమసుచారిత్రులకున్**
**దమలో సఖ్యమును వివా**
**హము నగుఁగా కగునె రెండు నసమానులకున్"**[23]

సఖ్యము సమానులతోనే ఉంటుందని ద్రుపదుడు ఎద్దేవా చేశాడు. ద్రోణుడు గురుదక్షిణగా ద్రుపదుని పట్టి తెమ్మని అర్జునుని పురమాయించాడు. కసి తీర్చుకునేందుకు ద్రోణుడు ద్రుపదుని చూసి పరిహసించాడు.

---

[22] కథాకమామీషూ – అనంత పద్మనాభరావు – 2013, పుట: 49.

[23] ఆంధ్ర మహాభారతం – నన్నయ్య, ఆదిపర్వం, 5వ ఆశ్వాసం, పద్యం: 205.

"వీరెవ్వరయ్య ద్రుపద మ

హారాజులె యిట్లు కృపణులయి పట్టువడన్

వీరికి వలసెనె యహహ య

హారాజ్యమదాంధకార మది వాసెనొకో"[24]

ఈ కథలో రాజశేఖరం (ద్రుపదుడు), రంగనాథం (ద్రోణుడు) ఇద్దరూ స్కూల్ ఫైనల్ వరకు కలిసి చదువుకున్నారు. రంగనాథం సెకండరీ గ్రేడ్ టీచర్ అయ్యాడు. రాజశేఖరం జిల్లా పరిషత్ చైర్మన్ అయ్యాడు. రాజశేఖరాన్ని చూడటానికి వెళ్ళిన రంగనాధానికి అవమానం ఎదురైంది. కొన్నాళ్లకు రంగనాథం మంత్రిగారి పి.ఏ. అయ్యాడు. రాజశేఖరం తన కుమార్తెను మంత్రికిచ్చి పెళ్ళి చేశాడు. పి.ఏ.గా ఉన్న రంగనాధాన్ని తీసివేయమని అల్లుని కోరాడు. అల్లుడు తిరస్కరిస్తాడు. ఇది ఆదర్శంగా రచయిత చెప్పాడు. బండ్లు ఓడలు, ఓడలు బండ్లు అవుతాయనడానికి ఒక నిదర్శనం. పురాణాలలో ప్రసిద్ధంగా ఉన్న కథను తీసుకొని ఈ విధంగా ఆధునిక కాలానికి సరిపడేలా మలచటం ఒక వినూత్న ప్రక్రియ.

## దేవయాని

మహాభారతంలోని యయాతి చరిత్ర ప్రసిద్ధం. దేవయాని ఈ కథలో ప్రధాన పాత్ర. కచదేవయానుల వృత్తాంతాన్ని నన్నయభట్టు అద్భుతంగా చిత్రించాడు. దేవయాని కచునిని ప్రేమించింది. నీవు గురుపుత్రివని అతడు తిరస్కరించాడు. శర్మిష్ట రాచబిడ్డ. దేవయాని గురుపుత్రి. దేవయానిని శర్మిష్ట బావిలో పడవేసింది. ఆ దారినా వెళుతున్న యయాతి మహారాజు ఆమెకు చెయ్యి అందించి ఉద్దరించాడు. నీవు పాణిగ్రహం చేశావు కాబట్టి నన్ను వివాహం చేసుకోమ్మని ఆమె బలవంతపెట్టింది.

---

[24] ఆంధ్ర మహాభారతం – నన్నయ్య, ఆదిపర్వం, 6వ ఆశ్వాసం, పద్యం: 90.

ఉ. “నిగ్రహమేది నన్ను ధరణిప్రభకూపము వెల్వరించు నా
దుగ్రమయూఖ సాక్ష్యముగ నున్నతదక్షిణపాణి జేసి భూ
పాగ్రణినాదు దక్షిణకరాగ్రము వట్టితి కానమున్న పా
ణి గ్రహణంబు సేసి తదినీయెడవిస్మృతి బొందబాడియే”[25]

“నన్ను వివాహమై నహుషనందన యీలలితాంగి దొట్టియీ
కన్నియలందఱున్ దివిజకన్యలతో నెనయైన వారు నీ
కున్నతి బ్రీతిసేయగ నృపోత్తమ వాసవు బోలి లీలతో
నిన్నరలోక భోగము లనేకము లందుము నీవు నావుడున్”

భారత కథలో మూడు ప్రధాన పాత్రలు. అవి. 1) దేవయాని, 2) శర్మిష్ఠ, 3) యయాతి. ఈ కథ మూడు పాత్రల చుట్టూ తిరుగుతుంటుంది. యయాతిని పెళ్ళాడిన దేవయాని తన పూర్వపు కసిని తీర్చుకునేందుకు శర్మిష్ఠను దాసిగా చేసుకుంటుంది. యయాతి, శర్మిష్ఠల సంపర్కం కథలో ముగింపు. ఈ నేపథ్యంలో దేవయాని కథను విశ్లేషించాలి. కదులుతున్న రైలులోకి హడావిడిగా ఎక్కింది దేవయాని. ఇక్కడ రచయిత పేరు కూడా మార్చలేదు. శర్మిష్ఠకు బదులు నర్మద అని యయాతికి బదులు వరుణ్ అని పేర్లు పెట్టారు. దేవయాని అని పెట్టడంతో భారత కథ చదివిన వారికి అది వెంటనే స్ఫురిస్తుంది. కదులుతున్న రైలులోకి హడావిడిగా ఎక్కుతున్న దేవయానికి వరుణ్ చేయి అందిస్తాడు. ఇందులో కచదేవయానుల

[25] ఆంధ్ర మహాభారతం – నన్నయ్య, ఆదిపర్వం, 3వ ఆశ్వాసం, పద్యం: 160, 161.

కథలు కూడా రచయిత వరుణ్ ద్వారా గుర్తు చేశారు. ఒక పద్యంలో ఒక పాదం కూడా ఉదాహరించారు. ఆ పద్యం ఇది:

ఉ. “వాడిమయూఖముల్ గలుగువాడపరాంబుధి గ్రుంకె ధేనువుల్
నేడిట వచ్చెనేకతమ నిష్టమెయిన్ భవదగ్నిహోత్రముల్
పోడిగ వేల్వగా బడియె బొద్దునుబోయె గచుండునేనియున్
రాడు వనంబులోనమృగ రాక్షస పన్నగ బాధనొందెనో”[26]

మూలకథలో దేవయాని తన తండ్రియైన శుక్రాచార్యుని వద్దకు విద్యలు నేర్చుకోవడానికి వచ్చిన కచుని ప్రేమించింది. అతడు గురుపుత్రివని సున్నితంగా తిరస్కరించాడు అచ్చు అలానే ఈ కథలో దేవయాని తన తండ్రి ప్రొఫెసర్ వద్దకు వచ్చిన శిష్యుని ప్రేమించి తిరస్కరించబడింది –

“నేను నిన్ను ఆ దృష్టితో చూడలేదు. నీవు గురుపుత్రివి అని వెళ్ళిపోయాడతను. కన్నీళ్ల పర్యంతం అయిందావిడ”[27]. అక్కడ యయాతి లాగానే వరుణ్‌ని దేవయాని పెళ్లాడింది. అక్కడ దేవయాని శర్మిష్టను దాసిగా తెచ్చుకుంది.ఇక్కడ ఒక పెద్ద కంపెనీ యజమాని అయిన తన భర్త కంపెనీలో తన స్నేహితురాలు, నర్మదకు ఉద్యోగం ఇప్పిస్తుంది. దేవయాని తన హోదా, తన అహంభావము ఆమెపై ప్రదర్శిస్తుంది. ఆమెను కంపెనీ గెట్‌టూగెదర్‌లో (get together) అవమానిస్తుంది. భారత కథలో వలె ఇక్కడ ముగింపు నర్మద వరుణ్‌ల సమాగమంతో ముగుస్తుంది.

[26] ఆంధ్ర మహాభారతం – నన్నయ్య, ఆదిపర్వం, 3వ ఆశ్వాసం, పద్యం: 112.

[27] గోరింట పూచింది – అనంత పద్మనాభరావు, పుట: 51.

**వట్టిరాకపోకలొనర్చె వానిసతియు**

పింగళి సూరన కళాపూర్ణోదయంలో సుగాత్రీ, శాలీనుల కథ బాగా ప్రసిద్ధం. వారిది విలక్షణ దాంపత్యం మానవ మనస్తత్వం (హ్యూమన్ సైకాలజీ) ఆధారంగా ఈ కథను ఆధునిక ధోరణిలో కథా రచయిత మలిచారు. మూలంలో ఒక పద్యం ఉన్నది.

**తే.** **"అనిపలికి, రెండు మూడు నాళ్ళట్లయనిపె**

**నల్లునొద్దకు బుత్రిక, నపుడతండు**

**నాది నే భావమున జూచె, నట్ల చూచె**

**వట్టిరాకపోకలొనర్చెవానిసతియు"**[28]

ఈ కథలో సుగాత్రి పేరు అలానే ఉంచారు. శాలీనుడి పేరును శాలివాహునుడిగా మార్చాడు. మూలకథలో ఏ విధమైన మార్పు చేయలేదు. అల్లునిచేత తోటపని చేయించటం, చెలికత్తెల సరసాలు, అత్తగారి వ్యంగ్యోక్తులు మధ్య మధ్యలో యథాతథంగా ఉంచారు. చివరి సన్నివేశంలోశివాలయానికి వెళ్ళి ఆమె దర్శనం చేసుకోవడం, గౌరీ మాతకు మొక్కటం ఇందులో విశేషం.

"మనసులో ఏదో శంక. సుగాత్రి హడావిడిగా తోటకు బయలుదేరింది."[29] తల్లికి మాట మాత్రం చెప్పలేదు. దారిలో శివాలయంలోకి వెళ్లి అలవాటుగా మూడు ప్రదక్షిణలు వానలోనే పూర్తి చేసింది. నందీశ్వరుని మూపురం తాకి శివలింగ దర్శనం చేసుకొంది. పక్కనే ఉన్న గౌరీ మాత విగ్రహానికి దండ ప్రణామం చేసింది. "సమస్త జగత్తుకు కళ్యాణాన్ని ప్రసాదించే ఓ గౌరీ! నీ దయ ఉంటే మా దాంపత్యం సుఖమంతమవుతుంది. నా

---

[28] కళాపూర్ణోదయం – పింగళి సూరన, పద్యం: 63.

[29] కథామందారం – అనంత పద్మనాభరావు, పుట: 93.

అందచందాలు ఆయనకు నచ్చడం లేదా? పరస్త్రీ సాంగత్యంలో ఆయన నన్ను నిర్లక్ష్యం చేస్తున్నారా? దేవీ నీ కటాక్షవీక్షణలతో మా కాపురం చక్కదిద్దు" అంటుంది.

మధ్యాహ్న నైవేద్యం పెట్టి అర్చక స్వామి గంటా వాదనం చేశారు". ఈ విధంగా రచయిత సందర్భానుసారంగా పురాణ కథలలోని గాధలను యువతకు అందించే ప్రయత్నం చేశారు. అదే విధంగా మృత్యుంజయ మంత్రాన్ని గీతా శ్లోకాలను అక్కడక్కడా సందర్భోచితంగా ఉటంకించారు. మూఢ నమ్మకం కాకపోయినా హిందూపురం దగ్గర విదురాశ్వత్థం వెళ్లి పిల్లలు లేనివారు నాగప్రతిష్ఠ చేస్తామని మొక్కుకుంటే పిల్లలు పుడతారని పాఠకులకు సూచించారు. 'నిరాశ్రయే నశోభంతే కవితా, వనితా, లతా' అనే సూక్తిని గుర్తు చేశారు. అదే విధంగా కేవల పురాణ గాధలనే కాక ఆధునికకాలంలోని మంచి పద్యాలను కూడా సందర్భోచితంగా వాడుకున్నారు. ప్రాచీన, ఆధునిక సాహిత్యంలోని మంచిని పంచాలని ఆయన అభిమతం.

"చంద్రసేనకు తెలుగు, సాహిత్యమంటే ఇష్టం. దువ్వూరి రామిరెడ్డి వనకుమారిని వర్ణించిన పద్యం గుర్తుకొచ్చింది. పూర్ణిమ నాగరికత తెలియని ముగ్ధ.

**'అరగౌర చీర అంసముల నంటియు నంటనిపైట చెంగె ఆ**
**తరుణికి లోకమిచ్చిన ఉదారపు నాగరకంబు, శేష సుం**
**దరత సమస్తమున్ ప్రకృతితానె యొసంగెను నాగరాంగనా**
**పరిచితమైన లజ్జ ఎటువంటిదొ కన్నె ఎరుంగ దింతకున్'**[30]

## కృష్ణ జన్మస్థానము

[30] కథామందారం – అనంత పద్మనాభరావు, పుట:18, 19.

ఇది భాగవతంలోని శ్రీకృష్ణ జననం గురించి పాఠకులకు ఆధునిక ధోరణిలో ఒక సినీ కథగా, ఒక పత్రిక (నవ్య పత్రిక) పోటీకి రాశారు. శ్రీకృష్ణుని జన్మస్థానం కారాగారము, ఆ కారాగారము ఇప్పుడు రాజకీయ నాయకులతోనూ, స్వామీజీలతోనూ నిండిపోతోంది. వ్యంగ్యంగా ఈ విషయాన్ని కొన్ని సన్నివేశాలతో కథను నడిపారు. ఈ సినీకథలో సినిమా ఫక్కీలోనే కథ నడుస్తుంది. భూలోకంలో కృష్ణుడి మందిరంలో జన్మాష్టమి వేడుకలు జరుగుతున్నాయి. అలానే మథురలోనూ, ద్వారకలోనూ కోలాహలంగా జన్మాష్టమి జరుపుతున్నారు. భాగవత కథ నేపథ్యంలో సాగిన ఇతివృత్తం కాబట్టి సన్నివేశ కల్పన కూడా అలానే సాగింది. అష్టమహిషీలు పరివేష్టించగా, సింహాసనంపై కూర్చొన్న కృష్ణుడు పక్కనే వోరగంట చూస్తూ నిలుచున్న రాధ అప్పుడే వచ్చిన నారదుడు ఇందులో పాత్రలుగా ప్రవేశపెట్టబడ్డారు. కృష్ణుడు ఆబోతులను జయించి నీలాదేవిని పరిణయం ఆడటం, నీలా సుందరీ పరిణయంలో ప్రధాన ఇతివృత్తం. శ్రీకృష్ణుని లీలా విశేషాలను స్పృశిస్తూ పోతనా సంహరణం, శకటాసురుని సంహరణం, తృణావర్త సంహరణం, గోవర్ధనగిరి ధారణం, కాళీయమర్దనం, గజేంద్రమోక్షం, రాసలీలలు నారదుని నోట పలికించారు. వివిధ ప్రాంతాలలో జరిగే కృష్ణాష్టమి వేడుకలను ప్రస్తావించి కృష్ణ చైతన్యం ISCON ద్వారా ప్రచారం చేయటం రచయిత సూచించారు. తిరుపతిలోని ISCON మందిరంలోనూ, ఉడిపి కృష్ణ మందిరంలోనూ, గురువాయూరు కృష్ణ మందిరంలోనూ జరిగే వేడుకలను ప్రస్తావించారు. ఇంతవరకు జరిగిన కథ ప్రాచీన కథా సమాహారం.

ఇందులో కొత్తమలుపు ఆధునిక సమాజాన్ని పట్టి పీడిస్తున్న రుగ్మతలను ఎత్తి చూపటం. హస్తినాపురంలో తీహార్ జైలు ఉన్నది. అలానే మరిన్ని ముఖ్య పట్టణాలలోనూ చంచల్‌గూడ  జైళ్లు ఉన్నాయి. ఆధునిక భారతంలో స్వాతంత్ర్యోద్యమ కాలంలో పాల్గొన్న రాజకీయ నాయకులకు జైలు నుండి బయటకు వచ్చినప్పుడు ఘనంగా స్వాగత సత్కారాలు జరిగేవి. ఇప్పుడు వివిధ పార్టీల నాయకులు జైలునుండి బయటకు వస్తుంటే పార్టీ జెండాలు

పట్టుకొని కార్యకర్తలు స్వాగతిస్తున్నారు. ఒక యువనేత జైలునుండి బయటకు వస్తున్న సన్నివేశంలో ఆంధ్రప్రదేశ్‌లో ఇటీవల ఒక పార్టీకి చెందిన యువనేత బెయిల్‌పై విడుదల కావటం వ్యంగ్యంగా చూచించారు. వసుదేవుడు గాడిద కాలు పట్టుకున్నాడని, ఈనాటి రాజకీయ వసుదేవుళ్ళు అడ్డమైన గాడిదల కాళ్ళు పట్టుకోవడం తప్పటం లేదని నారదుని చేత రచయిత వ్యంగ్యాస్త్రాలు సంధించారు.

వివిధ ప్రదేశాలలో స్వామీజీల ముసుగులో శిష్యురాండ్లపై అత్యాచారం చేసిన అభియోగంపై కారాగారంలో ఉన్న స్వామీజీల ఉదంతాలను రాజస్థాన్ జైలు అనే సన్నివేశంలో చెప్పారు. డేరాబాబా ఉదంతాన్ని, తమిళనాడులో మరో స్వామీజీ నిత్యానందస్వామిని గుర్తుకు చేశారు.

"నారదా! కృష్ణ జన్మస్థాన గౌరవాన్ని చెడగొడుతున్నారు" అని కృష్ణునిచేత పలికిస్తారు. "పత్రికల్లో, ఛానళ్లలో దాని ఖ్యాతి పెంచుకున్నారు స్వామీ!" అని నారదుని చేత పలికించి ప్రస్తుత ప్రసార మాధ్యమాల దుస్థితిని వర్ణించారు. మరో సన్నివేశంలో బీహార్ ముఖ్యమంత్రిగా పనిచేసిన లాలూ ప్రసాద్ యాదవ్ గడ్డి కరవటాన్ని ఉటంకించారు. మరోక చోట ఐ.ఎ.యస్ అధికారిణి అయిన శ్రీలక్ష్మి జైలుకు వెళ్ళటం సూచించారు. చివరగా దేవాలయంలో అర్చకుడు నగలు అపహరించడమనే వాస్తవ చిత్రణను సన్నివేశంగా మలిచారు. ఈ ఉదంతం తిరుపతిలోని శ్రీ కోదండ రామస్వామి ఆలయంలో వాస్తవంగా కొన్నేళ్ళ కిందట జరిగింది. తన కుమార్తె వివాహం కోసం అక్కడ ప్రధానార్చకుడు స్వామి వారి నగలను కుదువ పెట్టాడు. నిజం బయటపడి జైలుపాలయ్యాడు. ఇది హృదయాన్ని కదిలించే సన్నివేశం ఈ విధంగా కథాకథనంలో తనదైన శైలినీ రచయిత ప్రదర్శించారు.

## 2.18 ఇతివృత్త స్వీకరణ

కథకు మూలబలం ఇతివృత్తం. పునాది గట్టిగా ఉంటే భవనం అందంగా, సుందరంగా, శాశ్వతంగా నిలుస్తుంది. కథకు బీజ ప్రాయమైన ఇతివృత్తాన్ని స్వీకరించడంలోనే రచయిత పడే శ్రమ ఆధారపడి ఉంటుంది. దాదాపు 40 కథలలో వివిధ నేపథ్యాలుగల ఇతివృత్తాలను రచయిత ఎంచుకున్నారు. వీటిని ఇలా వింగడించవచ్చు.

1) సామాజిక జీవనం.

2) కుటుంబ నేపథ్యం.

3) యువత దృష్టి.

4)వృద్ధాప్య సమస్యలు.

5) హాస్యస్ఫోరక సంఘటనలు.

### 2.18.1 సామాజిక జీవనం

1. కవి సమాజంలో జీవిస్తాడు. కథకుడైనా అంతే, తన పరిసర వాతావరణాన్ని తాను పెరిగిన ప్రదేశాలను అతడు మరచిపోలేడు. సంప్రదాయ కుటుంబంలో జన్మించి, తాను నమ్ముకున్న సిద్ధాంతాలకు అనుగుణంగా జీవనం కొనసాగిస్తారు కొందరు. ఆ ఇతివృత్తాన్ని ఎంచుకొని 'అష్టోత్తరశతం' అనే కథను రాశారు.

   రామచంద్రమూర్తి నిష్టాగరిష్ఠుడు. నిత్యం గాయత్రీ మంత్ర పఠనం చేస్తూ, గాయత్రీ మాతనే నమ్ముకుని రోజూ కనీసం 108 సార్లు 20 సంవత్సరాలుగా జపిస్తున్నాడు. 108 సంఖ్య ఆయనకు ఇష్టం. కథ అంతా 108 మీదే నడుస్తుంది. రామచంద్రమూర్తి రిటైర్ అయ్యాడు. ఆరోగ్యం క్షీణిస్తుంది. ఒక అర్థరాత్రి ఎడమ వైపు

ఛాతీ నొప్పి వచ్చింది. 108పై నమ్మకం ఉన్న రామచంద్రమూర్తికి 108 అంబులెన్స్ దిక్కైంది. ఈ కథలో కొందరి విశ్వాసాలు, కొందరి నమ్మకాలు ఎలా పరిణమిస్తాయో రచయిత సూచించారు.

2. 'విధి నిర్వహణ' కథలో పెళ్ళిచూపులలో అనుకూలించని పార్వతి తనను కాదని వెళ్ళిన సుందరం తనవద్దనే టీచర్‌గా చేరడానికి వచ్చినప్పుడు కసి తీర్చుకుంటుంది. ఇది ప్రముఖ వారపత్రిక. ఆంధ్రపత్రికలో వచ్చిన రచయిత తొలి కథ. ఏవో కారణాలను సాకుగా చూపి కట్నకానుకల విషయంలో చాలా వివాహాలు ముడిపడవు. ఆ ఇతివృత్తాన్ని రచయిత ఈ కథలో చూపించారు.

3. మరో కథ 'ఎవరు త్యాగశీలి?' ఈ కథలో శోభన్ బాబు సినిమాలోలాగా ఇద్దరు నాయికలు, ఒక నాయకుడు. జయలక్ష్మి, సరోజ ఇందులో పాత్రలు. హీరో శేఖర్. ఒక ఉత్తరం ద్వారా కథనంతా నడిపారు. సమాజంలో ఇలాంటి సందర్భాలు సర్వ సాధారణంగా జరుగుతాయి. కుటుంబ కారణాలవల్ల పెద్దల వొత్తిడి వల్ల తాను ప్రేమించిన వ్యక్తిని వివాహం ఆడలేకపోతాడు. ఈ కథలో ముగింపు అనూహ్యంగా ఉత్కంఠ భరితంగా ఉంది.

ఈ ధోరణిలోనే సాగిన కథ 'పాపం భారతి'[31]. "వేకువ జామున 4.00 గంటలకు అలారం మోతతో శేఖర్ లేచాడు. సరోజ పక్కన కనిపించలేదు. ఉత్తరంతో పాటు ఫోటో కూడా శేఖర్ కంటబడ్డాయి. శేఖర్ మెదడు పనిచేయటం మానేసింది. అటు జయలక్ష్మికి ఇటు సరోజకు ద్రోహం చేశానన్న భయం పిచ్చెక్కించినంత పని చేసింది. సరోజకై చెరువులు, బావులు వెతికించాడు. సరోజ ఆత్మహత్య చేసుకుంటుందని నమ్మలేకపోయాడు. రెండు మూడు రోజుల్లో జయలక్ష్మితో పాటు

---

[31] కథాకమామీషూ – అనంత పద్మనాభరావు, పుట: 43.

సరోజ యింటికి తిరిగివచ్చింది”. ఈ కథలో సరోజ ఆత్మహత్యకు పాల్పడిందని పాఠకుడు ఊహిస్తాడు. అందుకు భిన్నంగా జయలక్ష్మితో సరోజ రావటం సుఖాంతంగా కథను ముగించినట్టుగా ఉంటుంది.

4. కార్యాలయాల్లో బంట్రోతు ఒక యంత్రంలో ప్రధాన మర లాంటివాడు. నరసింహులు అనే పాత్ర ద్వారా రచయిత వరుసగా మూడు కథలు రాశారు. 1) మాకూ ఉన్నాయి స్వగతాలు, 2) పాపం నరసింహులు, 3) ఆత్మాభిమానం – ఈ కోవలోనివే.

కలెక్టరు బంట్రోతుకు సమాజంలో ఒక ప్రత్యేకస్థానం ఉంది. అతడు వంగి, వంగి నడుస్తున్నా అతడిలో దర్పం, ఆత్మాభిమానం కొట్టొచ్చినట్లుగా కనిపిస్తాయి. అహం దెబ్బతింటే అతడు సహించలేడు. ఇది సహజంగా చిత్రించారు రచయిత. సమాజంలో భర్తను కోల్పోయిన స్త్రీ ఒంటరిగా జీవించడం ఎంత కష్టమో తెలియజేసే కథ ‘తలపుల తలుపులు’. ‘తలలు బోడులయిన తలుపులు బోడులా’ అనే ఒక పాత సామెత ఉంది. దానికి విరుద్ధంగా ఈ కథను మలిచారు.

చదువుతో సంబంధం లేకుండా రాజకీయాలలో ఉన్నత స్థానాన్ని నేడు చాలామంది పొందుతున్నారు. దానికి నిదర్శనంగా ‘ముఖ్య అతిథి’ కథను మలిచారు.

రాజకీయాలలో ఎన్నికలు ప్రధాన ఘట్టం. అవి సమాజాన్ని బాగా ప్రభావితం చేస్తాయి. ‘ఎన్నికల పాపం’ అనే కథలో సమాజంలో జరుగుతున్న అనేకానేక విపరీత ధోరణులను రచయిత ఈ కథలో చిత్రించారు.

బాగా బతికి చెడిపోయిన వ్యక్తులు సమాజంలో మనకు తారసపడుతుంటారు. వారు సిరి సంపదలతో తులతూగుతున్నప్పుడు అందరూ వారి చుట్టూ చేరుతారు. కాలం కలిసి రానప్పుడు వీధి కుక్కలా తరిమి కొడతారు. ‘కాలం కరచిన కడపట’ కథ ఇందుకు ఉదాహరణ.

### 2.18.2 కుటుంబ నేపథ్యం

ఏ కథా రచయిత అయినా తమ కుటుంబ వాతావరణాన్ని సమాజంలోని కుటుంబ వ్యవస్థను మరచిపోలేదు. ఆధునిక సమాజంలో వెర్రి తలలు వేస్తున్న నేటి కుటుంబ జీవనం గురించి కవి అయినా, కథకుడైనా, నాటకకర్తయైనా తనదైన ధోరణిలో సన్నివేశ కల్పన చేస్తారు. సంపన్నులతో పాటు నిర్భాగ్యులు కూడా బతుకుతున్న ఈ సమాజంలో ఎవరి విలువలు వారివి. కుటుంబాన్ని ఒక మూల స్తంభంగా భావించి దానిచుట్టూ పరిభ్రమించే వాతావరణాన్ని సృష్టించుకుంటారు.

ఈ రచయిత దృష్టిలో కుటుంబ వ్యవస్థ ఒక మహోన్నత వటవృక్షం లాంటిది అది పది మందికి నీడ కలిపిస్తుంది. శాఖోపశాఖలుగా విస్తరించి తన చల్లగాలితో సేద తీరుస్తుంది. పటిష్టమైన వేళ్ళూనుకున్న జవస్తత్వాలతో సమాజంలో పది మందికి ఉపయోగపడుతుంది. వ్యక్తిగత స్వార్థాలకు లోనుకాకుండా సమాజహితాన్ని కోరుకుంటుంది. ఈ నేపథ్యంలో రచయిత కొన్ని కథలు మలిచారు. 1) ఫ్యామిలీ కోర్టు, 2) పడగనీడ, 3) జగమొండి – ఈ ధోరణిలో సాగిన కథలు సినిమాలలాగానే కథలలోనూ అత్తా, కోడళ్ళ వైషమ్యం సాధారణంగా ప్రతిబింబిస్తుంది. 'ఫ్యామిలీ కోర్టు' కథలో అత్తగారు మాటలతో తన ప్రతాపాన్ని చూపిస్తుంది. అందుకు భిన్నంగా కోడలు అహంకారంతో తన కాపురంలో కలతలు తెచ్చుకుంటుంది. ఈ కథ నవ్య వారపత్రికలో వచ్చింది. ఈ కథను చదివిన తరువాత ప్రసిద్ధ కథా రచయిత ఎన్. తారకరామారావు రచయితకు ఫోను చేసి ముగింపు సమంజసంగా లేదని ఖరాఖండీగా చెప్పారు.

విపరీతమైన అహంకార ధోరణిలో కాంతి ఇల్లు విడిచి పోతుంది. పసిపిల్ల శిరీషను వదిలి వెళుతుంది. సుకుమార్ సున్నిత మనస్తత్వం కలవాడు. అత్తామామలు వారి వ్యక్తిగత జీవితంలోకి అడుగు పెట్టడం ఇష్టంలేక ఉదాసీనంగా ఉండిపోతారు. కాంతి విడాకుల నోటీసు

పంపించింది. ఫ్యామిలీ కోర్టులో కేసు నడిచింది. జడ్జి కౌన్సిలింగ్ మీదట కాంతి మనస్సు మార్చుకుంటుంది. ఆమె తన స్వానుభవాన్ని చెప్పి కాంతి మానసిక స్థితిని మార్చగలిగింది.

ముగింపు ఒక్కొక్క కథా రచయిత ఒక్కొక్క రకంగా మలుస్తారు. దీనికి రెండే పద్ధతులు ఉన్నాయి.

1. జడ్జి కేసు విచారణ చేసి విడాకులు ఇప్పించటం.

2. సుకుమార్ మళ్ళీ పెళ్ళి చేసుకోవటం లేదా కాంతి మళ్ళీ పెళ్ళి చేసుకోవటం.

విడాకులు తీసుకోకుండా కలిసిమెలసి జీవించటం: ఇదమిత్థంగా ముగింపు ఇలానే ఉండాలని ఎవరూ తీర్మానించ లేరు. అయితే “షటప్! వాట్ నాన్సెన్స్ యువార్ టాకింగ్” అని అరిచే స్వభావంగల కాంతి, ప్రతిదానికి అపర్థాలు తీసే కాంతి తన నిర్ణయానికి తల్లిదండ్రుల సపోర్టు కూడా ఉన్న కాంతి, తానే విడాకులకు ముందుకొచ్చిన కాంతి జడ్జి చెప్పిన మాటలకు తల ఊచి మళ్ళీ కాపురం చేస్తుందా? అనేది ఓ పెద్ద సందేహం. అయితే రచయిత లక్ష్యం హితోపదేశం చేయటమే కాబట్టి వాళ్ళను కలిపారు. ఆ కలపటం కొంత మంది పాఠకులకు రుచించకపోవచ్చు. అది వారి వారి స్వభావాల మీద ఆధారపడి ఉంటుంది. విడాకులిస్తే బాగుంటుందని కొందరనుకుంటే, కాంతి మళ్ళీ పెళ్ళి చేసుకుంటే బాగుంటుందని మరికొందరు అనుకుంటారు. సమాజంలో తమ తప్పును తామెరిగి క్షణికావేశాలకు, తాత్కాలిక ఉద్రిక్తతలకు లోనుకాకుండా సుదీర్ఘమైన కుటుంబ జీవనాన్ని కొనసాగించటం భారతీయ సనాతన సంప్రదాయంలోని మౌలిక అంశాలు. ఆ సంప్రదాయం పట్ల ప్రగాఢమైన నమ్మకం ఉన్న ఈ రచయిత ఈ కథకు ఇలా ముగింపు ఇవ్వడం సహజంగానే ఉన్నది. పాతతరం మనుషులకు కొత్తతరం మనుషులకు తరాల అంతరాలను అష్టోత్తరశతంలోచిత్రీకరించారు. వీడియోలో కనిపించిన కోడలు పొద్దుటే మొకాన బొట్టుపెట్టుకుంటే ఎంత బాగుండునో అనుకుంటుంది అత్తగారూ – సీత.

'గోరింట పూచింది' కథలో నూతన వధువు గృహప్రవేశం చేయటం సహజ వాతావరణంలో సాగింది. కుడికాలు ముందుపెట్టి ప్రవేశించమని కాలుతో బియ్యం కలశాన్ని తన్నమని పెళ్ళికూతురు రాధకు పురోహితుడు చెబుతాడు. నూతన వధూవరుల చేత పేర్లు చెప్పించటం అనే సంప్రదాయం ఉంది. అది ఈ కథలో చక్కగా చిత్రించారు. గోరింటాకు దాంపత్య చిహ్నం. భార్య కాళ్ళకు గోరింటాకు పూయాలని సరదా పడతాడు భర్త. కుటుంబ పెద్దలు ఇంట్లో తిరుగుతున్నప్పుడు అది బాగుండదని రాధ వారించినా, తల్లి అది చూసి శాపనార్థాలు పెట్టింది.

"తగుదునమ్మా అని తాను కూర్చోవడం, నువ్వు దాని కాళ్ళు పట్టుకోవడం, గోరింట పెట్టడం, ఏం చోద్యం రా: మా రోజుల్లో... అంటుంది. జానకమ్మ". సమిష్టి కుటుంబాలలో చిన్నా, పెద్దా అనే తేడాలున్నాయి. నేటి ఆధునికకాలానికి వాటి విలువలు తెలియదు. కుటుంబంలో ఇద్దరు అన్నదమ్ముల్లు తండ్రి ఆలనా పాలనా చూడటానికి ఏవో సాకులు చెప్పటం ఈ కథలో ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. రాధ వేణుగోపాల్ విడివిడిగా చెరొక ఊరిలో ఉండవలసి వస్తుంది. ఫోన్‌లో ఇద్దరూ రోజూ మాట్లాడుకోవటం, చిలిపి తగాదాలు పెట్టుకోవటం, ఆరోగ్యం జాగ్రత్తా అని ఉభయులు హెచ్చరిక చేసుకోవటం హృదయానికి సున్నితంగా తాకుతాయి. ఐ.సి.యూలో ఉన్న భార్య పాదాలకు హాస్పిటల్‌స్టర్ కంటపడకుండా గోరింటాకు రాధకు భర్త పూయడం ఒక హృదయ స్పందన కనిపించే సన్నివేశం.

'ఋణానుబంధరూపేణ' అనే కథలో రిటైరైన జానకిరామయ్యను కుమారులు పట్టించుకోకపోతే ఇరుగు పొరుగున ఉన్న శేషగిరి ఆదుకోవటం కుటుంబ నాడిని పట్టుకున్నట్లు అనిపిస్తుంది.

'కాంతాకనకాలు' అనే కథలో ప్రమోద్ తన కుటుంబం కంటే ఆఫీసు పనులు ముఖ్యమనుకుంటాడు. సంపాదన కోసం పరుగులు తీస్తాడు. భార్య మీద విపరీతమైన ప్రేమ.

ఈ కథలో సమాజంలో కుటుంబ వ్యవస్థలో మారుతున్న పరిణామాలను 'సుకర్ణో' ఇతివృత్తం ద్వారా రచయిత సూచించారు.

'కాలం కరిచిన కడపట' అనే కథలో కూడా కేవలం ధనం మీద ధ్యాసతో లోభిగా ఉన్న సూర్యనారాయణ కుటుంబ నేపథ్యాన్ని రచయిత వివరించారు.

'తలపుల తలుపులు' కథలో కుటుంబ వ్యవస్థలో ప్రధానమైన వ్యక్తి ఆకస్మికంగా మరణిస్తే ఒంటరి జీవితం గడిపే శాంత జీవితంలో కుటుంబ వ్యవస్థను సుస్పష్టం చేశారు. కుటుంబ విలువలకు ప్రాధాన్యం ఇచ్చిన శాంత తాను ఒంటరి జీవితం గడపటానికి సిద్ధపడి ఇతరుల చొరవను తిరస్కరిస్తుంది.

'వంశాంకురం' కథలో సంతానం కోసం విధురాశం వెళ్లడం జాతకాల మీద నమ్మకం పెట్టుకోవటం సహేతుకమేనా? అనిపించినా విశ్వాసాలకు సంబంధించిన అంశం అది.

'వట్టిరాకపోకలౌనర్చెవానిసతియు' అనే కథలో ఇల్లరికపు అల్లుని పట్ల అత్తగారి దృష్టి ఎలా ఉంటుందో కుటుంబంలో అతని స్థానం ఏమిటో సన్నివేశాలతో వర్ణించారు.

'జగమొండి' కథలో నాయనమ్మ సుగుణమ్మ ఇతరుల దృష్టిలో జగమొండి. కుటుంబ వ్యవస్థ మీద తనకు కొన్ని విశ్వాసాలు ఉన్నాయి. తాను పుట్టి పెరిగిన గ్రామంలో కంటే పట్టణంలో తన కుమారునికి చదువు బాగా సాగుతుందని తండ్రి కర్నూలుకు మకాం మారుస్తాడు. పిల్లలు పెరిగి పెద్దవాళ్లైనా ఆమె తాను గత కొంతకాలంగా తిరిగిన వాతావరణంలోనే ఉండిపోవాలనుకుంటుంది. కుటుంబ వ్యవస్థలో ఉండే పొరపొచ్చాలు, మాట పట్టింపులు, పడక పట్టింపులు భార్యాభర్తల మధ్య సహజమేనని సుగుణమ్మ సిద్ధాంతీకరిస్తుంది. పెళ్ళిచూపులు, కట్నకానుకల విషయంలో పేచీలు, కుటుంబ యజమానురాలిగా పట్టుదల ఈ కథలో సందేశాత్మకంగా చెప్పబడ్డాయి.

'ఫ్యామిలీ కోర్టు' కథలో అత్తాకోడలు, కొడుకు తండ్రి ఒక కుటుంబానికి నాలుగు స్తంభాల వంటివారు. నలుగురూ ప్రధానమే ఇందులో ఏ ఒక్క స్తంభం కదిలినా ఆ కుటుంబ భవనం కుప్ప కూలిపోతుంది. దానిని ప్రతిష్టం చేయడానికే జడ్జి లలితకుమారి తనదైన శైలిలో కోర్టు హాల్‌కు బయట తన ఆంతరంగిక గదిలో కాంతికి పొరలు కప్పిన కండ్లు విచ్చుకునేలా సలహా ఇచ్చింది. ఆ కుటుంబం ఒకటయింది.

### 2.18.3 యువత దృష్టి

పద్మనాభరావు కథల్లో రెండు ప్రధాన లక్షణాలు కనిపిస్తాయి. అవి 1) నేటి యువత, 2) వృద్ధాప్యంలో జీవనం సాగిస్తున్న వ్యక్తులు. ఈ రెండింటికి గ్రామీణ వాతావరణాన్ని పట్టణ వాతావరణాన్ని వాటి మధ్య తారతమ్య భేదాలను సన్నివేశాల ద్వారా రచయిత చిత్రీకరించుకుంటూ వెళ్ళారు.

'ఐయామ్ రియల్లీ సారీ' అనే కథలో రైలులో ప్రయాణం చేస్తున్న ఎదుటి స్త్రీని అంగాంగ పరీక్ష చేసే యువతకు ప్రతినిధిగా ప్రసాద్ కనిపిస్తాడు. అతని మాటల్లో, చూపుల్లో, చేష్టలలో, ఆలోచనలలో యువతలో పొంగు కనిపిస్తుంది. కానీ నేటి యువత స్వచ్ఛమైన ప్రవర్తన కలిగి ఉంటారు అనడానికి నిదర్శనంగా మనోరమ చైన్ కిందపడిపోతే తిరిగి ఆమెకు అప్పగిస్తాడు. అది జేబులో పెట్టుకోవాలని అనుకోడు. ఈనాటి యువత మనస్తత్వానికి నిజమైన ప్రతినిధి.

'విధి నిర్వహణ' కథలో సుందరం సర్వసాధారణమైన ఒక యువకుడు. కట్నకానుకల విషయంలో ఈనాటి యువతయే కాకుండా నాలుగు దశాబ్దాలకు ముందు యువకులు కూడా తల్లిదండ్రుల మాటలకు కట్టుబడి ఉండేవారు. ఫలితం పార్వతితో సుందరం వివాహం జరగలేదు. పశ్చాత్తాప హృదయంతో సుందరం పార్వతిని క్షమాపణ కోరుకుంటాడు.

'గూడు చెదిరిన పక్షులు' కథలో నేటి యువతకు తమ గ్రామాలపై ఉన్న మమతానురాగాలు చిత్రించబడ్డాయి.

‘ఎవరు త్యాగశీలి’ కథలో సరోజ నేటి సామాన్య యువతికి ప్రతినిధి. సమన్వయ ఔదార్యానికి నేటి సినిమా ఫక్కిలో శోభన్ బాబు – ఇద్దరు హీరోయిన్లు కథకు ఇది ఇమిటేషన్ లాంటిది.

‘ఆదర్శం’ కథలో స్నేహానికి విలువ తెలియని ఇద్దరు వ్యక్తుల కథ సన్నివేశాత్మకంగా చెప్పబడింది. పదవులు తెచ్చిన అహంకారం ఒకరినొకరిని దూరం చేశాయి.

మాకూ ఉన్నాయి స్వగతాలు, పాపం నరసింహులు, ఆత్మాభిమానం, కథలలో యువకులకు కలెక్టరు హోదా వచ్చినప్పుడు తమ కింది ఉద్యోగులను ఎలా చూస్తారో భిన్న సన్నివేశాలలో స్పష్టం చేశారు.

‘చెరువుగట్టు’ కథలో ముగ్గురు మిత్రుల అనుబంధాన్ని నేటి యువత ఎంత ప్రాణపదంగా చూసుకుంటారో చెప్పారు. మస్తాన్ తల్లికి రక్తం అవసరమైనప్పుడు ఎక్కించవలసినప్పుడు అంకిరెడ్డి ముందుకు రావటం ఆమె ప్రాణాలు కాపాడటం యువత విజ్ఞతకు నిదర్శనం.

‘కాంతాకనకాలు’ కథలో ఈనాటి సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు అహోరాత్రులు ధన సంపాదనపై ఆధారపడి బతుకు కొనసాగించటం చెప్పబడింది.

‘పూర్ణిమ’ కథలో నేటి యువతీ, యువకుల మానసిక స్థితిగతులకు పూర్ణిమ పాత్ర ఒక ప్రతిబింబం. ఆమె జీవితంలో ముగ్గురు తారసిల్లుతారు. ఒకరు జమీందారు, మరొకరు సొంత బావ, మరొకరు ఆలయ అర్చకుని  కుమారుడు. ఆమె ద్వైదీ భావంలో లేదు. మనస్సులో నేటి యువతివలె కొన్ని స్థిరమైన అభిప్రాయాలు ఉన్నాయి. వాటికి తోడు భగవంతుడి అనుగ్రహం అనే సెంటిమెంట్ ఉంది. ఫలితంగా ఆమె సాత్యకి చొరవను అంగీకరించి మాంగళ్యధారణకు తల వొగ్గింది.

‘సన్మానాలు చేయబడును’– ఈనాటి యువత విలువలకు ప్రాధాన్యాం ఇవ్వకుండా ఎలానో డబ్బు, కీర్తి సంపాదించాలనుకుంటారు. ఉద్యోగం లేకపోయినా సగర్వంగా ఏం చేస్తున్నారు అని అడిగితే “కన్సల్టెన్సీ నడుపుతున్నాననో లేదా రియల్ ఎస్టేటూ అని చెబుతారు”. వాటి

రెండింటికి ఒక స్థిర ఆదాయం ఉండదు. కానీ డాబుసరిగా తిరుగుతుంటారు. అలాంటి యువతకు ప్రతినిధి బాల్‌రాజు. చేస్తున్న ఉద్యోగం వదిలి స్వచ్ఛంద పదవీవిరమణ చేశాడు. సన్మానాలు చేయటం ఒక వృత్తిగా పెట్టుకున్నాడు. నాలుగు డబ్బులు సంపాదించటంతోపాటు సంఘంలో పలుకుబడి కూడా సాధించాడు. చివరకు తనకు గురువైన రఘునాథరావు సన్మాన విషయంలో కూడా అతనివద్ద రెండు నెలల పెన్షన్ డబ్బు తీసుకోవటమే కాక అతని ఇతర శిష్యుల వద్ద కూడా చందాలు వసూలు చేశాడు. యువత ఏవిధంగా తప్పటడుగులు వేస్తుందో ఈ కథ మనకు చెబుతుంది.

'పల్లె పిలిచింది'– విదేశాలలో స్థిరపడ్డ యువకులు తమకు వేళ్లవంటి గ్రామాలకు ప్రాధాన్యం ఇవ్వటం గురించి ఇందులో చెప్పబడింది.

## 2.18.4. వృద్ధాప్య సమస్యలు

పద్మనాభరావు కథలలో సామాజిక చిత్రణ, వాస్తవ స్థితిగతుల వర్ణన, వ్యక్తుల మనోభావాల విశ్లేషణ, భావ సంఘర్షణ, యదార్థ సంఘటనల సమాహారం, పురాణ కావ్య పరిచయం, పూర్వ గాథా సమన్వయం, మైత్రీ బంధము, అధికంగా కనిపిస్తాయి. ఒక్కొక్కసారి స్వానుభవాలేమో అన్నంత దగ్గరగా సన్నివేశాలు చిత్రిస్తారు. కథల పోటీలకు ఎక్కువ కథలు రాశారు కాబట్టి ఏదో ఒక కొత్తదనం చూపించాలనే భావంతో వాస్తవ చిత్రణకు కల్పన చేస్తారు. కథలలో పాత్రలు మన చుట్టూ తిరుగుతున్న, మనం నిత్యం చూస్తున్న వ్యక్తులుగా కనిపిస్తారు. ఒక పాత్రను పోలిన పాత్ర మరొకటి కనిపించదు. స్వభావాలు వేరు పరిసరాలు వేరు, పరిస్థితులు వేరు, సన్నివేశాలు వేరు, పాత్ర చిత్రణ వేరు, ముగింపు వేరు. ఇన్ని విశిష్టతల వల్ల వీరి కథలు పాఠకులను చదివింప చేస్తాయి. ఒక్కొక్కసారి ముగింపుతో మనం ఏకీభవించకపోవచ్చు. కానీ ప్రారంభం చేసిన తరువాత కథ సాంతం చదివింపజేస్తుంది.

'అష్టోత్తర శతం'– ఈ కథలో రామచంద్రమూర్తి, సీతాలు దంపతులు ఒంటరిగా జీవిస్తున్నారు. కొడుకులు ఇద్దరు అమెరికాలో ఉన్నారు. వీడియో పలకరింపులు తప్ప నేరుగా వచ్చి పలకరించే వారు కాదు. వృద్ధులకు సర్వసాధారణంగా సహకరించేది, ధైర్యాన్ని ఇచ్చేది దైవజ్ఞానం, పొరుగింటి కుర్రాళ్లు. ఈ కథలో రామచంద్రమూర్తి గాయత్రీ మంత్రాన్ని, భగవద్గీతను నమ్ముకున్నాడు. 108 సంఖ్య అతనికి ఇష్టం. హనుమాన్ చాలీసా చదివినా, చిలుకూరు దేవాలయానికి వెళ్ళినా, 108 సార్లు తప్పని సరి. చివరకు అతనికి 108 అంబులెన్స్ ఆధారమైంది. తొలి సంపుటి 'కథా కమామీషూ' కథలలో కొన్ని 1980కి పూర్వం రాసినవి కావటంవల్ల అందులో వృద్ధాప్య సమస్యలు తక్కువగా కనిపిస్తాయి.

'గోరింట పూచింది' కథలో రాధావేణులు ముగ్గురు పిల్లల తల్లిదండ్రులైనా ఒంటరి బతుకు తప్పలేదు. ఒకరు హైదరాబాద్‌లో, మరొకరు బెంగళూర్‌లో ఉంటున్నారు. ఒంటరి జీవితం గడుపుతున్న ఈ దంపతులకు కుమారుల టెలిఫోన్‌ల సంభాషణలలో ఆంతర్యం తెలియకపోలేదు. చివరకు చెరొక ఊరు చేరారు. ఓ రాత్రి రాధమ్మ ఐ.సి.యూలో చేరింది. వేణు వెళ్ళే సరికి ఆమె ప్రాణాలు అనంతంలో కలిసిపోయాయి. ఇది హృదయవిదారక సన్నివేశం. చివరి చూపులైనా లేకుండా చివరిమాటలైనా వినకుండా వారి చివరి రోజులు మానసిక క్షోభను కలిగింపజేశాయి.

'ఋణానుబంధరూపేణా' కథలో ముగ్గురు పిల్లల తల్లి సీతాలక్ష్మి. జానకిరామయ్య ఉద్యోగరీత్యా ఊర్లు తిరిగినా విశ్రాంతి జీవనం హైదరాబాద్‌లో గడుపుతున్నాడు. కోడళ్ళ వింత ప్రవర్తన, మాటల ధోరణి చివరి రోజుల్లో బిడ్డలు దగ్గర లేకపోవడం రసవత్తరంగా రచయిత చిత్రించారు. హాస్పిటల్‌లో చేరిన జానకిరామయ్య వెంటిలేటర్‌పై ఉంచబడ్డాడు. పక్క అపార్ట్‌మెంట్ శేషగిరి వారికి ఆధారమయ్యాడు. బిడ్డలు ఉండికూడా లేనివారు అయ్యారు ఆ దంపతులు.

'రేపటి నుంచి అమ్మనీవాటా'– ఇది సమాజంలో నేడు జరుగుతున్న యదార్థ వాస్తవ చిత్రణ. ఒకే కొడుకు ఉంటే అదొక తీరు. తప్పనిసరిగా అతనిమీదే ఆధారపడి అతనితో ఉండిపోవాలి. లేదా విడిగా కాపురం పెట్టి మరొక చోట ఉండాలి. చుట్టపుచూపుగా ఒకరిని ఒకరు పలకరించుకుంటారు అంతే. ఈ కథలో బిడ్డలున్న జానకిరామయ్య పరిస్థితి ఆయన మరణానంతరం పిల్లలు తల్లిని పంచుకున్న విధానం విచిత్రంగా తోచిన వాస్తవ సమాజానికి దర్పణం పట్టినట్టుగా కనిపిస్తుంది. కర్మక్రతువులు పూర్తి అయిన తరువాత అన్నదమ్ములు ఆస్తి పంపకాల విషయంలో వాదులాడుకున్నారు. తల్లిని ఎవరు పంచుకోవాలి అనే విషయంలో తగాదాపడ్డారు. ఇలాంటి అన్నదమ్ములు సమాజంలో లేకపోలేదు. వారి మనస్తత్వాలను, వారి మాటల తీరును, వృద్ధులైన తల్లిదండ్రుల స్థితిగతులను రచయిత ఇందులో చిత్రించారు. తల్లని ఆసుపత్రిలో చేర్చే విషయంలో కూడా వారు ఉదాసీనంగా ఉండిపోయారు. సుభద్రమ్మ తల్లి చనిపోయిన తరువాత ఆసుపత్రికి చెల్లించవలసిన బాకీ చెల్లించి అంబులెన్స్‌లో తల్లి శవాన్ని తనే తన ఊరు కాకినాడకు తీసుకెళ్లింది.

'నీడనిచ్చిన గూడు' కథలో 20% వృద్ధులు స్వచ్ఛందంగా వృద్ధాశ్రమంలో చేరుతున్నారు. మరికొందరిని దూరంగా ఉన్న వారి పిల్లలే చేర్పిస్తున్నారు. ప్రతి పట్టణంలోనూ వృద్ధాశ్రమాలు వెలిశాయి. ధనిక, పేద తేడా లేకుండా హోదాలతో సంబంధం లేకుండా బిడ్డలు ఉన్నవారు లేనివారు వృద్ధాశ్రమాలే దేవాలయాలుగా భావించి ఉండిపోతున్నారు. ఇటీవలే దినపత్రికల్లో చూశాం పిల్లలు లేని టి.యన్. శేషన్ దంపతులు మద్రాసులోని వృద్ధాశ్రమంలో చేరారు. ఇటీవలే ఆయన భార్య పరమపదించింది. తోడూ, నీడ లేనివారికి అది 'నీడ నిచ్చిన గూడు'. అందుకే ఈ కథకు 'నీడ నిచ్చిన గూడు' అని పేరు పెట్టారు. ఈ కథలో రత్నసాగర్ తన తల్లిని (75 సంవత్సరాలు) వృద్ధాశ్రమంలో చేరిపించటానికి ఒక పెద్ద బొంకు బొంకాడు. తాను అమెరికాకు వెళుతున్నాననీ, ఈ గోవర్ధనగిరి వృద్ధాశ్రమం చక్కగా వృద్ధులకు సేవలు అందిస్తుందనీ నమ్మ బలికి ఆమెను చేర్పించి వెళ్ళాడు. అతడు ఊరు వదిలి ఎక్కడికి వెళ్ళలేదు.

చివరకు రత్నసాగర్ ఇచ్చిన ఫోన్ నంబర్ కూడా మారిపోయింది. తల్లి చనిపోయిందని తెలిసిన అతడు రాలేదు. వృద్ధాశ్రమం వారే అంత్యక్రియలు జరిపారు. ఈ కథలో తల్లి చెప్పిన మాట ఒక చురక లాంటిది.  బాత్‌రూమ్‌లో పడ్డ తల్లి (జలజాక్షి) పలికిన పలుకులు ములుకుల్లా మన హృదయాన్ని తాకుతాయి:

'నాకు పిల్లలు లేరు డాక్టర్'

"వాడు నా బిడ్డ కాదు. ఈ గోవర్ధనగిరి నాకు నీడనిచ్చిన గూడు, వాడు తోడునియ్యని కొడుకు". అంపశయ్యపై ఉన్న జలజాక్షి చివరి మాటలు పాఠకులకు కన్నీరు తెప్పిస్తాయి.

'జీవచ్ఛవం'–దంపతులుగా ఉన్న వృద్ధుల సమస్యలే కాదు ఒంటరి జీవనం గడుపుతున్న వ్యక్తుల జీవితాలు కూడా ఈ కథలో ప్రతిబింబింప జేశాడు. కథ ప్రారంభమే ఇలా ఉంది. "రంగనాథం ఒంటరివాడు, భార్య కాలం చేసి మూడు యేండ్లు అయింది. ఇద్దరు మగపిల్లలు అమెరికాలో స్థిరపడ్డారు. గత మూడు సంవత్సరాలుగా రంగనాథం 'జీవచ్ఛవం'. ఉదయం, సాయంత్రం పార్కుల్లోనే తన తోటి వ్యక్తులతో ముచ్చట్లు చెప్పుకుంటూ కాలం వెల్లబుచ్చుతాడు. భార్య జ్ఞాపకాలు వదలలేదు". కథ ముగింపు ఇలా ఉంది "ఓ సాయంకాలం పార్కులో మిత్రులతో మాట్లాడుతూ పక్కనే ఉన్న సురేశ్ ఒడిలో వాలిపోయాడు రంగనాథం". కొడుకుల విషయం చెబుతూ అన్నదమ్ముల మధ్య ఆత్మీయతానురాగాలు అనుబంధాలు లేవని సూచిస్తూ ఈ వాక్యాలు రాశారు.  ఇది చాలా కుటుంబాలలో నేడు జరుగుతున్న వాస్తవ చిత్రణ. కొడుకుల్లో ఒకరు మియాపూర్లో, మరొకరు శాన్‌ఫ్రాన్సిస్‌లో.  రెండూ రెండు ధృవాలు. దిక్కుల్లోనే కాదు తమకు దిక్కనుకుంటున్న ఆ ఇద్దరు రెండు భిన్న దృవాలు. ఒకరిని ఒకరు ఆరేండ్లకోనాడు 6.00 గంటల విమాన ప్రయాణం చేసి కలుసుకుంటారు. 6.00 గంటలు ఉండి టాటా చెప్పేసి వెళ్లిపోతారు.

'వాన (ర) ప్రస్థం' అనే కథ ఇది వానప్రస్థం అనే పదం మీద రచయిత చేసిన చమత్కారం. వృద్ధాప్యంలో తల్లిదండ్రులు ఒక కొమ్మ మీది నుండి మరొక కొమ్మ మీదికి వాలినట్లుగా కొంతకాలం ఒక కొడుకు దగ్గర, మరికొంత కాలం ఇంకొకరి దగ్గర గడుపుతారు. వారు నివసిస్తున్న స్వస్థానమే వారికి పదిలం. ఇంక ఎక్కడ ఉన్నా వారికి నచ్చదు. ఆప్యాయతలు, అనురాగాలు లోపిస్తున్న ఈ రోజుల్లో వృద్ధ దంపతుల మానసిక చిత్రణకు ఈ కథ దర్పణం. సునాయస మరణాన్ని కోరుకుంటాడు శివసుందరం.

'దహనసంస్కారాలకు' అనే చిన్న కథ ఆరు వాక్యాల కథ. కానీ భావగర్భితమైన కథ. కొడుకు అమెరికా నుండి రాడని తెలుసు, తన జాగ్రత్తలో తాను ఉండిపోయింది. వీలునామా రిజిష్టర్ చేయించింది. దహన సంస్కారాలకు 15,000లు ఒక కవరులో పెట్టి తలకింద పెట్టింది.

'దోస తొడిమ' రచయితకు మృత్యుంజయ స్తోత్రం బాగా ఇష్టం. దాని పఠనం దినచర్యలో భాగం. అందుకే చాలా కథల్లో ఏదో ఒక రూపంలో దాని ప్రస్తావన వస్తుంది.

**"ఓంత్ర్యంబకం యజామహే**

**సుగంధిం పుష్టి వర్ధనం**

**ఉర్వారుకమివ బంధనాత్**

**మత్యోర్ముక్షీయ మామృతాత్'**[32]

సాధారణంగా వృద్ధాప్యంలో ఉన్నవారు కోరుకునేది సునాయాస మరణం. ఇక్కడ 'లావొక్కింతయు లేదు, ధైర్యమ విలోలంబయ్యెడిన్' అని గజేంద్రమోక్షంలోని పోతన పద్యాన్ని కూడా రచయిత సూచించారు. చివరిదశలో ప్రతి వ్యక్తీ కోరుకొనేది సునాయాస మరణం. ఈ

[32] కథామందారం – అనంత పద్మనాభరావు, పుట:85.

విధంగా ఈ కథలలో సన్నివేశ చిత్రణతోపాటు మానసిక సంఘర్షణను కూడా రచయిత సూచించారు.

## 2.18.5 హాస్యస్ఫోరక సంభాషణలు

పద్మనాభరావు కథకుడే గాక అష్టావధాని కూడా. అష్టావధానంలో అప్రస్తుత ప్రసంగానికి సమాధానాలు హాస్యభరితంగా ఉంటాయి. అందువల్ల ఈయన కథలలో కూడా ఎడనెడ సంభాషణల రూపంలో హాస్యం తొంగి చూస్తుంది. 'మిమ్మల్ని కాదులెండి' అనే మినీ కథలో ఒక సంభాషణ ఇందుకు ఉదాహరణ.

"ఉపన్యాసం గంటకు పైగా చేస్తున్న రామనాధం ఉపన్యాసం ఆపలేదు. కారణం ఆగంతకుడు చేతిలో కర్రతో వేదిక మీదకు రావడం" [33], కథకు ముక్తాయింపుగా అతడు అంటాడు.

"రామనాధంగారు! మిమ్మల్ని కాదండీ కొట్టవలసింది. మిమ్మల్ని ఆహ్వానించిన అభ్యుదయ వేదిక కార్యదర్శిని కొట్టాలి. అతడు కనిపిస్తాడేమోనని చూస్తున్నాను" ఇక్కడ సుదీర్ఘోపన్యాసాలు చేసేవారికి కథకుడు చురకంటించాడు.

"తప్పిపోయిన గోపీ' కథ ఒక హాస్య సంఘటన ఆధారంగా ఏర్పడింది, దినపత్రికలో తప్పిపోయిన కుర్రవాడి ఆచూకీ తెలిపితే 1,116/- బహుమతిగా ఇస్తామని ప్రకటించారు. సాంబశివరావు అనే వ్యక్తి ఒక గోపీని పట్టుకొచ్చాడు. 10 రోజుల క్రితం ఇచ్చిన ప్రకటన చూసి గోపీ తనంతట తానే వచ్చేశాడు. సాంబశివరావు నిరుత్తరుడయ్యాడు"[34]. ఎవరో సైకాలజీ స్కాలర్ తన పరిశోధన కోసం ఈ ప్రకటన ఇచ్చినట్లు తరువాత తెలుస్తుంది. ఇది చమత్కారం.

---

[33] కథా కమామీషూ – అనంత పద్మనాభరావు, పుట: 29.

[34] కథా కమామీషూ – అనంత పద్మనాభరావు, పుట: 79.

'అభిజ్ఞవర్గాల భోగట్టా' పూర్తిగా చమత్కార భరితం. ఓ ఇంటి అల్లుడు తాను ఇంగ్లీషులోనే మాట్లాడతానని శపథం చేశాడు. చివరకు హాస్యం పాలయ్యాడు. Yes/No సమాధానాలతో అత్తారింట్లో అవస్థలు పడ్డాడు. అమ్మాయి నెల తప్పింది అనటానికి ఇతడు ఊహించిన ఆంగ్ల పదం –'She has failed?'.

Wonderful, I see, I marry her వంటి పడికట్టు పదాలు హాస్యాన్ని కుమ్మరిస్తాయి. చివరకు Leave Letter సన్నివేశం నవ్వు పుట్టిస్తుంది. "My wife is suffering with romantic pains. I am the only husband available in the house. Two days leave granted"[35]. ఈ కథ స్వాతి వారపత్రిక కామెడీ కథల పోటీలో ఎంపికైన కథ.

'కృష్ణ జన్మస్థానం' కథ వ్యంగ్యంతో కూడిన సన్నివేశాలతో మలచబడింది. హస్తినాపురంలోని తీహార్ జైలు సీనులో నారదుని మాటలు ఇందుకు నిదర్శనం.

**"ఆయన ప్రజా హృదయాధినేత స్వామీ!"[36]**

**అందునా కలియుగం... ధర్మం ఒంటిపాదంపై నడుస్తోంది స్వామీ"**

అంటాడు నారదుడు.

'సన్మానాలు చేయబడును' అనే కథలో వ్యంగ్యంగా నేటి సమాజంలోని వివిధ సంఘాలు సన్మానాలు చేస్తున్న తీరుపై చురుకలు వేస్తుంది. బాలరాజు ఒక స్వచ్ఛంద సంస్థను స్థాపించాడు. ఉన్న ఉద్యోగం వదలుకున్నాడు. సన్మానాలు చేయడమే అతని వృత్తి. నెలకు ఓ అయిదు, ఆరు సన్మానాలు చేస్తాడు. పెళ్ళిళ్లలో కేటరర్. వధువు తరపు వారికి మెనూ కార్డు చూపించినట్లే బాలరాజు కూడా మూడు రకాల ప్యాకేజీలు తయారుచేశాడు. అవి ఒక బుక్‌లెట్‌గా తయారుచేశాడు. సన్మానం ద్వారా వచ్చిన డబ్బులో కొంత మిగుల్చుకోవడమే

---

[35] గోరింట పూచింది – అనంత పద్మనాభరావు, పుట: 48.

[36] గోరింట పూచింది – అనంత పద్మనాభరావు, పుట: 115.

అతని ఆదాయం. తాను చదువుకున్న గురువుగారికి సన్మానం చేస్తానని ఆయన వద్ద 40,000ల రూపాయలు, దానికి తోడు ఇతర శిష్యుల వద్ద చందాలు వసూలు చేశాడు. సన్మాన పత్రం చదివిన వ్యక్తి తడబాటు మనకు నవ్వు పుట్టిస్తుంది.

"మహాజనులారా ఈ 'దినం'" సన్మానం చేయించుకుంటున్న అని 'కొంటున్న' దగ్గర నొక్కి చెప్పింది. కీర్తిశేషులు రఘునాథరావుగారికి—అని నాలుక కరచుకొని కీర్తిమంతులు అని సవరించుకొంది. సన్మాన పత్రంలో అచ్చు తప్పు గమనించకుండా – మధురకవి – అనే పిరుదు ప్రధానం చేస్తున్నాం – అని చదివింది"[37].

'వాన(ర)ప్రస్థం' అనే కథను మానవీయ విలువలకు ప్రాధాన్యం ఇస్తున్న వానప్రస్థాన్ని వాన(ర)ప్రస్థంగా మలచటంలో రచయిత విశిష్టత కనిపిస్తుంది. కోతులు కోతి కొమ్మచ్చిలు ఆడినట్లు వృద్ధులైన దంపతులు కొద్ది రోజులు ఒక కుమారుడి వద్ద మరికొద్ది రోజులు ఇంకొక కుమారుడి వద్ద, ఇంకొకసారి కూతురివద్ద గెంతులు వేస్తారు. అందుకే రచయిత ముక్తాయింపుగా ఈ మాటలన్నారు. "హాస్పిటల్ కిటికీలోంచి ఎదురుగా నిండుగా కాచిన మామిడిచెట్టు. రెండు కోతులు తీవ్రంగా కొట్లాడుకుంటున్నాయి. మామిడికాయలు కొరికి తింటూ ఒకదానికొకటి అందించుకుంటున్నాయి. మరుక్షణంలో ఒక కోతి మరో కోతికి తలలో పేలు చూస్తోంది. ఇంకో క్షణంలో ఓ కోతి పక్క చెట్టుపైకి గెంతులేసింది. ఔరా వానరప్రస్థం అనుకొన్నాడు శివసుందరం"[38]. ఈ కథ స్వాతి వారపత్రికలో ప్రచురింపబడి తిరిగి పాఠకుల మెప్పుపొంది, స్వాతి మాసపత్రికలోనూ ప్రచురింపబడింది.

'పల్లెపిలిచింది' కథలో అమెరికా నుండి వచ్చిన రాబర్ట్ ఆసుపత్రిలో కాకుండా ఇంట్లో డెలివరీ (ప్రసవం) అయిన రమేష్ వదిన ప్రసవం గూర్చి విని ఆశ్చర్యపోతాడు. ఇది ఆంగ్లేయులకు

---

[37] కథామందారం – అనంత పద్మనాభరావు, పుట:63.

[38] కథామందారం – అనంత పద్మనాభరావు, పుట:81.

సహజమైన సందేహమే అయినా చదివే పాఠకునికి నవ్వు తెప్పిస్తుంది"[39]. అలానే నూతన వధూవరులకు పురోహితుడు నిర్ణయించిన రోజే మూడు రాత్రులు ఏకాంతం కలిపించడం అతడికి ఆశ్చర్యంగా తోస్తుంది. ఈ విధంగా దాదాపు 40 కథలలో అక్కడక్కడ సందర్భోచితంగా హాస్యాన్ని, వ్యంగ్యాన్ని చురకలుగా వడ్డిస్తూ రచయిత పాఠకులకు ఆహ్లాదం కలిగిస్తారు.

## 2.18.6 శృంగార సంభాషణలు – సన్నివేశాలు

పద్మనాభరావు ప్రబంధాలు విరివిగా చదివారు. ప్రబంధాలలో శృంగారం పాలు కొంచెం ఎక్కువ మోతాదులో ఉంటుంది. అంగాంగ వర్ణనలు, కవిసమయాలు అతి వేలంగా కనిపిస్తాయి. వాటి ప్రభావం రచయితపై సూక్ష్మంగా కనిపిస్తుంది. మీదు మిక్కిలి స్వాతి వారపత్రికవారు ప్రతి యేటా సరస శృంగార కథల పోటీ నిర్వహిస్తారు. ఆ పోటీలో తాను ముందుండాలని కాబోలు శృంగారం పాలు హెచ్చించారు. ఇందుకు:

'ఐయామ్ రియల్లీ సారీ' ఒక ప్రత్యక్ష కథనం. అదే విధంగా

'వట్టిరాకపోకలొనర్చే వానిసతియు' అనేవి ఒక అడుగు ముందుకేసిన శృంగార భరిత సందర్భం.

'గోరింట పూచింది కథ' హృదయాన్ని కదిలించే సున్నిత శృంగారంతో కూడినది.

'దేవయాని కథ' మరో మెట్టు ముందుకు నడిచి, భారత కథను నేపథ్యంగా పెట్టుకొని వ్రాసిన కథ. పతాక సన్నివేశంలో నర్మద లొంగిపోయిన సన్నివేశం వర్ణించబడింది.

'కాంతాకనకాలు' కథలో ఇండోనేషియా అధ్యక్షులు సుకర్ణో కథను ప్రస్తావించారు.

'పూర్ణిమ' కథలో కొన్ని సన్నివేశాలలో అదుపు తప్పని శృంగారం కనిపిస్తుంది.

---

[39] కథామందారం – అనంత పద్మనాభరావు, పుట:98.

'వంశాంకురం' కథలో అదుపు తప్పిన రాధ జీవితంలోని ఒక సన్నివేశానికి పరిణామంగా ఏర్పడ్డ సంతానం దానివల్ల జ్యోతిష్యం ఆధారపడటం కథాత్మకంగా చిత్రించబడ్డాయి.

## 2.19. గల్పికలు

గల్పికలు కథలు కావు. వ్యాసాలు కావు, వచన కవితలు కావు, కల్పిత కథలు కావు, అవి సంక్షిప్త వాస్తవ శబ్ద చిత్రాలు. వ్యంగ్యం వీటినాడిని పటిస్తుంది. సమాజంపై చురక వేస్తూ, వివిధ రకాల మనస్తత్వాలను గంభీరంగా, వ్యంగ్యాత్మకంగా కొద్ది మాటలతో చెప్పడం దీని లక్ష్యం. సర్వ సాధారణంగా ఇవి రెండు పుటలకు మించవు. 1982–87 మధ్య కాలంలో రచయిత ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రంలో అసిస్టెంట్ స్టేషన్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న కాలంలో ఈ రచనలు ఆంధ్రప్రభ, ఆంధ్రపత్రిక దినపత్రికలలో ప్రచురింపబడ్డాయి.

పన్యాల రంగనాథరావు సంపాదకత్వంలో 'సమయం' అనే దినపత్రిక 1984 ప్రాంతంలో ప్రచురింపబడేది. ఆ దినపత్రికలో 'ముత్యాల జల్లు' అనే శీర్షికతో వరుసగా గల్పికలు రాశారు. వాటిని తమ తొలి కథాసంపుటి కథా కమామీషూలో పద్నాల్గింటిని జతపర్చారు.

1) మొదటి తారీఖు ముచ్చట్లు.

2) ఆషామాషీ.

3) కాదనలేం.

4) సన్మాన శిరోవేదనోపాఖ్యానం.

5) అద్దె ఇళ్లలో ఆగచాట్లు.

6) ప్రమోషన్ జ్వరం.

7) ముత్యాల జల్లు.

8) టౌన్ కాపురం.

9) యల్.టి.సి. ప్రయాణం.

10) టెలిఫోన్ ప్రహసనం.

11) మామగారు ఒకప్పటి అల్లుడే.

12) బూతు మాటలు.

13) పెళ్ళి హంగామా.

14) అలవాటులో పొరబాటు.

ఇందులో ప్రసక్తానుప్రసక్తంగా సామాజిక జనజీవనాన్ని ఉద్యోగుల మనస్తత్వాన్ని మధ్యతరగతి మందహాసాన్ని, ప్రహసనరూపంలో వాక్చిత్రాలుగా కొద్ది మాటలలో వ్యంగ్యాత్మకంగా సూచించారు. ఇప్పుడు ఈ గల్పికలను విశ్లేషిద్దాం

ఇప్పుడైతే బ్యాంకుల ఎ.టి.యమ్ లు వచ్చాయి. 20 ఏళ్ళ క్రితం మధ్య తరగతి ఉద్యోగులకు మొదటి తారీఖున ఆఫీసులో జీతం బట్వాడా చేసేవారు. లేదా నెలాఖరు రోజు రెవెన్యూ స్టాంపు మీద సంతకం తీసుకొని క్యాష్ రూపంలో పట్టుకునే – ప్రావిడెంట్ ఫండ్ వంటి మినహాయింపులు పొగా మిగిలిన డబ్బు చేతికిచ్చేవారు. సర్వసాధారణంగా నెలంతా అంగట్లోను, ఫ్యాన్సీ షాపులోనూ, మందుల షాపులోనూ అప్పు తెచ్చుకొని పబ్బం గడుపుకుంటారు. జీతాలు నేరుగా ఇప్పట్లో లాగా బ్యాంకులో పడేవి కావు. జీతంపై ఆధారపడ్డ జీవితాలు వెన్నెలకు చకోరపక్షులుగా ఒకటవ తారీఖుకు ఎదురుచూస్తారు.

వాయిదా పద్ధతిలో కొన్న చీర బాకీ చెల్లించడం మొదలు ఆదాయ వ్యయ పట్టికను ఇంటావిడ ముందుగానే తయారుచేసి అణా పైసలతో సహా గిట్టించి సంసారాన్ని నెట్టించేవారు. తిరుపతి ముడుపులు, పెద్ద పిల్ల రజస్వల వేడుకలు బడ్జెట్‌లోనే సరిపెట్టుకోవాలి.

"నెలనెలా జీతాలు కాకుండా వారం వారం జీతాలు ఇస్తే బాగుంటుందని శుక్లపక్షం, కృష్ణపక్షంలోలాగా నెలలో రెండు భాగాలు. నెలలో మొదటి పక్షంలో ఉన్నంత హుషారు, రెండో పక్షంలో ఉండదు"[40] అని రచయిత చమత్కరిస్తారు. ఈ గల్పిక కృష్ణాపత్రికలో 1984లో ప్రచురితమైంది.

'ఆషామాషీ'– ఈ గల్పిక సాధన మాసపత్రిక (సంపాదకులు మన్నవ గిరిధరరావు) 1982లో ప్రచురించారు. ఇందులో అందించిన వ్యంగ్యం ప్రబంధ కవులు చేసే కవి సమయాల గురించి. ప్రాచీన కవులు నాయిక అంగాంగ వర్ణనకు కొన్ని కవి సమయాలు చేసుకున్నారు. స్త్రీల ముఖాన్ని చంద్రునితోనూ, నేత్రాలను చేపకనులతోనూ, ఊరువులను అరటి బోదెలతోనూ, నాసికను సారంగంతోనూ పోలుస్తారు. ఈ గల్పికలో శ్రీకాళహస్తి మహాత్మ్యంలోని నత్కీరుని కథను ప్రవేశపెట్టారు రచయిత.

పరమశివుడు తన భక్తుడైన పూజారికి ఒక పద్యం రాసి ఇచ్చారు. అందులో "సింధుర రాజగమనాధమ్మిల్లబంధంబు సహజగంధంబు"[41] అని కవి సమయం చూపాడు. అంటే పార్వతీదేవి కేశాలకు సహజమైన వాసన ఉంది. దీనిని రాజాస్థానంలోని నత్కీరుడు తప్పుపట్టాడు. పూజారి శివుని వద్దకు వెళ్ళి మొర పెట్టుకున్నాడు. శివుడు పార్వతీదేవి కేశాలకు గంధం ఉంటుందని సమర్థించాడు. నత్కీరుడు ఒప్పుకోలేదు. 'శివుడు ప్రత్యక్షమై నత్కీరునికి

---

[40] కథా కమామీషూ– అనంత పద్మనాభరావు, పుట: 81.

[41] కథా కమామీషూ– అనంత పద్మనాభరావు, పుట: 83.

కుష్ఠి రోగం వస్తుందని శపించాడు'[42]. ఈ విధంగా ఈ గల్పికలో రచయిత కావ్య ప్రసిద్ధమైన కవి సమయాన్ని ఉదాహరణ పూర్వకంగా వివరించే వ్యంగ్య చిత్రణ చేశారు.

'కాదనలేం' అనే గల్పికలో 20 ఏళ్ళనాడు టెలిఫోన్ ఉన్న గృహస్థుల సాధక బాధకాలను సుతిమెత్తంగా వర్ణించారు. అప్పట్లో మొబైల్ ఫోన్‌లు ఇంకా రాలేదు. కేవలం టెలిఫోన్ డిపార్టుమెంట్ వారి ల్యాండ్ లైన్ నెంబర్ వాడలో ఒకటో, రెండో ఉండేవి. టెలిఫోన్ ఉండటం ఒక హోదా. కొందరికి ఆఫీసువాళ్ళు ఏర్పాటు చేస్తారు. మరికొందరు తమ తమ అవసరాలను బట్టి టెలిఫోన్‌ను పెట్టుకుంటారు. మిగతా ఇండ్ల వాళ్ళు మొహమాటం లేకుండా రాత్రింబవళ్ళు అనే తేడా లేకుండా ఈ ఫోన్‌ను సొంత ఫోన్‌గా వాడుకుంటారు. అర్ధరాత్రి పూట పొరుగూరి నుండి కామాక్షమ్మ మా ప్లాట్లలో ఉండే థర్డ్ ఫ్లోర్‌లో సుందరం గారిని పిలువమంటుంది. ఇది కాదనలేని మొహమాటం అంటారు రచయిత. ఆ రోజుల్లో పొరుగూర్లకు ఫోన్ చేయటానికి STD సదుపాయం ఉండేది. దానిని ఇంటి యజమాని లాక్ చేసి పెట్టేవాడు. అయినా మొహమాటస్థులు వేధిస్తూనే ఉండేవారు. అందుకే STDని(Subscriber Trunk Dialing Service)అని పిలిచేవారు. అలాగే ఎయిడ్స్ అంటు వ్యాధిని కూడా STD (Sexually Transmitted Diseases)అంటారు. దానిని ఈ గల్పికలో రచయిత చమత్కరించారు.

మీకు STD ఉందా అంటే రెండర్థాలు వస్తాయి. 'టెలిఫోన్‌తో పాటు టి.వి.ని' మిక్సీని, కుట్టుమిషన్‌ని చేర్చాలని ఒకావిడ వాదన. ఈ గల్పిక 1986లో ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితమైంది.

'సన్మాన శిరోవేదనోపాఖ్యానం'– ఈ శీర్షిక పేరు పెట్టడంలోనే రచయిత చమత్కారం చూపారు. వివిధ సంస్థలు నగరాలలో చిన్నపాటి కవులకు, నటులకు సన్మానాలు చేసి

[42] కథా కమామీషూ– అనంత పద్మనాభరావు, పుట: 84.

బిరుదులిస్తుంటారు. అందులో ఎన్నో అవకతవకలు జరుగుతాయి. అవి హాస్యాన్ని పండిస్తాయి. ఈ గల్పిక 1984లో ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితమైంది. ఆంధ్ర పత్రిక దినపత్రికలో 1982లో ప్రచురితమైంది.

'అద్దె ఇళ్లలో అగచాట్లు' మరొక గల్పిక. ఇంటి యజమానికి అద్దెకున్నవానికి ఎప్పుడూ సహజంగా అత్తాకోడళ్ళ పోరు ఉంటుంది. కరెంటు ఎక్కువగా వాడుకున్నారనో, నీళ్ళు ఎక్కువగా వాడుకున్నారనో, రేడియో పెద్దగా పెట్టారనో గొడవలు జరుగుతుంటాయి. బదిలీల వల్ల కొందరు ఇల్లు మారక తప్పదు. రెండు ఏండ్ల కొకసారి బాడుగ పెంచాలని యజమాని ప్రతిపాదిస్తాడు. రచయిత ఈ గల్పికలో కుంతీ సమేతంగా పాండవులు ఏకచక్రపురంలో ఓ గృహస్థుని ఇంట్లో కాపురం చేయటాన్ని ఉదాహరించారు. చివరగా ఒక కవి వచనకవితన ఉదాహరించి ముగించారు.

**"అద్దెకున్నది స్వర్ణమణిమయ హర్మ్యమైనా సరేవద్దు**

**తాను స్వయంగా కట్టుకున్నది తాటికమ్మల గుడిసె ముద్దు"**[43]

ఉద్యోగంలో చేరిన రోజునుండి ప్రమోషన్ కోసం ఎదురు చూస్తారు. అది కొందరికి త్వరత్వరగా వస్తుంది. మరికొందరికి ఉద్యోగం చివరి రోజుల్లో వస్తుంది. ప్రమోషన్ రాలేదని కోర్టుకి ఎక్కినవాళ్ళు ఉన్నారు. సీనియారిటీ నిర్ధారణ విషయంలో చాలామంది అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్ వరకు వెళుతారు. ఈ గల్పిక 1982లో ఆంధ్రపత్రిక దినపత్రికలో ప్రచురితమైంది.

ముత్యాలజల్లు, టౌను కాపురం, ఎల్.టి.సి ప్రయాణం, టెలిఫోన్ ప్రహసనం, మామగారు ఒకప్పటి అల్లుడే, బూతు మాటలు, పెళ్ళి హంగామా, అలవాటులో పొరపాటు 1984లో ముత్యాలజల్లు శీర్షికలో సమయం దినపత్రికలో ప్రచురింపబడ్డాయి.

---

[43] కథా కమామీషూ – అనంత పద్మనాభరావు, పుట:92.

'బూతు మాటలు' అనగానే పాఠకుడు తప్పు అర్థం చేసుకుంటాడు. ఇందులో పాలబూతు వద్ద జరిగే తతంగాన్ని రచయిత విపులంగా వర్ణించారు.

'పెళ్ళి హంగామా'లో వివాహ సమయంలో ఆర్భాటంగా విందు భోజనాలు ఏర్పాటు చేయటాన్ని ప్రస్తావించారు. ఈ సందర్భంలో ఆముక్తమాల్యదలోని **"ఆనిష్మానిధి"**అనే పద్యపాదాన్ని ఉదాహరించారు.

విష్ణుచిత్తుడు తన ఇంటికి వచ్చిన అతిథులకు రాత్రివేళ అయినా భోజనాలు పెట్టేవాడు. ఆ సమయంలో అతిథులతో – కూర లెక్కువలేవు – అన్నం వేడిగా లేదు, పప్పు లేదు, దయచేసి భోజనం చేయండి అనేవాడట. తెనాలి రామకృష్ణుడు మొహమాటం లేకుండా రాయలవారితో అన్నాడట. "కూరలు, పప్పు లేకుండా అదేం భోజనం మహారాజా" అన్నాడట.

అనంత పద్మరావు కథలు సాధారణమైన ముగింపు కాకుండా తనదైన శైలిలో సమాజానికి అనుగుణంగా ఇచ్చాడు. ఈ ముగింపు సాంప్రదాయ వాదులకు నచ్చకపోవచ్చు. అయినప్పటికీ అనంత పద్మనాభరావు తనదైన దృక్పథంతో ప్రతి కథకు ప్రత్యేక ముగింపు ఇవ్వడం పద్మనాభరావు గారి ప్రత్యేకత. చదువుతున్నప్పుడు పాఠకులు ఇది ఇలా జరుగుతుందేమో అనుకుంటారు కొన్నిసార్లు పాఠకుల ఆలోచనలకు అందకుండా ముగింపు ఉండడం అనేది వీరి కథల్లో మరొక ప్రత్యేకమైన విషయంగా చెప్పవచ్చు. అనంతపద్మనాభరావు రాసిన కథలు సమాజంలోని యువతను, వృద్ధులను, కుటుంబ పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని ఏ విధమైన సమస్యలనైనా ఎలా పరిష్కరించుకోవాలో వీరి కథలలోప్రస్ఫుటంగా కనిపిస్తుంది.

# మూడవ అధ్యాయం

# మూడవ అధ్యాయం

# అనంత పద్మనాభరావు నవలలు-ఇతివృత్త వైవిధ్యం

## 3.0. తెలుగు నవల: స్థూల పరిణామం

"లిటరేచర్ ది మోస్ట్ సెడెక్టివ్ అండ్ డిసివింగ్, ది మోస్ట్ డేంజరస్ ఆఫ్ ప్రొఫెషన్స్" – లార్డ్ మోర్గే. సాహిత్యం కథన కళ, కవిత్వ కళ అనే రెండు కళలకు చెందిన సృజనాత్మక ప్రక్రియ. ప్రపంచ చరిత్రలో అతి ప్రాచీనమని చెప్పబడే సుమేరియన్ నాగరికతలో సాహిత్యం ఒక భాగమని అభిజ్ఞులు అంగీకరిస్తున్నారు. సాహిత్యము జన్మ ఎంత ప్రాచీనమో చెప్పలేము. మనిషికి మార్చే శక్తి ఉన్న ప్రక్రియ ఇది అని మానవ చరిత్ర సూచిస్తుంది. సాహిత్యం సంఘంలో సమూలంగా పరివర్తన తెచ్చే సాధనం కాకపోవచ్చు. కాని ప్రత్యేక వ్యక్తులపై దాని ప్రభావం నిస్సందేహంగా ఉంటుంది. "Great poets are judged from the frame of mind they induce in us" అన్న ఆర్.డబ్ల్యు. ఎమెర్సన్ మాటలు గమనింపదగినవి. మనిషిలో ఉన్న కరుణ లేక సానుభూతిని ఆవిష్కరించేది సాహిత్యం.

లిపి మానవుడు వెలువర్చే ధ్వనులకు ఏర్పరచుకున్న సంకేతం. ఒక తరం నుండి, మరొక తరానికి విజ్ఞాన సంపదను అందించే సాధనం. లిపి సహాయంతో మానవుడు సృష్టించుకున్న సాహిత్యం అతడి ఆలోచనలు, ఆశయాలు, అనుభూతులు, అనుభవాలు, కష్టసుఖాలు మున్నగు వాటికి ప్రతిబింబం. అది ప్రజల విజ్ఞానాభివృద్ధికి, మార్పుకు తోడ్పడుతుంది. సాహిత్యంలో సమాజం ఆవిష్కరింపబడుతుంది. హేతుబద్ధమైన జీవితం సాహిత్యంలోకి ప్రవేశిస్తుంది. మానవ సమాజానికి ఉపయోగపడని, సామాజిక స్పృహలేని ఎంత గొప్ప రచనలైనా మృత సాహిత్యంతో సమానమే.

సాహిత్య ప్రభావం మానవుడి మీద ఉంటుంది. దేశంలో ఎక్కువ శాతంలో ఉన్న సామాన్య జనానికి అవగాహన కలిగించడానికి వారిలో ప్రచారంలో ఉన్న సాహిత్య కళారూపాలనే గ్రహించాలి. వారి భాషలో చెప్పాలి. తమ సమస్యలను పరిష్కరించుకొని శాశ్వత ఉపశమనం పొందటానికి కావలసిన అవగాహనను, జనానికి నచ్చే పద్ధతిలో అందచేయాలి. "హితం మనోహారిచ దుర్లభం వచః" అన్న మాటను అసత్యం చేసే సాహిత్యమే జనామోదకర సాహిత్యం. మంచి రచయితలు, మంచి రచనలు ప్రజలలోంచి, జీవితంలో నుంచి వస్తారు, వస్తాయి.

విశ్వమంత విశాలమైనది, సముద్రమంత లోతైంది, వైవిధ్యంతో కూడుకున్నది, ఆలోచనామృతమైనది సాహిత్యం. భారతీయ సాహిత్యం మానవ జీవితం నిస్సారంగా ఉండకుండా ఉండడానికి అర్థ కామాదులను ప్రతిపాదిస్తూనే, ధర్మ ప్రతిపాలనకు ప్రాధాన్యం ఇచ్చింది. సాహిత్యం సమాజాభివృద్ధికి, ప్రజల పురోగమనానికి అన్ని కాలాలలోను ఉపయోగపడుతుంది. గ్రీసులో ఇలియట్ ఒడిస్సీ, స్కాండినేవియాలో సాగాలు, ఎడ్డేలు, ఇంగ్లాండులో కింగ్ ఆథర్, పర్సియన్‌లో Shanamoki, భారతదేశంలో రామాయణ మహాభారతాలు మున్నగు ఇతిహాసిక మహా కావ్యాలన్నిటికి యదార్థ మానవుడే పునాది. మహాకవి వాక్కు, ఆడ మధ్యాంతర హితమవుతుంది. అది ప్రజలని ఉత్తేజపరచడానికి తోడ్పడుతుంది. ఏ కవికైనా అతని చుట్టూ ఒక సమాజం, ఆ సమాజానికొక చరిత్ర, ఆ చరిత్రకొక పరిణామం ఉంటాయి. సామాజిక, చారిత్రక పరిణామ గమనంలో ప్రగతిశీలి, ప్రతిభాశాలి అయిన కవి ఆగమనానికి మరింత వేగవంతం చేసి, సమాజ పురోగమనానికి తోడ్పడతాడు. అనేక విధాల క్షణక్షణ పరిణామం పొందుతున్న ప్రపంచానికి కళాకారులే పురోగాములు. వారిలో ఒకటైన సాహిత్యకారుని ఉద్దేశ్యం కూడా అదే.

మానవ జీవితంలోని ప్రధానాంకాల్లో ఒకటైంది సాహిత్యం. తెలుగులో ఆదికవి నన్నయ మహాభారతానువాదం అనుసరణతో తెలుగులోగిల్లలో అడుగు పెట్టింది. అంతకు

పూర్వం శాసనాల్లో కనపడుతున్నా వర్ణాశ్రమ ధర్మోద్ధరణకు నన్నయ మహాభారత రచనకు పూనుకున్నా, తెలుగు సాహిత్యం నన్నయతో మొదలై పలురకాలుగా విస్తరించింది. కొన్ని రచనలు ఆర్ష ధర్మాన్ని ప్రతిపాదిస్తే, మరికొన్ని రచనలు శృంగారానికి పట్టాభిషేకం చేశాయి. కొన్ని రచనలు రాజులకు అంకితాలుగా మడులు మాన్యాల కోసం రచింపబడితే, మరికొన్ని మత ప్రచారానికి వ్రాయబడ్డాయి. కొందరు ఆత్మతృప్తికి వ్రాస్తే, మరికొందరు కవితాకన్యను తార్చి పొట్ట పోసుకోవడానికి ప్రయత్నించారు.

బ్రిటీషు వాళ్ళరాకతో దేశంలో ఎన్నో మార్పులు వచ్చాయి. పారతంత్ర్యంతోపాటు, సామాజికంగా, సాహిత్యపరంగా కొంత మంచి కూడా జరిగింది. ఆంగ్లేయుల పరిపాలనా వరద తెలుగు సాహితీక్షేత్రాన్ని నవల అనే ప్రక్రియతో సుసంపన్నం చేసింది. ఆధునిక సాహిత్య ప్రక్రియలైన నవల, కథ – కథానిక, జర్నలిజం, విమర్శ, స్వీయచరిత్ర, వ్యాఖ్యానం, జీవిత చరిత్ర, శాస్త్ర గ్రంథాలు, పీఠికలు మున్నగు వాటిలో నవల ముఖ్యమైనది.

ఆధునిక కాలంలో అత్యంత ప్రాచుర్యాన్ని పొందిన సాహితీ ప్రక్రియ నవల. తెలుగులో మొదట వచన ప్రబంధమన్న పేరుతో ప్రారంభింపబడి తరువాత నవల పేరుతో స్థిరపడిన ఈ ప్రక్రియలో వర్ణనలకన్న కథకే ప్రాధాన్యం. తొలినాటి నవలల్లో వర్ణనలుండటం, కథకు బదులు పాత్ర ప్రాధాన్యాన్ని కొనసాగించడం చూడవచ్చు. నవలలు అనేక అవాంతర కథలతో, అవాంతర పాత్రలతో కూడుకొని ఉంటాయి. నవలల్లో ఏదో ఒక లక్ష్యం ప్రధానమై ప్రధాన కథ కూడా అప్రధానమైన స్థితి కనిపిస్తుంది. నవలల్లో పాత్రల సంఖ్య, సంఘటనల సంఖ్య అపరిమితం. కార్యైక్య సాధన కోసం నవలల్లో పాత్ర బాహుళ్య కల్పన జరుగుతుంది. నవలల్లో రచయిత ఇచ్చిన ముగింపు కన్న మరెన్నో రీతుల ముగింపును ఊహించవచ్చు.

ఇంగ్లీషులోని Novel అనే మాట Novella అనే ఇటాలియన్ పదం నుంచి వచ్చింది. వచనంలో కథ మాదిరిగా ఉంటూ కథకు భిన్నమైన ఒక విలక్షణతను కలిగివుండే సాహిత్య

ప్రక్రియను NovellaStoriaగా మొట్టమొదట ఆ పదాన్ని వాడిన ఇటలీ రచయిత బొకేషియా పేర్కొన్నాడు. ఇంగ్లీషు రచయిత జాన్‌లీలి (John Lyly) రచన "Euphues" (1579)తో ఇంగ్లీషు నవల ప్రారంభమై స్కాట్ యుగానికి ఉన్నత స్థానానికి చేరుకుంది.

ఇ.ఎమ్. ఫార్‌స్టర్ అచ్చులో యాభై వేల అక్షరాలు దాటివున్న కాల్పనిక వచన సాహిత్యం అంతా నవలే అన్నాడు. ఆడవాళ్ళ డ్రాయింగ్ రూం కాలక్షేపమని మరికొందరు వేళాకోళం చేశారు. "Novel is a summary of actual life"–Meridith. ప్రఖ్యాత ఫ్రెంచి నవలా రచయిత మపాసా (Maupassant) నవల ధ్యేయం మనల్ని ఆనందపరచటం కన్నా అందులోని సంఘటనల ప్రాధాన్యతను అర్థం చేసుకొని ఆలోచించేటట్లు చేయగలవన్నాడు. ఒక జీవిత భాగాన్ని చిత్రించేది నవల. కథకు వాతావరణం పాత్రల మనస్తత్వమైతే నవలకు వాతావరణం సంఘం. నవలలోని పాత్రల జీవితం ద్వారా కొంతవరకు సంఘజీవితం కూడా చిత్రించక తప్పదు. నవలలో పాత్రలు పరిణామం పొందుతాయి. నవలలో సన్నివేశ బాహుళ్యం ముఖ్యం అన్న కొడవటిగంటి కుటుంబరావుగారి అభిప్రాయం ఈ సందర్భంలో గుర్తుంచుకోదగ్గది.

నవల అనే ప్రక్రియ సర్వ భారతీయ ప్రాంతీయ సాహిత్యాలలో ఆంగ్ల సాహిత్యం ప్రభావంవల్ల ఏర్పడిందే. భారతీయ నవలా రచనకు ఆద్యుడనుకుంటున్న బంకించంద్ర చటర్జీ ఇంగ్లీషు సాహిత్య ప్రభావంవల్లనే నవలా రచనకు పూనుకున్నాడు.

## 3.1 తెలుగు నవలారంభం

1872లో తెలుగు నవలా రచనకు నరహరి గోపాలకృష్ణమ్మచెట్టి "శ్రీరంగరాజ చరిత్ర" రచనతో శ్రీకారం చుట్టడం జరిగింది. ఆ తరువాత కందుకూరి వీరేశలింగం పంతులు 1880లో రాజశేఖర చరిత్ర, 1888 సంవత్సరంలో సత్యవతీ చరిత్ర అనే సాంఘిక నవలలను ప్రచురించారు. 1883 వరకు తెలుగు నవలలు రాయాలనే ఆసక్తి ఆనాటి రచయితలకున్నట్లు

లేదు. ఈ 20 సంవత్సరాలలో మొత్తం మూడు నవలలు మాత్రమే వచ్చాయి. శ్రీరంగరాజ చరిత్ర ముందు వెలువడినా "లోకము నందు అర్వాచీనులైన సాహితీపరులకెవ్వరు మార్గదర్శకత్వం వహింతురో, ఎవరూ అనుసరణీయులగుదురో, వారే ఆద్యులనియు, ఆచార్యులనియు కీర్తింపబడుదురను" మంజుశ్రీ మాటలను అనుసరించి రాజశేఖర చరిత్రను తెలుగులో మొదటి నవలగా పేర్కొనవచ్చును. కానీ కందుకూరి వీరేశలింగం పంతులుకే అనుసరణీయమైన శ్రీరంగరాజ చరిత్రమే ప్రథమాంధ్ర నవల. 1867లో వెలువడిన కొక్కొండ వెంకటరత్నం పంతులు మహాశ్వేత సంస్కృత కాదంబరిలోని 'మహాశ్వేత' వృత్తాంతానికి అనువాదం అని విమర్శకులు దానిని తొలి తెలుగు నవలగా అంగీకరించలేదు. ఆనాటికి తెలుగులో నవల రాసే ప్రయత్నం ప్రారంభమైనదని చెప్పవచ్చు.

"నవాన్ విశేషాన్‌లాతిగృహ్ణాతీతి నవలా" అని సంస్కృతీయంగా వ్యుత్పత్త్యర్థం చెప్పి Novel అన్న ఇంగ్లీషు పదానికి సమానార్థకంగా నవల అన్న పదాన్ని కాశీభట్ట బ్రహ్మయ్యశాస్త్రి సృష్టించారు. 1887 సంవత్సరం వరకు తెలుగులో ఈ సాహిత్య ప్రక్రియను వచన ప్రబంధమని సంభావించేవాళ్ళు. 1897 సంవత్సరంలో కాశీభట్ట బ్రహ్మయ్యశాస్త్రి రాజశేఖర చరిత్రను విమర్శిస్తూ వివేక చంద్రికా విమర్శనమన్న గ్రంథాన్ని ప్రకటించారు. ఈ విమర్శనలో ఆయన ఆధునికమైన ఈ ప్రక్రియను మనం ఇంగ్లీషు నుంచి తెచ్చుకున్నాం కాబట్టి పేరు కూడా తెచ్చుకొని ప్రచారపరచడం తప్పు లేదని నిష్కర్షించారు. ఆనాటినుండి నవలగానే నలుగుతూ ఈ ప్రక్రియను ప్రాచుర్యంలోకి తెచ్చారు. అంటే తెలుగు నవల పాతిక సంవత్సరాల వయసు వచ్చేవరకు దానికి పేరు నిర్ధారణ కాలేదన్నమాట.

మొదలి నాగభూషణశర్మ వాదననుసరించి తెలుగు నవలా సాహిత్యాన్ని 1872 నుండి 1900 వరకు ప్రారంభయుగంగా, 1900–1920 వరకు అనువాద యుగం, దేవచారిత్రక యుగంగా, 1920–1942 వరకు వికాస యుగంగా, 1942 –1960 వరకు మనోవైజ్ఞానిక

యుగంగా, తరువాత కాలాన్ని సమకాలిక యుగంగా విభజించి చెప్పవచ్చు. కాని విభజనకు తగినట్లు నవలలు వెలువడలేదు. మొదటినుండి అన్ని రకాల నవలలు రచింపబడ్డాయి.

కందుకూరి వీరేశలింగం పంతులు రాజశేఖర చరిత్రను మౌలికంగా తీసుకొనే తరువాత వారు రచనలు చేశారు. కాబట్టి ప్రారంభయుగం వీరేశలింగం పంతులుగారి యుగంగా భావింపబడుతుంది. ఈ యుగంలోనే చిలకమర్తి వారి కథాకథనంలోని సునిశితమైన హాస్యధోరణి పాఠకుల్ని ఆకర్షించేదిగా జనరంజకంగా ఉంది.

వికాసయుగం నవలలో రాజకీయ వాతావరణం, భావతీవ్రత కనపడుతుంది. ఉన్నవ లక్ష్మీనారాయణ, మునిమాణిక్యం నరసింహారావు, శ్రీపద సుబ్రహ్మణ్యశాస్త్రి, విశ్వనాథ, చలం, అడవి బాపిరాజు మున్నగువారు ఈ యుగంలో ప్రసిద్ధులైన కవులు.

స్త్రీలకు స్వేచ్ఛ, స్వేచ్ఛా ప్రణయాన్ని ప్రతిపాదిస్తూ తన శైలితో తెలుగు దేశాన్నంతా కదిలించిన వ్యక్తి చలం. రష్యాలో వెలిగిన శ్రామిక విప్లవం ప్రపంచ మేధావులను కదిలించింది. పెట్టుబడిదారి విధానంలోని లోపాలను, ప్రజాస్వామ్య విధానంలోని మేలు వివరించేది జి.వి. కృష్ణారావుగారి "కీలుబొమ్మలు". మారుతున్న సమాజంలో సర్దుకోలేని పాత్ర సీతారామారావును గోపిచంద్ అసమర్థుని జీవయాత్రలో చిత్రించారు. మహీధర రామమోహనరావుగారి "కొల్లాయిగట్టితేనేమి?" గాంధీజీ ఉద్యమాన్ని చిత్రించే నవల. కొడవటిగంటి కుటుంబరావు మధ్య తరగతి జీవితాలను అనే కోణాలనుంచి పరిశీలించి నవలలు వ్రాశారు.

మనోవైజ్ఞానిక యుగం నాటి నవలలో మనోభావాలను, మానసిక సంఘర్షణను యథాతథంగా చిత్రీకరించడం జరిగింది. బుచ్చిబాబు 'చివరకు మిగిలేది', గోపీచంద్ 'పరివర్తన', 'అసమర్థుని జీవయాత్ర', 'మెరుపుల మరకలు', పండిత పరమేశ్వరశాస్త్రి 'వీలునామా', రా.వి. శాస్త్రి 'అల్పజీవి', జి.వి. కృష్ణారావు 'కీలుబొమ్మలు', కొడవటిగంటి

కుటుంబరావు 'ప్రేమించిన మనిషి', 'కురూపి' మొదలైనవి ఈ ధోరణిలో వ్రాయబడ్డ నవలలే. ఈ ధోరణిలో ఇంకా నూతన ప్రయోగాలు చేసినవారు చాలామంది ఉన్నారు.

తెలుగు నవలల్ని పరిరక్షించి పోషించినవారు స్త్రీలు. స్త్రీల రచనలను ప్రచురించి ప్రోత్సహించిన ప్రథములు గృహలక్ష్మి సంపాదకులు డా॥ కె.ఎన్. కేసరి. ఆ తరువాత కూడా పక్షమాస పత్రికలు విశేషంగా బయలుదేరి, రచయిత్రుల సశేషమైన నవలల్ని ప్రకటించాయి. 1960 నుండి ఉగాది నవలల పోటీలలో నిలద్రొక్కుకున్న నవల నిలువెత్తున నిలిచింది.

తెలుగు నవలల పోటీని మొదటిసారి "చింతామణి" పత్రిక 1893లో నిర్వహించింది. రాజమండ్రి నుండి వెలువడిన ఈ మాసపత్రిక నిర్వహించిన పోటీకి మొదటిసారి మూడు నవలలు మాత్రం వచ్చాయి. నవలల అభివృద్ధికి పత్రికలు నిర్వహించి పాత్ర అన్యమైంది. ఈనాటి తెలుగు నవల యుగధర్మాన్ని సమగ్రంగా ప్రతిబింబిస్తున్నదన్నవచ్చు. కాని తెలుగు నవల పుట్టి నూరేళ్ళకు పైనబడ్డా నూరు మంచి నవలలు లభించడం కష్టమే అవుతుంది. మాలపల్లి, ఏకవీర, వేయి పడగలు, చివరకు మిగిలేది, అసమర్థుని జీవయాత్ర, అల్పజీవి, కీలుగుఱ్ఱాలు, చదువు లాంటి ఏ పదో లేక 15 నవలలో నవలా సమీక్షలో పేర్కొంటున్నాం. రా.వి. శాస్త్రి 'రాజు – మహిషి' నవల కూడా పూర్తిగా వస్తే ఈ శతాబ్దపు గొప్ప తెలుగు నవలల్లో స్థానం సంపాదించుకోగలదు. నూరేళ్ళకు పైబడ్డ తెలుగు నవలా చరిత్రలో రచయితలు, రచయిత్రులు వాసితోకన్నా రాసిలోనే ప్రాధాన్యతనిస్తున్నట్టు కనబడుతున్నది.

"నవల జీవితానికి ప్రతిబింబం. మిగిలిన సాహిత్య ప్రక్రియలకన్నా దీని పరిధి విస్తృతమైనది. నవలను మనం చాలా విధాలుగా చూడవచ్చు. కేవలం ఒక కథను చెప్పడం, కొన్ని ఆచారవ్యవహారాలను విదితం చేయడం, పాత్రల వ్యక్తిత్వాలను చిత్రించడం, జీవితంపై ఒక దృక్పథాన్ని ప్రేరేపించడం – ఇవన్ని నవల ఒక్కసారిగా గాని, వేరువేరుగా గాని చేస్తుంది" అంటాడు జె.బి. ప్రీస్ట్లీ. నవలలోని మంచిచెడులు దాన్ని తీర్చిదిద్దే విధానాన్నిబట్టి

ఉంటుంది. జీవితాన్ని లోతుగా చూచి అన్వయించే రచయిత నైపుణ్యం నవలకు ప్రాణం పోస్తుంది. ఆనందాన్ని కలిగించటం కన్న ఆలోచించేటట్లు చేయగలిగేది మంచి నవల.

నవల అనే సాహిత్య ప్రక్రియ మానవ స్వరూప స్వభావ చిత్రణకు సాంఘిక పరిస్థితుల వివరణకు అత్యంత అనుకూలమైనది కావటంచేత ప్రపంచ భాషలన్నిటిలోను ఒక ప్రత్యేక స్థానాన్ని పొందగలిగింది.

నవలాకారుల నవలల్లో ఈనాటి సాంకేతిక, వైజ్ఞానిక శాస్త్ర విషయాలు, కథాకథనం పడుగుపేకల్లా అల్లుకుపోయి పాఠకునికి ఒక నవల చదివినానన్న తృప్తితోపాటు శాస్త్రీయ విజ్ఞానాన్ని గురించిన కొంత అవగాహన కలిగిస్తున్నాయి. ఇలాంటి నవలలు వినోదవంతం, విజ్ఞానదాయకం కావడమే వీటి ప్రాచుర్యానికి ముఖ్య కారణం. కేవలం ఊహాకల్పితం, సామాన్య సమస్యాసంకీర్ణం అయిన నవల ఈనాటి పాశ్చాత్య పాఠకలోకంలో ఆదరణ పొందటం కష్టం. వస్తు గ్రహణంలోగాని, కథానిర్మాణంలోగాని, సన్నివేశచిత్రణలోగాని, పాత్రపోషణలోగాని నవ్యతతోపాటు ప్రస్తుత శాస్త్రీయ పరిశోధనాంశ వివరణలతో పాఠకునిలో అడుగడుగునా ఉత్సాహాన్ని రేకెత్తించగల నవలలు నేడు ఆదరింపబడుతున్నాయి.

## 3.2 నవలా దృక్పథం

స్వాతంత్ర్యం తరువాత సమాజంలో వచ్చిన పతనం 1950 సంవత్సరం తరువాత రచింపబడిన నవలల్లో కనపడుతుంది. ఈ కాలంలో వ్రాయబడిన నవలలు వ్యక్తిగత సమస్యలకు, కుటుంబ విషయాలకు పరిమితం అయినాయి.1950 నుంచి 1970 వరకు కాలాన్ని నవలారచనకు సంబంధించినంతవరకు సుషుప్తిదశ అనవచ్చు. ఈ కాలంలో అరవవాడైన నటరాజన్ "శారద" కలం పేరుతో 'అపస్వరాలు', 'ఏది సత్యం' వంటి గొప్ప నవలలు వ్రాశాడు. ముప్పాళ రంగనాయకమ్మ ప్రగతిశీల దృక్పథంతో రచించిన 'బలిపీఠం'

తెలుగు పాఠకులను కదిలించింది. సున్నితమైన శైలితో మృదువైన కథాకథనంతో 'సెక్రటరీ' వంటి నవలల ద్వారా యద్దనపూడి సులోచనారాణి ఒక ప్రత్యేక స్థానాన్ని ఏర్పరచుకున్నారు.

ఈ శతాబ్దంలో ఏడవ దశకంలో నక్సలైటు ఉద్యమం ప్రారంభమై యువతరాన్ని కదిలించింది. రెండు వేర్పాటు ఉద్యమాలు కూడా వచ్చాయి. ఈ దశకంలో వచ్చిన చైతన్యం నవలారంగంలోను కనిపిస్తుంది. దాశరథి రంగాచార్య 'చిల్లర దేవుళ్ళు', 'మోదుగుపూలు', 'జనపథం' నవలల్లో తెలంగాణా ప్రజాజీవితాన్ని చిత్రించారు. వాసిరెడ్డి సీతాదేవి రాజకీయాల్లో ఉన్న కుళ్ళును చిత్రిస్తూ 'సమత' వ్రాశారు. ఆమె వ్రాసిన 'మరీచిక' నక్సలైట్ ఉద్యమాన్ని చిత్రించే నవల. ఈ దశకంలో బీనాదేవి 'హేంగ్ మీ క్విక్', రావిశాస్త్రి 'రాజు – మహిషి', 'గోవులొస్తున్నాయి', 'రత్తాలు – రాంబాబు', వడ్డెర చండీదాసు 'హిమజ్వాల' వంటి ఎన్నో కళాత్మకంగా ఉన్నతమైన నవలలు వచ్చాయి. ఈ దశకంలో నవల మీద సినిమాల ప్రభావం ఎక్కువగా కనిపిస్తుంది. ఆ ధోరణిలో వ్రాయబడిన నవలలు పాఠకులను చదివించడానికి తద్వారా వారిలో ఆసక్తిని పెంచడానికి తోడ్పడ్డాయి.

నేటి తెలుగు నవలల్లో దారిద్ర్యం, ఆకలి, వ్యభిచారం, అధికారదర్పం, వర్గ పోరాటం మున్నగునవి సాంఘిక సమస్యలుగా చిత్రింపబడుతున్నాయి. ఇటువంటి నవలల వల్ల కాలక్షేపం తప్ప మరే ప్రయోజనమైనా ఉందా అనే ప్రశ్న ఎదురైనా అసంతృప్తి పడవలసిన స్థితి మాత్రం తెలుగు నవలకు పట్టలేదు. పాశ్చాత్య నవలా ప్రపంచంలో స్థానం సంపాదించగల ఉత్తమ నవలలు బుద్ధికి పదునుపెట్టి ఆలోచన రేకెత్తించగల రచనలు తెలుగులో ఉన్నాయి.

నవల పుట్టటానికి ముందు దాదాపు అన్ని భాషలలోను చాలాకాలం వరకు బహుశ ప్రచారాన్ని పొందుతూ ఉండిన సాహిత్య ప్రక్రియ మహాకావ్యం (ఎపిక్) రాజరిక జమీందారి సంస్కృతికి దర్పణం. తరువాత దశయైన బూర్జువా సంస్కృతి రూపొందించుకున్న సాహిత్య ప్రక్రియ నవల. ఆ సంస్కృతి నిర్మాతలై మధ్యతరగతి ప్రజలే నవలకు నిర్మాతలు, పోషకులు.

రాజాస్థాన సాహిత్యంలోని అవాస్తవికత, పలాయనతత్త్వం మీద వాస్తవికత చేసిన తిరుగుబాటు నవల. మధ్యతరగతి ప్రజలు బలీయమైన సామాజిక శక్తిగా రూపొందిన తరువాత వారిలో అక్షరాస్యత చాలా త్వరగా అభివృద్ధి చెందటానికి ముద్రణాయంత్రం చాలా తోడ్పడింది. వీరు పాండిత్యాన్నే కాక తమ ఆశలకు, ఆశయాలకు అనువైన సాహిత్యాన్ని కోరుకున్నారు. ఆ కోరికలో నుంచి నవల పుట్టింది. దానికితోడు 17వ శతాబ్దంలో జరిగిన బ్రిటీష్ విప్లవం యూరప్‌లో ప్రజల ఆలోచనా పద్ధతిని మార్చి వేసింది. సామాజిక సంబంధాల్లో మార్పులు వచ్చాయి. ఇలా నవల మారుతున్న సామాజిక సంబంధాలనుంచి ఉద్భవించింది. ఉన్నత వర్గాల ఆనందంకోసం సృష్టించబడ్డ అవాస్తవిక సాహిత్య ప్రక్రియ – రొమాన్స్ (ఒక రకంగా తెలుగు ప్రబంధం వంటిది) మీద తిరుగుబాటుగా మధ్యతరగతి ఆధునిక నవలను సృష్టించుకుంది. ప్రపంచ చరిత్రలో ఎన్నో విప్లవాత్మకమైన మార్పులకు కారణభూతమైన మధ్యతరగతివారు సాహిత్య చరిత్రలో అత్యంత విప్లవాత్మక పరిణామమైన నవల పుట్టుకకు కారణమయ్యారు.

## 3.3 నవలా నేపథ్యం

ఇంగ్లీషు నవల పదహారవ శతాబ్దంలో ఆవిర్భవించినప్పటికి కాల్పనికోద్యమము కాలానికి చెందిన సర్ వాల్టర్ స్కార్ట్‌తోనే ఆంగ్ల నవలలు వెలువడడం ప్రారంభమయింది. ఈ కాలపు నవలలకు సమకాలీన సమాజానికి సంబంధం లేదు.1830లో విక్టోరియన్ యుగం ప్రారంభమయినపుడు మతానికి, శాస్త్రీయ విజ్ఞానానికి మధ్య సంఘర్షణ ప్రారంభమయింది. చార్లెస్ డార్విన్ “ఓర్జిన్ ఆఫ్ స్పెసిస్” (Origin of Species) హేతువాదులలో సంచలనాన్ని కలిగించింది. పారిశ్రామిక విప్లవం ఫలితం కూడా మేధావుల్ని కలవరపెట్టింది. వీటన్నిటి ప్రభావం ఆనాడు సాహిత్యం మీద ఉన్నట్లు చార్లెస్ డికెన్స్ నవలలు చదివితే తెలుస్తుంది.

రొమాంటిసిసమ్‌కు పూర్తి వ్యతిరేకమైన రియలిజమ్ 19వ శతాబ్దంలో సాహిత్యంలో ప్రవేశించింది. జీవితాన్ని యథాతథంగా రచనల్లో చిత్రీకరించాలన్న అభిప్రాయంతో జార్జ్ ఇలియట్, ఆర్నాల్డ్ బిన్నిట్, టాల్‌స్టాయ్, బాల్జాక్, ఫ్లాబర్జ్ మొదలైన రచయితలు రియలిస్ట్ ధోరణిలో సమకాలీన సమాజంలోని సంఘటనను అద్భుతంగా వర్ణించారు. ఆకాశంలో మేడలు కట్టకుండా, తనచుట్టూ ఉన్న ప్రపంచాన్ని యథాతథంగా చూపిస్తూ, రచనలు చేసిన రియలిస్టిక్ నవలాకారులు నవలా సాహిత్యంలో ప్రముఖ స్థానాన్ని పొందారు.

రియలిజమ్ తరువాత వచ్చిన నేచురలిజమ్ ప్రభావంతో రాసిన నేచురలిస్ట్ నవలల్లో మానవ జీవితం సూక్ష్మాతిసూక్ష్మమైన వివరాలతో కనపడుతుంది. అలా చెప్పటంలో వీరికి సభ్యత, అసభ్యత వగైరా ఆలోచనలు ఉండవు. మనిషికి వారసత్వంగా వచ్చిన లక్షణాలు, చుట్టూ ఉన్న వాతావరణం అతని జీవితాన్ని తీర్చిదిద్దటమే కాకుండా, వాటినిబట్టే అతని ప్రవర్తన నిర్ణయించబడుతుందని నేచురలిస్టుల అభిప్రాయం. ఎమిలీజోలా, మొపాసా మొదలైన ఫ్రెంచి నవలా రచయితలు ఈ తరహా ధోరణిలో రచనలు చేశారు. నేచురలిజమ్, రియలిజమ్ సిద్ధాంతాల మధ్య కొన్ని తేడాలు ఉన్నప్పటికి ఈ సిద్ధాంతాల నవలల్లో వాస్తవ దృక్పథం కనపడుతుంది. జీవితాన్ని – ముఖ్యంగా అందులోని దుర్భర విషయాలను – సహజంగా, యథాతథంగా వర్ణించడమే సహజత్వవాదం. మానవ జీవితం నుంచి భగవంతుణ్ణి దూరంగా ఉంచటమే సహజత్వవాదమని స్వీడిష్ నవలా రచయిత అగష్ట్ స్ట్రిండ్‌బర్గ్ (1849–1912) అన్నాడు. ఇలాంటి రచనా పద్ధతిలో అద్భుతమైన రచనలు చేసినవాడు ఫ్రెంచి నవలాకారుడు ఎమిలీజోలా.

ఈ సిద్ధాంతాల తరువాత ప్రవేశించిన సింబాలిజమ్ వీటిని ఖండిస్తుంది. ఈ సింబాలిస్టులు బయటకు కనపడే విషయాలను కొన్ని భావాలకు ప్రతీకలుగా మాత్రమే భావిస్తారు. సాహిత్యంలో ఈ తరహా రచనా ధోరణులు 19వ శతాబ్దం చివరి భాగంలో ప్రవేశించి, 20వ శతాబ్దంలో చాలా మంది రచయితలకు రచనాయోగ్యంగా ఉండింది.

20వ శతాబ్దంలో ఒక దశాబ్దం తరువాత విశ్వసాహిత్యంపై ముద్రపడిన అస్తిత్వవాదం, మార్క్సిజంల ప్రభావం నవలా సాహిత్యంపై కూడా బలంగా కనిపిస్తుంది. అస్తిత్వవాదం సిద్ధాంతవాదులకు మనిషి ముక్యం, అతని అస్థిత్వం ముఖ్యం. మనిషిని కట్టుదిట్టాలలో ఉంచుదామనుకొన్న యాంత్రిక సిద్ధాంతాలన్నిటి మీద ఈ సిద్ధాంతం తిరుగుబాటు చేసింది. ఈ సిద్ధాంతం అంతకు ముందున్న సిద్ధాంతాలను వ్యతిరేకిస్తూ, వ్యవస్థకన్న వ్యక్తికి ప్రాధాన్యం ఇస్తూ ఒక ప్రత్యేక సిద్ధాంతంగా రూపొందింది. జీన్‌పాల్ సార్త్రే అస్తిత్వవాద సిద్ధాంతాన్ని గురించి వివరిస్తూ, మనిషి తనలోతాను ఉండేదానికి, తనకోసం ఉండేదానికి being in its self-yetre, Being for its self-etrepourosiగల తేడాను వివరించాడు. చైతన్యవంతుడైన మానవుడు తనలోతాను ఉండలేక తననుంచి తాను విడిపించుకొని చైతన్యంతో ముందుకు పోదామనుకుంటాడు. అయితే అస్వాభావికమైన ఈ కలయిక వల్ల ENSOI నుంచి పూర్తిగా బయటపడలేక POUROSI తో పూర్తిగా సంలీనం కాలేక అనంతాన్వేషణకు తీవ్రమైన ఆందోళనకు మానవుడు గురి అవుతున్నాడంటారు సిద్ధాంతకర్తలు. ఈ ఆందోళనను, అన్వేషణను తీసికొని సార్త్రే, కాఫ్కా, కేము మొదలైన నవలా రచయితలు 20వ శతాబ్దంలో అద్భుతమైన నవలలు వ్రాశారు. మొదటి, రెండవ ప్రపంచ యుద్ధ సమయంలో ప్రపంచవ్యాప్తంగా అలుముకున్న నిరాశ నిస్పృహలు ఈ తరహా సాహిత్యం ఉద్భవించడానికి, అభివృద్ధి చెందడానికి ప్రోదిని కల్పించింది. జీవితంలోని అసంబద్ధత – కార్యకారణ భావశూన్యత (Irrationality) ఈ తరహా నవలాకారులను బాగా ఆకర్షించింది. ఈ సిద్ధాంత నవలాసాహిత్యంలో పాత్రలు తమ బుద్ధికి తోటినట్లు అదుపు ఆజ్ఞ లేకుండా ప్రవర్తిస్తుంటాయి.

మేధావుల ఆలోచనలో వచ్చిన మరో మార్పుల మార్క్సిజమ్. ఈ మార్క్సిజమ్ ప్రభావంతో వర్గాల గురించి వాటి మధ్యగల సంఘర్షణ గురించి హృదయాలు కరిగేలా రచనలు వెలువడడం ప్రారంభమయింది. ఆర్థికంగా అట్టడుగు స్థితికి దిగజారిపోయిన మనిషి

గురించి, అతని ఆకలి గురించి వాస్తవ దృక్పథంతో మాక్జిమ్ గోర్కి (Maxim Gorky) రచనలు చేశాడు.

నవలా సాహిత్యంపై హేతువాద ధోరణులు, నిర్హేతుకవాద ధోరణులు ఒకదాని తరువాత ఒకటి పడుతున్న రోజుల్లోనే, మనస్తత్వ విశ్లేషణ నవలలు వెలువడ్డాయి. వ్యక్తి తానున్న సమాజంలోనే కాక తనలోతాను పడే సంఘర్షణను మనస్తత్వశాస్త్ర సిద్ధాంతాల ప్రభావంతో ఈ నవలల్లో అద్భుతంగా చిత్రించడం జరిగింది. దీనివల్ల మొదటి ప్రపంచ యుద్ధం తరువాత నవలాశిల్పంలో చెప్పుకోదగ్గ మార్పు వచ్చింది. మనస్తత్వ విశ్లేషణ నవలల్లో పాత్రల అంతరంగం అద్దంలా కనపడుతుంది. ఫ్రాయిడ్, అడ్లర్, యూంగ్, బెర్గ్‌సన్ మొదలైన మనస్తత్వవేత్తల సిద్ధాంతాలు ఈ నవలలకు కొత్త ఊపిరిని పోశాయి.

1872 నుండి తెలుగు నవలా పరిణామ చరిత్రను గమనిస్తే పై సిద్ధాంతాల ప్రభావం తెలుగు నవలలపై కొద్దో గొప్పో కనపడుతుంది. తెలుగు నవల వెలువడిన తొలినాళ్ళలో నవలా సాహిత్యంపై విక్టోరియన్ యుగపు ఆంగ్ల నవలల ప్రభావం ఉంది. మొదటి ప్రపంచ యుద్ధం ప్రారంభమయినపుడు ఉన్న కొత్త, పాత భావాలకు మధ్య సంఘర్షణ తెలుగు సాహిత్యంలో బాగా కనపడుతుంది. మొదటి ప్రపంచ యుద్ధానంతరం వ్యక్తికి, వ్యవస్థకు మధ్య జరిగే పోరాటం తెలుగు నవలా సాహిత్యంలో మరికొన్ని కొత్త పోకడలను తీసుకువచ్చింది. అస్తిత్వవాద ప్రభావం, మార్క్సిజం ప్రభావం చోటు చేసుకున్నాయి. మొదటి ప్రపంచ యుద్ధానంతర కాలంలో ప్రపంచమంతటా బాగా ప్రచారంలోకి వచ్చిన ఫ్రాయిడ్, అడ్లర్, యూంగ్ ఇత్యాదుల సిద్ధాంతాలను తెలుగు నవలాకారులు అర్థం చేసుకొని ఆ సిద్ధాంతాల ప్రేరణతో జేమ్స్ జాయిస్, వర్జీనియా ఉల్ఫ్ ఇత్యాదులు రచించిన నవలలు చదివి ఆ ధోరణిలో రచనలు చేయడం ప్రారంభించారు. మనిషి అంతరంగంలో కనిపించకుండా ఉండిపోయిన మరో మనిషిని చిత్రీకరించడం తెలుగు నవలాకారులు ప్రారంభించారు.

అక్షరాస్యతతోపాటు ముద్రణా సౌకర్యాలు పెరిగి జనం దగ్గరికి సాహిత్యాన్ని తీసుకొని వెళ్ళడానికి అవకాశం ఉన్న ఈ రోజుల్లో, జనామోదం పొందిన సాహిత్యాన్ని అందజేయడానికి వాణిజ్య పత్రికలు ప్రయత్నిస్తున్నాయి. జనం బలహీనతలను సంతృప్తిపరిచే సాహిత్యాన్ని సృష్టిస్తూ 'కళ కళకోసం, ఆనందం కోసం' అనే సిద్ధాంతాన్ని నినదిస్తున్నాయి. నిజానికి మధ్యతరగతి వారిని ఆలోచింపచేసి, తమ సమస్యలను గుర్తించే అవగాహన కలిగించే సాహిత్యం వారు అంగీకరించే పద్ధతిలో వెలువడవలసి ఉంది. సామాన్య జనంలో ఎక్కువ ప్రచారంలో ఉన్న సాహిత్య కళారూపాలను గ్రహించి, వారికి నచ్చే భాషలో చెప్పి, తమ సమస్యలను పరిష్కరించుకొని శాశ్వత ఉపశమనం పొందటానికి కావలసిన అవగాహనను వారికి నచ్చే పద్ధతిలో అందజేయవలసి ఉంటుంది. జనామోదకర సాహిత్య ప్రక్రియలలో ఒకటైన నవల జనంలో పఠనాసక్తిని పెంచడంతోబాటు పూని ఏదయినా ఒకే మేలు దారిని చూపించాలి. సాంఘిక చైతన్యం  ఏ కొంచెం, ఏ మూల కలిగినట్లు స్ఫురించినా ఆ రచన సార్థకమైనట్లే.

## 3.4. నవలా ప్రక్రియ – పరిచయం

1835వ సంవత్సరంలో లార్డ్ మెకాలే ప్రతిపాదల్ని అనుసరించి మన దేశంలో ఆంగ్ల విద్యా విధానం ప్రవేశపెట్టబడింది. ఆంగ్ల విద్య వల్ల వివిధ దేశాలలోని, వివిధ భాషలలోని విస్తృత పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చింది. అప్పటివరకూ అక్షర జ్ఞానంతో సంబంధమున్న వర్గాలతోపాటు, అక్షర జ్ఞానం లేనివారు కూడా చదువుకోవడం ప్రారంభించారు. ఆంగ్ల సాహిత్యాన్ని చదివినవారు అందులోని భావాలను, చారిత్రకాంశాలను, పాశ్చాత్య సంస్కృతిని, వివిధ ఉద్యమ వికాసాలను భారతీయ భాషల్లోకి అనువదించడం మొదలుపెట్టారు. ఇదే సమయంలో తెలుగులో మూస సాహిత్య సంప్రదాయానికి కాలం చెల్లి, కొత్త సాహిత్య సృష్టికి అవకాశం ఏర్పడింది.

ఆంగ్ల సాహిత్య పరిజ్ఞానం వల్ల తెలుగులో సృజనాత్మక వచన సాహితీ ప్రక్రియలు వెలుగు చూశాయి. వాటిలో ఖండకావ్యం, వచన కవిత, వచన గేయం, కథ, కథానిక, ఏకాంకిక, జీవిత చరిత్ర, స్వీయచరిత్ర, నాటకం, నవల ముఖ్యమైనవి. కొత్తగా రంగప్రవేశం చేసిన ఈ వచన సాహితీ ప్రక్రియలు ఆధునిక మానవ జీవితాన్ని యదార్థ దృష్టితో అధ్యయనం చేసి వాస్తవ జీవిత చిత్రణకు పూనుకోవడం చెప్పుకోదగ్గ విశేషం. ఆధునిక సాహిత్య ప్రక్రియలు సమాజంలో ప్రజల ఆలోచనా విధానాన్నీ, విజ్ఞాన పరిధిని కూడా పెంచాయి. అంతవరకూ పాతుకుపోయిన సంస్కృత, ప్రాకృత భూయిష్ఠమైన ప్రాచీన సాహిత్యానికి ఆదరణ తగ్గి, భిన్నమైన వచన సాహిత్యానికి ఆదరణ పెరిగింది. సామాజికపరమైన వాస్తవిక సంఘటనలను యదార్థంగా చిత్రించడం వలన ఈ వచన సాహితీ ప్రక్రియలు సామాన్య ప్రజానీకానికి ఇంకా చేరువయ్యాయి. సంస్కరణోద్యమ, జాతీయోద్యమ, స్వాతంత్ర్యోద్యమాల ఫలితంగా కవులు, రచయితలు అస్పృశ్యుల జీవితాలను ఇతివృత్తాలుగా స్వీకరించి రచనలు చేయడం మొదలుపెట్టారు.

ఆధునికమైన సాహిత్య ప్రక్రియల్లో 'నవల' విశిష్టమైనది. నవల విశాలమైన కాన్వాస్ కలిగి ఉండడం వల్ల ఎంత సంక్లిష్టమైన జీవిత చిత్రణ అయినా చేయవచ్చు. నవల వచనంలో ఉండడంవల్ల ఎక్కువమంది చదువుకోగలరు. అర్థం చేసుకోగలరు. ప్రధానంగా నవల సామాజిక చిత్రణకు బాగా ఉపయోగపడుతుంది. నవలా రచనలో వస్తు స్వీకారం, ఇతివృత్త నిర్మాణం, పాత్ర చిత్రణ, నేపథ్యం, దృక్పథం వగైరాలు ముఖ్య అంశాలుగా ఉంటాయి.

సామాజిక అవసరాలు కొత్త సాహిత్య ప్రక్రియ ఆవిర్భావానికి దోహదపడతాయి. జీవితాన్ని విశాల పరిధిలో చిత్రించే అవకాశం 'నవల'కు తప్ప మరే సాహిత్య ప్రక్రియకు లేదు. 19వ శతాబ్దంలో ఆంగ్ల సాహిత్య సంపర్కంవల్ల 'నవల' తెలుగులోకి వచ్చింది. ఆంగ్లం నందలి 'NOVEL'అనే పదానికి పర్యాయపదంగా తెలుగులో 'నవల' అనే పదం వెలిసింది.

ఈ రకమైన రచనా విధానానికి 'నవల' అన్న పేరును పెట్టినది మాత్రం కాశీభట్ల బ్రహ్మయ్య శాస్త్రిగారు.

నవల అంటే 'కొత్త కథ' అనే అర్థం కనిపిస్తుంది. నవలకు ప్రధానం ప్రేరణ రోజూ మనం చూసే మానవ సమాజమే. సామాజిక వాస్తవికతే దీనికి ప్రాణధారం.

The Development of English Novel అన్న గ్రంథంలో రిచర్డ్ క్రాస్ అనే పండితుడు నవల గురించి చెప్పిన మాటలకు తెలుగు అనువాదం ఇలా ఉంది...

'*యదార్థ జీవనాన్ని యదార్థ దృష్టితో అధ్యయనం చేసి దానిని*

*గద్యరూపంలో వ్యక్తం చేసేదే నవల"*

భాష, శైలి, సన్నివేశాలు, సంఘటనలు, పాత్ర చిత్రణ, వర్ణనలు నవలకు సమగ్ర రూపాన్ని చేకూరుస్తున్నాయి. అనతికాలంలోనే 'నవల' ఆధునిక మానవ జీవితాన్ని ప్రతిబింబిస్తూ, బహుళ జనాదరణ పొంది సాహిత్య ప్రక్రియల్లోకెల్లా తలమానికంగా నిలిచింది. అందువల్లే నవలను 'ఆధునిక మహాకావ్యం'[44] అన్నారు.

ఆంగ్ల సాహిత్య ప్రభావం వల్ల తెలుగులోకి వచ్చిన 'నవల' ప్రారంభంలో ఉపదేశాత్మక భావాలతో మొదలైంది. జాతీయోద్యమ కాలంలో రాజకీయ స్పర్శను పొందింది. స్వాతంత్ర్యోద్యమ కాలంలో పోరాట పటిమను ప్రదర్శించింది. ఆ తర్వాత మనస్తత్వ పరిశీలనకు పూనుకొంది. కొంతకాలం నేల విడిచి ఆకాశంలో పయనించింది. మరికొంతకాలం క్షుద్ర భావాలకు నిలయమైంది. ఆ తర్వాత వ్యాపార ధోరణిలో కొట్టుమిట్టాడింది. మళ్ళీ ఉద్యమ బాటలోకి వచ్చింది. అక్కడి నుండి స్త్రీవాద భావాలకు వాహికగా నిలిచింది. దాని తర్వాత దళిత జీవిత చిత్రణకు పెద్ద పీట వేసింది.

---

[44] సాహిత్య దర్శనం. కాకర్ల వెంకట రామనరసింహం. పుట: 613

స్వాతంత్ర్యానంతరం దళిత జీవితాన్ని బలంగా చిత్రించిన ఆధునిక సాహిత్య వచన ప్రక్రియల్లో నవలకు ఒక ప్రత్యేక స్థానం ఉంది.

## 3.5. నవలిక స్వరూపం

నవల, కథానికా భిన్న స్వరూపాలు గల రచనా ప్రక్రియలు నవలకు విస్తృతమైనక్యాన్వాస్ ఉంటుంది. కథకు పరిమితమైన అంశం ఇతివృత్తంగా ఉంటుంది. కవిత్వం, నాటకం, కావ్యం, ఏవి రాయాలన్నా పాండిత్యం అవసరం. వాటిని చదవటానికి ఎంతో కొంత భాషా పరిజ్ఞానం ఉంటే తప్ప అవి కొరుకు పడవు. నవల చదవటానికి సాహిత్య నేపథ్యం అవసరం లేదు. 1920 దశకాలకే నవల తెలుగులో ప్రాచుర్యం పొందింది. ముదిగంటి సుజాతారెడ్డి 'తెలుగు నవలానుశీలనం' అనే గ్రంథంలో ఈ క్రింది అంశాలను పేర్కొన్నారు:

"పాశ్చాత్య సాహిత్యంలో నవలా ప్రక్రియ నిలదొక్కుకున్న తర్వాతనే భారతీయ భాషల్లోకి ప్రవేశించింది. అయినా భారతీయ భాషల్లో నవల వెంటనే సంపూర్ణ వికాసంతో రూపుదిద్దుకొని పాఠకులను ఆకర్షించలేదు, ఆదరణను సంపాదించుకోలేదు. భారతీయ భాషల్లో నవల ప్రాచీన కథా కావ్యాల కథాశైలులకు దగ్గరగా కొనసాగి మెలమెల్లగా పాశ్చాత్య నవలా రూపానికి దగ్గరైంది. రచయితలు ఒక్కసారే భారతీయ కథ, శైలుల వాసనలను వదిలి పాశ్చాత్య కథ, శైలులను స్వంతం చేసుకోలేక పోయారని చెప్పవచ్చు"[45].

తెలుగు నవలపై పరిశోధన చేసిన మొదలి నాగభూషణశర్మ, బొడ్డపాటి కుటుంబరావు, శ్రీరంగరాజచరిత్రనే (1872), నరహరి గోపాలకృష్ణమశెట్టి (డిప్యూటీ కలెక్టర్, కర్నూల్) తొలి నవల అని పేర్కొన్నారు. శెట్టిగారు దీనికి నవీన ప్రబంధం అని పేరు పెట్టారు. ఈ కథ చారిత్రక యదార్థత కలది. ఆ తరువాత వీరేశలింగంగారి రాజశేఖర చరిత్ర నవలను

---

[45] తెలుగు సాహిత్య చరిత్ర – డా॥ ద్వానాశాస్త్రి, పుట: 627

వివేకవర్ధిని పత్రికలో ధారావాహికంగా ప్రచురిస్తూ తెలుగులో మొదటి వచన ప్రబంధం నేనే చేశానని తన స్వీయ చరిత్రలో పేర్కొన్నారు. కానీ దానిని విమర్శకులు కొందరు అంగీకరించలేదు.

నవల అనే పదం ఆంగ్లంలోని Novel అనే పదం నుండి వచ్చింది. అయితే కాశీభట్ల బ్రహ్మయ్యశాస్త్రి 'నవాన్ విశేషాన్ లాతీగృహ్ణాతీత నవల"– కొత్త విశేషాలు గలది నవల అని తీర్మానించారు. తెలుగులో నవల అనే పదం స్థిరపడింది. మరాఠీ, గుజరాతీ, కన్నడ భాషలలో నవలను కాదంబరీ అంటారు. హిందీ, బెంగాలీ భాషలో మొదట నవన్యాస్ అని పిలిచినా ఉపన్యాస్ అనే పదం స్థిరపడింది. కందుకూరి వీరేశలింగం తమ పత్రిక చింతామణిలో నవలల పోటీ నిర్వహించినప్పుడు (1892) కొన్ని నిబంధనలు ప్రకటించారు. దానిని బట్టి ఆనాటి నవలా లక్షణాలు తెలుసుకోవచ్చు:

"వచన ప్రబంధమనగా కల్పిత కథ. ఆ కథను పురాణేతిహాసాదుల నుండిగాని చరిత్రల నుండిగాని గైకొని కథా సారస్యమున కనుకూలముగనుండు నూతనాంశములను చేర్చి పెంచి వ్రాయవచ్చును లేదా కవి మొదటి నుండి కడవరకు స్వబుద్ధి చేతనే నూతన కథను కల్పించియైనను వ్రాయవచ్చును. శృంగారమూ, విరహమూ ఏదో ఒక రసమును ప్రధానముగా చేసుకొని వివిధ రసయుతముగా నుండునట్లుగాని యాయా రసమును పోషించుటకై వివిధ కష్టసుఖములను, ప్రయత్నములను, కార్య విఘాతములను, కార్య సాఫల్యములను మధ్యమధ్య సందర్భోచితముగా తీసుకొని వచ్చుచూ కథయంతయు నొక్కని చరిత్రమువలె నుండునట్లు వ్రాయవలెను. దుష్కార్యము వలన మొదట కొంత కాలము కార్య సిద్ధియగునట్లు కనపడినను కడపట కృషి యంతయు విఫలము. ధర్మమునకే విజయము కలుగుట మొదలైన సంగతులను బలపరిచి వ్రాయవలెను"[46].

[46] తెలుగు సాహిత్య చరిత్ర – డా॥ ద్వానాశాస్త్రి, పుట: 629.

నవల ఇలానే ఉండాలని గిరిగీసి చెప్పలేం. కానీ సాహిత్య పరిశోధకులు కొన్ని ప్రమాణాలను ఏర్పరచారు. తెలుగు నవలల్లో సామాజిక చైతన్యం అనే తన పరిశోధనా గ్రంథంలో డా॥ పి. సంజీవమ్మ ఇలా నిర్వహించారు.

"నవల జీవితానికి ప్రతిబింబం. మిగిలిన అన్ని సాహిత్య ప్రక్రియల కన్న దీని పరిధి విస్తృతమైంది. నవలను మనం చాలా విధాలుగా చూడవచ్చు. కేవలం ఒక కథను చెప్పడం – కొన్ని ఆచార వ్యవహారాలను విదితం చేయడం – పాత్రల వ్యక్తిత్వాలను చిత్రించడం – జీవితంపై ఒక దృక్పథాన్ని ప్రేరేపించడం. ఇవి అన్నీ ఒక్కసారిగా కాని, వేరు వేరుగా కాని చేస్తుంది"[47] ఆంగ్లేయులు ఇలా నిర్వచించారు.

నవలకు, కథకు రెండింటికి సాంఘిక ఇతివృత్తం ప్రధానం. కానీ నవలకున్న విస్తృతి కథానికకు లేదు. పరిమితమైన సంఘటన, పరిమితమైన పాత్రలు కలది కథానిక.

## నవలలో ప్రధానంగా నాలుగు ప్రధానాంగాలు

1) కథ.

2) కథా ఇతివృత్తం.

3) పాత్రలు.

4) నేపథ్యం.

ఇవి పరస్పరాశ్రయాలు. ఏ ఒకటి లోపించినా, బలహీనమైన నవల సారహీనమవుతుందని వల్లంపాటి వెంకటసుబ్బయ్య పేర్కొన్నారు. నవలలో ప్రధానాంకం నేపథ్యం.

---

[47] తెలుగు సాహిత్య చరిత్ర – డా॥ ద్వానాశాస్త్రి, పుట:630.

## 3.6 నవలల వర్గీకరణ

### i) సాంఘిక నవలలు

వేయి పడగలు, మాలపల్లి, అసమర్థుని జీవయాత్ర, అల్పజీవి, అంపశయ్య మొదలైనవి.

### ii) హాస్య, వ్యంగ్య నవలలు

బారిష్టర్ పార్వతీశం (మొక్కపాటి), గణపతి (చిలకమర్తి), విష్ణుశర్మ ఇంగ్లీషు చదువు (విశ్వనాథ), ఇద్దరమ్మాయిలు, ముగ్గురబ్బాయిలు (ముళ్ళపూడి), కార్ఖానోపాఖ్యానం (నంపాసా) మొదలైనవి.

### iii) రాజకీయ నవలలు

మాలపల్లి ఉన్నవ లక్ష్మీనారాయణ, కీలుబొమ్మలు (జి.వి. కృష్ణారావు), కొల్లాయి గట్టితేనేమి (మహీధర రామమోహనరావు), గోవులొస్తున్నాయి జాగ్రత్త (రావిశాస్త్రి), రామరాజ్యానికి రహదారి (పాలగుమ్మి) మొదలైనవి.

### Iv) డిటెక్టివ్ నవలలు

మాయావి (వేంకట పార్వతీశ కవులు), వాడేవీడు (దేవరాజు వెంకట కృష్ణారావు), టెంపోరావ్, కొమ్మూరి సాంబశివరావు, విశ్వప్రసాద్ వారి నవలలు (చౌకబారు నవలలు) మొదలైనవి.

### v) విజ్ఞాన శాస్త్ర నవలలు (సైన్స్ ఫిక్షన్)

విహంగయానం (టేకుమళ్ళ రాజగోపాలరావు), చిత్రగ్రహం (రావూరి భరద్వాజ), గుడ్‌బై భూదేవి గుడ్‌బై (ఎన్.ఆర్. నంది) మొదలైనవి.

### vii) పౌరాణిక నవలలు

సౌందర్య తిలకము (చిలకమర్తి), కేతవరపు వెంకట శాస్త్రి రాసిన 'మదాలస', ద్రౌపది (కె. రామలక్ష్మి) మొదలైనవి.

**viii) చారిత్రక నవలలు**

హిమబిందు (అడవి బాపిరాజు), కర్పూర మంజరి (చిలకమర్తి), ఏకవీర (విశ్వనాథ), నారాయణ భట్టు, రుద్రమదేవి (నోరి నరసింహశాస్త్రి), చెంఘీజ్ ఖాన్ (తెన్నేటి సూరి), రామప్ప గుడి, నరమేధం (వసుంధర), లల్లాదేవి (ముదిగొండ శివప్రసాద్) నవలలు.

**ix) బాలల నవలలు**

రాజు–పేద (నండూరి రామమోహనరావు అనువాదం).

పేనూ–పెసర చేనూ (నార్ల చిరంజీవి),

మా సుందరి (చింతాదీక్షితులు),

బుడుగు (ముళ్ళపూడి) మొదలైనవి.

తెలుగు నవలా సాహిత్యానికి దాదాపు 130 సంవత్సరాలు చరిత్ర ఉంది. వేల నవలలు వచ్చినా ప్రాచుర్యం పొందినవి వందలలో ఉంటాయి. వారపత్రికల ప్రోత్సాహం వల్ల చాలామంది రచయిత్రులు నవలలు పుంఖానుపుంఖాలుగా రాశారు. యద్దనపూడి సులోచనరాణి, కోడూరి కౌసల్యదేవి నవలలు విపరీతంగా అమ్ముడుపోయాయి. మధ్యతరగతి ప్రజలు వీటిని విశేషంగా ఆదరించారు. సినిమా తరహా కథలతో ఈ నవలలు వ్యాపార నవలలుగా గుర్తించబడ్డాయి. కొన్ని నవలలు సినిమాలుగా కూడా రూపొందాయి. విశ్వనాథ సత్యనారాయణ పురాణవైర గ్రంథమాల పేర అనేక నవలలు వ్రాశారు. ఆయన నవల 'వేయి పడగలు' ఇటీవలే ఆంగ్లంలోకి కూడా అనువదించబడింది. పద్మనాభరావు ఆ నవలలోని ఆరు ఘట్టాలను ఆంగ్లంలోకి అనువదించారు. మొక్కపాటి వారి బారిష్టర్ పార్వతీశం,

చిలకమర్తివారి గణపతి హాస్య ప్రధానమైన నవలలు. స్త్రీవాద దృష్టితో రాసిన చలం నవలలకు పాఠకుల సంఖ్య పెరిగింది.

'భారతీయ సుప్రసిద్ధ గ్రంథాలు తెలుగు' అనే రచనలో పద్మనాభరావు కొన్ని నవలలను సంక్షిప్తీకరించారు. అందులో ప్రధానంగా ఈ నవలలు ఉన్నాయి.

1. రాజశేఖర చరిత్ర – కందుకూరి వీరేశలింగం పంతులు (1878).
2. గణపతి – చిలకమర్తి (1919).
3. మాలపల్లి – ఉన్నవ లక్ష్మీనారాయణ (1922).
4. బారిష్టర్ పార్వతీశం – మొక్కపాటి (1929).
5. దైవమిచ్చిన భార్య – చలం (1923).
6. కోనంగి – అడవి బాపిరాజు (1948).
7. రుద్రమదేవి – నోరి నరసింహశాస్త్రి (1951).
8. అసమర్థుని జీవితయాత్ర – గోపీచంద్ (1956).

"ఈ ఎనిమిది నవలలు నవలా సాహిత్యంలో మణిపూసలవంటివి. పద్మనాభరావు రచన ఆంగ్లం, హిందీ, ఒరియా భాషలలోకి కూడా కేంద్రప్రభుత్వ ప్రచురణ విభాగంవారు ప్రచురించారు"[48].

[48] భారత సుప్రసిద్ధ గ్రంథాలు తెలుగు, ఆర్. అనంతపద్మనాభరావు, పుట: పీఠిక.

## 3.7 అనంత పద్మనాభరావు నవలలు– విశ్లేషణ

అనంత పద్మనాభరావు 1971–80 మధ్య కాలంలో నాలుగు నవలలు రాశారు. ఈ నవలలు వ్రాయటానికి ప్రేరణ ఆంధ్రప్రభ వారపత్రికవారు ఏటా నిర్వహించే నవలల పోటీ 1971, 72, 73 సంవత్సరాలలో వరుసగా పోటీకి దీక్షగా మూడు నవలలు వ్రాశారు.

### 1. సంజవెలుగు

ఈనవల 1980 సంవత్సరంలో ముద్రింపబడింది. మొత్తం పుటలు 208. 24 ప్రధాన సన్నివేశాలతో కూడుకొని ఉంది.

### 2. వక్రించిన సరళరేఖ

ఈనవల 1980లో ముద్రింపబడింది. మొత్తం పుటలు 212. 21 ప్రధాన సన్నివేశాలతో ఈ నవల రచించబడింది.

### 3. మారని నాణెం

ఈ1973 సంవత్సరంలో ముద్రింపబడినది. మొత్తం పుటలు 178. 25 ప్రధాన సన్నివేశాలతో ఈ నవల రచించబడింది. ఇది పునర్ముద్రణ చేశారు.

ఈ మూడు నవలలే కాక సెప్టెంబర్ 1980లో “స్వగతాలు” అనే పేర 21 అధ్యాయాలు గల ఒక నవలను రాశారు. 1973లో ‘మారని నాణెం’ నవలను స్వయంగా ముద్రించారు. అవి 1000 కాపీలు అవి అమ్ముడుపోగా రెండవ ముద్రణను 1977లో వేశారు.

సంజవెలుగు, వక్రించిన సరళరేఖ నవలలను విజయవాడలోని సిద్దార్థ పబ్లికేషన్స్ వారు ప్రచురించారు. అప్పట్లో రచయితకు రాయల్టీ (పారితోషికం) వింటే నవ్వు వేస్తుంది. పేజీకి నాలుగు రూపాయల చొప్పున రెండు నవలలకు మొత్తం కలిపి 1,696/–లను చెల్లించారు. ఈ మూడు నవలలు ప్రచురణ అయిన దరిమిలా 1980లో ‘కలెక్టర్ బంట్రోతు’

(స్వగతాలు) అనే నవలను ప్రారంభించారు. దాని వ్రాత ప్రతి ఇప్పటికీ మూడు నోట్ బుక్ లలో భద్రంగా ఉంది. నాలుగు నవలలు వ్రాసినా ఏదీ వార, మాస పత్రికలకు రుచించలేదు అనే కొరత మిగిలిపోయింది. దానికి కారణం నవలలో మసలా జోడించక పోవడమే.

స్వగతాలు నవల చాలా కాలం చతుర మాస పత్రిక కార్యాలయంలో నిద్రించింది. ఏదో ఒక విధంగా దానిని ప్రచురింపజేయాలనే తాపత్రయంలో నవలలోని 21 అధ్యాయాలను పన్నెండుకు కుదించి నవలికగా ఆంధ్రభూమి కార్యాలయానికి పంపారు. అప్పటి సంపాదకులు సి. కనకాంబరరాజు ఈ నవలను 1996 లో మాస పత్రికకు అనుబంధంగా ప్రచురించారు.

మిగిలిపోయిన తొమ్మిది ఘట్టాలను విడి కథలుగా తమ కథా సంపుటాలలో ప్రచురించారు. పాత్రల పేరు, సన్నివేశాలు మార్చలేదు. ఆ కథల వివరాలు.

**1)'మాకూ ఉన్నాయి స్వగతాలు'– కథా కమామీషూ**

ఈ కథ 1985లో వేదగిరి రాంబాబు ప్రచురించిన డైరెక్టు కథా సంకలనంలో (వినూత్న కథ) ప్రచురింపబడింది.

**2) 'ఆత్మాభిమానం'– కథా కమామీషూ**

ఇందులో నరసింహులు పేరు కోటయ్యగా మార్చారు.

**3)'గోరింట పూచింది'**

ఈకథాసంపుటిలోని 'నారిగాడు' కథ కూడా కలెక్టరేట్ వాతావరణంలో మలచబడింది.

## 3.8 నవలల్లో ఇతివృత్త వైవిధ్యం

పద్మనాభరావు సంప్రదాయ కుటుంబంలో పుట్టి పెరిగి ప్రాచీన సాహిత్యంపై మక్కువ కలిగిన వ్యక్తి. ఆచార వ్యవహారాలలోనూ, సంప్రదాయాల పాటింపులోనూ ఎంత ఛాందసుడూ ఆధునిక భావజాలంతో కూడిన ప్రవర్తనలో అంతే ముందుంటాడు. అందుకే తాను ఎంచుకున్న నాలుగు నవలల్లో తనచుట్టూ ఉన్న వాతావరణాన్ని తనను బాగా ప్రభావితం చేసిన వ్యక్తుల జీవన రేఖలను నవలల్లో ప్రతిఫలింపజేశాడు.

### 1. మారని నాణెం.

1967–75 మధ్య కాలంలో రచయిత కందుకూరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు అధ్యాపకులుగా పనిచేశారు. వీరి సహోద్యోగి ఒకరు ఛాందసంగా ప్రవర్తించేవారు. ఆయన గుణగణాలను, ఆయన స్వభావాన్ని దృష్టిలో పెట్టుకొని ఈ నవల్లో ప్రధాన నాయకుడిని గోపాలరావు అనే పేరుతో తీర్చిదిద్దారు. ఈ నవల రాయటానికి ముందు రచయిత అప్పట్లో వెలువడ్డ వందకు పైగా నవలలు చదివి వాటి శైలిని గమనించారు. పోలాప్రగడ సత్యనారాయణమూర్తి హాస్య ధోరణి వీరికి బాగా నచ్చింది. బారిష్టర్ పార్వతీశం, గణపతి వలె ఒక పాత్రను సృష్టించాలని సంకల్పించారు ఫలితంగా గోపాలరావు జన్మించాడు. అతడు ముక్కుకుసూటిగా పోయే వ్యక్తి. లోకం పోకడలు తెలియవు. రోజూ గొడుగు వేసుకొని కాలేజీకి వచ్చే గోపాలరావును విద్యార్థులు ఆటపట్టించేవారు. సహాధ్యాపకులు సరేసరి. కుటుంబంలోని వారు కూడా అతని అమాయకత్వాన్ని ఆసరా చేసుకొని ఏదో విధంగా అతని వద్ద డబ్బు గుంజేవారు. చివరకు 'తాను మారాలి' అనే నిశ్చయానికి వస్తాడు గోపాలరావు. ఈ నవల ఇతివృత్తం కళాశాల పరిసరాల చుట్టూ, కుటుంబ పరిసరాల చుట్టూ తిరుగుతుంది. వీరి నవలలు మూడింటిపై పరిశోధన చేసిన టి.శ్యాంప్రసాద్ (శ్రీకృష్ణదేవరాయల యూనివర్సిటీ) మారని నాణెం నవలలోని గ్రామీణ వాతావరణాన్ని గూర్చి చెబుతూ

"రచయిత గ్రామీణ ప్రజల కలగొలుపుతనం, పల్లె ప్రజలకు, పట్టణవాసులకు గల వ్యత్యాసాన్ని తెలియజేస్తూ గ్రామీణ జీవిత విధానాన్ని చక్కగా వర్ణించడం జరిగింది"[49]. ఈ నవలలో సందేశాన్ని వివరిస్తూ శ్యాంప్రసాద్ ఇలా అంటారు "సమాజంలో జరుగుతున్న వివిధ సంఘటనలను రచయిత నిశితంగా విమర్శిస్తూ చేసిన రచనల్లో సమాజాన్ని మోసం చేసే వివిధమైన జీవన విధానాలను ప్రతిబింబిస్తూ ఆయా సందర్భాలలో ఆయా విషయాలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు రచయిత చిత్రీకరించిన విధానం సామాజిక తరగతి శక్తులకు హెచ్చరికగా, పురోగతి శక్తులకు ఓ సందేశంగా ఉంది"[50].

## 2. సంజ వెలుగు

గ్రామీణ వాతావరణంలో పుట్టి పెరిగిన రచయిత గ్రామాలలో నెలకున్న అనారోగ్యకర వాతావరణాన్ని చూసి, చలించి ఈ నవలా రచనకు ఉపక్రమించారు. పునః ప్రాతిపదికమైన వర్గాలుగా ఏర్పడటం, పంతాలు, పట్టింపులు ఈ నవలలో వర్ణించబడ్డాయి. పరిశోధకుడు టి.శ్యాంప్రసాద్ ఇలా అంటారు "భారతదేశానికి గుండెవంటిది గ్రామం. పాడిపంటలు, ప్రకృతి అందాలు, పిల్లగాలులను పుష్కలంగా ఇచ్చే ఈ గ్రామం ఒకప్పుడు ఒకరికొకరు అన్యోన్యంగా అమరికలు లేకుండా ఉండేది. గ్రామీణ వాతావరణంలో రాజకీయాలు ప్రవేశించాక కొంత అనారోగ్యకర వాతావరణం నెలకొనెదనే చెప్పాలి. నేడు గ్రామీణ వ్యవస్థలో ఏ గ్రామం చూసినా పార్టీపరంగానో, కులపరంగానో చీలికలై ఉండడం గమనించవచ్చు. ఇక గ్రామీణుల మనస్తత్వాలను పరిశీలిస్తే పట్టణ మనస్తత్వానికి వ్యత్యాసం స్పష్టంగా కనిపిస్తుంది".

---

[49] శ్యాంప్రసాద్, టి. అనంతపద్మనాభరావు నవలా సమగ్ర సాహిత్య పరిశీలన. పుట: 33, 97

[50] శ్యాంప్రసాద్, టి. అనంతపద్మనాభరావు నవలా సమగ్ర సాహిత్య పరిశీలన. పుట: 33, 97

### 3. వక్రించిన సరళరేఖ

ఈ నవలలో విశ్వవిద్యాలయాలలో నెలకున్న కుళ్లు రాజకీయాలను అధ్యాపక విద్యార్థుల సంబంధాలను స్పష్టంగా చిత్రించాడు. పరిశోధకులు టి. శ్యాంప్రసాద్ ఇలా విశ్లేషించారు "కులం, మతం, రాజకీయం, స్వార్థం, గ్రూపు రాజకీయాలతో మార్కులు సంపాదించాలనే కాంక్షతో అధ్యాపకుడికి, విద్యార్థికి మధ్య ఉన్న సంబంధం సత్సంబంధం అని చెప్పటానికి వీలులేదు. ఇటువంటి పరిస్థితి మారాలనే కాంక్షతోనే మంచి సంబంధం నెలకొనాలనే అభిలాషతోనే నేటి విశ్వవిద్యాలయాల్లో జరుగుతున్న పరిస్థితిని అనుభవపూర్వకంగా సమీక్షించి 'వక్రించిన సరళరేఖ' అనే నవలలో రచయిత వివరించిన తీరు ప్రశంసనీయం"[51].

ఈ మూడు నవలల నేపథ్యంపై సిద్ధాంత వ్యాసం ప్రచురింపబడింది. కాబట్టి నేను ఆ నవలల గురించి విస్తారమైన చర్చ చేయడంలేదు. ప్రస్తుత నవలిక 'స్వగతాలు' వివరాలలోనికి వెళదాం.

ఇది విస్తృతమైన నవల అయినప్పటికీ సంక్షిప్త నవలగానే ప్రచురింపబడి లోకానికి తెలిసింది. కానీ నేను నా పరిశోధనలో మిగిలిన ఘట్టాలను కూడా పరామర్శించాను.

## 3.9 స్వగతాలు నవలా నేపథ్యం

సమాజంలో అట్టడుగు వర్గం వారు, మధ్యతరగతి వారు, ధనికులు అని మూడు వర్గాల వారు ఉంటారు. వారి వారి జీవనశైలులు వేరు వేరు. వారు పుట్టి పెరిగిన వాతావరణం, వారు జీవిస్తున్న సమాజం వారిపై ప్రభావం చూపుతున్న వ్యక్తులు భిన్నంగా ఉంటారు. ఇది ఆర్థికపరమైన వర్గీకరణ, అలా కాక వారి వారి ఉద్యోగాలను బట్టి వారు తిరుగుతున్న సమాజం వారిని ఒక చట్రంలో బిగిస్తుంది. ఆఫీసుల్లో పనిచేసే ఉన్నతాధికారులు ఒక వర్గం. డైరెక్టర్లు,

---

[51] శ్యాంప్రసాద్, టి. అనంతపద్మనాభరావు నవలా సమగ్ర సాహిత్య పరిశీలన. పుట: 46

మేనేజర్లు, కలెక్టర్లు ఇలా వారి వారి హోదాలను బట్టి సమాజం వారిని గౌరవిస్తుంది. వారు కార్లలో తిరుగుతూ క్లబ్బుల్లో సభ్యులుగా ఉంటూ సంపన్న గృహాలలో ఉంటూ వివాహాది లావాదేవీలు కూడా వారి హోదాకు తగినట్టుగా ఉంటాయి. అందుకే అన్నారు 'వియ్యానికి గానీ కయ్యానికి గానీ సమ హోదా ఉండాలని', తిరుగులేని అధికారంలో వారు చలామణి అవుతుంటారు.

## 3.9.1 మధ్య తరగతి మందహాసం

వీరు చేసే ఉద్యోగాలు, చేసే పనులు అధికారుల మెప్పు కోరుతూ ఉంటాయి. సర్వ సాధారణ జీవితాన్ని గడుపుతూ నెలనెలా వచ్చే జీతం రాళ్లతో కాలం గడుపుతుంటారు. లంచాలకు చేయి చాపుతుంటారు.  ఇల్లు కట్టుకోవాలన్నా, పెళ్ళి చేసుకోవాలన్నా, వీరికి తలకు మించిన భారం. అప్పూ సొప్పో చేసి ఇల్లు కొంటారు.  పిల్ల పెళ్ళి చేస్తారు.  వీరికంటూ కొన్ని నిర్దిష్ట అభిప్రాయాలు ఉండవు. పరిస్థితులకు అనుగుణంగా సంప్రదాయ చట్రంలో ఇమిడి కాలం వెల్లబుచ్చుతారు.

## 3.9.2 అట్టడుగు వర్గంవారు

వీరు నోరూ ఊరు లేని వ్యక్తులు, ఆఫీసు భవనానికి వీరు పునాదిరాయి వంటివారు. బలహీన వర్గాలవారు అయితే వారికంటూ ఒక కంఠస్వరం ఉండదు. 'బాంచన్ నీ కాల్మొక్కుతాన్ దొర అంటూ జీవనయానం చేస్తారు.  తిట్లు, శాపనార్థాలు, అపనిందలు ఓరిమితో సహిస్తారు. సకృత్తుగా (ఎప్పుడైనా) అధికారి (యజమాని) మెచ్చుకుంటే కొండ నెక్కినంతగా సంతోషిస్తారు అలాంటి లక్షలాది మందికి ప్రతినిధి 'స్వగతాలు' నవలలో కథానాయకుడు నరసింహులు.

## 3.10 ఇతివృత్త స్వీకరణ

సమాజంలో ఎందరో వ్యక్తులుండగా రచయిత కలెక్టర్ బంట్రోతును తన కథానాయకుడుగా ఎన్నుకోవడంలో ప్రత్యేకత ఉంది. అన్ని ఆఫీసుల్లో నాల్గవ తరగతి ఉద్యోగులుంటారు. వీరిని ప్యూన్, బంట్రోతు, కలాసి వంటి పేర్లతో పిలుస్తారు. వీరిపట్ల అటు ఉన్నతాధికారులకు, మధ్య తరగతి అధికారులకు గౌరవభావం తక్కువ. వీరిని పేరు పెట్టి పిలుస్తారు. వీరి పేరు చివరన 'గారు' ను వాడరు. ఒరేయ్, ఏమోయ్ వంటివి వీరికి బిరుదులు. అణిగిమణిగి జీవితమంతా ఆఫీసుకే ధారపోస్తారు.

యాచకులలో గుడి దగ్గర ఉన్న యాచకులు మొదటి శ్రేణికి చెందినవారు అనుకుంటే కలెక్టర్ ఆఫీసులోని బంట్రోతు మొదటి శ్రేణి బంట్రోతుగా పరిగణిస్తారు. జిల్లా అధికారులు, రాజకీయ నాయకులు, ఉద్యోగులు, సమాజంలోని ఇతర వర్గాలవారు ఇతని ద్వారా కలెక్టర్ వాలకం తెలుసుకోవాలని ప్రయత్నిస్తారు.

ఇతర బంట్రోతుల కంటే కలెక్టర్ బంట్రోతు ఒక మెట్టుపైన ఉంటాడు. దవాల్ బంట్రోతు తలతలమెరిసే ఇత్తడి బిళ్ల తగిలించుకొని, ఠీవిగా కలెక్టరు ముందుగా నడుస్తాడు. కలెక్టరుతో పాటు ఏ.సి కారులో తిరుగుతాడు. ఆయన విందు భోజనం చేస్తే ఇతడు కూడా భోజనం చేస్తాడు. జిల్లాల్లో కలెక్టర్లు మారుతారు కానీ కలెక్టరు బంట్రోతు మారడు. వయోభేదం వీరిద్దరి మధ్య తరాల అంతరాలకు ప్రతీకగా నిలుస్తుంది. 30 ఏళ్ళు వయస్సుకన్న కలెక్టర్ ఏభై ఏళ్ళు దాటిన బంట్రోతును ఈసడింపుగానే చూస్తారు. ఇల్లు, వాకిలి వదిలిపెట్టి కుటుంబ వ్యవహారాలు మర్చిపోయి, రాత్రింబవళ్ళు కలెక్టర్ ఆఫీసులోనూ, బంగళాలోనూ కాలం గడిచిపోతుంది. ఈ నేపథ్యం గల నరసింహులు జీవితాన్ని రచయిత ఈ నవలికలో చక్కగా ప్రతిబింబింపజేశాడు. ఈ నవలలో ప్రధాన పాత్రలు ఇవి:

1) నరసింహులు

2) రాజ్యం – భార్య

3) గోపాల్ – కొడుకు

4) సీమ – కోడలు

5) కలెక్టర్.

ఈ ఐదు పాత్రల చుట్టూ కథ తిరుగుతుంది. మధ్య మధ్యలో కొందరు వ్యక్తులు ఆయా సన్నివేశాలలో కనిపిస్తారు. వారిలో కలెక్టర్ సతీమణి, రాజకీయనాయకుడు వంటివారు కొట్టవచ్చినట్లు కనిపిస్తారు. కథా ప్రారంభమే కలెక్టర్ దంపతులు పాఠశాల వార్షికోత్సవానికి వెళ్ళడంతో మొదలౌతుంది. సమావేశం అనంతరం కారులో వెళుతూ నరసింహులు ఊర్లోవాళ్ళ ఆతిథ్యం తీసుకొని వెళితే బాగుంటుంది దొరా అనటం కలెక్టర్ దొరకి నచ్చలేదు. కలెక్టర్ కసురుకున్నట్లు మాట్లాడటం మౌనంగా స్వీకరించిన, హోటల్‌లో కలెక్టర్ దంపతులు, డ్రైవర్ భోజనం చేసినా, బంట్రోతు నరసింహులు ఆత్మాభిమానం దెబ్బతినడం వల్ల భోజనం చేయలేదు.

అర్థరాత్రి ఇంటిపట్టు వచ్చినా, తెల్లారకముందే మళ్లీ డ్యూటీకి వెళ్ళాలని నరసింహులు భార్యతో అన్నప్పుడు – అడ్డ చాకిరి చేస్తున్నావని ఆమె ఎద్దేవా చేసింది.

తాను అడ్డగిస్తున్నా ఎమ్.ఎల్.ఎ లోపలికి వెళ్ళిపోతాడు. అందుకు నరసింహులు చివాట్లు తినక తప్పలేదు. ఎమ్.ఎల్.ఎ తనకిచ్చిన ఐదు రూపాయల నజరానా పేదవాడైన వెంకన్న భోజనానికి నరసింహులు ఇవ్వడంతో అతని మానవీయత తెలియ వస్తుంది.

కలెక్టర్ సతీమణి ఈసడింపులు, కలెక్టర్ చివాట్లు అతని జీవితంలో సహజమే. బ్రిటీష్ కలెక్టర్ పాల్ తన ఇంటికి రావటం నరసింహులు మహాభాగ్యంగా భావించాడు. దొర పెంచుకున్న కుక్కపిల్లను విదేశాలకు వెళ్ళిపోతూ కలెక్టర్ నరసింహులును పెంచమని ఇచ్చి

పోతాడు. టామీ ఖర్చులకోసం ఖాళీ చెక్కును ఇచ్చినా నిస్సందేహంగా ఆ చెక్కును పాత కాగితాల గుట్టలో దురిగాడు. కుక్క చనిపోయినప్పుడు ఆ చెక్కును కూడా పాతిపెట్టాడు. కుక్క చనిపోయిందని దొరకు తెలియజేస్తే బాధ పడతాడని ఆయన ఫోన్ చేసినా చెప్పలేదు.

తన స్వగ్రామానికి నరసింహులు వెళ్ళటం అక్కడ పెద్దరెడ్డి గారింట్లో దొర భోజనం చేసేలా చేయటం అతని జీవితంలో మరపురాని సంఘటన.

సర్వసంగపరిత్యాగిలా జీవితమంతా కలెక్టర్ ఆఫీసుకు దారపోసిన నరసింహులు కారు ప్రమాదంలో మరణించటంతో నవల ముగుస్తుంది. నవలను రచయిత దుఃఖాంతం ఎందుకు చేశారా అనిపిస్తుంది. శుభాశుభ సమ్మేళనంలాగా కొడుకు సివిల్ సర్వీసులలో ఒకటైన ఇండియన్ రెవెన్యూ సర్వీస్ లో సెలెక్టు కావడం నరసింహులు మరణం ఒకేసారి జరుగుతాయి. ఇది కొసమెరుపు.

## 3.11 పాత్ర చిత్రణ– నైపుణ్యం

### నరసింహులు

ఈ నవలలో ప్రధాన పాత్ర నరసింహులు. ఇతను నిజాయితీగా పనిచేసే కలెక్టరు బంట్రోతు. నలుగురు తనను నరసింహులు మంచివాడు అనుకుంటే చాలు. ఇంకా అంతకు మించి ఏమీ ఆశించడు. కొడుకు కలెక్టర్ కావాలన్నది ఇతని కోరిక. భార్య రాజ్యం ఎప్పుడూ నరసింహుల్ని వేరే బంట్రోతులతో పోల్చి ఎద్దేవా చేసినప్పుడు నరసింహులు “అవునే ఆ అడ్డగాడిదలా నేను గడ్డి గాడిదలా తినలేను” అంటాడు. ఇలా నిజాయితీపరుడిగా నరసింహులు మనకు కనిపిస్తాడు. చివరికి కొడుకు ఇండియన్ రెవిన్యూ సర్వీస్‌లో ఉత్తీర్ణుడు అయినప్పుడు వినే అదృష్టం లేకపోయింది.

**రాజ్యం**

నరసింహులు భార్య రాజ్యం. అందరి భార్యల్లాగే రాజ్యం కూడా తన భర్త, తన కొడుకు అనే సంసార స్వార్థంతో కనిపిస్తుంది. భర్త ఎప్పుడూ ఇంటికి రాకుండా కలెక్టర్ బంగళాలో, డ్యూటీలో ఎక్కువ సమయం గడపడంతో కోపంతో "ఏం డ్యూటీ తన్ను మాలిన ధర్మం మొదలు చెడ్డ బేరం" అని ముందు మన ఇల్లు సర్దుకోవాలి తర్వాత మరోటి అంటుంది.

కానీ భర్తకు గౌరవం ఇవ్వడంలో ఏమాత్రం నిర్లక్ష్యం చూపించదు. అందరిలాగా నేను ఉండను అంటాడు నరసింహులు. భార్య రాజ్యం వేరే బంట్రోతుతో పోల్చినప్పుడు "అబ్బ సత్యహరిశ్చంద్రుడి అన్నగారు – మింగ మెతుకు లేదు గానీ, మీసాలకు సంపెంగ నూనె" అంటుంది.

**గోపాల్**

నరసింహులు కొడుకు. తండ్రికి దగ్గ కొడుకు. తండ్రి ఆలోచనలు, తండ్రి బుద్ధులు అన్ని అలవడ్డాయి. సీమ అనే అమ్మాయిని ప్రేమించి పెళ్ళి చేసుకుంటాడు. నిజాయితీపరుడుగా కనిపించే మరో పాత్ర. అత్తగారి సొమ్మును ఏమాత్రం ఆశించడు. తండ్రి కోరిక మేరకు సివిల్స్ పాసయ్యాడు. కానీ తండ్రికి ఆ శుభవార్త వినే అదృష్టం లేకపోయింది. ఇది దుఃఖాంతంగా అనిపించేటటువంటి దృశ్యం. కంట తడి పెట్టించే అంశం.

**సీమ**

నరసింహులు కోడలు. నిజంగా కోడలుగా కాకుండా కూతురిలా మనకు కనిపిస్తుంది. మామగారి ఇష్టప్రకారం భర్తను సివిల్ సర్వీసెస్ పరీక్షలు రాయమంటుంది. చివరికి భర్త తన పుట్టింటికి రావట్లేదని తను కూడా పోవడం మానేస్తుంది. ఇవే కాకుండా అత్త, మామ పట్ల కూడా అభిమానం చూపిస్తుంది. చివరికి తన మామగారు చనిపోయాడని తెలిసి కన్నీటి పర్యంతమౌతుంది. తన చేతి గాజులు అమ్మి మరీ గోపాల్ ఢిల్లీకి వెళ్లడానికి డబ్బులు ఇస్తుంది.

## కలెక్టర్ జనార్దన్

కలెక్టర్ హోదాలో ఉన్న ఎవరైనా, తమ దగ్గర పనిచేసే నాలుగో తరగతి ఉద్యోగులను తక్కువ చేసి చూడడం సహజం. కానీ ఈ నవలలో నరసింహులుని ఏనాడు చిన్నచూపు చూసిన సన్నివేశం మనకు కనిపించదు. నరసింహులు నోటి వెంట కూడా 'అయ్యగారు చాన మంచోడు, అమ్మగారే ఎప్పుడు కసురుకోవడం, విసుక్కోవడం మాటిమాటికీ చీదరించు కోవడం మరీ జాస్తయిపోయింది అంటాడు'.

స్వగతాలు నవలిక చిన్నది కావటం మూలాన ముద్రణా సౌకర్యం కోసం కొన్ని చాప్టర్స్ అందులో నుండి రచయిత మినహాయించాడు. ఆ వ్రాతపతులను నేను చదివాను. ఇందులో రాని దాదాపు 7, 8 ఘట్టాలు నరసింహులు జీవనంలోని వివిధ కోణాలకు దర్పణాలుగా కనిపిస్తాయి. ఇందులో ఒక కథను వేదగిరి రాంబాబు 1985లో ప్రచురించిన వినూత్న కథలో ముద్రించారు. 'మాకు ఉన్నాయి స్వగతాలు' అనే శీర్షికతో ఈ కథ ముద్రితమైంది. ఈ ఘట్టంలో ఎమ్.ఎల్.ఎ వ్యంగ్యంగా "ఏమోయ్ మీవాడు ఐ.ఎ.యస్ పరీక్షలు బాగా వ్రాశాడా అని, రేపు మీవాడు కలెక్టర్ అయితే నీవు ఉద్యోగం మానేస్తావా అని అంటాడు. దానికి నరసింహులు చెప్పిన సమాధానం అతడి మనఃప్రవృత్తిని తెలియజేస్తుంది.

"నా ఉద్యోగం నాదీ వాడి ఉద్యోగం వాడిది". కలెక్టర్ విశ్రాంతి తీసుకుంటున్నాడు అంటే ఎమ్.ఎల్.ఎ కి కోపం వచ్చింది. ఆఫీసు సిబ్బంది భోజనానికి వెళ్ళారంటే ఎమ్.ఎల్.ఎ కి నచ్చలేదు. "నీ సంగతి తేలుస్తాను" అంటూ ఎమ్.ఎల్.ఎ విసురుగా వెళ్ళిపోయాడు. "తనదిగాని తప్పుకు తాను బాధ్యత వహించాలా" తన దౌర్భాగ్య స్థితికి తిట్టుకున్నాడు నరసింహులు. ఇంతలో మరో ఎమ్.ఎల్.ఎ ఫోన్ చేశాడు. గత్యంతరం లేక కలెక్టర్‌కు ఫోన్ కలిపాడు. విసురుగా బయటికి వచ్చిన కలెక్టర్ నరసింహులు మీద నోరు పారేసుకున్నాడు. భగవంతుడు తనకు ఎందుకు ఈ శిక్ష విధిస్తున్నాడు అనుకుంటాడు నరసింహులు.

భార్య రాజ్యం కాన్పుకు సిద్దమవుతుంటే కొద్దిగా ఆలస్యంగా వచ్చాడని కలెక్టర్ గట్టిగా మందలించాడు. నెల రోజులు సెలవు పెట్టి వెళ్ళిపోయాడు నరసింహులు. నరసింహులు లేని కొరత ఆ నెల రోజులు కలెక్టర్‌కి తెలిసి వచ్చింది. ఈ విధంగా నరసింహులు పాత్రను కష్టసుఖాల కావడి కుండను మోస్తున్న వ్యక్తిగా రచయిత చిత్రించాడు. పాపం నరసింహులు అనే కథలో కలెక్టరు భార్య విచిత్రంగా ప్రవర్తించటాన్ని చిత్రించారు. ఆ తప్పు నరసింహులుదే. సినిమాకు వెళ్ళేందుకు తయారైన కలెక్టర్ భార్య నరసింహులు మీద కారు రాలేదని కోపడటం, నరసింహులు ఓర్పుతో భరించాడు. బ్రిటీష్ దొరల దగ్గర పనిచేసిన నరసింహులు వారి ఔదార్యాన్ని స్నేహపూర్వక సంభాషణను తలచుకొని మాటిమాటికి సంబరపడేవాడు.

‘కథా కమామీషూ’ లోని ‘ఆత్మాభిమానం’ కథ కూడా నరసింహులు జీవిత విశేషాల సమాహారమే కానీ ఇందులో కలెక్టర్ బంట్రోతు పేరు కోటయ్యగా మార్చాడు. “కోటయ్య ముప్పై ఏళ్ళ సర్వీసులో ఎందరో ఐ.ఎ.యస్ ఆఫీసర్లు మారిపోయారు. దూషించిన వాళ్ళు భూషించారు.  దూషించిన వాళ్ళు దూషించారు. తల పైకెత్తి ఎరగడు. ఎందరెందరో అధికారులు, అనధికారులు, ఉద్యోగులు, నిరుద్యోగులు, హరిజనులు, గిరిజనులు వందల కొద్దీ కోటయ్య దయాదాక్షిణ్యాల కోసం రోజూ పడిగాపులు కాస్తుంటారు.

“కోటయ్య చిరునవ్వులు చిందిస్తూ అందరినీ సమయం చూసి లోపలికి పంపేవాడు. నిమిత్తమాత్రుడిగా ఆ గేటు దగ్గర నిలబడి అందరినీ గమనిస్తూ ఉండేవాడు”. ఇది కలెక్టర్ బంట్రోతు జీవిత చిత్రణ. తనదీ రాజయోగమే అనుకునేవాడు కోటయ్య. నరసింహులు కొడుకు ఐ.ఎ.యస్ పరీక్షకు ప్రయత్నించడం తన పొరపాటు కాదు, అయినా తనను కలెక్టర్ నిందించడం నరసింహులుకు బాధ వేసింది.

తాను ఉద్యోగంలో చేరిన తొలి రోజులను గుర్తుకు తెచ్చుకొని మురిసిపోయాడు. ఆ గ్రామానికి పర్యటన మీదగా వచ్చిన కలెక్టర్ మునసబు గారింట్లో తాను చేసిన పరిచర్యలకు

సంతోషించి తనతో తీసుకెళ్లాడు కలెక్టర్. బంట్రోతుగా ఉద్యోగం వేయించాడు. తనతో జీపులో తీసుకెళ్లాడు. ఆ తరువాత వచ్చిన పీటర్ ద్వారా పర్మినెంట్ చేశాడు.

ఒకరోజు ఆలస్యంగా వచ్చిన నరసింహులు మీద కలెక్టర్ చేయి జేసుకోబోయాడు. "చేయి జేసుకునేందుకు నేను మీ భార్యను కాదు దొరబాబు గారు" అంటూ చింత నిప్పులు కురిపించాడు నరసింహులు. ఈ కథలో ముగింపు వాక్యాలు నరసింహులు కథలో ముగింపు మాటలకు భిన్నంగా ఉన్నాయి. ఒక వ్యక్తి జీవితంలోని రెండు పార్శ్వాలను చూపటానికి కాబోలు రచయిత కోటయ్య పాత్రను నరసింహులకు భిన్నంగా చిత్రించారు. అక్కడ నరసింహులు కారు ప్రమాదంతో చనిపోతాడు. కొడుకు ఆదాయ పన్ను (Income Tax) కమీషనర్‌గా సివిల్ సర్వీసులో సెలక్టు అయ్యాడనే శుభవార్తను వినకుండానే కన్నుమూశారు. ఈ కథలో ముగింపు ఇలాగున్నది.

"ఎడం కన్ను అదిరింది. చిన్న కొడుకు ఏడుపు దూరానికే వినిపించింది. తను నమ్ముకున్న ఉద్యోగం తనని నమ్ముకున్న భార్య ఈనాటితో తనకిక లేరు. కోటయ్య కుప్పలా కూలిపోయాడు" నవలలో అర్థాంతరంగా నరసింహులు జీవితాన్ని ముగించారే అని తర్కిస్తున్న పాఠకునికి ఈ ముగింపు కొంత ఊరట కలిగిస్తుంది. అక్కడ విధి వైపరీత్యం కనిపిస్తుంది. ఇక్కడ అతనిలోని ఆత్మాభిమానం, పౌరుషం ప్రతిబింబిస్తాయి. కానీ అతని భార్య ప్రసవ వేదనతో మరణించడం పాఠకునిలో కొంత సానుభూతిని కలిగిస్తుంది. ఈ రెండు రకాలైన ముగింపులతో మనం ఏకీభవించక పోవచ్చు. అది రచయిత స్వేచ్ఛా, స్వతంత్ర దృక్పథం అని చెప్పవచ్చు.

ఒక్కొక్క రచయిత తనదైన శైలిలో తనదైన బాణీలో తనదైన మానసిక స్థితిలో కొసమెరుపును ఊహించుకుంటాడు. అది ఇలానే ఉండాలని ఎవరూ శాసించలేరు. రచయితలు రాజశాసనాలకు లోబడినవారు కాదు.

అముద్రిత నవలలో కొన్ని ముఖ్యాంశాలు. నరసింహులుని జీవితంలోని కొన్ని సంఘటనలు అముద్రిత గ్రంథంలో మిగిలిపోయాయి. ఆ సన్నివేశాలు చదివినప్పుడు నరసింహులు సంపూర్ణ జీవితచిత్రణ మనకు కనిపిస్తుంది. ఒక సన్నివేశంలో ఇంట్లో కుమారునితో సంభాషణ వింటే మనకు ఆశ్చర్యం వేస్తుంది. "ఏరా గవర్నమెంట్ తిండీ, తీర్థం పెట్టింది కదా లక్షణంగా చదువుకొని ఫస్టు క్లాసు తెచ్చుకోకూడదా, ఒకళ్ళ సిఫారసు లేకుండా ఉద్యోగం సంపాదించుకోవచ్చు గదా అంటాడు నరసింహులు". ఈ మాటలను బట్టి హాస్టళ్ళల్లో చదువుకుంటున్న విద్యార్థులు చదువుమీద ఎందుకు శ్రద్ధ పెట్టరో అనే ఆలోచనను రేకెత్తిస్తుంది.

వివాహ విషయంలో కుమారునిది భిన్నాభిప్రాయం. ఐనా తన మాట నెగ్గించుకోవాలని నరసింహులు ప్రయత్నం చేయలేదు. కొడుకును కలెక్టర్ దగ్గరికి తీసుకెళ్ళి ఏదైనా సహాయం చేయమని అడిగాడు. ఏదైనా చిన్న ఉద్యోగం కావాలా అని కలెక్టర్ అడిగితే ఎం.ఏ లో సీటు ఇప్పించమని కొడుకు అడగటం అతనిలోని విద్యాకాంక్షను తెలియజేస్తుంది. రాజకీయ నాయకులతో ఎలా ప్రవర్తించాలో వారితో ఎలా మాట్లాడాలో అతనికి తెలుసు. ఆఫీసులో జరిగిన వ్యవహారాల కాపీ తీయాలని కొందరు రాజకీయ నాయకులు ప్రయత్నిస్తారు. అయినా నరసింహులు చలించడు. కొడుకు చదువు ఫీజు కోసం రాజకీయ నాయకుడు 200 రూపాయలు ఇస్తాననటం అతడు లంచంగా భావించాడు. మరో సన్నివేశంలో కొడుకు హాస్టల్ దగ్గరకు వెళ్ళిన నరసింహులు అక్కడి సన్నివేశం చూసి బిత్తరపోయాడు. ఈ సన్నివేశాన్ని రచయిత తండ్రి, బిడ్డల మానసిక సంఘర్షణను చిత్రించడానికి ప్రవేశపెట్టినట్లు అనిపిస్తుంది. లోపల తాను ప్రేమించిన సీమతో కొడుకు ఉండడం చూసి నరసింహులు తరాల అంతస్థుల మధ్య జరిగిన సంఘర్షణతో బాధపడతాడు. ఆమె ఒక కమర్షియల్ టాక్స్ ఆఫీసర్ కూతురు.

తనకు, తన అంతస్థుకు సరితూగదేమో అని అతని సందేహం. చివరకు వారిద్దరు వివాహం చేసుకుంటారు. మరో సన్నివేశంలో వివిధ ఆఫీసుల్లో పనిచేసే బంట్రోతుల మధ్య

సంభాషణ ఎలా ఉంటుందో స్పష్టం చేశారు. ఒకతను డి.ఇ.ఓ. ఫ్యూన్. అతడు ఆఫీసర్‌తో టూర్ వెళ్ళినప్పుడు సబ్బులు, టవల్స్, హెయిర్ ఆయిల్స్, ఇంటికి పట్టుకొస్తాడని (సి.టి.ఓ) ఫ్యూన్ చేత అనిపిస్తాడు రచయిత.

నాలుగో తరగతుల ఉద్యోగాల సంఘానికి నిన్ను అధ్యక్షునిగా ఎన్నుకుంటామని నరసింహులుతో మిగిలిన ఫ్యూన్‌లు అంటే అతడు తిరస్కరించాడు. అతను ఇలా అంటాడు.

"వాళ్ళు మన ఆఫీసర్లు మనలను తిట్టడం వాళ్ళ హక్కు. అత్తా కోడళ్ళ సామెత మనది" నరసింహులు గీతోపదేశం చేశాడు. ఇక్కడ ఉంది అసలు రహస్యం. నరసింహులు గీతోపదేశం చేసేంత ఎత్తుకు ఎదిగిన ఒక విశిష్ట వ్యక్తి. మరో సన్నివేశంలో భార్యాభర్తల మధ్య అనురాగాన్ని ప్రతిబింబించే ఇతివృత్తాన్ని చెప్పారు. ఇక్కడ సంభాషణలు సహజంగా వర్ణించబడ్డాయి. కలెక్టర్ ద్వారా హైదరాబాద్ టూర్ వెళ్ళాడు. పెందలాడే నరసింహులు ఇంటికొచ్చాడు. భార్య రాజ్యం ఇవాళ మనం మనుమాడిన రోజు అంటుంది. ఇవాళ ఎక్కడలేని ప్రేమ పుట్టుకొచ్చింది అని రాజ్యం అంటే "అసలు నీ అబ్బకు లేదే బుద్ధి" అంటాడు. "నిజమే ఉంటే కలెక్టర్ జవానికి ఇచ్చేవాడు కాదు". "అవును నీ మొహానికి రాజకుమారుడు దొరికేవాడు". వారి సంసార జీవితంలో జరిగిన మరొక సన్నివేశాన్ని కూడా గుర్తుకు తెస్తుంది రాజ్యం. కొంత సరసాన్ని కూడా చిత్రించారు. ఇది అముద్రిత భాగంలోనిది. మరో సన్నివేశంలో గొప్పింటి బిడ్డ అయిన కోడలు సీమ అత్తగారింట్లో కాపురం చేసిన వైనం రసవత్తరంగా సాగించారు. కొడుకు గుమస్తా ఉద్యోగం అయినా ఇప్పించలేదని రాజ్యం భర్తను ఎద్దేవా చేస్తుంది. "నాకు ఎవరి సిఫారసులు అక్కరలేదు. నా తెలివితేటల మీద ఆధారపడి తెచ్చుకోగలను". మరో సన్నివేశంలో కలెక్టర్ ఆఫీసుకు వచ్చిన కొడుకును తనదైన హోదాలో విగిటర్ స్లిప్ ఇచ్చి రెండు గంటలపైన రమ్మన్నాడు. వ్యాపారులు,రాజకీయవేత్తలు జిల్లా అధికారులు రకరకాల భయాందోళనలతో కలెక్టరు దగ్గరకు వస్తుంటారు. ఆఫీసులో కలిసిన కొడుకును గూర్చి ఎవరో "నీ కొడుకు ప్రహ్లాదుని వంటివాడు" అన్నారు. "ప్రహ్లాదుని

తెలివితేటలు బాగున్నాయి. కానీ వాడు, నేను హిరణ్యకశిప సంవాదంలోకి దిగితే రసాభాస అవుతుంది" అంటాడు నరసింహులు. కలెక్టర్‌ని కలవకుండానే గోపాల్ కోపంగా వెళ్ళిపోయాడు.

మరో సన్నివేశంలో నరసింహులు కొడుకు గోపికి జూనియర్ లెక్చరర్‌గా అపాయింట్‌మెంట్ వచ్చింది. అందులో చేరితే సివిల్స్ పరీక్షలకు ఆటంకం అవుతుందని నరసింహులు వద్దంటాడు.

మరో సన్నివేశంలో గోపీ, సీమల వివాహ విషయంలో వర్ణాంతర వివాహం కావటంవల్ల ఇరువర్గాల వారు మాట పట్టింపులకు పోయారు. ఆ సన్నివేశంలో గోపి మామగారి వద్దనుండి డబ్బును ఆశించక పోవడాన్ని రచయిత స్పష్టం చేశారు.

మరో సన్నివేశంలో గోపీ మామగారు గోపిని టంగుటూరి జూనియర్ కాలేజీ నుండి సిటీకి (హైదరాబాద్) ట్రాన్స్‌ఫర్ చేయించడం గోపికి నచ్చలేదు.

మరో సన్నివేశంలో ఇద్దరు కళాశాలల లెక్చరర్ల మధ్య అభిప్రాయ బేధాలను, అక్కసము చిత్రించారు. ఇందులో పాత్రల పేర్లు కూడా గోపాలరావు, రామభద్రయ్య అని ఉంచారు. ఇవే పాత్రలు మనకు మారని నాణెంలో కనిపిస్తాయి. మరో సన్నివేశంలో కొత్త కలెక్టర్ అతడు తమిళ ప్రాంతంవాడు. యస్.పి గారు నరసింహులును విశ్వాసపాత్రుడైన వ్యక్తిగా చెప్పటం నరసింహులుకి ఆనందం వేసింది. కొత్తగా వచ్చిన కలెక్టరు తన మీద విసుక్కోవటం బాధ వేసింది.

మరో సన్నివేశంలో రాములమ్మ అనే ఒక వృద్ధురాలు, అంధురాలు కలెక్టరిని చూడటానికి వచ్చి కలిసిన వైనం తెలియజేశారు. మరో అనాథకు పింఛను శాంక్షన్ చేస్తాడు కలెక్టరు. మధ్యాహ్న భోజనానికి అంధురాలికి ఐదు రూపాయలు అందించిన నరసింహులి ఔదార్యం ఈ సన్నివేశంలో కనిపిస్తుంది. మరో సన్నివేశంలో సీమ తండ్రి కూతురిని, అల్లుడిని

వారి మ్యారేజ్‌డేకి ఆహ్వానించటం, అల్లుడు ముభావంగా ఉండటం వర్ణించాడు. మరో సన్నివేశంలో ఐ.ఎ.యస్ ఇంటర్వ్యూకి బయలుదేరిన గోపి ప్రయాణాన్ని వివరంగా హాస్యస్ఫోరకంగా వర్ణించారు. యు.పి.యస్.సి ఇంటర్వ్యూ ఎలా జరిగిందో వివరంగా మరో సన్నివేశంలో చిత్రించారు. తన తండ్రి కలెక్టర్ బంట్రోతు అని చెప్పటానికి సందేహించాడు. యు.పి.యస్.సి  సభ్యుడు సంతృప్తి పడటం ఈ సన్నివేశంలో ముఖ్యం. వివిధ సన్నివేశాలలో నరసింహులు పాత్రకు హుందాతనం, ఆత్మాభిమానం, వినయము ఉండేలా సన్నివేశాలు చిత్రించారు. అముద్రితమైన సన్నివేశాలు కూడా ఉంటే ఇది గొప్ప నవలగా సంపూర్ణత పొంది ఉండేది.

## 3.12. ముగింపు

పద్మనాభరావు గారు స్వగతాలు నవలలో సమాజంలోని అసమానతలను కళ్ళకు కట్టినట్లు చిత్రీకరించారు. ఈ నవలలో మధ్యతరగతి వారి పరిస్థితులను, అట్టడుగు వర్గాల వారి  పరిస్థితులను, బలహీనతలను గురించి చెప్పడం జరిగింది. కలెక్టర్ పాత్ర ద్వారా సమాజంలో అసమానతలు  చెబుతూ, వాస్తవానికి పెద్ద హోదాలో ఉన్నవాళ్లంతా తక్కువ శ్రేణి ఉద్యోగులతో వుండే ప్రవర్తన తీరును ఈయన రచనల్లో వ్యక్తం చేశారు. ఈయన నవలల్లో సాధారణంగా దుఖంతోనేనవలను ముగిస్తాడు.

# నాల్గవ అధ్యాయం

# నాల్గవ అధ్యాయం

# పురాణ వాఙ్మయ రచనలు విశ్లేషణ

# పురాణ వాఙ్మయ ప్రతిబింబం

## 4.0. దాంపత్య జీవన సౌరభం

మానవ జీవితంలో దాంపత్యం అనేది సాంఘిక కట్టుబాటు. వివాహానంతరం భార్యాభర్తలు సుఖసంతోషాలతో జీవించి సంతానవంతులై కుటుంబ పోషణ కొనసాగిస్తారు. బంధుమిత్రులు, ఇరుగుపొరుగువారు ఆ దంపతులను చూసి సుఖదుఃఖ సమ్మేళనమైన వారి జీవనయానాన్ని పొగడుతారు లేదా తెగడుతారు. కష్టసుఖాలు, సుఖదుఃఖాలు, లాభనష్టాలు, ఆర్థిక ఇబ్బందులు, సుఖఃసంతోషాలు సమంగా పంచుకుంటూ కాడికి కట్టిన జొడెద్దులవలె జీవనయానం సాగిస్తారు. ఆ దారి గతుకులమయం కావచ్చు లేదా నల్లేరు మీద బండి నడక కావచ్చు. పురాకృత సుకృత పుణ్య ఫల విశేషం చేత ఒకరికి ఒకరు జమ గూడుతారు. వాల్మీకి చరిత్రలో రఘునాథ నాయకుడు, కిరాతుని బోయవాని (వాల్మీకి) భార్య నోట ఒక మంచి మాట అనిపిస్తారు. సప్తర్షులను అరణ్య మార్గంలో అడ్డుకున్న కిరాతకుడికి సప్తర్షులు ఒక ప్రశ్న వేశారు. నీవు తెరచాటుగా సంపాదించిన పాప పుణ్యములు నీ కుటుంబ సభ్యులు పంచుకుందురా? అని ప్రశ్నించారు. అతడు పరుగుపరుగునా ఇంటికి వచ్చి తన భార్యను ప్రశ్నించాడు. ఆమె ఇలా సమాధానం ఇచ్చింది.

చ. **"తవులగువారి కెవ్వరికతంబున సాగెద వప్పుదీసి తె**

**త్తువొ కొనితెత్తువో తెరువుదోచుచుతెత్తువొ జూదమాడితె**

**త్తువొ చని తెత్తువొ యదియు దోసమొపున్నెమొనాకు నేటికా**

**రవరవ నీవు దెచ్చినవి దాచక వండగ పాడినిచ్చలున్”**[52]

అదే విషయాన్ని కిరాతుడు సప్తర్షులకు తెలియజేయగా వారు అతనికి “మరామరా” అని విలోమంగా రామ మంత్రోపదేశం చేశారు. అతడు తపస్సు చేసుకుంటున్న సందర్భంలో భార్యాబిడ్డలు, బంధువులు వచ్చి అతని తపస్సును విరమించ చేయటానికి ప్రయత్నించారు. అప్పుడు అతను అన్న మాటలు నిత్యసత్యాలు.

**కం. “సతులెవ్వరు సుతులెవ్వరు**

**హితులెవ్వారేటి వఱదనెందే నొకచో**

**జతకూడిన కాష్ఠంబుల**

**గతి నించుక కూడివిచ్చి కదులుదురవలన్”**

దీని భావాన్ని గమనిస్తే భార్యాభర్తలనేవారు కాలమనే నదీ ప్రవాహంలో కొట్టుకుపోతూ మధ్య కాలంలో జతపడిన రెండు దుంగల్లా కొంత దూరం కలిసిమెలిసి ఆ తరువాత కొంత కాలానికి కొంత దూరానికి విడిపోయి ఎవరిదారెంట వారు నడుస్తారు. ఎవరో ఒకరు మరణిస్తే మరొకరు ఒంటరి జీవితం గడపుతారు. ఇది దాంపత్య జీవన రహస్యం.

ప్రస్తుత గ్రంథం దాంపత్య జీవన సౌరభం అనంతపద్మనాభరావు 2013లో ప్రచురించారు. పద్మనాభరావుకు పురాణశాస్త్ర గ్రంథ పరిచయం ఉంది. భారత భాగవత రామాయణాది కావ్యాలలో ఎందరో దంపతుల జీవన ప్రస్థానం కనిపిస్తుంది. వాటిని క్షుణ్ణంగా చిరకాలం అధ్యయనం చేసిన వ్యక్తి కావటంవల్ల ఈ వ్యాసాలలో వారి పాండిత్య స్ఫూర్తి కనిపిస్తుంది. రచనా నేపథ్యం 2010 సంవత్సరంలో టైం ఆఫ్ ఇండియా ఆంగ్ల దినపత్రిక యాజమాన్యం వారు హైదరాబాద్‌లో ‘సురభి’ అనే తెలుగు మాసపత్రికను సాహిత్యపరంగా

[52] వాల్మీకి చరిత్ర – ద్వితీయ శ్వాసము .120:పద్యం ,

ప్రారంభించారు. దాని సంపాదకులుగా ప్రముఖ సినీ నటులు రచయిత శ్రీ గొల్లపూడి మారుతీరావును ఎన్నుకున్నారు. మారుతీరావు, పద్మనాభరావు కడప ఆకాశవాణి కేంద్రంలో 1980 ప్రాంతాలలో రెండు సంవత్సరాలు కలిసి పనిచేశారు. ఒక సంవత్సర కాలం పాటు వీరిద్దరు "బావగారి కబుర్లు" అనే కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా సురభి మాసపత్రికకు నెలనెలా ఏదైనా ఒక అంశంపై "ఒక కాలం" నిర్వహించమని మారుతీరావు పద్మనాభరావుని కోరారు. అది కొత్త తరహాలో ఉండాలి. పాఠకులు ఇష్టపడేలాగా ఉండాలి. నలుగురికి రుచించేదిగా ఉండాలి అని సూచించారు.

ఈ సందర్భంగా పద్మనాభరావు పురాణ దంపతులను ఆధునిక యువతీ యువకులకు పరిచయం చేద్దామని ఆలోచించారు. పత్రిక పేరు 'సురభి' కాబట్టి వ్యాసానికి శీర్షిక 'దాపంత్య జీవన సౌరభం' అని పేరు పెట్టారు. సులభిలం అనే పేరుతో రచయిత ముందుమాటలో ఇలా అంటారు –"పురాణ దంపతుల జీవన విధానాన్ని ఆధునిక యువతీ యువకులకు కొత్తగా చెప్పాలని సంకల్పం. ఆ విషయం మారుతీరావుగారితో ప్రస్తావించాను. దాంపత్య జీవనం అని పేరు పెడదామనుకున్నాను. అది డా॥ సమరంగారి సెక్స్ సమస్యల విశేషాలని పాఠకులు భ్రమపడే అవకాశం ఉంది.

పత్రిక 'సురభి'– అది స్ఫురించేలా దాంపత్య జీవన సౌరభం అని పేరు పెట్టాను. ఒక సంవత్సర కాలం చక్కగా సాగింది. అర్థాంతరంగా టైమ్స్ యాజమాన్యం వారు పత్రికా నిర్వహణలో మార్కెటింగ్ ప్రకటనలు రావడం లేదని మూసివేశారు. అంతటితో నా సీరియల్‌కు ఫుల్‌స్టాప్ పడింది"[53]. కానీ ఆ పత్రిక మఖలో (నక్షత్రం) పుట్టి పుబ్బలో గిట్టింది అన్న సామెతగా సంవత్సరం దాటగానే మూతబడింది. సాహిత్య పత్రికలు కొని చదివే

[53] అనంతపద్మనాభరావు, రేవూరి. దాంపత్యజీవనసౌరభం.పుట:9

అలవాటు ఆంధ్రులకు లేదని భారతి మాసపత్రిక మూతపడటంతో తెలిసి వచ్చింది. 'సురభి'కి కూడా ఆ గతి తప్పలేదు.

## 4.1. గ్రంథ విస్తృతి

దాదాపు 12 నెలలకు పైగా 12 వ్యాసాలు ప్రచురించారు. వాటిని ఒక పుస్తక రూపంలో తీసుకురావడానికి రచయిత మరికొన్ని జోడించక తప్పలేదు. ఆ ప్రక్రియలో భాగంగా మరో 30 మంది దంపతులను పురాణాలలో నుండి ఏరి కూర్చి ఆ గ్రంథాన్ని సమగ్రం చేసారు. ఆ గ్రంథాన్ని ప్రముఖ ఆధ్యాత్మిక గురువు శ్రీ కందుకూరు శివానందమూర్తిగారికి 2013 గురుపూర్ణిమనాడు అంకితమిచ్చారు. ఈ గ్రంథానికి ముందుమాట వ్రాస్తూ శివానందమూర్తిగారు ఇలా ఆశీర్వదించారు –"ఆదర్శ దాంపత్యమంటే లౌకిక సుఖానికీ, దుఃఖానికీ అతీతమైనది. కర్మవశాత్తు వచ్చిన కష్టాలకు మానవుడు లొంగిపోకుండా దాంపత్యమనే పరమ పవిత్ర బంధాన్ని పదిలంగా కాపాడుకోవడం ముఖ్యం".

ఆదిదంపతులైన పార్వతీపరమేశ్వరులకే బాధలు తప్పలేదు. పరమేశ్వరునికి సతీ వియోగం. సతి కోసం పతి తపస్సు చేయడం, శివుని కోసం పార్వతి తపస్సు చేయడం విశేషం. అలానే శ్రీరామచంద్రునికే సీత ఎడబాటు తప్పలేదు. వనవాస కష్టాలను సతీపతులిద్దరూ ఎంచుకున్నారు, పంచుకున్నారు.

పాతివ్రత్యంతో దాంపత్య జీవనాన్ని సుఖమయం చేసుకోవడం, ఆదర్శమూర్తులుగా లోకానికి మార్గ దర్శకులు కావడం అత్రి మహర్షి అనసూయ విషయంలో మనం గమనిస్తాం. కానీ నేటి యువత చిన్న పొరపొచ్చాలతో కాపురాలలో అడ్డుగోడలు కట్టుకుంటున్నారు. ఏదో ఒక మిషతో దంపతులు విడిగా ఉంటున్నారు లేదా విడిపోతున్నారు. సంసార నౌక సాఫీగా సాగడానికి ఇద్దరూ బాధ్యులే. ఒకరిమీద ఒకరికి కోపం రావచ్చు, పోట్లాడుకోవచ్చు, మాట్లాడుకోవచ్చు. అయితే పూర్వం పెద్దల జోక్యంతో అది సమసిపోయి సుఖజీవనం

సాగించేవారు. ఇప్పుడు వేగవంతమైన, విలాసవంతమైన జీవితం వచ్చింది. కంప్యూటర్ పరిచయాలతో కలుసుకొని త్వరగా పెళ్లి చేసుకున్నవారు, అంతే త్వరగా చిన్న తగాదాలతో విడిపోతున్నారు. సంసారాలు చెడిపోతున్నాయి. ఈ ఆధునిక సామాజిక నేపథ్యాన్ని దృష్టిలో పెట్టుకొని డా॥ రేవూరు అనంతపద్మనాభరావు దాంపత్య జీవన సౌరభం పేర వివిధ ఆదర్శ దంపతుల జీవనరేఖల్ని సరళంగా చిత్రించారు.

పద్మనాభరావు లోగడ ఆకాశవాణి, దూరదర్శన్‌లలో ఢిల్లీలో అత్యున్నత పదవులు నిర్వహించారు. మన ఆశ్రమానికి సన్నిహితులు, పండితులు, సమర్థులు 2013 శ్రీరామనవమి పురస్కారాన్ని మన సనాతన ధర్మ ఛారిటబుల్ ట్రస్టు ద్వారా అందుకున్న సాహితీవేత్త.

ఈ గ్రంథంలో త్రిమూర్తులు, సీతారాములు, సత్యాకృష్ణులు, అహల్యా గౌతములు, నలదమయంతులు, సావిత్రీ సత్యవంతులు మొదలుగా నలభై మంది పురాణ దంపతుల జీవన విశేషాల విశ్లేషణ చేసి సరళమైన భాషలో పద్మానాభరావు పాఠకులకు అందించారు.

బహు పురాణ పరిచయం, విశ్లేషణా సామర్థ్యముగల పద్మనాభరావు ఆయా దంపతుల ఎదుర్కొన్న క్లిష్ట సమస్యల్ని ఆధునిక యువతీ యువకులకు సమన్వయం చేసి చెప్పడం ప్రశంసనీయం"[54] అన్నారు శివానందమూర్తిగారు.

ఇందులో 41 మంది దంపతుల జీవనయానం ప్రస్తావించబడింది.

1) "పార్వతీ పరమేశ్వరులు

2) లక్ష్మీనారాయణులు

3) ఛాయా సూర్యులు, రోహిణీ చంద్రులు, సరస్వతీ బ్రహ్మలు

4) సీతారాములు

---

[54] దాంపత్య జీవన సౌరభం .6 ,5:పుట ,అనంతపద్మనాభరావు .ఆర్ ,

5) సత్యాకృష్ణులు

6) కౌసల్యా దశరథులు

7) అహల్యా గౌతములు

8) మండోదరీ రావణులు

9) తార, వాలి

10) అనసూయా అత్రులు

11) శూర్పణఖ

12) ఊర్మిళా లక్ష్మణులు

13) నందయశోదలు

14) దేవకీ వసుదేవులు

15) సులోచనా ఇంద్రజిత్తులు

16) రత్నమాలా జనకులు

17) అరుంధతీ వశిష్టులు

18) జాంబవతీ కృష్ణులు, నీలాకృష్ణులు

19) రేవతీ బలరాములు

20) గాంధారీ ధృతరాష్ట్రులు

21) కుంతీ పాండురాజులు

22) ద్రౌపదీ పాండవులు

23) భీమ హిడింబిలు

24) సుభద్రార్జునులు

25) మేనకా విశ్వామిత్రులు

26) శకుంతలా దుష్యంతులు

27) మత్స్యగంధీ పరాశరులు

28) గంగాశంతనులు, సత్యవతీ శంతనులు

29) దేవయాని, యయాతులు, శర్మిష్ట

30) నలదమయంతులు

31) కృపీద్రోణులు

32) రేణుకా జమదగ్నులు

33) భానుమతీ దుర్యోధనులు

34) ఉత్తరాభిమన్యులు

35) లోపాముద్రాగస్త్యులు

36) సావిత్రీ సత్యవంతులు

37) ఊర్వశీ పురూరవులు

38) శచీ పురందరులు

39) చంద్రమతీ హరిశ్చంద్రులు

40) గోదారంగనాథులు

41) పద్మావతీ శ్రీనివాసులు"[55]

కొసమెరుపుగా బ్రహ్మచారి సంసార తాపత్రయం అనే పేర భీష్ముని జీవిత వృత్తాంతాన్ని ప్రస్తావించారు. ఈ వ్యాసం కడప నుండి ప్రచురింపబడే జీవనవికాసం అనే మాసపత్రికలో ప్రచురింపబడింది. వివిధ రంగాలలో పని చేస్తూ దంపతులుగా ఉన్న రచయితల వివరాలను సేకరించి వ్యాసరూపంలో ప్రచురించారు. ఇందులో దాదాపు 20 మందికి పైగా సాహిత్య దంపతుల వివరణ ఉంది. పురాణం సీత దంపతులు, బుచ్చిబాబు దంపతులు, ఆరుద్ర దంపతులు, పుట్టపర్తి దంపతులు, అబ్బూరి దంపతులు, సుదర్శనం దంపతులు, శేషేంద్ర దంపతులు, లవణం దంపతులు, శ్రీకాంతశర్మ దంపతులు, పోలాప్రగడ దంపతులు ఇలా ఎందరెందరో. విశేష శ్రమ కూర్చి ఈ వివరాలను ఇందులో పొందు పరిచారు.

ఈ వ్యాసాలను రెండు రకాలుగా వింగడించవచ్చు.

1) సురభిలో ప్రచురించిన వ్యాసాలు.

2) తరువాత ప్రచురణకు జోడించిన దంపతులు.

## సురభిలో ప్రచురించిన వ్యాసాలు

ఈ వ్యాసాలు నిడివిలో పెద్దవి. వాటి రచనా ధోరణి ఆధునిక సమాజంతో ముడిపెట్టబడిన తీరులో కొనసాగింది. వేగవంతమైన ఆధునిక జీవనంలో దంపతుల ప్రాధాన్యతలు వేరువేరుగా ఉంటాయి. పురాణకాలంలో భర్త ఒక ఆరాధ్య దైవం. మారుతున్న

---

[55] దాంపత్య జీవన సౌరభం ,ఆర్.8 ,7:పుట ,అనంతపద్మనాభరావు .

సమాజంలో ఆ విలువలకు ప్రాధాన్యం లేదు. పాదాభివందనం చేసి కాలు కడిగి నెత్తిన నీళ్ళు చల్లుకునే రోజులవి. పాతివ్రత్యానికి ప్రాధాన్యం ఉన్న రోజులవి. పతిభక్తి, పతిరక్తి, పతి ద్వారా ముక్తి కోరుకున్న రోజులవి, ఉపవాసాలు, వ్రత దీక్షలు చేసి పతి ఆయుస్సును పెంచుకోవాలని తాపత్రయం పడిన రోజులవి. పురాణ కాలం నుండి మధ్య యుగాల నాటికి పరిస్థితులలో కొంత మార్పు వచ్చింది. సతీసహగమనం ఒక విధ్యుక్త ధర్మంగా భావించిన రోజులవి. కాలక్రమేణా సతీసహగమనం రాజారామ్‌మోహన్‌రాయ్ సంస్కరణోద్యమం ఫలితంగా ప్రభుత్వం నిషేధించింది. ఆధునిక కాలం నాటికి భర్త చనిపోతే భార్యలు విధవరాండ్రుగా దుర్భర జీవితాన్ని గడపవలసి వచ్చింది. ముసలివాళ్లతో కన్యాశుల్కం పేర కన్యలకు చిన్న వయస్సులోనే వివాహం చేసేవారు. వాళ్ళు బాలవితంతువులు అయినారు. కందుకూరి వీరేశలింగంపంతులు వంటి సంఘసంస్కర్తలు విధవా పునర్ వివాహాలకు నడుం కట్టారు.

ఆంగ్లేయ పరిపాలనా ప్రభావంవల్ల భారతీయుల కట్టుబాట్లు, ఆచార వ్యవహారాలలోనూ, సంప్రదాయాలలోనూ ఎన్నో మార్పులు వచ్చాయి. స్త్రీ విద్యకు అవకాశం లభించింది. స్త్రీలు కడప గడప దాటి ఉద్యోగాలు చేయటం మొదలుపెట్టారు. రాజ్యాంగంలో స్త్రీలకు సమాన హక్కులు లభించాయి.

ఉద్యోగినులు పూర్వకాలంలో వలె అణిగిమణిగి అడుగులకు మడుగులొత్తే రోజులు మారిపోయాయి. వంటావార్పులలోనూ, ఇంటిపనులలోనూ, పిల్లల పెంపకంలోనూ భార్యాభర్తలు సమాన బాధ్యతలు నిర్వహించే దశ వచ్చింది. కానీ పురాణాలలోని దంపతుల జీవన విధానాన్ని ఆధునిక స్థితిగతులకు అనుగుణంగా గమనిస్తే భార్యాభర్తలు ఏడు రకాలలో ఏదో ఒక తరగతికి చెందినవారు లేదా అన్ని రకాల వారు అయి ఉంటారు.

1) పార్వతీ పరమేశ్వరులు – భార్యకు అర్ధ శరీరం ఇచ్చినవాడు / భార్యను నెత్తిన పెట్టుకున్నవాడు.

2) లక్ష్మీనారాయణులు – భార్యను గుండెలపై పెట్టుకున్నవాడు.

3) ఛాయా సూర్యులు – ధుమధుమలాడే భర్త వెంట నీడలా తిరిగే సతి.

4) రోహిణీ చంద్రులు – ధుమధుమలాడే (ఎండ వేడిమి) భార్యకు చల్లని మనస్సుగలపతి.

5) సరస్వతీ బ్రహ్మలు – భర్తకు తలలో నాలుకగా మెలిగే స్త్రీ.

6) సీతారాములు – ఏకపత్నీ వ్రతానికి మారుపేరైన పతి.

7) సత్యాకృష్ణులు – అష్టమహిషలతో గోపికాలోలుడైన కృష్ణుడు.

ఈ ఏడు జంటలను రచయిత ప్రధానంగా ప్రస్తావించారు.

## 4.2 వ్యాసాల విశిష్టత

ఇందులో వాక్య రచనాశైలి సంభాషణాత్మకంగా ఉంటుంది. కథ చెప్పినట్లుగా ఉంటుంది. పాత కథను కొత్త సీసాలో పోసి అందించారు. ఉదాహరణకు పార్వతీపరమేశ్వరుల వ్యాసంలో ప్రారంభం ఇలా కొనసాగింది.

“సీత బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజనీరు. శ్రీరామ్‌తో పెళ్లై సంవత్సరం అయింది. శ్రీరామ్‌తో కాపురం హాయిగా గడిచిపోతుంది. అయితే, శ్రీరామ్ అలవాట్లు కొన్ని సీతకు నచ్చవు. చాలాసార్లు చెప్పి చూసింది. కానీ, శ్రీరామ్‌లో మార్పు రాలేదు. అవేవీ దుర్వ్యసనాలు కావు. ఎంగిలి చేసిన వాటర్ బాటిల్‌ను మళ్లీ ఫ్రిజ్‌లో పెట్టొద్దని సీత వాదన. శ్రీరామ్‌కి అదొక గొప్ప తప్పు కాదు. చివరకు మాట పట్టింపులు, పడక పట్టింపుల దాకా వెళ్ళాయి. ఇంతలో సీత తమ్ముడి పెళ్ళి నిశ్చయమైంది. సీత ఒక్కతే వెళ్ళడానికి సిద్ధమైంది. “మీ నాన్న దగ్గర నుంచి పిలుపు రానీ, ఇద్దరం కలిసి వెడదా”మని శ్రీరామ్ సలహా ఇచ్చాడు. తమ్ముడి పెళ్లికి పిలుపు కోసం చూడనవసరం లేదు శ్రీరామ్ అంటూ సీత మూతి ముడుచుకుంది. తీరా మామగారు

ఊళ్లో అందరినీ పిలిచి అల్లుణ్ణి పిలవలేదు. “ఇదేం న్యాయం? నేను తక్కువ స్థాయిలో ఉన్నాననేగా” అని శ్రీరామ్ ఎదురు ప్రశ్న వేశాడు. సీత మొండికేసి పెళ్లి కెళ్లింది. ఛీత్కారాలు, అల్లుడి మీద పరాచికాలు మొదలుపెట్టాడు సీత తండ్రి. సీత సహించలేకపోయింది. ఇది ఆధునిక భారతంలో జరిగిన కథ”[56].

పార్వతీ పరమేశ్వరులు ఆదిదంపతులు. అందుకే అన్నారు:

**వాగార్థావివ సంపృక్తౌ**

**వాగర్థః ప్రతిపత్తయే**

**జగతః పితరౌవందే**

**పార్వతీ పరమేశ్వరౌ**

వాక్ + అర్థము ఒక మాటలో కలిసినట్లుగా అన్యోన్య దాంపత్య జీవనం కొనసాగించే వ్యక్తులు పార్వతీపరమేశ్వరులు. మరి ఆ పదాన్ని విరిచి – పార్వతీ పరమేశ్వరౌ అని వ్యాఖ్యానించారు. పార్వతిప అంటే శివుడు, రమేశ్వరుడు అంటే విష్ణువు.

ఈ వ్యాసంలో ప్రధానంగా గమనించాల్సిన విషయం శివుని కోసం పార్వతి తపస్సు చేసింది. ఆ తరువాత పార్వతి కోసం శివుడు తపస్సు చేశాడు. ఒకరికొకరు ఆ విధంగా గాఢమైన అనురాగాన్ని ప్రకటించారు. ఐశ్వర్యం ప్రధానం కాదు అనే విషయాన్ని వీరి గాథ ప్రకటిస్తుంది. అందుకే హరవిలాసంలో మాయావటువుగా వచ్చిన పరమశివుడు తపస్సు చేస్తున్న పార్వతితో ఇలా అంటాడు.

---

[56] దాంపత్య జీవన సౌరభం, ఆర్. అనంతపద్మనాభరావు, పుట:10.

“గజచర్మం ధరించినవాడు ఒంటి నిండా బూడిద పూసుకున్నవాడు, స్మశానంలో జీవించేవాడు, మెడ చుట్టూ పామున్నవాడు, పుట్టుక లేనివాడు, మూడు కండ్లు కలిగినవాడు అయిన ఆ శివుని గూర్చి నీవు తపస్సు చేస్తున్నావు వృథా శ్రమ అంటాడు”[57].

శివపార్వతుల వివాహం పూర్తి అయింది. పిలవని పేరంటంగా దక్ష ప్రజాపతి యజ్ఞానికి వెళ్లిన పార్వతి తనకు జరిగిన అవమానానికి అగ్నిప్రవేశం చేసింది. మరుజన్మలో హిమవంతుడి కుమార్తెగా పార్వతి జన్మించింది. ఇప్పుడు పార్వతి కోసం శివుడు తపస్సు చేశాడు. పరిచర్యలు చేస్తున్న పార్వతిని ఆమె తండ్రి అనుమతితో వివాహం ఆడాడు. వీరిద్దరి మధ్య ఒళ్లు కాల్చుకున్నవాడు మన్మథుడు.

ఈ వ్యాసంలో రచయిత ఒక సర్వసాధారణమైన శ్లోకాన్ని ప్రస్తావించారు.

**“కన్యావరయతే రూపం**

**మాతా విత్తం పితా శ్రుతం**

**బాంధవాః కులమిచ్ఛంతి**

**మృష్టాన్న మితరే జనాః”**[58]

“ఎంత మంచి భార్యాభర్తలైనా హేళనలు, నవ్వులాటలు ఎంత దూరం వెళతాయో ఈ సన్నివేశం గుర్తుకు తెస్తుంది. నేటి కాలంలో విడాకుల దాకా వెళ్లిన భార్యాభర్తలెందరో పెద్ద పదవుల్లో, ఉద్యోగాల్లో ఉండే దంపతులు మాట పట్టింపులకు పోయి విడాకులు తీసుకొని మానసిక శాంతి లేకుండా జీవిస్తున్నారు”[59].

---

[57] హరవిలాసం – శ్రీనాథుడు – చతుర్థా శ్వాసం .28:పుట ,

[58] దాంపత్య జీవన సౌరభం, ఆర్. అనంతపద్మనాభరావు, పుట:28.

[59]దాంపత్య జీవన సౌరభం, ఆర్. అనంతపద్మనాభరావు, పుట:15.

మరో సందర్భంలో భృగు మహర్షి విష్ణువుని వక్షస్థలంపై తన్నాడు అది తన స్థానం. అందుకు కోపించిన లక్ష్మి అలిగి కొల్లాపురం వెళ్లిపోయింది. ఆమెను వెతుకుతూ విష్ణుమూర్తి శేషాచలం చేరుకున్నాడు. అతడే కలియుగ ప్రత్యక్ష దేవుడు వేంకటేశుడు. భార్యాభర్తల కోపతాపాలు ఎంత దూరం వెళతాయో చెప్పేందుకు రచయిత లక్ష్మీనారాయణుల వృత్తాంతాన్ని ఎంచుకున్నారు. ఇందులో అన్నమయ్య కీర్తన తెలుసుకుంటే మోక్షము, తెలియకుంటే బంధము అని వివరిస్తారు.

## 4.2.1. ఛాయా సూర్యులు

ఈ వ్యాసానికి శీర్షిక "చెదరని తరగని బంధం". ఆధునిక పరిభాషలో సూర్యచంద్రులను ఇందులో ప్రస్తావించారు. "సూర్యారావు, పూర్ణచంద్ ఒకే ఊళ్లో ఉంటారు. సూర్యారావు తూర్పు వీధిలో, పూర్ణచంద్ పడమటి వీధిలో ఉంటారు. సూర్యారావు పొద్దు పొడవక ముందే బయలుదేరి పొద్దు గొంకిన దాకా పనిచేసి ఇల్లు చేరతాడు. పూర్ణచంద్‌కు నైట్ డ్యూటీలు, సాయంకాలం అసుర సంధ్యవేళ షిఫ్టు డ్యూటీ కెళ్లి ఖచ్చితంగా సూర్యోదయానికి ఇల్లు చేరతాడు. ఇద్దరూ పరోపకార జీవులు. ఎవరి నుంచి ఏమి ఆశించకుండా ఇతరులకి సహాయం చేయడమే వారి పని. వారి ఇల్లాలులు మాత్రం ఉత్తర దక్షిణ ధృవాలు. సూర్యారావు ఇంటా బయట చిటపటలాడుతూ చంద్ర నిప్పులు కక్కే ఆఫీసరు. వచ్చిన దగ్గర నుంచి వెళ్ళే వరకూ మండిపడుతుంటాడు. అయితే పది మందికి లాభపడే పనులు చేస్తాడు. భార్య ఛాయాదేవి భర్త ననుసరించి తిరిగే బుద్ధిమంతురాలు. నలుగురిని ఆదుకునే చల్లని తల్లి. ఇద్దరి సంసార నౌక అలా సాగిపోతుంది. పూర్ణచంద్ సంసారం సాఫీగా సాగడం లేదు. భార్య రోహిణి సూర్యకాంతంలా ఎప్పుడు చూసినా రుసరుసలాడుతూ నిప్పులు గక్కుతుంటుంది. ఇరుగుపొరుగంటే అసలు పడదు. భర్త మెతక. భార్య పటాటోపం. ఊళ్ళో వాళ్ల నోట్లో ఈ

దంపతుల జంట గురించి రోజూ ఏదో ఒక చర్చ జరుగుతూనే ఉంటుంది. ఇదీ ఆధునిక భారతం”[60].

ఈ వ్యాసంలో పరస్పర భిన్నధృవాలైనా ఛాయాసూర్యులను, రోహిణీచంద్రుల సంసారిక జీవితాన్ని రచయిత ఆధునిక కాలపు వ్యక్తుల జీవితాలతో పోల్చారు. పరస్పర అవగాహనతో సంసారం వెళ్లబుచ్చటం అవసరం అంటారు. ఇక్కడ ఒక చమత్కారం కూడా చెప్పారు. “వివాహమైన మొదటి ఏడాది భార్య చెప్పిన మాట భర్త వింటాడు. రెండో ఏడాది భర్త చెప్పిన మాట భార్య వింటుంది. మూడో ఏడాది నుంచి వీరిద్దరి మాటలు ఇరుగుపొరుగు వాళ్లు వినే దశ వస్తుంది”.

విడాకుల సంస్కృతికి భారతీయులు దూరంగా ఉండాలని రచయిత ఇందులో సూచించారు. ఈ వ్యాసంలో రెండు జంటలను కలపడంలో రచయిత ఉద్దేశం. రెండు భిన్నస్వరాల సమ్మేళనమే లోకవ్యవహారం అని సూచించడానికే. అందుకే సీతాయాః చరితం మహత్ అన్నారు. అవసరం వచ్చినప్పుడు నిర్మొహమాటంగా ఖండితంగా మాట్లాడటానికి సీతమ్మ వెనకాడలేదు. వనవాసానికి రావొద్దని శ్రీరాముడంటే –“మీరు ఇంత బీరువని మా తండ్రి జనక మహారాజు అనుకోలేదు” అని నిలదీసింది. మరో సందర్భంలో ఋషులకు రాముడు రాక్షససంహారం చేస్తానని మాట ఇచ్చినప్పుడు –“నీకే పాపము తలపెట్టని ఆ అమాయకపు ప్రాణులని హింసించే హక్కు నీకు ఎవరు ఇచ్చారని ప్రశ్నించింది”. అనుమానానికి తావిచ్చి రాముడు మాట్లాడినప్పుడు అగ్ని పరీక్షకు సిద్దమయింది. లవకుశుల జనానాంతరం ఆమె భూగర్భంలో కలిసిపోవటానికి సిద్ధపడింది. నూరుగురు కుమారులకు తల్లిఅయినా భర్తతో సుఖమే పరమానంద దాయకం అని తీగలు లేని వీణ లేనట్లే, చక్ర

[60] దాంపత్య జీవన సౌరభం .17:పుట ,అనంతపద్మనాభరావు .ఆర్ ,

భ్రమణం లేని రథం లేనట్లే, భర్తలేని భార్య జీవితం నిరర్థకం అని అరణ్యవాసానికి సిద్ధమయింది.

ఈ వ్యాససంపుటిలో రామాయణ సంబంధమైన జంటలను భిన్నకోణాలలో రచయిత చూపించిన తీరు అద్భుతం. ఒక్కొక్క దాంపత్యం ఒక్కొక్క తరహా. ఎవరి కష్టసుఖాలు వారివి. ఎవరి సాధక బాధకాలు వారివి. అయితే రామాయణ గాథ మొత్తం ఈ పాత్రల చుట్టూ తిరుగుతుంది. ఈ వివరాలను రామాయణంలో స్త్రీ పాత్రలు గ్రంథంలో చక్కగా పాండు రంగారావు (ఆంగ్లంలో) విశ్లేషించారు. దానిని అనువాదం చేసిన ఈ రచయిత ఆ స్ఫూర్తితో ఈ గ్రంథంలో పదకొండు మంది దంపతుల జీవన సమరాన్ని తనదైన రీతిలో విశ్లేషించారు. ఇందులో చక్రవర్తులున్నారు – కౌసల్యా దశరథులు, రత్నమాల–జనకులు, రాజకుమారులు–సీతారాములు, ఊర్మిళ–లక్ష్మణులు, ముని దంపతులు – మేనకా విశ్వామిత్రులు, అహల్యా గౌతములు, అనసూయ అత్రులు, అరుంధతి వశిష్ఠులు, వానరదంపతులైన – తారా వాలి, రాక్షస దంపతులైన – మండోదరి రావణులు, సులోచన ఇంద్రజిత్తులు, శూర్పణఖ ఇందులో ప్రస్తావించబడ్డారు. భారతానికి సంబంధించి గాంధారీ ధృతరాష్ట్రులు, కుంతి పాండురాజులు, ద్రౌపది పాండవులు, భీమ హిడింబిలు, సుభద్ర అర్జునులు, శకుంతలా దుష్యంతులు, గంగా శంతనులు, సత్యవతి శంతనులు, దేవయాని శర్మిష్ఠ, యయాతి నలదమయంతులు, కృపీ ద్రోణులు, రేణుకా జమదగ్నులు, భానుమతీ దుర్యోధనులు, ఉత్తరాభిమాన్యులు, లోపాముద్ర అగస్త్యులు, సావిత్రీ సత్యవంతులు, ఊర్వశీ పురూరవులు ఇందులో విస్తారంగా కనిపిస్తారు.

భాగవతానికి సంబంధించి లక్ష్మీనారాయణులు, సత్యాకృష్ణులు, నంద యశోదలు, దేవకీ వసుదేవులు, జాంబవతీ కృష్ణులు, నీలా కృష్ణులు, రేవతీ బలరాములు ప్రస్తావించబడ్డారు. వీరే కాక శచీ పురందరులు, చంద్రమతీ హరిశ్చంద్రులు, గోదా రంగనాథులు, పద్మావతీ శ్రీనివాసులు పురాణ ప్రసిద్ధమైన దంపతులు.

రచయిత వీరి దాంపత్యాలలోని వైశిష్ట్యతను, విలక్షణతను, వివరణాత్మకంగా, విశ్లేషణాత్మకంగా, విపులంగా విశదపరిచారు. కథను క్లుప్తంగా చెబుతూ పురాణగాథకు భిన్నం కాకుండా ఆధునిక సమాజానికి ఒక సందేశం లభించేలా వ్యాసాలను విస్తృతపరిచారు.

రుక్మిణీ కళ్యాణాన్ని 'కిడ్నాప్' చేసిన వివాహంతోనూ, ప్రేమ వివాహంతోనూ పోల్చారు. అహల్యా గౌతముల కథలో తెలిసి తప్పుచేసి కాలుజారిన అహల్యను గౌతముడు తిరిగి స్వీకరించటం ఒక ఉదారభావంగా పేర్కొన్నారు. మండోదరి పాత్రను గురించి చెబుతూ సినిమాలలో (విలన్) ప్రతినాయకుని భార్య సౌమ్యంగానూ, పతివ్రతాధర్మంతోనూ ప్రవర్తించిన తీరును ఆదర్శప్రాయంగా చెప్పారు. సీతను రామునికి అప్పగించి శరణు వేడమని ఆమె ప్రాధేయపడింది. అతడు అహంకారంతో పెడచెవిన పెట్టాడు. అలానే తార వాలితో రాముని శౌర్య పరాక్రమాలను రుజువర్తనను చెప్పి మందలించే స్థితికి ఎదిగింది. అయినా బుద్ధి గడ్డి తిని అన్నాదమ్ముల మధ్య వైరం కుటుంబాన్ని ఎలా నాశనం చేస్తుందో ఈ గాథలో తెలుస్తుంది.

అనసూయ నిజంగా అనసూయ (అసూయ లేనిది) ఆదర్శ గృహిణి. తాను ఆదర్శంగా ఉండటమే కాక ఆదర్శ దాంపత్యం ఎలా ఉండాలో సీతకు తెలిపిన సాధ్వీమణి. ఆ దంపతులలో మెచ్చుకోదగిన మరో గుణాన్ని కూడా రచయిత సుస్పష్టం చేసారు. భార్యను గూర్చి భర్త ఇతరుల యెదుట నాలుగు మంచి మాటలు చెప్పటం ఆదర్శ దాంపత్యానికి తొలిమెట్టు అని తెలపడానికి అత్రి మహర్షి రామలక్ష్మణులతో అనసూయను గూర్చి అనసూయ అసాధారణతను గూర్చి ఉదాహరించటం ఒక ఉదాహరణ.

కాపురం కూల్చిన చెల్లెలు అనే భావంతో శూర్పణఖ పాత్రను ప్రవేశ పెట్టారు. ఆమె రావణ సోదరి. ఆమెకు విద్యుజ్జిహ్వునితో పెండ్లి జరిపించారు. పొరబాటున రావణుడు కాలకేయులతో యుద్ధం చేస్తూ బావగారిని చంపాడు. నలుగురు అన్నదమ్ములకు ఆమె ఒక్కగానొక్క సోదరి. ఆమెకు జనస్థానాన్ని అరణంగా ఇచ్చి పంపాడు రావణుడు. రాముడిపై

వ్యామోహం పెంచుకున్న శూర్పణఖకు ముక్కు చెవులు కోసి పంపాడు లక్ష్మణుడు. ఆమె రావణుడికి పెడ బుద్ధులు నేర్పింది. సీత నీకు దగిన స్త్రీ అని చెప్పి సీతాపహరణానికి దారితీసేలా చేసింది. కథ దుఃఖాంతం కావడానికి, సర్వరాక్షస వినాశనానికి ఆమె మూలకారణం అయింది. ఒక చెల్లెలు దుర్బుద్ధి వంశ నాశనానికే దారి తీసిన సంఘటన ఇది. కాపురం అంటూ ఎక్కువ కాలం చేయకపోయినా జంబుకాసురుడనే కుమారుడు పుట్టాడు. అతడు పొదలలో తపస్సు చేసుకుంటున్నాడు. ఫలాలు కోస్తున్న లక్ష్మణుడు చూడకుండా అతన్ని కత్తితో పొడిచాడు. ఎంతటి హృదయవిదారకమైన జీవితం. అటు భర్తను, తన అన్న ద్వారానే కోల్పోయింది, ఇటు కన్న కుమారుడినీ కోల్పోయింది. ముక్కు, చెవులు కోల్పోయింది. తనవల్ల ఖరదూషణులతోపాటు 14 వేల మంది రాక్షస సైన్యము రాముని చేతిలో నశించారు. అంతటితో నిరాశ్రయురాలైన ఆమె ఇంటి పట్టున పడివుండవచ్చు కానీ, దుర్బుద్ధితో ఆమె రావణ కుంభకర్ణ ఇంద్రజిత్తుల మరణానికి, లంకా వినాశనానికి మూల హేతువు అయింది.

ఆవిడ సంసారం చేయలేదు కదా మరి ఈ దంపతుల కోవలోకి వస్తుందా అనే సందేహం కలుగుతుంది. కొందరి జీవితాలలో నూరేళ్ళ కాపురం మూన్నాళ్ళ ముచ్చటవుతుంది. మరికొందరు పిల్లాపాపలతో నూరేళ్ళ పంటగా సుఖశాంతులతో జీవిస్తారు. ఈ రెండు రకాల జీవన సమరాన్ని తెలియజేయటానికే శూర్పణఖ జీవిత వృత్తాంతాన్ని ఇందులో జోడించారు.

### 4.2.2 ఊర్మిళ

విశ్వకవి రవీంద్రుడు అనాదృత మహిళలను పేర్కొంటూ బుద్ధుడి భార్య యశోధరను గూర్చి ప్రధానంగా ఊర్మిళను గూర్చి విస్తారంగా వ్రాశారు. సీతారాముల సేవలో అరణ్యాలలో 14 సంవత్సరాలు తన భర్త లక్ష్మణుడు పరిచర్యలు చేస్తుండగా ఊర్మిళ రాజప్రాసాదంలో ఉన్న

విరహ వేదనతో గడిపింది. ఇక్కడ రచయిత ఊర్మిళా లక్ష్మణుల వివాహ సమయంలో కన్యాదాన వేళ జనకుడు అప్రయత్నంగా ఈ మాటలు అనడం యాదృచ్ఛికం కాక భవిష్యత్ కథకు పునాదులుగా చెప్పారు.

**"లక్ష్మణా గచ్ఛ భద్రంతే ఊర్మిళాం ఉద్యతాం మయా**

**ప్రతీచ్ఛ పాణి గృహ్ణీష్వ మాభూత్కాలస్య పర్యయః**

"లక్ష్మణా రమ్ము! నీకు క్షేమం అగుగాక. ఈ ఊర్మిళను స్వీకరించు. ఈమె హస్తాన్ని నీ హస్తంతో గ్రహించు. ఆలస్యం చేయకు అన్నాడు. సీతను రాముడికిస్తూ 'ఇయం సీతా మమసుతా సహధర్మ చరీతవ'అన్న మాటలు వాల్మీకి ఇక్కడ వాడలేదు. నీ సహధర్మచారిణి సీత అన్నాడు రామునితో. లక్ష్మణుడలా కాదు"[61].

ఈ రామాయణ స్త్రీ పాత్రలను అంతరంగతరంగం పేరుతో పద్మనాభరావు సీతాయనం అనే మరొక గ్రంథంలో భిన్నకోణంలో చూపించారు. నాణేనికి ఇరువైపులలాగా స్త్రీ మూర్తులలోని అంతరంగ భావాలను తనదైన శైలిలో ఆవిష్కరించారు. 'ఊర్మిళాదేవి నిద్ర' అనే స్త్రీల పాట ఆంధ్రదేశంలో బాగా ప్రచారంలో ఉంది. దానిని రచయిత ఇందులో ప్రస్తావించారు. "శ్రీరామ పట్టాభిషేక సమయంలో సీత శ్రీరామచంద్రునికి ఒక వినతి చేస్తుంది.

**సీత**: ఊర్మిళను 'వద్దు నీవుండమనుచు' సౌమిత్రి మనలను సేవింపవచ్చె

ఆనాడు మధురశయ్యపై నాతి కనుమూసి పవళించియున్నది.

ఇకనైన ఆనతిచ్చి తమ్ముని ఇందుముఖి కడకంపుడీ.

---

61 దాంపత్య జీవన సౌరభం – అనంతపద్మనాభరావు .46:పుట ,

**శ్రీరాముడు**: ప్రియురాలి దగ్గరికి నీవు పోయి సరససల్లాపములచే దుఃఖోపశమమెల్ల తీర్పవయ్యా అని రాముడు లక్ష్మణుని ఊర్మిళ వద్దకు పంపాడు.

**ఊర్మిళ**: అయ్యా మీరెవరయ్యా ఇంత ఆగడములకొస్తిరి? అని ప్రశ్నించింది.

**లక్ష్మణుడు**: శ్రీరాముని తమ్ముండనే సీత మరిదిని కానటే.

**ఊర్మిళ**: ప్రాణేశుడగుట తెలిసి కోమలికి ప్రాణములు తేజరిల్లే పతి పాద పద్మములకు ప్రణమిల్లె.

ఇది స్త్రీల పాటలలో ప్రచారంలో ఉన్న కథ. మగతగా 14 ఏళ్లు నిద్రించిన ఊర్మిళ తన భర్త లక్ష్మణుని గుర్తించడానికి కొంత సమయం పట్టిందనుకోవాలి”[62].

జనకుని భార్య పేరు ఏంటో లోకానికి తెలియదు. ఆమె పేరు రత్నమాల (సునయనాదేవి). ఈ సందర్భంలో ఊరు పేరూ లేని ఆడవారిలాగా రత్నమాల కూడా వెలుగులోకి రాని ఒక పాత్ర. జనకుడు రాజర్షి. సంసార తాపత్రయం లేని ఆధ్యాత్మిక స్వభావంగల మహోన్నత వ్యక్తి. రత్నమాల – జనకుల దాంపత్య సౌరభాలు వెలుగులోకి రాలేదు. యాగశాల నిర్మాణం కోసం భూమిని దున్నుతుంటే నాగేటి చాలులో సీత లభించింది. సీతారాముల జనన సందర్భంగా రచయిత ఒక సరస సంభాషణను ప్రస్తావించారు.

ఒకసారి సీతారాములు సరససల్లాపాలు ఆడుకుంటున్నారు.

**రాముడు**: సీతా మీ దేశంలో బిడ్డల కోసం ప్రసవ వేదన అక్కర్లేదు. భూమిని దున్నితే ఆడపిల్లలు దొరుకుతారట.

**సీత**: నిజమే స్వామీ! మా దేశంలో భూమిని దున్ని కష్టపడితే దొరుకుతారు. మీ దేశంలో కేవలం పాయసం పంచితే నలుగురేసి మగపిల్లలు కలుగుతారు.

---

62 దాంపత్య జీవన సౌరభం – ఆర్. అనంతపద్మనాభరావు, పుట:47, 48.

"ఇద్దరూ అలా నవ్వుకున్నారు"[63].

వశిష్ఠుడు రఘువంశ రాజులకు కులగురువు. అరుంధతీ వశిష్ఠులు లోకారాధ్యులు. ఇప్పటికీ నూతన వధూవరులుకు అరుంధతీ నక్షత్రం చూపిస్తారు. కన్యాశుల్కంగా మత్స్యయంత్ర ఛేదన, శివధనుర్భంగం వంటి పరీక్షలు మనకు భారత రామాయణాలలో కనిపిస్తాయి.  కానీ ఇక్కడ కథ అడ్డం తిరిగింది. వశిష్ఠుడు కాబోయే భార్యకు ఒక పరీక్ష పెట్టాడు. ఇసుకను వండి పెట్టమని కోరాడు. ఆమె ఆ పరీక్షలో నెగ్గింది. పోనీ అంతటితో గండం గడిచిందా అంటే లేదు. తన కమండలాన్ని (పెళ్లి అయిన తరువాత) అరుంధతి చేతికిచ్చి నేను తిరిగి వచ్చేవరకు కాపాడమన్నారు. ఏండ్లూ, పూండ్లూ గడిచినా అతడు తిరిగి రాలేదు. ఆమె తదేక దీక్షతో అలానే ఉండి పోయింది. బ్రహ్మదేవుడు వశిష్ఠుని తీసుకొని వచ్చే వరకు ఆమె తన దృష్టిని మరల్చలేదు. "ఇదేం సంసారం అండీ" అనిపిస్తుంది మనకు. కానీ ఇలాంటి ఆదర్శ దంపతుల జీవన ప్రమాణాలను లోకానికి తెలియజేయడం కోసం వీరి కథ లోకోపకారి అవుతుంది. కష్టసుఖాలు కావడికుండలు. ఇరువురు సమంగా మోయలనేది తాత్పర్యం.

## 4.2.3 సులోచన ఇంద్రుజిత్తులు

సులోచన మహా పతివ్రత. కుటుంబ పెద్దయైన మామగారి (రావణుని) స్త్రీ వ్యామోహ బుద్ధి తన కాపురాన్ని నాశనం చేసింది. వాల్మీకి రామాయణంలో సులోచన మనకు కనిపించదు. రంగనాథ రామాయణంలో సులోచన ప్రస్తావన ఉన్నది. బల పరాక్రమాలు కలిగి ఇంద్రుని సైతం బంధించి తీసుకొని వచ్చిన తన భర్త ఇంద్రజిత్తు రామరావణ యుద్ధ అగ్నిహోత్రంలో సమిధయ్యాడు.  కొద్దిపాటి వివరాలు లభిస్తున్న వీరిద్దరి జీవన స్థితిగతులను రచయిత ఇందులో ప్రస్తావించారు.

---

[63] దాంపత్య జీవన సౌరభం – ఆర్. అనంతపద్మనాభరావు, పుట:61.

## 4.2.4 కౌసల్యా దశరథులు

దశరథుని పాత్ర విచిత్రమైనది. పుత్ర కామేష్టి యాగంలో లభించిన పాయసంతో ఆయనకు నలుగురు పుత్రులు జన్మించారు. పట్ట మహిషి కౌసల్యా రాజ్యాంగ రీత్యా సమస్తాధికారాలు గల మహారాణి. కానీ ఆమె పరిస్థితులను లొంగి తలవంచుకున్న ఒక నిస్సహాయురాలు. బహు భార్యత్వం వల్ల కలిగే అనర్థాలను రామాయణంలో దశరథుని వృత్తాంతం ద్వారా మనము గ్రహించవచ్చు. కైక తన ఔన్నత్యాన్ని చాటుకోవడానికి తన కుమారునికి పట్టాభిషేకం చేయటానికి మంథర దుర్భోధలతో వరాల నెపంతో దశరథుని ప్రాణాలు తీసింది. సాఫీగా సాగిపోతున్న సంసార ప్రవాహానికి గండి పడింది. రాముడు అరణ్యాలకు వెళ్లాడు. భరతుడు రాజ్యాన్ని తిరస్కరించాడు. కథలో మూడు స్త్రీ పాత్రలు మూడు భిన్న మనస్తత్వాలు కలిగి ఉండటం రామాయణ ప్రత్యేకత.

ఈ రామాయణ గాథను ఆధునిక జీవన విధానానికి సరిపడేలా సమన్వయం చేశారు రచయిత. ఈ క్రింది వాక్యాలలో అది ప్రస్ఫుటం అవుతుంది.

“కుమారులు విదేశాలకు ఉద్యోగాల నిమిత్తం వెళ్లి అక్కడ సంవత్సరాల తరబడి ఉండిపోయినప్పుడు ఆ తల్లి పడే మానసిక వ్యధను చూస్తున్నాం. అందులోనూ పతి ఆదరణ సరిగ్గా లేనప్పుడు ఆ బాధ వర్ణనాతీతం. వీడియో కాన్ఫరెన్స్‌లో కుమారుడు వారానికొకసారి తనతో గంటసేపు మాట్లాడతాడని ఆ తల్లి సంబరపడిపోతుంది. రెండేళ్లకొకసారి చుట్టపు చూపుగా వచ్చి పోయే కొడుకు, కోడలు, మనుమల్ని అనునిత్యం ఊహించుకుంటూ పూజలు చేస్తూ పూజ గదిలోనే గడపుతుంది. చివరి శ్వాస వదిలే సమయానికి ఆ కొడుకు విమానం అంది వస్తాడా, రాడా? అని బెంగ పెట్టుకోదు. తన రాత ఎలా ఉంటే అలా జరుగుతుందని సర్ది చెప్పుకుంటుంది”[64].

---

[64] దాంపత్య జీవన సౌరభం – ఆర్. అనంతపద్మనాభరావు, పుట:26.

మౌన వ్యాఖ్యాత కౌసల్య. భర్తను అదుపులో పెట్టుకోవాలనే మనస్తత్వం గలది కైక. తన కుమారులిద్దరినీ – భరత శతృఘ్నులను ఇతరులకు సహాయకులుగా ఉండేలా తీర్చిదిద్దిన తల్లి సుమిత్ర. వరాలు శాపాలుగా, శాపాలు వరాలు అయిన ఘట్టాలు మనకు భారత, రామాయణాలలో కనిపిస్తాయి.

## 4.3 మహాభారతంలోని దంపతులు

మహాభారతంలో మూలపురుషుడు భీష్ముడు అనుకుంటే అతనికి సంసారమే లేదు. అతడు ఆజన్మ బ్రహ్మచారి. భీష్మశపథం లోకవిదితం. "సంసార తాపత్రయంలేని బ్రహ్మచారి అతడు" అనే శీర్షికతో రచయిత సుదీర్ఘ ప్రస్తావన చేశారు. కుటుంబం కోసం ఆధునికకాలంలోనూ త్యాగం చేసిన ఇలాంటి భీష్ములు మనకు ఎందరో కనిపిస్తారు. తమ్ముళ్ల వివాహానికి, స్వయంవర మండపానికి వెళతాడు భీష్ముడు. అంబ, అంబిక, అంబాలికలను బలవంతంగా తీసుకొస్తాడు. అంబ భీష్మునిపై ప్రతిజ్ఞ చేసి వెళ్లిపోయింది. ఈ కథలో మలుపు స్వయంగా తాను సంసారం చేయకపోయినా కురుపాండవ సంసారాల యోగక్షేమాల కోసం నిరంతరం తపించిన వ్యక్తి భీష్ముడు.

### 4.3.1 గాంధారీ ధృతరాష్ట్రులు

లోకంలో చాలామంది పుట్టంధులు మనకు తారసపడతారు. ఇతడు అంబిక – వ్యాసులకు దేవరన్యాయంలో జన్మించాడు. గాంధారితో వివాహం జరిగింది. భర్తవలే తాను పట్టుపుట్టం కండ్లకు గంతలుగా కట్టుకొని ఉండిపోయింది. గాంధారి దంపతులిద్దరూ గుడ్డివాళ్లు. మత్సరగ్రస్తులు (అసూయ) కలిగినవారు. ఎదుటివారి సంసారం బాగుంటే చూడలేని మనస్తత్వం గలవారు. కుంతి గాంధారిలిద్దరూ ఒకేసారి గర్భవతులైయ్యారు. కుంతికి కొడుకు పుట్టాడు. ఓర్వలేనితనంతో గర్భ తాడనం చేసుకుంది. వ్యాసుని సూచన మేరకు నూరుగురు కౌరవులు, ఒక కుమార్తె దుస్సల కలిగారు.

వీరి దాంపత్య జీవనం విచిత్రంగా కొనసాగింది. ఇద్దరూ కళ్లు లేని కబోదులు. అహంకార దుర్విదగ్ధుడు. కుమారులలో పెద్దవాడైన దుర్యోధనుడు. ధృతరాష్ట్రుని పుత్ర మమకారం, కురుక్షేత్ర సంగ్రామానికి దారి తీసింది. పాంచాలీ పరాభవం, భీముని శాపం, కృష్ణుని సారథ్యం కౌరవ వంశాన్ని సమూలంగా నాశనం చేశాయి. అయినా ఈ దంపతులిద్దరిలో పశ్చాత్తాపం లవలేశం కూడా కలగలేదు. యుద్ధానంతరం భీముణ్ణి కౌగిలింత పేరుతో నుగ్గు నుగ్గు చేయాలని ప్రయత్నించి ధృతరాష్ట్రుడు విఫలుడయ్యాడు. సమీపానికి వచ్చిన ధర్మజుని పాదాలపై తన కంటి చూపును ప్రసరింపజేసి, కమిలిపోయేలా చేసింది గాంధారి. ఈ దంపతులు జీవితాంతం సుఖపడలేదు. ఇతరులు సుఖంగా ఉంటే చూడనులేదు. చివరకు వీరి మహాప్రస్థానం (మరణం) కూడా వానప్రస్థానంలో కారుచిచ్చులో మసి కావడంతో పూర్తి అవుతుంది. ఇలాంటి అభాగ్య దంపతులు మనకు అక్కడక్కడ తారసపడుతూనే ఉంటారు.

## 4.3.2 కుంతి పాండురాజులు

గాంధారి, ధృతరాష్ట్రులు దాంపత్యం ఒక విధంగా సాగితే కుంతీ పాండవుల వివాహం మరో పంథాలో కొనసాగింది. వరాలు శాపాలయ్యాయి. దుర్వాసుని వరంవల్ల సూర్యుని ఆహ్వానించి కర్ణుని ప్రసవించి కన్యత్వాన్ని చెడగొట్టుకుంది కుంతి. అప్పటికీ ఇంకా వివాహం కాలేదు. పోనీ వివాహం అయిన తరువాత అయినా సుఖ పడిందా అంటే అదీ లేదు. ఈ సందర్భంలో రచయిత ఆధునిక సమాజంలో కన్యలుగా ఉండి కాలు జారి బిడ్డలను కని ఏటిపాలు చేస్తున్న స్త్రీల ప్రవృత్తిని ప్రస్తావించారు. పాండురాజుతో కుంతికి వివాహం అయింది. సంసారం సాఫీగా సాగిందా? అంటే లేదనే సమాధానం. ముని శాపం ఆ దంపతుల మధ్య అగాధాన్ని సృష్టించింది. కానీ వంశోద్ధరణ కోసం యమ, ఇంద్ర, వాయుదేవుల ద్వారా ధర్మార్జున, భీములను పొందింది. సపత్నీ ద్వేషం లేకుండా మాద్రికి

కూడా ఆ వరాన్ని ప్రసాదించింది. వైధవ్య జీవితం ఎంత దుర్భరమో  కుంతి పాత్ర ద్వారా మనం గ్రహించవచ్చు. సతీసహగమనం చేసిన మాద్రి అదృష్టవంతురాలు. తన కళ్ల ముందరే తన కుమారుడు అరణ్య అజ్ఞాత వాసాలు చేయడం కుంతి చూసింది. కురుక్షేత్ర మహా సంగ్రామాన్ని అందులో బాంధవ వినాశాన్ని కళ్ళారా చూసింది. కర్ణార్జునుల మధ్య వైరుధ్యాన్ని సహించ లేకపోయింది. పాండురాజుతో దాంపత్య జీవనమే సాగలేదు. మహావీరులైన ముగ్గురు కుమారులున్నా సుఖపడలేదు. ఇలాంటి దంపతులు కూడా మనకు అక్కడక్కడ కనిపిస్తారు.

## 4.3.3 ద్రౌపది–పాండవులు

బహుభర్తృత్వం ఎక్కడో కొన్ని ఆటవిక సమాజాలలో తప్ప కనిపించదు. స్వయంవరంలో అర్జునుడు ద్రౌపదిని చేపట్టాడు. కానీ తల్లి మాటను అనుసరించి ఆమెను పాండవులు ఐదుగురు భార్యగా స్వీకరించారు. బలవంతులైన ఐదుగురు భర్తలు ఉన్నా ఆమె దాంపత్య జీవనం ఒడిదుడుకులతోనే కొనసాగింది. పాంచాలీ పరాభవం, పాండవుల అరణ్య, అజ్ఞాతవాసాలు, కీచక వధ, ఆమె జీవితంలో విరుద్ధ సంఘటనలు. యౌవన సమయంలో పాండవులు రాజసుఖాలు అనుభవించ లేకపోయారు.

అరణ్యవాస సమయంలో భీమ హిడింబిల వివాహం జరిగింది. తీర్థయాత్ర సమయంలో అర్జునుడు సుభద్రను వివాహమాడాడు, చిత్రాంగద, ఉలూచి అర్జునున్ని వరించారు. ద్రౌపది పట్ల బహుభర్తృత్వం అర్జునుని పట్ల బహుభార్యాత్వం భారత కథలో విచిత్ర ఇతివృత్తాలు.

## 4.3.4 మేనకా విశ్వామిత్రులు

మహాతపస్సంపన్నుడైన విశ్వామిత్రుడు మేనక వలలో చిక్కాడు. వారికి ఒక కుమార్తె కలిగింది. రచయిత ఇక్కడ ఆధునిక పరిభాషలోని మాటను వాడాడు.

“అంతటి తపస్సంపన్నుడు మేనక వలలో చిక్కాడు. తపస్సు చేస్తున్న మునికి సపర్యలు చేస్తూ ఆయనను లోబరుచుకొంది. చాలాకాలం వారిద్దరూ కామోపభోగాలు అనుభవించారు. ఇద్దరికీ ఒక కుమార్తె పుట్టింది. ఆ బిడ్డను మాలిని అనే ఒక ఏటి ఒడ్డు తీరంలో పెట్టి మేనక దేవలోకానికి వెళ్లిపోయింది. విశ్వామిత్రులు తన దారిన తాను తపోభూమికెళ్లాడు. వీరిది దాంపత్యమా? సంసారమా? కాదు. ఆధునిక కాలంలో పిలిచే లివింగ్ టుగెదర్ (Living Together) అందామా? కలిసి ఉండటం, సుఖాలనుభవించడం”[65].

భారతంలో భిన్న దంపతులు భిన్న మార్గాలలో సంసారజీవితాన్ని గడపటాన్ని రచయిత వివిధ పాత్రల ద్వారా విశ్లేషించారు. ఒక్కొక్కరిది ఒక్కొక్క మార్గం. గాంధర్వ వివాహానికి ప్రతీకలు శకుంతలా – దుష్యంతులు.

ఆధునికకాలంలో జరిగే ప్రేమవివాహాలతో దీనిని రచయిత పోల్చారు. పరాశరుడు మత్స్యగంధిపై వ్యామోహం పడటాన్ని తాత్కాలిక ఉద్రేక స్వభావంగా భావించవచ్చు. కానీ వారికి వ్యాసుడు జన్మించటం లోకకళ్యాణం కోసమే. గయ్యాళి భార్యకు ప్రతిరూపం గంగ. ఆమె మీద మోజుపడ్డ శంతనుడు ఆమె గొంతెమ్మ కోరికలను అంగీకరించాడు. ఏడుగురి బిడ్డలను నదీపాలు చేసినా నోరెత్తలేదు. ఎనిమిదవ బిడ్డ పుట్టినప్పుడు అడ్డు పడ్డాడు అతడే భీష్ముడు.

ఈ శంతన మహారాజు సత్యవతీ (మత్స్యగంధి)ని వివాహమాడటానికి ఉద్యుక్తుడౌతాడు. దాశరాజు పెట్టిన షరతులను అంగీకరిస్తాడు. ఫలితంగా భీష్ముడు బ్రహ్మచారిగా మిగిలిపోతాడు.

భారతంలో దేవయాని ఒక ఆధునిక కన్యకు ప్రతిబింబం. ఆమె గురు పుత్రిక. శిష్యుడుగా ఉన్న కచుని ప్రేమించింది. అతడు తిరస్కరించి వెళ్ళిపోయాడు. నేటి సమాజంలో

---

65 దాంపత్య జీవన సౌరభం – ఆర్. అనంతపద్మనాభరావు, పుట:71.

కూడా ఇలాంటి భగ్న ప్రేమికురాండ్రు కనిపిస్తారు. బావిలో నుండి పైకి లేవదీసిన యయాతిని బలవంతపెట్టి పెళ్ళి చేసుకుంది. కసి తీర్చుకోవటానికి శర్మిష్ఠను దాసిగా తెచ్చుకుంటుంది. చివరకు ఆమె ద్వారా యయాతి పుత్రులను పొందుతాడు. ఇదొక త్రికోణ దాంపత్య జీవనం.

మహాభారతంలో మరొక విచిత్రదంపతులు నలదమయంతులు. ప్రేమ లేఖలతో ప్రారంభమైన ఆధునిక యువతీ యువకుల  వివాహం కూడా. వీరిద్దరు హంసద్యూతంతో ఒకరినొకరు ప్రేమించుకుంటారు. స్వయంవరంలో దమయంతి నలుని వరించింది. కథ ఇంతటితో ఆగలేదు. కలి మహత్మ్యంతో వారు అష్టకష్టాలు పడ్డారు. రాజభోగాలను అనుభవించాల్సిన వారు అడవి పాలయ్యారు. వీరిది బహుక్లిష్టము, కష్టతరము అయిన దాంపత్య జీవనం.

భారతంలో ఉత్తరాభిమాన్యుల జీవితంకూడా ఒక విశేష సంఘటనల సమాహారం. పద్మవ్యూహంలో చిక్కుకున్న అభిమన్యుడు మరణించాడు. అప్పటికే పరీక్షిత్తు ఆమె గర్భంలో ఉన్నాడు. అశ్వత్థామ అస్త్రప్రయోగంతో ఆ శిశువు మరణించాల్సింది కానీ శ్రీకృష్ణుడు కాపాడాడు.  చిన్న వయస్సులోనే ఉత్తరాభిమాన్యుల జీవనం ముగిసింది.

ద్రోణాచార్యుడు, కృపి పేద బ్రాహ్మణులకు ప్రతినిధి. అశ్వత్థామకు పాలకోసం ద్రుపదుని వద్దకు గోదానం కోసం వెళ్ళి అవమానితుడయ్యాడు ద్రోణుడు. ఆ అవమానమే భారత యుద్ధానికి బీజం అయ్యింది.

భానుమతి, దుర్యోధనులు దాంపత్యాన్ని గురించి భారతంలో వివరాలు మనకు లభించవు. కానీ కొన్ని ఇతిహాసాల ఆధారంగా స్వయంవరంలో దుర్యోధనుడు భానుమతిని బలవంతంగా తీసుకెళ్ళాడాన్ని చెబుతారు.

భారతంలో మరో విశిష్ట దంపతులు సావిత్రి సత్యవంతులు.  యముని సైతం మెప్పించి తన పతి ప్రాణాలను కాపాడిన ఏకైక పతివ్రతా శిరోమణి సావిత్రి. కష్టాలకు, కడగండ్లకు వారి జీవితం ఆలవాలమైంది.

ఈ గ్రంథంలో ఈ కోవకే చెందిన మరో దంపతులు చంద్రమతి హరిశ్చంద్రులు. సత్యనిష్ఠకు నిలిచి అష్టకష్టాలను కొని తెచ్చుకున్న వ్యక్తి హరిశ్చంద్రుడు. చంద్రమతి పరుని ఇంట ఊడిగాలు చేయవలసి వచ్చింది. హరిశ్చంద్రుడు కాటికాపరి కావాల్సి వచ్చింది. కేవలం మాటకు కట్టుబడి వారు ఇంతటి అవస్థలకు లోను కావాల్సి వచ్చింది.

చివరి వ్యాసం సాహిత్య దాంపత్యం. ఈ వ్యాసం విశేష పరిశోధనలతో కూడిన వ్యాసం. ఇందులో దాదాపు ఇరవైమంది జంటల సాహిత్య ప్రస్థానాన్ని సవివరంగా పేర్కొన్నారు.  ఈ వ్యాసం నవ్యలో ప్రచురితమైంది. ఇలాంటి వ్యాసం మున్నెన్నడు విస్తారంగా ఒకచోట పేర్కొనలేదని పాఠకులు ఉత్తరాల ద్వారా నవ్య సంపాదకత్వానికి తెలియజేశారు. ఇందులో రచయిత అనంతపద్మనాభరావు, శోభాదేవి దంపతుల ప్రస్తావన కూడా చేయడం కొసమెరుపు. శోభాదేవి కూడా అన్నమయ్య సంకీర్తనా సౌరభం, అన్నమయ్య జీవన ప్రస్థానం, సంభవామి యుగేయుగే గ్రంథాలు ప్రచురించారు.  వీరిద్దరికి ప్రపంచ తెలుగు మహాసభలలో 2012లో సన్మానం జరిగింది.

## 4.4 పురాణం కావ్యశాస్త్ర పరిజ్ఞానం

పద్మనాభరావు కవి, పండితుడు, శాస్త్ర పరిజ్ఞానం కలవాడు. వివిధ పురాణ శాస్త్రప్రబంధాలలో పద్యాలు 4,000 దాకా కంఠస్థం చేసినవాడు. నిరంకుశోపాఖ్యానం, సుగ్రీవ విజయం, మాల్యాది వైభవం వంటి పురాతన గ్రంథాలను పరిష్కరించాడు. వావిళ్ల రామస్వామి శాస్త్రులు & కో వారికి, రాఘవ పాండవీయానికి టీకా, తాత్పర్య వ్యాఖ్యానం రాశారు. అలానే శ్రీమదాంధ్రమహాభారతం  విరాటపర్వానికి తిరుమల తిరుపతి దేవస్థానం వారి కోరిక మేరకు

కొన్ని పద్యాలకు టీకాతాత్పర్యం 2007లో రాశారు. శ్రీమదాంధ్ర మహాభాగవతం, చతుర్థస్కందానికి టీకాతాత్పర్యం రాశారు (2017). హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయంవారు ఆచార్య బేతవోలు రామబ్రహ్మం సంపాదకత్వంలో ప్రచురించిన వర్ణన రత్నాకరంలో కొంత భాగానికి టీకా, తాత్పర్యం రాశారు. తంజావూరులోని సరస్వతీ మహల్ గ్రంథాలయం వారికి ప్రౌఢకవి మల్లన రచించిన రుక్మాంగద చరిత్రను పరిష్కరించే బాధ్యతను చేపట్టారు. తిరుమల బ్రహ్మోత్సవాలకు, శ్రీశైలం, శివరాత్రి ఉత్సవాలకు భద్రాచలం సీతారామ కళ్యాణానికి గత 30 సంవత్సరాలుగా ఆకాశవాణి, దూరదర్శన్, SVBCలకు ప్రత్యక్ష వ్యాఖ్యానాలు చేశారు, చేస్తున్నారు. బహుకావ్య ప్రబంధ పరిచయంతో వివిధ పత్రికలలో వెయ్యికి పైగా వ్యాసాలు రాశారు. ఈ నేపథ్యంలో ఆయన రాసిన కథలలో అనేక సందర్భాలలో పాత్రల మనస్తత్వం చిత్రించటానికి సన్నివేశ కల్పనలోనూ, సంభాషణ నిర్వహణలోనూ, వివిధ కావ్యప్రబంధాలలో నుండి పద్యాలు, శ్లోకాలు, సందర్భోచితంగా వాడుకొని పాఠకునికి ఆహ్లాదం కలిగించారు. కథాకమామీషూలో ఇలాంటి ఉదాహరణలు.

'ఐయామ్ రియల్లీ సారీ' కథలో అన్నమయ్య సంకీర్తనను ప్రస్తావించారు. "జలజాక్షి మోమునకు జక్కవకుచంబులకు నెలకొన్న కప్పురపు నీరాజనం"[66]. ఇదే కథలో అల్లసాని పెద్దన మనుచరిత్రలోని వరూధిని ప్రవరుల సంభాషణను రెండు సార్లు ప్రస్తావించారు.

"ప్రాంచత్ భూషణ బాహుమూలరుచితో పాలిండ్లు పొంగార"[67].

"కామశాస్త్రోపాధ్యాయనినా వచించెదవు".

"నీపైన్ చిక్కెమనంబునాకు, నన్ చిత్తజుబారికి అప్పగించెదో".

"ఎవ్వతెవీవు భీతహరిణేక్షణ" అనే పద్యం

---

[66] కథా కమామీషూ – అనంత పద్మనాభరావు, పుట:9.

[67] కథా కమామీషూ – అనంత పద్మనాభరావు, పుట:9.

“ఇంతలు కన్నులుండ తెరువెవ్వరి వేడెదు” అనే పద్యాలు ఉదాహరణ.

‘వట్టిరాకపోకలొనర్చెవానిసతియు’ అనేది సంపూర్ణంగా కళాపూర్ణోదయంలోని సుగాత్రీ, శాలీనుల కథకు ముడిపడిన ఇతివృత్తం.

‘అష్టోత్తర శతం’ కథలో రామచంద్రమూర్తి గాయత్రీ మంత్ర పఠనం

**“ఓం భూర్భువస్సువః**

**తత్సవితుర్వరేణ్యం**

**భర్గోదేవస్య ధీమహి**

**ధియోయనః ప్రచోదయాత్”**[68]

నిత్యం చేయటాన్ని పేర్కొన్నారు. అలానే లక్ష్మీ క్షీరసముద్ర రాజతనయాం, శ్రీరంగధామేశ్వరీ అనే లక్ష్మీ స్తుతిని ఉటంకించారు.

‘వాసాంసిజీర్ణానియథావిహాయ’ మరో ఉదాహరణ. భగవద్గీతలోని “యత్రయోగేశ్వరః కృష్ణో”[69] అనే శ్లోకాన్ని గుర్తు చేశారు. కేవలం తెలుగు సంస్కృతం గ్రంథాలే కాక ‘తులసీదాస్’ హిందీలో రచించిన ‘రామచరిత మానస్’లోని ఒక శ్లోకాన్ని కూడా సందర్భోచితంగా ప్రస్తావించారు.

**“పవన తనయ సంకటహరణ**

**మంగళ మూరతి రూప్**

**రామలఖన సీతా సహిత**

---

[68] కథా కమామీషూ – అనంత పద్మనాభరావు, పుట:23.

[69] కథా కమామీషూ – అనంత పద్మనాభరావు, పుట:23.

**హృదయ బసహు సురభూప్"**[70]

'ఆదర్శం' కథలో ద్రుపద, ద్రోణుల కథ చిత్రించబడింది.

'దేవయాని' కథ యయాతి, దేవయానుల కథకు అనుసరణగా చెప్పవచ్చు. ఇందులో కథ శర్మిష్ట, దేవయాని, యయాతిల మీద తిరుగుతుంది.

**"కర్మణ్యేవాధికారస్తే**

**మాఫలేషు కదాచన**

**మాకర్మఫల హేతుర్భూః**

**మాతే సంగోస్త్వకర్మణి"**[71]

'కృష్ణజన్మస్థానం' కథ ఆధునిక భాగవత కథకు పేరడీ. కేవలం ప్రాచీన కవుల గ్రంథాల నుండి ఉదాహరణలు చూపటమే కాక 'పూర్ణిమ' కథలో కవి కోకిల దువ్వూరి రామిరెడ్డి వనకుమారి ఖండకావ్యం నుండి (ఆధునిక కవి) 'అరగౌర చీర' అనే పద్యాన్ని ఉదాహరించారు.

"నిరాశ్రయేనశోభంతే కవితా, వనితా, లతా" అనే సంస్కృత సూక్తిని 'తలపుల తలుపులు' అనే కథలో ప్రస్తావించారు[72].

"సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణంవ్రజ, అహంత్వా సర్వపాపేభ్యో మోక్షయిష్యామి మాశుచః"[73] అనే గీతా శ్లోకాన్ని 'నీడనిచ్చిన గూడు' అనే కథలో పరిచయం చేశారు.

అలానే సమదుఃఖ సుఖందారం, అని సంశయాత్మ వినశ్యతి అని ఉదాహరణలు చూపారు.

---

[70] కథా కమామీషూ – అనంత పద్మనాభరావు, పుట:25.

[71] గోరింట పూచింది – అనంత పద్మనాభరావు, పుట:88.

[72] కథా మందారం – అనంత పద్మనాభరావు, పుట:30.

[73] కథా మందారం – అనంత పద్మనాభరావు, పుట:43.

జ్యోతిష సంబంధమైన ఒక విశ్వాసాన్ని ఆధారంగా చేసుకున్న కథ 'వంశాంకురం'. రచయిత స్వయంగా జ్యోతిష్కులు కావటం మూలాన ఈ సంఘటనలను శాస్త్రబద్ధంగా రూపొందించారు.

మర్కటకిశోర న్యాయం, మార్జాలకిశోర న్యాయం అనేవి వానరప్రస్థం అనే కథలో ప్రస్తావించబడ్డాయి.

"ఓం త్ర్యంబకం యజామహే" అనే మృత్యుంజయ మహా మంత్రాన్ని ఈ కథలో సందర్భోచితంగా వాడారు. దానికి మరింత విలువనిస్తూ 'దోస తొడిమ' అనే కథలో దానిని స్పష్టం చేశారు.

పోతన భాగవతంలోని గజేంద్రమోక్షం ఘట్టంలో "లావొక్కింతయులేదు ధైర్యమా విలోలంబయ్యెడిన్" అనే పద్యాన్ని గుర్తు చేశారు.

"నారాయణం పరబ్రహ్మ" అనే శ్రీనివాస వజ్ర కవచాన్ని జగన్నాథం నోట పలికించారు.

## 4.5. తెలుగు భాషలో రామాయణాలు

**"మానిషాద ప్రతిష్టాంత్వం**

**అగమశ్శాశ్వతీస్సమాః**

**యత్ క్రౌంచ మిథునీదేకం**

**అవధీం, కామమోహితమ్"**

అని ఆదికవి వాల్మీకి మహాకవి నోట ఏనాడు ఈ శ్లోకం వెలువడిందో నాటనుండి నేటి వరకు అన్ని భాషల్లోనూ రామాయణ అనువాదకావ్యాలు, నాటకాలు, గేయకావ్యాలు, యక్షగానాలు,

వివిధ ప్రక్రియల్లో, వివిధ కాలాల్లో భిన్నరూపాలలో అవతరించాయి. తమదైన శైలితో, తమదైన దృష్టితో, తమదైన శక్తితో, తమదైన చిత్రవృత్తితో, తమదైన బాణీలో రచనలు కొనసాగించారు. వీరందరికి ఆది గురువు కవి.

తెలుగుసాహిత్యానికి సంబంధించినంతవరకు తిక్కన నిర్వచనోత్తరరామాయణం, గోన బుద్ధారెడ్డి రంగనాథ రామాయణం, ఎర్రన రామాయణం, భాస్కరరామాయణం, మొల్ల, కంకంటి పాపరాజు ఉత్తరరామాయణం, కట్టా వరదరాజు రామాయణం ప్రాచీనకాలంలో వెలువడ్డాయి. యక్షగానాలలో సుగ్రీవ విజయం, యక్షగానం రామాయణ కథపై ఆధారపడిందే. ఆధునిక కాలంలో రామాయణ కథాసంబంధమైన నాటకాలు అనేకం వచ్చాయి. శ్రీపాదవారు, వావికొలనువారు (మంథర వ్యాఖ్యానం), జనమంచివారు (ధర్మసార రామాయణం), విశ్వనాథవారి రామాయణ కల్పవృక్షం వెలిచాయి. రామాయణ కల్పవృక్షం జాతీయ స్థాయికి ఎదిగి జ్ఞానపీఠానికి ఎంపికై తెలుగువారి జెండాను జాతీయ స్థాయిలో ఎగురవేసింది. తమిళంలోని కంబరామాయణాన్ని పూతులపట్టు శ్రీరామరెడ్డి తెలుగులోకి అనువదించారు. తులసీదాస్ రామచరితమానస్ కూడా పలువురు తెలుగులోకి అనువదించారు.

**సీ. మఱల నిదేల రామాయణంబన్నచో**

**నీ ప్రపంచక మెల్లనెల్ల వేళ**

**దినుచున్న యన్నమే తినుచున్నదిన్నాళ్ళు**

**తన రుచి బ్రతుకులు తనవిగాన"**[74]

---

74 శ్రీమద్రామాయణ కల్పవృక్షం – బాలకాండం – అవతారిక – 5వ పద్యం.

అని తిరిగి తాను రామాయణం వ్రాయడానికి గల నేపథ్యాన్ని వివరించుకోవాల్సి వచ్చింది. రామాయణ కల్పవృక్ష విమర్శనంగా ముప్పాళ రంగనాయకమ్మ 'రామాయణ విషవృక్షం' ప్రచురించింది. గడియారం వెంకటశేషశాస్త్రి రామాయణం, పుట్టపర్తి నారాయణాచార్యుల జనప్రియ రామాయణం. ఆధునిక కాలంలో వచ్చిన అనేకానేక రామాయణాలు ప్రసిద్ధ కథకుడైన విహారి పదచిత్ర రామాయణం కూడా కలదు.

ఏకోజి మహారాజు (1735–36) తంజావూరును పాలించిన మహారాష్ట్ర రాజు. రామాయణ ద్విపద కావ్యాన్ని రాశారు. ద్విపద రామాయణాలలో రంగనాథరామాయణంలాగే ఇది కూడా ప్రసిద్ధం. ఇతడు వాల్మీకిని ఇలా ప్రశంసించారు "ధరణి రామయాణోద్యమాన సంచార వరకోకిలంబైన వాల్మీకిదలచి"[75]. ఈ నేపథ్యంలో అంతరంగ తరంగాన్ని పరిశీలించడానికి ముందు రచయిత అనంతపద్మనాభరావు అంతరంగాన్ని గమనించాలి.

## 4.5.1 అనంత పద్మనాభరావుఅంతరంగం

"వాల్మీకి రామాయణం జగత్ ప్రసిద్ధం. వేలాది సంవత్సరాలుగా సంస్కృతంలోను, తెలుగులోను, ఇతర భాషల్లోను రామకథను చెప్పారు, చెబుతున్నారు, చెబుతారు...

రామాయణాన్ని రామచరిత మానస్‌గా తులసీదాసు ప్రవచించాడు. విశ్వనాథ వారి రామాయణం జ్ఞానపీఠమైంది.

"మరలనిదేల రామాయణ"మ్మని విశ్వనాథ వారే చెప్పుకున్నారు.

రామాయణంపై వందల కొద్ది పరిశోధనలు వెలువడ్డాయి. ఇది సరికొత్త ప్రయోగం.

---

[75] ఏకోజి మహారాజు–ద్విపద రామాయణం – 10వ ద్విపద.

రామాయణంలో 18 మంది స్త్రీలు తమ అంతరంగాన్ని ఎలా ఆవిష్కృతం చేశారో కల్పన చేశాను. ఇది పరిశోధనాత్మక కల్పన. కేవలం స్త్రీలద్వారా కథ నడిచింది. 18 సంఖ్యకు మన హిందూ సంప్రదాయంలో ప్రాధాన్యం ఉంది.

ఇది కవి హృదయంలోని వేదన... నివేదన...

స్త్రీ పాత్రలు మనస్సు విప్పి చెప్పుకోలేని గుండెల ఆక్రందన. తరతరాలుగా వారిలో గూడు కట్టుకున్న మానసిక వేదన. ఒకరిపై ఒకరికి ఆదరం, గౌరవం, అభిమానం.

విధి చేతిలో కీలుబొమ్మలు, విలువలు తెలిసిన మహిళలు, సముద్ర తరంగాలు చెలియలికట్ట దాటనట్లే రామాయణ స్త్రీల అంతరంగ తరంగాలు మర్యాదాతిక్రమణం చేయవు.

ఇవి సీతాయన కథాగమన శిల్పాలు.

ఆ శిల్పాల సౌందర్యం చూసి ఆనందిద్దాం.

అంతరంగ తరంగాల ఆకృతిని ఈ కృతిలో దర్శిద్దాం".

తెలుగు భాషలో ప్రాచీన, ఆధునిక కవులలో అనేకులు అనేక ప్రక్రియలలో ప్రయోగాలు చేసే సఫలం అయ్యారు. ఎవరి ధోరణి వారిది . ఎవరి దృక్పథం వారిది. పాఠకులే వీటికి న్యాయ నిర్ణేతలు. తెలుగు వారికి భారత, భాగవతాలవలే ప్రసిద్ధమైన ఒకే ఒక్క రామాయణ అనువాదాన్ని చెప్పగలిగినది ఏదీ లేదు. భారతానికి వివిధ అనువాదాలు, అనుసరణలు వచ్చినా కవిత్రయ కవులను ఎవరూ అధిగమించ లేకపోయారు. అదే రీతిలో వ్యాస భాగవతాన్ని పోతానాదులు తెనిగించిన రీతిలో మరెవ్వరూ ముందుకు వెళ్లలేకపోయారు. భారత, భాగవతాల వలే ప్రామాణికంగా రామాయణం చదవాలంటే ఎవరి రామాయణం చదవాలనేది ఇప్పటికీ పండితుల మధ్య ఉన్న పెద్ద ప్రశ్న.

## 4.5.2 అంతరంగ తరంగ రచనా నేపథ్యం

2012లో విజయవాడనుండి వెలువడే 'నది' మాసపత్రిక వారు పౌరాణిక, చారిత్రక నేపథ్యంగల ఒక వచన కావ్యానికి లక్ష రూపాయల బహుమతి ప్రకటించారు. అది ప్రేరణగా కొత్తదైన తరహాలో రామాయణాన్ని వచన కావ్యరూపంలో ఆధునిక పరిభాషలో 'నవల' వలె అంతరంగ తరంగం అనే పేరుతో సీతాయనం అనే వచన కావ్యాన్ని రచయిత రచించారు. రచనలలో తనకు సహకరిస్తున్న వీరి శ్రీమతి ఆర్. శోభాదేవి కూడా ఇదే పోటీకి తనదైన రీతిలో 'సంభవామి యుగేయుగే' అనే పేర 'దశావతార చరిత్రం' ను నవలా రూపంలో ఈ పోటీకి పంపించారు.

రెండింటికీ బహుమతులు రాకపోయినా రెండు గ్రంథాలు 2014లో ప్రచురించారు.

## 4.5.3 రచనా ప్రణాళిక

1. స్త్రీవాద దృష్టితో రచించబడిన రచన అని వర్గీకరించబడకపోయినా స్త్రీల మానసిక ప్రవృత్తిని ఆధారంగా చేసుకొని కథను నడిపారు.
2. 18 స్త్రీ పాత్రలతో 7 ఖండాలను కథాక్రమంలో ముందుకు సాగించారు.
3. ఉత్తమపురుషలో కథను నడిపించారు. రచయిత తానుగా కథను చెప్పదు. పాత్రలు తమంత తామే తమ అంతరంగాన్ని ఆవిష్కరిస్తారు.
4. రచయిత పాత్రలలో పరకాయ ప్రవేశం చేసి వారి నోటి వెంట మాటలు పలికించారు.
5. హిందూ సంప్రదాయంలో 18 సంఖ్యకు ప్రాధాన్యం ఉన్నది. అందువలన 18 పాత్రలను ఎంచుకున్నారు.

6. ఇది పరిశోధనాత్మక కథా కల్పన. ఇది మూల విధేయమైన వాల్మీకి రామాయణానికి భిన్నం కాదు. ఎక్కడ అవాల్మీకమైన సన్నివేశాలు కానీ, కల్పనలు కానీ చేయలేదు.

7. లోగడ కొందరు ఊర్మిళ భావావేశాన్ని వర్ణించిన రచయితలు ఉన్నారు. కానీ మిగతా పాత్రల మనోభావాలకు దర్పణం కట్టినవారు లేరు.

8. ఆయా పాత్రలు తమ కథను చెబుతున్నా బాలకాండ కథ తరువాత అయోధ్యకాండ, అరణ్యకాండ ఇలా కథా గమనానికి అనుగుణమైన రీతిలో పాత్రలను ప్రవేశపెట్టారు.

ఇందులో 18 పాత్రలు

1) కౌసల్య

2) తాటక

3) అహల్య

4) సుమిత్ర

5) కైక

6) అనసూయ

7) సీత

8) శూర్పణఖ

9) సునయనా దేవి, జనకపత్ని, రత్నమాల అని కూడా పిలుస్తారు

10) ఊర్మిళ

11) శబరి

12) సురస

13) సింహిక

14) స్వయంప్రభ

15) మండోదరి

16) సులోచన

17) అరుంధతి

18) పాత్రల ద్వారా కథ నడిచినా ఒక్కొక్క విభాగానికి ఒక్కొక్క శీర్షికను పెట్టారు. ఇలా చెప్పటం వల్ల పాఠకులకి ఉత్కంఠ పెరుగుతుంది.

**శీర్షికలు**

1) కౌసల్యాసుప్రజారామ

2) రామబాణం

3) ఇంద్రుని వంచన

4) వరాల తల్లి

5) గచ్ఛతాత యధాసుఖం

6) అంధకార బంధురమైన అయోధ్య

7) పత్నీ పరిచయం

8) ఇయం సీతా మమసుతా

9) వనవాస సుఖం

10) చుప్పనాతి చెల్లెలు

11) మాయలేడి

12) జనకపత్ని

13) మగత నిద్రలో

14) ఎంగిలి చేసిన పండ్లు

15) మాట నేర్పరి

16) హనుమ చాతుర్యం

17) పరాక్రమశాలి హనుమ

18) సీత జాడ

19) విధి వంచిత

20) అశోక వనంలో

21) లంకాధిపతి కోడలు

22) పట్టాభిషిక్తుడైన రాముడు.

12. ప్రతి సన్నివేశం చివరలో రచయిత ఒక పద్యాన్ని స్వయంగా రాశారు. అవి కొసమెరుపులుగా భాసించాయి.

13. ముక్తాయింపుగా మంగళప్రదంగా కథ సుఖాంతం కావాలి. కాబట్టి వాల్మీకి శ్లోకాన్ని ఉటంకిస్తూ తాను దాని అనువాదాన్ని పద్యరూపంలో మంగళా శాసనంగా ప్రకటించారు[76].

14. మధ్య మధ్యలో స్వీయ పద్యరచన జోడించారు. ఎడనెడ వాల్మీకి రామాయణంలోని శ్లోకాలను సందర్భోచితంగా వాడుకుంటారు. ఉదాహరణకు సుమిత్ర పాత్ర ప్రవేశంలో ఈ శ్లోకం కనిపిస్తుంది.

**"రామం దశరథం విద్ధి**

**మాం విద్ధి జనకాత్మజాం**

**అయోధ్యామటవీం విద్ధి**

**గచ్ఛ తాత యధా సుఖం"**[77]

**"ఇయం సీతా మమ సుతా**

**సహధర్మ చరీతవ**

**ప్రతీచ్ఛ చైనాం భద్రంతే**

**పాణిం గృహ్ణీష్వ పాణినా"**[78]

15. మధ్యలో ఆముక్తమాల్యదలోని ఆనిష్టానిధి పద్యానుకరణగా ఒక పద్యాన్ని రచించారు.

**శా॥ "అనిష్టానిధిగేహసీమనడురేయాలించినన్మోయు నెం**

**తే నాగేంద్రశయానుపుణ్యకథ లుందివ్య ప్రబంధాను సం**

---

[76] అంతరంగ తరంగం – ఆర్. అనంతపద్మనాభరావు – పుట:206.

[77] వాల్మీకి రామాయణం – అయోధ్యకాండ – 40వ సర్గ – 9వ శ్లోకం.

[78] వాల్మీకి రామాయణం – బాలకాండ – 73వ సర్గ.

**ధాన ధ్యానము నాస్తిశాకబహుతా, నాస్త్యుష్ణతా, నాస్త్యపూ**

**పో, నాస్త్యోదన సౌష్ఠవంచ కృపయా భోక్తవ్య మన్నల్కులున్"**[79]

ఈ పద్యానికి పద్మనాభరావు కొద్దిపాటి సవరణతో సందర్భానుసారంగా పద్యాన్ని సృష్టించారు. అష్టావధానం చేసిన రచయిత కావడం వల్ల అది సులభ సాధ్యమైంది.

**శా॥ అనిష్టానిధి దివ్యసీమనెవరే నాలించినన్ వీచె నెం**

**తేనీ రామకథానుగుణ్యకథలున్ దీవ్యత్ మహత్వానుసం**

**ధానధ్యానము – నాస్తిశాక బహుతా, నాస్త్యుష్ణతా, నాస్త్యపూ**

**పో, నాస్త్యోదన సౌష్ఠవంచ – కృపయా భోక్తవ్యమన్ మాటలున్"**[80]

శూర్పణఖ ఘట్టంలో రచయిత కొన్ని పద్యాలను స్వయంగా అల్లారు. అవి శూర్పణఖ మనస్తత్వాన్ని చిత్రించే విధంగా ఉన్నాయి.

## 4.6 రచయిత స్వీయ పద్య రచనలు

**చం॥ "చిరు దరహాసచంద్రికలు సేమము జూడ లతాంగి నవ్వి క**

**న్నరవిరి విచ్చినట్లుగని యందము చిందగ, బుగ్గలందు లే**

**బరువపు కాంతిదోప – తన పయ్యెద చేతులుజేర్ప – కంతుడా**

**దరమున కౌగిలింతలిడె దర్పమొలంకగ చాపహస్తుడై"**

**శా॥ "వ్రీడారోహిత భావచంద్రికలతో లోలాక్షి సిగ్గిల్లె – మా**

---

79 ఆముక్తమాల్యద – ప్రథమాశ్వాసం – పద్యం:83.

80 అంతరంగ తరంగం – ఆర్. పద్మనాభరావు, పుట:50.

రాడంగం దలపోసి సాదరముగా ప్రారంభరాగోన్నతుల్

జాడల్‌దెల్పగ కన్నుదోయి ముకుళించన్ – నాతికిన్ క్రొంబులకల్

తోడ్తోడన్ మదనుండు విల్లుగొనె సంతోషంబు పొంగారగా"

ఉ॥ "చెక్కిట నూత్నరాగములు సేవకవృత్తికి దారితీయగా

చక్కలిగింతలై మరుడు సందిటబట్టిన బాణజాలముల్

ప్రక్కకు దోసె – నాడు రతిభావము దోపగ పూలసెజ్జకున్

మ్రొక్కిడె – ఫాలనేత్రునకు మ్రొక్కిడె గద్గద ఖిన్నకంఠియై"[81]

ఉ॥ "నిన్నటిదన్క దాగినవి, నేడిదె లోకముతీరుజూచి – సం

పన్నులకున్ కరగ్రహణ బాధలు తప్పని రీతిజూచి, భ

క్త్యున్నత భావమున్ గదుర నూపిరులూదిన భంగి కాంత వ

క్షోన్నత దీప్తులన్ గనుచు నూరువులున్ తొడగట్టి నిల్చెబో"

సీ॥ అందాల నొలికించి యాడుది నవ్వెనా

మగవాని ధైర్యమ్ము మంటగలియు

కులుకుచు గాజులు గలగలమనిపింప

మగధీరుడైన నమస్కరించు

నడయాడుచందంపు నయనంపు విందుల

మగడు బికారియై మాటలాడు

---

[81] అంతరంగ తరంగం – ఆర్. పద్మనాభరావు, పుట:111, 112.

ఒయ్యారమొలకింప పయ్యెద తొలగెనా

కాళ్లవేళ్లబడును కాంతుడపుడు

తే.గీ.॥ ఓరచూపుల మగవారి గోరెనేని

బ్రహ్మచర్యమ్ము మదిలోనె వదలుకొనును

దాసులే గద! మగవారు తరుణులకును

నాడు నేడునెగాదు – ఏనాడుగూడ

కౌసల్య భావావేశాన్ని చిత్రిస్తూ ఇలా అంటారు.

"కైక దశరథు ముద్దుల కాంతయౌను

అంతఃపురిలోనె బందియౌ కాంతనేను

రామచంద్రుడు నాకు గారాలపట్టి

రాజసములేని కోసల రాజపుత్రి"[82]

సుమిత్ర:

తే.గీ.॥ "అక్క కౌసల్య రాముని కలమటించె

చెల్లి కైకమ్మ కోర్కెలే తల్లడిల్ల

వరములే బలిగొన్న వాపంక్తిరధుని

తపనబడబోదు ఎన్నండు ఈ సుమిత్ర"[83]

---

[82] అంతరంగ తరంగం–ఆర్. అనంతపద్మనాభరావు, పుట:14.

[83] అంతరంగం తరంగం – ఆర్. అనంతపద్మనాభరావు, పుట:35.

ఊర్మిళ:

తే.గీ.॥ "అన్నవెంబడి నడిచె తానడవులకును
ఏమిచెప్పెద చెరసాల ఈ అయోధ్య
చెనటి ప్రాణమెటులొ నరచేతబట్టి
ఊపిరే పతిగాదె ఈ ఊర్మిళసతి"[84]

తార:

తే.గీ.॥ "రామభరతులు లక్ష్మణస్వాములందు
అన్నదమ్ముల సఖ్యత అధివసించె
వాలి మరణించె సుగ్రీవువాంఛితమున
భర్తకోల్పోయినట్టి దీ వాలిపత్ని"[85]

మండోదరి:

తే.గీ.॥ "భక్తిభావన పరమేశు వరములందె
సర్వశాస్త్రవిదుడు భుజశక్తియుతుడు
కామమోహితరావణు భామనైతి
ఏటికెదురీత ఈదె లంకేశుపత్ని"[86]

---

84 అంతరంగ తరంగం – ఆర్. అనంతపద్మనాభరావు, పుట:140.

85 అంతరంగ తరంగం – ఆర్. అనంతపద్మనాభరావు, పుట:161.

86 అంతరంగ తరంగం – ఆర్. అనంతపద్మనాభరావు, పుట:171.

**సులోచన**

**తే.గీ.॥ "ఇంద్రజిత్తు నాభర్త, నాకేమిలోటు**

**బలమదోద్ధత లంకాధిపతియె మామ**

**రామశరతప్త మీ సర్వరాక్షసాళి**

**వీచె వైధవ్యగాలి సులోచనకును"**[87]

కథను సంభాషణాత్మకంగా నడపడం, నాటకంలో వలే రెండు పాత్రలు పరస్పరం సంభాషించుకున్నట్లు చెప్పటం ఒక ప్రత్యేకత.

**సన్యాసి**:"బంగారు శరీరచ్ఛాయ గలిగి పచ్చని పట్టు వస్త్రం కట్టుకొన్నదానా! నీవెవరివి? పార్వతివా? కీర్తికాంతవా? లక్ష్మివా? అప్సరసవా? ఐశ్వర్యాధి దేవతవా? రతీదేవివా? నీ అందం వర్ణనాతీతం. ఇంతవరకు నేనిలాంటి మనుష్య స్త్రీని చూడలేదు. దేవ గంధర్వ యక్ష కిన్నర స్రీలు కూడా ఇంతటి రూపం గలవారు లేరు. ఈ వయస్సులో నీవు అడవులలో ఉండటం నా మనసును కలచి వేసింది.

ఇది రాక్షసులు సంచరించే చోటు. నీవు ఇక్కడ ఉండకూడదు. నగరంలో ఉద్యానవనంలో తిరగాలి. శ్రేష్ఠుడైన భర్త నీకవసరం.

నీవు నాకంటికి దేవతా స్త్రీలా కనబడుతున్నావు.

ఇక్కడ సింహాలు, భయంకర మృగాలను చూసి నీకు భయంగా లేదా?

నీవు అసలు ఎవరిదానవు? ఒంటరిగా దండకారణ్యంలో ఎందుకు తిరుగుతున్నావు?

నేను (సీత) అతిథిగా వచ్చిన ఆ సన్యాసికి అతిథి సత్కార్యాలు చేసి...

---

[87] అంతరంగ తరంగం – ఆర్. అనంతపద్మనాభరావు, పుట:190.

**సీత**:"బ్రాహ్మణోత్తమా! భోజనం సిద్ధంగా ఉంది. నిమంత్రణ చేస్తాను రండి. ఇది మునులు కూర్చొనే ఆసనం.  ఫలాలు సిద్ధంగా ఉన్నాయి. మీరు అతిథిగా వచ్చారు. మీకు నా వివరాలు చెప్పాలి".

"నేను మిథిలాధిపతి జనకుని కుమార్తెను. అయోధ్య రాకుమారుడు రాముని భార్య సీతను. సమస్త భోగాలను దశరథుని కోడలిగా గౌరవం పొందుతూ, పన్నెండేళ్లు అనుభవించాను. పదమూడో సంవత్సరం రామపట్టాభిషేకానికి మహారాజు ఏర్పాట్లు చేశారు. మా అత్త కైకేయి వరాల ఫలితంగా అరణ్యాల కొచ్చాం.

నాకు అప్పటికి పన్నెండేళ్లు. రామునికి ఇరవై ఐదు. మాతో మా మరిది లక్ష్మణుడు కూడా వచ్చాడు అరణ్యాలకు. ఒక్క క్షణం వేచి ఉంటే నా భర్త జింకలను, ఉడుములను చంపి వాటి మాంసం సమృద్ధిగా తెస్తారంటూ నా సంగతి చెప్పాను".

**రావణుడు**: ఇక నీపేరు, గోత్రము, కులము యదార్థంగా చెప్పు. దండకంలో ఒంటరిగా ఎందుకు తిరుగుతున్నావు?

"సీతా దేవాసుర పన్నగులతో సహా అన్ని లోకాలను గజగజలాడించిన రావణుణ్ణి. నిన్ను చూసిన తర్వాత నా భార్యలనుండి ఆనందం పొందలేను. నాది లంకానగరం. అది సముద్ర మధ్యంలో ఉంది. అక్కడ నీవు నాతో హాయిగా ఉద్యానవనాలలో తిరగవచ్చు. ఐదువేల మంది దాసీలు నీకు పరిచర్యలు చేస్తారు"[88].

**మరో ఘట్టంలో ——**

**మహారాజు**:"ఆచార్య దేవా! ఏమిటీ వైపరీత్యం?

[88] అంతరంగ తరంగం – ఆర్. అనంతపద్మనాభరావు, పుట:125, 126, 127, 128, 129.

**ఆచార్యులు**: ప్రభూ! రాకుమారి జాతకంలో సప్తమస్థానం...

**ప్రభువు**: సప్తమం...

**ఆచార్యులు**: బలహీనం ప్రభూ.

**ప్రభువు**: ప్రస్తుత కర్తవ్యం. రాకుమారికి గత మాసంలో కుజదోష నివారణ పూజలు చేయించాం. శాంతులు కూడా చేయించాం.

**ఆచార్యులు**: ప్రభూ! ముహూర్త బలం అపరిమితంగా ఉంది. ఆటంకాలెదురైనా వీరిరువురికి వివాహం నిశ్చయంగా జరుగుతుంది. తమరు వివాహ ప్రయత్నాలు ఆరంభించవచ్చు.

**కుండపోతగా వర్షం**

**ప్రభువు**: అమాత్యవర్యా! అజమహారాజునకు వివాహ వర్తమానం రాజలాంఛనములతో అందించండి. వారు తమ పుత్రులు దశరథ మహారాజుతో కలిసి సపరివారంగా వివాహానికి కోసలకు రావాల్సిందిగా ఆహ్వాన లేఖలు పంపండి.

**అమాత్యులు**: చిత్తం ప్రభూ!

**రావణుడు**: మహర్షీ! భూత భవిష్యత్ వర్తమానాలను దివ్యదృష్టితో చూడగలిగిన తాము మా భవిష్యత్తును కూడా సెలవివ్వండి.

**నారదుడు**: విధి బలీయం.  ఆగామి సంచితాలను ఎవ్వరూ తప్పించుకోలేరు. నాయనా! నీవు అష్టదిక్పాలకులను జయించి నీ అడుగులకు మడుగులొత్తేలా చేశావు. కానీ...

**రావణుడు**:  ఏమిటి మహర్షీ... ఆగిపోయారు?

**నారదుడు**: తగవులమారియని నన్ను అందరంటారు. కానీ నిజం చెప్పక తప్పదు.

**రావణుడు**: ఏమిటా నిజం?

**నారదుడు**: కోసల దేశాధీశుని కుమార్తె కౌసల్యకు వివాహం జరుగబోతుంది. ఆమె గర్భంలో జన్మించే కుమారుడు నీ మరణానికి హేతువు కాబోతాడు.

**రావణుడు**: అసంభవం... (అభ్యంతర మందిరం దద్దరిల్లింది) ఈనాడే ఆ కౌసల్యను సముద్ర మధ్యంలో పడవేస్తాను. వివాహము లేదు. గర్భమూ లేదు. ఈ దశకంఠుని ప్రతాపాగ్నికి దేవతలే భస్మీభూతమయ్యారు.

**రావణుడు**: మహర్షీ! ఆ కౌసల్యను అంతమొందించనిదే నాకు నిద్ర పట్టదు.

**నారదుడు**: నాయనా? నీవంతదూరం వెళ్లి స్త్రీ హత్య దోషానికి పాల్పడనవసరం లేదు.

**రావణుడు**: మహర్షీ... నన్నాపకండి.

**నారదుడు**: కౌసల్యకు పుత్ర సంతానం కలిగితేనే గదా! ఆమెకు ఇప్పట్లో ఆ భాగ్యం లేదు. సమస్త దేవతలను జయించిన నీవు ఒక స్త్రీని చంపటం విరోచితమనిపించుకోదు. ముల్లోకాలను గడగడలాడించే పరమశివుని మెప్పించిన నీకు ఒక సామాన్య మానవుణ్ణి అదీ ఆ పుట్టబోయే బిడ్డను జయించడం లెక్కలోనిది కాదు. నామాట విని ప్రయత్నం విరమించుకో.

**దశరథుడు**: గృధ్రరాజా నేను అయోధ్య రాకుమారుణ్ణి. మా తండ్రి అజమహారాజు కాలవైపరీత్యం వల్ల మా వివాహానికి భంగమై ఇప్పుడే మేమిద్దరం ఒకటయ్యాము.

"మానవ భాషను అర్థం చేసుకోగల ఆ పక్షిరాజు జటాయువు నూతన వధూవరులను సునాయాసంగా ఆకాశమార్గంలో అయోధ్యకు చేర్చాడు. ఆ పక్షిరాజుకు నూతన దంపతులు నమస్కరించారు. నీ రుణం తీర్చుకోలేమన్నారు. ఈ సాహచర్యం జీవితాంతం ఉంటుందన్నాడు దశరథుడు"[89]

రావణుడు సీతను అపహరించిన సన్నివేశంలో నాటకీయతను ప్రవేశపెట్టారు.

---

[89] అంతరంగ తరంగం – ఆర్. అనంతపద్మనాభరావు, పుట 131.

వివిధ కాండాలలో ఉన్న ఒకే పాత్రకు సంబంధించిన కథను ఒక్కచోట గుదిగూర్చి చెప్పటం కష్ట సాధ్యమైన విషయం. ఉదాహరణకు కౌసల్య బాలకాండలో, అయోధ్య కాండలో కనిపిస్తుంది. ఆమె పూర్వజన్మ వృత్తాంతం, దశరథునితో వివాహం అన్నింటిని కలిపి ఒకే సన్నివేశంలో ఇమడ్చడం చేయి తిరిగిన రచయిత మాత్రమే చేయగలడు.

కౌసల్య సన్నివేశంలో మరొక నాటకీయత సన్నివేశం ప్రవేశపెట్టారు. దీనిని నాటకంగా కూడా ప్రవేశపెట్టవచ్చు.

సులోచన సన్నివేశంలో కరుణరసాదృతమైన నాటకీయత.

**సులోచన**:"ప్రభువుల విజయపరంపర మేమూ విన్నాం. కానీ...

**ఇంద్రజిత్**: ఈ ఇంద్రజిత్తుని యుద్ధ నిఘంటువులో 'కానీ' లేదు దేవీ!

**సులోచన**: మీరు అంతటి సమర్థులే. దేవేంద్రుని...

**ఇంద్రజిత్**: అవి పాత గాథలు. మొన్నటికి మొన్న రామలక్ష్మణులు మూర్ఛితులయ్యారు.

**సులోచన**: పునరుజ్జీవితులయ్యారు. 'స్వామీ! రామచంద్రుని గూర్చి అంతా విన్నాను. మా తండ్రి నాగరాజు నాకు అంతా వివరంగా చెప్పి పంపారు. రఘు కులతిలకుడు, మూర్తీభవించిన ధర్మ స్వరూపం. మీరు మామగారితో చెప్పి యుద్ధాన్ని ఆపండి. ఒక్క సీత కోసం రాక్షస వంశ నాశనం కూడదు".

ప్రభువులు నన్ను తప్పు పట్టలేదు. నా ఆలోచన సరిగా లేదని వారించారు అంతే! ధర్మపక్షపాతియైన నేనలా మాట్లాడటం సహజమేనని సంభావించారు. సమర్థుల నిస్సహాయ దశ సర్వనాశనానికి కారణమవుతోందనే నా బాధను నా ప్రభువులకు విన్నవించాను. వినాశనం ఇంకా పూర్తిస్థాయిలో జరగకుండా నివారించడం బుద్ధిమంతులుగా మీ కర్తవ్యమని బ్రతిమాలాను. వారి వాదన విచిత్రం.

నీవు చెప్పే రాముడు పితృవాక్య పరిపాలన చేశాడు. తండ్రి మాట తలదాల్చాడు. నేనూ అంతే. నా తండ్రి సముద్రంలో దూకమన్నా సిద్ధమే. రామరావణ సంగ్రామంలో అంతిమ విజయం రావణునిదేనని నమ్మకం.

సర్వ దేవతలను గడగడలాడించి, దిక్పాలకులను తన పాద దాసులను చేసుకొన్న రావణునికి సాధారణ మానవులు, అంతకు మించి వానరులు ఒక లెక్క కాదు.

ప్రభువుకు వాస్తవ పరిస్థితి అర్థం కావడం లేదా? లేక పితృవ్యామోహంలో వాస్తవాన్ని మరుగు పరుస్తున్నారా?

ప్రభూ! మీ పినతండ్రి కుంభకర్ణులు...

ఔను నిజమే దేవి... అఖండ బలపరాక్రమాలు గలవారు గతించారు.

రావణునకు అది హృదయశల్యం.

"లోకకంటకుడైన రావణుని ఒక నరుడు ఎదిరించడమా? అసంభవం" అంటూ హుంకరించారు.

నేను భయంతో గాలికి అరటి ఆకులా వణికిపోయాను. కన్నీళ్లు పెట్టాను.

నన్ను గాఢంగా హత్తుకొంటూ చుబుకం పైకెత్తి...

'దేవీ! ఈ ఇంద్రజిత్తు భార్య ఇలా బేలగా మాట్లాడటం తగదు' అన్నారు.

నిన్న రాత్రి స్వప్నంలో నాకొక భయంకరాకృతి కన్పించడం, అది నా ప్రభువును మింగివేయడం నా పతికి తెలిపాను.

తండ్రిని మించిన తనయుడు. తన వాదన వదలలేదు.

"కల కని కలవరపాటు ఏలా?" అని బుజ్జగించారు. వీరపత్ని ఇలా మాట్లాడడం భావ్యం కాదన్నారు.

"అత్తగారు కూడా మామగారికి..."

'దేవీ! మీ స్త్రీల ఆలోచనలే అంత... అహోరాత్రులు ఆ శ్రీరామచంద్రుని గుణగానం చేయడమే, వీరాధివీరులమైన మా తండ్రీ కొడుకులకు తగిన భార్యలే దొరికారు' అంటూ పరిహసించారు.

'నవ్వులాట కాదు స్వామీ! హృదయ కుహరంలోని విపరీత భయం మాచేత అలా హితవు పలికిస్తుంది"[90].

రామాయణ కావ్యంలో కనిపించని జనకపత్ని పేరును వివిధ పురాణాల ఆధారంగా సేకరించి రత్నమాల (సునయనాదేవి) అని ఒక ప్రత్యేక సన్నివేశాన్ని కల్పన చేశారు. ఇక్కడ ప్రత్యేకత జనకుడు లోకానికంతటికీ రాజర్షిగా ప్రసిద్ధుడు. కానీ కుటుంబ వ్యవహారాల విషయంలో ఆయనకు ధ్యాసలేదు. దానిని ఎత్తి పొడుస్తూ సునయనాదేవి భావగర్భితమైన మాటలతో అనేక సన్నివేశాలను తన మనఃఫలకంపై చిత్రించుకున్న వాటిని రచయిత కళ్ళకు కట్టేలా చేశాడు. సీత అరణ్యవాసానికి వెళ్లిందని జనకపత్ని ఆవేదన పడుతుంటే జనకుడు అంటాడు "అవశ్యమనుభోక్తవ్యం దేవీ"[91].

జనకుడు సీత వివాహ సమయంలో 'సహధర్మ చరీతవ' అన్న మాటను జనకపత్ని తనదైన శైలిలో అన్వయించి ఇలా అంటుంది.

"వివాహ సమయంలో ఈ జనకులవారు 'సహధర్మ చరీతవ' అని ఏ ముహూర్తాన అన్నారో గానీ జానకికి కష్టాలు, కడగండ్లు తప్పలేదు. ఈ సందర్భంలో ప్రాచుర్యంలో ఉన్న

---

90 అంతరంగ తరంగం – ఆర్. అనంతపద్మనాభరావు, పుట:185, 186, 187.

91 అంతరంగ తరంగం – ఆర్. అనంతపద్మనాభరావు, పుట:133.

ఒక హస్తసాముద్రిక శాస్త్రవేత్త చెప్పిన జ్యోతిషాన్ని ఆమె గుర్తుకు తెచ్చుకుంటుంది. రచయిత స్వయంగా జ్యోతిష్కులు కూడా కాబట్టి ఇలా ప్రవర్తింపజేశారు.

"ఈమె జీవితం సుఖ దుఃఖ సంగమం. భర్తను ఎడబాసి ఉండే అవకాశం ఉంది. రాజభోగాలకు దూరమయ్యే రోజూ రానుంది. దుష్టగ్రహ వీక్షణ ఉంది.

లగ్నాత్ సప్తమస్థానమూ, అష్టమస్థానమూ జాతకరీత్యా కూడా సరిలేవు. సాముద్రికం చూసినా ఈమెకు ఎక్కువ కాలం వనవాస యోగం ఉంది. తగిన గ్రహ శాంతులు వివాహానికి ముందే చేయించండి అన్నారు"[92].

విశ్వామిత్రుడు యాగ సంరక్షణకు తీసుకెళ్లినవాడు రామున్ని పెళ్ళికొడుకుని చేసి తీసుకొని వచ్చాడు అనే అర్థం వచ్చేలా ఇలా అంటుంది "ఆ విశ్వామిత్రులవారికి తన పని అయిపోయిందని అనిపించుకోవాలనే తొందర".

ఊర్మిళను గురించి బాధపడుతూ లక్ష్మణుడు అడవులకు వెళ్లాడు కదా, ఆయన తిరిగీ వచ్చేంతవరకూ ఆమెను మిథిలకు తీసుకువద్దామని జనకపత్ని భర్తతో అంటుంది. ఈ సందర్భంలో ఓ చమత్కారం చేశారు.

**"అన్నీ ఉన్నాయి.. కానీ...**

**అల్లుని నోట్లో శని**"అనే సామెతను గుర్తు చేశారు"[93].

## 4.7.అంతరంగ తరంగం – పాత్ర చిత్రణ

రామాయణంలో ప్రధాన పాత్రలే కాకుండా ఎన్నో అప్రధాన పాత్రలు కూడా కనిపిస్తాయి. ప్రత్యేకించి సీతాయనంలో స్త్రీ పాత్రల మీద దృష్టి పెట్టినందువలన కొన్ని చిన్న

---

[92] అంతరంగ తరంగం – ఆర్. అనంతపద్మనాభరావు, పుట:134.

[93] అంతరంగ తరంగం – ఆర్. అనంతపద్మనాభరావు, పుట:35.

పాత్రలకు కూడా రచయిత ప్రాధాన్యం కల్పించారు. పాత్రలు ఉత్తమపురుషలో (స్వగతం) మాట్లాడతాయి. ఆ పాత్రల వెనుక రచయిత హృదయం ఉంటుంది. మాట్లాడేది వారే అయినా మాట్లాడించేది రచయిత. తోలుబొమ్మలాటలో ఆయా పాత్రలు కదులుతూ ఉంటాయి. కానీ మాట్లాడేది సూత్రధారుడు. అలాంటి సూత్రధారుడే ఈ రచయిత.

**పాత్రల ద్వారా కథాగమనం నడపటం**

రామాయణంలో 7 కాండాలు (కాండములు) ఉన్నాయి.

1) బాలకాండ

2) అయోధ్యాకాండ

3) అరణ్యకాండ

4) కిష్కింధకాండ

5) సుందరకాండ

6) యుద్ధకాండ

7) ఉత్తరకాండ

ఇందులో రచయిత ఉత్తరకాండను స్వీకరించలేదు. దానికి కారణం సీత వాల్మీకి ఆశ్రమంలో అనాథగా జీవించటం. లవ, కుశుల జననం, లవ, కుశుల అయోధ్యా ప్రవేశం. సీత భూగర్భంలోకి ప్రవేశించడం ఈ ఘట్టాలు కరుణరసభరితాలు. రామాయణంలో ఉత్తరకాండకు కూడా ప్రాధాన్యం ఉంది. కానీ ఈ రచయిత శ్రీరామపట్టాభిషేకంతో కథను సుఖాంతం చేయాలని భావించారు. సంప్రదాయవాదులైన కొందరికి ఇది నచ్చకపోవచ్చు. ఏది ఏమైనా రచయిత శ్రీరాముని పట్టాభిషేకంతో కథను ముగించడం మనం గమనించాలి.

'నిరంకుశాః కవయః' అన్నారు. కవులు నిరంకుశులు. వారిని ఇలానే రాయాలి. ఇదే చెప్పాలి ఇంతవరకే చెప్పాలి. ఇది కూడా చెప్పాలి అని నిర్దేశించలేము. ప్రస్తుతానికి వస్తే రచయిత బాలకాండ నుండి యుద్ధకాండ వరకు జరిగిన సన్నివేశాలలోని కథాభాగాల్ని పాత్రల అంతరంగ ద్వారనే బహిర్గతం చేశారు. కాండాల పేర్లు మనకు ఎక్కడా కనిపించవు. కానీ వాల్మీకికి విధేయంగా కథ నడుస్తుంది. అవాల్మీకంగా ఏ సన్నివేశాన్ని కల్పించలేదు. పాత్రల మనోభావాలకు ఏవిధమైన మచ్చ తగలకుండా జాగ్రత్తపడ్డారు. బాలకాండలో ఇతివృత్తాన్ని కౌసల్య ద్వారా మొదలుపెట్టారు. ఒక సందేశం ద్వారా కౌసల్యా దశరథులు వివాహపూర్వం పరిచయం కావడం పురాణాలలో ఉన్నదే. అక్కడక్కడా నాటకీయత కూడా చోటు చేసుకొని సంభాషణల ద్వారా కథను నడిపించారు. కౌసల్యను చంపడానికి రావణుడు ఉద్యుక్తుడు కావడం, నారదుడు వారించడం, నూతన దంపతులైన కౌసల్యా, దశరథులు సముద్రతీరంలో నిస్సహాయంగా తిరుగుతున్నప్పుడు జటాయువు వారిని అయోధ్యకు చేర్చడం విశేషంగా వర్ణించబడ్డాయి. కౌసల్య అంతరంగంలోని పుత్రకామేష్టియాగ ఘట్ట వివరణ, దశరథుని ముువ్వురు రాణులు పాయసాన్ని స్వీకరించడం, విశ్వామిత్ర ఆగమనం, శివధనుర్భంగం ప్రస్తావించబడ్డాయి. ఇంతటితో బాలకాండ కథ పూర్తి కాలేదు. తాటక, అహల్య పాత్రల అంతరంగం ద్వారా బాలకాండ కథను ముగించారు.

రామాయణ కథాభాగానికి సంబంధించినంతవరకు తాటకగానీ, అహల్యగానీ ప్రధాన పాత్రలు కాదు. కానీ విశ్వామిత్ర యాగ సంరక్షణకు బయలుదేరిన రామలక్ష్మణుల శౌర్య పరాక్రమాలను వివరించడానికి తాటక పాత్ర ప్రధానం. తాటక కుమారులే మారీచ సుబాహులు. మారీచుడు తరువాతి కథా భాగంలో సీతాపహరణకు దోహదం చేసిన వ్యక్తి. అందువలన తాటకను ఒక విశిష్ట వ్యక్తిగా ఇందులో నిరూపించారు.

తాటక చేసిన వాదన హేతుబద్ధం —"స్త్రీ హత్యాపాతకం రఘువంశానికి అంటకపోదు" అని తీర్మానిస్తూ ఇలా అంటుంది "రఘువంశ చరిత్రలో ఈ స్త్రీ హత్యా పాపం

ఎక్కడికిపోదు. వాళ్ళ వంశంలో స్త్రీలకు ఏదో ఒకనాడు కష్టాలు రాకపోవు. రఘువంశ స్త్రీలు దుర్భర దుఃఖానికి లోనవుతారు. స్త్రీ హృదయం పరితపిస్తే వృథా పోదు"[94].

అహల్య పాత్ర కూడ కథా భాగంలో అంతగా ప్రధానం కాదు. రాముని దైవిక స్వభావాన్ని చిత్రించడానికి అది ఉపకరిస్తుంది. ఇక్కడ బాలకాండలో అహల్య పాత్ర ద్వారా కేవలం ఇంద్రుని వంచనను పేర్కొనడమేకాక శివధనుర్భంగం తరువాత సీతారాముల వివాహాన్ని కూడా ప్రస్తావించారు. ఈ మూడు పాత్రల ద్వారా బాలకాండ కథ పూర్తి అవుతుంది.

## 4.8 కథాకథనంలో ప్రత్యేకత

బాలకాండలో ప్రధానపాత్ర దశరథుడు. ఆ తరువాత విశ్వామిత్రుడు. కానీ ఈ స్త్రీవాద ప్రణాళికలో వారికి చోటు లేదు.  అందువల్ల రచయిత చిన్న పాత్రలైన తాటక, అహల్యను కూడా ప్రస్తావించి కథను నడిపారు. అయోధ్యాకాండ కథలో కైక వస్తుంది.

### 4.8.1 కౌసల్య

ఈమె రామాయణంలో ఒక ప్రధాన పాత్ర. కౌసల్య, కైక, సుమిత్రలను హ్రీ, శ్రీ, కీర్తిలతో పోలుస్తారు. కౌసల్య హ్రీ (హ్రీ అంటే నమ్రత), సుమిత్ర శ్రీ, కైకేయి కీర్తి. కౌసల్య విషయానికి వస్తే ఆమె పట్టమహిషి.  కానీ తానెన్నడూ ఆ అతిశయాన్ని చూపించి ఎరుగదు. ఆమె మూగ మూకీచిత్రంలో పాత్ర లాగా మౌనంగా తన కళ్ళముందు జరిగిన సన్నివేశాలను చూసిందే గానీ, శబ్ద చిత్రంలో లాగా సంఘటనలకు స్పందించి మాట్లాడలేదు.

ఆమె మొట్టమొదటిసారిగా రామాయణంలో మాట్లాడిన తీరు ఇది. మరునాడు రాముని పట్టాభిషేక మహోత్సవానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. దశరథుడు ఆ నిర్ణయం

[94] అంతరంగ తరంగం – ఆర్. అనంతపద్మనాభరావు, పుట:15.

తీసుకున్న మరుక్షణమే కౌసల్యారాముల హితులు ఆ శుభవార్తను పరుగు పరుగున వెళ్ళి ఆమెకు తెలియజేయడానికి వచ్చినప్పుడు ఆమె ఆనందభాష్పాలతో "వత్సారామ చిరంజీవ" అన్నది.

ఆమె సాధారణమైన పవిత్రస్త్రీగా పరిమిత కోరికలుగల వ్యక్తిగా ఆమె ప్రవర్తించింది. పట్టాభిషేక వార్తను ప్రకటించిన తరువాత దశరథుడు పెద్ద భార్య అయిన కౌసల్య వద్దకు వెళ్ళాలి. కానీ కైకేయ దగ్గరకు వెళ్ళాడు. రాముడు ఆ వార్తను తెలియజేయడానికి తన వద్దకు వచ్చినప్పుడు ఆమె శ్రీదేవిని ప్రార్థించి ఆశీస్సులు కురిపించవలసిందిగా ప్రార్థించింది.

రాముడు అరణ్యాలకు వెళతానన్నప్పుడు ఆమె వివిధ రకాలుగా అతన్ని వారించేందుకు ప్రయత్నించి విఫలురాలయ్యింది. తండ్రి ఆజ్ఞను పాటించడానికి సిద్ధంగా ఉన్న రాముని దారికి అడ్డు రాదల్చుకోలేదు. "నీవు ఎల్లప్పుడు సత్ప్రవర్తనలోనే నడుస్తావని నాకు తెలుసు. ఈ సమయంలో నీకు ఏది ఉత్తమ మార్గమో ఆలోచించి ఆచరించమని సూచించింది.

"ప్రయాణ సన్నాహం సాగించు. క్షేమంగా తిరిగిరా" అని ఆశీర్వదించింది. ఆమె తన దుఃఖాన్ని మరి ఎవరితోనూ వెల్లడించలేదు. కుమారునితోనే పంచుకున్నది. దశరథునిగానీ, కైకేయిగానీ కలిసి వ్యతిరేకంగా మాట్లాడలేదు. రామునికి వీడ్కోలు చెప్పేందుకు రాణులందరూ బయలుదేరినప్పుడు ఆమె కూడా మౌనంగా సాగనంపింది. ఆమె మాతృ హృదయం గల సాధు హృదయ.

సుమంతుడు రాముని దండకారణ్యంలో వదిలి పెట్టి వచ్చానని చెప్పినప్పుడు ఆమె దుఃఖం కట్టలు తెంచుకుంది. ఆ క్షణంలో దశరథుడు మూగవాడయ్యాడు. ఇప్పుడు కౌసల్య ఒక మాట అన్నది "నేహాతిష్ఠత కైకేయీ విశ్రబ్ధం ప్రతిభాష్యతామ్"[95] (ఇక్కడ మీ నోటికి కళ్ళెం కైకేయి వేయలేదు కాబట్టి నిర్భయంగా మాట్లాడమని దశరథుని కోరింది).

---

[95] వాల్మీకి రామాయణం – అయోధ్యాకాండ.

చిత్రకూటంలో రాముడు కలిసినప్పుడు కూడా కౌసల్య శాంతనిగ్రహస్వభావంతో కనిపించింది. ఆమె పూర్వంవలె హ్రీంకారాది దేవత. ఈ విధమైన స్వభావంగల వాల్మీకీ సృష్టించిన కౌసల్య పాత్ర నాడిపట్టుకొని ఆమె మనస్సులోని భావావేశాలను అంతరంగ తరంగంలో కల్పన చేయడానికి భావపరిణతి, రామాయణ రహస్యానువేషణశక్తి పాత్రచిత్రణ కౌశలము అవసరం. వీటిని కౌసల్య విషయంలో రచయిత పద్మనాభరావు అద్భుతంగా చిత్రించారు.

ఈ పాత్ర ద్వారా బాలకాండ కథను రచయిత ప్రస్తావించారు. సరయూ నదీ తీరంలో యజ్ఞావాటికలో జరిగిన పుత్రకామేష్టిని ప్రస్తావించి తనలోని హిరీ లక్షణాలను గుర్తుకు తెచ్చుకొని తనను హ్రీ అని బ్రహ్మదేవుడు ఏ క్షణాన వర్ణించాడో కానీ తన అణువణువునా ఆ లక్షణాలను తాను జీర్ణించుకుంది.

"నాలుకపై వాగ్దేవి నర్తించే ఆ బ్రహ్మ వాక్కులు ఎన్నడూ వొట్టివికావు"[96]. విశ్వామిత్రుని వెంట యాగ సంరక్షణకు శ్రీరామచంద్రుడు వెళుతున్నప్పుడు ఆమె భావనను రచయిత ఇలా చిత్రించారు "వారిద్దరూ (రామలక్ష్మణులు) రాక్షస మూకలు ఉన్నచోటికి వెళుతున్నారంటే నా మాతృ హృదయం తల్లడిల్లింది. అయినా వశిష్టుల వారిపై గల గురుత్వంతో నా మనసు ఏ విధమైన కళంకాన్ని శంకించలేదు"[97].

ఆమె ప్రతి కదలికలలోనూ ప్రతిస్పందనలోనూ ఒక విధమైన మానవాంశం ఉన్నది. అది ఆమె శీలం వెనుక ఉన్న దైవాంశ ప్రాధాన్యం. తాను నోరు తెరిచి ప్రభువును ఏదీ అడగలేదు. అరణ్యాలకు నా బిడ్డను ఎందుకు పంపారు అని మహారాజును ప్రశ్నించలేదు.

---

[96] అంతరంగ తరంగం – ఆర్. అనంతపద్మనాభరావు, పుట:11.

[97] అంతరంగ తరంగం – ఆర్. అనంతపద్మనాభరావు, పుట:3.

కౌసల్యా దశరథుల తొలి కలయికను రచయిత వివరంగా చెప్పారు. వివాహానికి అశ్వంపై బయలుదేరిన దశరథ మహారాజు నదీ ప్రవాహంలో పట్టుదప్పి నదిలో ఈదుకుంటూ ఒక మందసం ఆధారంగా తీరాన్ని చేరాడు. ఆ మందసంలో రావణుడు కౌసల్యను పెట్టి బంధించి సముద్రంలో పడవేశాడు. అనుకోకుండా ఆ మందసమే దశరథునికి తీరం చేరడానికి ఆధారభూతమైంది. ఇక్కడ రచయిత ఒక చమత్కారం చేశారు. "అక్కడే దశరథుల వారు కౌసల్య పాణిగ్రహం తమ వంశ మూలపురుషుడైన సూర్యుని సాక్షిగా చేశారు"[98].

## 4.8.2 కైక

ఇప్పటికి ఈ కథా భాగంలో మూడు పాత్రల ద్వారా కౌసల్య, తాటక, అహల్య – బాలకాండ కథను రచయిత పూర్తి చేశారు. ఇప్పటికి సీతాకళ్యాణం పూర్తి అయ్యింది. అయోధ్యాకాండలోకి ప్రవేశిస్తున్నాం. ఈ కథ ఎవరి ద్వారా నడపాలి. దీనికి మూల పురుషుడు దశరథుడు. కానీ ఇందులో స్త్రీ పాత్ర రావాలి. రామాయణ కథాగమనానికి అత్యంత కీలక పాత్ర కైకేయి. రామపట్టాభిషేకం జరిగి రామరాజ్యం నెలకొల్పవలసిన అవతారమూర్తి అయిన శ్రీరామచంద్రుడు అయోధ్యకే పరిమితమైతే అవతారం అవసరమే లేదు. లోకకంతకుడు అయిన రావణుని సంహారం కావాలి. అది రాముని ద్వారా జరగాలి. అందుకు కైక తనపై వచ్చిన నిందనలన్నింటినీ భరించి మాట్లాడక తప్పలేదు. ఈ అంతరంగ మధనంలో కైక మాటల ద్వారా హాలాహలం సృష్టించబడింది. ఆమె నిందలకు పాత్రమైంది. ఆ ఉద్వేగాన్ని రచయిత ఇందులో సమర్థవంతంగా నిర్వహించారు. కైక వేసిన ప్రశ్నలు రచయిత మాటల్లో ఇవి "మేనమామల ఇంట్లో ఉన్న నా తనయుడు భరతుడు రేపటికి రేపు ఎలా రాగలడు? అతడు లేకుండా రాముని పట్టాభిషేకానికి తొందర ఏమిటి?

[98] అంతరంగ తరంగం – ఆర్. అనంతపద్మనాభరావు, పుట:8.

"ముగ్గురు రాణులం దశరథుని మనస్సు పంచుకున్న వాళ్లం ఉన్నాం. మాతో ఎవరితో చెప్పలేదు. నేను ముద్దుల భార్యని లోకమంతా ఆడిపోసుకుంటుంది.

నాతో మాట మాత్రం అనవచ్చా? ముది మది తప్పిందా? భరతుడు ఎదురుతిరుగుతాడనీ, తన భాగమిమ్మంటాడనీ భయమా? ఆవశిష్టులవారు, సుమంత్రుడు అంతా కలిసి కుట్ర పన్నారా?"[99]. కోపావేశంతో దశరథుని తూలనాడిన కైక మనస్తత్వచిత్రణను రచయిత ఇలా వ్యక్తపరిచారు:

"మీ వంశంలో ఇది కొత్త విషయమేమీ కాదు. సగరుడు తన జ్యేష్ఠ పుత్రుడైన అసమంజుని ఏదో అపరాధం చేశాడనే నెపంతో కట్టుబట్టలతో దేశం నుండి వెళ్ళగొట్టాడు. అలానే రాముడు కూడా వెళ్ళాలని పట్టుబట్టాను"[100].

కైక దృష్టితో చూసినప్పుడు దశరథుని రాజకీయ కుట్ర ఇలా అనిపిస్తుంది. పాయస భాగాన్ని పంచడంలో మహారాజు అసంబద్ధంగా ప్రవర్తించాడని ఆమె వాదన.

"ముద్దుల భార్యని పేరేగాని ఆ దశరథ మహారాజు నాపట్ల మొదటి నుండి విచక్షణతోనే ప్రవర్తించాడు. తాను పుత్రకామేష్టియాగం చేస్తే అందులో పాయస పాత్ర లభించింది. న్యాయసమ్మతంగా నాకు మూడో పాలు రావాలి. ఆయన మనస్సులో ఏదో కుతంత్రం ఉంది. ముందుగా పెద్ద భార్య కౌసల్య గృహానికి స్వయంగా వెళ్లి సగభాగం ఇచ్చాడు. అంతటితో సరిపోలేదు. సుమిత్ర వద్దకు వెళ్లి ఆ సగంలో సగభాగం ఇచ్చాడు. సగపాలు నాకిచ్చి మిగిలిన భాగాన్ని తన కిష్టురాలైన ఆ సుమిత్రకే మళ్లీ పంచాడు. రెండు సార్లు ఆ సుమిత్ర కివ్వడమేమిటి?"[101].

---

[99] అంతరంగ తరంగం – ఆర్. అనంతపద్మనాభరావు, పుట:25.

[100] అంతరంగ తరంగం – ఆర్. అనంతపద్మనాభరావు, పుట:29.

[101] అంతరంగ తరంగం – ఆర్. అనంతపద్మనాభరావు, పుట:30.

ఆమె పాత్రను కొద్ది వాక్యాలలోనే రచయిత స్పష్టం చేయడం ఇందులో విశేషం.

"మహోన్నత శిఖరాలను అధిరోహించవలసిన నేను, భరతుని మీది మమకారంతో అటు పతికి, ఇటు బిడ్డకు దూరమయ్యాను. అంతా విధి వైపరీత్యం. విధి చేతిలో నేను కీలుబొమ్మను. లోకం దృష్టిలో నేను అధికారము, హోదా అనే దానికి బలియైన అబలను"[102].

## 4.8.3 సుమిత్ర

ఈమె దశరథునికి ప్రియ భార్యగా చెప్పవచ్చు. కైక తాను ప్రియభార్యనని భావిస్తుంది గానీ, దశరథుని మనస్సులో సుమిత్ర పట్ల సున్నిత ప్రేమ ఉంది (Soft corner) అందుకు నిదర్శనం. పాయస భాగాన్ని రెండు సార్లు ఆమెకు ఇవ్వడం. చివరగా మిగిలిన 8వ వంతు భాగాన్ని కైకకు ఇవ్వవచ్చు కదా.

మనస్తత్వ విషయంలో సుమిత్ర లోతైన ఆలోచన కలది. అందుకే ఈ సన్నివేశానికి శీర్షికను 'గచ్ఛతాతయధా సుఖం' అని పెట్టాడు రచయిత. తనను గురించి తాను ఇలా విశ్లేషించుకుంది.

"నేను మితభాషినని లోకం అంటుంది. తనకంటూ శత్రువులు ఎవరూ లేరు. అందుకేనేమో సు–మిత్ర అన్నారు. అందరూ నాకు మిత్రులే. ప్రభువులు నాతో ఎన్నడూ సన్నిహితంగా, సరసంగా అనురాగపూరితంగా మాట్లాడినట్లు నాకు గుర్తులేదు"[103].

తన కుమారులిద్దరూ – లక్ష్మణుడు, శత్రుఘ్నుడు రామ భరతులకు సహాయకారకులుగా ఇంచుమించు ఛాయవలే ప్రవర్తించడం ఆమెకు సంతోషాన్ని కలిగించింది. కానీ ఇలా అనుకుంటుంది "కోడలు ఊర్మిళ వయస్సులో ఉంది. పతిని ఎడబాసి 14 సంవత్సరాలు ఎలా జీవితాన్ని భరిస్తుందో, నేను జీవితంలో కోరుకున్నవేవీ లేవు. అయినా

[102] అంతరంగ తరంగం – ఆర్. అనంతపద్మనాభరావు, పుట:31.

[103] అంతరంగ తరంగం – ఆర్. అనంతపద్మనాభరావు, పుట:33.

వైధవ్య ప్రాప్తి విధి విలాసం. అయోధ్య రాణులు తమ జీవితాలు ఇలా సాగదీయవలసిందేనా" ఈ వాక్యాలు ఒక న్యాయస్థానంలో న్యాయాన్యాయాల విచారణ చేసిన ఒక న్యాయమూర్తి ఇచ్చిన తీర్పువలె ఉంది.

## 4.8.4 సీత

ఈ ప్రకరణానికి 'ఇయంసీతా మమసుతా' అనే నామకరణం చేయటం ఔచిత్య భరితంగా ఉన్నది. శివధనుర్భంగానంతరం సీతా పాణిగ్రాహ సందర్భంలో జనకుడు పలికిన పలుకులు ఇవి

**"ఇయం సీతామమ సుతా**

**సహధర్మ చరీతవ**

**ప్రతీచ్ఛ చైనాం భద్రంతే**

**పాణిం గృహ్ణీష్వ పాణినా"** **(వాల్మీకి రామాయణం)**

సీతారాములు ఆదర్శ దంపతులు. ఒకరి మీద ఒకరు అవాజ్యమైన ప్రేమానురాగాలు కలవారు. రామాయణానికి 'సీతాయనం' అని పేరు కూడా ఉన్నది. రామాయణంలో రామునికి ఎంత ప్రాధాన్యం ఉందో సీతకు అంతే ప్రాధాన్యం ఉంది. ద్రష్ట అయిన వాల్మీకి మహర్షి రామా అనే శబ్దాన్ని సీత పర్యాయంగా ఒకటి రెండు చోట్ల మహాకావ్యంలో వాడినాడు. ఈ అంశాలను అనంత పద్మనాభరావు తమ అనువాద రచన రామాయణంలో స్త్రీ పాత్రలలో వివరించారు.

"వాల్మీకి 'రామా' అనే శబ్దాన్ని జానకీ పర్యాయంగా ఒకటి రెండు చోట్ల మహాకావ్యంలో వాడాడు. ఒకచోట రామ, రామా పదాలను రెండింటిని ఒకే శ్లోకంలో వాడాడు. రాముని నిర్ణయానికి వ్యతిరేకంగా సీత రాముని వెంట అరణ్యాల అనుసరించి వచ్చింది. స్వయంగా తానే నిర్ణయాన్ని తీసుకొంది. ఆ సుందర ప్రకృతి దృశ్యాల వీక్షణ వల్ల

ఆనందపరవశురాలైన 'బాల' వలె సీత సంచరించేది. ఆమె ఆహ్లాదాన్ని వాల్మీకి సాంకేతికంగా సూచించాడు.

**బాలేవ రమతే సీతా బాలచంద్ర నిభాననా**

**రామా రామేహ్యదీనాత్మా విజానేపి వనే సతీ"**[104]

సీత ఎక్కువగా మాట్లాడి ఎరుగదు. 1,2 సందర్భాలలో రాముని ప్రవర్తనను హెచ్చరిస్తూ నిలదీసింది. ఇది ఆమెకు సహజసిద్ధంగా లభించిన స్వభావగుణం. ఆమె ఎన్నడూ రాముని గుడ్డిగా అనుసరించలేదు. రాముని చర్యల పట్ల ఆమె నిష్కర్షగా మాట్లాడిన సందర్భం ఇది.

"తన ప్రవర్తనలో భక్తి విధేయతలను ప్రకటించినా జానకి గుడ్డిగా రాముణ్ణి అనుసరించలేదు. ఆమె స్వతంత్ర వ్యక్తిత్వాన్ని వీడలేదు. రాముడి చర్యలపట్ల తన అభిప్రాయాన్ని వ్యక్తం చేయడానికి ఎన్నడూ వెనుకాడ లేదు. దండకారణ్యంలోని రాక్షసులనందరినీ సంహరిస్తానని రాముడు ప్రతిన పూనినప్పుడు ఆమె జంకులేకుండా రాముణ్ణి ప్రశ్నించింది. "నీకే పాపము తలపెట్టని ఆ అమాయక ప్రాణులను హింసించే హక్కు నీకు లేదంది". రాముడు ఆమె సందేహానికి తగిన ప్రతి సమాధానమిచ్చాడు. తనవల్ల రామలక్ష్మణులు అరణ్యంలో కష్టాలపాలయ్యారనే గాని, తన భద్రత గూర్చి సీత ఎన్నడూ ఆలోచించలేదు. అరణ్యంలో మొట్ట మొదట రామలక్ష్మణులను అపహరించుకొని వెళ్లడానికి విరాధుడు ప్రయత్నించాడు. తనను తీసుకొని వెళ్లి ఆ యిరువురిని విడిచి పెట్టమని సీత ప్రాధేయపడింది. సాధారణ స్త్రీ ఇట్టి అభ్యర్థన చేయలేదు"[105].

---

[104] రామాయణంలో స్త్రీ పాత్రలు – అనువాదం – ఆర్. అనంతపద్మనాభరావు, పుట:5.

[105] రామాయణంలో స్త్రీ పాత్రలు – అనువాదం – ఆర్. అనంతపద్మనాభరావు, పుట:8.

సుందరకాండలో ఆమె మనస్సు విప్పి మాట్లాడింది. రావణుని నిరసించింది. హనుమను శంకించింది. ఆపైన హనుమ వివరాలను తెలుసుకొని హనుమను నమ్మింది. మరో సన్నివేశంలో పర్ణశాలలో ఉన్న సమయంలో రాముని రక్షణ కోసం లక్ష్మణుని తూలనాడింది. ఆమె పొందిన క్లిష్టాలు కష్టాలు వర్ణనాతీతం. ఆమె మనస్సు ఒక అగ్ని గుండం లాంటిది. అదొక మానసిక సముద్రం. అందులోంచి హాలాహలం ఉద్భవించింది. అమృతము లభించింది. ఆమె మనస్సులోని భావాలను రచయిత ఇందులో 2, 3 ప్రకరణాలలో వివరించారు. తొలి ప్రకరణంలో ఆమె మొదటిసారిగా మాట్లాడింది, రాముడు అరణ్యవాసానికి వెళుతూ సీతను వారించిన సందర్భంలో.

వివాహానికి పూర్వం సీతారాములు ఉద్యానవనంలో కలుసుకున్నారనే సన్నివేశాన్ని కొందరు (వాల్మీకి కాకుండా) ఇతర సంస్కృత కవులు వర్ణించారు. ఓ సాయంకాలం ఉద్యానవనంలో సీత విహరిస్తోంది. సీత గౌరీదేవిని పూజించటానికి సఖులతో కలిసి వచ్చింది. అప్పుడు లక్ష్మణ సమేతుడైన (శ్రీరామచంద్రుడు) లీలమేఘశ్యాముడు ఆమెకు కనిపించాడు. "ప్రథమ వీక్షణంలో ఆయన నా మనస్సుకు హత్తుకున్నారు. నా శరీర వామభాగం (ఎడమ) స్పందించింది. ఎదురుగా ఉన్న ఆ శ్యామునికి కరకమలములతో శిరస్సు వంచి నమస్కరించాను. చెలులు వచ్చి నన్ను దూరంగా తీసుకువచ్చారు"[106].

ఈ సన్నివేశాన్ని సీత అనసూయతో పంచుకుంది. శివదనుర్భంగ ఘట్టాన్ని కూడా సీత మనోభావాలలోనే రచయిత చిత్రించారు. పాణిగ్రహ సందర్భంలో జనకుడు ఇలా అంటాడు "శ్రీరామచంద్రా నీ భుజ పరాక్రమంచే గెలువబడిన ఈ సీత మా దగ్గర పెరిగింది. నీవు చేసిన ప్రతి ధర్మకార్యంలో ఈమెకు హక్కు ఉన్నది. మా అమ్మాయి పాణిని నీ పాణితో గ్రహించు. పతివ్రత, పుణ్య స్వభావురాలు అయినది ఈమె. నీడ వదలనట్లుగా నిన్ను ఈమె వదిలిపెట్టదు"

[106] అంతరంగ తరంగం – ఆర్. అనంతపద్మనాభరావు, పుట:173.

ఇక్కడ ఎన్నో ధర్మ సూక్ష్మాలు ఉన్నాయి. ఈ ప్రకరణానికి తరువాత మరో ప్రకరణం కూడా రచయిత కథా కథనానికి సీత పాత్రనే వాడుకున్నారు. దీని శీర్షిక 'వనవాస సుఖం'.

అరణ్యాలకు వద్దు అన్న రామునితో సీత – మా తండ్రి నిన్ను ఇంత భీరువుగా ఊహించలేదు అంటూ ఆమె రాముని భయాన్ని తొలగిస్తుంది. కొద్ది మాటలు మాట్లాడినా ఆమె ధైర్య సాహసాలను వెలిబుచ్చింది. వనవాస సమయంలో మునులందరూ తమను రక్షించమని కోరినప్పుడు రాముడు వారికి హామీ ఇచ్చినప్పుడు ఆమె తీవ్రంగా ప్రశ్నించింది. ఏ విధమైన అపకారం చేయని రాక్షసుల మీద నీవు శత్రుత్వం పూనటం ఎందుకని ప్రశ్నించింది. విరాధుడు  తనను ఎత్తుకెళ్లినపుడు కూడా ఆమె ధైర్యంగానే నిలిచింది. రామలక్ష్మణులను విరాదుడు భుజాలమీదికి ఎక్కించుకొని వెళ్లిపోతున్నప్పుడు ఆమె ఒంటరిగా మిగిలింది. అయినా బేలగా ప్రవర్తించలేదు.  తన వల్ల రాముడు కష్టాలపాలు అయినాడని మాత్రం బాధపడింది. కైక దుష్ట చింతన గుర్తుకు వచ్చింది.

అరణ్యవాస గమనాన్ని రాముడు సీత వద్ద ప్రస్తావించినప్పుడు ఆమె ధైర్యంగా మాట్లాడింది. "వియోగభారంతో నేను ప్రాణాలు వదలక మానను" అని చెబుతూ తన బాల్యంలో జరిగిన ఒక వృత్తాంతాన్ని ప్రస్తావించింది.

జనకుడి ఇంటిలో కన్యగా ఉన్న సీతకు ఒక సాముద్రిక శాస్త్రవేత్త ఆమె అరచేతిలో రేఖలు చూసి "ఈమెకు వనవాస జీవితం తప్పదు అన్నాడు" మరొకసారి ఒక భిక్షువు ఆమె తల్లితో మీ కుమార్తెకు వనవాసం కలుగుతుందని జోస్యం చెప్పింది. కొంచెం కోపాన్ని ప్రదర్శించి రామునితో తీవ్రంగా ఇలా అన్నది " మా తండ్రి జనకమహారాజు స్త్రీకి పురుషవేషం వేసినట్లున్న నిన్ను తెలియక అల్లుడిగా చేసుకున్నాడు. సూర్యతేజస్సు రామునియందు ఉన్నదన్నవారు అజ్ఞానంతో అని ఉంటారు.  నాటకాలలో వేషాలు వేసి జీవించే నటుడు తన భార్యను స్వయంగా ఇతరులకు ఇచ్చినట్లు నన్ను ఇతరులకు ఇవ్వాలనుకుంటున్నావా? అని

ప్రశ్నించింది". ఇవి వాల్మీకి రామాయణంలో ఉన్న వాక్యాలే. అందుకే రచయిత సీత చేత ఇలా అనిపించారు "రాముని మనస్సు నొప్పించానా రామునికి వనవాసంలో క్లేశం కలిగించాను. భర్తపై ప్రేమతో అనకూడని మాటలు అన్నాను బిక్షుకి సాముద్రిక శాస్త్రవేత్త చెప్పిన మాటలు నిజమౌతున్నాయా? దైవమే సాక్షి, నా మనస్సే సాక్షి"[107].

"ఏవీ నీ కోమలపాదాలు అంటూ నా పాదాలు రాముడు ముట్టుకున్నారు. సున్నితంగా పాదాలు ఒత్తారు అన్న సన్నివేశాన్ని రచయిత కల్పితం చేశారు. అరణ్యవాస క్లేశంతో ఎర్రనైన సీత పాదాలను రాముడు స్పృశించడం ఒక విధంగా హృదయాన్ని ద్రవింపజేస్తుంది. ఇక్కడ రచయిత జనసామాన్యంలో ఉన్న ఒక గాథను వివరణగా ఇచ్చారు.

**రాముడు**: సీతా! మీ మిథిలా నగర విశేషాలు మరోమారు చెప్పు.

**సీత**: ఏమున్నాయి స్వామీ! మీకు తెలియనివి. మేం ఎన్నో ఏళ్లుగా పూజిస్తున్న శివధనస్సును మీరు మీ ప్రతాపం చూపటానికి విరగ్గొట్టారు.

**రాముడు**: అలానా ఎంత అపచారం! నేనూ దాన్ని ముట్టుకోకుండా ఉంటే ఈ సీత కన్యగానే ఉండిపోయేది.

**సీత**: ఔరా! ఎంతలేసి మాటలు?

**రాముడు**: దేవీ! మేం మరో వింత విన్నాం. మీ నగరంలో భార్యాభర్తలు దాంపత్యం చేయనక్కర్లేదట. భూమి దున్నుతుంటే చాలు. ఆడపిల్లలు దొరకుతారట.

**సీత**: నవ్వుతూ... అలానా స్వామీ.

---

[107] అంతరంగ తరంగం –ఆర్. అనంతపద్మనాభరావు, పుట:96.

**రాముడు**: కాక మరేమిటి? అంటూ ఆప్యాయంగా నా పాదాలు ముద్దాడారు. నా చుబుకం పట్టి "బంగారు జానకి" అంటూ పెదవులపై ముద్దాడారు.

**సీత**: స్వామీ! మీ అయోధ్యా విశేషాలు మా మిథిలానగరంలో గొప్పగా చెప్పుకుంటారు. మిథిలా నగర పౌరులు బిడ్డలు కావాలంటే కష్టపడి పొలం చదును చేయాలి. వృషభాలు పెట్టి నాగలితో దున్నాలి. నాగటిచాలులో ఎప్పుడైనా బిడ్డ దొరికితే దొరకవచ్చు. కానీ మీ అయోధ్యలో కేవలం పాయసం తాగితేనే చాలు. ఒకరు కాదు ఇద్దరు కాదు, నలుగురేసి మగధీరులు పుడతారట. దాంపత్య జీవనం అక్కర్లేదు సుమా!

**రాముడు**: మా సీత చాలా తెలివైనది"[108].

కథను వడివడిగా నడిపించడానికి అరణ్యకాండ వృత్తాన్ని పాఠకులకు సావకాశంగా, సవివరంగా, వివరణాత్మకంగా, విపులంగా చెప్పటానికి రచయిత ఈ ప్రకరణాన్ని ఎంచుకున్నారు. పది సంవత్సరాల అరణ్యవాస గమనాన్ని సీత గుర్తుకు తెచ్చుకున్నట్లు, తొమ్మిది ఆశ్రమాలలో గడిపినట్లు అగస్త్య ఆశ్రమానికి వెళ్లినట్లు పర్ణశాల నిర్మాణం గురించి వర్ణించారు. పంచవటి నిర్మాణం లక్ష్మణుడు వేగంగా చేసినప్పుడు సీతారాములు అతని మనస్ఫూర్తిగా ప్రశంసించారు.

సీత స్వభావాన్ని సహజ గుణాలను, గాంభీర్యాన్ని వర్ణించటానికి రచయిత మరో ప్రకరణం అయిన మాయలేడిలో వివరించారు. ఈ ప్రకరణంలో మాయలేడి రూపంలో మారీచుడు రావడం, దానిని చూసి తాను స్త్రీ సహజ స్వభావంతో భ్రమ పడటం సీత భావాలలోనే రచయిత పలికించాడు. ఏడుస్తూ సీత పలికిన పలుకుల వెనుక ఆమె ఆవేదన ఈ సన్నివేశంలో రచయిత అద్భుతంగా చిత్రించారు.

---

[108] అంతరంగ తరంగం – ఆర్. అనంతపద్మనాభరావు, పుట:102,

**సీత**: (ఏడుస్తూ) లక్ష్మణా! రాముడు లేకుంటే నేను గోదావరిలో పడి చస్తాను లేదా ఉరి పోసుకుంటాను. ఎత్తు నుండి దూకి శరీరం వదులుతాను. విషం త్రాగి అగ్నిలో దూకి చస్తాను. రాముని కాదని పరపురుషుని పాదం కూడా తాకను సుమా!

లక్ష్మణుడు బాధపడుతూ వెళ్లిపోయాడు.

నా మనసులో వేదన ప్రారంభమైంది.

మరిదిని ఆవేశంలో అలా అన్నానా? నా ఆలోచనలు ఎందుకు వక్రంగా వచ్చాయి?

ఎక్కడ మిథిల? ఎక్కడ శివ ధనుస్సు.

రాముడు రానేల? ధనస్సు విరవనేల?

అయోధ్యలో సుఖంగా ఉన్న మా దాంపత్యానికి అరణ్యవాస శిక్షేలా? ఆ కైకమ్మ ఏం బావుకొంది. భరతుడూ ఊరు బయటే ఉన్నాడు. భర్తనూ కోల్పోయింది. వైధవ్యం ప్రాప్తించింది ముగ్గురికీ. వనవాసంలో ఎన్ని తిప్పలు"[109].

సీతారామసంవాదంలో సీత పరుషంగా మాట్లాడిన సందర్భాలను రచయిత వివరంగా ఇచ్చారు. జటాయువుపట్ల ఆమెకు కలిగిన సానుభూతి ఇందులో ప్రదర్శితం అయింది. గడ్డి పరకను ముందు పట్టుకొని సీత రామునితో సంభాషించడం ఇందులో చిత్రితమైంది. లక్ష్మణున్ని అనరాని మాటలు అన్నందుకు తనకు వెంటనే శిక్ష లభించింది. చివరగా అశోకవనంలో సీత అనే ప్రకరణంలో ఆమె తన పాపానికి ప్రాయశ్చిత్తం లేదు అని అనుకుంటుంది.

"నా ప్రాణాలపై నాకు తీపి లేదు. అయినా చావు రాదు. రావణుడు నన్ను కోపంతో చంపితే ఎంత బాగుండేది" అని ఆమె అనుకోవడం, ఆమె స్త్రీ సహజ స్వభావానికి తార్కాణం.

---

[109] అంతరంగ తరంగం – ఆర్. అనంతపద్మనాభరావు, పుట:124.

హనుమతో సంభాషణ సమయంలో కూడా ఆమె ఒక రాచవనితలాగా మాట్లాడింది. "హనుమా! నీ ధైర్య సాహసాలకు కొదవలేదు. ఒకవేళ నేనే నీ వీపు మీద నుండి సముద్ర మధ్యంలో కళ్లు తిరిగి పడిపోతే జలజంతువులకు మంచి ఆహారం దొరుకుతుంది. రాక్షసులు చూసి రావణునికి చెబితే ఏమవుతుందో ఊహించు. అప్పుడు నాకోసం నీవు చేసిన ప్రయత్నం వృథా అవుతుంది. పర పురుషుని శరీరం స్పృశించను. దొంగతనంగా నీవు తీసుకెళ్లడమెందుకు? రావణుడంటావా? నాకు తెలియని స్థితిలో, నేనేమీ చేయలేని స్థితిలో నిస్సహాయంగా ఉండగా తెచ్చాడు. నా బుద్ధిపూర్వకంగా అలా జరగలేదు. నా రాముడే వచ్చి యుద్ధంలో జయించి తీసుకెళ్తాడు"[110].

రామపట్టాభిషేకాన్ని సీత భావాలలోనే చెప్పి కథను సుఖాంతం చేయడం రచయిత సామర్థ్యానికి నిదర్శనం. పట్టాభిషేకుడైన రాముడు అనే శీర్షిక సున్నితమైన స్త్రీ మనస్తత్వాన్ని చిత్రిస్తుంది.

"ఇంద్రజిత్తు మరణం నా (సీత) మనస్సును కలిచి వేసింది. తండ్రి చేసిన అపరాధానికి తనయుడు బలియైనాడు. నా రాముడు కూడా తండ్రి చేసిన అపరాధానికి అడవుల పాలు అయినాడు. అడవిలో నేను చేసిన తప్పిదానికి రాముడు అష్టకష్టాలు పడుతున్నాడు. భార్యవల్ల భర్తకు సుఖాలు కలుగుతాయంటారు కానీ నావల్ల అన్నీ కష్టాలే. ఆ మండోదరి పుణ్యవతి అయినా ఆమెకు పుత్రశోకం, అంతకు మించి ఆ సులోచన గూర్చిన ఆలోచనతో నాకడుపు తరుక్కుపోతుంది. ఈ స్త్రీ జన్మ కష్టాల కూడలి. ఎవరో పుణ్య స్త్రీలు అనసూయవంటి వారు కొందరే"[111].

ఇక్కడ ఆమెలోని స్త్రీ బయటకు వచ్చింది. తనవల్ల రాముడు కష్టాలు పడుతున్నాడు. రావణునిమీద కోపం ఉంది కానీ, మండోదరి చేసిన పాపం ఏమీ లేదు, ఆమెకు కలిగిన

---

[110] అంతరంగ తరంగం – ఆర్. అనంతపద్మనాభరావు, పుట:180.

[111] అంతరంగ తరంగం – ఆర్. అనంతపద్మనాభరావు, పుట:190, 91.

పుత్రశోకానికి సీత బాధపడింది. భర్తను పోగొట్టుకున్న సులోచన పట్ల సానుభూతి ప్రకటించింది. సాధారణంగా వాడుకలో ఉన్న "ఆడ జన్మ పాడు జన్మ" అనే సామెత ఆమెకు గుర్తుకు వచ్చింది". రాముడు మరణించాడని రావణుడు చెప్పినప్పుడు ఆమె దుఃఖించింది. అగ్నిపరీక్ష సమయంలో కూడా ఆమె రాముని నిందించలేదు. రామునికి ప్రదక్షిణలు చేసి అగ్ని ప్రవేశం చేసింది. పుష్పక విమానంపై రాముని సరసన కూర్చొని అయోధ్యకు వెళ్ళడం, రామపట్టాభిషేకం ఈ ప్రకరణంలోనే పూర్తి అయ్యాయి. కానీ ఒక నూతన కల్పన చేసి రచయిత రామపట్టాభిషేకానంతరం గురుపూజా మహోత్సవం అనే ఒక చివరి ప్రకరణాన్ని సృష్టించాడు. ఈ ప్రకరణంలో అరుంధతి ప్రధాన పాత్రధారి. ఇప్పటికీ వివాహ సందర్భాలలో వివాహం కాగానే అరుంధతీ దర్శనం చేయిస్తారు. ఆమె పరమ సాత్వికురాలు, వశిష్టుని భార్య. ఈ సన్నివేశంలో సీత కన్నీరు పెట్టుకున్నట్లు ఆమెను అరుంధతీ ఓదార్చినట్లు చిత్రించారు. అరుంధతీవశిష్టులకు పాదపూజ చేయటం ఇందులో చెప్పబడింది. రామరాజ్యం సుప్రతిష్ఠితం కావాలని వశిష్టుడు పలకడంతో గ్రంథం పూర్తి అవుతుంది.

### 4.8.5. తాటక

ఇది రామాయణంలో అప్రధానమైన ప్రధాన పాత్ర. అందుకు కారణాలు అనేకం.

1) శ్రీరామచంద్రుడు స్త్రీని చంపడం భావ్యమేనా అనేది విమర్శకుల తొలి ప్రశ్న.

2) రాముడు చేసిన తొలి బాణ ప్రయోగం ఇదే.

3) ఆమె కుమారులే మారీచ సుబాహులు.

4) సుబాహుడు రాముని చేతిలో మరణించిన తొలి రాక్షసుడు.

5) చనిపోకుండా బ్రతికిన మారీచుడే రామాయణ కథా భాగాన్ని మలుపు తిప్పిన వ్యక్తి.

ఈ అన్ని కారణాల వల్ల తాటక కూడా రామాయణంలో ప్రాధాన్యతను సంపాదించింది. ఆమె మనస్సులో తీవ్రమైన కోపం రాముడిపై ఉంది...

"రామలక్ష్మణులకు నా రాక్షసతత్త్వాన్ని గుర్తు చేస్తున్నాడు విశ్వామిత్రుడు, ఆయన నిజానికి విశ్వానికి అమిత్రుడు. మిత్రుడు కాదు"

నేను తనకు ప్రత్యక్షంగా ఏం అపకారం చేశాను?

రామునికైనా నేను స్త్రీననే గౌరవం అక్కర్లేదా?

"అందమైన యక్షరూపాన్ని పోగొట్టుకొని ఇలా క్రూరరాక్షసి రూపం ధరించానన్న కనికరం లేదు. నా శాపానికి విరుగుడు లేదా? స్త్రీ హత్య పాతకమని మాటిమాటికి గుర్తు చేయాలా? రఘువంశ చరిత్రలో ఈ స్త్రీ హత్యాపాతకం ఎక్కడికీ పోదు. వాళ్ళ వంశంలో స్త్రీలకు ఏదో ఒకనాడు కష్టాలు రాకపోవు. రఘువంశ స్త్రీలు దుర్భర దుఃఖానికి లోనవుతారు. స్త్రీ హృదయం పరితపిస్తే వృథా పోదు. ధర్మ విరుద్ధమైన నన్ను చంపమని మాటిమాటికీ విశ్వామిత్రుడు రాముని పురికొల్పాడు. దానికి ఏవో పాత పురాణాలు చెప్పాడు"[112].

ఆమె చేతనే రాముని గుణకీర్తనను కూడా చేయించటం ఒక ప్రత్యేకత. విశ్వామిత్రుని ఆజ్ఞను పాటించడానికి రాముడు చెప్పిన సమాధానం ఆయనలోని గాంభీర్యతకు నిదర్శనం.

"మహర్షీ! మా తండ్రి అయిన దశరథ మహారాజులు, విశ్వామిత్రుడు చెప్పినట్లు చేయమని నన్ను ఆదేశించారు. నేను ఆయన మాటను జవదాటను. ఇది తప్పా, ఒప్పా, ధర్మ సమ్మతమా? అని ఆలోచించాల్సిన అవసరం లేదు. న్యాయాన్యాయ విచారణ మీకే వదిలేస్తున్నాను"[113].

---

[112] అంతరంగ తరంగం – ఆర్. అనంతపద్మనాభరావు, పుట:15.

తాటక విపరీత చేష్టలతోనే రాముడు ఆమెను చంపినట్లుగా వాల్మీకంలో ఉన్నది. దానినే ఇక్కడ రచయిత చిత్రించాడు. ఆమె భయంకరమైన దుమ్ము సృష్టించింది. శిలావర్షం కురిపించింది. నానారూపాలు ధరించి భయంకర వాతావరణాన్ని కలిగించింది. అప్పుడు లక్ష్మణుడు ఆమె ముక్కు, చెవులు కోశాడు.  ఇక్కడ తాటక చేత రచయిత ఒక మంచిమాట అనిపించాడు.

"ఆ తమ్ముడు మహా పోకిరి. సలక్షణంగా ఉండే ఆ లక్ష్మణుడు వచ్చి నా ముక్కు, చెవులు కోశాడు. ఆడదానికి ముక్కు, చెవులు కోయడం ఆయనకు సరదాలాగా కనిపిస్తుంది". ఈ వాక్యాలు తరువాత జరగబోయే శూర్పణఖ వృత్తాంతాన్ని స్ఫురింపజేస్తాయి. స్త్రీ హత్యా పాతకం రామునికి అంటకపోదు అంటూ "నా ఉసురు భావి కాలంలో ఇలాంటి అడవిలోనే ఇతని స్త్రీకి తగలకపోదు" ఈ వాక్యాలు నిజానికి తల్లడిల్లిపోతున్న ఆమె హృదయంలోని ఆవేశానికి, ఆక్రోశానికి, ఆవేదనకి, ఆక్రందనలకు నిదర్శనం.

## 4.8.6 అహల్య

ఈ శీర్షికకు రచయిత "ఇంద్రుడి వంచన" అని పేరు పెట్టడంలోనే ఘనత ఉన్నది. ఆమె విధి వంచిత తెలిసి తప్పుచేసింది. తెలియక అదృశ్య రూపంలో ఆశ్రమ ప్రాంతంలో ధూళి ధూసరితయై పడి ఉన్నది. బాలకాండలో సీతాకళ్యాణఘట్టానికి ముందు కనిపించే పాత్ర అహల్య. ఆమె మనస్సులోని ఆవేదన రచయిత ఈ ప్రకరణంలో ఆరు పుటలలో బహిర్గతం చేశారు. లోకంలో వాడుకలో ఉన్న విధంగా ఆమె రాయిలా పడి ఉండలేదు.  అది అవాల్మీక కల్పన. "చాలా సంవత్సరాల పాటు ఎవ్వరికీ కనపడకుండా ఆశ్రమ ప్రాంతంలోనే భస్మంలో పడి ఉండి ఆహారమే లేక వాయు భక్షణ చేస్తూ తపస్సులో ఆశ్రమంలో పడి ఉన్నది".

ఈ పాత్ర సృష్టిలో బ్రహ్మ సృష్టి ఇమిడి ఉన్నది. బ్రహ్మదేవుడు క్షీరసముద్ర మధనానంతరం మోహినీ రూపంలో వచ్చిన విష్ణువును చూసి జనమంతా బ్రహ్మకు

సౌందర్యం అంటే తెలియదని ఎద్దేవా చేశారు. ఆ కోపంలో దానిని ఒక సవాలుగా స్వీకరించి అతిలోకసుందరిగా ఒక స్త్రీని సృష్టించాడు. ఆమెకు అహల్యా అని పేరు పెట్టారు. అ – అంటే అచ్చు, హ – అంటే హల్లు అక్షరానికి మారుపేరు సరస్వతి, హలం – అంటే నాగలి అది వంకరటింకరగా ఉంటుంది. వంకరటింకరలు లేనిది అహల్య, కానీ ఇంద్రునివల్ల ఆమెకు వంకరటింకర బుద్ధి కలిగిందని రచయిత చమత్కరించారు.

పుట్టిన బిడ్డను బ్రహ్మ సర్వసంగ పరిత్యాగి అయిన గౌతముని చేతిలో పెట్టారు. ఆమెకు యుక్తవయస్సు రాగానే గౌతముడు ఆమెను బ్రహ్మకు అందించాడు. ఆమెను చూసి ఇంద్రాది దేవతలు ఎగబడ్డారు. ఇంద్రుడు తొందరపడ్డాడు. భూ ప్రదక్షిణ ముందుగా చేసి వచ్చిన వారికి ఆమెను ఇస్తానని బ్రహ్మ షరతు పెట్టాడు. గౌతముడు గోగర్భంలోంచి శిశువు శీర్షోదయం అవుతుండగా ఆ గోవుకు ప్రదక్షిణ చేశాడు. అది భూ ప్రదక్షిణతో సమానం. వెంటనే బ్రహ్మ అహల్యా గౌతముల వివాహం జరిపించాడు. ఆమె అతనిని సేవించి తరించింది. వారికి శతానందుడు జన్మించాడు. గౌతముడు తపోధనుడు. 12 సంవత్సరాలు అనావృష్టి కలిగినప్పుడు అక్కడి ప్రజలను రక్షించినవాడు. గోహత్యా పాతకాన్ని తొలగించుకున్నవాడు. గౌతమీ నది భూమిపై ప్రవహించటానికి మార్గదర్శకుడైనాడు.

తెలిసి చేసిన తప్పుకు అహల్యా శాపగ్రస్థురాలయ్యింది. కానీ శ్రీరామచంద్రుని రాకతో యధా స్వరూపాన్ని పొందింది. శాపవిమోచనం అనంతరం గౌతముడు యథావిధిగా అహల్యతో కాపురం చేశాడు. ఇక్కడ రచయిత ఆమె మనస్సులోని మాటను ఇలా బయటపెట్టారు “మా సంసారాన్ని చక్కబెట్టిన ఆ మహానుభావుడు ఒక సంసారి కావాలని నేను మనస్సులో కోరుకున్నాను” స్త్రీ హత్యాదోషం నా శాపవిమోచనంతో రామునికి పరిహారం అయిందని నా విశ్వాసం.

ఈ వాక్యాలు అవాల్మీకాలు. అయినా ఈ సందర్భానికి అవి చక్కగా అతికాయి. లోకులు చేస్తున్న స్త్రీ హత్యాపాతకం నుండి రాముని విముక్తుణ్ణి చేశాయి. తాటక సంహారం అహల్యా శాపవిమోచనం కొద్ది కాలవ్యవధిలో జరిగిన సన్నివేశాలు. రెండింటికి విశ్వామిత్రుడు సాక్షి. రాముని అతిలోక శక్తికి, అహల్యా శాపవిమోచనం ఒక నిదర్శనం.

## 4.8.7 అనసూయ

ఒకే ఒక్క సన్నివేశంలో కనిపించే పాత్ర ఈమె. కానీ రామాయణంలో ఆమెకు ఒక విశిష్ట స్థానం ఉన్నది. ఈ శీర్షికకు పత్నీ పరిచయం అని రచయిత నామకరణం చేయడం విశిష్టంగా ఉన్నది. సాధారణంగా భర్త తన భార్యను ఇతరులకు పరిచయం చేసేటప్పుడు ఒకటి, రెండు పొడి వాక్యాలు మాట్లాడి సరిపెడతారు. కానీ అందుకు విరుద్ధంగా అత్రిమహర్షి అనసూయను గూర్చి కొత్తవారైన సీతరామలక్ష్మణులకు విశేషంగా చెప్తాడు. అందుకనే రచయిత ఇక్కడ ఒక స్వభావ చిత్రణ చేశాడు.

“ఈ మునులు సాధారణంగా తమ పత్నుల గురించి పట్టించుకోరు. జపతపాలు, హోమాలు, వేదాధ్యయనం, అతిథి సత్కార్యాలు, యజ్ఞయాగాలు, శిష్ట సంతతి అంతకు మించి వారికి మరో లోకం తెలియదు. శాపాలు ఇవ్వడం తెలుసు. తపస్సు చేసి దేవతలను మెప్పించడం తెలుసు”.

త్రిమూర్తుల అంశతో ఆమెకు చంద్రుడు దత్తాత్రేయులు, దుర్వాసులు జన్మించారు. మహర్షి తపస్సుకు వెళుతూ తనతో రమ్మంటే ఆమె సున్నితంగా తిరస్కరించింది. పుత్రసంరక్షణ తన బాధ్యతగా భావించింది. వనవాస క్లేశాలను అనుభవించబోయే సీతకు సతీ ధర్మాన్ని వివరంగా చెప్పింది. సీత కూడా వినయంగా తాను భర్త పట్ల పూజార్హభావంతో మెలుగుతానని స్పష్టం చేసింది. సీతకు అమూల్యఆభరణాలను, మాలికలను అనసూయ కానుకగా సమర్పించింది. సీతాకళ్యాణం వృత్తాంతాన్ని సీత నోటివెంట వినాలని ఆమె

కుతూహలం పడింది. వారిద్దరూ ఏకాంతంలో ఎన్నో ముచ్చట్లు చెప్పుకున్నారు. ఈ పాత్ర రామాయణంలో విశిష్టమైన పాత్ర. జరుగబోయే కథా గమనానికి అవసరమైన సూచనలు అందించిన మహనీయురాలు అనసూయ. బాలకాండలో అహల్య ఎంత ప్రముఖురాలో, అయోధ్యాకాండలో అనసూయ కూడా అంతే ప్రధాన పాత్ర. ఇద్దరూ మునిపత్నులు. ఇద్దరూ పతి భక్తి గలవారు. ఇద్దరూ లోకసంరక్షణకు దోహదం చేసినవారు. ఈ పాత్రల అంతరంగ భావనలను ప్రస్ఫుటం చేయటంలో రచయిత కృతకృత్యుడయ్యాడు.

## 4.9 ఇతర పాత్రలు

కథ వడివడిగా సాగిపోవడానికి సన్నివేశ కల్పనకు పాఠకుల సౌలభ్యం కోసం రచయిత కొన్ని పాత్రలను అప్రధానం అయినవే అయినా ప్రధానంగా ఎత్తి చూపారు. అవి ఇవే.

1) సునయనా దేవి (జనకపత్ని)

2) ఊర్మిళ (లక్ష్మణుని భార్య)

3) శబరి (వృద్ధ తపస్విని)

4) తార (వాలి భార్య)

5) సురస (నాగమాత)

6) సింహకి (రాక్షసి)

7) స్వయంప్రభ (తపస్విని)

8) మండోదరి (రావణుని భార్య) – శీర్షిక విధివంచిత

ఈ పాత్రాల ద్వారా అరణ్య, సుందర, కిష్కింధ, యుద్ధకాండల కథాగమనాన్ని రచయిత వడివడిగా కొనసాగించారు. ఇందుకు కారణం ఈ సీతాయనంలో పురుషపాత్రలు ప్రధానం కాదు. స్త్రీల మనోభావాలే కథకు బలం. వాల్మీకి మనస్సును అనుసరించి వారి మనస్సులు బయటపెడతారు. వాల్మీకి చెప్పని మాటలు వారు మాట్లాడరు. జనశృతిలో ఉన్న గాథల ఆధారంగా కొన్ని కల్పనలు అక్కడక్కడ చేయబడ్డాయి. వాటి వివరాలలోకి వెళదాం.

## 4.9.1 సునయనా దేవి

ఈమె జనక పత్ని. ఈమెను రత్నమాల అని కూడా పిలుస్తారు. వాల్మీకి రామాయణంలో ఈమె పేరు కనిపించదు. జనకుడు రాజర్షి. అతనికి లౌకిక వాసనలు పట్టవు. రాజమాత అయిన ఆమెకు సాధారణ స్త్రీల వలె కొన్ని అనుమానాలు రాక తప్పవు. అందుకే ఆమె అంటుంది "అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో..." ఈ మాటలు అనడానికి వెనుక అరణ్యవాసంలో ఉన్న సీతను గూర్చిన ఆవేదన కారణం. వివాహసందర్భంలో జనకుడు పలికిన పలుకులను వాల్మీకి నోట వెలువడినవా అని ఇక్కడ రచయిత చమత్కరించాడు. ఊర్మిళ ఏకాంతాన్ని గురించి తల్లిగా ఆమె బాధపడింది. ఆమెను పుట్టింటికి తీసుకువద్దామని భర్త వద్ద ప్రతిపాదించింది. జనకుడు అంగీకరించలేదు.

## 4.9.2 ఊర్మిళ

ఈ ప్రకరణానికి శీర్షిక "మగత నిద్రనలో" ఊర్మిళ వంటి పాత్రలు మనకు పురాణాలలో బహు కొద్దిగా కనిపిస్తాయి. వివాహసందర్భంలో జనకుడు సీతా పాణిగ్రహణ సందర్భంలో చెప్పినట్టు "సహధర్మ చరీతవా" అని చెప్పలేదు. ఆలస్యం చేయకుండా పాణి గ్రహణం చేయమన్నాడు. అదే విధంగా అత్తగారైన సుమిత్ర లక్ష్మణునితో 'గచ్ఛతాత యధాసుఖం' అంటుంది. "సదాసుఖం" అనవచ్చు కదా అని ఊర్మిళ మనస్సులో అనుకుంటుంది. మాటలే ఎరుగని ముగ్ధ మనోహర స్వభావంగల వ్యక్తిగా ఊర్మిళను

చెప్పవచ్చు. వాల్మీకిలో ఆమెను గూర్చిన సుదీర్ఘ ప్రస్తావన కనిపించదు. సీతకు, తనకు అదృష్టాలలో ఉన్న తేడాను ఊర్మిళ ఇలా అంటుంది "ఇద్దరిదీ తలకో రకం జీవితం. అక్కయ్యకు అరణ్యవాసం, అయోధ్యా వియోగం, నాకు అంతఃపుర శిక్ష, పతీ వియోగం. ఎవరి అదృష్టాన్ని ఎవరు మార్చగలరు"[114].

## 4.9.3. శబరి

దీనికి శీర్షిక ఎంగిలి చేసిన పండు. శబరి వృద్ధ తపస్విని. ఎండిన మ్రోడు నేలరాలే దశలో ఉన్న తపస్విని. మగ్గిన పండ్ల బుట్టతో రాముని రాకకోసం ఎదురు చూస్తుంది. ఇక్కడ రచయిత ఒక కల్పన చేశారు.

"స్వామి మెడలో వేయడానికి పూలమాలలు స్వయంగా కట్టాను. ఆజానుబాహుడైన నా రామయ్య మెడలో వేయాలి. వంగిన ఈ శబరి కోసం ఆయన తల వొంచుతాడా?

ఆయన ఎవరికీ తలవంచని వీరుడు.

సీతమ్మ రామయ్య మెడలో పూలమాల ఎలా వేసింది. పాపం సీత కోసం మెడ వంచి ఉంటాడు. రాముని పాదాలు పూజించడానికి పూలు తెచ్చి సజ్జలో పెట్టాను.  ఈ ఉదయమే నా ఎడమ కన్ను అదిరింది"[115].

ఈ పాత్ర చిత్రణలో రచయిత పాఠకులను భక్తి భావావేశాలలోకి తీసుకువెళుతాడు. ఆమెలో పంచేంద్రియాలు జ్ఞానాన్ని కోల్పోయామని, తనుజ్యోతి ఆరిపోయిందని పదబంధాలు వాడారు.

---

[114] అంతరంగ తరంగం – ఆర్. అనంతపద్మనాభరావు, పుట:140.

[115] అంతరంగ తరంగం – ఆర్. అనంతపద్మనాభరావు, పుట:143.

“రామయ్య హస్త స్పర్శతో నాకు స్పర్శజ్ఞానం నశించింది. ఆ మందహాస వదనం చూసి నా నయనేంద్రియ జ్ఞానం నశించింది. ఆయనకు సమీపంగా కూచోగానే భూతత్వం జీర్ణించుకొంది. సర్వేంద్రియాలు రాముని పాదాల మీద సమర్పించుకున్నాను. మతంగ మహర్షి రూపం ఒక్కసారి దివ్యంగా నా కనుల ముందు కన్పించింది. నీలమేఘశ్యాముడైన ఆ రామయ్య రూపం మరుక్షణంలో దివ్య ప్రభాసితంగా కన్పించింది.

**నోటమాట రాలేదు**

**రాముని పాదాలపై నాతల**

**రాముని కరస్పర్శతో నా తనుజ్యోతి ఆరిపోయింది”**[116]

ఇది అద్భుత కల్పన. బాపూ గీచిన బొమ్మలా, శబరి, రాముడు మనకు ఈ సన్నివేశంలో గుర్తుకు వస్తారు.ఆమెలోని భక్తి భావం ఆమె పట్ల రామునికి ఆదరణ భావన ఈ వాక్యాలలో కనిపిస్తాయి.

## 4.9.4. తార

కిష్కింధకాండ అంతా ప్రధాన పాత్రధారిగా తారను చూపించారు. దీని శీర్షిక మాట నేర్పరి. ఆమె రాజకార్యనిర్వహణాదక్షురాలు. మాట నేర్పరి. ఎదుటి వారి మనస్సును సులభంగా అర్థం చేసుకోగల ధీశాలి. వాలి కేవలం డాంబికం ప్రదర్శించే వ్యక్తి. అతనికి తార ఎన్నో రకాలుగా రాముని శౌర్య పరాక్రమాలను గూర్చి చెవినిల్లు గట్టుకొని చెప్పి చూసింది. అయినా ప్రయోజనం లేకపోయింది. అన్నదమ్ముల మధ్య వైషమ్యం తగదని హితవు చెప్పింది.

[116] అంతరంగ తరంగం – ఆర్. అనంతపద్మనాభరావు, పుట:145.

రామునితో సఖ్యత కోరుకోమ్మనది. ఆ మూర్ఖుడు పెడచెవిన పెట్టాడు. నేలకొరిగిన వాలిని చూసి విలపించింది తార.

వాలిని చంపిన బాణంతోనే తనను కూడా చంపమని రాముని ప్రాధేయపడింది. ఆమె రాజనీతినిపుణురాలు. కోపంతో ఉన్న లక్ష్మణుని శాంతపరిచింది. సమయానుకూలంగా మాట్లాడగల నిపుణురాలు ఆమె. సుగ్రీవుడు మదిరా మదనోద్ధతుడై మత్తెక్కి ఉన్నప్పుడు అతనిని కర్తవ్యోన్ముఖున్ని చేసింది. భర్తతోపాటు ప్రాయోపవేశం చేయటానికి తనకు అవకాశం రాలేదే అని తలపోసి 'విధి బలీయం అని సరి పెట్టుకుంది'.

సురస, సింహిక, స్వయంప్రభ ఈ మూడు పాత్రలు కథాగమనం వడిగా సాగిపోవటానికి దోహదం చేసిన పాత్రలు. సముద్రలంఘనం చేస్తున్న హనుమను తనపై సేద తీరమని మైనాకుడు కోరుకుంటాడు. హనుమ సున్నితంగా తిరస్కరించాడు. సురస హనుమంతుని కబళించాలని ప్రయత్నించి విఫలురాలయ్యింది. చివరకు నీకు కార్యసిద్ధి అవుతుందని దీవించింది.  అదే విధంగా సింహిక హనుమను ఆకర్షించి అతని వేగాన్ని తగ్గించాలని, పడగొట్టాలని ప్రయత్నించి విఫలురాలయ్యింది. స్వయంప్రభ దారి తెలియని వానరులను బిలం నుంచి బయటకు తెప్పించి రామకార్యనిర్వహణ యజ్ఞంలో తాను కూడా ఒక సమిధ అయ్యింది.

## 4.9.5. మండోదరి

శీర్షిక పేరు విధివంచిత. రావణుని పత్ని అయిన మండోదరి గర్వ దుర్విదగ్ధుడైన రావణుని కామమోహిత ప్రవర్తనకు బలి అయిన స్త్రీ.  ఆమె వివాహమే విచిత్రంగా జరిగింది. అష్ట దిక్పాలకులను ఓడించిన తన పతి ఒక అసామాన్య మానవకాంతి అయిన సీత కోసం తన భర్త రాముని చేతిలో మరణించటం తథ్యం అని భయపడింది. ఎన్నో విధాలుగా హితబోధ చేసి విఫలురాలయ్యింది. సమస్త రాక్షస వంశం నశించింది. తన కుమారుడైన ఇంద్రజిత్తు

ప్రాణాలు కోల్పోయాడు. తన పతి కూడా ప్రాణాలు కోల్పోక తప్పలేదు. విభీషణుడి మాటలను, తన మాటలను ప్రభువు పెడచెవిన పెట్టాడని విలపించింది. యముని తన పాదదాసునిగా చేసుకున్న ప్రభువునకు భవిష్యత్తులో ఏమౌతుందో అని శంకించింది. మండోదరి, రావణుల వివాహమే విచిత్రంగా జరిగింది. వనంలో స్వేచ్ఛగా సంచరిస్తున్న మండోదరి వేట కోసం వచ్చిన రావణుని చూసింది. పక్కనే తన తండ్రి మయుడు ఉన్నాడు. రావణుడు తన వంశ పుట్టుపూర్వోత్తరాలను గొప్పగా చెప్పి మండోదరిని వివాహం ఆడాడు. అరణ్యమధ్యంలోనే అగ్నిని ప్రజ్వరిల్లజేసి శాస్త్రోక్తంగా వివాహమాడాడు. ఇక్కడ మండోదరి ఇలా అనుకున్నది "పట్టణంలో బంగారు భవనాలలో జరగవలసిన మా వివాహం అలా అరణ్య మధ్యమంలో జరిగింది. మా నాన్న ఎందుకు నవ్వారో నాకు ఇప్పుడు అర్థమైంది. వంశ ప్రతిష్ఠ గొప్పదని అనుకొని ఉంటారు. వివాహ కానుకగా అల్లునికి శక్తి అనే ఆయుధాన్ని ఇచ్చారు. ఒక్కొక్క జన్మ ఒక్క రకంగా సాగిపోతుంది. నా పతికి అన్నీ ఎదురు దెబ్బలే. జయాపజయాలు దైవాధీనాలు. నందీశ్వరుని శాపం వారికి ఉండనే ఉంది. వానరుల చేతిలో లంకా నాశనం కాగలదని శాపం"[117].

ఈ విధంగా అంతరంగ తరంగంలో అష్టాదశ (18) స్త్రీ పాత్రల ద్వారా సీతాయనాన్ని కండ్లకు కట్టేలా బాపూ తైలవర్ణచిత్రంలా సర్వాంగసుందరమైన భాషామధురిమతో, భావావేశపూరితమైన, సంభాషణచతురిమతో, వాక్ చమత్కృతితో, భావ చందన పరిమళంతో, స్నిగ్ధపూర్వక సమాస బంధుర వాక్య నిర్మాణంతో, సహజోక్తులతో, అంతరంగ తరంగాల మహోజ్వలతను రచయిత ఈ గ్రంథంలో పాఠకులకు మెప్పించేలా చేయగలగటం ఆయన వాక్పటుత్వానికి, కావ్య నిర్మాణ చతురతకు నిదర్శనం.

---

[117] అంతరంగ తరంగం – ఆర్. అనంతపద్మనాభరావు, పుట:167.

## 4.10 సంగ్రహ వాల్మీకి రామాయణం– సంక్షిప్తీకరణ

160 పుటల ఈ గ్రంథం వాల్మీకి రామాయణానికి సంక్షిప్త వచన కావ్యం. రామాయణాన్ని తెలుగు భాషలోనే కాక ఇతర భాషలలోనూ ఎందరో ఎన్నెన్నో ప్రక్రియలలో అనువదించి ఉన్నారు. ఆ విషయాన్నే గ్రంథకర్త పీఠికలో 'వందే వాల్మీకి కోకిలం' అనే పేరుతో వివరించారు.

"వాల్మీకికోకిల మృదుమధుర రామాయణ కావ్యగానాన్ని తరతరాలుగా అన్ని భాషలలోను పద్యరూపంలోను, వచనంగాను, నాటకంగాను, యక్షగానంగాను కవి పండితులు అందించారు. తెలుగులో నిర్వచనోత్తర రామాయణము, రంగనాథ రామాయణము, కట్టావరద రామాయణము, ఉత్తర రామాయణము వంటి ఎన్నో రామాయణాలు వచ్చాయి. విశ్వనాథవారు శ్రీమద్రామాయణ కల్పవృక్షరచనకు పూనుకుంటూ –"మనుజుండు తాతిన్నయన్నంబె తినుచునుండు, తన రుచి బ్రతుకులు తనవిగాన" అని సమాధానం చెప్పుకున్నారు. వందల కొలది వచన రామాయణాలు వచ్చాయి.

గత మూడు సంవత్సరాలుగా డా॥ పుల్లెల శ్రీరామచంద్రుడు వ్రాసిన రామాయణ వ్యాఖ్యానాన్ని పలుమార్లు పఠించాను. డా॥ ఇలపావులూరి పాండురంగారావు ఆంగ్ల గ్రంథానికి 'రామాయణంలో స్త్రీ పాత్రలు' అని అనువాదం చేశాను. వారి వాల్మీకి మోనోగ్రాఫ్‌ను కేంద్ర సాహిత్య అకాడమీ వారికి తెలుగులోకి అనువదించాను"[118].

తెలుగులో చాలా రామాయణాలు ఉన్నాయి కదా మళ్లీ రామాయణం రాయడానికి గల కారణాన్ని రచయిత తనదైన రీతిలో ఈ కింది విధంగా చెప్పారు.

[118] సంగ్రహ వాల్మీకి రామాయణం – ఆర్. అనంతపద్మనాభరావు, పుట:5.

మధుర పదార్థాలను (Sweets) అందరం తింటాము. ఎవరి రుచి వారిది. నాకు గులాబ్ జామ్ అంటే ఇష్టం, మరియొకరికి లడ్డు ఇష్టం. ఇలా వారి వారి అభిరుచులకు అనుగుణంగా వారు ఆ మధుర పదార్థాలను స్వీకరిస్తూ ఉంటారు. మళ్లీ మళ్లీ తింటారు. అలానే రామాయణ మధురిమలను గ్రోలటానికి కాలపరిమితి లేదు. విషయపరిమితి లేదు. వివేచనతో కూడిన విశ్లేషణతో ఎందరో ఆ రామాయణ కథాగానం పలు రీతులు చేశారు. 1960లలో మద్రాసు నుండి వెలువడే ఆంధ్రపత్రిక దినపత్రికలో శ్రీనివాస శిరోమణి సీరియల్‌గా రామాయణం ప్రచురించారు. అది బాగా ప్రాచుర్యంలోకి వచ్చింది. ఆకాశవాణిలో విజయవాడ కేంద్ర నుండి ధర్మ సందేహాలు కార్యక్రమంలో ఉషశ్రీ సంవత్సరాల తరబడి రామాయణాన్ని ప్రవచనరూపంలో చెప్పారు. అది సంగ్రహ రామాయణమే దానిని తిరుమల తిరుపతి దేవస్థానం వారు ప్రచురించి ప్రతులు సరసమైన ధరలకు విక్రయించారు. హైదారాబాద్‌లో పుల్లెల శ్రీరామచంద్రుడు రామాయణాన్ని ఏడు కాండల వివరణలతో ప్రచురించారు. సంగ్రహ రామాయణాన్ని కామేశ్వరరావు చేత రాయించారు. రామాయణం కోటి ప్రతులను పంపిణీ చేసి రామాయణ హృదయాన్ని యువతరానికి అందజేయాలని టి.ఎల్ ప్రసాద్ గారి సంకల్పం. వారి ప్రేరణతోనే నేను ఈ గ్రంథం రచించాను.

మిత్రులు, హైదరాబాద్ మెట్రో రైలు మేనేజింగ్ డైరెక్టర్ ఎన్.వి.యస్. రెడ్డి గారు ఈ గ్రంథాన్ని సాకల్యంగా చదివి అభినందనపూర్వకంగా ముందుమాట రాశారు.

వారు ఇలా అన్నారు “రామాయణ, భారత, భాగవతాలు  భారతీయ సంస్కృతికి, నాటి భారతీయ మేథోవికాసానికి దర్పణాలు, వాల్మీకి మహర్షి వ్రాసిన రామాయణం యుగయుగాలుగా తరతరాలుగా భారతీయ సంస్కృతిని తీర్చిదిద్దుతోంది. వాల్మీకి తర్వాత అన్ని భారతీయ భాషల్లో అనేక మంది కవులు, రచయితలు పుంఖానుపుంఖాలుగా వారి వారి రీతిలో రామాయణాన్ని రచించారు, వ్యాఖ్యానించారు. 24 వేల శ్లోకాలతో 7 కాండలుగా రచించబడిన ఈ మహా గ్రంథాన్ని సరళమైన తెలుగులో క్లుప్తంగా 160 పుటలలో

వ్రాయడమనేది డా॥ అనంతపద్మనాభరావుగారు చేసిన సాహసం అనే చెప్పాలి. తనదైన శైలిలో రామాయణ సారాన్ని నేటి యువత ఆకళింపు చేసుకునేలా ఆయన చేసిన ఒక అద్భుతమైన ప్రయోగం ఈ పుస్తకం.

విశ్వవ్యాప్తంగా వేనవేల భాషల్లో వెలువడిన కోటానుకోట్ల గ్రంథాల్లో అతి కొద్ది గ్రంథాలు మాత్రం చిరకాలం మనగలుగుతాయి. కోట్లాది ప్రజల జీవనవిధానాన్ని, ఆలోచనాశక్తిని, ఆధ్యాత్మిక తృష్ణను, ఊహా నైపుణ్యాన్ని అమితంగా ప్రభావితం చేసి ఈనాటికీ ఆరాధింపబడుతున్న మహోన్నత గ్రంథం రామాయణం. రామాయణంలోని పాత్రలు – ఆదర్శవంతమైన తండ్రి, కుమారుడు, అన్న, తమ్ముడు, భార్య, రాజు, భృత్యుడు, ఏ విధంగా ప్రవర్తించాలో, మత సేవా ధర్మాన్ని నిర్వర్తించాలో తెలియజేస్తాయి. మానవాళి విలువలను, ధర్మ సందేశాన్ని రామాయణం మనకు అమృత ధారలా అందిస్తుంది.

రామాయణం గొప్పతనాన్ని, దాని ద్వారా నేర్చుకోవాల్సిన జీవన పాఠాలను యువతకు సులభ రీతిలో తెలపవలసిన బాధ్యతను చక్కగా నిర్వహించారు ఈ పుస్తక రచయిత డా॥ ఆర్. అనంతపద్మనాభరావుగారు. సంగ్రహంగా వాల్మీకి రామాయణాన్ని చిరు గ్రంథంగా అందరికీ బోధపడేలా వ్రాసి పాఠకులకు రామాయణామృతాన్ని గ్రోలే ఒక చక్కని అవకాశాన్ని కల్పించారు.

నేటి యువతకు రామాయణం మార్గదర్శి. పితృవాక్య పరిపాలన, భ్రాతృభక్తి, ప్రభుభక్తి, మైత్రీబంధం వంటి ఎన్నో విషయాలు రామాయణం నుండి నేర్చుకోవాలి. సమగ్ర రామాయణాన్ని చదివే అవకాశం, ఓపికలేని వారికి ఈ సంగ్రహ రామాయణం ఒక కరదీపిక. రచయితకు నా అభినందనలు. ఈ ప్రయత్నం ప్రశంసనీయం. “రామాయణాన్ని పద్య రూపంలో రాసినా, వచన రూపంలో రాసినా, నాటకంగా రాసినా, గేయ రూపంలో రాసినా,

యక్షగానంలో రాసినా, సినిమాగా తీసినా, అందులో మధురిమకు కొరత లేదు. అన్ని తీపి పదార్థాలలోనూ చక్కెర ఒక్కటే కదా, స్వరూపం వేరు".

## 4.11. హరివంశము పూర్వరంగ విశిష్టత

ఎఱ్ఱన హరివంశము తెలుగు సాహిత్యంలో అత్యంత ప్రసిద్ధం. కవిత్రయ కవులలో ఒకడైన ఎఱ్ఱన కేవలం అరణ్యపర్వశేషపూరణంతోనే గాక వ్యాస భారతంలో ఖిలపర్వమైన హరివంశాన్ని కూడా తెనిగించడంతో కవిత్రయంలో స్థానం సంపాదించడానికి దోహద పడింది. ఎఱ్ఱన మనుమడైన మల్లయ్య తన తాతను గురించి చెబుతూ

**" ప్రౌఢిమై హరివంశభాగమున్ రెండును**

**రచియించె సభలందు ప్రాజ్ఞులెన్న"**[119]

ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ ప్రచురించిన హరివంశం సంక్షేప ప్రతి రెండు భాగాలుగా ప్రచురితమైంది. దీని పీఠికలో సంపాదకులైన పురిపండా అప్పలస్వామి "హరివంశ మూలాన్ని" గురించి ప్రస్తావించారు[120].

అరణ్యపర్వశేషం, ఎఱ్ఱన హరివంశము అనువాదము పరికించే ముందు ఈ మూలం గురించి కొంచెం ముచ్చటించడం అప్రస్తుతం కాదు. వేదాలకు ఖిలసంహితలున్నాయి. అలాగే పంచమ వేదమైన మహాభారతానికి హరివంశము ఖిలం. ఖిలమంటే తరవాయి, పరిశిష్టం.

**హరివంశస్తతః పర్వపురాణం ఖిలసంజ్ఞితమ్**

[119] హరివంశము – ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ 1968 సంపాదకులు పురిపండా అప్పలస్వామి, పుట:26.

[120] హరివంశము – ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ 1968 సంపాదకులు పురిపండా అప్పలస్వామి, పుట:27.

**విష్ణుపర్వ శిశోశ్చర్యావిష్ణోఃకంసవధ స్తథా**

**భవిష్యపర్వ చాప్యుక్తం భవిష్యేవాద్భుతం మహత్**

**ఏతత్పర్వ శతంపూర్ణం వ్యాసే నోక్తం మహాత్మనా**

**(మహా భారతం:ఆదిపర్వం–2:పుట**:82, 83)

అనంతరం హరివంశ పర్వం. దీనిని ఖిల పురాణం అంటారు. ఇందలి విష్ణు పర్వంలో శ్రీకృష్ణుడి బాలచరిత్ర, కంసవధ ఉన్నాయి. ఈ ఖిలపర్వంలో భవిష్య పర్వం కూడా ఉంది. ఇది గొప్పది. అద్భుతమైంది. మహాత్ముడు వ్యాసుడు వంద పర్వాలు వ్రాశాడు. ఖిల పర్వంలో హరివంశ భవిష్య పర్వాలున్నాయి. హరివంశ ఖిల పర్వంలో వ్యాసమహర్షి లెక్కించి పన్నెండు వేల శ్లోకాలు చెప్పాడు" అని మహా భారతం పర్వ సంగ్రహ పర్వం.

"హరివంశంబు భవిష్య పర్వంబునను శతపర్వంబులుగలిగి" అని నన్నయభట్టు

(ఆంధ్ర మహాభారతము:ఆదిపర్వం:1–32)

"భారతపరాంశమని యింపారగ జెప్పుదురు బుధులు హరివంశము" అని ఎర్రా ప్రెగడ

(హరివంశము:అవతారిక:పుట:40)

మహా భారతానికి టీక వ్రాసిన నీలకంఠ పండితుడు హరివంశము కలుపుకునే "భారత భావదీపిక వ్రాశాడు. అతడికి పూర్వం అర్జునమిశ్రుడు మొదలైన వారును టీకలు వ్రాశారు". "హరివంశంలో ప్రధాన కథ కృష్ణ చరిత్ర. కృష్ణ చరిత్ర భారతం, విష్ణుపురాణం, బ్రహ్మ పురాణం, వాయుపురాణం, అగ్నిపురాణం, భాగవతం, బ్రహ్మవైవర్త పురాణం, పద్మపురాణం, వామన, కూర్మ పురాణాలలో కనిపిస్తుంది. విష్ణు పురాణం, హరివంశము, భాగవతం ఈ

మూడు పురాణాలలో ప్రధాన కథ కృష్ణచరిత అయినా మార్పులు, చేర్పులు అనేకం. ఒక్కొక్క కథ పరస్పరం విరోధం కూడా. విష్ణు పురాణ భాగవతాదులతో లెక్కకు వచ్చే మహా గ్రంథం హరివంశము. ఒక్కొక్క ప్రాంతంలో దీని ప్రశస్తి మరింత అధికం. సంతానం కోరేవారు హరివంశము పఠించడం సంప్రదాయం. ఉత్కల దేశంలో జ్యోతిష్క శాస్త్రం కూడా జాతక చక్రం కొడుకు సుత పంచమ స్థాన విచారణలో హరివంశంలో స్వీకరించడం గమనించదగిన విషయం.

**"సత్పుత్రం లభతే తథైవ హరివంశం శేనశ్రుతే అర్క స్థితే,**

**నష్టేందౌ హరివాసరే బహువిధాన్ సంతర్పయేత్ బ్రాహ్మణాన్"[121]**

ఎర్రన హరివంశంలో పర్వ విభాగం లేదు. పూర్వ భాగం, ఉత్తర భాగం అని రెండు భాగాలున్నాయి. నాచన సోముడు కూడా పర్వ విభాగం పాటించలేదు. ఉత్తర హరివంశం అని రాశాడు. ఎర్రన ఈ "హరివంశాన్ని ఎప్పుడు రాశాడో సరిగ్గా చెప్పడానికి తగిన ఆధారాలు లేవు. 1325–1340 సంవత్సరాల మధ్య రామాయణం హరివంశం రాసి ఉంటాడని చాగంటి శేషయ్య చెప్పారు"[122]. 1335కి పూర్వము హరివంశ రచన జరిగి ఉంటుందని పలువురి పరిశోధకుల అభిప్రాయం.

నన్నయ, తిక్కనలు భారతానువాదంలో అనుసరించిన మార్గాన్నే ఎర్రన తన అరణ్యపర్వశేషంలోనూ, హరివంశంలోనూ అనుకరించాడు. హరివంశ అనువాదంలో అతడు మూలం నుంచి కొంత కొంత విడిచిపెట్టాడు. లేనిది కొంత చేర్చాడు. ఎర్రన హరివంశంలో కుంభాంకుడి కూతురు చిత్రరేఖ ఒక్కతే కనిపిస్తుంది. ఇద్దరు చిత్రరేఖలు కనపించరు. ఇది ఎర్రన బుద్ధి పూర్వకంగా చేసిన మార్పు.

---

[121] హరివంశము – ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ 1968 సంపాదకులు పురిపండా అప్పలస్వామి, పుట:34.

[122] ఆంధ్ర కవి తరంగిణి, పుట:4–58.

ఖిల పురాణం ఈ విషయంలో పురిపండా అప్పలస్వామిగారు పీఠికలో కొంత చర్చ చేశారు.

"మహాభారతంలో కృష్ణచరిత్ర విపులంగా లేదు కనుక అది ఖిలం (తరవాయి)గా ఉందని భాగవతకారుడి అభిప్రాయం. వ్యాసుడు హరివంశం ఖిలపర్వం వ్రాసి ఉంటే భాగవతకారుడి ఈ నారద వాక్యం అసత్యమే అవుతుంది. ఏమంటే హరివంశం కృష్ణచరిత్రే కదా భాగవతం లాగా.

ఇదంతా విచారిస్తే హరివంశం మహాభారతకారుడి రచన కాదనీ, మహాభారతానికి అది ఖిలపర్వం కూడా కాదనీ, స్పష్టపడుతుంది. మహాభారత రచన అనంతరం ఎంతో కాలానికి కృష్ణ భక్తులెవరో హరివంశం వ్రాసి దానికి ప్రతిష్ఠ అర్థించి ఖిలపర్వమని మహాభారతంలో అతుకుపెట్టి ఉంటారు. ఈ అతుక్కికిటంకంగా భారత పర్వం సంగ్రహం చివర హరివంశం పేరు చేర్చి ఉంటారు"[123].

## 4.11.1 ఆకాశవాణి ధారావాహిక నేపథ్యం

అనంతపద్మనాభరావు ప్రస్తుత సృజనాత్మక రచయిత అయిన హరివంశం నేపథ్యాన్ని గమనించాలి. 1978 నవంబర్‌లో అనంతపద్మనాభరావు విజయవాడ ఆకాశవాణి కేంద్రానికి కడప నుండి బదిలీ అయ్యారు. అక్కడ కనిపిస్తున్న ప్రముఖ ప్రవచనకర్త ఉషశ్రీ విజయవాడ నుండి కడపకు బదిలీ అయ్యారు. దాదాపు మూడు సంవత్సరాలుగా 1976 నుండి బాలాంత్రపు రజనీకాంతరావు నేతృత్వంలో నడుస్తున్న ప్రసార తరంగాలలో ధర్మ సందేహాలు కార్యక్రమం హైలెట్. ప్రతి ఆదివారం మధ్యాహ్నం 12.00 గంటలకు 30 నిమిషాలపాటు ధర్మసందేహాలు కార్యక్రమం లైవ్‌గా లైవ్‌లీగా ప్రసారమయ్యేది. ఉషశ్రీని చూడటానికి ఆదివారం టూరిస్టు బస్సుల్లో జనం ఆకాశవాణికి వచ్చేవారంటే అతిశయోక్తి కాదు. ఆయన

[123] హరివంశం, ఉత్తరభాగం, పుట:31.

ఉదాత్త కంఠస్వరం మేఘగంభీరనిస్వనం. శ్రీగురుభ్యోనమః అని శిష్యుడు A.B. ఆనంద్ కార్యక్రమాన్ని ప్రారంభించేవాడు. "నాయనా! ఈ వారం ఏం సందేహాలు వచ్చాయి" అని గురువుగారు అని మొదలుపెట్టేవారు.

వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఉత్తరాలలోని పురాణసంబంధ సందేహాలకు ఉషశ్రీ తనదైన రీతిలో సమాధానం చెప్పేవారు. ఆ ప్రశ్నలు ఇలా కొనసాగాయి "భీముడు దుర్యోధనుని తొడలపై కొట్టి సంహరించడం న్యాయమేనా? ఎవరో ఏదో అన్నారని రాముడు సీతను అరణ్యాలకు పంపడం ఎంతవరకు న్యాయం" ఇలాంటి ప్రశ్నలకు ఉషశ్రీ హేతుబద్ధంగా సామాజికపరమైన అన్వయంతో శ్రోతలకు ఆహ్లాదం కలిగించే రీతిలో సమాధానాలు చెప్పేవారు.

పది నిమిషాల తరువాత మహాభారత ప్రవచనం మొదలుపెట్టేవారు. మూడు సంవత్సరాల పాటు అవిచ్ఛిన్నంగా భారత, రామాయణ, భాగవతాలలో ప్రవచన రూపంలో ఆసక్తిదాయకంగా చెప్పారు. ఇటీవల కాలంలో చాగంటి కోటేశ్వరరావు ప్రవచనాలకు ఎంత ప్రజాదరణ లభించిందో అంతటి ప్రజాదరణ ఉషశ్రీ గారికి ఉండేది. వివిధ పట్టణాలలో ఆయనను ఆహ్వానించి ఆయన చేత ప్రవచనాలు చెప్పించేవారు. 1978 నవంబర్ నాటికి ఆయన మహాభారతంలో ఆశ్రమవాస పర్వం వరకు ప్రవచనం పూర్తి చేశారు. అర్థాంతరంగా ఆయనకు కడప బదిలీ జరిగి పోయింది. ప్రవచన శాఖ ప్రయోక్తగా అదే స్థానంలో వచ్చిన అనంతపద్మనాభరావుపై ఆ గురుతర బాధ్యత పడింది. ఆదివారం రానే వచ్చింది. ఉషశ్రీ గొంతు వినడానికి అలవాటుపడ్డ శ్రోతలు ఎదురు చూస్తున్నారు. వెంటనే పద్మనాభరావు తన గొంతు వినిపించడానికి సిద్ధపడలేదు. ఇద్దరి స్వరాలలో ఎంతో తేడా ఉంది. అయితే కార్యక్రమం ఆపడానికి లేదు. మధ్యే మార్గంగా చక్కని కంఠ స్వరం కలిగి రేడియో, నాటకాలలో వాయిస్ అయిన రామ్‌మోహన్ చేత ఆ కార్యక్రమాన్ని కొనసాగించి ఒకటి, రెండు నెలల్లో ఆశ్రమవాస పర్వంనుండి స్వర్గారోహణ పర్వం వరకు కథను చెప్పించారు.

ధర్మ సందేహాలకు సమాధానాలు పద్మనాభరావు గారే రాసిచ్చేవారు. భారత కథను కూడా ఈయనే ప్రవచన రూపంలో రాసి ఇచ్చారు. 1979 జనవరి నాటికి భారతం సమాప్తం అయింది. అసలు ప్రశ్న ఇప్పుడు ధర్మసందేహంగా నిలబడింది. రామాయణ, భారత, భాగవతాలను ఉషశ్రీ ఇంతకుముందే చెఱుకు గడ నుండి రసం పీల్చినట్టు మధుర రస ఆస్వాదనం చేశారు. ఇప్పుడు ఏం చెప్పాలి. ఏం చెబితే శ్రోతలను ఆకర్షించవచ్చు. ఉషశ్రీ కంఠానికి అలవాటుపడిన శ్రోతలని నిరాశపర్చకుండా తనదైన శైలిలో వినూత్నమార్గంలో చెప్పడానికి పద్మనాభరావు విశేష కృషి చేశారు. ఎర్రన రాసిన హరివంశ కావ్యాన్ని క్షుణ్ణంగా చదివారు. నన్నయ, తిక్కనలతో పాటు కవిత్రయంలో స్థానం సంపాదించిన ఎర్రన వలె తాను ఖిల పురాణంమైన హరివంశాన్ని శ్రోతలకు అందించారు.

## 4.11.2 ప్రసారంలో వినూత్నత

ఉషశ్రీ పద్ధతి ఇలా ఉండేది 10 నిమిషాలు ధర్మ సందేహాలకు సమాధానాలు ఆపైన ప్రవచనాలు. అనంతపద్మనాభరావు అదే ధోరణిని అనుసరించారు. అయితే శిష్యుడుగా ఇంతకు ముందున్న A.B. ఆనంద్ స్థానంలో మల్లాది సూరిబాబును (మల్లాది బ్రదర్స్ తండ్రిగారు) అనౌన్సర్‌ని శిష్యుడిగా ఎంచుకున్నారు. దీనికి రెండు కారణాలు.

1) రెండు కొత్త కంఠాలకు శ్రోతలను అలవాటు చేయడం.

2) ప్రవచనంలో మధ్య మధ్య హరివంశం నుండి ఎంపిక చేసిన పద్యాలను శ్రావ్యమైన కంఠంతో తంబూరా మీటుతో సూరిబాబు పాడేవాడు. ఇది శ్రోతల నాడిని బాగా పట్టుకోగలిగింది. జనవరి 1979 నుండి జూన్ 1980 వరకు ఈ హరివంశ ప్రవచన ప్రసారాలు కొనసాగాయి. మళ్లీ పద్మనాభరావు కడపకు, ఉషశ్రీ విజయవాడకు యధాస్థానాలలో చేరుకున్నారు. హరివంశప్రవచనం పూర్తి అయింది. ఈ గ్రంథాన్ని సిద్దార్థ పబ్లికేషన్స్, విజయవాడ వారు తొలుత 1981లో ప్రచురించారు. దానికి మంచి ఆదరణ

లభించింది. ఆ తరువాత ఉషశ్రీ సోదరుడు పురాణపండ రాధాకృష్ణమూర్తి భాగవత మందిర ప్రచురణలో భాగంగా 1985లో తొలుత ముద్రించారు. ఆపైన ద్వితీయ, తృతీయ ముద్రణలు వెలువడ్డాయి. దాదాపు లక్ష కాపీల వరకు అమ్ముడు పోయాయి. రాధాకృష్ణమూర్తి వివిధ పురాణాలను స్తోత్రాలను తమ ప్రచురణలో భాగంగా వెలువరించేవారు. ఆ ప్రచురణలకు కొంత మంది శాశ్వత చందదారులు ఉండేవారు. వారందరికీ ఈ గ్రంథ ప్రతులు చేరేవి. ఆ విధంగా ప్రసార రంగం నుండి ప్రచురణ రంగంలోకి హరివంశం చోటు చేసుకుంది. చివరిసారిగా 2004లో ఈ గ్రంథం పునర్ముద్రితమైంది.

## 4.11.3 పుట్టపర్తి నారాయణాచార్యుల ప్రశంస

హరివంశాన్ని తెలుగులో ఇద్దరు కవులు వ్రాసినారు. మొదటివాడు ఎఱ్ఱన, తరువాతవాడు నాచన సోమనాథుడు, నాచన సోమనాథుడు మూలము నుండి తనకు నచ్చిన కథలు కొన్ని ఏరుకొని తన కవిత పాటవాన్ని చూపిస్తూ ప్రబంధధోరణిలో వ్రాసుకుంటూ పోయాడు. ఎఱ్ఱన ఒకడే మూలాన్ని దృష్టిలో పెట్టుకున్నది. ఆయనది పక్వమైన పురాణశయ్య!

అటు నన్నయను, ఇటు తిక్కననూ తన రచనలో మేళవించుకొని – అధిక ప్రసంగాలకు పోకుండా వున్న అవకాశంలోనే తన వ్యక్తిత్వాన్ని చాటుకుంటూ రచిస్తూ పోతాడు. ప్రబంధపరమేశ్వరుడనే బిరుదం ఎఱ్ఱన్నకు చాలా సముచితమైనది తరువాతి కవులు ప్రబంధ లక్షణాలను అతని నుంచి నేర్చుకొన్నారా–అనిపిస్తుంది. చి॥ పద్మనాభరావు చేసిన మంచిపని అక్కడక్కడ ఎఱ్ఱన పద్యాలను ఉదాహరించడం. దీనితో పది మందికీ హరివంశం కథ తెలియడంతోపాటు ఎఱ్ఱన్న రచనను చదువుదామనే ఆసక్తి కలుగుతుంది.

భారతమునకు వచ్చినంత ప్రశస్తి తెలుగులోగాని, సంస్కృతంలోగాని హరివంశానికి రాలేదనే చెప్పాలి. తెలుగులో రాకపోవడానికి కారణాలు వేరు. సంస్కృతంలో అది వ్యాసరచన అయినా, భారతం ఎదుట అంత రక్తికి రాలేదు. దానికి ఖిల పర్వాలనే పేరే ప్రచారంలో ఉంది.

భారతము చదివిన తర్వాత హరివంశాన్ని ఒక ద్వైత సంప్రదాయస్థులు మాత్రమే నియతంగా చదువుతారు. భారతాన్ని కూడా ఇండ్లలో పారాయణం చేసే అలవాటు మనకు లేదు. ఎక్కడైనా గుళ్ళలోనే చదువుతారు. వాళ్ళు కూడా హరివంశం చదివే అలవాటు పెట్టుకోలేదు.

పద్మనాభరావు భారతం కృష్ణ కథేనని, కాని అది పూర్వాపర్వాలలో అనుషంగికమై పోయిందనీ అంటున్నాడు. నిజమే కాని, భారతానికి కృష్ణకథా పర్యాయంగా వ్యాఖ్యానం చేసిన పూర్వులు కూడా ఉన్నారు. మధ్వాచార్యులువారు భారతమంతా కృష్ణకథేనని – ఆ బొమ్మలనాడించిన సూత్రధారుడు కృష్ణ పరమాత్మయేనని మహాభారత తాత్పర్య నిర్ణయంలో వ్యాఖ్యానిస్తూ వస్తాడు.

18 పురాణాలు అన్నీ ఉపపురాణాలు, ఒకదానిలో ఉన్న కథ మరొక దానిలో భిన్నంగా ఉంటుంది. ఈ పురాణాలలో భారత భాగవత రామాయణాలలో కూడా ఈ ప్రక్షిప్తాలను గూర్చిన చర్చ చాలా చిక్కయింది. పురాణాల్లో కనబడే కథల్లోని పరస్పర విరోధాలను పౌరాణికులు కల్పభేదంతో సమర్థించుకుంటూ పోతారు. కొందరు పురాణంలో కథ ముఖ్యం కానే కాదు పొమ్మన్నారు. ఈ చిక్కు హరివంశంలోనూ తప్పలేదా అనిపిస్తుంది. భారత భాగవతాలలో కనబడని ఎన్నో కొత్త విషయాలు ఇందులో కానవస్తాయి. అక్కడ సూచించిన విషయాలకు విపులీకరణం కూడా ఇందులో కనబడుతుంది. కంస జన్మ, బలరామునకు – రేవతికి జరిగిన వివాహము – ఈ కథలు భాగవతంలో సూచనప్రాయంగా వస్తాయి. ఇక్కడ వానిని కొంచెం ప్రధానంగా చెప్పడమూ తటస్థపడింది.

మదిరాదేవి, కాంతిమతి, మహాలక్ష్మి బలరాముని దగ్గరకు వచ్చి తమ్ము వరించమని కోరినట్లుగా హరివంశంలో వస్తుంది. ఇంకెక్కడా ఇది కనబడదు. అట్లే కృష్ణుడు జరాసంధ యుద్ధాలలో పరశురామునితో పరిచయము చేసుకొన్న కథ కొత్తదే. కాలయవనుడు యాదవ

పురోహితుడైన గర్గుని కుమారుడట! ఇవన్నీ మనకు కొత్తగా కన్పించే విషయాలే. కాలయవనుని దగ్గరకు కృష్ణుడు కాలసర్పాన్ని పెట్టి పంపిన ఘట్టము కూడా కొత్తదే.

జరాసంధునికీ, బలరామునికీ గదాయుద్ధం జరుగుతుంది. ఆనాడు బలరాముడు గదాయుద్ధంలో చాలా గొప్పవాడు. గొప్పవాడేమిటి? అతనితో సమానుడు లేడు. అతడు జరాసంధుని చంపబోతూ ఉంటే ఆకాశవాణి వారించిందట. కృష్ణుని సంతానాన్ని గూర్చి హరివంశంలో కొన్ని కొత్త విషయాలు చెప్పినాడు. అనగా కొత్తపేర్లన్న మాట. బలిచక్రవర్తిని పాతాళంలో నిలిపిన శ్రీమహావిష్ణువు ఆయనకు కొన్ని వరాలిచ్చినాడు. కొంత పుణ్యభాగమాయనకు పంచినాడు. అవి ఈ క్రిందివి:

**శ్రోత్రియులు లేని శ్రాద్ధము**

**వ్రతహీనమైన అధ్యయనము**

దక్షిణలు లేని క్రతువు – వీటి ఫలం కర్తకుగాక బలికి దక్కుతుంది. ఈ విషయమున్నూ మనకు కొత్తదే. ఐనా హరివంశం అప్రసిద్ధమైన గ్రంథం. దాని కథలు విననివారు చాలామంది. పేరు గూడా వినని వారు ఇంకా చాలామంది.

చి॥ పద్మనాభరావు ఈ కథలను పరిచయం చేయడం చాలా సముచితమైన పని. వచన రచన కూడా చిన్న వాక్యాలతో పాండిత్యం జోలికిపోని సరళమైన పద్ధతిలో సాగింది.

## 4.11.4 వివిధ ఘట్టాలు

హరివంశ కథలో ప్రధాన ఘట్టాలు ఈ రచయిత 11గా విభజించారు.

1) కథాభాగం (కృష్ణ జననం)

2) బలరామ వివాహం

3) కంసుని వృత్తాంతం

4) జరాసంధ వధ

5) కాలయవనుని వృత్తాంతం

6) ద్వారకా నగర నిర్మాణము

7) రుక్మిణీ కళ్యాణం

8) ప్రద్యుమ్న జననం

9) నరకాసుర వృత్తాంతం

10) బాణాసురుని కథ

11) మార్కండేయ చరిత్ర

## 4.12 వచనరచనలో సృజనాత్మకత

పద్య కావ్యాన్ని వచనంగా వ్రాయటం ఒక ఎత్తు. అది ప్రసారయోగ్యంగా ప్రవచన రూపంలో చెప్పటం ఒక ఎత్తు. చదువుకునే పాఠకుడికి విశదపరచటం ఒక మార్గం. వినే శ్రోతకు చెవులకు ఇంపుగా మాట్లాడుకునే రీతిలో రాయటం వేరొక మార్గం. ఈ ధోరణికి అనేక రకాల కష్టాలున్నాయి.

1) పాఠకుడు ప్రవచనకారునితో మమేకమై వినడానికి ఉత్సుకత చూపాలి,

2) పాండిత్యస్ఫోరకంగా కఠినపదాలతో సుదీర్ఘసమాసాలతో శ్రోతలను గజిబిజి చేయకూడదు. అందుకే సరళ వ్యవహారికాన్ని ఎంచుకున్నారు.

3) సృజనాత్మక ధోరణిలో కథను చెప్పడంలో తనదైన రీతిలో ఆయా ఘట్టాలను, సన్నివేశాలను సులభశైలిలో వర్ణించారు.

4) పాత్ర చిత్రణకు ఎక్కువ అవకాశం లేదు.

5) స్వకపోలకల్పనలకు అవకాశం లేదు యథాతథంగా కథను చెప్పాలి. ఎర్రన హృదయానికి సన్నిహితంగా ఉండాలి. మూలానికి భిన్నంగా కొత్త ఆలోచనలు ప్రవేశపెట్టకూడదు.

6) ప్రసార మాధ్యమానికి సరిపడే రీతిలో చిన్న చిన్న వాక్యాలతో సన్నివేశాన్ని శ్రోతల కళ్ళకు కట్టేలా చెప్పగలగటం కత్తి మీద సాము వంటిది.

7) పద్యానికి ఒక ఒడుపు ఉంటుంది. ఒక ప్రవాహ ఝరిలా అది ముందుకు సాగుతుంది.

8) ప్రబంధ పరమేశ్వరుడైన ఎర్రన శైలి ముగ్ధమందారం దానిని చదివిన పాఠకులు ఉంటారు. వారు రేడియోలో ఈ కార్యక్రమాన్ని వింటున్నప్పుడు కథాకథనం పట్ల ఆసక్తిని చూపాలి.

9) ఉత్కంఠభరితంగా ప్రవచనం కొనసాగించాలి.

10) హరివంశ పద్యాల ఎంపికలో ఎన్నో జాగ్రత్తలు తీసుకోవాలి. వినేటప్పుడు సీసపద్యం సుదీర్ఘంగా అనిపిస్తుంది, వినిపిస్తుంది. అందువల్ల కేవలం వృత్తపద్యాలను మాత్రమే ఎంచుకున్నారు.

11) 1/8 డెమీ సైజులో దాదాపు 240 పుటల ఈ గ్రంథంలో మూల హరివంశంలోని 1000 పద్యాల సారాంశం అందివ్వాలి.

12) వర్ణనలకు తావులేదు. అలా అని కథను దాటడానికి వీలులేదు.

13) రాగయుక్తంగా పాడేందుకు పద్యాలు అనుకూలంగా ఉండాలి. అందుకే కొన్ని పద్యాలను రోజుకు 1, 2 మాత్రమే ఎంచుకున్నారు. అవి సూరిబాబు శ్రావ్యంగా పాడేవారు.

14) చకచకా సాగిపోయేలా కథాగమనాన్ని సంక్షిప్తం చేశారు.

15) ఇది వచనానువాదం కాదు. వచనానుసరణం.

16) సృజనాత్మకతతో నిర్మాణం చేసిన ఒక వచన కావ్య శిల్పం.

17) సంభాషణ రీతిలో వాక్యాలు దొర్లిపోతాయి.

## 4.13 కథా నిర్మాణంలో విశేషాలు

శ్రీకృష్ణుని వృత్తాంతంలో వివిధ సమయాలలో ఎందరినో సంహరించాడు. పూతనా సంహరణం, కాళీయమర్ధనం, శకటాసురల భంజనం, కంసవధ, జరాసంధుని వధ, కాలయనుని వధ, నరకాసుర వధ—ఇలా అనేకానేక ఘట్టాలలో శౌర్య పరాక్రమాలతో శ్రీకృష్ణుడు బాల్యంలోనే తన శక్తిని నిరూపించాడు. ఆయా ఘట్టాలను వింటున్నప్పుడు శ్రోతలకు కృష్ణతత్త్వం అర్థమయ్యేలా చెప్పగలగాలి.

కథాగమనంలో వాడిన కొన్ని పద్యాలు మచ్చుకు:

**'ఎదురై నిల్వగ నోపితేని సమరోదీర్ణస్ఫురద్బాహు సం**
**పదసొంపారగ నన్నదమ్ముల మిముంబ్రాణంబులం బాపుదున్**
**పదిలంబేది తొలంగితేని దివియుం పాతాళమున్ లోనుగా**
**తుది నీచొచ్చినచోట జొచ్చికృతకృత్యున్ చేయుదున్ మృత్యువున్'**

**"విను మేగాంతి యనంగ చంద్రునికడున్ విఖ్యాతనై యుండుదున్**
**నినునాశీత మాయూఖుకంటె ఘనుగా నిక్కంపు చూపొప్పగా**
**కని ప్రేమంబున బొందవచ్చితి తగంగైకొమ్ములోకాతిశా**
**యిని నీ యుజ్వలమూర్తి! నీకు నెనయే యెన్నంగ నేమూర్తులున్"**

**'అనలంబిట్లు తగిల్చి తారు సమరప్రారంభ సన్నాహులై**

జననాథుల్ బహుదేశవాసులు మహాసైన్యావళీ కల్పనం

బొనరం జేర్చిన వారు నేడు వినుమీ యుర్వీతలంబెల్ల ని

ర్మను జేంద్రంబుగ జేయకెట్లుడుగు నస్మత్కోప సంరంభముల్'

"ఏనుండంగ నరేంద్ర సింహముల నీవిట్లేల నెగ్గించెది

చ్చో నుగ్రాటవిలోన నాడటు పశుస్తోమంబులన్ గాచిన

ట్లేనో కేశవ! లావు చేవయును ధైర్యంబున్ కలండంద్రుని

న్నానేర్పిప్పుడు నాకు నెక్కినగదా యత్యంత సిద్ధంబగున్"

"గరుడపతాకతోడి రథకల్పన మొప్పగ చక్రమాదిగా

బరగిన కైదువుల్ విततబాహులన్ వెలుగొంద దివ్యతా

స్ఫురిత శరీరుడై సకల భూతభయంకర విక్రముండు పం

కరుహదళేక్షణుండడరె కంపము బొందగ శత్రు సైన్యముల్"

'గోపికలంది యాపసిడికోర నుదార సుగంధిశీధువి

చ్చాపరిపూర్తిగాగొని వెసంగడు నుగ్గడులై ముదంబు సం

వ్యాపక భంగి నంగము సమస్తము ఘూర్ణన మొందజేయ ను

ద్దీపితమైన మోహము మదిన్ పరతంత్రత యావహింపగన్'

పుట్టపర్తివారు అన్నట్లు వచనరచన చిన్న వాక్యాలతో నడిచి పాండిత్యం జోలికి పోని సరళమైన పద్ధతిలో కొనసాగడం ఈ సృజనాత్మక శైలిలో కొనసాగడం విశేషం. ఈ రచయిత పద్మనాభరావు సృజనాత్మక రచనలను పదింటిని ఎంచుకున్నాను. అందులో అధిక భాగం పురాణాలకు సంబంధించిన గాథలే మూల ఇతివృత్తాలు కావటం విశేషం. కథానికా సంపుటాలు మూడు, నవలిక ఒకటి తప్ప మిగతా ఆరు గ్రంథాలు పురాణ సంబంధాలు. అందులో రెండు రామాయణ సంబంధాలు 1) అంతరంగ తరంగం, 2) సంగ్రహ వాల్మీకి రామాయణం, మరి రెండు భాగవత సంబంధమైనవి. 1) హరివంశం, 2) యశోద. దాంపత్య జీవన సౌరభంలో వివిధ పురాణాలకు సంబంధించిన గాథల ఆధారంగా అల్లిన సృజనాత్మక రచనలు. ముత్తుస్వామి దీక్షితులు సంగీతపరమైనది.

అనంత పద్మనాభరావు అంతరంగ తరంగంలో కేవలం స్త్రీ పాత్రలకు ప్రాధాన్యం ఇవ్వడం జరిగింది. ఇందులోని పాత్రలను చదువుతున్నప్పుడు పాత్రల ద్వారా రచయితనే మాట్లాడుతున్నట్లు అనిపిస్తుంది. రామాయణం అనగానే ముఖ్యమైన పాత్రలు అయినటువంటి సీత ఊర్మిళ కాకుండా ఎన్నో అప్రధాన పాత్రలను కూడా ప్రస్తావించడం జరిగింది. ఉదాహరణకు తాటక సునయన దేవి అంతరంగ తరంగంలో అనంత పద్మనాభరావుగారు 18 స్త్రీ పాత్రల ద్వారా కళ్లకు కట్టినట్లు చూపించడం విశేషం. చివరిగా ఉత్తర కాండ దుఃఖం అని చెప్పి దానిని వదిలేసి రాముడి పట్టాభిషేకంతో సంగ్రహ వాల్మీకి రామాయణాన్ని సుఖాంతంగా ముగించడం విశేషంగా చెప్పవచ్చు.

# ఐదవ అధ్యాయం

# ఐదవ అధ్యాయం

# బాల సాహిత్యం-విశ్లేషణ

## 5.0 తెలుగులో బాల సాహిత్యం—పరిచయం

ఏ సాహిత్యమైనా వివిధ కాలాల్లో వివిధ ప్రక్రియలతో విలసిల్లుతుంది. కాని ఇది బాలల కోసమని, ఇది యువకుల కోసమని, ఇది వృద్ధుల కోసమని ఏ సాహిత్యంలోనూ ప్రత్యేక విభాగాలుండే దానికి ఆస్కారం లేదు. ఎందుకంటే సాహిత్యం ఏ ఒక వర్గానికో, ఏ ఒక ప్రాంతానికో, ఏ ఒక వయసుకో పరిమితం అయితే సార్వజనీనం, సార్వకాలికం కాదు. ఏ కవి అయినా తన కావ్యం సార్వజనీనం, సార్వకాలికం కావాలని ఆకాంక్షిస్తాడు. అయితే కవి కృతిలో స్త్రీల గూర్చి, పురుషుల గూర్చి, బాలబాలికల గూర్చి, వృద్ధుల గూర్చి, యువకుల గూర్చి, కొన్ని కొన్ని ఘట్టాలలో సందర్భానుసారంగా ప్రసక్తి రావడం జరుగుతుంది. ఈ ప్రసక్తి కవి ప్రతిభ, వ్యుత్పత్తులపై గాక, కవిపై పరిసర ప్రాంతాల ప్రభావం, ఇష్ట దైవాల ప్రభావం, ఇష్ట వ్యక్తుల ప్రభావం ప్రత్యేకంగా కన్పిస్తుంది.

ఉదాహరణకు నన్నయ్య శకుంతలోపాఖ్యానంలో శకుంతల నోటివెంట బిడ్డను కౌగిలించుకున్న తండ్రి అనుభూతిని వ్యక్తం చేశాడు. 'పుత్రగాత్ర పరిష్వంగ' విషయంలో ఇది నన్నయ్య అనుభూతిని, అభిప్రాయాన్ని తెలిపే పద్యం. ఇక్కడ నన్నయ ఒక బిడ్డను గూర్చి చెప్పాల్సిన అవసరాన్ని  కంటే శకుంతల మనోభావాన్ని వ్యక్తం చేయడానికే ప్రాధాన్యం ఇచ్చినట్లు కన్పిస్తుంది. అయితే అనుభవం, ప్రతిభ, వ్యుత్పత్తి, లోకసంస్కారం పెనవేసుకొన్న కవిలో ఇటువంటి పద్యాలు మనకు గోచరమౌతాయి. ఈ పద్యం బాలుర కోసం గాని, బాలుర గురించి గాని చెప్పిన పద్యం కాక పోయినా, సాహిత్యంలో 'బాలసాహిత్యం' అని పరిశీలించాల్సి వస్తే ఈ పద్యాన్ని గ్రహించవచ్చు.

సాహిత్యంలో వయస్సును బట్టి విభాగం లేకపోయినా పరిశీలనార్థం బాలసాహిత్యాన్ని ప్రత్యేకంగా గ్రహించి పరిశోధనలు చేయడం జరుగుతూ ఉంది. అట్లే అన్నమయ్య తన ముప్పైరెండు వేల సంకీర్తనల్లో బాలుర కోసం గాని, బాలుర గురించి గాని ప్రత్యేకంగా సంకీర్తనలు వ్రాయలేదనడం స్ప,టం. అయితే ఆ మహామహుడి గళం నుంచి జారిన సుమధుర మధు వాగ్ధారల్లో తొక్కుపలుకుల బాలుర గూర్చి, తప్పటడుగుల పసికందుల గూర్చి, ఆటపాటల్ని గూర్చి, వారి ఆగడాల్ని గూర్చి, ఇంకా ఎన్నిటినో గూర్చి ఉంది. ఆయన కీర్తనల్లో ఇలాంటి సందర్భాన్ని ఒకచోట చేర్చి పరిశీలిస్తే అన్నమయ్య ఆ కాలంలో పసిబాలుర విషయాలు ఎలాంటివో, వాటిని ఆయన ఏ విధంగా వివరించాడో, ఆ నాటి సాంఘిక పరిస్థితులు ఎలా ఉండేవో తెలుసుకోవడానికి అవకాశం కలుగుతుంది. అనన్య భక్తి మహిమోపేతులైన అన్నమయ్య వంటి మహాత్ములైన వాగ్గేయకారుల మధుర వాక్కలాపంలో పారవశ్య మహితాలూ, భక్తిరస భావలలితాలూ అయిన బాల భగవానుల విషయాలు మనసుల్ని ఎలా పులకింప చేస్తాయో ఈ ప్రయత్నం వల్ల తెలుసుకోవచ్చు.

అన్నమయ్య బాల సాహిత్యాన్ని ప్రత్యేకంగా పరిశీలించే దానికిముందు 'బాల' శబ్దాన్ని గూర్చి తెలుసుకోవాల్సిన ఆవశ్యకత ఉంది. బాలశబ్దవ్యుత్పత్తి నిఘంటు, స్మృతి, గీత శాస్త్రాదుల్లో ఎలా ఉందో పరిశీలించాలి. కనుక మొదట నిగంటువులోని బాలశబ్ద విషయాన్ని చూడాలి.

## 5.1 నిఘంటువులు 'బాల' శబ్ద వ్యుత్పత్తి

'బలప్రాణవే – బలతి అల్పాయాసేన బాలః'[124]

– అల్పాయసంతో బ్రతికేవాడు బాలుడు.

'వలసంచలనే – వలతి ఇతి బాలః'[125]

[124] గురుబాల ప్రబోధిక .

– సంచలించేవాడు బాలుడు.

నిత్యం చలించే మనస్సు కలిగనవాడు, నిల్చిన చోట నిలువని మనశ్శరీరాలు కల్గినవడాని, క్రీడాసక్తుడని, సుఖంగా, శాంతంగా, దిగులు లేకుండా బ్రతికేవాడని, ఇతరులపై ఆధారపడినవాడు కాబట్టి 'అల్పాయాసేన' అని 'బాల' శబ్దానికి నిర్వచనం చెప్పబడింది అని నైఘంటిక బాలశబ్ద వ్యుత్పత్తి సారాంశం.

'ఆషోడశాద్భ వేద్బాలః తతస్తరుణ ఉచ్యతే'[126]

– వరకు బాలుడు తర్వాత తరుణుడు.

'గ్రహణధారణ పటుద్బాలః' – అని శాస్త్ర నిర్వచనం.

గ్రహణధారణ పటువు బాలుడని పండితుల అభిప్రాయం. అంటే విషయాన్ని గ్రహించి జ్ఞాపకముంచుకునేవాడూ, చెప్పింది చక్కగా గ్రహించి మనస్సునందుంచుకునేవాడని అర్థం.

బాల శబ్దం వృద్ధ శబ్దానికి వ్యతిరేకం. వృద్ధుడంటే వయస్సులో, మనస్సులో పెద్దవాడు. బాలుడంటే వయస్సులో, మనస్సులో చిన్నవాడు. వృద్ధుడిది వికాసం పొందిన మనస్సు. బాలుడిది అప్పుడే వికసిస్తున్న మనస్సు. బాలుడి మనస్సు ఆర్ద్రంగా, సున్నితంగా ఉంటుంది. అలాంటి బాలల మనస్సులను ఉన్నతంగా, ఉత్తమంగా తీర్చిదిద్దే దానికి సాహిత్యం ఒక గొప్ప సాధనం.

బాలబాలికలకు వినటానికి, చదవటానికి ఉద్దేశించబడిన రచనలే బాల సాహిత్యం. ఇది వారు చదువుకోదగిన, నేర్చుకోదగిన లేదా వినదగిన సాహిత్యం. ఇది ప్రధానంగా బాలల ఉపయోగార్థం సృష్టించబడినది.

---

125 మనుస్మృతి .

126 మనుస్మృతి.

భారతీయ సిద్ధాంతాన్ని బట్టి మానవుడి జీవిత ప్రమాణం నూరేండ్లు. ఆ నూరేండ్ల ప్రాయాన్ని బాల, కౌమార, యౌవన, వార్ధక్యాలని నాలుగు విధాలుగా విభజించడం శాస్త్ర సమ్మతం.

భగవద్గీతలో కౌమార, యౌవన, జరాస్థితులు మాత్రమే చెప్పబడ్డాయి[127].

ఈ అభిప్రాయమే శంకరాచార్యుల వారి భజగోవింద శ్లోకాల్లోనూ తెలుపబడినది.

'బాలస్తావ త్క్రీడాసక్త స్తరుణ స్తావ త్తరుణీ సక్తః

వృద్ధస్తావ చ్చిన్తాసక్తః పరమే బ్రహ్మణి కోపినసక్తః'[128]

బాలుడు క్రీడాసక్తుడు అన్న విషయం ఇక్కడ తెలుస్తుంది. అలాగే ఇతర దశల ఆసక్తులూ తెలుస్తాయి.

పసిబిడ్డను లాలించే విధానాన్ని గూర్చిన ప్రసిద్ధ శ్లోకం కూడా కలదు.

'రాజ వత్పంచ వర్షాణి

దశవర్షాణి దాసవత్

ప్రాస్తేతు షోడశే వర్షే

పుత్రం మిత్ర వదా చరేత్'

ఈ శ్లోకం బాల, కౌమార, యౌవన దశల్ని స్పష్టంగా నిర్దేశించకపోయినా వయః పరిమితి క్రమాన్నే సూచిస్తుంది.

---

[127] "దేవానోఽ స్మిన్యథా దేహే కౌమారం యౌవనం జరా
తథా దేహాంతర ప్రాప్తి ర్ధీర స్తత్ర నముహ్యతి -"భగవద్గీత2 ,వ అధ్యాయం .శ్లోకం 13 –

[128] బాలశబ్ద వివరణ– భజగోవింద శ్లోకములు , ఆది శంకరాచార్యులు .

'బాలానాం సుఖబోధాయ క్రియతే తర్క సంగ్రహః' అని అన్నంభట్లు తర్క సంగ్రహం ఆరంభంలో ఉంది.

మానవ జీవితంలో ప్రథమ దశ బాల్యదశ. ఇది మనిషి జీవితంలో చీకూ చింతా తెలియని దశ. అమాయకత్వానికి, మంచితనానికి బాల్యం మరో పేరు. దీనివల్లనే పిల్లల్ని పరబ్రహ్మ స్వరూపాలుగా పెద్దలు భావిస్తారు.

బాల్యం నుండి పదునాలుగు సంవత్సరాల వరకు వారి వారికనువైన సాహిత్యాన్ని బాల సాహిత్యమనవచ్చని 'బాల వాఙ్మయం' అనే రచనలో ఎ. లక్ష్మీనారాయణగారు తెలిపారు.

బాలబాలికలు ఈనాడు తమ వయస్సుకు మించిన మనోవికాసాన్ని పొందగల్గుతున్నారు. కావున పుట్టినప్పటి నుంచి పదిహేనేండ్ల వరకు బాల్యదశగా పరిగణించవచ్చు.

ఈ బాల్యదశను పిల్లల పెరుగుదలలో, మనః ప్రవృత్తిలో కలిగే మార్పుల్ని బట్టి మూడు దశలుగా విభజించవచ్చు.

## ప్రథమ దశ

పిల్లలు పుట్టినప్పటినుంచి ఐదేండ్ల వరకూ ప్రథమ దశగా భావించవచ్చు. ఇందులో మూడేండ్ల వరకూ మరి పసితనం, ఆ తర్వాత పరిసరాల ప్రభావానికి స్పందించే మానసిక పరిణతి పిల్లల్లో కన్పిస్తుంది.

ప్రథమదశలోని బాలలకు చాలా ప్రీతికరమైంది శ్రవ్య సాహిత్యం. అంటే పిల్లల్ని ఉద్దేశించి తల్లులు పాడే జోల పాటలు, లాలి పాటలు, చందమామ పాటలు మొదలైనవన్ని శ్రవ్య సాహిత్యానికి చెందినవే. ఇవన్నీ ప్రథమదశలో పిల్లలకు ఉల్లాసాన్ని కలిగిస్తాయి. దృశ్యరూపమైన రంగురంగుల బొమ్మలు వారికి ఆకర్షకంగా కన్పిస్తాయి.

## ద్వితీయ దశ

ఐదు పది సంవత్సరాల వరకు మధ్యగల బాల్యాన్ని ద్వితీయదశగా పరిగణించవచ్చు. ఐదేండ్లు నిండిన పిల్లల మాటల్లో కొంత మానసికమైన ఎదుగుదల కన్పిస్తుంది. ఈ వయస్సు పిల్లలు క్రమంగా పాటల్ని, కథల్ని అర్థం చేసుకోవడమే గాక, సులభ శైలి రచనల్ని చదివి విషయ గ్రహణ శక్తిని పెంపొందించుకోగలరు.

ద్వితీయదశలోని పిల్లలకు బొమ్మలతో కూడిన దృశ్యసాహిత్యం ఎక్కువగా ఉపకరిస్తుంది. శ్రవ్య సాహిత్యంలో శబ్దం ప్రధానమైతే, దృశ్య సాహిత్యంలో బొమ్మలు ప్రధానం. రంగు రంగుల బొమ్మలతో కూడిన పుస్తకాలు, నాటికలు, సినిమాలు, టెలివిజన్లు మొదలైనవన్ని దృశ్య సాహిత్యానికి చెందినవే.

## తృతీయ దశ

బాల్యంలో పదకొండు సంవత్సరాలనుండి పదిహేనేండ్ల వరకు తృతీయ దశ. ఈ దశమ కౌమారం అని కూడా అంటారు. సాధారణంగా పదకొండు సంవత్సరాల వయస్సు నుండి పిల్లల మనః ప్రవృత్తిలో ప్రత్యేకమైన మార్పులు గోచరిస్తాయని శాస్త్రజ్ఞుల అభిప్రాయం.

తృతీయ దశలోని పిల్లలకు పఠన సాహిత్యం ఎక్కువగా ఉపకరిస్తుంది. పఠించి అర్థం చేసుకోగలిగే సాహిత్యం పఠన సాహిత్యం. ఇది వివిధ సాహితీ ప్రక్రియలతో కూడుకొన్న సాహిత్యం. వచన రూపంలో ఉన్న నీతికథలు, అద్భుతకథలు, హాస్యకథలు, వీరగాథలు మొదలైనవాటిని పఠించడం ద్వారా తృతీయ దశలోని పిల్లలు మనోవికాసాన్ని పొందుతారు.

తెలుగులో బాలసాహిత్య విషయాన్ని మనం పరిశీలిస్తే వివిధ కాలాల్లో వివిధ విధాలుగా దాని అభివృద్ధి మనకు కన్పిస్తుంది. ఏ సాహిత్యంలో అయినా బాల వాఙ్మయం సహజంగా గేయరూపంలోనే ప్రారంభమౌతుంది. ఈ గేయ సాహిత్యం జానపద సాహిత్యంలో

విలీనమై ఉండేది. గేయమే ఏ వాఙ్మయంలో ఐనా కవితా పరిణామంలో ప్రథమదశ. ఆటపాట రూపమైన ఈ గేయకవిత, ప్రారంభదశలో ఒక వ్యక్తిని గాని, ఒక సమూహాన్ని గాని ఆశ్రయించి, అవతరించి ఉండవచ్చని పెద్దల అభిప్రాయం.

మనకు ప్రాచీన బాలగేయ సాహిత్యంలో బాలల నుద్దేశించి పెద్దలు పాడే పాటలే అధికంగా కన్పిస్తాయి. దీనికి బహుశ ఈ బాలగేయ సాహిత్యానికి కర్తృత్వం, మాతృ హృదయం కావడమే కావచ్చు. ప్రాచీన కాలంనుండి తెలుగులో వెలువడిన లాలిపాటలు, జోలపాటలు పరిశీలిస్తే తెలుగు తల్లులు తమ బాలలకు ఉగ్గుపాలతోబాటు సంగీత సాహిత్యాలని రంగరించి పోసినారనిపిస్తుంది.

ఎఱ్ఱన ఉత్తర హరివంశంలో, పాల్కురికి సోమనాథుని బసవపురాణంలో, వెన్నెలకంటి సూరన విష్ణుపురాణంలో, ధూర్జటి కాళహస్తీశ్వర మహాత్మ్యంలో, తెనాలి రామకృష్ణుని పాండురంగ మాహాత్మ్యంలో, ధరణిదేవుల రామయ్య మంత్రి దశావతార చరిత్రలో, అయ్యలరాజు నారాయణామాత్యుని హంసవింశతిలో బాలల ఆటపాటల వర్ణనలు మనకు కన్పిస్తాయి.

తాళ్ళపాకవారి కీర్తనల్లో బాలగేయాల ప్రస్తావన విరివిగా ఉంది. ప్రత్యేకించి అన్నమయ్య సంకీర్తనలలో లాలిపాటలు, జోలపాటలు, ఉగ్గుపాటలు, ఊయలపాటలు మొదలైనవెన్నో కన్పిస్తాయి.

గ్రంథస్తమైనవే కాక ప్రాచీన బాలసాహిత్యంలో మౌఖికమై అనుసృతంగా వస్తున్న గేయాలు, అమ్మమ్మలు చెప్పే కాశీ మజిలీ కథలు, పిట్టకథలు, పేదరాశి పెద్దమ్మ కథలు మొదలగునవి కాలగర్భంలో పోయినవి. పోగా ఇంకా ఎన్నో మనకు లభిస్తున్నాయి. ఇవన్నీ కూడా బాలలను ఆనందింపచేసేదానికే కాక, వారికి మానసిక వికాసాన్ని కూడా కల్గించే దానికి జాలువారినవే.

అలాగే పిల్లల ఉత్సాహాన్ని పెంపొందించేందుకు, వారి ఊహాశక్తిని పెంచేందుకు, వారికి లోకనీతిని, జ్ఞానాన్ని వివరించేందుకు పంచతంత్ర కథలు మొదలైనవెన్నో వెలిశాయి. అంటే మొదట గేయరూపంగా ఉన్న ఈ బాలసాహిత్యం క్రమక్రమంగా చారిత్రక గాథలు, నీతికథలూ, సాహస గాథలకూ నిలయమైంది. 19వ శతాబ్దం తరువాత బాలసాహిత్యాన్ని పరిశీలిస్తే ఈ బాలసాహిత్యం అనేక విధాలుగా వికసించిందని చెప్పవచ్చు. ఆంగ్ల భాషా ప్రభావం కూడా ఈ వికాసానికొక కారణం.

తెలుగు సాహిత్యంలో వెంకట పార్వతీశ్వర కవుల్ని బాలసాహిత్య స్రష్టలుగా పేర్కొనవచ్చు. గురజాడ అప్పారావుగార్ని బాలవాఙ్మయ వైతాళికులుగా చెప్పవచ్చు. కుమారీ శతకాదులు, తెలుగు బాలవంటి శతకాలు కూడా కంద, గీత పద్యాల్లో వచ్చాయి. ఆధునిక కాలంలో పత్రికలు, రేడియోలు, టెలివిజన్లు బాలసాహిత్య వికాసం కోసం తమవంతు ప్రయత్నాన్ని చేస్తూనే ఉన్నాయి.

బాలసాహిత్యం దినదినాభివృద్ధి చెందుతూనే ఉంది. అన్నమయ్య బాలలకోసం వ్రాసిన సాహిత్యాని కంటే, బాలలకు సంబంధించిన సాహిత్యం ఎక్కువగా వ్రాశారు. అది వివిధ రకాలుగా అన్నమయ్యలో మనకు కన్పిస్తుంది. స్థూలదృష్టికి బాలసాహిత్యమే అని మనం అన్నా, దాన్ని అనేక రకాలుగా వింగడించి పరిశీలించేదానికి అవకాశమేకాక అవసరం ఉంది.

## 5.2 ఇతర భాషల్లో బాల సాహిత్యం

ఇతర భాషల్లో అనేక రకాల బాలసాహిత్యం అని అన్నప్పటికీ ఇందులో కేవలం క్రిష్ణ కథాత్మకమైన బాలసాహిత్యమే గ్రహించబడుతుంది.

## 5.2.1 తమిళంలో బాలసాహిత్యం

ద్రావిడ భాషల్లో ప్రాచీనమైన తమిళ సాహిత్యంలో కృష్ణాత్మకమైన బాలసాహిత్యం ఎలా రూపొందించారో మొదట పరిశీలించాలి.

వైష్ణవ భక్తి సంప్రదాయంలో భక్తిసముద్రానికి ఏతమెత్తిన మహాభక్తి కర్షకులు ఆళ్వార్లు. తమ కీర్తనల్లో విష్ణువు దశావతారాల్ని వీళ్ళు కీర్తించారు. అన్ని అవతారాలకన్నా వీరు క్రిష్ణావతారానికే ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చారు. ఎన్నో మార్గాల్లో ఆ అవతారం పట్ల విశేష భక్తిప్రపత్తుల్ని వారు ప్రకటించారు. అన్నమయ్య కూడా వారి మార్గాన్ని దశావతారాల విషయంలో అనుసరించాడు.

ఆళ్వార్లలో పేయాళ్వార్, కులశేఖరాళ్వార్, పెరియాళ్వార్లను ప్రత్యేకించి ఇందుకు గ్రహించడం జరిగింది.

ఆళ్వార్లలో బాలకృష్ణుణ్ణి కీర్తించినవారిలో పేయాళ్వార్ చెప్పదగ్గవాడు. ఈయన కృష్ణుణ్ణి మనసా, వాచా, కర్మణా స్మరిస్తూ చేసిన కృష్ణ సంకీర్తన 32 పద్యాలకు పరిమితమైంది.

తర్వాత కులశేఖరాళ్వార్ తన 27 పద్యాల్లో కృష్ణుణ్ణి స్మరించాడు. ఆ స్మరణలో కృష్ణుడి బాల లీలల్ని తాను చూడలేక పోయినాను అనే తీవ్రతరమైన ఆవేదనను అభివ్యక్తం చేశాడు. ఎలాగైనా బాలకృష్ణుడి లీలావిశేషాల్ని చూడగలిగే ఉపాయాన్ని చూపమని సర్వేశ్వరుణ్ణి మనసారా ప్రార్థించాడు. ఆ అభ్యర్థన ప్రార్థనారూపమైనట్టిది. భక్తిలో ఇది ఒక విశిష్ట మార్గం. ఇది మధురభక్తి సంప్రదాయానికి చెందింది. తన్ను తాను మరచి అణువణువులో కృష్ణాంశను ప్రత్యక్షీకరించుకొని తన్మయం చెందడం, విశేషించి తనను నాయికగా పురుషోత్తముడైన బాలకృష్ణుణ్ణి నాయకుడిగా భక్తుడు భావించుకోవడం ఇందులో కన్పిస్తుంది.

పెరియాళ్వార్ క్రిష్ణావతార కథను భావించి 233 కీర్తనల్ని రచించాడు. శ్రీకృష్ణావతార కథలో ప్రముఖమైన కృష్ణ జననం, యదుకులరక్షణ, గోపికలతో క్రీడించడం. కంసవధల్ని ఒకే పద్యంలో స్మరించాడు. ఇది బాలకృష్ణ లీలామాలికలాగా మనోహరంగా ఉంది.

రాత్రివేళ జన్మించి, గోకులాన్ని ప్రవేశించి, ప్రేతల భయాన్ని వారించి, బలవంతుడైన కంసుణ్ణి వధించి అతని దేహాన్ని పొర్లించినవాడు, తమ పట్టుపుట్టాల్ని అపహరించినవాడు ఈ బాలకృష్ణుడే అని గోపికలు అన్నట్లు పెరియాళ్వార్ ఒక కీర్తనలో మనోహరంగా భావించాడు[129]. ఈ విధంగా ఎన్నో మధుర రస భావించితాలైన బాల సాహిత్య కీర్తనల్ని ఉదహరించవచ్చు. ఆళ్వార్ల కృష్ణభక్తి ఎన్నో రకాల ఎంతో వైశిష్ట్యాన్ని సంతరించుకొంది.

## 5.2.2 కన్నడంలో బాలసాహిత్యం

కన్నడ సాహిత్యంలో కేవలం పురందరదాసు రాసిన బాల సాహిత్యాన్ని ప్రస్తుత పరిశీలనలో గ్రహించడం జరిగింది. పురందరుల బాలక్రిష్ణ సాహిత్య పరిశీలనకు ముందు ఆయన జీవితరేఖల్ని కొంతవరకైనా ప్రసరింప జేయడం సమంజసంగ ఉంటుది. కన్నడ సంకీర్తనాచార్యుడైన పురందరదాసు అన్నమయ్య కాలానికి యవ్వనదశలో ఉన్నాడు[130]. కన్నడంలో లక్ష దాకా సంకీర్తనల్ని చేసి, కర్నాటాంధ్ర ద్రావిడ మహారాష్ట్రాల్లో కూడా పరమభక్తుడుగా, వాగ్గేయకారుడుగా ఆరాధించబడ్డాడు.

---

[129] ఇరువెట్టి యాల్ విరందు పోయ్ ఏళై వల్లాయర్
మరుట్టైత్త విర్పిత్తువన్ కంజన్ మాళ
పురట్టి యన్నా ళెంగళ్ పూంపట్టు కొండ
అరట్టన్......

[130] అన్నమయ్య కాలం క్రీ ,1503–1408 .శ.పురందరదాసు కాలం .1564–1484కాగా
పురందరదాసు అన్నమయ్య నిష్క్రమణ కాలానికి సుమారు సం॥ మధ్య వయస్సులో ఉన్నాడు .

పురందరదాసు లాక్షణికుడుగా కాక, కర్నాటక సంగీత సంప్రదాయంలో లక్ష్యాలుగా, నాదకల్పనాత్మకాలై, ధాతు, మాతు సంయుతాలైన ఎన్నో కీర్తనల్ని చేసాడు. ఈయన రచనల్లో ఎక్కువ భాగం సంకీర్తనలే.

పురందర దాసు కొంతకాలం పునహ[131]నగరంలో ఉన్నట్లు తెలుస్తుంది. తర్వాత ఈయన విజయ విద్యానగరంలో ఉన్నాడు. శ్రీకృష్ణదేవరాయలు ఈయనకు సమకాలీకుడే.

నలభై ఏండ్ల ప్రాయంలో ఈయన వ్యాసతీర్థులవారి వద్ద ఉపదేశాన్ని పొంది, పురందరదాసుగా ప్రసిద్ధి చెందినాడు.

అన్నమయ్యవలెనే పురందరులు కూడా సంకీర్తనాత్మకాలైన పదాలనేకాక, బాలక్రిష్ణ లీలాత్మకాలైన కీర్తనల్ని, గోపికా గీతాల్ని, గోపికలు యశోదతో చేసిన విన్నపాల్ని, కృష్ణ విరహాతురలైన గోపికల విరహ గీతాల్ని, ఇంకా ఎన్నో రకాల కీర్తనల్ని వైవిధ్యంతో గానం చేశారు. ఈయన కీర్తనలు పురందర విఠలుడికి అంకితాలు. అన్నమయ్యకు ఏడుకొండలస్వామి ఎట్లో పురందరులకు విఠలుడు అట్లే.

హంపీలో ఒకే మంటపంలో ఈయన ఎక్కువ కాలం ఉండడంవల్ల దానికి 'పురందరదాస మంటపం' అన్న పేరు వచ్చింది. జీవితం మలిసంధ్యలో తురీయాశ్రమాన్ని స్వీకరించాడు. రక్తాక్షి అమావాస్య పర్వదినం నాడు కారణజన్ముడైన పురందర దాసు ఇహ జీవితయాత్ర చాలించాడు[132].

అల్లరి పిల్లల విషయంలో భయపడే తల్లుల మనస్తత్వాన్ని యశోద ద్వారా పురందరదాసు నిరూపించారు. దుడుకుతనం ఉన్న తన బాలకృష్ణ కుమారుణ్ణి యశోద ఆతడి

---

[131] ఇది మహారాష్ట్ర .కర్నాటక రాజ్యాల సరిహద్దు ప్రాంతం ,

[132] రక్తాక్షి నామ సంవత్సర పుష్య అమావాస్య పురందరుల మహా ప్రస్థాన 1564)జనవరి 2.

దుడుకుచేతల్ని కొడుకుకి వివరిస్తూ భయపడడాన్ని ఈ క్రింది కీర్తనలో పురందరదాసు అభివర్ణించాడు.

**'కణ్ణముందిరో రంగ కణ్ణముందిరో'**[133]

**'కంటి ముందుండు రంగ కంటి ముందుండు'** — అని భావం.

పూతన చన్నుదాగి తృణావర్త శకటాసురాది దైత్యులను కూల్చిన నీ దుడుకుతనానికి రంగా! భయపడుతున్నాను.

చెట్టెక్కి మడుగులో దూకి పాము పడగల్ని తొక్కిన నీ దుడుకుతనానికి భయపడుతున్నాను.

గోపికల ఇళ్లకు వెళ్ళి పాలు పెరుగుల్ని దొంగిలించి తాగవద్దు. పురందర విఠలా! నా కళ్ళ ముందరే ఉండు. ఎక్కడికీ వెళ్లవద్దు.

పై కీర్తనలో యశోద భయానికి ఒక వంక హేతువుల్ని కూరుస్తూ, మరో వంక బాలకృష్ణుడి లీలల్ని కూడా ధ్వనింప చేయడం పురందరదాసుకే చెల్లింది. ఈ ప్రక్రియ ఇతని కన్నా ముందువాడైన అన్నమయ్యలో కూడా ఉంది.

## 5.2.3 హిందీలో బాలసాహిత్యం

తమిళ, కన్నడ సాహిత్యాల్లోని బాలకృష్ణ లీలా విశేషాల్ని పరిశీలించిన తర్వాత, భారత జాతీయ భాష సాహిత్యమైన హిందీలో పరమ భక్తుడు, కారణజన్ముడు అయిన సూరదాసు బాలకృష్ణ లీలా విశేషాల్ని రేఖామాత్రంగానైనా పరిశీలించాలి. దానికి ముందు సూరదాసు సంగ్రహ పరిచయం అవసరం అనిపిస్తుంది.

---

[133] శైశవలీల పుట. 50.

దాస సాహిత్యంలో సూరదాసుకు సమధిక స్థానం ఉంది. కొందరు ఇతడ్ని పుట్టు గుడ్డి అని అంటారు. చర్మ చక్షువుల సంగతి ఎలా ఉన్నా, ఈతడి ప్రజ్ఞాచక్షువు నుండి వెలువడిన వెలుగురేఖలు సాహిత్యాన్ని తేజోమయం చేశాయి. చర్మ చక్షువులకు కనపడని ఎన్నో మహత్తర విషయాల్ని ఈయన ప్రజ్ఞా చక్షువు దర్శించింది. ఇతడు పారదృశ్య.

మహాసారస్వత బ్రాహ్మణుడైన సూరదాసు, మధుర ప్రాంతంలో ఉన్న రేణుకా క్షేత్రంలో జన్మించాడని ప్రతీతి. ఇతడు ఆ బాల్యభక్తుడు. గాయకుడు. కవి. వెరసి వాగ్గేయకారుడు.

ఇతడు బాల్యం నుంచే విరాగి. అందుకే చిన్నతనంలోనే ఇల్లు విడిచి గ్రామ బాహ్యప్రదేశంలో ఒక కుటీరాన్ని నిర్మించుకొని తర్వాత కాలంలో శకునాలు చెప్పుకుంటూ ఉండేవారట. కొందరు ఈయన వద్ద సేవకులుగా చేరి భజన గోష్ఠుల్లో పాడుకుంటూ భక్తులై దాస్వాశ్రమంలో ఆశ్రయాన్ని పొందేవారు.

ఏ కారణం చేతనూ సూరదాసు తన ఆశ్రమాన్ని 'గౌఘట్'లోనికి మార్చివేశాడు. ఇది ఆయన ఆధ్యాత్మిక జీవితంలో ఒక మలుపు అనే చెప్పాలి. ఇక్కడే వల్లభాచార్యుల వారి దర్శనం, ఉపదేశం సూరదాసుకు ప్రాప్తించాయి. వల్లభాచార్యులవారిది శుద్ధాద్వైతం. దాసు ఇందులో దీక్షితుడైనాడు. తద్వారా 'పుష్టిమార్గ' భక్తి శిఖరాల్ని అధిరోహించాడు.

వల్లభులు వినయపదాలకు (భగవంతునితో దైన్యాన్ని ప్రకటించే పదాలు) మారు లీలాపదాల్ని (భగవల్లీలల్ని) పాడమని ప్రోత్సహించడమే కాక దానికి ఊతగా దాసుకు భాగవతానుక్రమణకు ఉత్తేజపరచి ఉపదేసించాడు. అనతంరం వల్లభాచార్యుల వారు సూరదాసును గోవర్ధనగిరి మీద ఉన్న శ్రీనాధ దేవాలయానికి తనతో తీసుకుని వెళ్ళి ఆ స్వామి సంకీర్తన సేవకు నియమించాడు. వల్లభుల అనంతరం వారి కుమారుడు గోస్వామి విఠలదాసు కూడా సూరదాసును సంకీర్తన గాయకుడు గానే గౌరవించాడు. అంతేగాక సూరదాసు వంటి

ఎనిమిది మంది కవుల్ని కూర్చి గోస్వామి విఠలదాసు 'అష్టచాప్' అనే పేరుతో ఏర్పాటు చేశాడు. వారిలో సూరదాసుది అధ్యక్ష స్థానం.

సూరదాసు కవిత భాగవతం ఆధారంగా ప్రవర్తిల్లినా అన్ని ముక్తకాలే. విశేషించి భాగవత దశమస్కంధ పూర్వభాగ పరిమితాలైన పదాలే అందులో అధిక భాగం. అందులో కూడా కృష్ణ కథాత్మకాలైన బాలలీలలతోపాటు రాధాక్రిష్ణ ప్రేమలీలలు, రాసక్రీడలు ప్రధానంగా ఉన్నాయి.

సూరదాసు వర్ణించిన బాల లీలలు భాగవతానికే పరిమితం అయినా అందులో ఆయన భావుకత, కాల్పనికత, అనుభవ జ్ఞానం కూడా గోచరిస్తాయి. కృష్ణుడి జన్మం మొదలుకొని వయోనుగుణాలైన సంస్కార భేదాల్ని వర్ణిస్తూ విషయాన్ని కళ్ళకు కట్టినట్లు చిత్రించాడు. అందుకే విశ్వవాత్సల్య సాహిత్యంలో సూరదాసుకు అగ్రతాంబూలం చిక్కింది. వాత్సల్య రసపోషణలో తర్వాతి తరాల వారికి సూరదాసు అవకాశమీయలేదన్నా సహజోక్తిగానే ఉంటుంది.

ఏతాదృశ భక్తిరస నిర్భరుడైన సూరదాసు బాలకృష్ణ సాహితీక్షేత్రంలో ప్రవహించి సారవంతం చేసిన భావామృతధారలో క్రుంకులిడడం అనంతర కర్తవ్యం.

**'జననీదేఖి బలిజాతి'**[134] అన్న కీర్తన కవితలో బాలకృష్ణుడు దోగాడుతూ మణిరత్నమయమైన వాకిట్లో తన ప్రతిబింబాన్ని చూచుకొని అమాయకంగా పట్టుకోబోయినట్లు, దాన్ని చూచిన యశోదానందులు ఆనంద పారవశ్యం చెందినట్లు సూరదాసు భావించాడు.

---

[134] దశమస్కంధము– సాగర్‌సూర్ ,71 , సూరదాసు .

అలాగే మరో పాటలో సూరదాసు, ఆడుకోవడానికి కృష్ణుడు చంద్రుణ్ణి బొమ్మగా కావాలని కోరేదాన్ని వర్ణించాడు[135]. అందని వస్తువుల్ని, ఆకర్షణీయంగా ఉన్న వస్తువుల్ని పసిపిల్లలు కావాలనడం పరిపాటే. అందుకు పట్టుబట్టడం కూడా మామూలే. తల్లులు ఏదో ఉపాయంతో గోముతో గోలచేసే పిల్లల్ని సమాధానపర్చడం కూడా సహజమే. ఈ సహజ సుందరమైన భావనావిశేషాన్ని సూరదాసు ఈ గీతంలో కన్నులకు కనిపింప చేశాడు.

మారాము చేస్తున్న బాలకృష్ణుడికి యశోదా మాత ఒక పళ్ళెంలో నీళ్ళుపోసి, అందులో చంద్రుడి ప్రతిబింబాన్ని చూపుతూ కృష్ణుడికి ఇచ్చినట్లు కవి వర్ణించాడు. బాలకృష్ణుడు ఆ పళ్ళెరాన్ని ఆడించి, ఊగే చంద్రుడి ప్రతిబింబాన్ని చూచి ఆనందించాడు[136].

కృష్ణుడు చంద్రుణ్ణి రమ్మని పిల్చినట్లు, అది రానందుకు కృష్ణుడు ఏడ్చినట్లు యశోద "నీ ముఖం చూసి చంద్రుడు చిన్నబోయి పారిపోతున్నాడని చెప్పి"నట్లు కవి ఒక గీతంలో వర్ణించాడు[137].

తలమీద నెమలి పింఛము, మొలకు గంటల మొలతాడు, పాదాలకు మణినూపురాలు, మెడలో హారం, కస్తూరి బొట్టు, పీతాంబరంతో ముగ్ధ మనోహరమైన రూపంతో తలవాకిట దోగాడే చిన్నికృష్ణుణ్ణి చూచి యశోద ఆనంద పారవశ్యంతో ఆ దృశ్యాన్ని నందుడికి చూపిన శైశవలీలను ఈ పాటలో సూరదాసు అభివర్ణించాడు.

నిజానికి ఇది యశోద పరవశం కాక సూరదాసు పొందిన ఆనంద పారవశ్యమే అనిపిస్తుంది. ఆ గీతం ఇది...

**"ఆంగన ఖైలై నందకే నంద జదుకుల కుముద సుఖద చారు చందా"**[138].

[135] 'మయ్యా మైతో చంద్ ఖిలౌనా లైహుమ్– (193 – .స్కం.ద) సాగర్‌సూర్ ,' సూరదాసు .

[136] సూర్‌సాగర్ – (195 – దశమస్కంధము) సూరదాసు .

[137] సూర్‌సాగర్ – (196 – దశమస్కంధము) సూరదాసు .

సూరదాసు ఇందులో శాబ్దికంగా, ఆర్థికంగా భావనా సౌందర్యాన్ని ప్రతిపాదించాడు. రమణీయ భావనాత్మికత ఇందులో ఆర్థిక సౌందర్యాన్ని ప్రతిపాదించగా 'నందకే నంద', 'జదుకుల కుముద సుఖద చారు చందా' ప్రయోగాలు శాబ్దిక సౌందర్యాన్ని చిందిస్తున్నాయి. ఆద్యంతాల్లో బిందుపూర్వక 'ద' కారం, మధ్యలో 'ద'కార పౌనఃపున్యం ఇందలి ప్రత్యేకత. పై వాటికి మించిన మృదుల లలిత సంస్కృత పదయోజన దీనిలోని ప్రత్యేకత. ఇలాంటివి సూరదాసు కవితలో తామరతంపరలు.

ఇది తమిళ, కర్నాటక, హిందీ భక్తి సాహిత్యాల్లో ప్రసారితమైన బాలసాహిత్య పరిశీలించదగినది. ఆళ్వార్ల కాలం విభిన్నంగా ఉన్నా, అన్నమయ్య, పురందరదాసు, సూరదాసుల భావపరంపర ఇంచుమించు బాల సాహిత్యంలో ఒకేరకంగా ప్రసరించడం గమనించదగ్గది.

## 5.3 బాల సాహిత్యం–నిర్వచనం

తెలుగు సాహిత్యంలో బాలసాహిత్యానికి ప్రత్యేకత ఉన్నది. బాలల కోసం పెద్దలు రచించిన సాహిత్యం అది. బాలల్లో పఠనాసక్తిని పెంపొందించడానికి వారికి పురాణపరిచయం చేయడానికి సాహిత్యం పట్ల అవగాహన కల్పించడానికి ఈ రచనలు దోహదపడతాయి. మానవ జీవితంలో అపూర్వమైనది బాల్యం అని చెబుతూ ముళ్ళపూడి వెంకటరమణ 'బుడుగు' రచనను ఆకాశవాణి విజయవాడ కేంద్రంలో సమీక్షిస్తూ గుంటూరుకి చెందిన సి.హెచ్. సుశీల ఇలా అంటారు:

"మానవ జీవితంలో అపూర్వమైనది బాల్యం. గడిచిపోతే తిరిగి రాని క్షణాలు అవి. మళ్ళీ మళ్ళీ తలచుకుంటే మనస్సంతా ఆనందతరంగాలతో నింపే మధురమైన అనుభూతి అది. ఎలాంటి దిగులు, విచారం, చీకు, చింత లేకుండా సుఖంగా శాంతంగా హాయిగా

---

[138] సూర్‌సాగర్ – (735 – .స్కం.ద) సూరదాసు .

ఆడుతూ పాడుతూ బ్రతికేస్తారు పిల్లలు"[139]. అట్టి రచనలలో ముళ్ళపూడి వెంకటరమణ బుడుగు విశిష్టమైనది. బాలబంధు బి.వి. నరసింహారావు బాలసాహిత్య చరిత్రలో ఒక విశిష్ట వ్యక్తి. ఇతరులు కూడా ఈ బాలసాహిత్యాన్ని పరిపుష్టం చేయడానికి కృషి చేశారు.

## 5.4 అనంత పద్మనాభరావు బాలసాహిత్య కృషి

తిరుమల తిరుపతి దేవస్థానమువారు హిందూ ధర్మ ప్రచారంలో భాగంగా శ్రీనివాస బాల భారతి పేర ఒక వంద పుస్తకాలకు పైగా ప్రచురించారు. 1979–83 మధ్యకాలంలో తిరుపతిలో దేవస్థాన కార్య నిర్వహణాధికారిగా పనిచేసిన డా॥ పి.వి.కె.ఆర్. ప్రసాద్ ఎన్నో ప్రణాళికలు అమలుపరిచారు. ధార్మిక గ్రంథాలైన ఉషశ్రీ రచించిన భారతభాగవత రామాయణాల సంక్షిప్త ప్రతులను లక్షలాది కాపీలు ప్రచురించారు. అందులో భాగంగా బాలసాహిత్యం పేర ఒక శీర్షికను ఏర్పాటు చేసి ప్యాకెట్ సైజులో 60 పుటలకు మించకుండా వివధ ప్రసిద్ధ వ్యక్తులను గూర్చి బాలలకు పరిచయం చేశారు. అందులో భాగంగా 1981 ప్రాంతాలలో అనంత పద్మనాభరావు కడప కేంద్రంలో పనిచేస్తున్నప్పుడు ప్రధాన సంపాదకులు, సుప్రసిద్ధ పండితులు అయిన డా॥ ఎస్.బి. రఘునాథ చార్య కోరిక మేరకు పద్మనాభరావు తొట్ట తొలుత కర్ణాటక సంగీతత్రయంలో (త్యాగయ్య, ముత్తుస్వామి దీక్షితులు, శ్యామశాస్త్రి) ఒకరైన ముత్తుస్వామి దీక్షితుల గురించి ఒక చిరు గ్రంథం రాశారు. అది 1985లో శ్రీనివాస బాలభారతి – 40గా ప్రచురితమైంది. అది తిరుమల తిరుపతి దేవస్థానం వారి ధార్మిక గ్రంథాల పరంపరలో 224వ గ్రంథం. పాఠకుల ఆదరణ పొందిన ఈ గ్రంథంలో తొలి ప్రచురణలో 10,000ల కాపీలను ముద్రించారు. ఆ తరువాత 1999లో మరో 10,000 వేల కాపీలు ముద్రించారు.

[139] శతవసంత సాహితీ మంజీరాలు – ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయం ప్రచురణ – సంపాదకులు – ప్రయాగ వేదవతి, పుట:675.

## 5.4.1 యశోద గ్రంథం

శ్రీనివాస బాలభారతి శీర్షికలో 66వ ప్రచురణగా 1996 విజయదశమినాడు తిరుమల తిరుపతి దేవస్థానంవారి ఆధ్యాత్మిక గ్రంథ ప్రచురణల పరంపరలో 401గా ఈ గ్రంథం ప్రచురింపబడింది. రెండు వేల ప్రతులు ముద్రించారు. ఇదే పరంపరలో అనేక మంది ఋషులను గూర్చి పురాణ పాత్రల గురించి సంగీత విద్వాంసుల గురించి, భక్తులను గూర్చి వివిధ రచయితలు చిరు గ్రంథాలు రాశారు. రఘునాథచార్య సంపాదకత్వంలో అవి వెలువడ్డాయి.

## 5.4.2 భాగవతంలో యశోద పాత్ర

వ్యాసప్రోక్తమైన మహాభాగవతంలో యశోద పాత్ర అత్యంత ప్రధానమైనది. శ్రీకృష్ణుడు జన్మించినది దేవకికి కానీ, పుట్టిన మరుక్షణంలో అతడు యశోద పొత్తిళ్లలో చేరాడు. దేవకీ తనయుడు, యశోద నందనుడు అని కూడా అంటారు. దేవకికి పుట్టాడు. యశోదకి ఆనందం కలిగించాడు. పెరిగినదంతా యశోద వద్దనే. బాల్యక్రీడలన్నీ నంద, యశోదల సమక్షంలోనే. గోపికలతో విహరించాడు. పూతనాది రాక్షస సంహరణం, యశోద సమక్షంలోనే జరిగాయి.

గోపికలు అల్లరిచేస్తున్న శ్రీకృష్ణుడి గురించి యశోద ముందు ఏకరవు పెట్టినప్పుడు ఆమె వారినే మందలించింది.

యశోద నందులు బాలక్రిష్టునికి జాతకర్మలు చేయించారు. దానధర్మాలు సమృద్ధిగా చేశారు. గోపాలురు కానుకలతో వచ్చి కృష్ణున్ని దర్శించి ఆనందించారు. గోపికలు – మన యశోద చిన్ని మగవానిని కనెనట? చూచి వత్తామమ్మ సుదతులారా అంటూ కలిసికట్టుగా వచ్చి బిడ్డను చూచి సంతోషించారు. యశోద పూర్వ జన్మలో వసువుల్లో ఒకరైన ద్రోణుని భార్య. ఆమె పేరు ధర. ఈ ద్రోణుడు అస్త్ర విద్యలను నేర్పించిన ద్రోణుడు కాదు. ధరాదేవి దంపతులను బ్రహ్మదేవుడు భూలోకంలో జన్మించవలసిందిగా ఆజ్ఞాపించాడు. ఆ దంపతులు

మాకు నిరంతరం విష్ణు సేవాభాగ్యం కలిగేలా చూడమని ప్రాధేయపడ్డారు. వారు యశోద, నందులుగా జన్మించి శ్రీకృష్ణుని సేవాభాగ్యానికి నోచుకొని ధన్యులయ్యారు. ఈ వృత్తాంతాన్ని శుక మహర్షి చెప్పారు. ఆమె శ్రీకృష్ణుని ముద్దు మురిపాలతో జీవనాన్ని సార్థకం చేసుకుంది.

ఆమె శ్రీకృష్ణుడితో ఎంత ఆనందించిందో మనకు తెలియదుగానీ ఆమెతో చిన్ని కృష్ణుడు నానా యాగి చేశాడు. ఈ క్షణంలో ఇక్కడుంటాడు. మరుక్షణంలో ఏదో గోపిక ఇంట్లో పాలు, పెరుగు తాగుతుంటాడు. ఒకరోజు బిడ్డను అలా కూర్చోబెట్టి అతడు ఆడుకుంటూ ఉన్నాడులే అని తన పనిలో తాను నిమగ్నమై ఉంది. తృణావర్తుడు అనే రాక్షసుడు సుడిగాలిలా వచ్చే అతని ఆకాశానికి ఎత్తుకెళ్ళాడు. ఆ శిశువు అతనిని చంపి కిందికి వచ్చాడు. ఆమె అమాయకత్వానికి పరాకాష్ట. తన బిడ్డ అమాయకుడని లేనిపోని నిందలు గోపికలే చెబుతున్నారని ఆమె అనుమానం. శ్రీకృష్ణుని తాడుతో రోలుకి కట్టివేయాలని ఆమె విశ్వప్రయత్నం చేసింది. శ్రీకృష్ణుడు లొంగలేదు. అయినా తల్లి మీది ప్రేమతో బంధించబడ్డాడు. మద్దిచెట్లను కూల్చి సిద్ధులకు శాపవిమోచనం కలిగించాడు. యశోద ఎత్తిపొడుపుగా మాట్లాడిన మాటల్లో ఎంతో చమత్కారం ఉన్నది.

**క.** **“వీరెవ్వరు? శ్రీకృష్ణులు**
**గారా? యెన్నడును వెన్నగానరట కదా**
**చోరత్వం బించుకయును,**
**నేరరఁటధరిత్రి నిట్టి నియతులుగలరే”**[140]

[140] దశమస్కందం – శ్రీమద్భాగవతం – పూర్వభాగం, పుట:374.

అలాంటి యశోద పాత్రను విడిగా 60 పుటలలో బంధించడం కష్టంతో కూడిన పని. ఆమె ఎన్ని ఇక్కట్లను ఎదుర్కొన్నా శ్రీకృష్ణునిపై ప్రేమతో వాటినన్నింటిని సహించింది. తృణావర్తుడు శ్రీకృష్ణుని ఆకాశానికి తీసుకెళ్లినప్పుడు ఆమె పడిన బాధ వర్ణనాతీతం.

**ఉ. "ఇక్కడ బెట్టితిందనయు డిక్కడ నాడుచునుండె గాలిదా**
**నెక్కడ నుండి వచ్చె శిశు వెక్కడిమార్గము వట్టిపోయెనే**
**నెక్కడ జొత్తునంచుగమలేక్షణ గ్రేపు దొఱంగి భిన్నమై**
**పొక్కుచువ్రాలు గోవ్రక్రియ భూస్థలి వ్రాలె దురంతచింతమై"**[141]

ఈ గ్రంథంలో రచయిత బాలల కోసం పెట్టిన కొన్ని శీర్షికలు ఆసక్తిదాయకంగా ఉన్నాయి:

1) ధన్యమైన జీవితం
2) యశోద పొత్తిళ్లలో చిన్నికృష్ణుడు
3) మాకుమారుడు బాగున్నాడా?
4) పూతన నేలకొరిగింది
5) శకటం ముక్కలు ముక్కలైంది
6) ఎక్కడిదీ సుడిగాలి?
7) తృణావర్తుడు నేలకూలాడు
8) ఇతడు అవతార పురుషుడే

[141] దశమస్కందం – శ్రీమద్భాగవతం – పూర్వభాగం, పుట:269.

9) అల్లరి కృష్ణుని ఆగడాలు

10) ఇంత మురిపేమేమిటమ్మా?

11) దూడలను వదిలేశాడు

12) నీ ధైర్యానికి మెచ్చుకోవాలి

13) పాలు నేలపాలు చేశాడు

14) కలహాలు కల్పించాడు

15) నీకంటే దేవుడెవరు?

16) మీవాడు కొంటెవాడు

17) ఇవన్నీ బాల్య చేష్టలేనా

18) లబోదిబోమన్నాడు

19) ఎన్నింటిని చెప్పగలం

20) కడవలు ఖాళీ అయ్యాయి

21) హృదయం తల్లడిల్లింది

22) ఇక చాడీలు మానండి

23) ఎలాగో సరి పెట్టుకోవాలి

24) ఎలా నోరు వస్తుంది?

25) మన్ను తినంగ నే శిశువునో

26) కలయో? వైష్ణవ మాయయో

27) యశోద నివ్వెరపోయింది

28) పాలివ్వమని మారాం

29) కళ్ల నీళ్లు దొర్లాయి

30) వీడిని దండించాలి

31) దండనం పరమౌషధం

32) వెన్నదొంగ దొరికాడు

33) నా ప్రయత్నాలన్నీ వృథా

34) పాపం అమాయకురాలు

35) లొంగినట్లు నటన

36) గంధర్వుల శాపం తీరింది

37) బిచ్చగాళ్లకు పట్టిస్తాను

38) బృందావనిలో నందకిశోరుడు

39) బ్రహ్మ పాదాలపై బడ్డాడు

40) తొలి నోముల ఫలం

41) కాళీయ మర్ధనం

42) నిన్ను వదిలి మేము జీవించలేం

43) ఆనంద తాండవం

44) పాహిమాం! పాహిమాం!

45) కన్నయ్య లీలా వినోదం

46) గబుక్కున మింగేశాడు

47) చిటికెన వేలిపై గోవర్ధనగిరి

48) ఆమె చరిత్ర ధన్యం

అనంత పద్మనాభరావు రాసిన యశోదగ్రంథం గురించి ఆచార్య యస్.బి. రఘునాథాచార్యలుగారు తమ అభిప్రాయాన్నీ కింది విధంగా వ్యక్తీకరించారు.

**శ్రీనివాసదయోద్భూతా బాలానాం స్ఫూర్తి దాయినీ।**

**భారతీ జయతాల్లోకే భారతీయ గుణోజ్జ్వాలా॥**

ఖండఖండాతరాల్లో నాగరికత కనువిప్పేనాటికే సభ్యతకు సంస్కారానికి, నైతిక – ధార్మికాదర్శాలకు పేరుపడ్డది మన భరతఖండం. ఈ గడ్డపై పుట్టిన ప్రతిమానవుదు అధర్మాన్ని ఎదిరిస్తూ, ధర్మాచరణలో తన జీవితాన్ని పండించుకొని, మాధవాభిముఖంగా నడచి మహనీయకీర్తి నార్జించినవాడే. అలాంటి మహాత్ముల సన్నిధి మన సుఖ సంతోషాలకు పెన్నిధి. వారి జీవితాదర్శాలు మనస్సుల్లో మెదిలితే వాటి ప్రభావం మనమీద ఎంతో ఉంటుంది. 'నేను భారతీయుణ్ణి', 'ఇది తరతరాల నుంచి వస్తున్న నా సంప్రదాయం', 'ఇది నా కర్తవ్యం' అని ప్రతి బాలుడు, బాలిక ఈ దేశ సేవకు తనను అంకితం చేసుకుంటారు.

నిజానికి ఈ దేశంలో ఎందరో మహానుభావులు, మహా పురుషులు, మహా పతివ్రతలు, మహా వీరులు పెరిగి చక్కని సంస్కృతికి పునాదులు వేశారు. స్వచ్ఛమైన జీవనవాహినిని

మనదాకా ప్రవహింప చేశారు. ఆహా! మనమెంత అదృష్టవంతులం! మన వెనుక ఎంత ఉదాత్తమైన చరిత్ర ఉంది. ఆ పుణ్యపురుషులు, మహాసాధ్వులు ఇక్కడ పుట్టకపోతే మనదిగా మనం చెప్పుకొనే మహత్తరమైన ఈ సంస్కృతి, సభ్యత మనకెలా సంక్రమించేవి? వాళ్లను అర్థం చేసుకోవడం, వాళ్ల చరిత్ర మననం చేసుకోవడం, వారి ఆదర్శాలు స్మరించడం కూడ మనకు గొప్ప విజ్ఞానాన్నందించే విద్యాభ్యాసం. అది ముందు ముందు మనజాతి జీవన ప్రవాహంలో కొన్ని ఏండ్లదాకా చెక్కుచెదరిని స్ఫూర్తి సౌరభాలను విరజిమ్ముతుంది. అందుకే శ్రీనివాస బాలభారతి ఉదయించింది. ఎందరో మహానుభావుల్ని మీ ముందుంచుతోంది. ఇక మీదే ఆలస్యం. బాలలూ! రండి! రండి!

నిండు మనస్సుతో మీకిదే మా స్వాగతం!

ఆహా! ఆ నగుమోము ఎంత అందంగా ఉంది. ఆ కళ్లలో కాంతులు చూసేవాళ్లకు ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. చిన్నపిల్లవాడైనా ముల్లోకాలను ఆకర్షించగల ఆ తేజస్సు చూసి తీరవలసిందే. ఆఁ ఎవరు? అతని వెనక పరుగిడుతున్నారు? పాపం! ఆ చిన్నారిని పట్టుకోవడానికి ఆవిడ ఎన్ని తిప్పలు పడుతున్నది. అందినట్లే అంది తల్లి చేతికి దొరక్కుండా పారిపోతున్నట్లున్నాడు. ఆ తల్లి శ్రమచూస్తే జాలేస్తుంది. ఆమె ముఖంలో పట్టుకోవాలనే పట్టుదల, అల్లరి చేస్తున్నాడనే కోపం, తన బిడ్డ ఇంత చిలిపివాడనే ఆనందం, ఎలానైనా వీడిని పట్టుకోగలననే ఉత్సాహం కొట్టవచ్చినట్లు కనపడుతున్నాయి. వాడిని పట్టుకోవాలనే ప్రయత్నంలో ఆమె ముఖంపైన ఏర్పడిన స్వేదబిందువులు ముత్యాలసరాల్లాగా ధగధగ మెరిసిపోతున్నాయి. ఎవరా బిడ్డడు? ఇంకెవరు? ముల్లోకాలకే కాదు; కన్నతల్లికి కూడా అందని అందాల రాశి. చిన్ని కృష్ణడు. మఱి అతణ్ణి పట్టుకోవాలని వెంబడించే ఆ తల్లి ఎవరో తెలుసా? ఎన్నో నోముల పుణ్యఫలం వల్ల ముకుందుణ్ణి పెంచి పెద్దచేసే భాగ్యాన్ని పొందిన యశస్విని యశోద.

కన్నతల్లి దేవకీదేవికి లేని అదృష్టాన్ని కన్నయ్య ఆమెకు అనుగ్రహించాడు. భగవంతుడి బాల్యక్రీడలన్ని చూసి ఆనందించి తరించే అదృష్టం అందటికీ దొరికేది కాదు. అటువంటి భాగ్యానికి నోచుకున్న వనితామణి యశోదమ్మ తల్లి. అంతేకాదు 'కన్నయ్యా! నీవు అల్లరిచేస్తున్నావయ్యా!' అంటూ అదిరించి బెదిరించి బుంగమూతితో ఉన్న కృష్ణుణ్ణి చూచి మైమరచిపోయే సౌభాగ్యం ఎంతమందికుంటుంది? ఒక్క యశోదకు తప్ప. 'కన్నా! మన్నెందుకు తిన్నావు? ఏదీ నోరు తెరు' అని ప్రశ్నించి ఆ నోటిలో అండపిండ బ్రహ్మాండాలను దర్శించి ఆశ్చర్యచకితురాలైన ఆ తల్లి వాత్సల్యభక్తి మనకొక ఆదర్శం కావాలి.

కన్నయ్యను పెంచుకోవడానికి ఆ తల్లి పెంచుకున్న వాత్సల్యమే మనం భగవంతుణ్ణి సేవించడానికి కావాలి రాజమార్గం.

ఈ రచనలో రచయిత తీసుకున్న కొన్ని నియమాలు:

1) సరళమైన భాష.

2) బాలలచేత చదివించేలా ఉండటం.

3) కథా భాగాన్ని క్లుప్తం చేసినా, ముఖ్య సన్నివేశాలు వదిలి వేయకుండా జాగ్రత్త తీసుకోవడం.

4) దశమస్కంధ పూర్వభాగంలో విస్తరించిన యశోద పాత్రకు సంబంధించిన అన్ని వృత్తాంతాలను, అన్ని సన్నివేశాలను గుదిగుచ్చి చెప్పడం.

5) ఆ పాత్ర భావావేశాలను, మనో విశ్లేషణలను చెప్పటం.

6) కథను సంభాషణాత్మకంగా నడపడం.

7) ఇతర పాత్రలను విస్మరించకుండా కథా భాగమును నడపడం.

ఈ సప్త పదములతో యశోద చిరు గ్రంథాన్ని రేఖామాత్రంగా ఒక నవలికగా చిత్రించారు. దీనిని విస్తరించి ఒక పెద్ద నవలకూడా రాయవచ్చు. కానీ బాల సాహిత్య పరంపరలో భాగం కాబట్టి దానికి సంక్షిప్తత అవసరం అయినది.

### 5.4.3 ముత్తుస్వామి దీక్షితులు

శ్రీనివాస బాలభారతి శీర్షికలో ప్రచురితమైన ఈ గ్రంథం ప్రధానంగా సంగీత వేత్త అయిన ముత్తుస్వామి దీక్షితులను బాలలకు పరిచయం చేయడమే ముఖ్యోద్దేశంగా రచింపబడింది. ఈ పరంపరలో త్యాగయ్య, శ్యామశాస్త్రుల గురించి కూడా దేవస్థానం రచనలు ప్రచురించింది.

కర్ణాటక సంగీతత్రయంలో త్యాగయ్య, శ్యామశాస్త్రి, ముత్తుస్వామి దీక్షితులు మూడు రత్నాలవంటివారు. వారు ముగ్గురు ఆంధ్రభాషలో కీర్తనలు రాయడం ఒకే ప్రాంతంలో నివసించడం గమనించదగ్గ విషయం. అందులో ఒకరైన ముత్తుస్వామి దీక్షితులవారి గురించి రచయిత సుదీర్ఘ పరిశోధన చేశారు. వారిపై లోగడ వచ్చిన గ్రంథాలను అవలోడనం చేశారు. ప్రధానంగా ఆయన జీవితంలోని ఎన్నో సంఘటనల ఆధారంగా ఈ గ్రంథం తయారైంది.

ఇందులో శీర్షికలు ఇలా కొనసాగాయి.

1) సంగీత త్రిమూర్తులు

2) తిరువారూరుకు ఎంత అదృష్టం

3) జననం

4) విద్యాభ్యాసం

5) బాల్యంలోనే కీర్తనలు

6) తన బాణీ తనది

7) తండ్రివెంట కచేరీలకు

8) పరధ్యానం

9) రెండో పెళ్లి

10) మనలి సంస్థానం

11) చిదంబరనాథ యోగి ఆశీస్సు

12) కాశీయాత్ర

13) మంత్రోపదేశం

14) సంగీత సాధన

15) నీ కోరిక సిద్ధిస్తుంది

16) ఆ వీణను నాకు బహుకరించు

17) తిరిగి మనలి సంస్థానానికి

18) తిరుత్తణిలో ముత్తుస్వామి

19) ఇదిగో భగవత్ప్రసాదం, నోరు తెరు

20) కొత్త కీర్తన

21) గురుగుహునిపై ఏడు కీర్తనలు

22) వాతాపిగణపతిం భజే

23) పంచముఖ వాద్యం

24) అంతులేని శిష్యగణం

25) నవగ్రహకృతులు

26) కాంచీ నివాసం

27) ఉపనిషద్బ్రహ్మ స్నేహం

28) అష్టాదశ ముద్రలు

29) దీక్షితులు తిరువారూరు చేరాడు

30) పంచలింగ కృతులు

31) నవావర్ణ కృతులు

32) తిరువారూరులోనే ఉంటాను

33) ఎట్టయాపురంలో బాలస్వామి

34) తిరిగి తీర్థయాత్రలు

35) కలలో గురు గుహానుగ్రహం

36) శాత్తూరులో ముత్తుస్వామి

37) బాలస్వామి వివాహవార్త

38) ఎట్టయాపుర ప్రయాణం

39) సభలో సర్పం ఆడింది

40) అమృతవర్షిణి రాగంతో మహావర్షం

41) అన్నదమ్ములు కలిశారు

42) నాదజ్యోతికి నమస్కారాలు

43) తిరువారూరు ప్రయాణం

44) ఎట్టయాపురం నుంచి లేఖ

45) అంతిమయాత్ర

కథాకథన రీతిలో రచనాశైలి కొనసాగింది. నాటకీయంగా సంభాషణలను నడిపాడు. లోకంలో చాలామందికి తెలియని ఒక విషయాన్ని రచయిత ప్రస్తావించారు. కర్ణాటక సంగీత సభలలో అందరు సంగీతజ్ఞులు కచేరికి ముందు 'వాతాపిగణపతిం భజే' అనే కీర్తనతో కచేరి మొదలుపెడతారు. అది ముత్తుస్వామి దీక్షితులదని చాలామందికి తెలియదు. ఆ ఘట్టాన్ని రచయిత సోదాహరణంగా వివరించారు.

### 5.4.3.1 వాతాపిగణపతిం భజే:

తిరుత్తణి దేవాలయ ప్రాకారంలో ఒకచోట త్రికోణాకృతిలో వినాయక విగ్రహం ఇమిడి ఉంది. ప్రణవ స్వరూపంలో ఉన్న ఆ గణపతి నుద్దేశించి రచించిన కీర్తనయే వాతాపిగణపతిం భజే. ఈ కీర్తన సంగీతవిద్వాంసుల నోట కచేరీలలో ఆరంభకీర్తనగా గానం చేయబడుతోంది. హంసధ్వని రాగంలో ఆ కీర్తన మధుర మధురంగా సాగిపోతుంది. తిరుత్తణిలోని కమలాంబాదేవి ఆలయంలో దేవి ఈశాన్యముఖంగా ప్రతిష్ఠితమైంది. రాత్రివేళలలో ముత్తుస్వామి ప్రాకారాలలో ద్వారానికి దగ్గరగా సుమారు అర ఫర్లాంగు దూరంలో వీణ వాయిస్తూ దేవియొక్క దీపారాధన తిలకించేవాడు. ఆ దేవీదర్శన భాగ్యమే వారిని కృతకృత్యులను చేసింది. అదే విధంగా ముత్తు స్వామి దీక్షితులు చేసిన వివిధ ప్రదేశాల

ప్రస్తావన కూడా రచయిత చేశారు. సంస్కృతంలో రచించిన ఒక కీర్తనను రచయిత ప్రస్తావించారు.[142]

"వివాహం నాటి సూర్యోదయం ముత్తుస్వామి వారు సూర్యదేవుని స్తుతిస్తూ ఒక కీర్తన ఆలపించారు.

**సూర్య మూర్తే నమోస్తుతే సుందర ఛాయాధిపతే**

**కార్య కారణాత్మక జగత్ప్రకాశ సింహరాశ్యాధిపతే**

**ఆర్య వినుత తేజః స్ఫూర్తే ఆరోగ్యాది ఫలదకీర్తే"**[143]

ఇలా సంతోషపారవశ్యంలో తమ్ముడి వివాహశుభసందర్భంలో సూర్యోపాసన చేశారు ముత్తుస్వామి దీక్షితులు. త్యాగరాజ పంచరత్న కీర్తనలవలే ముత్తుస్వామి దీక్షితుల నవావర్ణ కీర్తనలు కూడా ప్రసిద్ధం.

## 5.4.3.2 నవావర్ణ కృతులు

నవావర్ణకృతుల పేరుతో కమలాంబికా వరంగా రచించిన తొమ్మిది కృతులు మధు కుల్యలు. తిరువారూరికి సమీపంలోని విఘ్నేశ్వరులపై రచించిన 16 కృతులు షోడశ గణపతి కృతులుగా ప్రసిద్ధాలు. 'వాతాపిగణపతిం భజే' ఆ పదహారు కృతులలో ఒకటి. 'శ్రీమహాగణపతి', 'పంచమాతంగముఖి', 'శ్రీమూలాధార' అనే కృతులు కూడా లోకంలో బాగా వాడుకలోకి వచ్చాయి"[144]. ముత్తుస్వామి జీవితంలో ద్వితీయ వివాహం ఒక ప్రధాన ఘట్టం. దానిని ఇలా వర్ణించారు.

---

[142] ముత్తుస్వామి దీక్షితులు – ఆర్. అనంతపద్మనాభరావు, పుట:28

[143] ముత్తుస్వామి దీక్షితులు – ఆర్. అనంతపద్మనాభరావు, పుట:48.

[144] ముత్తుస్వామి దీక్షితులు – ఆర్. అనంతపద్మనాభరావు, పుట:34.

## 5.4.3.3 రెండో పెళ్ళి

బంధువులంతా ముత్తుస్వామిని గూర్చి ఆలోచించసాగారు. అతడి పరధ్యానానికి కారణం భార్య రూపవతి కాకపోవడమనుకొన్నారు. సంప్రదాయ కుటుంబంలో పుట్టిన ఆ అమ్మాయి రూపవతి ఆ అమ్మాయి. ఎంతో ముచ్చటగా ఇంటి పనులు సవరించేది. భర్త అనుగ్రహం కోసం ఎదురుచూసేది. కాని ముత్తుస్వామి అవేవీ పట్టించుకునే స్థితిలో లేడు. ఎల్లప్పుడూ దైవ చింతన. రెండో వివాహం చేసి, అందమైన కోడలిని తీసుకొని వస్తే కుమారునికి సంసారంపై వ్యామోహం పెరుగుతుందని బంధువులు సలహా యిచ్చారు. 'తథాస్తు' అన్నారు పెద్దలు. శాస్త్రోక్తంగా రెండో పెళ్ళి జరిపించారు. కాని ముత్తుస్వామి నడవడిలో ఏ విధమైన మార్పు రాలేదు. మూడు ముళ్ళు వేశాడే తప్ప సంసారతగులంలో చిక్కుకోలేదు. భగవద్భక్తి మరువలేదు. ఒక సంగీతవేత్తను గురించి చెబుతున్నప్పుడు ఆయన రచనలలోని కొన్ని కీర్తనలనైనా ప్రస్తావించికపోతే అది సంపూర్ణం కాదు. అందుకే చంద్రం భజ అనే కీర్తనను రచయిత ప్రస్తావించారు.[145]

## 5.4.3.4 "కలలో గురుగుహానుగ్రహం"[146]

మానసికంగా ఆవేదన కలిగింది. ఆ సాయంకాలం చంద్రోదయ సమయంలో నవగ్రహ కీర్తనలలో తాను రచించిన 'చంద్రంభజ' అనే కీర్తన ఇలా ఆలాపించాడు దీక్షితులు.

**చంద్రం భజ మానస**

**సాధుహృదయసదృశం**

**ఇంద్రాదిలోకపాలేడిత తారేశం**

[145] ముత్తుస్వామి దీక్షితులు – ఆర్. అనంతపద్మనాభరావు, పుట:14.

**ఇందుం షోడశకలాధరం నిశాకరం**

**ఇందిరా సహోదరం సుధాకరమనిశం**

**శంకరమౌళి విభూషణం**

**శీతకిరణం చతుర్భుజం**

**మదన ఛత్రం క్షపాకరం వెంకటేశనయనం**

**విరాణ్మనోజననం – విధుం కుముదమిత్రం**

**విధి గురుగుహవక్త్రం**

**శశాంకం–గీష్పతేః శాపానుగ్రహపాత్రం**

**శరచ్చంద్రికా ధవళప్రకాశగాత్రం**

**కంకణకేయూర హారమకుటాదిదరం**

**పంకజరిపుం రోహిణీ ప్రియకరచతురం ॥చంద్రం॥**

మనోహరంగా విరిసిన పండువెన్నెల్లో కీర్తన ఆలపిస్తూ ఆదమరచి నిద్రపోయారు దీక్షితులు. స్వాప్నికజగత్తులో తాను భగవంతుని సాన్నిధ్యంలో ఉన్నట్లు స్ఫూర్తి కలిగింది. గురుగుహమూర్తి తన ననుగ్రహించినట్లు తోచింది. ప్రయత్నిస్తే తన తమ్ముడు ఎక్కడో కనిపించగలడనే స్ఫూర్తి కలిగింది. ముత్తుస్వామి దీక్షితుల సంగీతంలోని ప్రత్యేకతను గురించి చెబుతూ రచయిత అష్టాదశ ముద్రణలు చెప్పారు.[147]

[147] ముత్తుస్వామి దీక్షితులు – ఆర్. అనంతపద్మనాభరావు, పుట:36, 37.

### 5.4.3.5 అష్టాదశముద్రలు

దీక్షితులవారి కీర్తనలలో లయాత్మక గుణం తక్కువ. కాని రాగ సంచారం, గమకవిశేషం – గానం చేసే సమయంలో శ్రోతలను మైమరపింపజేస్తాయి. త్యాగయ్య అఖిలభారత ఖ్యాతినార్జించాడు. శ్యామశాస్త్రి కీర్తనలు ప్రసిద్ధిలోకి వచ్చాయి. అదే సమయంలో సంగీత ప్రపంచంలో దీక్షితులవారు తమదైన స్థానాన్ని నిలుపుకున్నారు. తన రచనల్లో రాజముద్ర, వాగ్గేయకార ముద్ర, క్షేత్ర ముద్ర, ప్రబంధ ముద్ర, రాజముద్ర మొదలుగా అష్టాదశముద్రలు కనిపిస్తాయి.[148] ఏ ప్రాంతంలో గానం చేసింది స్పష్టమయ్యేందుకు అవకాశం కలిగింది. ఆయా క్షేత్రాలను సందర్శించినపుడు ఆయన సంతోష పారవశ్యంలో కీర్తనలు రచించి గానం చేయడం విశేషం.

ఈ విధంగా రచయిత ఒక సంగీత వేత్తను బాలలకు పరిచయం చేయడం కత్తిమీద సాము వంటిది. ఇది సంగీతం  తెలిసిన వారిని ఉద్దేశించింది కాదు. సంగీతం తెలియని వారిని ఉద్దేశించి రాసిన రచన. అందువలన ఎన్నో జాగ్రత్తలు అవసరం అయ్యాయి. అందులో రచయిత కృతకృత్యుడయ్యాడు.

తెలుగు సాహిత్యంలో  బాల సాహిత్యానికి ఒక ప్రత్యేకత ఉంది. దానికి అనంత పద్మనాభరావు తన పాండిత్యాన్ని జోడించి మరింత అందంగా తీర్చిదిద్దాడు. బాలల్లో పురాణ పరిచయం చేయడానికి  సాహిత్యం పట్ల అవగాహన కల్పించడానికి ఈ రచనలు దోహదపడతాయి. పద్మనాభరావు గారు భాగవతంలోని యశోద శ్రీకృష్ణుని మధ్య ప్రేమను శ్రీకృష్ణుని అల్లరి చేష్టలను గురించి చెప్పడం ఈ రచనలో భాగంగా ముత్తుస్వామి దీక్షితులను కూడా తెలుగు సాహితీ లోకంలో పరిచయం చేయడం విశేషంగా చెప్పవచ్చును.

---

[148] ముత్తుస్వామి దీక్షితులు – ఆర్. అనంతపద్మనాభరావు, పుట:32.

# ఉపసంహారం

# ఉపసంహారం

'రేవూరు అనంత పద్మనాభరావు సృజనాత్మక సాహిత్యం–అనుశీలన' అనే ఈ సిద్ధాంత వ్యాసం ఐదు అధ్యాయాలుగా విభజించాను. ఒక్కొక్క అధ్యాయంలో నేను పరిశోధించి, పరిశీలించిన అంశాలను కింద పొందు పరుస్తున్నాను.

## మొదటి అధ్యాయం: 'అనంత పద్మనాభరావు జీవితం – నేపథ్యం'

పద్మనాభరావుగారి జీవితంలోని కొన్ని దశలు స్థూలంగా పరిచయం చేయబడ్డాయి. ఇందులో భాగంగానే రచయిత బాల్యం, ఉన్నత చదువులన్నింటినీ వివరించాను. వీరి రచనలకు దారితీసిన సంఘటనలను ఈ అధ్యాయంలో క్రోడీకరించాను. అంచెలంచెలుగా వారి అభ్యుదయ కార్యచరణ ఎలా కొనసాగిందో వివరించబడింది. వారి రచనలను, వాటిలోని విశేషాలు సంక్షిప్తంగా తెలుపబడింది. ఉపాధ్యాయ వృత్తి నుండి ఆకాశవాణి డైరెక్టర్‌గా నియమితులైన తీరు క్షుణ్ణంగా వివరించబడింది.

## రెండవ అధ్యాయం: 'రచయితల స్వకపోల కల్పనలు – కథా సాహిత్యం'

కథా సాహిత్యంలో దాని లక్షణాలు, నిర్వచనాలు వివరించబడ్డాయి. ఎవరెవరు కథకు లక్షణాలు, నిర్వచనాలు ఇచ్చారో వారందరి గురించి సంక్షిప్త సమాచారం ఇవ్వడం జరిగింది. అలాగే రచయిత రాసిన కథల గురించి వివరించడం జరిగింది. కథామందారం, గోరింట పూచింది, కథాకమామీషు, కథలలోని విశ్లేషణ, నేపథ్యం, రచయిత చూపించిన ముగింపులాంటి అంశాలన్నింటిని క్షుణ్ణంగా విపులంగా వివరించడం జరిగింది. కథాసంపుటాలకు వివిధ పత్రికలలో వచ్చిన సమీక్షలను క్రోడీకరించడం జరిగింది. ఆధునిక సమాజానికి ఈ కథలు ఎంతవరకు దోహదపడుతున్నాయో వివరించడం జరిగింది.

**మూడవ అధ్యాయం: 'అనంత పద్మనాభరావు నవలలు – ఇతివృత్త వైవిధ్యం'**

నవలా సాహిత్యం ఆవిర్భావం, వికాసాలను తెలియజేస్తూ, నవలా నిర్వచనాలు, లక్షణాలు, నవలా రచయితలను గురించి వివరించడం జరిగింది. పద్మనాభరావు రాసిన నవలలోని ఇతివృత్త నేపథ్యాన్ని వివరించాను. ఇంతకు ముందు నవలల మీద పరిశోధనలు జరిగాయి. వాటి వివరణను కూడా ఇవ్వడం జరిగింది. అదే విధంగా పద్మనాభరావు రాసిన 'స్వగతాలు' నవలలోని నేపథ్యాన్ని అందులో పద్మనాభరావు చూపిన శైలిని వివరించడం జరిగింది. మధ్య తరగతి కుటుంబాలు, సమాజంలో ఏ విధంగా అడ్డంకులను ఎదుర్కొంటున్నారో కళ్ళకు కట్టినట్లు చూపిన తీరును వాస్తవికంగా వివరించడం జరిగింది.

**నాల్గవ అధ్యాయం: 'పురాణ వాఙ్మయ రచనలు – విశ్లేషణ'**

పురాణ వాఙ్మయ రచనలను పరిచయం చేస్తూ వాటిలోని అంశాలను విశ్లేషించడం జరిగింది. పురాణ వాఙ్మయం పేర పద్మనాభరావు దాంపత్య జీవన సౌరభం, సంగ్రహ వాల్మీకి రామాయణం, అంతరంగ తరంగం పేర పురాణంలోని పాత్రలను తీసుకొని ఆధునిక పరిభాషకు ఏ విధంగా సరిపోల్చుతూ రాశాడో వివరించడం జరిగింది. పాత్రల మధ్య సంభాషణలు నడిచిన తీరును, అదే విధంగా మూలంలోని లేని ఎన్నో పాత్రలను పద్మనాభరావు తన రచనలలో తీసుకురావడం వంటి విశేషమైన అంశాలను గురించి వివరించబడింది. ఈ గ్రంథాలకు వచ్చిన పీఠికలు, సమీక్షలు, ముందు మాటలను గురించి స్థూలంగా విశ్లేషించి చెప్పబడింది.

**ఐదవ అధ్యాయం: 'బాలసాహిత్యం – విశ్లేషణ'**

బాలసాహిత్యం పద్మనాభరావు ఎందుకు రాయాల్సి వచ్చిందో దాని పరమార్థం ఏమిటో వంటి కుతూహలం కలిగించే అంశాలను తెలియజేస్తూ రచనలు విశ్లేషించబడ్డాయి.

ముత్తుస్వామి దీక్షితులు, యశోద గ్రంథాలలోని ముఖ్య అంశాలను వివరించడం జరిగింది. భాగవతంలో ఏ పాత్ర ముఖ్యమైనదో రచయిత చెప్పిన అంశాలన్నింటిని విపులంగా చర్చించబడ్డాయి. యశోద గ్రంథంలోని శ్రీకృష్ణుడి ప్రత్యేకతను శీర్షికల రూపంలో క్షుణ్ణంగా చర్చించడం జరిగింది.

సృజనాత్మక సాహిత్య రచనలో వైవిధ్యాన్ని ఈ పరిశోధన స్పష్టం చేసింది. కథలు రాసే తీరు, నవలిక రాసే శైలి పురాణ వాఙ్మయ ఆధారంగా నూతన దృష్టిని అవలోకింపజేయటం రచయితకు అవసరమని ఈ పరిశోధన తెలియజేస్తుంది. సమకాలీన సమస్యలకు ఎంత ప్రాధాన్యం ఉందో సనాతన సాంప్రదాయ ధోరణులకు అంతే ప్రాధాన్యం ఉంది అని ఈ పరిశోధన తేటతెల్లం చేస్తుంది.

సులభ శైలి, క్రమకథాపరిణామం, భావ విస్తృతి, సామాజిక దృక్పథం, కుటుంబ వ్యవస్థ పట్ల తపన రచయితలకు అవసరమనే విషయాన్ని ఈ పరిశోధన నొక్కి చెబుతుంది.

# ఉపయుక్త గ్రంథ సూచిక

# ఉపయుక్త గ్రంథ సూచిక


1. అనంత పద్మనాభరావు, రేవూరు. 1996. యశోద. తిరుపతి: తిరుమల తిరుపతి దేవస్థానములు
2. అనంత పద్మనాభరావు, రేవూరు. 1999. ముత్తుస్వామి దీక్షితులు. తిరుపతి: తిరుమల తిరుపతి దేవస్థానములు.
3. అనంత పద్మనాభరావు, రేవూరు. 2004. హరివంశం. రాజమండ్రి: భాగవత మందిరం
4. అనంత పద్మనాభరావు, రేవూరు. 2013. కథా కమామీషూ. హైద్రాబాద్: శ్రీ వేదగిరి కమ్యూనికేషన్స్.
5. అనంత పద్మనాభరావు, రేవూరు. 2013. దాంపత్య జీవన సౌరభం. హైద్రాబాద్: స్వీయ ప్రచురణ.
6. అనంత పద్మనాభరావు, రేవూరు. 2014. అంతరంగ తరంగం. హైద్రాబాద్: స్వీయ ప్రచురణ.
7. అనంత పద్మనాభరావు, రేవూరు. 2014. గోరింట పూచింది (కథానికల సంపుటి). హైద్రాబాద్: స్వీయ ప్రచురణ.
8. అనంత పద్మనాభరావు, రేవూరు. 2015. కథా మందారం. హైద్రాబాద్: స్వీయ ప్రచురణ.
9. అనంత పద్మనాభరావు, రేవూరు. 2016. సంగ్రహ వాల్మీకి రామాయణం (వచన కావ్యం). హైద్రాబాద్: స్వీయ ప్రచురణ.
10. అనసూయ, జిల్లెళ్ళ. 2014. తెలంగాణ బతుకు చిత్రాలు. హైదరాబాదు: తెలంగాణ సోషల్ రీసెర్చ్ సొసైటి.
11. అప్పారావు, పి. యస్.తెలుగు నాటక వికాసము, నాట్యమాల ప్రచురణము,

12.ఆనందన్, కె.(నిర్వాహక సం)నాటక విజ్ఞాన సర్వస్వం, (8వ సం), పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాద్, 2008.

13.ఆనందారామం, సి.నవలా విమర్శ, ఉమా పబ్లికేషన్స్,హైదరాబాద్, 1994

14.ఆరుద్ర సమగ్రాంధ్ర సాహిత్యం, తెలుగు అకాడమి, హైదరాబాద్, 2012

15.ఉపేందర్, వెన్నం. 2016. కొన్ని వెలుగు నీడలు (కథలు). హైదరాబాదు: నవచేతన పబ్లిషింగ్ హౌస్.

16.ఎల్లయ్య, వేముల., శంకర్, సంపంగి. 2013. అవిటి కథలు. నల్లగొండ: అవిటి సాహితీ సంస్థ.

17.ఎల్లారెడ్డి, కర్ర (సంపా.). 2007. మన తెలంగాణ (నల్లగొండ జిల్లా ప్రత్యేక సంచిక). వరంగల్: తెలంగాణ సాహితీ.

18.కరుణ, తాయమ్మ. 2018. జీవితం (కథల సంపుటి). హైదరాబాదు: తెలంగాణ ఎన్నారై అసోషియేషన్.

19.కాంతారావు, శిరంశెట్టి. 2012. ఊత కర్రలు. పాల్వంచ: స్వీయ ప్రచురణ.

20.కిరణ్ కుమార్ రెడ్డి, ఎన్,(గౌ.సం)తెలుగు వాణి, నాలుగవ ప్రపంచ తెలుగు మహాసభలు ప్రత్యేక సంచిక, పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాద్, 2012

21.కుటుంబరావు, బి.వి.తెలుగు నవలా పరిణామము, (ప్రథమ సంపుటం) గాయత్రి ప్రచురణము, హైదరాబాద్,1971.

22.కృష్ణమూర్తి, దేవులపల్లి. 2012. కథల గూడు. హైదరాబాదు: హైదరాబాదు బుక్ ట్రస్ట్.

23.కృష్ణమూర్తి, దేవులపల్లి. 2016. యక్షగానం. నల్లగొండ: హైదరాబాదు బుక్ ట్రస్ట్.

24.కృష్ణారావు, వైద్యుల. చక్రపాణి (సంపా)తెలుగు సాహిత్య చరిత్రవివరాలు అలభ్యం .

25.గంగప్ప, ఎస్.తెలుగు నాటకం, శశీ ప్రచురణలు, గుంటూరు, 1985

26.గోపాలకృష్ణ, పరుచూరి.తెలుగు సినిమా సాహిత్యం కథా–కథన–శిల్పం, వీటెక్ పబ్లికేషన్స్, హైదరాబాద్, 2004

27.చంద్రశేఖర రెడ్డి, రాచపాళెం.శిల్పప్రభావతి, శారదా ప్రింటింగ్ ప్రెస్, కమలా నగర్, అనంతపురం, 1980

28.చెన్న కేశవరావు,కంపా.రంగస్థల కరదీపిక, చరిత గ్రాఫిక్స్ ఆఫ్ సెట్ ప్రింటర్స్, హైదరాబాద్, 1998

29. డా. సి. నారాయణరెడ్డి సమగ్ర సాహిత్యం (ఏడు, ఎనిమిదవ సంపు), విశ్వంభర పబ్లికేషన్, 2000

30.తిరుపతి, బి. 2006. కథ–తెలంగాణ ప్రాంతీయవాదం. హైదరాబాదు: హైదరాబాదు విశ్వవిద్యాలయానికి సమర్పించిన పరిశోధన గ్రంథం.

31.దక్షిణామూర్తి, పోరంకి. కథానిక స్వరూప స్వభావాలు, విప్ల కంప్యూటర్ సర్వీసెస్, నల్లకుంట హైదరాబాద్ 2009

32.దేవరాజు మహరాజు. 2015. మనిషి కథలు. హైదరాబాదు: జీవన ప్రచురణలు.

33.నరసింహ మూర్తి, యు, ఎ.విశ్వనాథ సౌందర్య దర్శనము, అజో విభో కందాళం ప్రచురణలు, కాచిగూడ క్రాస్ రోడ్, హైదరాబాద్,2009.

34.నాగభూషణ శర్మ, మొదలి, తెలుగు నవలా వికాసం, నాట్యకళా ప్రెస్, హైదరాబాద్,1971

35.నాగభూషణ శర్మ, మొదలి.నాటకశిల్పం, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాద్,2008

36.నాగయ్య, జి. 1996. తెలుగు సాహిత్య సమీక్ష. హైదరాబాదు: నవ్య పరిశోధన ప్రచురణ.

37.నారాయణరెడ్డి, సుంకిరెడ్డి. 2007. నల్లగొండ జిల్లా సాహితీ చరిత్ర. ఢిల్లి: మైనర్ రీసెర్చ్ ప్రాజెక్ట్ రిపోర్టు.

38.నిత్యానందరావు, వెల్దండ. 2013. విశ్వవిద్యాలయాలలో తెలుగు పరిశోధన. హైదరాబాదు: ఓం సాయి గ్రాపిక్స్.

39.నిర్మల్. 2014. ఆబ్కారి కథలు. హైదరాబాదు: పద్మశ్రీ ప్రచురణలు.

40.పెరుమాళ్ళ, వేముల. 2011. తెలంగాణ జాతీయాలు. సికింద్రాబాదు: విరాట్ పబ్లికేషన్స్.

41.ప్రసన్నాంజనేయులు, మంచికలపాటి. విశ్వనాథ నవలా శిల్పం, గ్రంథకర్త, విద్యానగర్, కోట మండలం, నెల్లూరు జిల్లా, 2007

42.భాస్కర్, నలిమెల. 2010. తెలంగాణ పదకోశం. హైదరాబాదు: తెలంగాణ రచయితల వేదిక.

43.మంగమ్మ,బి.తిక్కన నాటకీయ శిల్పము (విరాట పర్వము) అనంతపూర్ ప్రింటర్స్, కమలా నగర్, అనంతపురం

44.మంజులత, ఆవుల.(ప్ర సం.)తెలుగు సినిమా భాష వ్యాసావళి, పొట్టిశ్రీరాములు విశ్వవిద్యాలయం, హైదరాబాద్, 2008

45.మల్లికార్జున్, వి. 2018. ఇరానీ కేఫ్ (కొన్ని కథలు). హైదరాబాదు: అజ్ పబ్లికేషన్.

46.మల్లిఖార్జునరావు, కప్పగంతుల. వ్యాసమాలిక, క. గా. కా. కౌ, ప్రచురణలు, రాజమండ్రి, 1988

47.ముత్యాలు, భూతం. 2013: మాండలీకం (కులవృత్తి పదకోశం). నల్లగొండ: గుంపు సాహితీ సంస్థ.

48.ముత్యాలు, భూతం. 2017. దగ్ధం (దళిత కథలు). నల్లగొండ: గుంపు సాహితీ సంస్థ.

49.మృణాళిని, వి.సాంఘిక నవల కథన శిల్పం, తెలుగు పరిశోధన ప్రచురణలు, హైదరాబాద్, 1988

50.యాదగిరిరెడ్డి, మేరెడ్డి. 2016. బొడ్రాయి కథలు. నల్లగొండ: ధృతి ప్రచురణలు.

51.రంగారావు, మాదిరాజు.సమాలోచనం, రసధుని సాహితీ పరిషత్తు, వరంగల్, 2003

52.రఘురామ్, మద్దాలి.(సంక).అరవై ఏళ్ళ తెలుగు సినిమా, కిన్నెర పబ్లిషర్స్, కిన్నెర ఆర్ట్ థియేటర్స్, హైదరాబాద్.1994

53.రజిత కుమారి, బచ్చలి. 2017. 1970కి పూర్వం వరంగల్ కథా సాహిత్యం. వరంగల్: స్వేచ్ఛ పబ్లికేషన్స్.

54.రజిత, అనిశెట్టి (సంపా.). 2017. శతాధిక రచనల సమాహారం–తెలంగాణ రచయిత్రుల కథలు. హైదరాబాదు: నవచేతన పబ్లిషింగ్ హౌస్.

55.రాజా శివానందం, నటసోపానం, ప్రగతి ఆఫ్సెట్ ప్రై లి, హైదరాబాద్, 2010

56.రాజారాం, మధురాంతకం. 2008. రాజారాం కథలు. హైదరాబాదు: విశాలాంధ్ర పబ్లికేషన్.

57.రామరాజు,బి(సంపా)విజ్ఞాన సర్వస్వము, తెలుగు సంస్కృతి, (రెండవ సంపుటం), విజ్ఞాన సర్వస్వ కేంద్రం, తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాద్.1988

58.రామారావు, యస్వి.తెలుగు సినిమా చరిత్ర, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాద్, 2012

59.రామారావు, యస్వీ.తెలుగుతెర (20వ శతాబ్దపు తెలుగు సినిమా సంక్షిప్త చరిత్ర), కిన్నెర పబ్లికేషన్స్, హైదరాబాద్. 2004

60.రాములు, బి.ఎస్. 1998. కథల బడి (కథా అలంకార శాస్త్రం). హైదరాబాదు: విశాల సాహిత్య అకాడమి ప్రచురణ, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్.

61.వనజాత, కోట్ల. 2014. ఇత్తు (కథల సంపుటి). హైదరాబాదు: స్పృహ సాహితీ సంస్థ.

62.విద్యాదేవి, ఆకునూరు. 2012. ఉత్తర తెలంగాణ మూడు దశాబ్దాల కథ (1970–2000). వరంగల్: విద్యానంద ప్రచురణలు.

63.విద్యేశ్వరి, డి.భారతీయ భాషల్లో నవలా ప్రక్రియ, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాద్, 1998

64.వీరభద్రయ్య, ముదిగొండ.సాహితీ విమర్శ సూత్రం–అన్వయం, పల్లవి పబ్లికేషన్స్, విజయవాడ,1998

65.వెంకట రామనరసింహము,కాకర్ల.సాహిత్య దర్శనము. క్వాలిటి పబ్లిషర్స్, రామ మందిరం వీధి, విజయవాడ.1979

66.వెంకట సుబ్బయ్య వల్లంపాటి. కథాశిల్పం, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాద్, 2008

67.వెంకటసుబ్బయ్య, వల్లంపాటి. నవలాశిల్పం, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాద్,1989

68.శంకరరావు, ఎలికట్టె. 2015. పరిగెచేను కథలు. హైదరాబాదు: నవచేతన పబ్లిషింగ్ హౌస్.

69.శంకర్, అనంత. 2020. జాగృతి కథలు–సమగ్ర పరిశీలన (2001–2010, ఒక దశాబ్ది కథలు). హైదరాబాదు: జాతీయ సాహిత్య పరిషత్.

70.శైలమ్మ, జి. 2011. తెలుగు కథాసాహిత్యం–గిరిజన జీవితం. కుప్పం: ద్రావిడ విశ్వవిద్యాలయం.

71.శ్రీనివాస్, సంగిశెట్టి. 2010. బండారు అచ్చమాంబ–తొలి తెలుగు కథలు (కథా సంపుటి). హైదరాబాదు: కవిలె పబ్లికేషన్స్.

72.శ్రీనివాస్, సంగిశెట్టి., శ్రీధర్, వెల్దండ. 2016. అలుగు (తెలంగాణ కథ–2015). హైదరాబాదు: 'సింగిడి' తెలంగాణ రచయితల సంఘం.

73.శ్రీనివాస్, సంగిశెట్టి., స్కైబాబ. 2014. రంధి. (తెలంగాణ కథ–2013). హైదరాబాదు: 'సింగిడి' తెలంగాణ రచయితల సంఘం.

74.శ్రీనివాస్, సంగిశెట్టి., స్కైబాబ., శ్రీధర్, వెల్దండ. 2015. (తెలంగాణ కథ–2014). హైదరాబాదు: 'సింగిడి' తెలంగాణ రచయితల సంఘం.

75.శ్రీహరి, రవ్వా. 1986. నల్లగొండ ప్రజల భాష. హైదరాబాదు: స్వీయ ప్రచురణ.

76.షాజహాన. 2016. లద్దాఫ్ని (ముస్లిం స్త్రీల కథలు). హైదరాబాదు: నసాల్ కితాబ్ ఘర్.

77.సత్యనారాయణ, ఎస్వీ. 2019. తెలంగాణ పదకోశం. హైదరాబాదు: పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం.

78.సిధారెడ్డి, నందిని. 2008. కులవృత్తులు తెలంగాణ సాహిత్యం. హైదరాబాదు: తెలంగాణ రచయితల వేదిక.

79.సిల్మానాయక్, అజ్మీరా. 2015. నంగార (నల్లగొండ జిల్లా బంజారాల మౌఖిక కథలు–పరిశీలన). హైదరాబాదు: జ్యోత్స్న కళాపీఠం.

80.సుజాత, ముదిగంటి. 2018. తెలంగాణ వ్యవహారిక పదకోశం. హైదరాబాదు: నవచేతన పబ్లిషింగ్ హౌస్.

81.సుజాతారెడ్డి, ముదిగంటి. 2010. మరో మార్క్స్ పుట్టాలె (కథలు). హైదరాబాదు: విశాలాంధ్రపబ్లిషింగ్ హౌస్.

82.సూర్య ధనుంజయ్, డి. 2009. నల్లగొండ జిల్లా బంజారా సాహిత్యం–జీవన చిత్రణ. హైదరాబాదు: శీతల్ పబ్లికేషన్స్.

83.స్కైబాబ. 2012. అధూరె (ముస్లిం కథలు). నల్లగొండ: నసాల్ కితాబ్ ఘర్. 'హర్యాలి' ముస్లిం రచయితల వేదిక.

84.స్కైబాబ. 2015. అలాయి బలాయి (బహుజన కథలు). శ్రీకాకుళం: ఎస్‌బిటి 'సిక్కోలు' బుక్ ట్రస్ట్.

85.స్కైబాబ. 2015. బేచారె (భగ్నమైన ప్రేమ కథలు). హైదరాబాదు: సవాల్ కితాబ్ ఘర్.

# అనుబంధాలు

# అనుబంధం -I

## I(A)- మొదటిసారి రచయితతో ఇంటర్వ్యూ- భిన్న కథలు

ఇతివృత్తం ఆధారంగా భావించినప్పుడు ప్రధానంగా సాంఘిక కథలు, రాజకీయ కథలు, ప్రేమ కథలు, ఉద్యమ కథలు, హాస్య కథలు, అనువాద కథలు, భూమి కథలు, కూలీ కథలు, దోపిడీ కథలు, పోలీసు కథలు, క్రైం కథలు, బాలల కథలు, వృద్ధాప్యకథలు, వైజ్ఞానిక, కాల్పనిక కథలు, మాండలిక కథలు చెప్పుకోదగిన అంశాలు.

సమకాలీన కథాసాహిత్యాన్ని ఈ భిన్న అంశాల ఆధారంగా వచ్చిన కథలతో పోల్చి చూసి అంచనా వేయాలి. ఈ నేపథ్యంలో రచయితతో నేను ఒక ఇంటర్వ్యూ చేశాను:

1. ప్రశ్న: **మీరు కథారచన ఎప్పుడు ప్రారంభించారు?**

**జవాబు:** అధ్యాపక వృత్తిలో ఎనిమిది సంవత్సరాలు(1967-1975) కొనసాగాను. అప్పట్లో ఆంధ్రపత్రిక, సచిత్ర వారపత్రిక బాగా ప్రసిద్ధం. నేను 1970 ప్రాంతాలలో విధి నిర్వహణ అనే కథను ఆంధ్రపత్రికకు పంపించాను. అది పెద్ద కథ. అది ప్రచురితమైన తరువాత నాకు 25 రూపాయలు పారితోషికం కూడా వచ్చింది. అది ఒక గొప్ప సంబరం. అంతకుముందు నెల్లూరు నుండి వచ్చే ప్రముఖ వారపత్రిక జమీన్ రైతుపత్రికలో ఎవరు త్యాగశీలి? అనే కథను ప్రచురించాను. ఇలా అడపాదడపా కథలు రాస్తూ వచ్చాను. జీవితంలో కథలు చెప్పడం నాకు ఇష్టం లేదు.

**2 ప్రశ్న: మరి మూడు కథాసంపుటాలు ఎలా వచ్చాయి?**

**జవాబు:** ఇదో విచిత్రం. నేను అన్ని దిన, వార పత్రికలలోనూ పద్యాలు, గేయాలు ప్రచురించాను. అడపాదడపా కథలు కూడా వచ్చాయి. తిరుపతిలో విశ్రాంతజీవితం గడుపుతున్న సమయంలో కొన్ని కథలు రాశాను. ఆ తరువాత స్వాతి, నవ్య కథల పోటీలలో 2005– 2015 మధ్య కాలంలో అనేక కథలు వ్రాశాను. అవి మూడు సంపుటాలుగా వచ్చాయి.

**3 ప్రశ్న: మరి పోటీలలో బహుమతులు ఏమైనా వచ్చాయా?**

**జవాబు:** నవ్య వారపత్రిక పోటీలో సాధారణ ప్రచురణకు పది కథలు దాకా ఎంపికయ్యాయి. ఉన్నట్లుండి ఒకరోజు స్వాతి వారపత్రికవారు 10,000ల రూపాయలు బహుమతి చెక్కును పంపారు. అది సరసమైన కథల పోటీలో బహుమతి పొందిన 'వట్టిరాకపోకలౌనర్చెవానిసతియు" అనే కథకు పారితోషికం.

**4 ప్రశ్న: ఈ కథలో ఇతివృత్తం ఏమిటి? (వట్టిరాకపోకలౌనర్చెవానిసతియు).**

**జవాబు:** కళాపూర్ణోదయంలో పింగళి సూరన ఒక అద్భుతమైన కథను సృష్టించాడు. సుగాత్రీ, శాలీనుల కథ. ఆ కథలో మానసిక విశ్లేషణతో కూడిన ఇతివృత్తం ఉంది. దాని ఆధారంగా నేను ఈ కథను మలిచాను. చాలామంది కథకులు కళాపూర్ణోదయాన్ని చదివినవారు, చదవనివారు ఫోన్ల ద్వారా పలుకరించారు.

**5. ప్రశ్న: మీ మొదటి కథాసంపుటి ఎప్పుడు వచ్చింది?**

జవాబు: నేను 2013 నాటికి 75 పుస్తకాల దాకా రాశాను. కానీ ఒక్కటి కూడా అందులో కథాసంపుటి లేదు. నా కథలన్నీ ఆంధ్రపత్రిక, ఆంధ్రప్రభ, జమీన్

రైతు, స్రవంతి, స్వాతి, నవ్య వారపత్రికలలో వచ్చాయి. వీటిలో 13 కథలు ఎంచుకున్నాను. వాటికి తోడు 14 గల్పికలు కూడా చేర్చి 'కథాకమామీషూ' అనే పేరుతో వేదగిరి కమ్యూనికేషన్స్, హైదరాబాదు చిరకాల రేడియో మిత్రులు డా॥ వేదగిరి రాంబాబు సౌజన్యంతో ప్రచురించాను.

**6 ప్రశ్న: గల్పికలు అంటే ఏమిటి?**

**జవాబు:** ఇది కథ కాదు. కథలాంటిది. కొద్దిపాటి హాస్యం, వ్యంగ్యచిత్రణ, సమకాలీన సామాజిక జీవనచిత్రణ ఇందులో ఉంటాయి. ఆంధ్రప్రభ, ఆంధ్రపత్రికల్లో కాలక్షేపానికి అనే శీర్షికలో కొన్ని ప్రచురింపబడ్డాయి. 1982–87 మధ్యకాలంలో నేను హైదరాబాద్ ఆకాశవాణి కేంద్రంలో అసిస్టెంట్ స్టేషన్ డైరెక్టరుగా పనిచేస్తున్నప్పుడు ఆకాశవాణి మిత్రులు 'సమయం' దినపత్రిక సంపాదకులు అయిన పన్యాల రంగనాథరావుగారు మా పత్రికకు ఏదైనా రాయమని అడిగారు. అలా 'ముత్యాలజల్లు' అనే శీర్షికతో రోజూ ఒక వ్యంగ్య చిత్రణ రాశాను. అద్దె ఇళ్లలో అగచాట్లు ఇలా కొన్ని శీర్షికలతో హాస్యస్ఫోరకంగా రచనలు సాగాయి. వాటిని తొలి సంపుటిలో వేశాను. ఈ సంపుటికి ఆదరణ బాగానే లభించింది.

**7 ప్రశ్న: మరి రెండవ సంపుటి ఎప్పుడు వచ్చింది?**

**జవాబు:** ఏటా ఒక బిడ్డ అనే నియమంలా ప్రతి ఏటా ఒక పుస్తకం. గత 50 సంవత్సరాలుగా ప్రచురిస్తూ వస్తున్నాను. ఒక్కొక్కసారి కవలలు పుడతారు. 2014లో 'గోరింట పూచింది' అనే పేరుతో 13 కథల సంపుటిని ప్రచురించాను.

**8 ప్రశ్న: గోరింట పూచింది అని ఎందుకు పేరు పెట్టారు?**

**జవాబు:** ఇది సామాజిక, మానసిక చిత్రణతో కూడిన కథ. నవ్య వారపత్రికల పోటీలో సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ. 2010–12 మధ్యకాలంలో నవ్య, స్వాతి వారపత్రికల పోటీలకు వరుసగా 10,15 కథలు రాశాను. ఇలా కథలు రాయడానికి 65వ ఏట విశ్రాంత జీవితం గడపడం కూడా కొంత కారణం. ఈ కథలో తాను గాఢంగా ప్రేమించిన తన భార్యకు చరమదశలో పాదాలకు గోరింట పూయటం ఒక హృదయ ఉద్వేగభరితమైన సన్నివేశం. ఆ కథా నేపథ్యాన్ని చదివినప్పుడు అందులోని బలవత్తరమైన సెంటిమెంట్ తెలుస్తుంది. 2014లో దీనిని ప్రచురించాను. ముఖ చిత్రం కూడా అందంగా వచ్చింది. పుస్తక రూప కల్పన చేసిన డి.టి.పి ప్రసాద్ కవర్ పేజీ డిజైన్ బాగా చేయడం వలన దానికి ఆకర్షణ వచ్చింది.

**9 ప్రశ్న: మీ కథల్లో ఉద్దేశ్యం ఏమిటి?**

**జవాబు:** పద్యానికైతే ఒక ఇతివృత్తం ఉంటుంది. రాముడి కథో, కృష్ణుడి కథో, గాంధీ కథో ఇలా ఇతివృత్తాన్ని ఎంచుకొని దానికి తగినట్లుగా పద్యాలు, ఖండకావ్యాలు నడుస్తాయి. కథలు అలా కాదు. కథకుడే ఒక సంఘటనల దొంతరలను ఎంచుకొని సన్నివేశాలు, పాత్రలు కల్పిస్తాడు.

**10 ప్రశ్న: కథలో ఏది ముఖ్యం?**

**జవాబు:** కథలో పాత్రల సృష్టి ముఖ్యం. ఎక్కువ పాత్రలు ఉంటే పాఠకుడు గజిబిజి పడతాడు. కొద్ది పాత్రలతో, కొద్ది సన్నివేశాలతో ఉత్కంఠభరితంగా కథ సాగాలి. పాఠకుడు ఊహించిన మలుపు ఉంటే అది కథ కానే కాదు. కొత్తదనంగా ఆలోచనాత్మకంగా, సమాజహితంగా కథ ఉండాలి. అప్పుడే అది

పాఠకుడికి నచ్చుతుంది. ఏం చెప్పారు అన్నది కాదు ముఖ్యం. ఎలా చెప్పారు అన్నది ముఖ్యం. అనవసర వాక్యాలు ఉండకూడదు. సాగదీయడం పనికిరాదు, క్లుప్తంగా, హృద్యంగా, సన్నివేశ చిత్రణ ఉండాలి అప్పుడే కథ పండుతుంది.

**11 ప్రశ్న: మీ కథలలో వృద్ధాప్య జంటలను ఎక్కువగా చిత్రీకరించారు. అది స్వానుభవమా?**

**జవాబు:** రచయితకు అన్నీ స్వానుభవాలు కానక్కరలేదు. ఊహించి సమాజ వాతావరణాన్ని చిత్రించటమే అతని పని. రోజూ పత్రికలలో వస్తున్న వార్తలు, మన కళ్ళ ముందు జరుగుతున్న సంఘటనలు కథకు మూలం అవుతాయి. ఒకసారి "అద్దె ఇల్లు కావాలి" అని ఒక వయోవృద్ధుడు మా ఇంటికి వచ్చాడు. నాకు ఒక నెల రోజులు అద్దెకు మీ ఇల్లు కావాలి అని అడిగాడు. ఎందుకండి? అని ప్రశ్నించాను. "వచ్చే నెల మా అమ్మ నావంతు ఆమెను ఆ గదిలో ఉంచాలి. ఆ తరువాత నెల మా తమ్ముడు తీసుకెళ్తాడు అన్నాడు" ఆ నేపథ్యంతోనే వచ్చిన కథ 'రేపటినుంచి అమ్మ నీవాటా' వృద్ధాప్యంలో తల్లిదండ్రులను వృద్ధాశ్రమంలో చేర్చడం వారి ఆలనా పాలనా చూడకపోవడం వారు నిస్సహాయులుగా ఉండటం అనేక కుటుంబాలలో ప్రత్యక్షంగా చూశాను. వాటి ఛాయలు నా కథలన్నింటిలో కనిపిస్తాయి.

**12 ప్రశ్న: మీ కథలలో గ్రామీణ వాతావరణం ఎక్కువగా కనిపిస్తుంది? ఎందుకని?**

**జవాబు:** నేను పుట్టి పెరిగింది ఒక పల్లెటూరు. నెల్లూరు జిల్లాలోని చెన్నూరు గ్రామం. 10వ ఏడు వరకు అక్కడే ఉన్నాను. ఆ తరువాత SSLC పూర్తి చేసేంతవరకు కూడా కొంచెం పెద్ద గ్రామంలో ఉన్నాను. అది పట్టణం కంటె చిన్నది, గ్రామం

కన్నా పెద్దది. అయినా మేజర్ గ్రామ పంచాయితీ. అది బుచ్చిరెడ్డి పాళెం. డాక్టర్ బెజవాడ గోపాల్ రెడ్డి పుట్టిన గ్రామం.

గ్రామాలలో మానవతా సంబంధాలను, కులమతరహిత వ్యవస్థను నేను కళ్ళారా చూశాను. అన్నవదినా, మామ, బావ, అక్కాచెల్లెలు అని మనసారా పిలుచుకునే వాతావరణం అది. ఒకరి కష్టసుఖాలను మరొకరు పంచుకుంటారు. అపార్ట్‌మెంట్, పట్టణ మనస్థితి కాదు. పక్క ఇంట్లో వ్యక్తి చనిపోయినా పట్టనట్లు తలుపులు మూసుకునే వ్యక్తులు కాదు, ఈ నేపథ్యంలో నేను 'పల్లె పిలిచింది', 'చెరువు గట్టు' కథలు రాశాను. నేను పెరిగిన వాతావరణం నామిత్రులు, నా ఇష్టులు అందులో పాత్రల రూపంలో కనిపిస్తారు. అంకిరెడ్డి, రమణయ్య సజీవ పాత్రలు. వారి పేర్లు కూడా అలానే ఉంచాను. మస్తాన్ తల్లికి రక్తం కావాల్సి వస్తే అంకిరెడ్డి ఇస్తాడు. ఇది మతాతీత, కులాతీత, వర్ణరహిత, వర్గరహిత, సమాజ దర్పణంగా నేను భావిస్తాను. ఇలా రాయటం వల్ల అంతరించి పోతున్న సుగంధ పరిమళము వంటి గ్రామీణ వాతావరణాన్ని పెంచాలనేది నా ఉద్దేశ్యం.

**13 ప్రశ్న: మీ కథలలో హాస్యం తొంగి చూస్తుంది ఎందుకు?**

**జవాబు:** స్వతహాగా నేను హాస్య స్వభావం గల వ్యక్తిని. నా దగ్గరకు వచ్చిన వ్యక్తి నవ్వకుండా వెళ్ళటం నాకిష్టం లేదు. నా కథలు చదివే పాఠకుడు కూడా హాస్యం పాలు చవిచూడాలి. 'ఇక్కడ సన్మానాలు చేయబడును' అలా వచ్చిందే. తెలుగు సాహిత్యంలో హాస్యం పాలు తక్కువ అని ఒక అపవాదు ఉంది. హాస్య కథారచయితలు కూడా తక్కువే. వెర్రితలలు వేసే హాస్యం కాక సున్నితమైన హాస్యం నా కిష్టం. కృష్ణ జన్మస్థానం ఈ కోవలో వచ్చిన కథ.

ఆధునిక సమాజంలో చాలామంది కృష్ణ జన్మస్థానానికి వెళుతున్నారు. వచ్చీ రాని ఇంగ్లీషుతో కడుపుబ్బా నవ్వించే వ్యక్తులు మనకున్నారు. 'అభిజ్ఞ వర్గాల భోగట్టా' ఈ కోవలో వచ్చిన కథే.

**14 ప్రశ్న: మీ కథలలో కుటుంబ వ్యవస్థ ఎలా ప్రతిబింబించారు?**

**జవాబు:** నేను మా తల్లిదండ్రులకు ఒక్కడినే కానీ ఒక సమిష్టి కుటుంబ వ్యవస్థలో పదిమంది అన్నదమ్ముల కుటుంబం మధ్య పెరిగాను. ఆ సమిష్టి కుటుంబ వ్యవస్థలోని బాగోగులు నాకు తెలుసు. చిన్న కుటుంబ వ్యవస్థ ఉన్న ఈ రోజుల్లో అత్తామామలు, బావమరదులు, అన్నదమ్ములు అనే వ్యవస్థపైన ఏకీభావం క్రమంగా తరుగుతోంది. దీనిని కొన్ని కథలలో చిత్రించాను. మరికొన్ని కథలలో అత్తాకోడళ్ళ మధ్య వైషమ్యాన్ని చిత్రించాను. 'పడగ నీడలో', 'ఫ్యామిలీ కోర్టు' ఈ కోవలోనివే. 'వాన(ర)ప్రస్థం' వృద్ధాప్య సమస్యలను చిత్రించే కథ. 'దహన సంస్కారాలకు' అనే కార్డు కథ ఆధునిక సమాజ చిత్రీకరణ.

**15 ప్రశ్న: మరి మూడో సంపుటి గురించి చెప్పండి?**

**జవాబు:** ఇప్పటి వరకు వచ్చిన కథాసంపుటిలో చివరిది 'కథామందారం'. ఇందులో 15 కథలు ఉన్నాయి. ఈ సంపుటికి ప్రఖ్యాత కథారచయిత 'నాయుని కృష్ణమూర్తి' ముందు మాట రాశారు. వరుసగా మూడు సంవత్సరాలు వెలువడిన మూడో కథా సంపుటి ఇది. మానవీయ దృక్పథాలకు ఇందులో కథలు నిదర్శనాలు. 'పడగ నీడలో' కథ కృష్ణమూర్తి గారికి బాగా నచ్చింది. కృష్ణమూర్తి ఇలా అంటారు.

“నూతన రచయితలు కథ రాయబోయే ముందు నిర్ణయించుకోవాల్సిన అంశాలు. 1) ఏ విషయం గురించి మీరు కథ రాయాలను కొంటున్నారు? 2) మీ కథకు అవసరమైన పాత్రలు, 3) మీ కథ ఆసక్తికరంగా ఉండాలంటే ఆసక్తి రేకెత్తించే ప్రారంభం కావాలి, అదెలా?, 4) కథను అనవసరంగా పెంచకుండా, నీతి వాక్యాలు చెప్పకుండా, రచయితకు తెలిసిన విషయాలు అన్నింటినీ చొప్పించకుండా కథను ముగించడం ఎలా?, 5) కథాంశాన్ని పూర్తిగా వ్యక్తం చేయకుండా ఆసక్తి కలిగించే పెట్టదగిన పేరు ఏది? ఇవన్నీ ఆలోచించి మనసులో ఒక చట్రాన్ని (Frame) ఏర్పాటు చేసుకొని రాయడం మొదలుపెడితే చక్కటి కథ తయారవుతుంది. బాగా గమనించండి. మీకు నచ్చిన కథలు చాలా వాటిల్లో విషయం పాతదే. ఇదివరకు ఎంతో మంది చెప్పిందే అయి ఉంటుందిగాని కథనం – కథ చెప్పిన తీరు బాగా ఉండి ఉంటుంది. అందుకే అది మీకు నచ్చి ఉంటుంది.

ఆర్. అనంతపద్మనాభరావుగారు అనుభవజ్ఞులైన రచయిత, ఎన్నో ప్రక్రియల్లో ఆయన రచనలు చేశారు. వారి పేరు తెలియని సాహిత్య ప్రియులు ఉండకపోవచ్చు.

నేను ఇంతవరకూ చెప్పిన కథ ఎలా రాయాలా? అన్న వివరణకు చక్కని ఉదాహరణ అనంత పద్మనాభరావుగారు రాసిన ‘పడగనీడ’ ఈ కథాసంపుటిలో మొదటి కథ.

కథలోని అంశం చాలా పాతది. ఒక కోడలు అత్త గయ్యాళితనాన్ని భరించ లేకపోతుంది. భర్త చేతగానితనాన్ని అసహ్యించుకుంటుంది.

ఆత్మస్థైర్యంతో నూతన జీవితం కోసం, పడగనీడ లాంటి అత్తింటి నుండి చెప్పకుండా వెళ్ళిపోతుంది.

**16 ప్రశ్న: మరి నాలుగో సంపుటి సంగతి ఏమిటి?**

**జవాబు:** ఇప్పుడు కథలు రాయడం తగ్గించాను. పోటీలు పడి కథలు రాసే బదులు అవసరమొచ్చినప్పుడే కథలు రాద్దామని నిర్ణయించుకున్నాను.

ఉపసంహారం: ఆకాశవాణి శ్రోతలకు సుపరిచితులు అనంతపద్మనాభరావు. వివిధ హోదాల్లో దేశంలో అనేకచోట్ల ఆయన ఈ విభాగంలో ఉన్నత పదవుల్లో రాణించారు. అన్ని సాహిత్య ప్రక్రియల్లో అనుభవమున్న రచయిత, పరిశోధకుడు, అధ్యాపకుడు అనేక అవధానాలు చేసినవారు. అనువాద బహుమతులు అందుకున్న వారు పద్మనాభరావు. వ్యంగ్య రచనలో అందె వేసిన చేయి. నాలుగు దశాబ్దాలుగా పలు పత్రికల్లో ఈయన రాసిన కథానికలు, గల్పికల సంపుటే ఈ పుస్తకం. ఇందులోని 13 కథానికలు, మరో 14 గల్పికలు ఆనాటి ఆంధ్రప్రదేశ్ వాతావరణం, సామాజిక పరిస్థితులు ఈ కథలో కళ్లకు కడతాయి.

నవ్య వారపత్రికలో 28 వారాలపాటు ధారావాహికంగా వెలువడిన వ్యాసాలమాలిక ఈ పుస్తకం. ఆకాశవాణి కేంద్రంలో, దూరదర్శన్‌లో 43 సంవత్సరాల పాటు ఉన్నత స్థానాల్లో బాధ్యతలు నిర్వహించిన అనంత పద్మనాభరావు తన ఉద్యోగ ధర్మంలో ఎంతో మంది ప్రముఖులతో సన్నిహితంగా మెలిగారు. వారితో ఆయనకున్న అనుభవాలకు ఈ వ్యాసాలలో ఎంతో ఆసక్తికరంగా మనకు అందించారు. సినీరంగానికి చెందిన తొమ్మిది మంది, రాజకీయ రంగానికి చెందిన ఏడుగురు, సాహిత్య రంగానికి చెందిన మరో 17మంది ప్రముఖులతో ఇంటర్వ్యూలు, వారితో సంభాషణ, అనుభవాల విశ్లేషణలు ఎంతో ఆసక్తికరంగా ఇందులో పొందుపరిచారు

రచయిత. ఈ పరిచయాలు నవ్య పాఠకుల్ని విశేషంగా ఆకర్షించడమే కాకుండా పాఠకుల నుండి గొప్ప స్పందన లభించడం వారి విషయ పరిజ్ఞానానికి చిహ్నం.

దాంపత్యం అంటే సుఖదుఃఖాలకు అతీతమైనదని, కర్మవశాత్తు వచ్చిన కష్టాలకు లొంగిపోకుండా దాంపత్య పవిత్రబంధాన్ని కాపాడుకోవాలని చెప్పేందుకు ఉపయోగపడే వ్యాసాలివి. ఇవన్నీ 'సురభి' మాసపత్రికలో వెలువడినవే.

కొత్త తరం దాంపత్యాలు చాలావరకు నీటి మీద రాతల్లా మారుతున్న పరిస్థితుల్లో ఈ వ్యాసాలు కొత్త జంటలకు దాంపత్యంపై ఎంతో అవగాహన కల్పిస్తాయి. నలభై మూడు మంది పురాణ దంపతుల గురించి కొత్త తరహాలో యువతను ఆకట్టుకునేలా పద్మనాభరావు ఇందులో చెప్పారు [సమీక్ష: లలిత త్రిపుర సుందరి].

# I(B)- రెండవసారి రచయితతో ముఖాముఖి

**1 ప్రశ్న: వాల్మీకి రామాయణం సంగ్రహంగా ఎందుకు రాయడం పూర్తిగా రాయొచ్చు కదా?**

**జవాబు:** పుల్లెల శ్రీరామచంద్రుడు పెద్దల మూల శ్లోకాలు కొన్నింటిని ఉదాహరిస్తూ యధాతథంగా దాదాపు 600 పుటల గ్రంథ ప్రచురించారు. విడివిడిగా 7 కాండల పుస్తకాలు కూడా దొరుకుతున్నాయి. 24 వేల శ్లోకాల మూల రామాయణాన్ని 600 పుటలకు కుదించడం కూడా ఒక పెద్ద ప్రయత్నమే కానీ సంస్కృతం రానివారు మూలం చదవలేనివారు, రామ కథను తెలుసుకోదలచినవారు సాకల్యంగా రామాయణాన్ని చదివి ఆనందిస్తారు. అందువల్ల తెలుగు వచనం దానికి సరిపోతుంది.

**2 ప్రశ్న: మీరు పద్యకవి కదా దీనిని వచనంలో ఎందుకు రాశారు?**

**జవాబు:** నేను డిగ్రీ చదువుతున్న రోజుల్లో (1962–65) రామాయణంలోని బాలకాండలోని విశ్వామిత్ర ఆగమన ఘట్టాన్ని దాదాపు 40 పద్యాలలో రాశాను. మొత్తం రామాయణం రాయాలనే సంకల్పం. అయినా కుదరలేదు. రామానుగ్రహం లేదేమో, అందులో 1,2 పద్యాలు ఉదాహరిస్తాను. అందులో పద్యాలను నేను కొన్నింటిని అంతరంగ తరంగంలో యధాతథంగా సందర్భోచితంగా ఆయా పాత్రలకు సరిపడేలా ఉదాహరించాను.

వచనం రాయడానికి మూలకారణం ఈనాటి యువతకు పద్యం మీద దృష్టి లేదు. అబ్బో పద్యమా! మనకు వంటపట్టదని దూరంగా ఉండిపోతారు. సమకాలీన పండితుల మెప్పు కోసం సుదీర్ఘ సమాసాలతోనూ, కఠినపదాలతోనూ,

ఉపమాద్యలంకారాలతోనూ రాస్తే అది పండితుల మధ్యనే ఉండి పోతుంది. ఆత్మతృప్తి కోసం రాయవలసిందే కానీ, జన సామాన్యానికి పట్టదు.

“ఫాస్టు ఫుడ్”కి అలవాటు పడిన ఈనాటి యువతకు సుదీర్ఘ రచనలు, నవలలు చదివే ఓపిక లేదు. మాతరం వాళ్ళు రైలులో వెళుతూనో, బస్సుల్లో వెళుతూనో నవలలు కొనుక్కొని చదివేవారు. ఇప్పుడు స్వాతి లాంటి వారపత్రికలలో సెక్స్ ధోరణిలతో కూడిన కథలను చదవడానికి సరసమైన కథలు శృంగారాత్మకంగా లభిస్తున్నాయి. పెద్దన వరూధిని పద్యంలో వర్ణించాడంటే అది శృంగారంగా ఇప్పుడు భావిస్తున్నారు. మరి ఇప్పుడు వస్తున్న డా॥ సమరం బ్రాండ్ కథల మాటలేమిటి? అన్నీ క్లుప్తంగా ఉండాలి. హాయిగా చదివించేలా ఉండాలి. ఎక్కువ సమయం పట్టకూడదు. అంతా త్వరత్వరగా అయిపోవాలి. ఈతరం యువత ఆలోచనా దృష్టికి సరిపోయేలా నేను వచనాన్ని ఎంచుకున్నాను.

**3 ప్రశ్న: ఉత్తరకాండను ఎందుకు వదిలేశారు?**

**జవాబు:** రామాయణం అంటే 7 కాండలతో కూడినది అని మనమందరం భావిస్తాం. 6 కాండలతో రామపట్టాభిషేకం పూర్తి అయ్యింది. బాలకాండ నుండి యుద్ధకాండ వరకు గల 6 కాండలలో రామపట్టాభిషేకం పూర్తయ్యింది. మరీ దానిని పొడిగించడం ఎందుకు. వాల్మీకికి కూడా ఈ సందేహం వచ్చిందేమో అందుకే దానికి ఉత్తర కాండ అని పేరు పెట్టాడు. అదీ కాక సీతా పరిత్యాగం, సీత నిర్యాణం వంటి ఘట్టాలు నాకు ఎందుకో రుచించలేదు. తిక్కన కూడా నిర్వచనోత్తర రామాయణాన్ని విడిగా రాశారు. అందువల్ల అవకాశం లభించినప్పుడు ఉత్తరకాండను మొదలుపెడతాను.

**4 ప్రశ్న: 24 వేల శ్లోకాల రామాయణాన్ని 160 పుటల్లోకి ఎలా బంధించగలిగారు?**

**జవాబు:** వాల్మీకి రామాయణాన్ని నేను సంపూర్ణంగా 5, 6 మార్లు చదివాను. అది ఒక దీక్షా వ్రతంగా చదివిన రోజులున్నాయి. హైకోర్టు న్యాయమూర్తి అయిన జస్టిస్ పమిడిఘంటం కోదండ రామయ్యగారు పుల్లెల శ్రీరామచంద్రుడుగారి రామాయణ శ్లోక తాత్పర్య గ్రంథాలను 1995 ప్రాంతాలలో నీకు అందించారు. ఆయన ప్రతి నెలా పునర్వసు నక్షత్రం నుండి పునర్వసు వరకు 27 రోజులలో వాల్మీకి రామాయణం పూర్తి చేసి పూర్ణాహుతి చేసేవారు. అదే విధంగా కనీసం 1, 2 సార్లైనా నన్ను చేయమని సలహా ఇచ్చారు. ఆ స్ఫూర్తితో ఢిల్లీలో ఉండగా నేనూ పని ఒత్తిడిలో ఉన్నా రోజూ ఉదయం పూజా సమయంలో సరిగ్గా 27 రోజుల్లో రామాయణం చదవటం పూర్తి చేశాను. హనుమత్ సమేత సీతారామ లక్ష్మణులకు హారతి ఇచ్చి మా నాన్నగారికి చూపించాను. అదే రోజు సాయంత్రం ఆయన స్పృహ కోల్పోయి రెండు రోజుల్లో పరమపదించారు (5 ఆగస్టు, 2000). బహుశా ఆ రామాయణ పఠనా ఫలితం ఆయనకు లభించి ఉంటుందని నా విశ్వాసం.

ఇలా రామాయణాన్ని పలు వారాలు చదివిన నేపథ్యంలో సంగ్రహ రామాయణ సంకల్పం కలిగినప్పుడు పుల్లెల వారి రామాయణాన్ని మరొక మారు చదివాను. ఒక్కొక్క కాండను నెమరు వేసుకొని అప్పుడు వచన రచనకు నాంది పలికాను. వచనమైతే యువతకు సులభంగా కొరుకుడు పడుతుందని నా నమ్మకం.

**5 ప్రశ్న: సంక్షిప్తత విషయం చెప్పలేదు?**

**జవాబు:** ఆ విషయానికే వస్తున్నాను "కొండ అద్దమందు కొంచమై ఉండదా" అని వేమన చెప్పినట్లు శ్రీ మహావిష్ణువు విశ్వరూపం చిత్రించడం ఎంత కష్టమో, వామన రూపం

చూపించడం అంతే కష్టం. అందువల్ల కొన్ని నియమాలు పాటించాను. త్రివిక్రముని వామన రూపంలో చూపించడం కష్ట సాధ్యమే అయినా అసాధ్యం కాదు.

1) ప్రధాన సన్నివేశాలను మాత్రమే ఎంచుకున్నాను.

2) సుదీర్ఘ సంభాషణలను క్లుప్తం చేశాను.

3) అప్రధానమైన కొన్ని సంఘటనలను కొద్ది వాక్యాలలో కథాగమనానికి సరిపడేలా మలిచాను.

4) వర్ణనల జోలికి పోలేదు.

5) గ్రాంథిక శైలి కాకుండా, సరళ వ్యవహారికంలో కథను నడిపించాను. అందుకు ఎన్నో ఉదాహరణలు చూపించవచ్చు.

యుద్ధకాండను 25 పుటలకే సంక్షిప్తం చేశాను. బాలకాండను 30 పుటలలోనూ, అయోధ్యకాండను 28 పుటలలోనూ, అరణ్యకాండను 30 పుటలలోనూ, కిష్కింధకాండను 30 పుటలలోనూ, సుందరకాండను 20 పుటలలోనూ సంగ్రహించవలసి వచ్చింది.

**6 ప్రశ్న: సంక్షిప్తం చేయటంలో మీకేమైనా ఇబ్బందులు కలిగాయా?**

**జవాబు:** వాల్మీకి హృదయాన్ని పట్టించేటట్లుగా మూలకథకు భంగం కలగని రీతిలో సంగ్రహం పరచడం కత్తిమీద సాములాంటిది. కథలోని ప్రధాన సన్నివేశాన్ని దేనిని పరిగణించకూడదు. గ్రంథ విస్తరణ దృష్ట్యా సంభాషణ పెంచలేదు. నాకున్న అవరోధం వల్ల చదివే పాఠకుడు రామాయణంలోని ఫలానా అంశాన్ని ఎందుకు చెప్పలేదు అని నేను ఎదురుపడ్డప్పుడు అడగకూడదు.

**7 ప్రశ్న: మీరు మాటిమాటికి యువత అంటున్నారు కదా మీ దృష్టిలో వీళ్ళు ఎవరు?**

**జవాబు:** నీవు బాలవ్యాకరణం చదివే ఉంటావు. బాలురు అంటే ఎవరు అని అడిగారట సూత్రకారుడు. "గ్రహణధారణ పటుః బాలః నతుస్తనంధయః" అంటే విషయాన్ని గ్రహించేవాడు, ధారణ చేసే శక్తిగలవాడు బాలుడు. పాలుతాగే పిల్లవాడు కాదు. మరి బాల్యదశను దాటి యవ్వన దశకు వచ్చిన వాళ్ళు ఎంతో కొంత చదువుకొని ఉంటారు. అవి సైన్స్ పాఠాలు కావచ్చు. లెక్కల చిక్కులు కావచ్చు, కామర్స్, ఇంజనీరింగ్, డాక్టర్ కావచ్చు. ఏ చదువు చదివినా ఎంతో కొంత పరిజ్ఞానం ఉంటుంది. వాళ్ళను రాముడికి సీత ఏమౌతుంది అని ప్రశ్నించక్కర్లేదు అలా అని "రాముడికి సీత ఏమౌతుంది?" అని ఆరుద్ర రాసిన పుస్తకం చదివావా అని అడగనక్కర్లేదు. చిన్నతనంలో నానమ్మలు, తాతయ్యలు పిల్లలను నిదురబుచ్చేందుకు చెప్పిన కథలలో అడపాదడపా రామాయణ ప్రస్తావన వచ్చే ఉంటుంది. లక్ష్మణుడు శూర్పణఖ ముక్కు, చెవులు కోశాడనే ఘట్టమైనా గుర్తుంటుంది. మారువేషంలో వచ్చిన రావణుడు సీతను పుష్పకవిమానంలో తీసుకెళ్లడం, ఆశోకవనంలో సీత బాధలు పడటం కర్ణాకర్ణిగా విని ఉంటారు. అలాంటి యువతకు సంపూర్ణ రామాయణం కథను చెప్పటం నా ఉద్దేశం. ప్రత్యేకించి ఇది విదేశాలలో ఉండే తెలుగు వారికి కథను తెలుసుకునే అవకాశం కల్పిస్తుంది. వారు వారి పిల్లలకు రామాయణం కథలు కథలుగా చెప్పటానికి ఉపయోగపడుతుంది ఆ ఉద్దేశ్యంతోనే నేను ఈ ప్రయత్నం చేశాను.

**8 ప్రశ్న: విశ్వామిత్రుడి కథ సుదీర్ఘం కదా ఎలా సంక్షిప్తం చేశారు?**

**జవాబు:** మూలంలో అనేక శ్లోకాలలో ఉన్న గాధిసుతుని గాథను ఆరు వాక్యాలలో నిబంధనం చేశాను. ఎక్కడా కథకు భంగం లేదు. ఉదాహరణకు "గాధి నా తండ్రి. కుశవంశాన జన్మించినందున నన్ను కౌశికుడంటారు. మా అక్క సత్యవతిని ఋశీకుని కిచ్చి

వివాహం చేశాం. వారిద్దరూ సశరీరంగా స్వర్గానికి వెళ్లారు. దేవతా శక్తిగల ఆమె కౌశికీ నదిగా హిమాలయాలపై ప్రవహిస్తున్నది. అక్కపై ప్రేమతో నేను హిమవత్పర్వత ప్రాంతాలలో నివసిస్తున్నాను. ఈ యాగం కోసం నేను ఆమెను వీడి సిద్ధాశ్రమానికి వచ్చాను. ఇప్పుడు నాకు కార్యసిద్ధి కలిగింది"[149] అన్నాడు.

అయోధ్యకాండలో రామభరతుల సంవాదం సుదీర్ఘంగా ఉంది. ఎవరి వాదనలు వారు వదిలిపెట్టలేదు. అయోధ్యకు రమ్మని భరతుడు, పితృవాక్య పరిపాలన చేస్తానని రాముడు ఎన్నో రకాలైన వాద ప్రతివాదనలు చేశారు. ఆ ఘట్టాన్ని జాబాలి వృత్తాంతంతో సహా 2 పుటలలో పూర్తి చేశాను.

**9 ప్రశ్న: 14 సంవత్సరాల అరణ్యవాసాన్ని వాల్మీకి అరణ్యకాండలో సుదీర్ఘంగా వర్ణించారు. 10 సంవత్సరాల పాటు సీతారామలక్ష్మణులు ఎన్నో ఆశ్రమాలు సందర్శించారు. మరి ఈ విషయాలన్నీ క్లుప్తంగా ఎలా చెప్పడం సాధ్యపడింది?**

**జవాబు:** దండకారణ్యంతో ప్రారంభమై అరణ్యవాసకాలంలో సీతారాములు జీవితంలో అనేక సంఘటనలు జరిగాయి. దేనికి అదే విశేషం. ఒక సన్నివేశాన్ని మరొక సన్నివేశంలో కలిపే కొలికి ఉండదు. అయినా దేనిని విడిచిపెట్టలేదు. అందుకే ఉపశీర్షికలు పెట్టాను. విరాధవధ, దేవేంద్రుని దర్శనం, సుతీక్షుని దర్శనం, అగస్త్యుని సందర్శనం, జటాయువు సందర్శనం, ఆపైన పంచవటిలో పర్ణశాల ప్రవేశం ఇంతలో శూర్పణఖ ప్రవేశం. రామాయణం కథాగమనాన్ని మలుపు తిప్పిన వ్యక్తి మొదటి భాగంలో మంథర అయితే తరువాతి భాగంలో శూర్పణఖ కనిపిస్తుంది. శూర్పణఖ రాముని కలిసి ఉండకపోతే లక్ష్మణుడు కించపరచకపోతే రామరావణ యుద్ధమే లేదు. 14 సంవత్సరాలు అరణ్యవాసం పూర్తి చేసుకొని రాముడు అయోధ్యకు వెళ్ళిపోయేవాడు.

[149] సంగ్రహ వాల్మీకి రామాయణం – ఆర్. అనంతపద్మనాభరావు, పుట:18.

**10 ప్రశ్న: అవతార లక్షణం అది కాదు కదా?**

**జవాబు:** ఆ విషయానికే వస్తున్నాను. రాముని జననమే రావణుని వధ కోసం. శాపగ్రస్తులైన జయవిజయులు ఈ జన్మలో రావణ కుంభకర్ణులుగా ఉన్నారు. వారిని చంపవలసిన బాధ్యత రామావతార రూపంలో ఉన్న విష్ణుమూర్తిపై ఉన్నది. అందువల్ల రాముడికి కోపం రావాలి. అది ఎలా వస్తుంది. తనకు ప్రాణపదమైన సీతాపహరణమే, ఆ క్రోధాగ్ని రగిల్చే నిప్పు కణిక అవుతుంది. శూర్పణఖ ఆ పనిని పూర్తి చేసింది. కామ మోహితుడైన రావణునికి సీత సౌందర్యాన్ని వివరించి చెప్పింది. కథ అనుకున్న రీతిగా మలుపు తిప్పింది.

**11 ప్రశ్న: యుద్ధకాండ పెద్దది కదా దానిని ఎలా సంగ్రహించారు?**

**జవాబు:** మహాభారతంలో కూడా భీష్మపర్వం నుండి స్త్రీ పర్వం వరకు సుదీర్ఘమైన యుద్ధ వర్ణనలు ఉన్నాయి. 18 రోజులు జరిగిన కురుక్షేత్ర సంగ్రామాన్ని వ్యాసుడు – తిక్కన తమదైన రీతిలో వర్ణించుకుంటూ వెళ్ళారు. వాల్మీకి రామాయణంలో కూడా ఒక నానుడి ఉన్నది. రామరావణ యుద్ధం ఎలా జరిగింది అని అడిగితే ఇలా చెప్పారు "రామరావణ యుద్ధం రామరావణయుద్ధయోరివ" రామరావణయుద్ధం రామరావణ యుద్ధం వలే ఉన్నది. దానిని మరొక యుద్ధంతో పోల్చడానికి వీలు లేదు. వానరసేనలతో లంకను దాటిన శ్రీరామచంద్రుడు చేసిన యుద్ధంలో ఎన్నో ఘట్టాలు ఉన్నాయి. వాటిని నేను సహేతుకంగా కొన్ని ఉపశీర్షికలలో సంగ్రహించాను:

**1. రావణ సమాలోచన**

హనుమంతుడు లంకా దహనం చేసి వెళ్ళిన తరువాత రావణుడు సభను ఏర్పాటుచేసి మంత్రాలోచన చేశాడు. విభీషణుడు హితవు చెప్పినా పెడచెవిన పెట్టి దేశ

బహిష్కృతుని చేశాడు. ఆ విషయం క్లుప్తంగా చెప్పాను. విభీషణ శరణాగతి, అంగద రాయబారం చకచకా సాగిపోయాయి. అసలు యుద్ధం ప్రారంభమయ్యింది. ఇంద్రజిత్తు రామలక్ష్మణులను నాగపాశ బద్ధులను చేశాడు. ఆ తరువాత కథను కింది ఉపశీర్షికలలో విహంగ వీక్షణంలా చకచకా నడిపాను. ఆ శీర్షికలు ఇలా ఉన్నాయి.

1) యుద్ధ భూమికి సీతను తీసుకొని వెళ్ళుట.
2) లక్ష్మణుని బంధ విముక్తి
3) కుంభకర్ణుని రాక్షసులు నిద్రలేపుట
4) ఇంద్రజిత్తుతో హోరాహోరీ యుద్ధం
5) రావణ పుత్ర శోకం.
6) రామరావణ యుద్ధం
7) లక్ష్మణుడు మూర్ఛ తేలుట
8) విభీషణుని పట్టాభిషేకం
9) భరతునికి రాముని రాకను తెలియజేయుట
10) శ్రీరామ పట్టాభిషేకం.

ఈ విభాగాలలో కథను సంక్షిప్త పరచవలసి వచ్చింది. అయితే పాఠకులకు ఎక్కడ అసంతృప్తి కలగని రీతిలో కథాకథనం కొనసాగింది.

**12 ప్రశ్న: సృజన సాహిత్యానికి మీ దృష్టిలో దీనికున్న స్థానం ఏమిటి?**

**జవాబు:** తల్లికి బిడ్డలందరూ సమానమే. కానీ సాధారణ రీతిలో చిన్నపిల్లవారు అంటే ఇష్టం. అలానే నేను ఫలానా రచన నాకు ఇష్టమని నేను చెప్పను. కానీ ఒక ఆత్మతృప్తి ఉంది.

2015లో సంవత్సరం సీతాయనం రాశాను. 2016లో రామాయణం రాశాను. అలా సీతారాముల పట్ల నా ఋణం తీర్చుకున్నాను. పాఠకులే న్యాయ నిర్ణేతలు.

ఉత్తర రామాయణాన్ని గూర్చి లోకంలో భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. ఈ రచయిత ఉత్తర రామాయణాన్ని సంగ్రహ రామాయణంలో చేర్చకపోవడానికి అనేక కారణాలు చెప్పారు.

ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ వారు 1968లో ప్రచురించిన తిక్కన నిర్వచనోత్తర రామాయణం పరిష్కర్త డా॥ పాటిబండ్ల మాధవశర్మ పీఠికలో ఇలా రాశారు.

"లోకమునకు పూర్వ రామకథ యందున్నంత ఆసక్తి ఉత్తర రామకథ యందు కానరాదు. అయినను తిక్కనగారు ఉత్తర రామకథను కావ్యము చేయ నిశ్చయించుట మనుమసిద్దిని సుభగుని గావించుటకు, ఆయనకు అభ్యుదయమగుటకు, ఇంకా జనాదరణ తన కావ్యమునకు లభించి తీరునని ఆయన విశ్వాసము"[150].

[150] నిర్వచనోత్తర రామాయణం – పాటిబడంల మాధవశర్మ పరిష్కరణం, పుట:30.

# I(C)- మూడవసారి రచయితతో ఇంటర్వ్యూ:

1) మీ నవలల్లో ఎక్కువగా గ్రామీణ వాతావరణాన్ని చిత్రీకరించడానికి గల కారణం?

**జవాబు:** 1970–80 దశాబ్దాల కాలం మధ్య కాలంలో నా నాలుగు నవలలు వచ్చాయి. దాదాపుగా 30 సంవత్సరాలు నేను గ్రామీణ వాతావరణంలో పుట్టి పెరిగాను. మాది చిన్న గ్రామం. అన్ని వర్గాలకు, కులాలకు చెందినవారు కలిసిమెలిసి జీవిస్తారు. అక్క, అన్న, బావ వరుసలతో పలకరిస్తారు, పులకరిస్తారు. వైద్య సదుపాయాలు లేని ఊరు, 15 కిలోమీటర్ల దూరంలో గానీ హైస్కూల్ లేని ఊరు. అక్షరాస్యత తక్కువ. అక్కడి గ్రామీణ వాతావరణాన్ని "సంజవెలుగు" నవలలో యథాతథంగా ఇంచుమించు పేర్లతో సహా నేను వాడుకున్నాను. రామిరెడ్డిగారు, కాంతమ్మ ఆయనకున్న బలహీనతలు, ఆయన దర్పం, అహంకారం వేళ్ళూనిన పెత్తందారీతనం ఈ నవలల్లో నేను ప్రతిబింబించాను. పాత్రలు, సన్నివేశాలు చదివే పాఠకునికి కొత్తగా ఉండవచ్చు గానీ అవి ఇంచుమించు జరిగిన సంఘటనలు. ఉదా॥ తిరునాళ్ళ సందర్భం, ధర్మకర్త పెత్తనం ఇందులో ప్రస్ఫుటమయ్యాయి. చిన్నవూరే అయినా రెండు పార్టీలుగా విడిపోయి హైకోర్టు దాకా బంజరు భూమి కోసం కేసులు నడిచిన ఊరు అది. తటస్థంగా ఉన్న మా నాన్నగారు కత్తిమీద సాములాగా ఆరు పదుల జీవితాన్ని గడిపారు.

"మారని నాణెం"లో నిండైన పల్లె వాతావరణాన్ని ప్రధాన పాత్ర గోపాలరావు ద్వారా నేను ఏడు, ఎనిమిది సన్నివేశాలలో చిత్రీకరించాను. ఆయన పని చేసిన కళాశాల పెద్ద పట్టణం కాదు, పల్లెటూరు కాదు. అక్కడి వాతావరణం, ఆయన పుట్టి పెరిగిన వాతావరణం, ఆయన అన్నావదినల జీవితానుబంధం పల్లెటూరి జీవన సరళిలోని వివిధ అంశాలను సందర్భోచితంగా నేను ప్రస్తావించాను.

"వక్రించిన సరళరేఖ"లో సరళ (కథానాయిక) గ్రామీణ వాతావరణంలో పెరిగిన బిడ్డ. యూనివర్శిటీ చదువు కోసం వెళ్ళి అక్కడి వాతావరణానికి అలవాటుపడిన మధ్య తరగతి వనిత. గ్రామాల్లో ఉన్న కక్షలు, కార్పన్యాలకు బలైన వనిత. నాయుడు, రెడ్డి తదితర కులాల సంఘర్షణ "వక్రించిన సరళరేఖ"లోనూ, "సంజవెలుగు". లోనూ కనిపిస్తాయి.

"స్వగతాలు" గ్రామీణ వాతావరణానికి దూరమే అయినా, అందులో ప్రధాన పాత్ర కోటయ్య (కలెక్టరు బంట్రోత్తు). పల్లెటూరి వాతావరణంలో పుట్టి పెరిగిన వ్యక్తి. అతని కుదుళ్ళుపల్లెలో పాతుకుపోయినాయి. చుట్టుపక్కల వాళ్ళు అతని పరపతిని, త్వరితగతిని ఒక్కొక్కసారి ఎద్దేవా చేసేవారు. అట్టడుగు వర్గాల జీవన రేఖల్లో చిత్రించడానికి నేను ప్రయత్నించాను. ఈ నాలుగు నవలలు గ్రామీణ, పట్టణ, సామాజిక జీవన దర్పణాలు వాటికి నేపథ్యం రచయిత జీవనమే.

## 2) బాలసాహిత్యం రాయడానికి గల ప్రేరణ ఏమిటి?

**జవాబు:** సాహిత్య ప్రక్రియల్లో నేను దాదాపు అన్ని ప్రక్రియలను స్పృశించాను. అవధానాలు చేశాను. పద్య కవితలు రాశాను. వచన కవితలను, అష్టకం, ఉదాహరణ, నాటకం, శ్రవ్య నాటకం, నవల, కథానిక, రూపకం, అనువాదం ఇలా వివిధ ప్రక్రియలకు ప్రవేశం ఉంది. ఈ నేపథ్యంలో తిరుమల తిరుపతి దేవస్థానంవారు బాలసాహిత్య ప్రచురణలలో భాగంగా నాచేత రెండు గ్రంథాలు రాయించారు. పండితుల మెప్పు పొందేలా రాయడం ఒక ఎత్తు అయితే, మధ్య తరగతి ప్రశంసలు పొందడం మరొక ఎత్తు. ఆ స్థాయి నుండి బాలల సాహిత్యంను సానుకూలంగా, సావకాశంగా, సాభిప్రాయంగా, సులభ శైలిలో బాలురకు సరిపడేలా రాయడం సాహసమే అవుతుంది. అయితే ఇక్కడ బాలురు అనే పదానికి చిన్నయసూరి చెప్పిన అర్థం గుర్తు

పెట్టుకోవాలి. "గ్రహణధారణపట్టుః బాలః నతుః స్తలంద్దాయః" అంటే గ్రహణ ధారణ పట్టు శక్తి గలిగిన వారేగానీ బాలురు పాలుతాగే పిల్లలు కాదు. అలాంటి బాలురలనే దృష్టిలో పెట్టుకొని ఈ రెండు చిరు గ్రంథాలను రాశాను. రెండు సార్లు పునర్ముద్రణ కావడం నా అదృష్టం. ఈ గ్రంథాలు వాక్య నిర్మాణంలోనూ, సన్నివేశ చిత్రణలోనూ, పద సరళిలోనూ చిన్న చిన్న వాక్యాలుగా ఉండి సుదీర్ఘ సమాస భూయిష్టంగాక బాలురను అలరించేవి. పేరుకు బాలురే గానీ ఆ పుస్తకాల శీర్షికలను, గ్రంథాలను చదివినవారు పేరుకు బాల సాహిత్యం నేతి బీరకాయలో నేయివలే, గ్రంథ పరిణామంలోనూ, విషయ విస్తృతిలోనూ అవి చిన్నవి. ఆ విధంగా నేను బాల సాహిత్య రచయితను అయ్యాను.

**3) మీ రచనల్లో ఎక్కువగా స్త్రీల సమస్యల గురించి ప్రస్తావించారు. దానికి మీ జీవిత భాగస్వామి ప్రేరణ ఏమైనా ఉందా?**

**జవాబు:** మాది ప్రేమ వివాహం కాదు. Love after marriage. ఆ మాట ఎందుకు అంటున్నాను అంటే 52 ఏళ్ళుగా మేము కొట్టుకోకుండా, తిట్టుకోంకుండా (ఇతరుల కంట పడకుండా) జీవనం కొనసాగిస్తున్నాం. ఆమెది ఆధ్యాత్మిక ధోరణి, బహు గ్రంథ పఠనం, బహు పారాయణ ధృతి స్వభావ సిద్ధమైన లక్షణాలు. ఒక ఆదర్శ గృహిణికి ఉండవలసిన లక్షణాలు ఆమెలో ఉన్నాయని నేను అనడమే కాదు చాలా ప్రదేశాలలో, చాలా సన్నివేశాలలో ఇతరులు మమ్మల్ని శివపార్వతులతో పోలుస్తారు. అలాగని మా అబ్బాయి గణేష్ కాదు. ఈ విధమైన ఐదు దశాబ్దాల సంసారిక జీవన దర్పణాలే నా రచనల్లో కనిపిస్తాయి.

వృద్ధాప్యంలో తల్లులు అనుభవించే మానసిక, శారీరక బాధలు, మధ్య తరగతి కుటుంబాలలో, సమిష్ఠి కుటుంబాలలో కోడళ్ళు అనుభవించే కష్టాలు, ఒంటరి

జీవితాన్ని గడిపే కొందరు మహిళామణులు కక్ష సాధించాలనే మనస్తత్వంగల యువతులు సమాజంలో తరచూ తారసపడుతారు. ఉద్యోగినుల బాధలు చెప్పనలవి కావు. పెళ్ళి చూపుల తతంగాన్ని నా మొట్ట మొదటి కథ ఆంధ్ర పత్రికలో ప్రచురింపబడింది. విధి నిర్వహణలో నేనే హైలెట్ చేశాను. అలా అని నాలుగు కథాసంపుటిలోనూ దాదాపు ముప్పై పాత్రలు స్త్రీవాద ధోరణికి అనుకూలం కాకపోయినా స్త్రీల పక్షపాతి అని చెప్పవచ్చు. స్త్రీ స్వాతంత్ర్యానికి అర్హత కాదు అనే భావనను వ్యతిరేకిస్తాను. అలాగనే "నిరాశ్రయే నాశోభంతే కవితా వనితాలతా" – ఆశ్రయం లేకుండా కవితా వనితాలతా శోభించావు (పైకి రావు) అనే వాదానికి కూడా నేను దూరం. ఏ రచయిత అయినా తాను జీవిస్తున్న సమాజానికి పై స్థాయిలో త్రిశంకు స్వర్గంలో జీవించడు. అందుకే నా కథలలో గానీ, నవలలో గానీ ఊహా సుందరులు, ఊర్వశులు ఉండరు. మధ్య తరగతి సాధారణ జీవితంలో కొట్టుమిట్టాడుతున్న వనితల కథాచిత్రణమే నా అధ్యయనం. అలాగని పురుష ద్వేషం కాదు. స్త్రీ పక్షపాతం అంతకంటే కాదు. రచయితగా నా బాధ్యత యదార్ధ జీవితాన్ని యథాతథంగా చెప్పి దానిపై నిర్ణయాన్ని పాఠకునికే వదిలివేస్తాను. దేవయాని కథలో భారతంలోని దేవయాని కథను యథాతథంగా నూతన సన్నివేశాలతో దేవయాని, శర్మిష్ఠ ఆధునికంగా చిత్రించబడ్డారు.

**4) మారుతున్న సమాజానికి అనుగుణంగా రాబోయే రచనల్లో ఏవైనా మార్పులు చూడవచ్చా?**

**జవాబు:** సమాజం ప్రగతిశీలం. అది ఒక నదీ ప్రవాహంలా ఒరవళ్ళు చెందుతూ ప్రవాహ ఝురితో సాగిపోతూ ఉంటుంది. కాలాన్ని ఎవ్వరు అడ్డు వేయలేరు. అడ్డుకట్టలు వేయలేరు. ఇరవయో శతాబ్ద ఉత్తరార్థంలో అనేక వాదాలు, వివాదాలు, తగాదాలు వచ్చాయి. అవి రచనలలో ప్రతిబింబించాయి. అభ్యుదయ సాహిత్యవాదం మొదలు దళిత సాహిత్యవాదం వరకు అనేక శ్రేణులలో, అనేక బంధాలలో రచనలు

వెల్లువిరిచాయి. ఇరవై ఒకటో శతాబ్దిలో మనం ముందుకు నడుస్తున్నాం. ఇది మాంత్రిక యాంత్రిక యుగం. ఎప్పుడో ప్రవరుడు పాదలేపంతో హిమాలయాలకు వెళ్ళాడంటే ఆశ్చర్యపడ్డాం. ఈనాడు రోదసి గగన విహారం సులభం అయ్యింది. మహిళలు అన్ని రంగాలలోనూ దూసుకుపోతున్నారు. ఇది విశ్వ కుటుంబ సాంకేతిక వైభవ యుగం. అందువల్ల నా దృష్టిలో 2050 సంవత్సరం నాటికి చెదలు పట్టే పుస్తకాలు మనకు కనిపించవు. అవి మెదళ్ళ చెదళ్ళను విదిలించి రోదసిలో విహరింప చేస్తాయి. కలం కాగితం చేతపట్టుకొని కవితలు, కథలు రాయవలసిన రోజులు ఉండవు. రచయిత కంప్యూటర్ ముందు కూర్చొని ఎదుటి వ్యక్తితో మాట్లాడుతున్నట్లు కథలు దృశ్య రూపంలో చూడవచ్చు. అమెరికాలోని పాఠకుడు అది చూసి ప్రతిస్పందన పంపవచ్చు. అది నన్నయ మరియు తిక్కన కాలంలో లేదు. కొన్ని వందల సంవత్సరాలు వాళ్ళ రచనలు తాటాకుల నుండి బయటకు రాలేదు. అందుకే తారా శశాంకం నోరు జారింది. "తాటాకులలోన వ్రాసిరి పరాంగన కూడిన పాపమంచు" అనే తీవ్ర స్థాయికి ఆనాటి పరిస్థితులు వెలుగు చూశాసాయి. స్వేచ్ఛా విశృంకలత్వం ఆంధ్ర సాహిత్య క్షీణయుగంలో కావ్య రూపంలో బయటపడ్డాయి. 21వ శతాబ్ద ఉత్తరార్థంలో ఉన్న మనం ప్రపంచీకరణ నేపథ్యంలో అన్ని సంస్కృతుల ప్రభావానికి ఎదురీది భారతీయ సంస్కృతిని ఒక జయపతాకగా ఎగురవేసే రోజులు వస్తాయి. రచయితలు కూడా తదనుగుణంగా రచనలు కొనసాగిస్తారు అనడం నిస్సందేహం.

**5) మీ రచనలన్ని వాస్తవానికి దగ్గరగా ఉండటానికి గల కారణాలు?**

**జవాబు:** నేను ఊహాసుందరులను గానీ, సుందరీమణులను గానీ ఎన్నడూ భ్రమించలేదు. మధ్య తరగతి కుటుంబాలలో పుట్టి స్వశక్తితో నిలబడి అధికార హోదాలు అనుభవించి చుట్టూ ఉన్న సమాజంలోని బాగోగులను చూసి స్పందించినవాడిని. ఒకప్పుడు 70వ దశకంలో చాలామంది నవలల్లో ఊహాసుందరులైన కథానాయికలు కనిపించేవారు.

అది చదివిన పెళ్ళిళ్ళు కానీ అమ్మాయిలు తమ భర్తలు సినీ హీరోలుగా ఉండాలని చక్ర భ్రమణం చేసేవారు. కాలాతీత వ్యక్తులు వారు. ఇంట్లో రామయ్య, వీధిలో కృష్ణయ్య, నారీ నారీ నడుమ మురారీ ఇలాంటి శీర్షికలతో నవలలు, సినిమాలు ఒక ఊహా ప్రపంచాన్ని సృష్టించాయి. తొలి నవల వ్రాయటానికి ముందు మారని నాణెం (1970) మరియు నేను 100కు పైగా నవలలు చదివాను. వాటిలో అంతఃస్సూత్రంగా ఉన్న సామాజిక గమనాన్ని గుర్తించాను. ఊహాలోకంలోని వరూధిని గానీ, అమాయక ప్రవరుడు గానీ, నా రచనల్లో కనిపించరు. వాస్తవాధీన రేఖకు దగ్గరగా ఉండే వ్యక్తులు, పడిలేచిన వ్యక్తులు, పడుతూ అడుగులు వేస్తున్న వ్యక్తులు, నా కళ్ళ ముందు కనిపించారు. అదే నా రచనలలోని సజీవ పాత్రలు. అలా అని నేను ఒక సంఘ సంస్కర్తగా గానీ, సంఘాన్ని మార్చే శక్తిగల ధీమంతుడని నేనెన్నడు భ్రమించలేదు. నా కథలు, నా నవలలు నిలువెత్తు జీవిత చిత్రాలు, నడుస్తున్న చరిత్రలు.

# అనుబంధం -II

# ప్రముఖులతో ఇంటర్వ్యూ

ఆచార్య రావికంటి వసునందన్, అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ – దాంపత్య జీవన సౌరభంపై వీరి మాటలు:

డా॥ ఆర్. అనంతపద్మనాభరావుగారు బహుముఖ ప్రతిభ గల ప్రజ్ఞామూర్తులు. శత గ్రంథ పరిమితమైన వీరి లేఖిని అనేక సాహిత్య కోణాలను సామాజిక దృక్పథాలను ఆధ్యాత్మిక ప్రపంచాలను పరామర్శించింది. ఆ రచనల్లో ఒకటి 'దాంపత్య జీవన సౌరభం'. ఇది సురభి మాసపత్రికలో ధారావాహికంగా ముద్రితమైన 43 వ్యాసాల సంపుటి. దీనిని రచయిత ఆధ్యాత్మిక సామాజిక సద్గురువులైన డాక్టర్ కె. శివానందమూర్తిగారికి భక్తితో అంకితం చేశారు. ఈ వ్యాస సంపుటిలో పార్వతీ పరమేశ్వరులు మొదటి శీర్షిక. ఆదిదంపతులైన పార్వతీ పరమేశ్వరులను దాంపత్య ప్రపంచంలో ప్రథమంగా స్వీకరించడం వీరి సంప్రదాయ దృష్టికి నిదర్శనం. చివరి వ్యాసం పద్మావతీ శ్రీనివాసులు. కలియుగ దైవమైన శ్రీవేంకటేశ్వరుని దాంపత్య వైభవసంస్మరణ ఎంతో సముచితంగా ఉన్నది. ఈ సంపుటిలోని బ్రహ్మచారి సంసార తాపత్రయం, సాహిత్య దాంపత్యం అనే రెండు శీర్షికలు పుస్తక రచనా ప్రణాళిక నుండి కొంచెం పక్కకు తప్పినట్లు అనిపించినా ఇవి కూడా సంసార విశేష సంపుటాలే. "బ్రహ్మచారి సంసార తాపత్రయంలో సర్వసంసార సౌఖ్య పరిత్యాగమూర్తి భీష్ముని గురించి ప్రస్తావించడం అద్భుతంగా ఉన్నది. భీష్ముని పాత్ర చిత్రణ చేస్తూ అంపశయ్యపైనే వాలాడు భీష్ముడు అనటం సర్వసాధారణమైన శయ్యా సౌఖ్యం మీద కాదనే ధ్వనిని స్ఫురింపజేస్తుంది. అలాగే సాహిత్య దాంపత్య సౌరభం అనే శీర్షిక మునిమాణిక్యం, పురాణం సీత, ఆరుద్ర, శ్రీశ్రీ వంటి సుప్రసిద్ధ సాహితీవేత్తలతో పాటు మరికొందరు సమకాలీన సాహిత్య దంపతులను పరిచయం చేయడం పద్మనాభరావుగారి సమగ్ర దృష్టికి నిదర్శనం.

# అనుబంధం-III

## డా॥ రేవూరి అనంత పద్మనాభరావు రచనలు (1970–2021)

| | | | |
|---|---|---|---|
| 1 | రాష్ట్రపతి వి గిరి .వి. | బయోగ్రఫీ | 1970 |
| 2 | మారని నాణెం | నవల | 1973 |
| 3 | విరిసీ విరియని మొగ్గలు | కంపైలేషన్ (సంగ్రహం) | 1973 |
| 4 | కుసుమ మంజరి | కంపైలేషన్ (సంగ్రహం) | 1974 |
| 5 | అష్టావధానం | పోయెట్రీ (కవిత్వం) | 1974 |
| 6 | శారద నవ్వింది | కంపైలేషన్ (సంగ్రహం) | 1975 |
| 7 | శ్రీ మాల్యాద్రి వైభవం | ఎడిషన్ | 1976 |
| 8 | నిరంకుశోపాఖ్యానం | ఎడిషన్ | 1977 |
| 9 | కందుకూరి రుద్రకవి | పిహెచ్ థీసిస్ .డి. | 1977 |
| 10 | ప్రకృతి కాంత | రిసెర్చ్ (పరిశోధన) | 1977 |
| 11 | వక్రించిన సరళ రేఖ | నవల | 1980 |
| 12 | సంజ వెలుగు | నవల | 1980 |
| 13 | హరివంశం | రేడియో సీరియల్ | 1981 |
| 14 | మారని నాణెం | నవల | 1981 |
| 15 | సుగ్రీవ విజయం | నవల | 1981 |
| 16 | రాయలసీమ రత్నాలు | బయోగ్రఫీస్ | 1981 |
| 17 | రామాయణంలో స్త్రీ పాత్రలు | ట్రాన్స్లేషన్ (అనువాదం) | 1981 |
| 18 | శారదా మంజీరలు | బయోగ్రఫీ | 1982 |
| 19 | లిటరరీ హెరిటేజ్ | ఇంగ్లీషు ఆర్టికల్స్ | 1984 |

| | | | |
|---|---|---|---|
| 20 | భక్తి సాహిత్యం | తెలుగు ఆర్టికల్స్ | 1984 |
| 21 | మన ప్రకాశం | బయోగ్రఫీ | 1985 |
| 22 | ముత్తుస్వామి దీక్షితులు | బయోగ్రఫీ | 1985 |
| 23 | భయం వేస్తోందా భారతి | వచన పద్యం (ఫ్రీ వెర్స్) | 1987 |
| 24 | ప్రభాత వదనం మార్నింగ్ ఫేస్ ఆఫ్ )<br>ముల్కరాజఆనంద్ | ట్రాన్స్లేషన్ (అనువాదం) | 1992 |
| 25 | ఆకాశవాణి ప్రసారాలు | ఆర్టికల్స్ | 1993 |
| (26 | నీరు (వాటర్ బై రామ) | ట్రాన్స్లేషన్ (అనువాదం) | 1994 |
| (27 | స్వగతాలు | నవల | 1996 |
| (28 | యశోద | చిల్డ్రన్ లిటరేచర్ | 1996 |
| (29 | హరివంశం (సెకండ్ ఎడిషన్) | రేడియో సీరియల్ | 1996 |
| (30 | రేడియోకి ఏలా వ్రాయాలి ? | ఆర్టికల్స్ | 1997 |
| (31 | భారతీయ సుప్రసిద్ధ గ్రంథాలు – తెలుగు | సంక్షిప్త వెర్షన్<br>(డ్ వెర్షన్అబ్రిడ్జ్) | 1997 |
| (32 | ఇండియన్ క్లాసిక్స్ – తెలుగు | ఇంగ్లీషు వెర్షన్ | 1997 |
| (33 | ఛాయారేఖలు<br>అమితావ్ ఘోష్ – షాడో లైన్స్( | ట్రాన్స్లేషన్ (అనువాదం) | 1997 |
| (34 | ప్రసార ప్రముఖులు | బయోగ్రఫీ | 1997 |
| (35 | రాయలసీమ రత్నాలు – పార్ట్ II | బయోగ్రఫీ | 1997 |
| (36 | చెట్లు (ట్రీస్) | ట్రాన్స్లేషన్ (అనువాదం) | 1999 |
| (37 | ముత్తుస్వామి దీక్షితులు – సెకండ్ ఎడిషన్ | బయోగ్రఫీ | 1999 |
| (38 | వాల్మీకి వాల్మీకి ఆఫ్ డా)॥ ఐ . | ట్రాన్స్లేషన్ (అనువాదం) | 2000 |

| | | | |
|---|---|---|---|
| | (పాండురంగారావు | | |
| (39 | ఢిల్లీ ఆంధ్ర ప్రముఖులు | బయోగ్రఫీ | 2000 |
| (40 | కాంతయ్య | బయోగ్రఫీ | 2000 |
| (41 | మధుక్షీరాలు (హీబ్రూ స్టోరీస్) | ట్రాన్స్‌లేషన్ (అనువాదం) | 2002 |
| (42 | బోధనోపకరణాలు (లోకాస్ట్ బుక్స్) | ట్రాన్స్‌లేషన్ (అనువాదం) | 2002 |
| (43 | ప్రసార రథసారథులు | బయోగ్రఫీ | 2002 |
| (44 | ఇండియన్ క్లాసిక్స్ తెలుగు | హిందీ | 2002 |
| (45 | ఇండియన్ క్లాసిక్ తెలుగు | ఒరియా | 2002 |
| (46 | మారని నాణెం (హిందీ) | నవల | 2004 |
| (47 | మహాభారతం (విరాట పర్వం) | కామెంటరీ | 2006 |
| (48 | హరివంశం )III ఎడిషన్( | రేడియో సీరియల్ | 2007 |
| (49 | మదర్ థెరిస్సా ఇంగ్లీషు బై)మెహతా( | ట్రాన్స్‌లేషన్ (అనువాదం) | 2007 |
| (50 | పద్మనాభరావు నవలలు | రిసెర్చ్ | 2007 |
| (51 | అనంత సాహితీ మూర్తి | రిసెర్చ్ | 2007 |
| (52 | రేడియో నాటకాలు | రిసెర్చ్ | 2007 |
| (53 | అవధాన పద్మ సరోవరం | పొయెట్రీ | 2008 |
| (54 | పద్మ సరోవరం | పొయెట్రీ | 2008 |
| (55 | బెజవాడ గోపాల రెడ్డి | బయోగ్రఫీ | 2009 |
| (56 | ఆంధ్ర కేసరి ప్రకాశం | బయోగ్రఫీ | 2010 |
| (57 | శంకరంబడి సుందరాచారి | బయోగ్రఫీ | 2011 |
| (58 | వర్ణన రత్నాకరం | కామెంటరీ | 2012 |
| (59 | మహాభారతం IV కాంటో | కామెంటరీ | 2012 |

| | | | |
|---|---|---|---|
| (60 | సుగ్రీవ విజయం | ఎం టెక్ట్స్ బుక్ .ఎ. | 2012 |
| (61 | ప్రసార మాధ్యమాలు – తెలుగు | రిసెర్చ్ | 2012 |
| (62 | జాబ్ ఇంటర్వ్యూస్ | ఇంగ్లీషు | 2012 |
| (63 | పోటీ పరీక్షలు – లక్ష్య సాధన | సివిల్స్ | 2012 |
| (64 | దాంపత్య జీవన సౌరభం | రిసెర్చ్ | 2012 |
| (65 | తలుపుల తలుపులు | మెమోయిర్స్ (జ్ఞాపకాలు) | 2012 |
| (66 | కథా–కమామీషు | షార్ట్ స్టోరీస్ | 2013 |
| (67 | మారథాన్ రేస్ టు సివిల్ సర్వీసెస్ | సివిల్స్ | 2013 |
| (68 | గోరింట పూచింది | షార్టా స్టోరీస్ | 2013 |
| (69 | తలుపుల తలుపులు )II ఎడిషన్( | మెమోయిర్స్ (జ్ఞాపకాలు) | 2014 |
| (70 | సివిల్స్ ప్లానర్ | సివిల్స్ | 2014 |
| (71 | ఎథిక్స్  ఇంటిగ్రిటీ అండ్ ఆప్టిట్యూడ్ , | సివిల్స్ | 2014 |
| (72 | అనువాద సాహిత్యం | పిహెచ్ థీసీస్ .డి. | 2014 |
| (73 | అంతరంగ తరంగం | నావల్ | 2015 |
| (74 | వెంగమాంబ | గైడ్ | 2015 |
| (75 | మన పండుగలు | ప్రోజ్ | 2015 |
| (76 | కథా మందారం | స్టోరీస్ | 2015 |
| (77 | సంగ్రహ వాల్మీకి రామాయణం | ప్రోజ్ | 2015 |
| (78 | జీవిత చరిత్రలు | పిహెచ్ థీసీస్ .డి. | 2015 |
| (79 | అనంత పద్మనాభరావు – సమగ్ర సాహిత్యం | పిహెచ్ థీసీస్ .డి. | 2016 |
| (80 | కృష్ణ పుష్కరవేణి | తెలుగు | 2016 |

| | | | |
|---|---|---|---|
| (81 | నీతి నిజాయితీ , | తెలుగు | 2016 |
| (82 | థౌసన్డ్ హుడ్స్ (వేయి పడగలు) | ఇంగ్లీషు | 2017 |
| (83 | పద్య నాటక పంచకం | రేడియో డ్రామా | 2017 |
| (84 | పండుగలు సంప్రదాయాలు | ఆర్టికల్స్ | 2017 |
| (85 | శంకరంబాడి (మోనోగ్రాఫ్) | ఇంగ్లీషు | 2017 |
| (86 | వర్ణన రత్నాకరం | కామెంటరీ | 2017 |
| (87 | రాఘవ పాండవీయం | కామెంటరీ | 2018 |
| (88 | మహనీయులు | బయోగ్రఫీస్ | 2018 |
| (89 | తెలుగు మాస పత్రికలు | రిసెర్చ్ | 2018 |
| (90 | ప్రసిద్ధ క్షేత్రాలు | తెలుగు | 2018 |
| (91 | జమలాపురం కేశవరావు | బయోగ్రఫీ | 2018 |
| (92 | దుర్గాభాయ్ దేశ్ముఖ్ | బయోగ్రఫీ | 2018 |
| (93 | ఎ శర్మ .ఎన్.వి.పి. | బయోగ్రఫీ | 2018 |
| (94 | సివిల్స్ పరీక్షలు | ఎస్సేస్ (వ్యాసాలు) | 2018 |
| (95 | పండుగలు – పరమార్థం | ఎస్సేస్ (వ్యాసాలు) | 2018 |
| (96 | పబ్లిక్ రిలేషన్స్ | టెక్ట్స్ బుక్ | 2018 |
| (97 | ఆకాశవాణి పరిమళాలు | ఆటోబయోగ్రఫీ | 2019 |
| (98 | ఋషిపరంపర | రేడియో సీరియల్ | 2019 |
| (99 | నీతి అభిరుచి ,నిజాయితీ , | ఎస్సేస్ (వ్యాసాలు) | 2019 |
| (100 | కీచక వధ | కామెంటరీ | 2019 |
| (101 | పరిపాలనలో నీతి | గ్రూప్ –I | 2019 |
| (102 | సివిల్స్ పరీక్షలు – గెలుపు గుర్రాలు | సివిల్స్ | 2019 |

| | | | |
|---|---|---|---|
| (103 | యతీంద్రులు (పుష్పగిరి) | బయోగ్రఫీ | 2019 |
| (104 | కథా దర్పణం | షార్ట్ స్టోరీస్ | 2020 |
| (105 | ధర్మ సందేహాలు | ఆన్సర్స్ | 2020 |
| (106 | కావ్య పరిమళం | ఎస్సేస్ (వ్యాసాలు) | 2020 |
| (107 | రేడియో నాటకాలు | ప్లేస్ (నాటకాలు) | 2020 |
| (108 | సివిల్స్ మారథాన్ | సివిల్స్ | 2020 |
| (109 | రాయలసీమ మహారథులు | బయోగ్రఫీస్ | 2020 |
| (110 | శతక ద్వయం | పోయెట్రీ | 2020 |
| (111 | రుక్మాంగద చరిత్ర | ఎడిటింగ్ | 2021 |
| (112 | లోకమాన్య తిలక్ | ట్రాన్స్లేషన్ (అనువాదం) | 2021 |
| (113 | పింగళి వెంకయ్య | బయోగ్రఫీ | 2021 |
| (114 | వ్యాస మంజరి | ఎస్సేస్ (వ్యాసాలు) | 2021 |
| (115 | జ్ఞాపకాలు వ్యాపకాలు | సీరియల్ | 2021 |

# పుస్తకాల్లో ముద్రితమైన  పరిశోధన పత్రాల నకలు

RNI No. APTEL/2003/12253

# భావ వీణ

తెలుగు సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

# BHAVA VEENA

Journal of Telugu Literary, Culture & Language Study

Vol : 16 Issue No. 8(2) Monthly August 2019 ISSN No. : 2456-4702 Rs. : 15/-

ज्ञान-विज्ञान विमुक्तये
UGC
University Grants Commission
UGC Approved Journal
No. 42500



## డా॥ సి.నారాయణరెడ్డి

BHAVAVEENA
Vol. 16, Issue. 8(2), August - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ
UGC Approved Journal No. 42500

# Contents (విషయ సూచిక)


| | | |
|---|---|---|
| 1. ఆముక్త మాల్యద - భక్తి తత్వం | - డా॥. బూసి వెంకటస్వామి | 5 |
| 2. తెలంగాణ సాహిత్య కరదీపిక కోవెల సంపత్కుమారాచార్య | - డా॥ చవ్వా వెంకటరెడ్డి | 8 |
| 3. వచన కవిత్వంపై స్త్రీవాద ప్రభావం | - డా. గోనిపాటి ధర్మారావు | 11 |
| 4. జాషువా కావ్య ఖండికలు | - డా॥ గంగు కిషన్ ప్రసాద్ | 18 |
| 5. గురజాడ 'ముత్యాల సరాలు' | - డాక్టర్ ఎం.మునిరత్నం | 24 |
| 6. అరుదైన సొలొమోను సామెతలు | - జి.యన్.శ్యామలరాణి | 29 |
| 7. శకుంతలోపాఖ్యానం : మానవసంబంధాలు | - గరికిపాటి గురజాడ | 33 |
| 8. ద్రావిడభాషా కుటుంబ అంతర్భాగం - ఎరుకుల భాష | - డా॥ గరికపాటి హరిబాబు | 37 |
| 9. లంబాడీ పిల్లల ఆటలు - పాటలు | - కొర్ర ఝాన్సీ | 40 |
| 10. సుగాలీల పుట్టుపూర్వోత్తరాలు | - డా. ఇస్లావత్ భీమానాయక్ | 45 |
| 11. కాళోజీ స్వగత కవితలు - అవలోకనం | - డా॥ లావుడ్యా సుజాత | 51 |
| 12. బోయి భీమన్న 'ధర్మవ్యాధుడు' నాటకం - స్త్రీ పాత్ర చిత్రణ | - సిహెచ్. రేవతి | 55 |
| 13. పురాణం సుబ్రహ్మణ్య శర్మ గారి "మధురవాణి ఇంటర్వ్యూలు" | - కర్రి వి.వి. యం.కె. కుమార్ | 58 |
| 14. "శ్రీ శివభారతము" విశ్లేషణ | - కె. లలిత & - డా. యన్. నరసింహులు | 60 |
| 15. రాయలసీమలో బహుజన సాహిత్యం | - డా॥ మేడికుర్తి ఓబులేసు | 64 |
| 16. తెలుగు నాటక వికాసం | - డాక్టర్ కొత్తిరెడ్డి మల్లారెడ్డి | 72 |
| 17. ఆధునిక సాహిత్యంలో - బాలికల సమస్యలు | - డా॥ పి.వి. రమణారెడ్డి | 75 |
| 18. శ్రీనాథుని క్రీడాభిరామం | - వేముల శరణ్య | 78 |
| 19. కొండపల్లి కోటేశ్వరమ్మ నిర్జనవారధి : జండర్ దృక్పథం | - డా. వెంకటరామయ్య గంపా | 80 |
| 20. తెలుగు మాటల పుట్టుక, ఇతర బాషా పదాల కలయిక | - డా. జి. వెంకటరమణ | 86 |
| 21. అనంతపద్మనాభరావు జీవితం, వ్యక్తిత్వం | - బోయపల్లి చిట్టెమ్మ | 91 |
| 22. తెలుగు వాగ్గేయ పద కవితా త్రిమూర్తుల్లో - క్షేత్రయ్య | - డా॥ ఎ. సిల్మా నాయక్ | 96 |
| 23. కరీంనగర్ జిల్లా సాహిత్య వైభవం (ప్రాభవం) | - డా॥ కలవకుంట రామకృష్ణ | 99 |

BHAVAVEENA
Vol. 16, Issue. 8(2), August - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ
UGC Approved Journal No. 42500

# అనంతపద్మనాభరావు జీవితం, వ్యక్తిత్వం

- బోయపల్లి చిట్టెమ్మ, పరిశోధక విద్యార్థిని, తెలుగు శాఖ, హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం, హైదరాబాద్, తెలంగాణ.

## పరిచయం :

ఆధునిక కథా సాహిత్యంలో అనంతపద్మనాభరావు గారు ఒక విశిష్టమైనటువంటి స్థానాన్ని సంపాదించుకొన్నారు. అలాంటి అనంతపద్మనాభరావు గారు ఆధునిక తెలుగులో కవులలో ఒకరుగా చిరస్థాయిగా నిలిచిపోయారు. ఈయన కలం వివిధ రచనలు వెలుగులోకి వచ్చాయి. అలా ఈయన కలం నుండి వివిధాంశాలకు సంబంధించిన కథలు వెలువరించారు. వీటిలో మూడు కథా సంపుటాలు మిక్కిలి ప్రాచుర్యాన్ని సంతరించుకొన్నది. ఈయన వివిధ కోణాలల్లో కథలను చిత్రీకరించారు. వీరు రచించిన కథలో కొన్ని విధి నిర్వహణకు సంబంధించినవి గాక మిగిలినవి సామాజిక దృక్పథానికి సంబంధించిన కథలు ఉన్నాయి. ఇలా అనంతపద్మనాభరావు గారి కథలు ఆధునిక కాలంలో ఎంతో నైపుణ్యతను సంపాదించుకొన్నది. అందుకే అనంతపద్మనాభరావు గారి కథలంటే చెవి కోసుకొనే వారు లేకపోలేదంటే అతిశయోక్తి కాదు.

## జననం :

1947వ సంవత్సరం జనవరి 29 తేదీ రథసప్తమి పర్వదినం రోజున నెల్లూరు నగరంలో అనంత పద్మనాభరావు జన్మించారు. తల్లిదండ్రులు లక్ష్మీకాంతారావు, శారదాంబలు. వీరి స్వగ్రామం బుచ్చిరెడ్డిపాలెంకు సమీపంలో చెన్నూరు. అది ఒక పంచాయతీ గ్రామం. తండ్రి వ్యవసాయదారుడు. నైష్ఠిక కుటుంబం.ఆయనకు ఒకే ఒక కొడుకు పద్మనాభరావు.

## విద్యాభ్యాసం :

అనంతపద్మనాభరావు గారి ప్రాథమిక విద్యాభ్యాసం స్వగ్రామంలోనే తొమ్మిదవ సంవత్సరం వరకు గడిచింది. అక్కడే నాలుగవ తరగతి పూర్తయ్యింది. అప్పట్లో హైస్కూలులో చేరటానికి డబుల్ ప్రమోషన్ విధానం ఉండేది. హైస్కూలులో చేరటానికి ముందు ఒక రాత పరీక్ష పెట్టి వారి వారి అర్హతలను బట్టి ఆరు లేదా ఏడు తరగతులలో చేర్చుకునేవారు. అలా తొమ్మిదవ ఏట తరగతిలో చేరారు. 1960వ సంవత్సరంలో ఎస్ఎస్ఎల్‌సి పూర్తి చేశారు. అప్పటికి ఆయనకు పదమూడు సంవత్సరాలు నిండాయి. 1965వ సంవత్సరంలో నెల్లూరులోని వి.ఆర్.కళాశాలలో బి.ఎ.స్పెషల్ తెలుగును సెకండు క్లాసులో పాసయ్యారు. తెలుగు స్పెషల్, హిస్టరీ, ఎకనామిక్స్, ఆప్షనల్ సబ్జెక్టులుగా డిగ్రీ పూర్తి చేశారు. కళాశాల స్థాయిలోనే ఛందోబద్ధంగా పద్యాలు రాశారు. సరస వినోదిని, సమస్యాపూరణ కార్యక్రమానికి ఆకాశవాణికి వారం, వారం పద్యాలు రాయడంతో ప్రారంభమైన వీరి కవితా వ్యాసంగం వికాసాన్ని పొందింది.1965-67వ సంవత్సరాల మధ్య శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో ఎం.ఎ.తెలుగు పాఠ్యాంశంగా చదివి స్వర్ణపతకం పొందారు.

## ఉద్యోగం :

ప్రకాశం జిల్లాలో కందుకూరు చాలా చిన్న ఊరు. అది గ్రామం కాదు. పట్టణం కాదు. 1966వ సంవత్సరంలో అక్కడ తిక్కవరపు రామిరెడ్డి గారి విరాళంతో ప్రభుత్వ కళాశాలను ఏర్పాటు చేశారు. యాదృచ్ఛికమే అయినా తిరుపతి విశ్వవిద్యాలయంలో ఎం.ఎ.తెలుగులో సర్వ ప్రథములుగా నిలిచినందుకు తిక్కవరపు రామిరెడ్డి స్వర్ణ పతకాన్ని స్వీకరించిన పద్మనాభరావు అదే రామిరెడ్డి విరాళంతో ఏర్పడిన ప్రభుత్వ కళాశాలలో ఉద్యోగం సంపాదించారు. ఏడున్నర సంవత్సరాలు అంటే 'సాడేసాత్' అని గుర్తుకొస్తుంది. అంటే ఏణ్ణాళ్ల శని. కందుకూరులో పనిచేసిన 1967 వ సంవత్సరం డిసెంబర్ నుండి 1975వ సంవత్సరం ఆగష్టు వరకు అంటే ఏడున్నర సంవత్సరం కాలం పాటు అధ్యాపక వృత్తిలో ఉన్నారు. పాఠాలు చెప్ప

టంలో విద్యార్థుల మెప్పును సాధించారు. బి.ఎ.స్పెషల్ తెలుగు విద్యార్థులకు సంస్కృతం, బాలవ్యాకరణం పాఠాలు చెప్పారు. అష్టావధానాలు మొదలుపెట్టారు. ఉద్యోగం చేస్తున్న రోజుల్లో పరిసర ప్రాంతాల పాఠశాలలో వార్షికోత్సవాలకు ముఖ్యఅతిథిగా చాలా ప్రాంతాలను సందర్శించారు. కందుకూరు తాలుకా రచయితల సంఘం స్థాపించి అధ్యక్షులయ్యారు. సభలు, సమావేశాలు అయిదు సంవత్సరాల పాటు నిర్వహించారు. ఈ విధంగా ఏడున్నర సంవత్సర కాలంలో విస్తృత సాహితీ వ్యాసంగంతో పాటు రేడియో ప్రసంగాలు కూడా చేశారు. ఏడున్నర సంవత్సరం పూర్తికాగానే ఏణ్ణాళ్ల శని వదిలినట్లుగా అధ్యాపక వృత్తిని వదిలి ఆకాశవాణిలో చేరారు. 1975వ సంవత్సరం నుండి 2005వ సంవత్సరం మధ్య కాలంలో పద్మనాభరావుగారి ఉద్యోగ రంగం, సాహితీ రంగం, సాంస్కృతిక రంగం వేయి పుంతలు తొక్కింది. పద్మనాభరావుగారు కడప, అనంతపురం, విజయవాడ, హైదరాబాద్, ఢిల్లీ ఆకాశావాణి కేంద్రాల్లో వివిధ హెూదాలలో పనిచేశారు. పద్మనాభరావుగారు ప్రవచన శాఖ ప్రయోక్తగా 1975వ సంవత్సరం ఆగష్టులో 'ఓపెన్ కాంపిటీషన్'లో ఎంపికై ఏడు సంవత్సరాలు కడప, విజయవాడల్లో పనిచేశారు. ఈ కాలంలో వివిధ సాహితీవేత్తలతో, సాంస్కృతిక కళా రాజకీయ వేత్తలతో రేడియోకు పరిచయాలు చేశారు. నిలకడగా ఒక ఊర్లో ఉండటం ఆయన ఇష్టం ఉండదు. రెండు సంవత్సరాలు ఒకసారి తానే పూనుకొని మరొక ఊరికి బదిలీ అయ్యేవారు. అలా ముప్పై సంవత్సరాలలో పదమూడు బదిలీలు చూశారు.

## రచనలు :

1. వి.వి.గిరిచరిత్ర (1970), 2.విరిసీవిరియని మొగ్గలు (కవితా సంకలనం (1971), 3.మారెని నాణం (1973), 4.శారద నవ్వింది, 5.కందుకూరి రుద్రకవి (1977), 6.నిరంకుశోపాఖ్యనం-పరిష్కరణ, 7.ప్రకృతికాంత (పరిశోధన) 1977, 8.హరివంశం (రేడియో ధారావాహిక) 1981, 9.సుగ్రీవ విజయం (పరిష్కరణ)1981, 10.రాయలసీమ రత్నాలు (జీవన రేఖలు) 1981, 11.శ్రీమాల్యాది వైభవం. కథా సంపుటాలు 1.కథా కమామీషూ 2.గోరింట పూచింది 3.కథామందారం. 1.కథా కమామీషూ సంపుటంలోని కథలు- 1.ఐయామ్ రియల్లీ సారీ 2.వట్టిరాకపోక లానర్చె వానినతియు 3.అష్టోత్తరశతం 4.మిమ్మల్ని కాదులెండి 5.ముహూర్తం షాట్ 6.విధి నిర్వహణ 7.ఎవరు త్యాగశీలి 8.ఆదర్శం 9.మాకు ఉన్నాయి స్వగతాలు 10.పాపం నరసింహులు 11.ఆత్మాభిమానం 12.పాపం భారతి 13.తప్పిపోయిన గోపి. గోరింట పూచింది కథ సంపుటంలోని కథలు - 1.గోరింట పూచింది 2.ఋణాను బంధరూపేణ 3.రేపటి నుండి అమ్మ నీవాటా 4.అభిజ్ఞ వర్గాల భోగట్టా 5.దేవయాని 6.చెరువు గట్టు 7.గుప్తదాత 8.కాంతాకనకాలు 9.ఎన్నికల పాపం 10.నారిగాడు 11.కాలం కరచిన కడపట 12.కృష్ణ జన్మస్థానం 13.గూడు చెదిరిన పక్షులు. కథా మందారం కథా సంపుటంలోని కథలు- 1.పడగ నీడలో 2.పూర్ణిమ 3.తలపుల తలుపులు 4.ముఖ్య అతిథి 5.నీడనిచ్చిన గూడు 6.వంశాంకురం 7.సన్మానాలు చేయబడును 8.జీవచ్ఛవం 9.వాన(ర)ప్రస్థం 10.దహన సంస్కారాలకు 11.దోస తొడిమ 12.పల్లె పిలిచింది 13.జగమొండి. నవలలు: 1.వక్రించిన సరళరేఖ 2.సంధ్య వెలుగు 3.మాకూ ఉన్నాయి స్వగతాలు. ఇవే కాకుండా ఐఎఎస్ చదివే విద్యార్థులకు ఉపయోగపడే ఆరు గ్రంథాలు వెలువరించారు. 1.జాబ్ ఇంటర్వ్యూస్ 2.పోటీ పరీక్షలు-లక్ష్యసాధన, 3.నీతి నీజాయితీ, అభిరుచి. పద్మనాభరావు కొంతమంది రచయితల జీవిత చరిత్రలను కూడా వెలువరించారు. 1.బెజవాడ గోపాలరెడ్డి, 2.ఆంధ్ర కేసరి ప్రకాశం 3.జమలాపురం కేశవరావు 4.శంకరంబాడి చంద్రాచారి 5.శంకరంబాడి సుందరాచారి

## పదవులు :

"అధికారిగా మంచి పేరు ఉన్నప్పుడే పక్కకు వెళ్లడం మంచిదని" పద్మనాభరావుగారి సిద్ధాంతం. అలాంటిది 1982వ సంవత్సరంలో యుపిఎస్‌సి ద్వారా అసిస్టెంట్ స్టేషన్ డైరెక్టర్‌గా ఎంపికయ్యారు. అదే రీతిలో 1988వ సంవత్సరంలో స్టేషన్ డైరెక్టర్‌గా ఎంపికయ్యారు. ఇవి రెండూ పోటీ పరీక్షలలో నెగ్గి సాధించిన విజయాలు.

అలాగే 2001వ సంవత్సరంలో పదోన్నతి మీద దూర దర్శన్‌కు డిప్యూటీ డైరెక్టర్ జనరల్‌గా నియమించబడ్డారు. ఇరవై ఆరు సంవత్సరాలు ఆకాశవాణి అనుబంధాన్ని వదులుకొని తనకు కొత్తదైన దూరదర్శన్‌లో నాలుగు సంవత్సరాలు పనిచేసి 2005వ సంవత్సరం పదవీ విరమణ పొందారు.

## భగవంతుని కృప :

పద్మనాభరావుగారు పదవీ విరమణ పొందిన తరు వాత హైదరాబాదులో స్థిరపడదలచుకున్నారు. కానీ శ్రీవేంకటేశ్వర కరుణా కటాక్ష విక్షణం చేత తిరుమల తిరుపతి దేవస్థానంలో అయిదేండ్లు పనిచేసే భాగ్యం లభించింది. వేంకటేశ్వర దృశ్య, శ్రవణ ప్రాజెక్టులో పదివి బాధ్యతలు నిర్వహిస్తూ శ్రీవేంకటేశ్వర భక్తి ఛానల్‌కు విశేష కృషిచేశారు. 2008వ సంవత్సరంలో రాష్ట్రపతి శ్రీమతి ప్రతిభా పాటేల్ చేతుల మీదుగా ఆ ఛానల్ ప్రారంభోత్సవం జరిగింది. ఆ ప్రయత్నంలో తొలి కార్య కర్తగా తాను ఉన్నానని అది భగవంతుడు ప్రసాదించిన అదృష్టమని మూడు సంవత్సరాలు జీతం తీసుకోకుండా స్వామి దగ్గర పనిచేసే మహాద్భాగ్యం లభించిందని సవినయంగా తెలియజేశారు.

## పరిశోధన :

పద్మనాభరావు గారిని పరిశోధన పరమేశ్వరుడుగా చెప్పుకోవచ్చు. పద్మనాభరావు పరిశోధన వయస్సుతో సంబంధం లేకుండా నిరంతరం కొనసాగుతూనే ఉం టుంది. దానికి తోడు ఆయనకు లభించిన పరిశోధన సౌకర్యాలు కూడా చెప్పుకోదగ్గవే. కేంద్ర ప్రభుత్వ సాంస్కృ తిక శాఖవారి సీనియర్ ఫెలోషిప్ 2005వ సంవత్సరం నుండి 2007వ సంవత్సరం వరకు లభించింది. "రేడియో నాటకాల" మీద క్షుణ్ణంగా పరిశోధన చేసి 2007వ సంవత్సరంలో ఒక ప్రామాణిక గ్రంథం ప్రచురించారు. 2015వ సంవత్సరం నుండి 2017వ సంవత్సరం మధ్య కాలంలో నేషనల్ ఠాగూర్ స్కాలర్‌షిప్ లభించింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అర్క్యూస్ వారి సౌజన్యంతో ప్రాచీన తెలుగు పత్రికల మీద ప్రామాణికంగా ఒక పరిశోధన చేశారు. పద్మనాభరావు గారి వ్యాఖ్యాతకు మెప్పుపొందిన అధికారులు వివిధ సభలలో, ఆకాశావాణి కేంద్రాలలో, పలుపుణ్యక్షేత్రాలలో వీరిని వ్యాఖ్యాతగా నియమించారు. భద్రాచల సీతారామచంద్ర స్వామి కళ్యాణంలోనూ, తిరుమల తిరుపతి బ్రహ్మోత్సవాలులోనూ, శ్రీ శైలం శివరాత్రి ఉత్సవాలులోనూ, బర్మింగ్‌హాం ఆంధ్రా అసోషి యేషన్, యు.కె.లోనూ, ఒంటిమిట్ట కోదండరామస్వామి కళ్యాణోత్సవాలులోనూ వీరు వ్యాఖ్యాతగా ఉన్నారు.

## వ్యక్తిత్వం :

పద్మనాభరావుగారికి సాహిత్యం మీద అభిలాష బి.ఎ. మూడో సంవత్సరం నుంచి అలవడింది. దివగంతులైన ఆచార్యులు వీరికి అధ్యాపకులు ఉండడమే దీనికి కారణం. అలా ఆచార్య జి.ఎస్.రెడ్డి, ఆచార్య చెన్నారెడ్డి, ఆచార్య కోరాడ రామకృష్ణశాస్త్రి, ఆచార్య జాస్తి సూర్య నారాయణ, తిమ్మావజ్ఝల కోదండ రామయ్య, పంగనమల బాలకృష్ణమూర్తి వద్ద శిష్యరికం వీరి సాహితీ పాండిత్యానికి వన్నె పెట్టింది. "కాలేజీలో ఒకరోజు పాఠం వింటూ ఒక గేయం రాశానని, అది ఆంధ్రపత్రిక దినపత్రికకు పంపిస్తే వెంటనే వేశారని" రచయిత తెలిపారు. 'ఉద్గ్రంథం రాయా లంటే' అనే శీర్షికతో రచయితలు పుస్తకాలకు పెద్దవాళ్ల చేత పీఠికలు రాయించటం వాటికి బహుమతులు రావటం అనే అంశాన్ని వ్యంగ్యంగా చెప్పారు. 'అనంతం' అనే కలం పేరుతో 1967వ సంవత్సరంలో ఆ గేయం ప్రముఖంగా ప్రచురించబడింది. అంతకు ముందు 'భయం వేస్తోందా భారతీ!' అనే పేరుతో ఒక గేయం నెల్లూరు నుండి వచ్చే జమీన్‌రైతు వారపత్రికలో ప్రచు రించారు. అంటే ఎం.ఎ.పూర్తియ్యేనాటికే ఆయన పద్య గేయ రచయితగా సాహిత్యంలోకి అడుగుపెట్టారు. అంతే కాదు స్రవంతి, ఆంధ్ర సారస్వత పరిషత్తు పత్రికలలో అనేక వ్యాసాలు రాశారు. ఉత్తర రామాయణం - తిక్కన - కంకంటిపాపరాజు అనే వ్యాసం ప్రముఖ సాహితీ పత్రిక ఆంధ్ర సారస్వత పరిషత్తు పత్రిక లో 1967వ సంవత్స రంలో ప్రచురింపబడ్డాయి. ఆ వ్యాసం ప్రచురించగానే చూసిన ఆచార్య తిమ్మావజ్ఝల కోదండ రామయ్య,

పద్మనాభరావుగారిని తరగతి గదిలోనే అందరి ముందు ప్రశంసించారు. దానితోపాటు "ఇలాంటి వ్యాసాల కోసం నీ సమయం వృథా చేసుకోవద్దు చదువు మీద శ్రద్ధ పెట్ట"మన్నారు. ఫలితం స్వర్ణపతకం విజేత అయ్యారు. తెలుగు శాఖాధిపతి జి.ఎన్.రెడ్డి గారు అమెరికాలో అధ్యాపకులుగా విస్కాన్సిన్ విశ్వవిద్యాలయంలో పదవీ బాధ్యతలు నిర్వహర్తించారు. ఆంగ్లేయ బోధన విధానాలకు అలవాటు పడిన జి.ఎన్.రెడ్డి గారు ఎం.ఎ. విద్యార్థులకు 1966వ సంవత్సరంలో సెమినార్ పద్ధతిని ప్రవేశపెట్టారు. చివరి సంవత్సరంలో ఉన్న విద్యార్థులు ప్రతి ఒక్కరు ఒక్కొక్క అంశాన్ని ఎంచుకొని గంటసేపు విద్యార్థులు, అధ్యాపకులు ముందు పాఠంలా చెప్పాలి. 1966వ సంవత్సరంలో చివరి సంవత్సరం విద్యార్థులు పదమూడు మంది ఉన్నారు. ఎవరూ ముందుకు రాలేదు. కానీ ఆచార్య జి.ఎన్.రెడ్డి గారు మాత్రం పద్మనాభరావు గారిని ఎంపిక చేశారు. దీనిని బట్టి చూస్తే అప్పటికే సాహిత్య అభిలాష ఎంతటిదో మనకు ద్యోతకమవుతుంది. అలా పద్మనాభరావుగారు తనకు ఇష్టమైన బాలవ్యాకరణాన్ని ఎంచుకున్నారు. తిమ్మావజ్ఝల కోదండ రామయ్య గారు బాల ప్రౌఢ వ్యాకరణాలు చెప్పేవారు. వారి సూచనలు, సలహాల మేరకు 'బాలప్రౌఢలు సాధింపని ప్రయోగ విశేషములు' అనే పేరుతో ఒక గంటసేపు 1966వ సంవత్సరం సెప్టెంబర్ 5 ఉపాధ్యాయుల దినోత్సవం రోజు ప్రసంగించారు. అలా పద్మనాభరావు గారు ప్రసంగించడమే కాకుండా ప్రసంగాన్ని వినడానికి వచ్చినటువంటి వారికి మీకు ఏదైనా సందేహాలు ఉన్నాయా అని అడిగారు. పద్మనాభరావుగారి ప్రసంగాన్ని ప్రతి ఒక్కరు మెచ్చుకొన్నారు. ఈయన సాహితీ వ్యక్తిత్వాన్ని గురించి- అంటే బి.ఎ.చదివే రోజుల్లోనే కళాశాల సాంస్కృతిక ఉత్సవాలకు ముఖ్య అతిథిగా సినీనటులు బాలయ్య విచ్చేశారు. అప్పుడు ఈయన ప్రిన్సిపాల్ ఆర్.సుబ్బారెడ్డిగారి అనుమతితో ఆయన మీద పద్మనాభరావు గారు ఒక పద్యం వెలువరించారు.

ఉ. "ఆతత నాట్యకౌశల మహత్త్వమునీకెగల్గె చిత్ర నిర్మాత సహాయమున్ గలిగె మా అభిమానము నీకె కల్గెడున్
నీ తలిదండ్రులెంత మహనీయులొ నిన్గన చిత్రసీమ ప్ర
ఖ్యాత కళావిలాసివగు దందరి కన్నను నాట్య చాతురిన్"

పై పద్యాన్ని వేదిక మీద చదివారు. సభలో చప్పట్లు మారుమోగాయి. "ఆనాటి చప్పట్ల మోత నన్ను రచయితగా తీర్చిదిద్దింది" అన్నారు పద్మనాభరావుగారు. కళాశాలలోనే నాటకాలలో, వేషాలు వేశారు. బహుమతులు అందుకున్నారు. 'అల్లుడు చూపిన ఆదర్శం' నాటకంలో అమ్మాయి వేషం వేశారు. ఆ తరువాత పెద్దయిన తర్వాత గొల్లపూడి మారుతీరావుతో కలిసి అనిశెట్టి రాసిన 'ఆడది' నాటకంలో వంటవాడి పాత్ర పోషించాడు. భువన విజయ సభలలో శ్రీకృష్ణదేవరాయలుగా, తిమ్మరుసుగా, తెనాలి రామలింగడుగా, పింగళి సూరనగా, కందుకూరి రుద్రకవిగా, వివిధ ప్రదేశాలలో వివిధ పాత్రలు పోషించారు. ఇది ఆయన కథలలోని నాటకీయతకు నేపథ్యంగా చెప్పుకోవచ్చు.

**కథా సాహిత్యం :**

పద్మనాభరావుగారి కలం మూడు కథా సంపుటాలు వెలుగులోకి వచ్చాయి. మూడో సంపుటం కథా మందారం సంపుటంలోని 'పడగ నీడలో' కథను సంక్షిప్తంగా పరిచయం చేస్తాను. ఈ కథ 2015వ సంవత్సరం జూన్‌లో ఆంధ్రజ్యోతి, నవ్య వారపత్రికలో ప్రచురితమైనది. ఈ కథ గురించి రచయితను సంభాషించగా ఇలా అన్నారు. "ఈ కథ నవ్య వారపత్రికలో వచ్చిన తరువాత చాలామంది ఫోన్లు చేశారు. ఒకరోజు ఒక ఆమె ఫోను చేసింది. ఈ కథ చాలా వాస్తవంగా ఉంది. ఆనాటి సమాజంలో కాదు, ఈనాటి సమాజంలోనూ చాలామంది ఇలాంటి సూర్యకాంతలు ఉన్నారు. మీరు చూపిన ముగింపు బాగుంది అన్నారు. మీరెవరమ్మా? అని నేను అడిగాను. నేను నవ్య వారపత్రిక జగన్నాథశర్మ భార్యను అంది. నేను నవ్యలో వచ్చిన కథలు చదువుతుంటాను. ఈ కథలో ముగింపు చాలా నచ్చింది" అన్నారామె. ఆయనకు కలిగిన అనుభూతిని ఈ సందర్భంగా తెలియజేశారు.

సాధారణంగా కథ ఉత్కంఠను రేపాలి. చివరివరకు పాఠకుడు తన మనస్సులో ఏదో ఒక భావంతో ఇలా

# ప్రభుత్వ డిగ్రీ కళాశాల

సదాశివపేట, సంగారెడ్డి జిల్లా, తెలంగాణ.

UGC CARE - Journal
Arts & Humanities
Sl.No. : 35

## భావవీణ ప్రత్యేక సంచిక

Journal of Literary, Culture & Language Studies

Vol. 17 - Issue. 02 - Spl. Edition - February 2020 - ISSN No. : 2456-4702




# భారతీయ సాహిత్యం - చతుర్విధ పురుషార్థాలు



## అంతర్జాతీయ సదస్సు

తేది : 08-02-2020




ప్రత్యేక సంచిక - ప్రధాన సంపాదకురాలు :

డా॥ ఎస్. బేబిరమణి

శాఖాధిపతి, తెలుగు విభాగం,

ప్రభుత్వ డిగ్రీ కళాశాల, సదాశివపేట,

సంగారెడ్డి జిల్లా, తెలంగాణ.

| | | |
|---|---|---|
| 63. హైందవం - ధర్మం | - డా॥. జి.సుహాసిని | 225 |
| 64. అభిజ్ఞాన శాకుంతలం - చతుర్విధ పురుషార్థాలు | - డా. గంగిశెట్టి లక్ష్మీనారాయణ | 228 |
| 65. మహాభారత సావిత్రోపాఖ్యానం | - డా॥ వి. ఎన్. మంగాదేవి | 232 |
| 66. భారతీయ తత్వ శాస్త్ర భూమిక: చతుర్విధ పురుషార్థాలు | - నందిగామ నిర్మల కుమారి | 235 |
| 67. అసమర్థుని జీవ యాత్రలో ధర్మార్థ కామ మోక్షాలు | - డా॥ జి. వెంకట రమణ | 240 |
| 68. భార్గవరామ చరిత్ర - ధర్మాచరణ | - జి. రమేష్ | 249 |
| 69. తెలుగు కావ్యాలు - ధర్మార్థ కామ మోక్షాలు | - కట్ట రంజిత్‌కుమార్ | 253 |
| 70. జయరాజు పాటలు - ధర్మార్థ కామ మోక్షాలు | - ఎలకంటి రవీందర్ | 256 |
| 71. జానపద సాహిత్యం - ధర్మార్థ మోక్షములు | - సోనబోయిన సతీష్ | 258 |
| 72. జ్ఞానాదేవతుకైవల్యమ్ | - శ్రీదేవి కాశవజ్జల | 260 |
| 73. ధర్మబద్ధ కామం | - పూషడపు సుబ్బారావు | 262 |
| 74. వేయి పడగలలో పురుషార్థం - ధర్మం | - అవధానం సుజాత | 265 |
| 75. పోతన భాగవతంలో మోక్ష మార్గం | - డాక్టర్ ఉడాలి విష్ణుప్రియ | 268 |
| 76. భారతీయ సంస్కృతికి పురుషార్థాలు మూలస్తంభాలు | - పి. అనురాధ | 272 |
| 77. "సతి దానశూరము" యక్షగానంలో ధర్మార్థ కామమోక్షలు | - డా॥. బాణాల భుజంగరెడ్డి | 275 |
| 78. శ్రీ శివ మహాపురాణము - చతుర్విధపురుషార్థాలు | - డా॥. మరపతి మాంతయ్య | 278 |
| 79. భారతీయ సంస్కృతికి చాతుర్వర్గ మూలాలు | - టి. పద్మ | 281 |
| 80. అర్థము ధర్మముననుసరించిన అనుసరణీయము | - డా॥. యస్. బేబీరమణి & యస్. సతీష్ | 283 |
| 81. భాగవతపురాణము - చతుర్విధ పురుషార్థములు | - డా॥. బాచిమంచి వెంకటేశ్వర్లు | 284 |
| 82. పురుషార్థసాధన - గజేంద్ర మోక్షము | - విదేప్రు నాగమణి | 290 |
| 83. "కుమార సంభవం - గృహస్థాశ్రమధర్మం" | - డా॥. పెండ్యాల అనసూయా ప్రసన్నలక్ష్మి | 292 |
| 84. ఆత్మజ్ఞానం (మోక్షము) యొక్క గొప్పతనము | - డా॥. యస్.పి. క్రిష్ణవేణి | 301 |
| 85. ధర్మార్థకామమోక్షాలకు నిలయం : దాంపత్య జీవన సౌరభం | - బోయపల్లి చిట్టెమ్మ | 304 |
| 86. వేమన ధర్మనిరతి | - డా॥. యమ్. విజయశ్రీ | 308 |
| 87. భాగవతంలో "ధర్మం" విశిష్టత | - డా॥. మంద సురేఖారెడ్డి | 310 |
| 88. జానపద సాహిత్యంలో శృంగార (కామ) సౌరభాలు | - డా॥. సి.హెచ్. చంద్రయ్య | 312 |
| 89. **रामो विग्रहवान् धर्मः** | - **कंदाल वनदुर्गा रोहिणी** | 314 |
| 90. **माधकाव्ये चतुर्विधपुषार्थाः** | - **डा. एन. सशिधर** | 316 |
| 91. **धर्म कर्म नीती** | - **डा. वि.टि.वि. क्रिश्न वेनि** | 321 |
| 92. Folk Performning Arts and the Role of Telugu News Papers | - Kondigari Buchaiah | 325 |
| 93. Principles of Dharma in Ramayanam | - Dr. K. Padmaja | 327 |
| 94. Attainment of Purushaarthas According to ShukraNeeti | - I. R. Nandini | 330 |
| 95. Relevance of Puranic Discourses of Purusharthas in Modern Life | - A.V. Sheshachary | 332 |

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253 UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

# ధర్మార్థకామమోక్షాలకు నిలయం : దాంపత్య జీవన సౌరభం

- బోయపల్లి చిట్టెమ్మ, పరిశోధక విద్యార్థి, తెలుగు విభాగం, హైదారాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం, హైదారాబాద్.

మానవ జీవితంలో దాంపత్యం అనేది సాంఘిక కట్టుబాటు. వివాహానంతరం భార్యాభర్తలు సుఖసంతోషాలతో జీవించి సంతానవంతులై కుటుంబ పోషణ కొనసాగిస్తారు. బంధుమిత్రులు, ఇరుగుపొరుగువారు ఆ దంపతులను చూసి సుఖదుఃఖ సమ్మేళనమైన వారి జీవనయానాన్ని పొగడుతారు లేదా తెగడుతారు. కష్టసుఖాలు, సుఖ దుఃఖాలు, లాభనష్టాలు, ఆర్థిక ఇబ్బందులు, సుఖః సంతోషాలు సమంగా పంచుకుంటూ కాడికి కట్టిన జొడెద్దులవలె జీవనయానం సాగిస్తారు. ఆ దారి గతుకుల మయం కావచ్చు లేదా నల్లేరు మీద బండి నడక కావచ్చు. పురాకృత సుకృత పుణ్య ఫల విశేషం చేత ఒకరికి ఒకరు జమ గూడుతారు. వాల్మీకి చరిత్రలో రఘునాథ నాయకుడు, కిరాతుని బోయవాని (వాల్మీకి) భార్య నోట ఒక మంచిమాట అనిపిస్తారు. సప్తర్షులను అరణ్య మార్గంలో అడ్డుకున్న కిరాతకుడికి సప్తర్షులు ఒక ప్రశ్న వేశారు. నీవు తెరచాటుగా సంపాదించిన పాప పుణ్యములు నీ కుటుంబ సభ్యులు పంచుకుందురా? అని ప్రశ్నించారు. అతడు పరుగుపరుగునా ఇంటికి వచ్చి తన భార్యను ప్రశ్నించాడు. ఆమె ఇలా సమాధానం ఇచ్చింది.

చ. "తవులగువారి కెవ్వరికతంబున సొగెద వప్పుడీసి తె
త్తువొ కొనితెత్తువో తెరువుదోచుచుతెత్తువొ జూదమాడితె
త్తువొ చని తెత్తువొ యదియు దోసమొపున్నెమొనాకు నేటికా
రవరవ నీవు దెచ్చినవి దాచక వండగ బాడినిచ్చలున్"

అదే విషయాన్ని కిరాతుడు సప్తర్షులకు తెలియజేయగా వారు అతనికి "మరామరా" అని విలోమంగా రామ మంత్రోపదేశం చేశారు. అతడు తపస్సు చేసుకుంటున్న సందర్భంలో భార్యాబిడ్డలు, బంధువులు వచ్చి అతని తపస్సును విరమించ చేయటానికి ప్రయత్నించారు. అప్పుడు అతను అన్న మాటలు నిత్యసత్యాలు.

కం. "సతులెవ్వరు సుతులెవ్వరు
హితులెవ్వారేటి వఱదనెందే నొకచో
జతకూడిన కాష్ఠంబుల
గతి నించుక కూడివిచ్చి కదులుదురవలన్"

దీని భావాన్ని గమనిస్తే భార్యాభర్తలనేవారు కాలమనే నదీ ప్రవాహంలో కొట్టుకుపోతూ మధ్య కాలంలో జతపడిన రెండు దుంగల్లా కొంత దూరం కలిసిమెలిసి ఆ తరువాత కొంతకాలానికి కొంత దూరానికి విడిపోయి ఎవరిదారెంట వారు నడుస్తారు. ఎవరో ఒకరు మరణిస్తే మరొకరు ఒంటరి జీవితం గడపుతారు. ఇది దాంపత్య జీవన రహస్యం.

ప్రస్తుత గ్రంథం దాంపత్య జీవన సౌరభం అనంత పద్మనాభరావు 2013లో ప్రచురించారు. పద్మనాభరావుకు పురాణశాస్త్ర గ్రంథ పరిచయం ఉంది. భారత భాగవత రామాయణాది కావ్యాలలో ఎందరో దంపతుల జీవన ప్రస్థానం కనిపిస్తుంది.

పురాణాలలోని దంపతుల జీవన విధానాన్ని ఆధునిక స్థితిగతులకు అనుగుణంగా గమనిస్తే భార్యాభర్తలు ఏడు రకాలలో ఏదో ఒక తరగతికి చెందినవారు లేదా అన్ని రకాల వారు అయి ఉంటారు.

1) పార్వతీ పరమేశ్వరులు - భార్యకు అర్థ శరీరం ఇచ్చినవాడు /భార్యను నెత్తిన పెట్టుకున్నవాడు.
2) లక్ష్మీనారాయణులు - భార్యను గుండెలపై పెట్టుకున్నవాడు.
3) ఛాయా సూర్యులు - ధుమధుమలాడే భర్త వెంట నీడలా తిరిగే సతి.
4) రోహిణీ చంద్రులు - ధుమధుమలాడే (ఎండ వేడిమి) భార్యకు చల్లని మనస్సుగల పతి.

5) సరస్వతీ బ్రహ్మలు - భర్తకు తలలో నాలుకగా మెలిగే స్త్రీ.
6) సీతారాములు - ఏకపత్నీ వ్రతానికి మారు పేరైనపతి.
7) సత్యాకృష్ణులు - అష్టమహిషలతో గోపికాలోలుడైన కృష్ణుడు.

ఈ ఏడు జంటలను రచయిత ప్రధానంగా ప్రస్తావించారు.

ఈ వ్యాససంపుటిలో రామాయణ సంబంధమైన జంటలను భిన్నకోణాలలో రచయిత చూపించిన తీరు అద్భుతం. ఒక్కొక్క దాంపత్యం ఒక్కొక్క తరహా. ఎవరి కష్టసుఖాలు వారివి. ఎవరి సాధక బాధకాలు వారివి. అయితే రామాయణ గాథ మొత్తం ఈ పాత్రల చుట్టూ తిరుగుతుంది. ఈ వివరాలను రామాయణంలో స్త్రీ పాత్రలు గ్రంథంలో చక్కగా పాండురంగారావు (ఆంగ్లంలో) విశ్లేషించారు. దానిని అనువాదం చేసిన ఈ రచయిత ఆ స్ఫూర్తితో ఈ గ్రంథంలో పదకొండు మంది దంపతుల జీవన సమరాన్ని తనదైన రీతిలో విశ్లేషించారు. ఇందులో చక్రవర్తులున్నారు - కౌసల్యా దశరథులు, రత్నమాల-జనకులు, రాజకుమారులు - సీతారాములు, ఊర్మిళ - లక్ష్మణులు, ముని దంపతులు - మేనకా విశ్వామిత్రులు, అహల్యా గౌతములు, అనసూయ అత్రులు, అరుంధతి వశిష్టులు, వానరదంపతులైన - తారా వాలి, రాక్షస దంపతులైన - మండోదరి రావణులు, సులోచన ఇంద్రజిత్తులు, శూర్పణఖ ఇందులో ప్రస్తావించబడ్డారు. భారతానికి సంబంధించి గాంధారీ ధృతరాష్ట్రులు, కుంతి పాండురాజులు, ద్రౌపది పాండవులు, భీమ హిడింబిలు, సుభద్ర అర్జునులు, శకుంతలా దుష్యంతులు, గంగా శంతనులు, సత్యవతి శంతనులు, దేవయాని శర్మిష్ఠ, యయాతి నలదమయంతులు, కృపీ ద్రోణులు, రేణుకా జమదగ్నులు, భానుమతీ దుర్యోధనులు, ఉత్తరాభిమన్యులు, లోపాముద్ర అగస్త్యులు, సావిత్రీ సత్యవంతులు, ఊర్వశీ పురూరవులు ఇందులో విస్తారంగా కనిపిస్తారు.

భాగవతానికి సంబంధించి లక్ష్మీనారాయణులు, సత్యాకృష్ణులు, నంద యశోదలు, దేవకీ వసుదేవులు, జాంబవతీ కృష్ణులు, నీలా కృష్ణులు, రేవతీ బలరాములు ప్రస్తావించబడ్డారు. వీరే కాక శచీ పురందరులు, చంద్రమతీ హరిశ్చంద్రులు, గోదా రంగనాథులు, పద్మావతీ శ్రీనివాసులు పురాణ ప్రసిద్ధమైన దంపతులు.

రచయిత వీరి దాంపత్యాలలోని వైశిష్ట్యతను, విలక్షణతను, వివరణాత్మకంగా, విశ్లేషణాత్మకంగా, విపులంగా విశదపరిచారు. కథను క్లుప్తంగా చెబుతూ పురాణగాథకు భిన్నం కాకుండా ఆధునిక సమాజానికి ఒక సందేశం లభించేలా వ్యాసాలను విస్తృతపరిచారు.

రుక్మిణీ కళ్యాణాన్ని 'కిడ్నాప్' చేసిన వివాహంతోనూ, ప్రేమ వివాహంతోనూ పోల్చారు. అహల్యా గౌతముల కథలో తెలిసి తప్పుచేసి కాలుజారిన అహల్యను గౌతముడు తిరిగి స్వీకరించటం ఒక ఉదారభావంగా పేర్కొన్నారు. మండోదరి పాత్రను గురించి చెబుతూ సినిమాలలో (విలన్) ప్రతినాయకుని భార్య సౌమ్యంగానూ, పతివ్రతాధర్మంతోనూ ప్రవర్తించిన తీరును ఆదర్శప్రాయంగా చెప్పారు. సీతను రామునికి అప్పగించి శరణు వేడమని ఆమె ప్రాధేయపడింది. అతడు అహంకారంతో పెడచెవిన పెట్టాడు. అలానే తార వాలితో రాముని శౌర్య పరాక్రమాలను రుజువర్తనను చెప్పి మందలించే స్థితికి ఎదిగింది. అయినా బుద్ధి గడ్డి తిని అన్నాదమ్ముల మధ్య వైరం కుటుంబాన్ని ఎలా నాశనం చేస్తుందో ఈ గాథలో తెలుస్తుంది.

అనసూయ నిజంగా అనసూయ (అసూయ లేనిది) ఆదర్శ గృహిణి. తాను ఆదర్శంగా ఉండటమే కాక ఆదర్శ దాంపత్యం ఎలా ఉండాలో సీతకు తెలిపిన సాధ్వీమణి. ఆ దంపతులలో మెచ్చుకోదగిన మరో గుణాన్ని కూడా రచయిత సుస్పష్టం చేసారు. భార్యను గూర్చి భర్త ఇతరుల యెదుట నాలుగు మంచి మాటలు చెప్పటం ఆదర్శ దాంపత్యానికి తొలిమెట్టు అని తెలపడానికి అత్రి మహర్షి రామలక్ష్మణులతో అనసూయను గూర్చి అనసూయ

అసాధారణతను గూర్చి ఉదాహరించటం ఒక ఉదాహరణ.

కాపురం కూల్చిన చెల్లెలు అనే భావంతో శూర్పణఖ పాత్రను ప్రవేశ పెట్టారు. ఆమె రావణ సోదరి. ఆమెకు విద్యుజ్జిహ్వునితో పెండ్లి జరిపించారు. పొరబాటున రావణుడు కాలకేయులతో యుద్ధం చేస్తూ బావగారిని చంపాడు. నలుగురు అన్నదమ్ములకు ఆమె ఒక్కగానొక్క సోదరి. ఆమెకు జనస్థానాన్ని అరణంగా ఇచ్చి పంపాడు రావణుడు. రాముడిపై వ్యామోహం పెంచుకున్న శూర్పణఖకు ముక్కు చెవులు కోసి పంపాడు లక్ష్మణుడు. ఆమె రావణుడికి పెడ బుద్ధులు నేర్పింది. సీత నీకు దగిన స్త్రీ అని చెప్పి సీతాపహరణానికి దారితీసేలా చేసింది. కథ దుఃఖాంతం కావడానికి, సర్వరాక్షస వినాశనానికి ఆమె మూలకారణం అయింది. ఒక చెల్లెలు దుర్బుద్ధి వంశ నాశనానికే దారి తీసిన సంఘటన ఇది. కాపురం అంటూ ఎక్కువ కాలం చేయకపోయినా జంబుకాసురుడనే కుమారుడు పుట్టాడు. అతడు పొదలలో తపస్సు చేసుకుంటున్నాడు. ఫలాలు కోస్తున్న లక్ష్మణుడు చూడకుండా అతన్ని కత్తితో పొడిచాడు. ఎంతటి హృదయవిదారకమైన జీవితం. అటు భర్తను, తన అన్న ద్వారానే కోల్పోయింది, ఇటు కన్న కుమారుడినీ కోల్పోయింది. ముక్కు, చెవులు కోల్పోయింది. తనవల్ల ఖరదూషణులతోపాటు 14 వేల మంది రాక్షస సైన్యము రాముని చేతిలో నశించారు. అంతటితో నిరాశ్రయురాలైన ఆమె ఇంటి పట్టున పడివుండవచ్చు కానీ, దుర్బుద్ధితో ఆమె రావణ కుంభకర్ణ ఇంద్రజిత్తుల మరణానికి, లంకా వినాశనానికి మూల హేతువు అయింది.

ఆవిడ సంసారం చేయలేదు కదా మరి ఈ దంపతుల కోవలోకి వస్తుందా అనే సందేహం కలుగుతుంది. కొందరి జీవితాలలో నూరేళ్ళ కాపురం మూన్నాళ్ళ ముచ్చటవుతుంది. మరికొందరు పిల్లాపాపలతో నూరేళ్ళ పంటగా సుఖశాంతులతో జీవిస్తారు. ఈ రెండు రకాల జీవన సమరాన్ని తెలియజేయటానికే శూర్పణఖ జీవిత వృత్తాంతాన్ని ఇందులో జోడించారు.

## సులోచన ఇంద్రజిత్తులు :

సులోచన మహా పతివ్రత. కుటుంబ పెద్దయైన మామగారి (రావణుని) స్త్రీ వ్యామోహ బుద్ధి తన కాపురాన్ని నాశనం చేసింది. వాల్మీకి రామాయణంలో సులోచన మనకు కనిపించదు. రంగనాథ రామాయణంలో సులోచన ప్రస్తావన ఉన్నది. బల పరాక్రమాలు కలిగి ఇంద్రుని సైతం బంధించి తీసుకొని వచ్చిన తన భర్త ఇంద్రజిత్తు రామరావణ యుద్ధ అగ్నిహోత్రంలో సమిధయ్యాడు. కొద్దిపాటి వివరాలు లభిస్తున్న వీరిద్దరి జీవన స్థితిగతులను రచయిత ఇందులో ప్రస్తావించారు.

## కౌసల్యా దశరథులు :

దశరథుని పాత్ర విచిత్రమైనది. పుత్ర కామేష్టి యాగంలో లభించిన పాయసంతో ఆయనకు నలుగురు పుత్రులు జన్మించారు. పట్ట మహిషి కౌసల్యా రాజ్యాంగ రీత్యా సమస్తాధికారాలు గల మహారాణి. కానీ ఆమె పరిస్థితులను లొంగి తలవంచుకున్న ఒక నిస్సహాయురాలు. బహు భార్యత్వం వల్ల కలిగే అనర్థాలను రామాయణంలో దశరథుని వృత్తాంతం ద్వారా మనము గ్రహించవచ్చు. కైక తన ఔన్నత్యాన్ని చాటుకోవడానికి తన కుమారునికి పట్టాభిషేకం చేయటానికి మంథర దుర్బోధలతో వరాల నెపంతో దశరథుని ప్రాణాలు తీసింది. సాఫీగా సాగిపోతున్న సంసార ప్రవాహానికి గండి పడింది. రాముడు అరణ్యాలకు వెళ్లాడు. భరతుడు రాజ్యాన్ని తిరస్కరించాడు. కథలో మూడు స్త్రీ పాత్రలు మూడు భిన్న మనస్తత్వాలు కలిగి ఉండటం రామాయణ ప్రత్యేకత.

ఈ రామాయణ గాథను ఆధునిక జీవన విధానానికి సరిపడేలా సమన్వయం చేశారు రచయిత. ఈ క్రింది వాక్యాలలో అది ప్రస్ఫుటం అవుతుంది.

"కుమారులు విదేశాలకు ఉద్యోగాల నిమిత్తం వెళ్లి అక్కడ సంవత్సరాల తరబడి ఉండిపోయినప్పుడు ఆ తల్లి పడే మానసిక వ్యథను చూస్తున్నాం. అందులోనూ పతి ఆదరణ సరిగ్గా లేనప్పుడు ఆ బాధ వర్ణనాతీతం. వీడియో కాన్ఫరెన్స్‌లో కుమారుడు వారానికొకసారి తనతో

ప్రభుత్వ డిగ్రీ కాలేజ్, సదాశివపేట.

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253 UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

గంటసేపు మాట్లాడతాడని ఆ తల్లి సంబరపడిపోతుంది. రెండేళ్లకొకసారి చుట్టపు చూపుగా వచ్చి పోయే కొడుకు, కోడలు, మనుమల్ని అనునిత్యం ఊహించుకుంటూ పూజలు చేస్తూ పూజ గదిలోనే గడపుతుంది. చివరి శ్వాస వదిలే సమయానికి ఆ కొడుకు విమానం అంది వస్తాడా, రాడా? అని బెంగ పెట్టుకోదు. తన రాత ఎలా ఉంటే అలా జరుగుతుందని సర్ది చెప్పుకుంటుంది".

మౌన వ్యాఖ్యాత కౌసల్య. భర్తను అదుపులో పెట్టుకోవాలనే మనస్తత్వం గలది కైక. తన కుమారులిద్దరినీ - భరత శత్రుఘ్నులను ఇతరులకు సహాయకులుగా ఉండేలా తీర్చిదిద్దిన తల్లి సుమిత్ర. వరాలు శాపాలుగా, శాపాలు వరాలు అయిన ఘట్టాలు మనకు భారత, రామాయణాలలో కనిపిస్తాయి.

**ఆధారం గ్రంథం :**

దాంపత్య జీవన సౌరభం - ఆర్. అనంతపద్మనాభరావు

❖ ❖ ❖

# జాతీయ మరియు అంతర్జాతీయ సదస్సుల్లో

# సమర్పించిన పరిశోధన ధ్రువపత్రాల నకలు

## విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం, నెల్లూరు.



### తిక్కన సాహితీ పీఠం
### తెలుగు శాఖ.

"నెల్లూరు జిల్లా సాహితీ సర్వస్వం" అనే అంశం పై జాతీయ సదస్సు

6-7 ఏప్రిల్, 2018

# ధృవీకరణ పత్రం

ఆచార్య/డా॥/శ్రీ/శ్రీమతి/కుమారి ....బోయపల్లి చిట్టెమ్మ.... గారు

"నెల్లూరు జిల్లా సాహితీ సర్వస్వం" అనే జాతీయ సదస్సులో పాల్గొని ....అనంత పద్మనాభరావు

జీవితం - వ్యక్తిత్వం.... అనే అంశం పై పరిశోధనా పత్రం సమర్పించారు.

ఆచార్య ఎస్. జయప్రకాశ్
సదస్సు సంచాలకులు
తెలుగు శాఖ
విక్రమ సింహపురి విశ్వవిద్యాలయ కళాశాల, నెల్లూరు.

డా॥ అందె ప్రసాద్
ప్రిన్సిపాల్
విక్రమ సింహపురి విశ్వవిద్యాలయ కళాశాల, నెల్లూరు.

# ప్రభుత్వ డిగ్రీ కళాశాల, సదాశివపేట

(ఉస్మానియా విశ్వవిద్యాలయ అనుబంధము)

సంగారెడ్డి జిల్లా, తెలంగాణ

## "భారతీయ సాహిత్యం – చతుర్విధ పురుషార్థాలు"

## అంతర్జాతీయ సదస్సు

## ధృవపత్రము

శ్రీయుత/శ్రీమతి/డా॥ బి. చిట్టెమ్మ

ఉపన్యాపకులు/ఆచార్యులు/కవి/అవధాని/పరిశోధక విద్యార్థి యూనివర్సిటి ఆఫ్ హైదరాబాద్

"భారతీయ సాహిత్యం - చతుర్విధ పురుషార్థాలు" అను అంశమునుద్దేశించి కళాశాల తెలుగు విభాగం ఆధ్వర్యాన 08 ఫిబ్రవరి 2020 న నిర్వహించబడిన అంతర్జాతీయ సదస్సులో పత్ర సమర్పకులుగా/సమావేశ అనుసంధాన కర్తలుగా/పరిశోధకులుగా పాల్గొన్నారని/ ధర్మార్థకామమోక్షాలకు నిలయం: దాంపత్యం - జీవన సౌరభం. అనే అంశంపై పత్ర సమర్పణ చేశారని ధృవీకరించబడినది.

S. B

సదస్సు సమన్వయకర్త

**డా॥ యస్. బేబీ రమణి**

తెలుగు విభాగము

Patan

అధ్యక్షులు

**డా॥ టి. పతంజలి**

ప్రధానాచార్యులు